# రాజకీయ సమాజశాస్త్రం

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
CM0143

డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
హైదరాబాదు
1996

# రచయితల బృందం

సంపాదకుడు
ఆచార్య ఎం. సత్యనారాయణరావు

సహసంపాదకుడు
శ్రీ ఘంటా చక్రపాణి

రచయితలు
ఆచార్య ఎం. రాంచందర్
డా॥ వి. రవీంద్ర శాస్త్రి
డా॥ కె. లక్ష్మి
శ్రీ ఘంటా చక్రపాణి

తెలుగు భాష పరిశీలన
డా॥ ఎ.ఆర్.కె.మూర్తి

ముఖచిత్రం
రమేష్

Dr B R.A.O.U. LIBRARY
CM01143
31-3-97

డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రథమ ప్రచురణ 1995

© 1995 డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

అన్ని హక్కులు విశ్వవిద్యాలయానివి. ఈ పుస్తకంలో ఏ భాగమైనా ఉపయోగించదలచుకుంటే విశ్వవిద్యాలయం అనుమతిపొందాలి.

ఈ పాఠాలు సార్వత్రిక విశ్వవిద్యాలయం పాఠ్యప్రణాళికలో ఒక భాగం.

పాఠ్యప్రణాళిక వివరాలు చివరలో ఉన్నాయి.

ఇతర వివరాలకు: ఎకడమిక్ డైరక్టర్, డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

REPRINT IN 1996

Printed at Udaya Printers, Hyderabad - 1. Ph.202051

BRAOU

# పరిచయం

రాజకీయ సమాజశాస్త్రం ఆలస్యంగా ఆవిర్భవించినప్పటికీ అతి తక్కువ కాలంలో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకొంది. రాజనీతిశాస్త్రం ఎంత ప్రాచీన చరిత్రను కలిగి ఉందో రాజకీయ సమాజశాస్త్రం అంత ఆధునికమైంది. విశ్వవ్యాప్తంగా కొత్త సామాజిక శక్తులు ఆవిర్భవిస్తున్న నేటి నేపథ్యంలో రాజకీయ సమాజశాస్త్ర అధ్యయనం ఆవశ్యకత బాగా పెరిగింది.

రెండవ ప్రపంచ యుద్ధానంతర దశలోనే రాజకీయ సమాజశాస్త్రం అవతరించింది. పారిశ్రామిక విప్లవ ఫలితాలు, శాస్త్రసాంకేతిక విజ్ఞానాభివృద్ధి, సమాజాన్ని సంక్షోభంలో పడేశాయి. మానవసంబంధాల్లో సంభవించిన మార్పులు సామాజిక వర్గ నిర్మితులను మార్చివేశాయి. కొత్త ఆధిపత్యవర్గాలు రూపొందాయి. సమాజంలో భిన్న దృక్పథాలు అభివృద్ధి చెందాయి. రెండవ ప్రపంచ యుద్ధం ఈ దృక్పథాలను అంతర్జాతీయ ఎజెండాలోని చేర్చింది. యూరోపు ఖండం అందునా జర్మనీకి చెందిన మేధావులు యుద్ధవైఫల్యాలను, ఫలితాలను చర్చించప్రారంభించారు. అమెరికాకు వలసవచ్చి స్థిరపడిపోయిన మేధావివర్గం అటు మార్క్సిస్టు ఆలోచనాధోరణితోపాటుగా, మాక్స్‌వెబర్ రచనల ప్రభావంతో సామాజిక శక్తులు, రాజకీయ సంబంధాలపై చర్చను ప్రారంభించారు. ఇది 1930లో ఆరంభమై 1950నాటికి ఒక రూపం దాల్చింది. విద్యావేత్తల మధ్య చర్చనీయాంశంగానే కాక, అమెరికన్ విశ్వవిద్యాలయాల్లో రాజకీయ సమాజశాస్త్రం ఒక ప్రత్యేక అధ్యయనాంశంగా వృద్ధిచెందింది. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక, అంతకుముందు రాజకీయాలు-సమాజానికి మధ్యగల సంబంధాలపై అధ్యయనాలు జరిగినప్పటికీ, రాజకీయ సమాజశాస్త్రం ఇటీవలికాలంలోనే విశ్వవిద్యాలయాల అధ్యయనాంశపు స్థాయికి పెరిగింది.

BRAOU

19 వ శతాబ్దం మధ్యకాలం దాకా రాజనీతి శాస్త్రవేత్తలు కేవలం రాజనీతి ఆలోచనా విధానాన్ని మాత్రమే అధ్యయనం చేశారు. రాజ్యం, రాజ్య ఆవిర్భావానికి సంబంధించిన అంశాలపైననే తమ దృష్టి సారించారు. ఆ తరువాత కాలంలో కూడా రాజ్యం-అధికారయంత్రాంగం చుట్టూ మాత్రమే అధ్యయనాలు జరిగాయి. రెండవ ప్రపంచయుద్ధానంతరమే మేధావి వర్గం రాజకీయాలను ప్రభావితం చేస్తున్న సామాజిక శక్తులను గురించి ఆలోచించటం మొదలైంది. సమాజాన్ని ప్రభావితం చేసే అనేకానేక సంస్థల్లో రాజ్యం ఒకటిమాత్రమే తప్ప సమాజానికి ప్రత్యామ్నాయం కాదన్న వాదనలు రాజకీయ, సమాజ శాస్త్రాల మధ్య పరస్పర సంబంధాలు నెలకొల్పాయి. పర్యవసానంలో అంతర్వర్గీయ అధ్యయనాంశంగా రాజకీయ సమాజశాస్త్రం ఆవిర్భవించింది. సామాజిక నిర్మితులు, సాంఘిక శక్తులను అర్థం చేసుకోకుండా రాజనీతిని, రాజకీయాలను అర్థం చేసికోవడం కుదరని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ పరిస్థితుల్లో రాజకీయ దృగ్విషయాలను సామాజిక శక్తుల దృక్కోణంనుంచి అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఏర్పడింది.

రాజనీతి శాస్త్ర స్నాతకోత్తర అధ్యయన కార్యక్రమంలో రాజకీయ సమాజశాస్త్రాన్ని చేర్చాం. ఇందులో నాలుగు ఖండాలున్నాయి. మొదటి ఖండంలో స్వభావం, పరిధి, అధ్యయన దృక్పథాలను చేర్చాం. రెండవ ఖండంలో వివిధ రాజకీయ సమాజశాస్త్ర ప్రభావాలను చర్చించాం. మూడవ ఖండం చలన సూత్రాలను చర్చిస్తుంది. నాల్గవఖండంలో వివిధ స్థిరమైన దృక్కోణాలను చర్చించాం. ఈ అధ్యయనం ద్వారా సామాజిక శక్తులు రాజకీయాలను; రాజకీయాలు, సామాజిక శక్తులను ఎలా ప్రభావ పరుస్తున్నాయో అవగాహన చేసుకోవడానికి ఉపయోగపడుతుంది.

BRAOU

# డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
## సామాజిక శాస్త్రాల విభాగం

రాజనీతి శాస్త్రంలో స్నాతకోత్తర అధ్యయనం

రెండవ సంవత్సరం

పాఠ్యాంశం III రాజకీయ సమాజశాస్త్రం

విషయసూచిక


| భాగం | పేరు | పేజీ |
|---|---|---|
| 1. | రాజకీయ సమాజశాస్త్రం, స్వభావం, పరిధి | 1 |
| 2. | అధ్యయన దృక్పథాలు | 18 |
| 3. | రాజకీయాల సామాజిక ఆర్థిక ప్రాతిపదికలు | 33 |
| 4. | సామాజిక స్థరీకరణ | 52 |
| 5. | రాజకీయ సమాజికీకరణం | 64 |
| 6. | రాజకీయ సంస్కృతి | 79 |
| 7. | రాజకీయ ప్రసరణం | 91 |
| 8. | రాజకీయ శిష్టవర్గం | 102 |
| 9. | రాజకీయ భాగస్వామ్యం | 116 |
| 10. | రాజకీయ పరాయీకరణం | 135 |


BRAOU

BRAOU

# ఖండం - 1 ప్రవేశిక

BRAOU

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత రూపొందిద్దుకొన్న అంతర్వర్గీయ విజ్ఞానశాస్త్రం రాజకీయ సమాజశాస్త్రం. కొత్తగా రూపొందిన ఈ విజ్ఞాన శాఖ నిర్వచనం పరిధి, స్వభావం, అధ్యయన దృక్పథాలను మొదట తెలుసుకోవాల్సి ఉంది. వాటితోపాటుగా రాజకీయాల సామాజిక ఆర్థిక ప్రాతిపదికలను, దేశంలో నెలకొన్న స్థిరీకరణను అవగాహన పరచుకోవడం చాలా ముఖ్యం.

BRAOU

# భాగం - 1 రాజకీయ సమాజశాస్త్రం - స్వభావం, పరిధి

## విషయక్రమం


| | |
|---|---|
| 1.1 | లక్ష్యాలు |
| 1.2 | పరిచయం |
| 1.3 | రాజకీయ సమాజశాస్త్రం |
| 1.4 | రాజకీయ సమాజశాస్త్రం - నిర్వచనాలు |
| 1.5 | రాజకీయ సమాజశాస్త్ర అవతరణ |
| 1.6 | రాజకీయ సమాజశాస్త్ర చరిత్ర - పరిణామక్రమం |
| 1.7 | రాజకీయ సమాజశాస్త్రం - పరిధి |
| 1.8 | రాజకీయ సమాజశాస్త్రమా? సమాజ రాజకీయ శాస్త్రమా? |
| 1.9 | ముగింపు |
| 1.10 | చదువదగిన పుస్తకాలు |
| 1.11 | నమూనా పరీక్షా ప్రశ్నలు |


## 1.1 లక్ష్యాలు

BRAOU

ఈ భాగాన్ని చదివాక మీరు

- రాజకీయ సమాజ శాస్త్రం అంటే ఏమిటి,
- దాని వృద్ధి క్రమం,
- దాని పరిధిని

గురించి బాగా వివరించగలుగుతారు.

## 1.2 పరిచయం

సువిశాల ప్రపంచంలో మానవునిది ఒక ప్రత్యేకమైన స్థానం. ఆలోచనా శాలియైన మానవుడు మంచిచెడులను గుర్తెరిగి హేతుబద్ధంగా ప్రవర్తించగలడు. కేవలం జీవించటమే గాక, ఉన్నతంగా జీవించటం మానవుని ప్రధాన ఆశయమైనందున ఉన్నత జీవనానికై మానవుడు నిరంతరం ప్రకృతితో, సమాజంతో పోరాటం సాగిస్తున్నాడు. కాలక్రమంలో మానవుడు ఎంతో విజ్ఞానాన్ని సంతరించుకొన్నాడు. అట్టి మానవ విజ్ఞాన భాండాగారాన్ని స్థూలంగా (1) ప్రకృతి లేదా భౌతిక శాస్త్రాలు; (2) సామాజిక శాస్త్రాలుగా విభాగింప వచ్చు. మానవుడు సమాజ సభ్యుడుగా సమాజపు వివిధ రంగాలలో ప్రవర్తించే తీరు తెన్నులను అధ్యయనం చేసేవే సామాజిక శాస్త్రాలు. అనగా మానవ ఆర్థిక,రాజకీయ, నైతిక, మత, సామాజిక ప్రవర్తనలను అధ్యయనం చేసేవి సామాజిక శాస్త్రాలు.

రెండు మూడు శతాబ్దాలకు ముందు సమాజ సమస్యలు స్వల్పమైనందున సమాజ సమస్యలను అధ్యయనం చేయడానికి విభిన్న సామాజిక శాస్త్రాలు అవిర్భవించలేదు. సమాజ సమస్యల అధ్యయనాలన్నీ ఒకే శాస్త్ర పరిధిలో ఉండేవి. 18వ శతాబ్దంలో ఇంగ్లాండులో వచ్చిన పారిశ్రామిక విప్లవం, క్రమంగా చిన్న పెద్ద మెతాదులలో ప్రపంచంలోని వివిధ ప్రాంతాలకు విస్తరించటం వల్ల సమాజ స్వరూపంలో విప్లవాత్మాకమైన మార్పులు సంభవించాయి. శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం వృద్ధి, పారిశ్రామిక విప్లవాల ఫలితంగా సమాజంలో మార్పులతో పాటుగా, సమాజ సమస్యలు సంక్లిష్టమవుతూ వచ్చాయి. రోజు రోజుకు ద్విగుణీకృతమౌతున్న సమాజ సమస్యలను పరిమిత సామాజిక శాస్త్రాల సమష్టి అధ్యయన పద్ధతి సంతృప్తికరంగా విశ్లేషించలేకపో యింది. పర్యవసానంలో వివిధ సామాజిక సమస్యల పరిశీలనకై ప్రత్యేక అధ్యయన శాస్త్రాలు ఆవిర్భవించాయి. ప్రత్యేకీకరణ పిదప ప్రతి సామాజిక శాస్త్రం తన తన పరిధులను రూపొందించుకొని, ఆ పరిధిలోనే అంశాలను ప్రత్యేకంగా అధ్యయనం చేస్తూ వచ్చింది.

సమకాలీన సమాజశాస్త్రంలో రాజకీయ సమాజ శాస్త్రం ఒక ఉపవిషయంగా ప్రాధాన్యతను సంతరించుకొని ఒక ప్రత్యేక అధ్యయనాంశంగా రూపుదిద్దుకొంటున్నది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు అన్ని విశ్వ విద్యాలయాల్లో రాజకీయ సమాజశాస్త్రం అధ్యయనాంశంగా రూపొందటమే దాని ప్రాధాన్యతను ప్రాచుర్యాన్ని ప్రకటిస్తున్నది. రాజకీయ సమాజశాస్త్రం పై ఒక అంతర్జాతీయ అధ్యయన సంఘం ఏర్పడటం దాని అధ్యయన ప్రాముఖ్యతను వెల్లడిస్తున్నది. ద్వితీయ ప్రపంచ సంగ్రామం తరువాత రాజకీయ సమాజశాస్త్ర అధ్యయనంలో తగినంత శ్రద్ధ కనబడినప్పటికీ, ఆ శాస్త్ర విషయ పరిధిగాని, పరిశోధనాంశాల వృద్ధిపై కాని శాస్త్రీయ పద్ధతులలో సరిఅయిన అవగాహన ఏర్పడలేదు. ఈలోటు రాజకీయ సమాజ శాస్త్ర వృద్ధి కొంతవరకు కుంటు పడటానికి దోహదం చేసింది. రాజకీయసమాజ శాస్త్రం తనదైన సిద్ధాంత పరమైన అధ్యయన చట్టాన్ని ఏర్పరచుకొనక పోయినట్లయితే అది సంపూర్ణ సమాజ శాస్త్ర దశను చేరుకోలేకపోతుంది. రాజకీయసమాజ శాస్త్రాన్ని నిర్వచించి, దాని విషయపరిధిని నిర్ధారించి, శాస్త్ర అధ్యయనానికి తగిన నమూనాలను చర్చించి, శాస్త్ర పరిణామక్రమాన్ని పరిశీలించి, దాని ప్రత్యేక అధ్యయన విషయాలను గుర్తించి, భవిష్యత్ పరిణామాలను గూర్చి చర్చించవలసిన అవసరం చాలా ఉంది.

BRAOU

## 1.3 రాజకీయ సమాజశాస్త్రం

సమాజశాస్త్రానికి ఆంగ్లభాషలో సోషియాలజీ (Sociology) పదాన్ని అగస్టు కామ్టే ప్రవచించారు. సమాజ అధ్యయనమే సమాజశాస్త్రం. సామాజిక విశ్లేషణకు సమాజమే ప్రాతిపదికయని ఆయన వక్కాణించారు. కుటుంబం, రాజకీయ, ఆర్థిక, మతసంస్థలు, వాటిమధ్య పరస్పర సంబంధాలు విశ్లేషణలో ఉప అంతర్భాగాలుగా ఉంటాయి. సామాజిక సమూహాలను సమాజశాస్త్రం అధ్యయనం చేస్తుంది. మానవసంస్థలు, వాటి పరస్పర సంబంధాలను కూడా అది అధ్యయనం చేస్తుంది. వివిధ సామాజిక సందర్భాలలోని మానవ ప్రవర్తనలను కూడా సమాజ శాస్త్రం చర్చిస్తుంది.

సమాజ శాస్త్రం అధ్యయనం మానవ ప్రవర్తనలకు సంబంధించింది కనుక ఈ విషయంలో అది సర్వ వ్యాపితమైనదిగా ఉంటుంది. సమాజానికి చెందిన ఒక దృక్పధమే రాజకీయాలు. రన్సిమాన్( Runciman) ప్రత్యేక విజ్ఞాన శాస్త్రమైన రాజకీయశాస్త్రాన్ని సమాజశాస్త్రంతో సమన్వయించు ప్రత్యేకశాఖగా పరిగణించారు. రాజకీయాలు అధ్యయనానికి కేంద్రమైన సామాజిక విషయాలను పేర్కొనటం కష్టమైన విషయంకాదు. అయితే రాజకీయశాస్త్ర సరిహద్దులను పరిమితం చేయటమే చాల కష్టమైన పని. మానవుల మధ్య ఏర్పడే

వివాదాలను పరిష్కరించటమే రాజకీయశాస్త్ర ప్రధాన లక్ష్యం. సమాజం నిర్ణయం చేసే ప్రక్రియలను, రాజకీయ పరిణామాలను, వనరుల సాధికారిక కేటాయింపులను, విలువలను, శక్తిని వినియోగించటం, సమాజంలోని వివిధ ప్రభావాలు మొదలైన విషయాల అధ్యయనం కూడా రాజకీయశాస్త్ర లక్ష్యాలే. ఈ విషయాలన్నింటిని రాజనీతిశాస్త్రజ్ఞులు అధ్యయనం చేస్తారు.

రాజకీయశాస్త్ర అధ్యయన ప్రధాన లక్ష్యం శక్తి, ప్రధానంగా సామాజిక శక్తి. సహచరులతో మానవుడు తన సమస్యలను పరిష్కరించుకొనే వివిధ మార్గాలగురించి రాజనీతిశాస్త్ర అధ్యయనాలు పరిశీలిస్తుంటాయి. రాజనీతి శాస్త్రం మానవుల సమస్యలను అధ్యయనం చేస్తుంది. సమస్యల పరిష్కారానికి రూపొందిన యంత్రాంగం, పరిష్కారాన్ని ప్రభావ పరిచిన మూలకాలు, మానవసంబంధాలను ప్రభావ పరచిన వివిధ ప్రభావాలను కూడా రాజనీతిశాస్త్రం అధ్యయనం చేస్తుంది. రాజకీయశాస్త్ర అధ్యయనాల్లో సమాజశాస్త్ర ప్రాధాన్యతను రాజనీతిశాస్త్రజ్ఞులు చాలాకాలం నుండి గుర్తిస్తున్నారు. కారల్ మార్క్స్, మాక్స్‌వెబర్, మోస్కా, పరేటో, మిచెల్స్ సిద్ధాంతాలన్నీ రాజనీతిశాస్త్ర అధ్యయనాలను ప్రభావ పరచాయి. రాజకీయ వ్యవస్థ కాని, రాజకీయసంస్థ కాని, రాజకీయ నాయకులుగాని శూన్యంలో మనుగడకొనసాగించరు. సమాజశాస్త్ర అధ్యయనాలు రాజకీయశాస్త్ర అధ్యయనానికి సామాజిక వాతావరణంలోని అనేక విషయాలను వెలుగులోకి తెచ్చాయి. రాజకీయాలకు సమాజానికి; సమాజ నిర్మితులకు రాజకీయ నిర్మితులకు; సామాజిక ప్రవర్తనలకు రాజకీయ ప్రవర్తనకు మధ్యగల సంబంధాల అధ్యయనం రాజకీయ సమాజశాస్త్ర రంగమని చెప్పవచ్చు. ప్రభుత్వం సమాజానికి, నిర్ణయకల్పన అధికారులకు, సంఘర్షిస్తున్న సామాజిక శక్తులకు సంస్థలకు మధ్యగల అంతర్ సంబంధాలను అర్థం చేసుకోవటానికి రాజకీయ సమాజశాస్త్రం సహాయపడుతుంది. వివాదాల పరిష్కారానికి ఏర్పాటులు; వివిధ సమస్యల వ్యక్తీకరణలు, రాజకీయసమైక్యత, వ్యవస్థీకరణం మొదలైన సమస్యలను రాజకీయసమాజశాస్త్రం అధ్యయనం చేస్తుంది. వీటన్నింటికి పరస్పర సంబంధాలున్నాయి. వీటిలో సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ, మూలకాలు కూడా ఉన్నాయి. రాజకీయ విశ్లేషణలో రాజకీయ సమాజశాస్త్రం కొత్త మార్గాలను పద్ధతులను ఏర్పరచింది. రాజకీయశక్తి స్వభావం, సామాజిక, ఆర్థిక నిర్మితులతో వానికి గల అంతర్ సంబంధాలను కారల్ మార్క్స్ వెలుగులోకి తెచ్చారు. రాజకీయశక్తి ఆర్థిక ప్రాతిపదికను కారల్ మార్క్స్ సైద్ధాంతికంగా వివరించారు. అది రాజకీయ సమాజశాస్త్రానికి పునాదులు వేసింది. చాలా కాలం కిందటే గ్రీకు రాజనీతి శాస్త్రజ్ఞులైన ప్లేటో, అరిస్టాటిల్ లు కూడా ప్రభుత్వవిషయాలను ఆర్థిక సంస్థల పరంగా అధ్యయనం చేసారు. పరేటో, మోస్కా, మిచెల్స్, మాక్స్ వెబర్‌లు రాజకీయాల స్వయం ప్రతిపత్తిని సమర్థిస్తునే మార్క్స్ సిద్ధాంతాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వస్వరూప స్వభావాలను, రాజకీయ సమగ్రవాస్తవాలను అధ్యయనం చేయాలని వారందరూ అభిప్రాయ పడ్డారు.

BRAOU

రాజకీయ సమాజశాస్త్రం సమాజం, రాజకీయాల మధ్యగల సంబంధాలను అధ్యయనం చేస్తుంది. రాజకీయ సమాజశాస్త్రజ్ఞులు ప్రధానంగా రాజకీయాలకుగల సామాజిక పునాదులు, రాజకీయ ప్రక్రియ; సమాజం, సంస్కృతులపై రాజకీయ ప్రభావాల మధ్య గల సంబంధాలపై తమ దృష్టిని కేంద్రీకరిస్తున్నారు. సమాజశాస్త్రం, రాజనీతిశాస్త్రాల మధ్యగల పరస్పర చర్యల ( Interaction) ఫలితమే రాజకీయ సమాజశాస్త్రం. సామాజికశాస్త్రజ్ఞులు తమదృష్టిని సామాజిక నిర్మితులు, సామాజిక మార్పు; స్థరీకరణ, వర్గములు, వ్యవస్థలు, చలనం ( Mobility) సామాజిక వ్యవస్థలపై కేంద్రీకరించినట్లయితే; రాజకీయశాస్త్రజ్ఞులు చట్టం, స్థానిక, రాష్ట్ర,జాతీయ ప్రభుత్వాలు, ప్రభుత్వాల తులనాత్మక అధ్యయనం, రాజకీయ వ్యవస్థలు, పాలనాయంత్రాంగం, అంతర్జాతీయ సంబంధాలపై తమ దృష్టిని కేంద్రీకరించారు. రాజకీయ సామాజిక శాస్త్రజ్ఞులు రాజకీయ అభివృద్ధి, శిష్టులు, సామాజికరాజకీయ వ్యవస్థలు, శక్తి, సామాజిక శక్తి, రాజకీయసమాజీకీకరణం, రాజకీయ

సిద్ధాంతాలు, రాజకీయపార్టీలు, ఓటింగ్ ప్రవర్తన, ఘర్షణలు, సామాజిక ఉద్యమాలు మొదలైన అంశాలపై తమ దృష్టిని సారిస్తున్నారు. ఈ విధమైన అధ్యయనాలు రాజకీయసామాజిక ప్రక్రియలను సక్రమంగా అర్థం చేసుకోవటానికి కావలసిన విశ్లేషణలను అందించటంలో తోడ్పడుతున్నాయి.

## 1.4 రాజకీయసమాజశాస్త్రం -- నిర్వచనాలు

రాజకీయ సమాజశాస్త్రపు కొన్ని నిర్వచనాలను పేర్కొందాం.

(1) రాజకీయ సమాజశాస్త్రం రాజ్యం, సంఘం చర్యలను పరిశీలిస్తుంది. (Political Sociology Examines the Interaction Between the Society and the Polity )

(2) రాజకీయాలసామాజిక ప్రాతిపదికను క్షుణ్ణంగా పరిశీలించేదే రాజకీయ సమాజశాస్త్రం. (Political Sociology closely examines the Social basis of Politics)

(3) సమాజ శాస్త్రంలో రాజకీయ సమాజశాస్త్రం ఒక భాగం. అది ఒక సమాజంలో లేదా సమాజాల మధ్య అధికార పంపిణీ, సాంఘిక కారణాలకు, ఫలితాలకు సంబంధించింది. అధికార కేటాయింపులో మార్పులకు దారితీసే సాంఘిక రాజకీయ సంఘర్షణకు సంబంధించింది.

"Political sociology is that branch of Sociology which concerns with the social causes and consequences of given power distributions within as between societies, and with the social and political conflicts that lead to change in the allocation of power".

BRAOU

(4) సాంప్రదాయిక రాజనీతిశాస్త్రానికి భిన్నంగా, రాజకీయసమాజ శాస్త్రం మానవ రాజకీయ ప్రవర్తనను, రాజకీయ ప్రవర్తనను నిర్దేశించే కారకాలను, ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేసే వివిధ అంశాలను విశ్లేషిస్తుంది.

(5) వ్యక్తుల రాజకీయ ప్రవర్తనను, సామాజిక, ఆర్థిక అంశాలను ప్రభావితం చేసే ప్రక్రియను, సామాజిక ఆర్థిక పరిస్థితులను, రాజకీయసంస్థలను ప్రభావితం చేసే ప్రక్రియను అధ్యయనం చేసేదే రాజకీయ సమాజశాస్త్రం.

(6) ఒక సాంఘిక సందర్భంలో అధికారానికి సంబంధించినదే రాజకీయ సమాజశాస్త్రం.

"Political Sociology is concerned with the power in its social context".

(7) "రాజకీయాల ఉపరితల అంశాలపై కేంద్రీకరించేది రాజకీయశాస్త్రమైతే రాజకీయాల అంతర్గత అంశాలపై కేంద్రీకరించేది రాజకీయ సమాజశాస్త్రం."

Political science has tended to concentrate on the visible part of the political berg where as political sociology has paid greater attention to the submerged portions.

## 1.5 రాజకీయ సమాజశాస్త్ర అవతరణ

పారిశ్రామిక విప్లవ ఫలితంగా దినదినం సమాజసమస్యలు అధికం కావడం వలన, ప్రత్యేకనైపుణ్యం మినహా వాటిని విశ్లేషించలేమని తలంచిన సామాజికశాస్త్రాలు, పెక్కు స్వతంత్ర శాస్త్రాలుగా విడపోయి, వాటి పరిధులను రూపొందించుకొని, కీలకమైన ఇతర శాస్త్రాలతో ప్రమేయం లేకుండా తమతమ అధ్యయనాలను కొనసాగించాయి. కాని ఈ శాస్త్రలన్నింటికి మానవుడేకేంద్రబిందువైనందున, మానవుని ఒక రంగంలో ప్రవర్తన వేరొక రంగ ప్రవర్తనను ప్రభావితం చేయడమనే సామన్య సూత్రాన్ని నిర్లక్ష్యం చేసి, వివిధ సామాజిక శాస్త్రాలు వాటివాటి సరిహద్దులకే పరిమితమై అధ్యయనాలు జరపడంతో, అవి వాటికి సంబంధించిన సమస్యల విశ్లేషణ చేయలేకపోయినవి. ఉదాహరణకు రాజనీతిశాస్త్రం ఇంతకు పూర్వం కేవలం నిర్మాణసంబంధమైన, రాజ్యాంగ సంబంధమైన, సంస్థాగత సంబంధ అధ్యయనాంశంగా ఉండేది. కాని సంస్థల ఆధారాలేమిటి, అవి ఏవిధంగా పని చేస్తున్నాయి, వివిధ రకాలుగా ప్రవర్తించటానికి గల ఆర్థిక సాంఘిక అంశాలు ఏమిటి అనే వాటికి ప్రాధాన్యత కల్పించలేదు. తత్ఫలితంగా సాంప్రదాయిక రాజనీతిశాస్త్రం; రాజకీయ సమస్యలను, రాజకీయ మార్పులను కూలంకషంగా అధ్యయనం చేసే తన ప్రాథమిక బాధ్యతను సంతృప్తికరంగా నిర్వహించటంలో పరిపూర్ణంగా సఫలీకృతం కాలేకపోయింది. కాని 19వ శతాబ్దం చివర భాగంలో విశ్వ విద్యాలయాల ఆవిర్భావంతో సామాజిక శాస్త్రాలు విడిపోనారంభించాయి. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న దశలో వివిధ రకాలైన నిపుణుల అవశ్యకత ఏర్పడటమే ఇందుకు మూలకారణం.

సామాజిక శాస్త్రాల ప్రత్యేకీకరణ వల్లనే ఈ పరిస్థితి ఏర్పడటం వల్ల 20వ శతాబ్దపు శాస్త్రజ్ఞులు ఈ అంశాన్ని శ్రద్ధగా పరిశీలించి నూతన సూత్రాల అన్వేషణను ఆరంభించారు. వారి కృషి ఫలితంగా ఏర్పడిందే అంతర్ శాస్త్ర అధ్యయన పద్ధతి. సన్నిహిత సంబంధం గల శాస్త్రాల ప్రత్యేకతకు, స్వతంత్రతకు, సరిహద్దులకు ఎలాంటి హాని కలిగించకుండా, ఆయాశాస్త్రాల మధ్య ఏర్పడిన కృత్రిమ ఆటంకాలను తొలగిస్తూ, పరస్పర సహకారాన్ని అందించుకొనేందుకు అవసరమైన వారధులను నిర్మించటమే అంతర్ శాస్త్రీయ అధ్యయన పద్ధతి సారాంశం. ఈ పద్ధతివల్ల ఏ శాస్త్రానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా ఉండటమే, కాక, పరస్పర సహకారం సులభమై, ఇరుశాస్త్రాలకు ఎంతోమేలు చేకూరి తద్వారా సమాజానికి కూడా ఎంతో ప్రయోజనం కలుగగలదు. అంతేగాక ప్రత్యేకీకరణలో ఇరుశాస్త్రాలకు కలిగిన ఫలితాలు, ఆరెండు శాస్త్రాల కలయిక చే ఏర్పడిన తృతీయ శాస్త్రంలో ప్రతిబింబించగలవు. వినూత్నమైన ఈ అంతర్ శాస్త్రీయ అధ్యయన పద్ధతి ఫలితంగా అవతరిస్తున్న రాజనీతి అర్థికశాస్త్రం (Political Economy) భౌగోళిక రాజనీతి శాస్త్రం మొదలైన వాటి పరంపరలో అంతర్భాగంగా అవతరించిందే రాజకీయ సమాజశాస్త్రం.

రాజకీయాలను గూర్చి చర్చించే రాజనీతిశాస్త్రం, సాంఘిక సంస్థలను గూర్చి అధ్యయనం చేసే సమాజశాస్త్రం అతి సన్నిహితమైనవైనందున, ఆరెండింటి పరస్పర అవినాభావ సంబంధంచే అవతరించిందే రాజకీయ సమాజశాస్త్రం. అందువలననే దీనిని రెండు శాస్త్రాల మేలుకలయిక యని వివిధ రచయితలు అభిప్రాయపడ్డారు. దీని అవతరణకు కారణమైన సమాజ రాజనీతి శాస్త్రంలోని మేలైన అంశాలు రాజకీయ సమాజ శాస్త్రంలో ప్రతిబింబించాయి.

కారల్ మార్క్స్ రాజకీయ సామాజిక వ్యవస్థలను అర్థం చేసుకోవాలంటే ఆ వ్యవస్థ ఉత్పత్తి సంవిధానాన్ని తెలుసుకోవాలన్నారు. రాజకీయ వ్యవస్థ ఆర్థిక వ్యవస్థపై ఆధారపడి దానిననుసరించి మారుతుంటుంది.

మార్క్స్‌ను వ్యతిరేకిస్తూ వెబర్ ఆర్థికేతరమైన కారణాలు కూడా సమాజంలో ముఖ్యమైన పాత్రను నిర్వహిస్తాయని పేర్కొన్నారు. వెబర్‌ను అనుసరించి పరేటో, మోస్కా, లెస్టర్‌వార్డ్, టాల్కాట్ పార్సన్స్ మొదలైనవారు రాజనీతి శాస్త్రంపై విస్తృతంగా రాశారు. పార్సన్స్ రాజకీయ సమస్యలను వివరించటానికి సమాజ వ్యవస్థలకు సంబంధించిన వివిధ అంశాలను సమీకరించాలేగాని అందుకు నిర్దిష్టమైన అధ్యయన పద్ధతులులేవు అని అన్నారు. అయితే చాలాకాలం వరకు సామాజిక శాస్త్ర వేత్తలు కొత్త దృక్పథంతో రాజకీయ వ్యవస్థలను విశ్లేషించారు. వెబర్, పరేటో రచనల ప్రభావంతో చాలమంది రాజనీతి శాస్త్రజ్ఞులు, రాజనీతి శాస్త్రం వివిధ ప్రభుత్వ వ్యవస్థలు వాస్తవంలో ఎలా పని చేస్తాయో పరిశీలించటం ముఖ్యమని అన్నారు. ఈ వర్గానికి చెందిన వారిలో జేమ్సు బ్రైస్ మొదటివాడు, ముఖ్యుడుకూడా. బ్రైస్ దృష్టిలో రాజనీతి శాస్త్ర ముఖ్య విధి వాస్తవాలను ఏకరవు పెట్టడమే.

1903లో అమెరికన్ రాజనీతి శాస్త్రజ్ఞుల సంఘం రూపొందటంతో వివిధ ప్రభుత్వ వ్యవస్థల కార్యనిర్వహణ తీరుతెన్నులు ప్రత్యక్షంగా పరిశీలించడం ముఖ్యమనే అభిప్రాయం వ్యాప్తిచెందింది. ఈ విధంగా ఈ శతాబ్దపు ఆరంభంలో విధాన నిర్ణయ ప్రక్రియ, రాజకీయ నాయకత్వంలో మార్పు చేర్పులు, ఎన్నికల ప్రక్రియ, భావజాలం పాత్ర మొదలగు అంశాల అధ్యయనానికి ప్రాముఖ్యత పెరిగింది. కాని అధ్యయన పద్ధతులలో అభివృద్ధి లేకపోవటం వలన చాలా మటుకు పరిశీలనలు Intuition ఆధారంగానే జరిగాయి. ఈ సందర్భంలో ఇతర సామాజికశాస్త్రాలలో ప్రధానంగా సామాజిక, మానవ శాస్త్రాలలో అధ్యయన పద్ధతులలో జరిగిన అభివృద్ధి రాజనీతిశాస్త్రజ్ఞులను ఆకట్టుకొంది. ఈ దశలో ఆర్థర్‌బెంట్లీ, ఛార్లెస్ మెర్రియమ్‌లు గణనీయమైన పాత్రను నిర్వహించారు. బెంట్లీ రాజకీయచర్యలను సమూహాలు (Groups) ప్రభావితం చేస్తా యన్నారు. వివిధ సమూహాలకు చెందిన భావాలు, సిద్ధాంతాలు, ప్రభుత్వ వ్యవస్థలలో ప్రతిబింబిస్తాయి. అంటే రాజకీయవ్యవస్థను సరిగా అర్థం చేసుకోవాలంటే సమూహాల రాజకీయ కార్యకలాపాలను తెలుసుకోవాలన్నారు. ఛార్లెస్ మెర్రియమ్ మనోవైజ్ఞానిక, గణాంకశాస్త్రాలలో వచ్చిన అధ్యయన పద్ధతులను రాజకీయశాస్త్రజ్ఞులు ఉపయోగించుకోవాలన్నారు. తొలుత కొన్ని ఇబ్బందులు ఉన్నా అనుభవంతో అవసరమైన మార్పులు చేసుకోవచ్చునని సూచించారు. బెంట్లీ తదితరుల ప్రభావంతో రాజనీతిశాస్త్రపరిధి, దృక్పథంలో కొన్ని గణనీయమైన మార్పులు వచ్చాయి. అవి (1) గ్రూపు ప్రాథమిక విశ్లేషణ యూనిట్; (2) రాజకీయ ప్రక్రియ అధ్యయనం; (3) గ్రూపులు లేక వ్యక్తుల ప్రవర్తనల పరిశీలన. అంటే రాజకీయ శాస్త్రజ్ఞులు వివిధ సామాజిక కారకాలను పరిగణనలోకి తీసుకొంటారు. ఈ కారకాల పరిశోధనకు అధ్యయన పద్ధతులలో అభివృద్ధి సాధించాల్సి ఉంటుంది. నిష్పాక్షిక దృష్టితో అంశాల సేకరణ, సేకరించిన వాటిని క్రమపద్ధతిలో ఏర్పాటు చేయటం, వాటి ఆధారంగా రాజకీయ విషయాలను వివరించటం ఒక క్రమ పద్ధతిలో జరగాలి. అయితే రెండవ ప్రపంచయుద్ధానంతరం వరకు ఈ మార్పులు ఆశించినంతగా వ్యాప్తిచెందలేదు. యుద్ధకాలంలోను, ఆర్థిక సంక్షోభ కారణంగాను; విస్తృతమైన ప్రభుత్వవిధులు, మూడవప్రపంచ దేశాలు దాస్య శృంఖలాలనుండి విముక్తి చెందటం, రాజనీతిశాస్త్రంలో నూతనదృక్పథపు ప్రాధాన్యతను పెంచాయి. ప్రభుత్వనిర్ణయాలు ఎలాజరుగుతాయి, వివిధ వర్గాలపై వాటి ప్రభావం, ప్రజాస్వామ్య పరిరక్షణ, మూడవ ప్రపంచదేశాలలో రాజకీయ పరిస్థితి, అభివృద్ధి చెందిన విషయాల పరిశీలనలకు కొత్త దృక్పథం అవలంభించటం తప్పనిసరి అయింది.

ఈ విధంగా రాజకీయ విశ్లేషణకు సామాజిక, ఆర్థిక కారకాలను పరిగణనలోనికి తీసుకొని రావడం ద్వారా రాజకీయ సమాజ శాస్త్రం ఆవతరించింది. ఇది రెండు విభిన్న శాస్త్రాల సంకీర్ణం ఫలితంగా రూపొందింది. రాజకీయ సామాజిక కారకాల కలయికతో రాజకీయ వ్యవస్థను సరిగా అర్థం చేసుకోగల మన్న అభిప్రాయం

BRAOU

ఇందుకు దారితీసింది. ఇందువల్ల రాజనీతి శాస్త్ర పరిధి ప్రభుత్వ వ్యవస్థ, రాజ్యాంగ అధ్యయనం నుంచి రాజకీయ జీవనంలో సామాజిక, ఆర్థిక, వ్యవస్థల ప్రభావం పరిశీలన వరకు విస్తరించింది. వ్యక్తుల రాజకీయ ప్రవర్తన వివరణకు, సమాజానికి రాజకీయ వ్యవస్థకు ఉండే సంబంధాన్ని తెలుసుకోవడం రాజకీయ సామాజిక శాస్త్రజ్ఞులకు తప్పని సరి అయింది.

రాజకీయసమాజశాస్త్ర అవతరణ సమయాన్ని ఖచ్చితంగా నిర్ధారించలేం. క్రీస్తు పూర్వపు ప్లేటో, అరిస్టాటిల్ మొదలైన వారి రచనల్లో కూడా రాజకీయాలకు సామాజిక సంస్థలకు మధ్యగల సంబంధం గోచరించినప్పటికీ మార్క్స్, వెబర్, బ్రైస్, మిచెల్ మొదలైనవారు రచనల్లో రాజకీయాలకు సాంఘిక ఆర్థిక కారకాలకు మధ్యగల సంబంధం అధికంగా వివరించారు. మొదటి ప్రపంచయుద్ధం, సోవియట్ రష్యాలో కమ్యూనిస్టు విప్లవం, ఫాసిజం, నాజిజం మొదలైన రాజకీయ ఉద్యమాల ఫలితంగా 1930 ప్రాంతంలో వచ్చిన రచనలు రాజకీయసమాజశాస్త్రంగా పేర్కొనిన దానిలోని కొన్ని భావాలకు మాతృకలైనవి. నాటినుండి నేటివరకు ఈ శాస్త్రం దిన దిన ప్రవర్ధమానం చెందుతూ సాంఘిక విజ్ఞానాభివృద్ధికి దోహదం చేస్తున్నది.

## 1.6 రాజకీయ సమాజశాస్త్ర చరిత్ర -- పరిణామక్రమం.

రాజకీయ సమాజశాస్త్ర పరిణామక్రమాన్ని నాలుగు దశలుగా వర్గీకరించవచ్చు. శాస్త్ర అధ్యయన పరిధి, దృక్పథాలను బట్టి ఈ దశలను నిర్ధారించవచ్చు. మొదటిదశ; గ్రీకుల; రోమనుల కాలం. గ్రీకులు వ్యక్తిని రాజకీయప్రాణిగా భావించగా; తరువాత కాలంలోని రోమనులు అతనిని మత ప్రాతిపదికపై భగవంతుని సృష్టిగా, భగవదంశగా భావించారు. రెండవదశ ప్రభోదాత్మక కాలం నాటిది. వ్యక్తి రాజ్యానికి సేవ చేస్తూ, దానికి ఎల్లకాలం విధేయుడై ఉండవలెనా లేక రాజ్యం, వ్యక్తి సమాజసేవలకై ఏర్పడిన వ్యవస్థనా అనే సామాజిక, రాజకీయ సిద్ధాంతాలు, సూత్రాల మధ్య ఘర్షణలు జరిగిన కాలమది. ప్రభోదాత్మక దశనుండి ఆవిర్భవించి పందొమ్మిదవ శతాబ్దంలో మనుగడ పొందిన కాలం మూడవదశ: ఈ దశలో ఆధునికసమాజంలో శిష్టుల పాత్ర పైగణనీయమైన చర్చలు జరిగాయి. ఇక్కడ కూడా సాంప్రదాయ శిష్టవర్గాన్ని బలపరచేవారు, ప్రజాస్వామ్య శిష్టవర్గాన్ని బలపరచే వారు రెండు వర్గాలుగా శాస్త్రజ్ఞులు విడిపోయారు. సాంప్రదాయిక వాదులు రాజకీయవ్యవస్థను సంకుచిత, వంశపారంపర్యంగా అధికారం అనుభవించే వీలున్న వ్యవస్థగా భావించగా ప్రజాస్వామ్యవాదులు దానిని Open Ended, వ్యక్తిగత అర్హతలతో అధికారం సంపాదించుకొనే వీలు కల్పించే వ్యవస్థగా భావించారు. నాలుగవదశ. సమకాలీన రాజకీయ సమాజశాస్త్రకాలం. ఈ దశలో సమాజ రాజకీయాలను, లౌకిక దృక్పథంతో, అనుభవవాద పద్ధతులతో విశ్లేషించటం జరుగుతున్నది.

**రాజకీయ సమాజశాస్త్ర** పురాతన యుగపు ప్రతినిధులుగా ప్లేటో, అరిస్టాటిల్, సిసిరో, సెయింట్ ఆగస్టీన్, సెయింట్ **థామస్** అక్వినాస్‌లను పేర్కొన వచ్చు. వీరు సామాజిక వర్గాలు, రాజకీయాలపై వాటి ప్రభావం, రాజకీయ ప్రక్రియలపై ప్రభావాలు ఏవిధంగా ఉంటాయన్న అంశాలపై తమ దృష్టిని కేంద్రీకరించారు. ప్లేటో, అరిస్టాటిలు రాజ్యపు సామాజిక పునాదులపై తమదృష్టిని సారించారు. వీరిద్దరూ రాజ్య ఆవిర్భావం వ్యక్తుల అంతర్ప్రేరణల కారణంగా సహజమైన విషయంగా భావించారు. పురాతన యుగపు రచయితలు వ్యక్తిగుర్తింపు గమ్యం రాజ్యంలేక చర్చితో ముడిపడి ఉన్నవని పేర్కొన్నారు. సామాజిక అభివృద్ధి క్రమంలో వ్యక్తి గుర్తింపునకు గమ్యానికి మధ్య సంబంధం లేదన్నారు. ఈ భావనపై తరువాత దశలో తీవ్ర స్థాయిలో చర్చలు సాగాయి.

BRAOU

వ్యక్తి, సమాజం, రాజ్య వ్యవస్థల మధ్య ఏ విధమైన సంబంధం ఉండాలన్న అంశంపై నిన్నమొన్నటిదాక సుదీర్ఘమైన చర్చలు జరుగుతూవచ్చాయి. జాన్‌లాక్, మాంటిస్క్యూ, రూసోలు ఆతరువాత వారు సెయింట్ సైమన్, కామ్టే, మార్క్స్ఏంగెల్స్ మొదలగు వారు సమాజం, రాజ్యం లమధ్య అతి ముఖ్యమైన విభేదాలున్నాయన్నారు. మాకియవెల్లి, హాబ్స్, బర్క్, హెగల్, దీనికి వ్యతిరేకమైన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. సమాజాన్ని రాజకీయాలతో విభేదించి చూడకపోగా సాంప్రదాయిక రాజకీయ వ్యవస్థ లేక చర్చి నాయకత్వపు ప్రాధాన్యతను బలపరచారు.

17వ శతాబ్దంలో శ్రేష్టతకు, ప్రాశస్త్యానికి, ఉత్కృష్టతకు ప్రమాణంగా శిష్ట (ELITE) పదాన్ని వాడుకలోకి తీసికొని వచ్చారు. తరువాతి కాలంలో ఉన్నత సామాజిక వర్గాలను సూచించుటకు ఈ పదాన్ని వినియోగించసాగారు. 19వ శతాబ్దపు చివరి రోజుల్లో, 20వ శతాబ్దపు ఆరంభంలో ఈ పదం సమాజ, రాజనీతి శాస్త్రాలలో ప్రముఖ స్థానాన్ని సంతరించుకోలేకపోయింది. పరేటో, మోస్కా అనే ఇటాలియన్ సామాజిక శాస్త్రజ్ఞులు ఈ పదానికి ప్రాధాన్యత కల్పించారు. చరిత్ర భావనలతోగాని, సిద్ధాంతాలతోగాని, సాధారణ ప్రజలతోగాని, రహస్య శక్తులతోగాని సృష్టించబడలేదని, చరిత్ర సృష్టి తమతమ రంగాలలో విశిష్టస్థానాన్ని సంపాదించుకొన్న చిన్న వర్గాలసృష్టియని శిష్టపర సిద్ధాంతవేత్తలు భావిస్తున్నారు. చరిత్రలో అన్ని దశలలో కూడా ఒక విశిష్టమైన పాలక వర్గం ఉండెడిదని, ఇది సంఖ్యా పరంగా సమాజంలో చాలా చిన్నదని, సామాజిక వనరులపై గుత్తాదిపత్యం కలిగి ఉండి తద్వారా తమ అధికారాన్ని సమాజంపై పెంచుకొనుటకు, ప్రయత్నించి చాలావరకు సఫలీకృతమయ్యారని శిష్టవర్గ సిద్ధాంతవాదులు అభిప్రాయ పడ్డారు. సైనికశక్తి, మతశక్తి, ఆర్థికశక్తి, రాజకీయశక్తి మొదలుగాగల సామాజిక శక్తులపై శిష్టవర్గానికి ఆధిపత్యం ఉంటుందని; ఈ ఆధిపత్యం సమాజానికి సమాజానికి భిన్నంగా ఉంటుందని, కాలాన్ని బట్టి మారుతుందన్నది శిష్టవర్గ సైద్ధాంతికుల భావన. పరేటో, మోస్కా, మిచెల్స్ మొదలుగాగల సాంప్రదాయ శిష్టసిద్ధాంత కర్తలు వ్యక్తుల మధ్యగల భౌతిక నైతిక, వైజ్ఞానిక భేదాల నాధారంగా చేసుకొని తమసిద్ధాంతాన్ని బలపరచుకొన్నారు. ప్రజాస్వామ్యవ్యవస్థలకు ఎటువంటి భవిష్యత్తు లేదని వీరిభావన. డీటోక్వేవెల్లి, దులెకేం లాంటి శిష్టవర్గ సిద్ధాంతవాదులు ప్రతిసమాజంలో అన్నిదశలలో శిష్టులుంటారని, సమాజానికి వారి అవసరం తప్పనిసరిగా ఉంటుందని చెబుతూ; ఈ శిష్టవర్గాన్ని అదుపులో ఉంచకపోయిన వ్యక్తిగౌరవానికి, స్వేచ్ఛా స్వాతంత్రాలకు భంగం వాటిల్ల గలదని వాదించారు. రాజ్యాంగ బద్ధ ప్రజాస్వామ్యంలో అధికార విభజనకు ఎంత ప్రాధాన్యముంటుందో, ఉమ్మడి అభిప్రాయాలకు (Consensus) అంతే ప్రాధాన్యం ఉంటుంది. స్వతంత్రభావాలు కలిగి పౌర విధులు హక్కులపై చైతన్యంగల స్థానిక సంస్థలు పెరుగుతున్న కేంద్రీకృత అధికార వ్యవస్థను నియంత్రించ గలుగుతాయని ప్రజాస్వామ్యశిష్ట సైద్ధాంతికుల వాదన. ప్రజాస్వామ్య, సాంప్రదాయ శిష్టసిద్ధాంతవాదులకు మధ్యే మార్గంగా వెబర్, మాన్‌హీం లాంటివారు వాదించారు. శిష్టవర్గం లేని సమాజం ఉండదని అంగీకరిస్తూ, ప్రజాస్వామ్య పద్ధతులలో రాజకీయ స్థానాల భర్తీ జరిగితే, శిష్టులకు సామాన్యప్రజానీకానికి మధ్య దూరం తగ్గుతుందని వీరి భావన. న్యాయ పాలనలో శాంతి భద్రతల నియంత్రణలో మానవతావిలువలకు, ప్రజాస్వామ్యబద్ధంగా ప్రణాళికలను రూపొందించుకొనుట శిష్టవర్గానికి అవసరమని వీరి వాదన. రాజకీయ సమాజశాస్త్ర వృద్ధిలో ఈ దశ చాల కీలకమైనది.

సమకాలీన దశలో రాజకీయ సమాజశాస్త్రం మూడు ముఖ్యమైన అంశాలపై తన దృష్టిని సారించింది. అవి రాజకీయ సమాజశాస్త్ర అభివృద్ధి క్రమం, సమాజానికి రాజకీయాలకు గల సంబంధం, సామాజిక రాజకీయ వ్యవస్థలు, మార్పునకు మధ్యగల సంబంధం. శక్తి, ప్రాబల్యం, అధికారాల ఆవిర్భావం, వాటి నిర్మాణక్రమం ప్రక్రియ, సమాజంపై వీటి ప్రభావాల అధ్యయనం ఈ దశలోని ప్రధాన అంశాలు. సమకాలీన రాజకీయ

BRAOU

సమాజశాస్త్రం ఈ కింది అధ్యయన పునాదులపై నిలచి ఉంది:

1. రాజకీయ సమాజశాస్త్ర అధ్యయన పరిధి
2. సమాజం, రాజకీయ అభివృద్ధి
3. రాజకీయ శిష్టవర్గం, వ్యవస్థ
4. స్థూల సమాజ రాజకీయ అభివృద్ధి
5. సమాజం, ప్రాబల్యం, శక్తి
6. సామాజిక శక్తి
7. సామాన్య ప్రజానీకం
8. సామాజిక నిర్మితులు, రాజకీయాలు
9. సామాజిక రాజకీయ మార్పు

## 1.7 రాజకీయ సమాజశాస్త్రం -- పరిధి

సమాజం, రాజకీయాలను నేడు ప్రత్యేకాంశాలుగా భావిస్తున్నప్పటికీ; ప్రాచీన, మధ్యయుగాలలో ఈ ప్రత్యేకతాభావంగాని, వీటి మధ్య వైరుధ్యాలు గాని లేకుండెడివి. గ్రీకులు, రోమనుల కాలాల్లో మానవుని పూర్తిగా రాజకీయసమాజ సభ్యుడి గానే భావించేవారు. కాని పవిత్ర రోమన్ సామ్రాజ్యకాలంలో మానవుని విధేయతను చర్చితో అయిష్టంగానైనా పంచుకోవడం జరిగింది. 16,17 శతాబ్దాలలో సంభవించిన మత, ఆర్థిక, రాజకీయ సంఘటనల ఫలితంగా సమాజం, రాజకీయాలు క్రమక్రమంగా వేరు పడటం కొనసాగింది. 18వ శతాబ్దం నాటికి బ్రిటిష్ ఫ్రెంచి తత్వవేత్తలు ఈ రెండూ ఒకటికి మరొకటి పర్యాయ వ్యవస్థలుకావని అవిరెండూ వేర్వేరని, రాజ్యం ఎంతో ఉన్నత వ్యవస్థ అయినప్పటికీ సామాజిక వ్యవస్థలో అది అంతర్భాగమని భావించటం జరిగింది. 19వ శతాబ్దపు మేధావులైన సెయింట్ సైమన్, కామ్టే, మార్క్స్, విప్లవయుగపు ప్రభావం సామాజిక రాజకీయ వ్యవస్థలపై ఏవిధంగా ఉండునోయని తమ జిజ్ఞాస (Concern)ను వ్యక్త పరచారు. పారిశ్రామిక విప్లవం ఆర్థికంగా, ప్రత్యేకత ప్రాతిపదికగా ఉన్న భూస్వామ్య విధానం, క్రమానుగత పద్ధతిలో వ్యవస్థీకృతమైన వర్గవ్యవస్థల ఆధారంగా చేసుకొని, సాంప్రదాయంగా వస్తున్న మత, రాజకీయ శిష్టుల ప్రభావాన్ని విచ్ఛిన్నం చేసింది. అమెరికా స్వాతంత్ర్యపోరాటం, ఫ్రెంచివిప్లవం, రాజరికం వలస ప్రభుత్వాల రాజకీయ అధికారాన్ని ప్రాబల్యాన్ని కూకటివేళ్ళతో పెకిలించాయి. వాటి శాసనబద్ధతను, వ్యవస్థలను సంపూర్ణంగా మార్చివేసాయి. త్వరితగతిలో సామాజిక రాజకీయ మార్పులను తెస్తున్న ఈ కాలం రెండు సమస్యలను సృష్టించింది. అవి సామాజిక వ్యవస్థ, వ్యక్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు సంబంధించిన అంశాలు. దీని పర్యవసానంలో ఒక ముఖ్యమైన ప్రశ్న తలఎత్తింది. ఏవిధమైన ప్రజాస్వామ్య వ్యవస్థ, సాంప్రదాయకంగా వస్తున్న మత, రాజకీయ అధికారాన్ని స్థానభ్రంశంచే యునన్నదే ఈ ప్రశ్న.

ఇరవైవశతాబ్దపు సమాజరాజకీయశాస్త్రజ్ఞులదృష్టి, సమాజం, రాజకీయ వ్యవస్థలపై, సమైక్యతపై, వ్యక్తి పౌరహక్కుల రక్షణలపై కేంద్రీకరింపబడింది. బలమైన జాతి రాజ్యాలు, Mass Societies ఏర్పాటవుతున్న తరుణంలో రాజకీయ, సమాజ వ్యవస్థల స్వరూప స్వభావాలు ఏ రకంగా ఉంటాయన్న భావన మేధావి వర్గాలలో ఉత్పన్నం

అవుతున్నది. ప్రజా బాహుళ్యంనుండి న్యాయబద్ధమైన మద్దతు, విశ్వాసం లేని దీర్ఘకాలిక, కట్టుదిట్టమైన వ్యవస్థను నెలకొల్పుట రానురాను కష్టతరమని కొత్త రాజకీయ ప్రభుత్వాలు భావించనారంభించాయి. అధికారం ప్రాబల్యాలను సంపాదించటంలో, పంచుకోవటంలో, అనుభవించటంలో ఎంపిక చేసే పద్ధతుల గురించి ఉమ్మడి అభిప్రాయానికి రావడాన్ని కీలకమైన అంశంగా భావించవచ్చు. రాజకీయ వ్యవస్థనుకాని, సమాజం లేక సమాజాల మధ్య అధికారవిభజనను అధ్యయనం చేయాలంటే ఆ అధికారం వెనుక ఉన్న సాంఘిక శక్తులు, కారకాలు, వాటి ప్రభావాన్ని తప్పని సరిగా అధ్యయనం చేయాల్సిఉంటుంది. అటువంటప్పుడు ప్రాబల్యం, అధికారం, అధికారపు వివిధ స్వరూపాలు, విధాన నిర్ణయాల వెనుకగల సామాజిక కారకాలు, విధాన, శాసన నిర్మాణాలలో జోక్యం, క్రమం, మొదలుగాగల అన్ని చర్యలు, సమాజంపై వాటి ప్రభావం రాజకీయ సమాజ శాస్త్రజ్ఞుల దృష్టిని ప్రధానంగా ఆకర్షించాయి.

లింగ, వయోబేధం లేకుండా సమాజంలోని అన్ని వర్గాల మధ్యగల క్రమానుగత సంబంధాలను గాని సంపూర్ణమైన అంతర్‌చర్యలను (INTERACTIONS) గాని సమాజంగా స్థూలంగా పేర్కొనవచ్చు. సమాజంలో సభ్యులను కాపాడేందుకు స్వయం పోషకాలుగా ఉన్న సమాజ విభాగాలన్ని ఒక్క దగ్గరే కలిసి కట్టుగా ఉంటాయి. సామూహిక కట్టు బాట్లు, న్యాయసూత్రాలు, వ్యక్తుల పాత్ర, విలువల వ్యవస్థలు, వర్గాలు, తరాలు, మొదలుగా గల సామాజిక వ్యవస్థలే సామాజికచట్రంగా ఉంటూ; చారిత్రక గతిలో స్థిరంగానో లేక మార్పుచెందుతూనో ఉంటాయి. సమాజగమనానికి సామాజిక వ్యవస్థల మునుగడయే కారణం. సామాజిక మార్పు, సామాజిక సాంస్కృతికవిలువలు, ఆ విలువలను సాధించే వ్యవస్థల మధ్య ఉద్రిక్తతలను, విభేదాలను సూచిస్తుంది. లక్ష్యాలు, వాటిని సాధించే మార్గాల మధ్య విభేదాలు, సమాజం, రాజకీయాల మధ్యగల క్రియాశీల సంబంధాలను సూచిస్తాయి. పారిశ్రామిక విప్లవానంతరనేటి కాలం, సామాజిక సాంస్కృతిక మార్పులతో త్వరితగతిలో కోరుకుంటున్నది. సామాజిక వనరుకై పోటీపడే వర్గాల, విలువల కేంద్రాల మధ్య స్పష్టమైన విభేధాలున్నప్పుడు, మార్పును త్వరితగతినకోరడం గమనించదగిన విషయం. అందుకొరకే ఈ విభేదాలను సాధ్యమైనంతవరకు తగ్గించుటకు ప్రయత్నించినట్లయితే అవిచ్ఛిన్నమైన అభివృద్ధి సాధించుటకు సుగమమైన వాతావరణం ఏర్పడగలదు. సమాజంలోని అన్ని వర్గాలకు ఆమోద యోగ్యమైన ప్రాథమిక విలువలను, సూత్రాలను గుర్తించటం రాజకీయవ్యవస్థ ప్రథమ కర్తవ్యం. ఈ విలువలను సూత్రాలను సక్రమంగా అమలు పరచటకు కావలసిన శక్తి సామర్థ్యాలను సమకుర్చుకోవటం రాజకీయవ్యవస్థ ద్వితీయకర్తవ్యం. సామాజిక, రాజకీయ వ్యవస్థల మధ్యనిరంతర విభేదాలు నిస్పృహాలకు ఘర్షణలకు దారితీస్తాయి. ఈ రెండు వ్యవస్థలమధ్య సానుకూల వాతావరణం సామాజిక, సాంస్కృతిక విలువల సమీకరణకు దోహదం చేస్తూ లక్ష్యసాధనకు దోహద పడుతుంది.

సమాజంలో అధికారం, ప్రాబల్యాలకై జరిగే పోరాటం, అది సమసిపోవటానికి తీసుకోనే చర్యలే రాజకీయాలని సామన్య అర్థంలో చెప్పవచ్చు. సామాజిక వనరులకై సిద్ధాంతాలపై జరిపే బేరసారాల రంగస్థలమే రాజకీయాలు. ప్రాబల్యాన్ని అధికారాన్ని ఆధారాంగా చేసుకొన్న గతిశీలక రాజకీయాలు సర్వసాధారణంగా ప్రపంచంలో అన్ని కాలాలలో కనపడే సామాజిక ప్రక్రియ. ఇది అనియతంగా వ్యక్తుల మధ్యగాని, వర్గాల మధ్యగాని, సామాజిక వ్యవస్థల మధ్యగాని ఉండవచ్చు. గౌరవ మర్యాదలు, ప్రతిఫలాలకొరకు అయా వర్గాల మధ్య పోటీలు అనివార్యమైనందున రాజకీయాలు సర్వత్రా ప్రత్యక్షమవుతున్నాయి. ఒక వ్యక్తి లేక వ్యవస్థ ఆజ్ఞలను ఇతరులపై వారి ఇష్టానిష్టాలతో నిమిత్తంలేకుండా, ప్రతిఘటన ఉన్నా లేకున్నా, బలవంతంగానైన విధించగలిగేది, అధికారం లేక ప్రాబల్యం లేక శక్తి అని పిలువవచ్చును. దీనిని వివిధ రూపాలలో, వివిధ పద్ధతులలో వినియోగించుకోవచ్చు. సమాజంలో ఈ అధికారాన్ని అనుభవించే ముఖ్యవ్యవస్థగా రాజ్యాన్ని

BRAOU

పేర్కొనవచ్చు. పాలనా యంత్రాంగం ఉన్న రాజకీయవ్యవస్థయే రాజ్యం. రాజకీయాలను సాధారణార్థంలో ఇక్కడ పేర్కొన్నాం. రాజ్యాల మధ్యగాకుండా, వాటి నిమిత్తంలేకుండా కూడా వ్యక్తుల మధ్య, సమూహాల మధ్య ప్రాబల్యం, అధికారాల కొరకు పోటీని చూడవచ్చును. శాంతిభద్రతలను కాపాడుటకు, వివిధ సామాజిక వ్యవస్థలమధ్య ఘర్షణలు తలఎత్తకుండా జాగ్రత్త పడుతూ రాజ్యవ్యవస్థ పరిణతి చెందింది. సామాజిక వనరుల సమీకరణ వాటిపై అధిపత్యం, సమన్వయం, పంపిణీలకు బాధ్యత వహించే ప్రాథమిక వ్యవస్థ రాజ్యం.

వివిధ రకాల సామాజిక వ్యవస్థల కలయికయే సమాజం, రాజకీయ వ్యవస్థ. ఈ వ్యవస్థల నిర్మాణం, విధులు ఒకదానితో ఒకటి కలిసిపోయినట్లుండి, సమీప వ్యవహారిక సంబంధాలు కలిగి ఉంటాయి. ఈ సంబంధాలు వ్యవహారశైలిలో అధికారం ప్రాబల్యం, ప్రముఖస్థానం వహిస్తున్నాయి. ఇవిసామాజిక అవసరాల కొరకు, లక్ష్యాలకొరకు, విలువల కొరకు, లక్ష్యసాధనకు వినియోగించే మార్గాలకొరకు తద్వార లభ్యమయ్యే వనరుల నిమిత్తం సమాజం, రాజకీయ వ్యవస్థలు ఏ విధంగా పరస్పరం పోటీ పడుతుంటాయో సూచిస్తాయి. రాజకీయప్రక్రియ ఎప్పుడూ సంపూర్ణమైనదిగాఉండదు. ఎందుకనగా సమాజం కాలగమనంలో వృద్ధి చెందుతూ రూపాంతరం చెందుతూంటుంది. సమాజ వర్గాలలో ఎంచబడిన వనరులు తగినన్ని లేకపోవటం వల్ల; సామాజిక వర్గాలమధ్య వనరులకొరకు ఉద్రిక్తతలు, ఘర్షణలు నిరంతరం కొనసాగుతూ ఉంటాయి. ఈ ఉద్రిక్త వాతావరణాన్ని సక్రమంగా నిర్వహించి, శాంతి భద్రతలను కాపాడుతూ రాజకీయ సామాజిక వ్యవస్థల మధ్య సామరస్యాన్ని, సహకారాన్ని పెంచుతూ సమాజ పురోభివృద్ధికి పాటు బడటం రాజ్యపు ప్రధమ కర్తవ్యం.

ఇతర సాంఘికశాస్త్రాలతో పోల్చినపుడు రాజకీయ సమాజశాస్త్రం ఇటీవల ఉద్భవించింది. శైశవ దశలోనే ఈ శాస్త్ర పరిధిని ఖచ్చితంగా పేర్కొనడం కష్టం. అయినప్పటికీ ఈ శాస్త్రంలోని ప్రధాన అంశాలను స్థూలంగా తెలియజేయటం అసాధ్యమేమీ కాదు. రాజకీయ సమాజ శాస్త్రం రాజనీతి శాస్త్రంలో భాగంగా అవతరించినప్పటికీ సాంప్రదాయిక రాజనీతిశాస్త్ర అధ్యయన పద్ధతిని విమర్శిస్తూ మానవ రాజకీయ ప్రవర్తనను ప్రభావితం చేసే విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తుంది. సాంప్రదాయిక రాజనీతి శాస్త్రం ప్రధానంగా రాజ్యం, రాజ్యావతరణ, రాజ్యాంగం, ప్రభుత్వ యంత్రంగాలను గూర్చిన సంస్థాపరమైన అధ్యయనం చేస్తుంది. రాజకీయ సమాజ శాస్త్రం రాజ్యాన్ని, సమాజ నిర్మాణాన్ని, రాజకీయ-సామాజిక ప్రక్రియల పరస్పర సంబంధాన్ని అధ్యయనం చేస్తూ రాజనీతి శాస్త్రానికి నూతన జీవం పోసి సమాజానికి హెచ్చు స్థాయిలో ఉపయోగపడేలా రూపొందిస్తుంది.

నాటి పోలీసు రాజ్యాలకు భిన్నంగా ఆధునిక రాజ్యాలు, ప్రజా శ్రేయోరాజ్యాలైనందున, అధికార స్వామియైన పౌరుడు ఎలాంటి వాతావరణంలో పెరిగాడు అని చర్చిస్తుంది. అంతేకాక రాజకీయ సామాజికీకరణలో వ్యక్తిరాజకీయ భావాలను, నమ్మకాలను, ఆశయాలను రూపొందించటంలో తన కుల, మత, కుటుంబ, విద్య, వృత్తి సంబందమైన సంస్థలు ఏ విధమైన పాత్రను నిర్వహించుచున్నవి అనే విషయాలను కూడా రాజకీయ సమాజ శాస్త్రం చర్చిస్తుంది. ఒక దశలో మానవుడు ఏర్పరచుకొన్న రాజకీయ భావాలు, సంస్కృతి శాశ్వతంగా కొనసాగవలసిన అవసరంలేదు. మిత్ర బృందాలచే, వృత్తి, మత, సంస్థలచే, వర్గ విధేయతలచే; పౌరుని రాజకీయ భావనలో, ప్రవర్తనలో ఎంతో మార్పు సంభవిస్తుంది. అందువల్ల సంపూర్ణ రాజకీయ అవగాహనకు పాలకులను, పాలితులను ప్రభావితం చేసే వివిధ సాంఘికార్థిక శక్తులను అధ్యయనం చేయడం రాజకీయ సమాజ శాస్త్ర పరిధిలో అంతర్భాగమే.

BRAOU

రాజకీయాలలో చురుకుగా పాల్గొనేవారు అధికార కైవసానికి ప్రయత్నంచేయడం సహజం. అధికారం కేవలం అధికారం కొరకే కావచ్చు లేదా తన ఆర్థిక సాంఘిక ప్రయోజనాలకుగాని, తన సిద్ధాంతాల్ని అమలు పరచడానిగకి గాని కావచ్చును. అందువల్ల రాజకీయాలలో ఎల్లప్పటికి పరస్పర విరుద్ధమైన కోర్కెలు ఉండి సంఘర్షణలు ఉత్పన్నం కావడం సహజమే. పరస్పర విభేదాలున్నప్పటికి కొన్ని ముఖ్యాంశాలలో ఏకీభావం ఉన్నప్పుడే సుస్థిర రాజ్యస్థాపన సాధ్యపడుతుంది. రాజనీతి శాస్త్రం విభేదాలకు, అధికార పోరాటాలకు ప్రాధాన్యత నివ్వగా సమాజ శాస్త్రం కేవలం ఏకీభావనకు లేక సామాజిక సుస్థిరతకు మాత్రమే పరిమితం కావడంవల్ల అటు రాజనీతి శాస్త్రం, ఇటు సమాజ శాస్త్రం తమ తమ రంగాలకు సంపూర్ణ న్యాయం చేకూర్చలేక పోవుచున్నవి. రాజకీయ సమాజ శాస్త్రం భిన్నాభిప్రాయాలకు, ఏకీభావనలకు, శాంతి సుస్థిరతకు, సంఘర్షణలకు తగు ప్రాధాన్యత ఇచ్చి పరిశీలిస్తూ పై రెండు శాస్త్రాలలోని లోటును భర్తీ చేస్తుంది.

రాజకీయ సమాజశాస్త్ర అధ్యయనాన్ని స్థూలంగా మూడు ముఖ్యమైన భాగాలుగా విభజించవచ్చును:

1. రాజకీయ వ్యవస్థ సామాజిక పునాదులు.

2. రాజకీయ ప్రక్రియలో సామాజిక కారకాల ప్రభావంగా అంటే మార్పు, స్థిరత్వంలాంటి విషయాల అధ్యయనం.

3. వ్యక్తుల రాజకీయ ప్రవర్తన.

చివరి రెండు విషయాలపైననే రాజకీయ సమాజ శాస్త్రజ్ఞులు ఎక్కువగా తమ దృష్టిని కేంద్రీకరించారు. రాజకీయ వ్యవస్థ సామాజిక పునాదులు తెలుసుకోవడం దానికి సంబంధించిన ఇతర విషయాలను అర్థం చేసుకోవడానికి తోడ్పడుతుంది. వెబర్, మార్క్స్‌లు ఈ దృక్పథంతో తమ పరిశీలనను కొనసాగించినా తరువాత వీరు దీని ప్రాముఖ్యతను విస్మరించారు.

BRAOU

రాజకీయ సమాజ శాస్త్రజ్ఞులలో మొదట జరిగిన పరిశోధనలు సమాజంలో రాజకీయ ప్రవర్తనను సమగ్రంగా పరిశీలించడానికి ప్రయత్నం చేశాయి. కాని తర్వాతి కాలంలో ఈ దృక్పథాన్ని విమర్శించి రాజకీయ ప్రవర్తనకు సంబంధించిన వివిధ అంశాలపైన వీరు తమ దృష్టిని కేంద్రీకరించారు. అంటే స్థూల పరిశోధన(Macro-Research) నుంచి సూక్ష్మ పరిశోధన (Micro-Research) పై దృష్టి మరల్చారు. అయితే సామాజిక స్తరీకరణకు సంబంధించిన అధ్యయనాలు లేవని కాదు. కాని అవి ఎక్కువగా సమాజ శాస్త్రజ్ఞులు చేసి విశ్లేషణలే. సమాజ స్తరీకరణకు చెందిన సమస్యను రాజకీయ వ్యవస్థలో దాని పాత్రను రాజనీతి శాస్త్రజ్ఞులు విస్మరించారనే చెప్పవచ్చును.

రాజకీయ ప్రక్రియ-మార్పు, స్థిరత్వం గురించి రాజనీతి శాస్త్రజ్ఞులు విస్తృతంగా పరిశీలించారు. అయితే ఇక్కడ అన్ని విషయాలపై జరిగిన పరిశోధనలను సమీక్షించడం సాధ్యంకాదు. మూడవ ప్రపంచ దేశాలలో ఆధునికీకరణ, రాజకీయ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై వచ్చిన కొన్ని రచనలను చూద్దాం.

Political development.................................. is seen as the acquisition by a political system of a consciously sought and a qualitatively new and enhanced political capacity as manifested in the successful institutionalization of (1) new patterns of integration and penetration regulating and

containing the tensions and conflicts produced by increased differentiation, and (2) new patterns of participation and resources and distribution adequately responsive to the demands generated, imperatives of quality. The acquisition of such a performance capacity is in turn a decisive factor in the resolution of the problems of identity and legitimacy.

రాజకీయ అభివృద్ధి గురించి చర్చించినప్పుడు రాజనీతి శాస్త్రజ్ఞులు అభివృద్ధి చెందిన దేశాలలో పాశ్చాత్య దేశాలలో ఉన్న రాజకీయ వ్యవస్థను ఆదర్శవంతమైన వ్యవస్థగా తీసుకున్నారు. రాజకీయ కార్యకలాపాలలో లౌకికంగా భాగస్వామ్యం తీసుకొన్నప్పుడు, రాజకీయ వ్యవస్థ ఇతర సామాజిక వ్యవస్థలతో విడిపోయినప్పుడు, వివిధ కార్యకలాపాలను, సమస్యలను సమర్థవంతంగా నిర్వర్తించగలిగినప్పుడు దాన్ని పూర్తిగా అభివృద్ధి చెందిన ఆదర్శ వ్యవస్థగా భావించవచ్చునన్నారు.

అభివృద్ధి చెందిన దేశాలలో ఆధునిక, ప్రాచీన సాంప్రదాయాలకు మధ్యఉన్న వ్యతిరేకత ముఖ్య సమస్యగా తీసుకొన్నారు. పాశ్చాత్య దేశాల ప్రభావంతో ఈ దేశాలలో ప్రజాస్వామ్యం, పాశ్చాత్య విలువలు ప్రవేశించినప్పటికిన్ని ఇంకా సాంప్రదాయిక విలువులు పాతుకొని ఉండటం వలన చెప్పుకోదగిన అభివృద్ధి లేదని అన్నారు. అంటే పాశ్చాత్య విలువలు విస్తృతంగా ప్రచారంలోకి వస్తేగాని ఏ బడుగుదేశమైనా అభివృద్ధి చెందదని అర్థం.

పార్టీలు, ప్రభావ వర్గాలు రాజకీయ ప్రక్రియలలో ప్రజల పాత్రలాంటి విషయాలపైన కూడా విస్తృతంగానే పరిశోధనలు జరిగాయి. రాజకీయ అభివృద్ధిలో వివిధ పార్టీల గ్రూపుల పాత్ర, ఎన్నికల ప్రభావం గురించి ఎంతోమంది శాస్త్రవేత్తలు విపులంగా వ్రాశారు. ఈ పరిశోధనలకు సంబంధించిన కొన్ని ముఖ్యాంశాలు-

BRAOU

1) వ్యవస్థ కొంత పరిణితి చెందిన తర్వాతే రాజకీయ పార్టీలు ఆవిర్భావిస్తాయి. విధానాలకు, సంక్షోభాన్ని అరికట్టడానికి ప్రజల మద్దతును పొందడం వీటి ముఖ్య లక్ష్యం. "విధాన నిర్ణయంలోనూ, నాయకుల ఎంపికలోనూ ప్రజల పాత్రను elites గుర్తించాలనే సిద్ధాంతం మూలంగానే రాజకీయ పార్టీలు ఆవిర్భవిస్తాయి. నియంతలు కూడా ప్రజలను అదుపులో ఉంచటానికి పార్టీలను ఉపయోగించుకుంటారు." అంటే ప్రజల పాత్రను గుర్తించిన elite లే పార్టీల ఆవిర్భావానికి ప్రముఖ పాత్ర వహిస్తారు. కనుక పార్టీ వ్యవస్థ వలన ఎవరికి లాభం చేకూరుతుందో అన్న విషయం గురించి సమగ్రమైన చర్చలేదు.

2) రాజకీయ అభివృద్ధిపైన వచ్చిన అనేక రచనలు రాజకీయాలలో ప్రజలు పాల్గొనడం అవసరమని పేర్కొన్నప్పటికి, వ్యవస్థకు మద్దతునిస్తూ పాల్గొనడాన్నే భాగస్వామ్యం (Participation) గా భావించారు. అయితే వ్యవస్థకు వ్యతిరేకంగా కూడా ప్రజలు రాజకీయాలలో పాల్గొనవచ్చునని కొంతమంది ఒప్పుకొన్నారు. కాని వ్యవస్థకు వ్యతిరేకత తాత్కాలికమైనదిగా భావించారు. విధాన నిర్ణయంలో ఎక్కువ మంది పాత్రను విస్తృతం చేయడంద్వారా, పార్టీలు ప్రజలను సమీకరించడంవల్ల ఇటువంటి సమస్యలను పరిష్కరించవచ్చునని సూచించారు. అంటే వ్యవస్థను పటిష్టం చేయడానికే ప్రజలు రాజకీయాలలో పాల్గొంటారనే భావనను బలపర్చారు.

3) ఓటింగ్‌ను ప్రభావితంచేసే కారణాలను తెలుసుకోవడానికి చాలా దేశాలలో ప్రయత్నాలు జరిగాయి. కుల, మత వ్యవస్థల ప్రభావం, పార్టీల ఆర్థికస్థాయివంటి అంశాల పాత్రను నిశితంగా పరిశీలించారు. అయితే ఇలా ఎన్నికలలో గెల్చిన ప్రభుత్వం తీసుకొనే విధానాలు ఎవరికి అనుగుణంగా ఉంటాయి అన్న అంశాన్ని

విస్మరించారు. ఉదాహరణకు భారతదేశంలో ప్రభుత్వ విధానాలు ధనిక రైతులకే లాభదాయకంగా ఉన్నట్లు తేలింది. సన్నకారు రైతులు ఉత్పత్తి చేస్తున్న జనుము, వరికంటె ధనిక రైతులు ఉత్పత్తి చేస్తున్న గోధుమ, ప్రత్తికే ప్రభుత్వం ప్రాధాన్యత నిచ్చింది.

పై వాటితోబాటు క్రింది అంశాలు కూడ రాజకీయ సమాజశాస్త్రపరిధిలో, ప్రధాన అంతర్భాగంగా భావించబడుతున్నాయి.

1. ఓటింగ్ ప్రవర్తన: ఆధునిక రాజ్యాలలో అత్యధిక రాజ్యాలు ప్రజాస్వామ్య రాజ్యాలైనందున ప్రజాస్వామ్యంలో 'ఓటు' అత్యంత శక్తివంతమైన సాధనం. పౌరుడువేసే ప్రతి ఓటు ప్రజాస్వామ్య సౌధ నిర్మాణం ఇటుక. అత్యంత విలువైన ఓటును పౌరుడు స్థానిక రాజకీయాలు మొదలుకొని జాతీయ రాజకీయాల వరకు ఎలా ఉపయోగిస్తున్నాడు, ఓటింగ్ ప్రవర్తనను వివిధ సాంఘికార్థిక కారకాలు ఏ విధంగా నిర్దేశించుచున్నవి, మొదలైన విషయాలను రాజకీయ సమాజ శాస్త్రం రకరకాల పరిశోధనా పద్ధతుల ద్వారా అధ్యయనం చేస్తుంది.

2. ఆర్థిక అధికార కేంద్రీకరణ: రాజకీయ నిర్ణయాకరణ పూర్వం ఆర్థిక సంబంధమైన శక్తి ఒక స్వతంత్ర చలాంకం. విధాన నిర్ణయాకరణ ఆర్థిక శక్తిచే ప్రభావితం చేయబడే ఆధారచలాంకం అనే భావన ఉండేది. కాని రాజకీయ సమాజ శాస్త్రం ఆర్థికాధికారం విధాన నిర్ణయాకరణను ప్రభావితం చేసే అంశమునే కాక రాజకీయాధికారం ఆర్థికాధికారాన్ని ఏ విధంగా నిర్దేశించగలదనే పరిశోధించగలదు. ఉదహరణకు అధికార పార్టీసంపన్నులు, సంపన్నుల ప్రతినిధులతో కూడి వున్నా లేక సంపన్నులు, భూస్వాములు, శాసనసభ్యులు అయినప్పటికి ఆర్థిక వికేంద్రీకరణకు, పరిశ్రమల జాతీయకరణకు బ్యాంకుల జాతీయకరణ, భూకమతాల పరిధులు మొదలైన విధానాలను రూపొందించడం జరుగుతునే ఉన్నది.

BRAOU

3. రాజకీయ ఉద్యమాల, ప్రయోజనవర్గాల సిద్ధాంతాలు: రాజకీయ సమాజ శాస్త్రం ప్రపంచంలో నలుమూలల సంభవించిన, తల ఎత్తుతున్న ఉద్యమాలకు గల ప్రాథమిక కారకాలను ఉద్యమాలకు ఆధారమైన సిద్ధాంత అంశాలను క్షుణ్ణంగా పరిశోధిస్తుంది. అదే విధంగా ఆధునిక రాజకీయాలలో అత్యంత చురుకైన పాత్రను నిర్వహిస్తున్న ప్రభావ, ప్రయోజనవర్గాల పూర్వపరాలను, వాటి సిద్ధాంతాలను, అవి ప్రభుత్వవిధానాలను ప్రభావితం చేసే తీరు తెన్నులను కూడా రాజకీయ సమాజశాస్త్రం కూలంకషంగా చర్చిస్తుంది.

4. రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు: ప్రజస్వామ్య రాజ్యాలలో రాజకీయ పార్టీలు కీలకమైన పాత్రను నిర్వహిస్తున్నాయి. రాజకీయాభివృద్ధి క్రమంలో రాజకీయ పార్టీల స్వభావం, ఆధారం, ఆశయాలు కార్యక్రమాలలో ఎన్నో మార్పులు సంభవిస్తున్నాయి. అదే విధంగా ఆధునిక సమాజంలో సాంఘిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ఎంతో ముఖ్యమైన పాత్రను నిర్వహిస్తున్నాయి. రాజకీయ సమాజ శాస్త్రం వీటన్నిటి నిర్మాణం, ఆధార ఆశయాలు, కార్యక్రమాలను, వాటికి రాజకీయాలకు గల సంబంధమును సాక్షిభూతమైన ఆధారాలతో పరిశీలిస్తుంది.

5. ప్రభుత్వం ఉద్యోగిస్వామ్యం: రాజకీయ సమాజ శాస్త్రం ప్రభుత్వ స్వరూపం, స్వభావం, నిర్మాణం పనిచేయు విధానాన్ని చర్చిస్తుంది. అధికారం రాజకీయేతర సంస్థలను ప్రభావితం చేయడం, వాటి ద్వారా ప్రభావితం చేయబడే ప్రక్రియను లోతుగా పరిశీలిస్తుంది. ప్రభుత్వ యంత్రాంగ కీలక భాగాలైన ఉద్యోగి స్వామ్య స్వభావం, నిర్మాణం, సమస్యలు, విధాన నిర్ణయాకరణ అమలులో వీరి పాత్రను అధ్యయనం చేస్తుంది.

సమాజ శాస్త్ర వివిధ పరిశోధనా భావాలు, పద్ధతులు సహాయం చేసే రాజకీయ సంస్థలను, రాజకీయ ప్రవర్తనను అధ్యయనం చేయడం రాజకీయ సమాజ శాస్త్ర ప్రధాన లక్ష్యాలలో ఒకటి. ద్వితీయ ప్రపంచ సంగ్రామం పిదప వివిధ పరిశోధనా పద్ధతులచే రాజకీయ భావాలను తెలుసుకోవడం, ఓటింగ్ ప్రవర్తనను పరిశోధించడం ఈ శాస్త్రంలో ప్రధానమైన విషయంగా కొనసాగుతున్నది.

## 1.8 రాజకీయ సమాజ శాస్త్రమా? సమాజ రాజకీయ శాస్త్రమా?

రాజకీయ సమాజశాస్త్ర అధ్యయనం ప్రారంభమై 4, 5 దశాబ్దాలు గడిచినప్పటికీ దీని నామకరణంపై నేటికిని వాగ్వివాదాలు కొనసాగుతునే ఉన్నాయి. రెండు శాస్త్రాల కలయికచే ఏర్పడటంవల్ల కొందరు దీనిని రాజకీయ సమాజ శాస్త్రమనగా, మరికొందరు సమాజ రాజకీయ శాస్త్రమని పిలుస్తున్నారు. సమాజ రాజకీయ శాస్త్రమనే నామంబట్టి రాజనీతి శాస్త్రం ఇతర సామాజిక ఉప శాస్త్రాలవలె సమాజ శాస్త్రంలో ఒక ఉపభాగం అనే భావన గోచరిస్తుంది. అంతేకాక సమాజ శాస్త్రం సాంఘిక శాస్త్రాలకు కేంద్ర శాస్త్రంగా రూపొందుతున్న రోజులలో రాజనీతి శాస్త్ర పరిస్థితి అస్తవ్యస్థంగా అనిశ్చితంగా తయారగుచున్నది. కుటుంబం, నగరీకరిణ, నేరం, విద్య మొదలైన విషయాలు గురించి చేసే అధ్యయనంలో సమాజ శాస్త్రం ప్రశంసనీయమైన అభివృద్ధి సాధించినప్పటికి రాజకీయాలను సమాజ శాస్త్రజ్ఞులు రాజనీతి శాస్త్రజ్ఞుల కంటె మిన్నగా అధ్యయనం చేస్తునారనే భావన; వాస్తవ, విరుద్ధ, స్వతంత్ర, చలంకాలు చరాజకీయ సంస్థలు సాంఘికార్థిక ప్రభావాలకు లోనయ్యే ఆధారచలాంకాలు అయినందున సాంఘిక పరిస్థితులచే ప్రభావితం చేయబడే రాజకీయాల అధ్యయనాన్ని సమాజ రాజకీయ శాస్త్రం అనడమే సమంజసం.

BRAOU

అంతేగాక రాజకీయ సమాజ శాస్త్రం పరిశోధన సంబంధమైన ప్రశ్నావళిని రూపొందించుకోవడం సమాచార సేకరణ, కోడింగ్, స్కేలింగ్, వెరిఫికేషన్ మొదలైన వాటిని సమాజ శాస్త్రం నుండి గ్రహించి ఉపయోగిస్తుండటంవల్ల ఈ శాస్త్రానికి సమాజ రాజకీయ శాస్త్రమనే నామమే సరియైనదని సమాజ శాస్త్రజ్ఞుల అభిప్రాయం. ఈ భావన ప్రకారం రాజకీయ శాస్త్రాన్ని సమాజ శాస్త్ర స్థాయికి కుంచించడం జరుగుతుంది.

సాంఘిక ఆర్థిక కారకాలు రాజకీయ ప్రవర్తనను, సంస్థలను ప్రభావితం చేసినప్పటికీ సాంఘిక కారకాలదే పూర్తిగా పైచేయి అని చెప్పడానికి వీలులేదు. అంతేకాక ప్రతి రాజకీయ చర్యను సాంఘికార్థిక పరిస్థితులతో అంటగట్టలేము. ఉదాహరణకు రాజకీయ పార్టీలు అధికారాన్ని కైవసం చేసుకోనేందుకు వివిధ రాజకీయ వర్గాలు అవలంభించే ఎత్తుగడలను సాంఘికార్థిక పరిస్థితులచే పరిశీలించడం కష్టమని లిప్‌సెట్ అభిప్రాయం. అంతేకాక రాజకీయాలు కేవలం ఆధార చలాంకాలు అనే భావన కూడా సరియైనది కాదు. కొన్ని సందర్భాలలో సాంఘికార్థిక పరిస్థితులు ప్రభుత్వాన్ని ప్రభావితం చేసినప్పటికి రాజకీయ సంస్థ అయిన ప్రభుత్వం కూడా సమాజాన్ని విస్తృత స్థాయిలో ప్రభావితం చేయుగల స్వతంత్ర రాజకీయ చలాంకం అని చెప్పవచ్చును.

రాజకీయ కారకాల ప్రభావాన్ని విస్మరించి సామాజిక కారకాలకు అధిక ప్రాధాన్యతనిచ్చే సమాజ రాజకీయ శాస్త్రం ఉత్పత్తిదారులు లేకుండా వినియోగదారులుండగలరనే ఆర్థిక విధానం లాంటిదని విమర్శకుల అభిప్రాయం. సాంఘిక చలాంకాలు రాజకీయ చలాంకాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ అధ్యయనం చేసే ఈ శాస్త్రాన్ని రాజకీయ ప్రవర్తనకై రాజకీయేతర కారకాల ప్రభావాన్ని గూర్చి అధ్యయనం చేయగా రాజకీయ

Dr. BRAOU LIBRARY Acc. No! CM-0143 Class No! 320 రాజ.నా

సమాజ శాస్త్రంపై దానితోబాటు వ్యక్తుల రాజకీయ ప్రవర్తనకుగల రాజకీయ కారణాలు సాంఘిక శక్తులపై రాజకీయ సంస్థల ప్రాభావాన్ని కూడా అధ్యయనం చేయును. రాజకీయ సమాజ శాస్త్రం సమాజం పార్టీ పద్ధతిని ఎలా నిర్దేశిస్తుంది, పార్టీలు సమాజాన్ని ఏ విధంగా అదుపులో పెడుతున్నాయి అనే విషయాలను పరిశీలిస్తుంది. కాని కేవలం సామాజిక ఆర్థిక అవసరాల ఫలితమే రాజకీయ పక్షాల అవతరణ అనే పాక్షిక భావనను అంగీకరించదు. రాజకీయ సమాజ శాస్త్రజ్ఞుడు సామాజిక ఆర్థిక వర్గాల ఫలితంగా ఏర్పడే పార్టీలు ఎంతవరకు ఆధారచలాంకం అనే విషయాన్ని తెలియజేస్తాడు. సమాజంలోని వైరుధ్యాలను, చీలికలను వర్గప్రయోజనాలను నాయకుడు తన ఆశయ సాఫల్యానికి ఏ విధంగా ఉపయోగించుకొంటున్నాడు అనే విషయాన్ని విశదపరచగలదు. పరిశోధనా పరికరాలను సమాజ శాస్త్రంనుండి గ్రహించేది కేవలం ఈ శాస్త్రమేకాక ఇతర సాంఘిక శాస్త్రాలు కూడా. అంతేకాక సమాజపు ప్రతి చర్యను శాసనం ద్వారా క్రమబద్ధం చేసేది కూడా రాజ్యమే. ఈనాడు సమాజంలోని ప్రతి విషయం రాజకీయమయమై రాజకీయ ప్రభావాలకు లోనవుతూనే వున్నది.

## 1.9 ముగింపు

పైన వివరించిన వివిధ అంశాలను దృష్టిలో పెట్టుకొని అంతర్ శాస్త్ర అధ్యయన ఫలితంగా సమాజ, రాజనీతి శాస్త్రాల పరస్పర సంబంధముచే అవతరించి సామాజిక, రాజకీయ కారకాలకు తగిన ప్రాధాన్యతనిస్తూ రాజనీతి శాస్త్రంలో అంతర్ భాగంగా కూడా కొనసాగుతున్న ఈ శాస్త్రాన్ని రాజకీయ సమాజ శాస్త్రం అనే పేర్కొనటం సమంజసమైనదని పలువురు శాస్త్రజ్ఞులు అభిప్రాయపడుతున్నారు.

రాజకీయ వ్యవస్థ సమాజంలో భాగమనీ, దాన్ని అర్థం చేసుకోవాలంటే సామాజిక వ్యవస్థను తెలుసుకోవలసిన ఆవశ్యకత ఉన్నదని వివరించి రాజకీయ సమాజ శాస్త్రజ్ఞులు రాజనీతి శాస్త్ర అభివృద్ధికి తోడ్పడ్డారు. అయితే ఈ అభివృద్ధి సరైన దృక్పథంలో కొనసాగలేదని చెప్పవచ్చు.

BRAOU

రాజకీయ సామాజిక వ్యవస్థల మధ్య సంబంధాలను రాజకీయ సమాజ శాస్త్రజ్ఞులు వివిధ దృక్కోణాలనుండి పరిశీలిస్తున్నారు. రెండు వ్యవస్థల మధ్య సంబంధాల సామన్య మార్పిడి పద్ధతిని పరిశీలించటం; సమాజం రాజకీయాల మధ్య ఎడతెగని ద్విచలాంక సాధారణ సంబంధాల క్రమాలను పరిశీలించటం ఒక దాని తరువాత మరోకటిగా బహిర్గతమగు బహుచలాంకాల సంబంధాలు సమాజంలో ఆవిర్భవించి, రాజకీయ ప్రక్రియలకు లోనై తదనుగుణంగా మార్పు చెంది తిరిగి సమాజంలో ప్రవేశించే ప్రక్రియలను పరిశీలించటం, వివిధ పరిశీలనాదృక్పథాలలో ముఖ్యమైనవిగా భావించ వచ్చును.

-ఆచార్య: ఎం. రాంచందర్

## 1.10 చదువదగిన పుస్తకాలు


1. Ed.Richard G. Braungart : "Society and Politics" Readings in Political Sociology

2. S.N.Eisenstadt : "Political Sociology" A Reader

3. Anthony M.Oruvi : Introduction to Political Sociology

| | | | |
|---|---|---|---|
| 4. | Taru Bottomore | : | Political Sociology |
| 5. | Rush and Althoff | : | An Introduction to Political Sociology |
| 6. | Ashraf and Sharma | : | Political Sociology |
| 7. | Rathore | : | Political Sociology |
| 8. | Mukopadhya | : | Political Sociology |
| 9. | R.T.Janagam | : | Political Sociology |

## 1.11 నమూనా పరీక్షా ప్రశ్నలు

ఈ కింది ప్రశ్నలకు వ్యాసరూపంలో సమాధానాలు రాయండి.

1. రాజకీయ సమాజ శాస్త్రమనగా ఏమిటి. నిర్వచింపుము.
2. రాజకీయ సమాజ శాస్త్ర వృద్ధిక్రమాన్ని పరిశీలింపుము.
3. రాజకీయ సమాజ శాస్త్ర పరిధిని వివరిస్తూ అది శాస్త్రం అవునా కాదా చర్చింపుము.

BRAOU

# భాగం - 2 అధ్యయన దృక్పథాలు

## విషయక్రమం


2.1 లక్ష్యాలు

2.2 పరిచయం

2.3 రాజకీయాలు - సమాజం : ఒక చారిత్రక పరిశీలన

2.4 సాంప్రదాయ పద్ధతులు

2.5 ప్రవర్తనావాద దృక్పథం

2.6 వ్యవస్థల విశ్లేషణ

2.7 డేవిడ్ ఈస్టన్ విశ్లేషణ

2.8 నిర్మితులు - విధుల విశ్లేషణ

2.9 ఉత్పాదక విధులు

2.10.0 మార్క్సిస్టు దృక్పథం

2.10.1 గతి తార్కిక పద్ధతి

2.10.2 చారిత్రక భౌతికవాదం

2.10.3 వర్గపోరాటం - సామాజిక విప్లవం

2.11 ముగింపు

2.12 చదువవలసిన పుస్తకాలు

2.13 నమూనా పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 2.1 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదివాక మీరు

- రాజకీయ సమాజ శాస్త్రం అధ్యయన పద్ధతులు
- దృక్పథాలను, వాటి
- చారిత్రక వృద్ధిని

బాగా వివరించగలుగుతారు.

## 2.2 పరిచయం

రాజకీయాలకు సామాజిక శక్తులకు మధ్య అంతర్ చర్యలను వివరించటానికి రాజకీయ సమాజ శాస్త్రం ప్రయత్నం చేస్తుంది. ప్రభుత్వ విధానాన్ని సామాజిక - సాంస్కృతిక నేపథ్యంలో రాజకీయ సమాజ శాస్త్రం పరిశీలిస్తుంది. ఇవి ప్రభుత్వ నిర్ణయాలపై ఎక్కువ ప్రభావం చూపుతాయి. విభిన్న ఆసక్తులకు ప్రాతినిధ్యం వహించే వివిధ సామాజిక వర్గాలకు రాజకీయ వ్యవస్థ నిరంతరం ప్రతిస్పందిస్తుంటుంది. పర్యవసానంలో ప్రభుత్వం, ప్రభుత్వ విధానాలు తరచు ప్రభావితమవుతుంటాయి. విస్తృత సామాజిక ప్రక్రియలో రాజకీయరంగం అంతర్భాగం. కులం, మతం, సాంస్కృతిక, నైతిక, భాషాపరమైన అంశాలు రాజకీయ వ్యవహార సరళిని ప్రభావితం చేస్తాయి. అందువల్ల రాజకీయ వ్యవస్థ అతి విస్తృతమైన సామాజిక సాంస్కృతిక వాతావరణరూపంలో పనిచేస్తుంటుంది. సమాజాన్ని ప్రభావితం చేసే సామాజిక - ఆర్థిక శక్తులకు అతీతంగా రాజకీయ వ్యవస్థ ఉనికి కొనసాగదు.

పశ్చిమదేశాలలో రాజకీయ వ్యవస్థల అవతరణ, వృద్ధి, వ్యవహార సరళిని అనేక అంశాలు ప్రభావితం చేశాయి. పారిశ్రామికీకరణం, నగరాల వృద్ధి, కుటుంబ వ్యవస్థ, రాజ్య వ్యవహారాలలో చర్చి పాత్ర, లౌకికీకరణ మొదలైన కారకాలు అక్కడి ఉదారవాద ప్రజాస్వామ్య వ్యవస్థలకు బలమైన పునాదులను వేశాయి. స్వేచ్ఛా స్వతంత్రతలుగల పత్రికలు, రేడియో, టెలివిజన్, చలన చిత్రాలు, తదితర ప్రచార ప్రసార మాధ్యమాలు, లౌకికవిద్య, ప్రభావవర్గాల అవతరణ, బాగా అభివృద్ధి చెందిన రాజకీయ పార్టీలవ్యవస్థ ఉదారవాద ప్రజాస్వామ్య వ్యవస్థల విజయానికిదోహదపడ్డాయని భావిస్తున్నారు. మరో మాటలో చెప్పాలంటే ఆర్థికాభివృద్ధి, ఆధునికీకరణ, సాంస్కృతిక లౌకికీకరణ, నిర్మితి వైవిధ్యీకరణ (Structural Differentiation) మొదలైనవి ఉదారవాద ప్రజాస్వామ్యరాజకీయాలకు అవసరమైన మౌలిక నిర్మితులను ఏర్పాటు చేశాయి. పాశ్చాత్య దేశాలలో వివిధ సామాజిక వర్గాల మధ్య చర్య, ప్రతి చర్యలు, సామాజిక సమైక్యీకరణ మొదలైన విషయాలు క్రమంగా వివిధ రాజకీయ సంస్థల ఆవిర్భావానికి దోహదం చేశాయి.

ఇందుకు భిన్నంగా, ద్వితీయ ప్రపంచ సంగ్రామానంతరం స్వాతంత్ర్యం సంపాదించుకొన్న దేశాలు, ప్రధానంగా మూడవ ప్రపంచరాజ్యాలు, వేరే విధమైన ప్రత్యేకతలను సంతరించుకొన్నాయి. శతాబ్దాల తరబడి వలస పాలనలో ఉండి, వివిధ రకాల దోపిడీలకు గురై, వలసవాద విమోచనోద్యమాలద్వారా విజయవంతంగా జాతీయస్వాతంత్ర్యాన్ని సంపాదించుకొన్న దేశాలు సామాజికసమైక్యతా ప్రక్రియకు లోనుగా లేదు. కులం, మతం, తెగ, భాష, రక్త సంబంధాలు తదితర ప్రాథమిక విధేయతలు వాటిని నిలువునా చీల్చి, సమైక్యతకు అడ్డుగోడలుగా నిలిచిపోయాయి. విస్తృత జాతీయ లక్ష్యాలకు భిన్నంగా ఇవి ప్రజానీకంలో స్థిరపడి జాతి నిర్మాణానికి సవాళ్ళుగా పరిణమిస్తున్నాయి. వాస్తవానికి ఈ కారణాలవల్లనే అనేక దేశాలు విచ్ఛిత్తి చెందటం, లేదా నియంతల పాలన క్రిందికి రావడం జరుగుతున్నది. సామాజిక సంక్షోభాలను అధిగమించటానికి, సమైక్యతను పరిరక్షించుకోవడానికి, అభివృద్ధి చెందుతున్న చాలా దేశాలు నియంతృత్వ నమోనాయే సరియైనదిగా భావిస్తున్నాయి. అధికస్థాయి కేంద్రీకరణకు, అధికారవాదానికి, సామాజిక - రాజకీయ సమైక్యతకు నియంతృత్వ వ్యవస్థలు ప్రాధాన్యమిస్తున్నాయి. పర్యవసానంలో వైవిధ్యం, భిన్నాభిప్రాయాల ప్రాతిపదికలుగా ఉన్న ప్రజాస్వామ్య నిర్మితులు, మూడో ప్రపంచ దేశాలలో క్షీణతకు లోనై వాటిస్థానంలో నియంతృత్వ నిర్మితులు రూపొందుతున్నాయి. ద్వితీయ ప్రపంచ యుద్ధానంతరం పాశ్చాత్యదేశాల వలస పాలన నుండి ఆశియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ఖండాల చాలా దేశాలు రాజకీయ స్వాతంత్ర్యాన్ని సంపాదించుకొన్నాయి. వాటిలో చాలాదేశాలు పాశ్చాత్య రాజకీయ వ్యవస్థల నమోనాలను ఎంచుకొన్నాయి. నిర్ణీతకాలానికి ఎన్నికలు, ప్రాతినిధ్యసంస్థలు, బహుళ రాజకీయ పార్టీల వ్యవస్థలు, స్వతంత్ర న్యాయ శాఖ, సమన్యాయ పాలన, శాసన ఆధిక్యత, రాజ్యాంగతావాదం, మొదలైన ఉదారవాద ప్రజాస్వామ్య సంస్థలు, భావాలను అనుసరించి మూడవ ప్రపంచ రాజ్యాలు తమదైన రాజకీయ - రాజ్యాంగ - పాలన యంత్రాంగాన్ని రూపొందించుకొన్నాయి. అయితే ఆయా సమాజాల సామాజిక - ఆర్థిక పరిస్థితులు అనేక వత్తిడులను సృష్టించి ఉదారవాద రాజకీయ సంస్థల సామర్థ్యాన్ని సార్థకతను దెబ్బతీశాయి. ఈ సమాజాలలోని రాజకీయ ప్రక్రియను అక్కడి సామాజిక - ఆర్థికస్థితిగతులు నిర్ధారిస్తాయి. అందువల్ల వాటినేపథ్యంలో ఆయా సమాజాల రాజకీయ వ్యవస్థలను మనం అధ్యయనం చేయాల్సి ఉంది.

## 2.3 రాజకీయాలు - సమాజం : ఒక చారిత్రక పరిశీలన

రాజకీయ భావాలు, ఆలోచనలలో సామాజిక పరిస్థితులు ప్రధాన పాత్రను నిర్వహిస్తాయి. ఆదినుంచి



BRAOU

రాజకీయతత్త్వవేత్తలు రాజకీయాలను సమాజ స్వరూపం ద్వారానే పరిశీలిస్తున్నారు. రాజకీయాలకు, సమాజానికి ఉన్న సంబంధాన్ని ప్రాచీన గ్రీకు తత్త్వవేత్తల ఆలోచనలు ధృవీకరిస్తున్నాయి. ప్రఖ్యాత గ్రీకు రాజనీతి తత్త్వవేత్తలైన ప్లాటో, అరిస్టాటిల్ రాజకీయాలను సామాజిక దృక్కోణం నుంచి 'సముదాయం', 'నగర రాజ్యం' మొదలైన భావనలపరంగా విశ్లేషించారు. వారి ఉద్దేశ్యంలో వ్యక్తి ప్రయోజనానికి, ఉనికికి, రాజ్య లక్ష్యాలకు మధ్య ఎలాంటి వ్యత్యాసం లేదు. మానవుడు సంఘజీవి, రాజకీయ జీవి అన్న అరిస్టాటిల్ ప్రవచనాలు పౌరుడు, రాజ్యం, సమాజం, వాటి మధ్యగల అంతఃసంబంధాన్ని స్పష్టం చేసాయి. నిజానికి అరిస్టాటిల్ రాజ్యసిద్ధాంతం, కుటుంబం, గ్రామాలు, పట్టణాలనుంచి ఏర్పడిందే. ఆయన అభిప్రాయంలో రాజ్యం మానవుడి అత్యున్నత అభివృద్ధికి సామూహిక చైతన్యానికి ప్రతిరూపం. ఆదర్శవాద సాంప్రదాయానికి శ్రీకారం చుట్టిన ప్లేటో సమాజాన్ని మూడు వర్గాలు - తత్త్వవేత్తలు, సైనికులు, బానిసలుగా శ్రేణీకరించి, వారిమధ్య సామరస్యంతో ఒక 'ఆదర్శరాజ్య' (Ideal State) నమోనాను తన "రిపబ్లిక్" గ్రంథంలో రూపొందించారు. ఈ మూడు వర్గాలు తమ తమ వృత్తులలో శిక్షణ పొంది ఒకరితో మరొకరు జోక్యం చేసుకోకుండా తమ తమ కర్తవ్యాలను నిర్వహిస్తాయి. అంతేగాక పాలక వర్గానికి స్వంత ఆస్తి, కుటుంబాలు ఉండరాదన్నారు. స్వచ్ఛమైన ప్రజాజీవితానికి ఆస్తి, కుటుంబం అడ్డంకులుగా భావించి, ప్లాటో వాటిని పాలకులకు నిషేధించారు. దీనినిబట్టి సామాజిక ఆర్థిక పరిస్థితులు రాజకీయ వ్యవస్థను ఏ విధంగా ప్రభావితం చేస్తాయన్న ఆలోచన గ్రీకుల కాలంనుండి ప్రారంభమైందని చెప్పవచ్చు.

ఆధునిక యుగ ప్రారంభంలో బోడిన్, మాకియవెల్లీ, హాబ్స్ రచనలు కూడా రాజకీయ నిర్మితులగురించి విశేషంగా చర్చించాయి. కుటుంబం ఆస్తి రెండింటిని ఏ విధంగా సక్రమంగా నిర్వహించాలన్న అంశంపై తత్త్వవేత్తల రచనలలో విశ్లేషణలు కనిపిస్తాయి. ఉదాహరణకు కుటుంబం, ఆస్తి అనే పునాదుల పై బోడిన్ తనసిద్ధాంతాన్ని రూపొందించాడు. రాజ్యస్థిరత్వంలో అవిచాలా ప్రధానమైన పాత్రను నిర్వహిస్తాయి. వాటిలో దేనికైనా ఇబ్బంది కలిగితే, లేదా, అవిదెబ్బ తింటే రాజ్య పునాదులే కదిలిపోతాయని బోడిన్, మాకియవెల్లీలు భోదించారు. దీనినిబట్టి రాజకీయస్థిరత్వాన్ని సామాజిక, ఆర్థికసంస్థలు నిర్ణయిస్తాయన్న విషయాన్ని మనం గ్రహించవచ్చు. రాజకీయాధికారపు సార్థకత అది కల్పించే ప్రయోజనాలపై ఆధారపడి ఉంటుందని ఉపయోగితావాదం భావించింది. అధికసంఖ్యాకులకు అత్యధికసంతోషాన్ని కలిగించటమే రాజ్యపరమావధిగా ఉపయోగితావాదులు భావించారు. సామాజిక సంక్షేమాన్ని రాజ్యలక్ష్యంగా బెంథామ్ నిర్ధారించాడు. ప్రజాసంక్షేమాన్ని ఇనుమడింపచేయటమే రాజకీయాధికారపు ప్రధానలక్ష్యమని ఉపయోగితావాదులు వాదిస్తారు. రాజకీయాలు ఉత్పత్తికి సంబంధించినవిగా కారల్ మార్క్స్ సిద్ధాంతం భావిస్తుంది. సమాజం, రాజకీయాలను ఉత్పత్తి కారకాలు, ఉత్పత్తి ప్రక్రియలు నిర్దేశిస్తాయి. ఆర్థిక పరిస్థితుల పునాదులపై రాజకీయ వ్యవస్థ ఉపరితలం ఏర్పడుతుందని మార్క్స్ సిద్ధాంతీకరించారు. రాజకీయాధికారాన్ని ఆర్థికంగా ప్రాబల్యం గల వర్గం తమ అసక్తులను పరిరక్షించుకోవటానికి తనగుప్పిట్లో పెట్టుకొంటుంది. ఆర్థిక ప్రాబల్యం గల వారే రాజకీయాధికారాన్ని చలాయిస్తారు.ఆస్తి వ్యవస్థ (Institution of Property) బూర్జువా, శ్రామిక వర్గాలుగా సమాజాన్ని శ్రేణీకరిస్తుంది. ఉత్పత్తికారకాలపై తమకుగల గుత్తాధిపత్యం ద్వారా పెట్టుబడిదారులు శ్రామికవర్గాన్ని నిర్దాక్షిణ్యంగా దోచుకుంటారు. ఉత్పత్తి, పంపిణీ, వినిమయాలన్నింటిపైన పెట్టుబడిదారీ వర్గానికి గుత్తాధిత్యం ఉంటుంది. పెట్టుబడిదారులు తమ వర్గ ప్రయోజనాలకోసం ఇతరులను దోచుకోవటానికి రాజ్యం సాధనంగామారుతుంది. అందువల్ల ఆర్థిక ప్రాబల్యం ఉన్న వర్గం రాజకీయాలను శాసిస్తుందని మార్క్సిస్టులు భావిస్తారు. ఈ విధంగా ఆర్థిక రాజకీయ పరిస్థితులు మొత్తం సమాజాన్ని శాసిస్తాయని మార్క్స్ సిద్ధాంతం ప్రతిపాదిస్తుంది.

ఇది ఇలా ఉండగా బహుతావాదం (Pluralism) రాజ్యానికి పరిమితమైన అధికారాలు ఇచ్చి సామాజిక

BRAOU

సంస్థలకు, సమూహాలకు ఎక్కువ స్వేచ్ఛను కల్పించాలని వాదిస్తుంది. లాస్కీ, బార్కర్, జి.డి.హెచ్.కోల్, మైక్ఐవర్, ఫాలెట్, లిండ్సే మొదలైన వారంతా రాజ్యజోక్యంనుండి సమాజం స్వేచ్ఛగా పనిచేయాలంటారు. సంస్థల ఆంతరంగిక వ్యవహారాలలో రాజ్యం జోక్యం చేసుకోకుండా, వాటి కార్యకలాపాలను సమన్వయ పరచాలని వారు అంటారు. ఈ విధంగా బహుళత్వవాదులు సంస్థల స్వయం ప్రతిపత్తి, వ్యక్తిస్వేచ్ఛ, చొరవలకు, అధిక ప్రాధాన్యతను ఇస్తారు. పై చర్చను బట్టి రాజ్యం సమాజాల మధ్య ఉండవలసిన సంబంధం ప్రాచీనకాలంనుండి ఆధునిక కాలం వరకు చర్చనీయాంశమైంది. రాజనీతి తత్త్వవేత్తలు ఈ రెండింటి మధ్య సమన్వయం సాధించటానికి కాలానుగుణంగా చాలా సిద్ధాంతాలను రూపొందించారు. రాజనీతి చట్రంలో సామాజిక ఆర్థికరంగాలకు అవసరమైన సాపేక్ష స్వేచ్ఛ, పరస్పర ఆధారిత స్థితులను వివరించ ప్రయత్నించారు.

## 2.4 సాంప్రదాయ పద్ధతులు

రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు రాజకీయ సమాజశాస్త్ర అధ్యయనంలో అనుసరించిన దృక్పథాన్ని సాంప్రదాయక దృక్పథంగా పరిగణిస్తున్నారు. ప్రభుత్వాల విశిష్ట లక్షణాలు, సంస్థలు, వాటి కర్తవ్యాలు మొదలైన అంశాల వివరణకు పై పద్ధతి పరిమితమయింది. చాలావరకు చట్టపరమైన నిర్మితులను (Legal Structures) చర్చించటమే సాంప్రదాయపద్ధతుల లక్ష్యమయింది. అంతేకాక చాలా వరకు అది పాశ్చాత్య సంస్థల అధ్యయనానికి, పరిశోధనలకు పరిమితమయింది. పాశ్చాత్యేతర నమోనాలను (Non-western models) రూపొందించటానికి ఎలాంటి ప్రయత్నాలు జరుగలేదు. పాశ్చాత్యేతర సమాజాలను సాంప్రదాయ పద్ధతి పరిగణనలోనికి తీసుకోలేదు. అందువల్ల ఈ దృక్పథాన్ని 'యూరో-కేంద్ర' (Euro-Centric) పద్ధతిగా వర్ణిస్తారు. సాంప్రదాయక పద్ధతిలో ఈ కింది అంశాలున్నాయి. అవి:

i తులనాత్మక రహితం (Non-Comparative)

ii వర్ణనాత్మకం (Descriptive)

iii సంకుచితం (Parochial)

iv నిశ్చిత (Static)

BRAOU

సాంప్రదాయక దృక్పథం చాలావరకు పాశ్చాత్యదేశాల ప్రజాస్వామ్యసంస్థల సాధారణ లక్షణాలను వర్ణించటానికే పరిమితం అయింది. అనేకమైన రాజకీయ వ్యవస్థల సామాన్య స్థితిగతులను సాధారణీకరించటాని (Generalise)కి అది ఎలాంటి ప్రయత్నం చేయలేదు. బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికా, స్విట్జర్లాండ్, ఆస్ట్రేలియా, కెనడా మొదలైన పాశ్చాత్య ఉదారవాద ప్రజాస్వామ్య నమోనాలను వివరించటానికే సాంప్రదాయ పద్ధతి ప్రయత్నించింది. విభిన్న దేశాల మధ్య తులనాత్మక అధ్యయనాలు జరిగినప్పటికీ, కేవలం ప్రభుత్వాలను అధ్యయనం చేయటం వరకే సాంప్రదాయపద్ధతి పరిమితమయింది. విభిన్న సమాజాల రాజకీయాల మధ్య సారూప్యతలు, వైవిధ్యాలు, వ్యత్యాసాలను అది ఎక్కువగా పరిగణనలోనికి తీసుకొనలేదు. రాజకీయ వ్యవస్థల చోదకశక్తులైన సామాజిక - ఆర్థికాంశాలను చాలావరకు అది నిర్లక్ష్యం చేసింది. ఉదాహరణకు రాజకీయ పార్టీలు, ప్రభావ వర్గాలు, ఓటర్ల ప్రవర్తన మొదలైన రాజకీయ ప్రక్రియలలోని కీలకాంశాలు రాజనీతి విశ్లేషణలలో చాలా ప్రధానమైనవి. వీటిని కూడా అది నిర్లక్ష్యం చేసింది. అంతేకాకుండా సాంప్రదాయ పద్ధతి చాలావరకు వర్ణనకే ప్రాధాన్యమిచ్చింది. చాలా రచనలు, లాంఛనప్రాయమైన సంస్థల (Formal Institutions) ప్రభుత్వ నిర్మితుల సాధారణ అధ్యయనానికే పరిమిత మయ్యాయి. అంతేకాకుండా సాంప్రదాయిక పద్ధతి చాలా వరకు చారిత్రకంగా లేదా చట్టబద్ధంగా రూపొందిన అంశాలకే ప్రాధాన్యమిచ్చి అధ్యయనం చేసింది. రాజ్యాంగ నిబంధనలు, వివిధ చట్టాలు, అవి రూపొందటానికి దారి తీ[illegible] స్థితులు, అందులోని

అంశాలు, లాభనష్టాలు, అధ్యయనాల్లో ప్రధాన స్థానమాక్రమించాయి. ఈ సందర్భంలో సమాఖ్యవాదం (Federalism) అధ్యయనాన్ని ఒక ఉదాహరణగా పేర్కొనవచ్చు. సమాఖ్య వ్యవస్థలో ప్రభుత్వ అధికారాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కేటాయిస్తారు. అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, స్విట్జర్లాండు దేశాలలో సమాఖ్య రాజ్యాంగాలు ఏవిధంగా ఉన్నాయన్న వర్ణనకే సాంప్రదాయక పద్ధతి ప్రయత్నించింది. ఆయా దేశాలలోని సామాజిక - ఆర్థిక పరిస్థితులు ఏవిధంగా వివిధ సమాజాల్లో వైరుధ్యాలకు దోహదం చేసాయో విశ్లేషించటంలో అది విఫలమయింది. ఇంతకుముందే ప్రస్తావించినట్లు సాంప్రదాయకపద్ధతి "యూరో కేంద్ర" భావనలకే పరిమితమయింది. కేవలం పాశ్చాత్య యూరోపియన్ ప్రభుత్వాల అనుభవాలే అనుభవవాద పరిశోధనకూ సిద్ధాంతీకరణకు ప్రాతిపదికలయ్యాయి. యూరోపియనేతర అనుభవాలు రాజనీతి అధ్యయన పరిధిలోకి రాలేదు.

## 2.5 ప్రవర్తనా వాద దృక్పథం

రెండవ ప్రపంచ యుద్ధానంతర పరిస్థితులలో రాజనీతి శాస్త్ర అధ్యయనాల్లో ప్రవర్తనవాద విప్లవం ఆవిర్భవించింది. అంతవరకూ అనుసరిస్తూ వస్తున్న సాంప్రదాయ అధ్యయన పద్ధతి రాజకీయవాస్తవాలను వివరించటంలో విఫలమయింది. జాతుల మధ్య వైరాలు, అగ్రరాజ్యాల ఆవిర్భావం, జాతీయ వాదం వ్యాప్తి, ఆర్థికసంక్షోభం, నిరుద్యోగం, వివిధ సమాజాల్లో ఏర్పడిన అనిశ్చిత పరిస్థితులు, జాతుల మధ్య అసమానతలు, ఆర్థిక, సాంఘిక వ్యత్యాసాలు, తెగల మధ్య రగులుకొంటున్న విద్వేషాలు, పెరుగుతున్న ఉద్రిక్తతలు మొదలైనవన్నీ రాజనీతి, సామాజిక శాస్త్రవేత్తలకు సవాళ్ళుగా పరిణమించాయి. సామాజిక మార్పుకువారు చేసిన సేవ సమాజ విజ్ఞాన శాస్త్రవేత్తలలో పోల్చినప్పుడు బహుతక్కువగా ఉంటుంది. అందువల్ల వారు అనేక విమర్శలకు గురయ్యారు. రాజనీతి శాస్త్ర అధ్యయనం వాస్తవ సమస్యల పరిష్కారానికి ఉన్న రుగ్మతలను విశ్లేషించి, అవి ఏర్పడటానికి కారకాలను శోధించి, వాటి నివారణకు ప్రత్యామ్నాయ నమోనాలను విధానాలను చూపించాల్సిన బాధ్యతను రాజనీతి, సమాజ శాస్త్రజ్ఞులు తీవ్రమైన విషయంగా భావించటలేదన్న విమర్శ సర్వత్రా వ్యక్తమయింది. సమాజ, భౌతిక శాస్త్రాలు బాగా అభివృద్ధి చెందగా, సామాజిక శాస్త్రాల అధ్యయనం మాత్రం బాగా వెనుకబడి ఉంది. అందువల్ల ప్రపంచంలో సంభవిస్తున్న మార్పులను అవగాహన చేసుకోవటంలోను, విశ్లేషించటంలోను సామాజిక శాస్త్రాల అధ్యయనం సార్థకత ప్రశ్నార్థకంగా మిగిలిపోయాయి. ఈ కారణంవల్లనే సామాజిక శాస్త్రాల అధ్యయనంలో, మారుతున్న ప్రపంచపు అవసరాలు, వాస్తవాలకనుగుణంగా మార్పులు తేవలసిన అవసరాన్ని శాస్త్రవేత్తలు గుర్తించారు. పర్యవసానంలో ప్రవర్తనా వాద విప్లవం (Behavioural Revolution) అవతరించింది. ప్రవర్తనా వాద విప్లవం వ్యక్తుల ప్రవర్తనను, దానికిగల ప్రోద్బలాలను, సంస్థల యంత్రాంగాన్ని అధ్యయనం చేయ ప్రయత్నించింది. వ్యక్తికీ సమాజానికి ఉన్న సంబంధం ప్రధానంగా సామాజిక పరివర్తన మొదలైన అంశాలను వివరించటానికి ప్రయత్నం చేస్తుంది. ప్రవర్తనా వాదం నిర్మితుల అధ్యయనం నుంచి కొన్ని రాజకీయ పరిస్థితుల్లో వ్యక్తులు ఏ విధంగా వ్యవహరిస్తారు, వారి చర్య ప్రతిచర్యలు ఏ విధంగా ఉంటాయన్న అంశాలకే అధిక ప్రాధాన్యం ఇచ్చింది. సంస్థలను కేవలం నిర్మాణ పరంగా అధ్యయనం చేయకుండా, వాటిని వ్యక్తులు వ్యక్తుల సమూహాలు ఏ విధంగా ప్రభావితం చేస్తాయో విశ్లేషించ ప్రయత్నిస్తుంది. సంస్థలు వ్యక్తులు ప్రమేయం లేకుండా, వారి ఆసక్తులను పరిగణనలోనికి తీసుకొనకుండా పనిచేయలేవని ప్రవర్తనా వాదం విశ్వసిస్తుంది. రాజకీయ రంగంలో వ్యక్తులు వారి వారి ఆసక్తులు, దృక్పథాలు, అవగాహనలననుసరించి ఎలా వ్యవహరిస్తారు, వారి చర్య ప్రతి చర్యల ప్రభావం వ్యవస్థపై ఏ విధంగా ఉంటుందో వివరించటానికి, విశ్లేషించటానికి ప్రయత్నిస్తుంది. వ్యక్తుల ప్రవర్తనను అధ్య...వం చేసి వారు విడిగాను, సమష్టిగాను, సంస్థలను ఏవిధంగా ప్రభావితం చేస్తారో ప్రవర్తనా వాదులు ... చేస్తారు. వ్యక్తులపరంగా, వారి ప్రవర్తనలపరంగా అధ్యయనం చేసే

BRAOU

ఈ దృక్పథాన్ని ప్రవర్తనా వాద దృక్పథం అని అంటున్నారు. రాజకీయాలను శాస్త్రీయ దృక్పథంలో అధ్యయనం చేయటానికి ప్రవర్తనావాదం నూతన పరికరాలను అందచేసింది. ఈ దృక్పథంలో విభిన్న ఆసక్తులు, కార్యకలాపాల్లో నిమగ్నుడయ్యే వ్యక్తి కేంద్ర బిందువు అవటం వల్ల సామాజిక, సాంస్కృతికాంశాలకు ప్రవర్తనావాదం ప్రాధాన్యమిస్తుంది. మనోవైజ్ఞానికశాస్త్రం పద్ధతులను ప్రవర్తనావాదం అనుకరించింది. సాంపిల్ సర్వేలు, నిర్మిత షెడ్యూల్స్, ప్రశ్నోత్తరావళి, సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించి, శ్రేణీకరించి, విశ్లేషించటం మొదలైన పద్ధతులు ప్రవర్తనావాద అధ్యయనం దృక్పథంలో ప్రధానమైన అంశాలు. ఈ విధంగా సేకరించిన సమాచారం ఆధారంగా ప్రవర్తనా వాదం అనుభవ పూర్వక (Empirical) సిద్ధాంతాలను రూపొందించ ప్రయత్నిస్తుంది. రాజనీతి శాస్త్రంలో ప్రవర్తనా వాద దృక్పథానికి సంబంధించిన కొన్ని రచనలను ఈ సందర్భంలో ప్రస్తావించటం అవసరం. "రాజకీయాల్లో మానవ స్వభావం" అనే గ్రహం వాలాస్ రచన రాజకీయ ప్రవర్తనలో మనో వైజ్ఞానిక అంశాలను నొక్కి వక్కాణిస్తుంది. వ్యక్తి గత నిరాశానిస్పృహలు ఏ విధంగా రాజకీయాలను ప్రభావితం చేస్తాయో హెరాల్డ్ లాస్వెల్ విపులీకరించారు. తీవ్ర వాద భావాలు, ఉద్యమాల విశ్లేషణకు పై భావనలు విశేషంగా తోడ్పడ్డాయి. రాజకీయ సంస్థల పట్ల సామాజిక గణాల ప్రవర్తన ఏవిధంగా ఉంటుందో వివరించటానికి ఈ మనో వైజ్ఞానిక నేపథ్యం ప్రవర్తనా వాదానికి బాగా ఉపయోగపడింది. లూసియన్‌పై చేసిన బర్మా ఉద్యోగి బృందం అధ్యయనంలో ఉద్యోగి బృందం ప్రవర్తన ఏ విధంగా ఉంటుందో సాధరణీకరించటానికి ఉపయోగపడింది. ఒక చిన్న పరిధిలో వ్యక్తిత్వం విలక్షణాలను అధ్యయనం చేసి, వ్యక్తుల అవసరాలు ఏ విధంగా వ్యవస్థలను ప్రభావితం చేస్తాయో సాధారణీకరించాటనికి లూసియన్‌పై రచనతోడ్పడింది. ప్రవర్తనావాద దృక్పథం అభివృద్ధి చెందటానికి ఒక ముఖ్యమైన దశగా ఆయన విశ్లేషణలు ఉపకరిస్తాయి. రాజకీయ విశ్లేషణలలో మనో వైజ్ఞానిక అంశాలను అవి నొక్కి వక్కాణిస్తాయి. అయితే మనో వైజ్ఞానిక విశ్లేషణలో ఒక పరిమితి ఉంది. తాత్కాలికంగా వ్యక్తులను విడివిడిగా అధ్యయనం చేసి వారి ప్రవర్తనను క్రోడీకరించి విశ్లేషించి సామూహిక ప్రవర్తనకు సంబంధించిన సాధారణ సూత్రాలను రూపొందించలేమని కొందరు వాదిస్తారు. వ్యక్తి ఆలోచన, సామూహిక ఆలోచన, మనోభావాలు ఎల్లవేళలా, అన్ని సందర్భాల్లోను ఒకే విధంగా ఉంటాయని మనం నిర్ధారించి చెప్పలేం.

BRAOU

రాజకీయ విషయాలను విశ్లేషించటంలో ప్రవర్తనావాదం ఒక నూతన దృక్పథాన్ని సూచించింది. ఇంతకు ముందు వివరించినట్లు సామూహిక ప్రవర్తనను అధ్యయనం చేయటంలో ప్రవర్తనావాదం మానసికాంశాలను పరిగణనలోనికి తీసుకొంటుంది. విలువల కతీతమైన నిష్పాక్షిక పరిశోధనకు ప్రవర్తనావాదం పునాదులను వేసింది. వైజ్ఞానిక శాస్త్రాల్లో పరిశోధనలు ఏ విధంగా కొనసాగుతాయో అదే పద్ధతిలో సామాజిక శాస్త్రాల్లో కూడా శాస్త్రీయ పరిశోధనలు కొనసాగించటానికి ప్రవర్తనావాదం దోహం చేసింది. రాజకీయ అంశాలను విశ్లేషించటంలో సామాజిక, సాంస్కృతిక నేపథ్యానికి ఈ విధంగా ప్రాధాన్యత పెరిగింది. ప్రవర్తనా వాదపు మేధాపరమైన పునాదిరాళ్ళుగా కొన్నింటిని డేవిడ్ ఈస్టన్ పేర్కొన్నారు. అవి : క్రమబద్ధీకరణలు : (Regularities); (Verification) పరికరాలు; పరిమాణీకరణం, విలువల క్రమబద్ధీకరణం; పూర్తి వైజ్ఞానిక శాస్త్రం, సమగ్రత. ఈస్టన్ అభిప్రాయంలో మానవ ప్రవర్తనల్లో క్రమబద్ధత ఉంటుంది. పరిశీలనలు, ప్రశ్నోత్తరాల ద్వారా దానిని విశ్లేషించవచ్చు. ఈ విధంగా [illegible] ...చారాన్ని పరిమాణీకరించి, విశ్లేషించి, ఫలితాలను ఆధారం చేసుకొని అనుభవవాద సిద్ధ[illegible] ...పొందించవచ్చని డేవిడ్ ఈస్టన్ భావించారు. విషయాన్ని నిష్పాక్షికంగా పరిశీలించి, విశ్లేషించి, [illegible] ...కరిచటానికి సామాజిక శాస్త్రజ్ఞులు వారి వారి వ్యక్తిగత విలువలను దూరంగా ఉంచి పరిశోధ[illegible] ...కమించాల్సి ఉంటుంది. అంతేగాక రాజకీయ ప్రవర్తన అధ్యయనానికి అంతర్వర్గీయ దృక్పథం [illegible] ...Disciplinary Approach) విరివిగా ఉపయోగించాల్సిన అగత్యం ఉంది. రాజకీయ ప్రవర్తన [illegible] ...ఆర్థిక, సాంస్కృతిక అంశాలపై

ఆధారపడి ఉంటుంది కాబట్టి వాటిని కూడా పరిగణనలోనికి తీసుకోవాల్సి ఉంటుంది. అందువల్ల రాజనీతి శాస్త్రం తన హద్దులనుదాటి సామాజిక శాస్త్రం, ఆర్థికశాస్త్రం, మనో వైజ్ఞానిక శాస్త్రాల పరిధుల్లో పయనిస్తోంది. వాటికి సంబంధించిన కొంత సాధారణ పరిజ్ఞానం లేనిదే రాజకీయాలను విశ్లేషించటం అంత సులభసాధ్యమైన విషయంకాదు. అందువల్ల ప్రవర్తనావాదం వివిధ సామాజిక శాస్త్రాల సమన్వయాన్ని కోరుతుంది. కాని ప్రవర్తనావాదం 1960 దశకంలో తీవ్ర విమర్శలకు గురైంది. సాంప్రదాయవాదులు, ప్రవర్తనా వాదుల్లో కొందరు బాహాటంగా ప్రవర్తనావాదాన్ని విమర్శించారు. అధ్యయనానికి అవసరంలేని అత్యాధునిక పద్ధతులను ప్రవర్తనా దృక్పథం ప్రవేశపెడుతున్నదని విమర్శకులు భావించారు. పరికరాల కోసం విషయాన్ని నిర్లక్ష్యం చేయడం జరుగుతున్నదన్నారు. సామాజికావసరాలకు అనుగుణంగా పరిశోధనలు సాగటం లేదని వ్యాఖ్యానించారు. అతి సామాన్యమైన అర్థ రహిత అంశాలకు ప్రవర్తనా వాద దృక్పథం ప్రాధాన్యతనిస్తున్నదన్న విమర్శ తలపిస్తుంది. విలువల కలితమైన, నిష్పాక్షిక పరిశోధనకావాలన్న ఆదుర్దాలో ప్రవర్తనా వాదులు, యథా తథ స్థితిని సమర్థించుకొనే పరిస్థితులను సృష్టించారు. అందువల్ల ఉత్తర - ప్రవర్తనా వాద ఉద్యమం అన్న పేరుతో (Post - Behavioural Movement) మరొక దృక్పథం అవతరించింది. ఇది సామాజిక శాస్త్రాల పరిశోధనల్లో విషయ ప్రాముఖ్యానికి, వివరణకు, సార్థకతకు ప్రాముఖ్యం ఇచ్చింది. ఉత్తర ప్రవర్తనా వాదులు ప్రస్తుత సమస్యలైన నిరుద్యోగం, పేదరికం, ఘర్షణలు, ఉద్రిక్తలు, అసమానతలు మొదలైన సమస్యలకు రాజనీతి శాస్త్రజ్ఞులు సమాధానం, పరిష్కార మార్గాలు చెప్పాలంటారు. అప్పుడే రాజనీతి శాస్త్ర అధ్యయనాలకు ప్రాముఖ్యత, సార్థకత ఉంటాయి. కేవలం ఒక సమస్యను వివరించటంలోనే రాజనీతిశాస్త్రవేత్త కర్తవ్యం పూర్తికాదని; దానికి తగిన పరిష్కార మార్గం కూడా సూచించాల్సిన బాధ్యత ఉందని సర్వత్రా భావిస్తున్నారు. ఈ ఆలోచనే పాశ్చాత్యదేశాల్లో ఉత్తర ప్రవర్తనా వాద ఉద్యమానికి నాంది పలికింది. అంతేకాకుండా విలువలకలితమైన దృక్పథం విషయంలో గూడా చెప్పుకోదగిన మార్పు వచ్చింది. సామాజిక జీవనం నుండి విలువలు విడదీయరానివన్న భావం కూడా ఇందులో ఉంది. ఎటువంటి విశ్లేషణలలోనైనా అవి అంతర్భాగాలే. అందువల్ల సామాజిక శాస్త్రజ్ఞులు తాము విలువలుగా భావించే వాటిని ముందుగానే నిర్మొహమాటంగా తెలియజేసినట్లయితే వారి సాధారణీకరణాలను సరైన దృక్పథంలో అర్థం చేసుకోవటం సాధ్యమవుతుంది. ఉత్తర-ప్రవర్తనా వాద ఉద్యమవ్యాప్తికి డేవిడ్ ఈస్టన్ అతికీలమైన పాత్రను నిర్వహించారు. సాంప్రదాయిక, ఆధునిక అధ్యయన దృక్పథాలను సవివరంగా చర్చించిన తరువాత, వాటి మధ్య గల వైరుధ్యాలను ఈ క్రింది పట్టికలో ఉదహరించారు.

BRAOU

| | సాంప్రదాయక దృక్పథం | ఆధునిక దృక్పథం |
|---|---|---|
| 1. | రాజ్యం, ప్రభుత్వాల అధ్యయనానికి అధిక ప్రాముఖ్యత ఇస్తుంది. | రాజకీయ వ్యవస్థ, రాజకీయ ప్రక్రియల అధ్యయనానికి అధిక ప్రాముఖ్యత ఇస్తుంది. |
| 2. | యూరో-కేంద్రీకరణవల్ల యూరోపు దేశాల సంస్థలు, సంస్కృతుల అధ్యయనానికే పరిమితమయింది. | పాశ్చాత్యేతర, నూతన సమాజాల అధ్యయనానికి విస్తృతం అయింది. |
| 3. | చట్టపరమైన రాజ్యాంగపరమైన అంశాలు ప్రధానంగా స్థానం పొందాయి. | కర్తవ్య నిర్వహణ అంగాలపట్ల అధికమైన ఆసక్తి కనబరుస్తుంది. |
| 4. | రాజ్యసామాజిక నేపథ్యాన్ని పరిగణనలోకి తీసుకోకుండా కేవలం రాజ్యాన్ని మాత్రమే అధ్యయనం చేసింది. | రాజ్యాన్ని చర్చిస్తున్నప్పుడు దాని సామాజిక నేపథ్యం చర్చకు అత్యధిక ప్రాధాన్యమిస్తుంది. |
| 5. | విలువలకు ప్రాముఖ్యత ఇస్తుంది. | విలువల విషయంలో తాటస్థ్య, శాస్త్రీయ పద్ధతులకు అధిక ప్రాధాన్యం. |

| | | |
|---|---|---|
| 6. | ఊహాజనిత భావాలు ప్రేరకాలు. | వాస్తవాలతోను, ఆధునిక పరిశోధనా పద్ధతుల తోను ముడి పడి ఉంది. |
| 7. | విలువాత్మక భావాలకు పరిశీలన రహిత ప్రమేయాలు ఎక్కువగా స్థానం పొందాయి. | అనుభవవాద పరిశీలనల పట్ల అత్యధిక విశ్వాసం ప్రకటించింది. |

పైన వివరించిన పట్టిక సాంప్రదాయిక, ఆధునిక దృక్పథాల మధ్య వైరుధ్యానికి, వ్యత్యాసాలకు అద్దం పడుతుంది. సాంప్రదాయిక దృక్పథం ప్రధానంగా విలువాత్మకమైనది. తాత్త్విక ఆలోచనలు అందులో అధికం. ఆధునిక ప్రవర్తనావాద దృక్పథం ఇందుకు పూర్తిగా విరుద్ధం. శాస్త్రీయ పరిశోధనా పరికరాలకు, ఆలోచనా పద్ధతులకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుంది. విషయసేకరణ ప్రాతిపదికగా వాస్తవాలను పరిగణనలోనికి తీసుకొని సాధారణ సూత్రాలను రూపొందించటానికి ప్రయత్నిస్తుంది. అలాగే విషయ క్షేత్రంలో కూడా రెండు దృక్పథాల్లో రుణాత్మకమైన వ్యత్యాసం కనిపిస్తుంది. సాంప్రదాయిక అధ్యయనం కేవలం యూరోపు దేశాల సంస్థల అనుభవాలపై ఆధారపడితే, ఆధునిక ప్రవర్తనావాద అధ్యయన పద్ధతికి క్షేత్ర పరిధి చాలా విస్తృతమైనదిగాఉంది. అది యూరోప్‌కే పరిమితం కాకుండా యూరోపేతర సమాజాలను కూడా తన అధ్యయన పరిధిలోకి గ్రహిస్తుంది. అందువల్ల సాంప్రదాయిక దృక్పథంకంటే ఆధునిక అధ్యయన దృక్పథం చాలా విశాలమైంది. అంతేగాకుండా ఆధునిక దృక్పథం కేవలం రాజనీతి శాస్త్ర అధ్యయనానికే పరిమితం కాకుండా ఇతర సామాజిక శాస్త్రాల పరిధుల్లోకి విస్తరించి అంతర్వర్గీయ అధ్యయనాన్ని ప్రోత్సహిస్తుంది. సమాజ శాస్త్రం, ఆర్థిక శాస్త్రం, మనోవైజ్ఞానిక శాస్త్రం, భూగోళ శాస్త్రం మొదలైన శాస్త్రాలనుంచి అవసరమైన అంశాలను సేకరించి, రాజకీయ విషయాల అధ్యయనానికి వినియోగిస్తుంది. వాస్తవాలకు దగ్గరగా పరిశోధనాంశాలు, ఫలితాలు ఉండాలన్న తపన ప్రవర్తనా వాద అధ్యయన పరిధిని బాగా విస్తృతం చేసింది.

BRAOU

## 2.6 వ్యవస్థల విశ్లేషణ

ప్రవర్తనా వాదం విస్తరణలో భాగంగా వ్యవస్థల విశ్లేషణ (Systems Analysis) వృద్ధి చెందింది. రాజ్యం, ప్రభుత్వం మొదలైన పారిభాషిక పదాల స్థానంలో 'వ్యవస్థ' (System) అన్న పదాన్ని విరివిగా వాడుతున్నారు. అనేక సమాజాల్లో లాంఛన సంస్థలకు, లాంఛనేతర సమూహాలు, రాజకీయ అభివృత్తులు, (Political Attitudes) వ్యక్తుల పరస్పరసంబంధాలు, మొదలైన వాటిని అవగాహన చేసుకోవటానికి, విశ్లేషించటానికి 'వ్యవస్థ' పరంగా అధ్యయనం చేయుటం విస్తృతమైంది. వ్యవస్థల సిద్ధాంతానికి ఆద్యులు జీవశాస్త్రజ్ఞులు. 1950 దశకంలోనే వ్యవస్థల సిద్ధాంతం వినియోగంలోకి వచ్చినప్పటికీ, 1960 దశకంలోనే అది బాగా వ్యాప్తిలోకి వచ్చింది. వివిధ విజ్ఞాన శాస్త్రాల మధ్య సమీకరణ ఆవశ్యకతను వ్యవస్థల సిద్ధాంతం ఒక్కాణించింది. అనేక విజ్ఞాన శాస్త్రాల అధ్యయనాల మధ్య అడ్డుగోడలు పెరగటం వల్ల ఒక విజ్ఞాన శాస్త్రంలోని పరిశోధనా ఫలితాలు మరొక విజ్ఞానశాస్త్రానికి లభ్యం కాకపోవటం వల్ల విజ్ఞానశాస్త్రాల అభివృద్ధి కుంటుపడింది. ఈ పరిస్థితుల్లో సాధారణ వ్యవస్థల సైద్ధాంతికులు, అన్ని విజ్ఞానశాస్త్రాల్లోను ఉన్న సాధారణంశాలను క్రోడీకరించి అవి అన్ని విజ్ఞానశాస్త్రాలకు సమానంగా వర్తిస్తాయని వ్యవస్థల సిద్ధాంతాన్ని రూపొందించారు. వివిధ విజ్ఞాన శాస్త్రాల్లో ప్రస్తావించిన సాధారణ అంశాలకు ఒక అమూర్త రూపం ఇచ్చినట్లయితే, వాటినుంచి అన్ని విజ్ఞాన శాస్త్రాలకు సమానంగా వర్తించే ఒక సాధారణ సిద్ధాంతం రూపొందుతుందని భావించారు. అలాంటి సాధారణ అంశాలను అన్ని విజ్ఞానశాస్త్ర అధ్యయనాలు విరివిగా ఉపయోగించుకోవచ్చు. పర్యవసానమే సాధారణ వ్యవస్థల సిద్ధాంతం.

సాధారణ వ్యవస్థల సిద్ధాంతం తన రూపాన్ని ప్రకృతి శాస్త్రాలనుంచి ప్రధానంగా జీవశాస్త్రం నుంచి

గ్రహించింది. మొదటదీని అధ్యయనం మానవ శాస్త్రంలో అనుసరించారు. తరువాత సమాజ శాస్త్రం, మనో వైజ్ఞానికశాస్త్రం, రాజనీతి శాస్త్రం మొదలైన శాస్త్రీయ అధ్యయనాల్లోకి ప్రవేశించింది. రాజనీతి శాస్త్ర అధ్యయనం, విశ్లేషణలలో వ్యవస్థల సిద్ధాంతం వినియోగానికి కృషి చేసిన వారిలో రాబర్టు మెర్టన్, టాల్కాట్ పార్సన్ ముఖ్యులు. జీవశాస్త్రంనుండి గ్రహించిన వ్యవస్థాభావనకు అనుభవపరమైన పరిశీలన ప్రధాన అంశం. పరస్పర అంతర్ చర్యలకోసం, నిలచిన మూలకముల పొందికయే వ్యవస్థగా లుడ్విగ్ బెర్టాన్ ఫీ నిర్వచించారు. వివిధ విషయాల అభివృద్ధులు, సంబంధాలుగల అనేక అంశాల పొందికను వ్యవస్థగా హాల్, ఫాగన్‌లు నిర్వచించారు. పై నిర్వచనాలన్నీ పరిసరాలతోను, పరస్పరం వ్యక్తుల వస్తువుల సమాహారమే వ్యవస్థగా సూచిస్తున్నాయి. ఈ అనంత విశ్వం ఒక వ్యవస్థ. ఇందులో అనేకములైన వ్యవస్థలున్నాయి. గగన తలంలో వాతావరణ వ్యవస్థ ఉంది. సమాజంలో ఆర్థిక సామాజిక వ్యవస్థలున్నాయి. మానవ శరీరంకూడా ఒక సజీవ వ్యవస్థ. వీటికితోడు యంత్రాల పొందికతో యాంత్రిక వ్యవస్థకూడా ఉంది. సామాజిక వ్యవస్థలో వ్యక్తులే మూలాలు. సామాజిక వ్యవస్థ మినహా మిగతా వ్యవస్థలలో వ్యక్తులు అంతర్భాగం కారు. ఇదే సామాజిక వ్యవస్థలకు ఇతర వ్యక్తులకు మధ్య గల భేదం. ఇతర వ్యవస్థల్లో మూలకాలు వ్యవస్థ నిర్మాణానికి, నిర్వహణకై పూర్తిగా ఉపయోగపడుతాయి. వ్యక్తి సామాజిక వ్యవస్థలో అంతర్భాగం, ఏదో ఒక పాత్రను నిర్వహిస్తుంటాడు. రాజకీయ వ్యవస్థలో వ్యక్తుల రాజకీయ పాత్రకు ప్రాధాన్యత ఉంటుంది.

## 2.7 డేవిడ్ ఈస్టన్ విశ్లేషణ

రాజకీయ విషయాల అధ్యయనంలో వ్యవస్థా భావనను మొట్టమొదటగా డేవిడ్ ఈస్టన్ ప్రవేశపెట్టారు. A Framework for Political Analysis అనే గ్రంథంలో రాజకీయ ప్రక్రియలను శక్తులను విశ్లేషించటానికి రాజకీయ వ్యవస్థ అధ్యయనమే సరియైనదని ఈస్టన్ భావించారు. అంతకుముందు రాజనీతిశాస్త్రజ్ఞులు రాజకీయ సంస్థలను విడివిడిగా అధ్యయనం చేశారు. పరిసరాలను వారు అధ్యయనం చేయకపోవటంవల్ల వారి సిద్ధాంతాలు పరిశోధనా ఫలితాలు అర్థవంతంగా ఉండకపోయేవి. వ్యవస్థల విశ్లేషణను ప్రాతిపదికగా చేసుకొని రాజకీయ దృగ్విషయాలను అధ్యయనం చేయవచ్చని ఈస్టన్ భావించారు. సామాజిక ప్రవర్తనల, పరస్పర చర్యల అమూర్త రూపమే రాజకీయ వ్యవస్థ అని ఈస్టన్ భావన. రాజకీయ వ్యవస్థ ద్వారా సమాజంలో వివిధ విలువలు అధికారికంగా కేటాయించటం జరుగుతుందని ఈస్టన్ అన్నారు. వివిధ సామాజిక వ్యవస్థల్లో రాజకీయ వ్యవస్థను ఒక దానినిగా ఈస్టన్ గుర్తించారు. సమాజంలోని విలువలను అధికారికంగా రూపొందించి, కేటాయించి అమలుపరచే విభాగమే రాజకీయ వ్యవస్థ అని ఈస్టన్ సిద్ధాంతీకరించారు.

BRAOU

రాజకీయ వ్యవస్థను విశ్లేషించిన డేవిడ్ ఈస్టన్ సిద్ధాంతంలో ఈ క్రింది ప్రధానాంశాలున్నాయి:

1. సామాజిక ప్రవర్తనల, పరస్పర చర్యల అమూర్తరూపమే రాజకీయ వ్యవస్థ. రాజకీయ వ్యవస్థ ద్వారానే సమాజంలో విలువల సాధికారిక కేటాయింపు జరుగుతుంది.
2. అధికారాలు వివిధ నిర్ణయాలే విలువల సాధికారిక కేటాయింపులు. ప్రతి సమాజంలో సభ్యులకు ఉపయోగపడే వస్తువులు, సేవలు ఉంటాయి. అవి పరిమితంగా ఉంటాయి. కాబట్టి సభ్యుల మధ్య వాటి వినిమయంకోసం పోటీ తప్పనిసరి అవుతుంది. ఈ సందర్భంలోనే సమాజం సాధికారికంగా సభ్యుల మధ్య వస్తువులను సేవలను కేటాయిస్తుంది.
3. సమాజంలో అత్యధిక సభ్యుల ఆమోదం పొందిన కేటాయింపులే సాధికారికమైనవి. సదరు కేటాయింపులవల్ల సభ్యులు అంతకు ముందు తమకు గల వస్తువులు సేవలను మార్చుకోవచ్చు. వ్యక్తులు విలువలను సంపాదించుకొనే ప్రయత్నాల్లోనే కేటాయింపులు అడ్డంకిగా ఉంటాయి. అలాగే

ఇతరులకు లేని వాటిని నూతన కేటాయింపులద్వారా అందివ్వవచ్చు.

4. రాజకీయ స్వభావం గల అధికారిక కేటాయింపులను ఇతర విధానాలకు సంబంధించిన కేటాయింపు లనుంచి వేరు పరచవలసి ఉంటుంది.

5. సమాజంలో విలువలను సాధికారికంగా కేటాయింపులు చేయగల నిర్మితులు (Structures) పాత్రల సమాహారమే రాజకీయ వ్యవస్థ.

సామాజిక వ్యవస్థల్లో ఒకదానినిగా రాజకీయ వ్యవస్థను భావించినప్పుడు దానిని నిర్దుష్ట పరిధులలోనే అధ్యయనం చేయాల్సి ఉంటుంది. ఈ నిర్దుష్టమైన పరిధియే రాజకీయ వ్యవస్థను ఇతర వ్యవస్థలనుండి వేరుపరుస్తుంది. అయితే సదరు నిర్దుష్ట హద్దులను ఖచ్చితంగా నిర్ణయించటం సామాన్యంగా సాధ్యపడదు. రాజకీయ చర్యలు ఇతర సామాజిక చర్యలతో సమ్మిళితమై ఉంటాయి. నిర్మితులు పాత్రలు విభిన్నతలను సంతరించుకొని ఉంటాయి గనుక వాటిని గుర్తించవలసియున్నది. రాజకీయ వ్యవస్థ హద్దులు కలిగి ఉందన్న భావన వల్ల, అది ఎటువంటి పరిసరాలను కలిగి ఉంటుందన్నది తెలుసుకోవటం చాలా అవసరం. ఈస్టన్ అభిప్రాయంలో రాజకీయ వ్యవస్థ రెండు రకాల - భౌతిక, సామాజిక - పరిసరాలను కలిగి వుంటుంది. రాజకీయ వ్యవస్థ పరిసరాలను సమాజ అంతర్గత (Intrasocietal) సమాజానికి వెలుపల (Extra Societal) గా ఈస్టన్ సిద్ధాంతీకరించారు. సమాజంలోగల భౌతిక వాతావరణం, ఇతర వ్యవస్థల చర్యలు, ప్రతి చర్యలను సమాజ అంతర్గత పరిసరాలుగా పేర్కొన్నారు. ఆయన వాటిని ఈ కింది విధంగా వివరించారు:

i ఆవరణ సంబంధిత పరిసరాలు : మానవుల ఉనికితోపాటు ఉండే అనేక మానవేతర అంశాలు ఇందులో ఉన్నాయి. వాతావరణం, విస్తీర్ణం, నదీజలాలు, భూవనరులు, పర్వతాలు, లోయలు, అటవీ వనరులు మొదలైనవన్నీ భౌగోళిక స్వభావంగల భౌతిక పరిసరాలు.

ii జీవ సంబంధిత పరిసరాలు: వంశపారంపర్యత, జన్యు సంబంధిత, జీవపరమైన పరిసరాలు ఇందులో ఉంటాయి. వ్యక్తుల్లోని సహకార ఇచ్ఛ, హేతుబద్ధ ఆలోచనలు, రాజకీయ వ్యవస్థల మనుగడకు దోహదం చేస్తాయి. వీటిని మానవులు తమ జీవనానికి ఉపయోగించుకొంటారు.

iii మూర్తిత్వం (Personality): రాజకీ వ్యవస్థలోని వ్యక్తుల మూర్తిత్వాలు, వ్యవస్థ స్వరూపం, నిర్ణయాలు, నిర్వహణాల్లో ప్రభావాన్ని చూపుతాయి.

iv సామాజిక వ్యవస్థ: సామాజిక వ్యవస్థలోని ఇతర వ్యవస్థలన్నీ - సాంస్కృతిక, సాంఘిక, ఆర్థిక - రాజకీయ వ్యవస్థను ప్రభావితం చేస్తాయి.

BRAOU

సమాజానికి వెలుపల ఉన్న పరిసరాలుకూడా రాజకీయ వ్యవస్థను ప్రభావితం చేస్తాయి. అంతర్జాతీయ సంస్థలు, ఇతర దేశాలు, వాటితో గల సంబంధాలు రాజకీయ వ్యవస్థ వెలుపలగల పరిసరాలు. రాజకీయ వ్యవస్థ కొన్ని నిర్దిష్ట పరిసరాల్లో తన మనుగడను కొనసాగిస్తుంటుంది కనుక పరిసరాలు దానిని ప్రభావితం చేస్తుంటాయి. అందువల్ల రాజకీయ వ్యవస్థను డేవిడ్ ఈస్టన్ బహిరంగ వ్యవస్థగా (Open System) గా అభివర్ణించారు. రాజకీయ వ్యవస్థ ఎల్లప్పుడూ తన అంతర్గత, బహిర్గత ప్రభావాలకు లోనవుతుంటుంది. అంతరంగికంగా ఆందోళనలు, ఉద్యమాలు రాజకీయ వ్యవస్థలపై ఒత్తిడులు (Stresses) కలుగజేస్తుంటాయి. విదేశీ దండయాత్రలు, జోక్యం బహిర్గతంగా ఒత్తిడులను కలుగజేస్తాయి. ఒక వ్యవస్థ కొనసాగిపు అందులోని ఒత్తిడుల సమతౌల్యంపై ఆధారపడి ఉంటుంది. అధిక కేటాయింపులకోసం ప్రతి సమాజం ప్రయత్నిస్తుంటుంది. ఈ ప్రయత్నాలు అధికారం కైవసం కొరకు పోరాటంగా పరిణమిస్తాయి. ఇటువంటి పోరాటాల్లో రాజకీయ వ్యవస్థ క్రియాత్మకంగా జోక్యం చేసుకోవాల్సి ఉంటుంది.

..ను వ్యవస్థకు నిలకడ చాలా ప్రధానం, అంటె అందులో ఎలాంటి మార్పులు ఏర్పడరాదని అర్థంకాదు. ప్రతి రాజకీయ వ్యవస్థ అనేకమైన మార్పు చేర్పులకు గురౌతుంటుంది. అయితే మార్పుల స్థాయి ఒక రాజకీయ వ్యవస్థ క్షీణతలేక అభివద్ధిని సూచిస్తాయి. అధికారిక విలువల కేటాయింపుల స్థాయిలోనే ఒక రాజకీయ వ్యవస్థ అనేకమైన ఒత్తిడులకు గురౌతుంటుంది. అధికారిక విలువల కేటాయింపులలో మార్పులు లేకపోతే ఆ వ్యవస్థ స్థిరంగా తన మనుగడను కొనసాగించటం సాధ్యమవుతుంది. ఒత్తిడులు రాకుండా నివారించగల్గితే లేదా ఒత్తిడులను విజయవంతంగా వ్యవస్థలు అంతర్భాగం చేసుకొని తగు మార్పు చేర్పులలో కొనసాగితే అప్పుడు కూడా వ్యవస్థ విజయవంతమయినట్లుగా భావించాల్సి ఉంటుంది. రాజకీయ విశ్లేషణలలో డేవిడ్ ఈస్టన్ వ్యవస్థల సిద్ధాంతం చాలా ప్రాముఖ్యం పొందింది. విశ్లేషించాల్సిన దృగ్విషయాలన్నింటినీ వ్యవస్థల చట్రంలో బిగించటానికి ఈస్టన్ సిద్ధాంతం ప్రయత్నిస్తుంది. వర్ణనకూ, వివరణలకూ ఎంపిక చేయవలసిన చలాంకాలన్నింటిని వ్యవస్థల ప్రవర్తనల్లో ఇమిడించవచ్చు. అయితే అన్ని సందర్భాలలోను ఇది సాధ్యం కాదు. ఒక వ్యవస్థ హద్దులను నిర్ణయించటం వాస్తవంలో చాలా కష్టమైనపని. ఉత్పాదకాలు, ఉత్పాదితాలుగా ఎలా మారుతాయన్న అంశాన్ని గురించి ఈస్టన్ ఏమీ వివరించలేదు. అంతే కాకుండా ఈస్టన్ నమోనా వ్యవస్థల లక్ష్యాలు, ఉద్దేశ్యాలకు ఎలాంటి ప్రాధాన్యతనూ ఇవ్వలేదు. ఆయన కేవలం రాజకీయ వ్యవస్థ మనుగడకే ప్రాధాన్యమిచ్చారు. అలాగే రాజకీయ శక్తిని ఎవ్వరు ఎక్కడ, ఎలా, ఎందుకు ఉపయోగిస్తారన్నది కూడా ఈస్టన్ వివరించలేదు. స్వేచ్ఛ, అధికారం, రాజ్యాంగతావాదం మొదలైన విలువలను ఈస్టన్ నమోనా ప్రస్తావించదు. అంతేకాకుండా మెజారిటీ ప్రజల ప్రయోజనాల పరిరక్షణలో రాజ్యాధికారాన్ని ఎలా నియంత్రించవచ్చు అన్న అంశానికి కూడా ఈస్టన్ ఎటువంటి ప్రాధాన్యతను ఇవ్వలేదు.

## 2.8 నిర్మితులు - విధుల విశ్లేషణ

BRAOU

నిర్మితులు - విధుల విశ్లేషణ దృక్పథం వ్యవస్థల సిద్ధాంతానికి చాలా సన్నిహితంగా ఉంటుంది. నిర్మితులు - విధుల సిద్ధాంతం కూడా ప్రవర్తనా వాద ఉద్యమ ఫలితమే. ఈ దృక్పథం సామాజిక యధార్థాలైన నిర్మితులు (Structures), విధులు (Functions), ప్రక్రియలు (Processes) యంత్రాంగాలు మొదలైన వాటిని వివరించటానికి ప్రయత్నిస్తుంది. ఆల్మండ్ గేబ్రియల్ మొదలైనవారు ఈ దృక్పథాన్ని ప్రతిపాదించారు. డేవిడ్ ఈస్టన్ నమోనా వలె ఆల్మండ్ విశ్లేషణకూడా వ్యవస్థా భావనపైననే ఆధారపడిఉంది. "తులనాత్మక రాజకీయాలు" (Comparative Politics) అనే గ్రంథంలో ఆల్మండ్ తన సిద్ధాంతాన్ని చర్చించారు. విధుల నిర్వహణ రీతులను అనుసరించి రాజకీయ వ్యవస్థలను శ్రేణీకరించాలన్నది ఆల్మండ్ భావన. ప్రతి రాజకీయ వ్యవస్థ రెండు రకాలైన విధులను తప్పనిసరిగా నిర్వహిస్తుంటుంది. అవి: ఉత్పాదక లేదా రాజకీయ విధులు: ఉత్పాదిత లేక ప్రభుత్వ విధులు. ఆల్మండ్ ఐదు ఉత్పాదక; మూడు ఉత్పాదిత విధులను పేర్కొన్నారు.

I ఉత్పాదక విధులు:

i రాజకీయ సామాజికీకరణం

ii రాజకీయ నియామకాల భర్తీ; (Political Recruitment)

iii ప్రయోజనాల వ్యక్తీకరణం; (Interest Articulation)

iv ప్రయోజనాల సమీకరణం; (Interest Aggregation)

v ప్రసారం; (Communication)

II ఉత్పాదిత విధులు:

i నియమావళిరూపకల్పన; (Rule Making)

ii నియమావళి నిర్వహణ; (Rule Application)

iii నియమావళి న్యాయనిర్ణయాలు; (Rule Adjudication)

ఉత్పాదకవిధుల్లో రాజకీయ సామాజికీకరణం చాలా ప్రధానమైంది. ప్రతి రాజకీయ వ్యవస్థ తన సంస్కృతి, నిర్మితులు - కుటుంబం, చర్చి, విద్యాలయం, కార్మిక వర్గం, స్వచ్ఛంద సంస్థలు, ప్రసార ప్రచారసరళి, - స్థిరంగా కొనసాగాలని కోరుతుంది. ఒక రాజకీయ సంస్కృతిలో ప్రవేశించే ప్రక్రియయే రాజకీయ సామాజికీకరణం. రాజకీయ సామాజికీకరణం పూర్తి అయిన తరువాత రాజకీయ భర్తీ ప్రారంభం అవుతుంది. రాజకీయ వ్యవస్థకు సంబంధించిన వివిధ కర్తవ్యాల నిర్వహణకు అవసరమైన పౌరులను భర్తీ చేయటం జరుగుతుంది. రాజకీయ భర్తీ ప్రత్యేక రాజకీయ పాత్రల సామాజీకరణకు చెందినదై ఉంటుంది. ప్రయోజనాల వ్యక్తీకరణ రాజకీయ సామాజీకరణకు సన్నిహితంగా ఉంటుంది. వీటిలో ఎక్కువగా ఉత్పాదక విధులకు సంబంధం ఉంటుంది. ఉత్పాదక విధులుద్వారా సమాజానికి రాజకీయ వ్యవస్థకూ మధ్య ఉన్న వైవిధ్యాన్ని గుర్తించవచ్చు. రాజకీయ విధాన నిర్ణయకర్తలపై వ్యక్తుల సమూహాలు చేసే వివిధ ప్రతిపాదనల ప్రక్రియయే ప్రయోజనాల వ్యక్తీకరణగా ఆల్మండ్ సిద్ధాంతీకరించారు. రాజకీయ మార్పిడి ప్రక్రియలో ఇది మొదటి విధి. వ్యక్తులకు సమూహాలకు తమ తమ ప్రయోజనాల వ్యక్తీకరణకు సరైన అవకాశాలు లభించనప్పుడు వారు అసంతృప్తి చెందుతారు. అసంతృప్తిని నివారించలేనప్పుడు హింస, దౌర్జన్యచర్యలు ప్రారంభమవుతాయి. రాజకీయ శిష్ట వర్గాలు వాటిని అణచివేయాల్సి ఉంటుంది. వివిధ ప్రయోజనాలను సమన్వయ పరచి సాధారణ విధానాలను రూపొందించే ప్రక్రియయే ప్రయోజనాల సమీకరణ. కొన్ని వ్యవస్థల్లో సమీకరణం విధులను శాసనసభ, కార్యనిర్వాహకవర్గం, ఉద్యోగి స్వామ్యం, ఆసక్తి వర్గాలు, ప్రసార మాధ్యమం, రాజకీయసమాజం నిర్వహిస్తాయి. ఆల్మండ్ అభిప్రాయంలో రాజకీయ ప్రసారం, ప్రధాన హద్దుల నిర్ణయీకరణ విధులను నిర్వహిస్తుంది. ప్రసార మాధ్యమానికి స్వేచ్ఛ కల్పించటం ద్వారా సమాజం నుంచి ప్రభుత్వానికీ, ఒక రాజకీయ నిర్మితి నుంచి మరో రాజకీయ నిర్మితికి స్పందిత సమాచారం (Feed back) లభ్యమవుతుంది. ప్రజాస్వామ్య వ్యవస్థల్లో ప్రసారం స్వేచ్ఛాయుతంగా సాగితే, నియంతృత్వ వ్యవస్థలో రాజకీయ ప్రసారంపై ప్రభుత్వానికి గుత్తాధిపత్యం ఉంటుంది.

BRAOU

## 2.9 ఉత్పాదక విధులు

శాసనాలు రూపొందించటమే నియమావళి రూపకల్పన. ఇది నిర్మితుల ప్రత్యేక లక్ష్యం. అన్ని రాజకీయ వ్యవస్థలలోను ఏదో ఒక రూపంలో నియమావళి రూపొందుతుంది. శాసన వర్గం, న్యాయ వర్గం కొన్ని సందర్భాల్లో ఉద్యోగిబృందం ఆధునిక సమాజాల్లో అవసరమైన నియమనిబంధనలను రూపొందిస్తాయి. రూపొందించిన నియమావళిని అమలుపరచటమే నియమావళి నిర్వహణ. నియమావళిని అమలు పరచటానికి పాలనా సామర్థ్యం అత్యున్నతస్థాయిలో ఉండాలి. ఫలితంగా ఉద్యోగి బృందం ప్రాధాన్యతను సంతరించుకొంటుంది. నియమావళి నిర్వహణ, లక్ష్యాలు, విధులు పరస్పర అంతర్ చర్యలు వాటి ఎంపికకు దోహదం చేస్తాయి. నిర్మితులు రాజకీయ వ్యవస్థ నిర్వహణలో ఉపకరిస్తాయి. నూతన లక్ష్యాలను చేరుకోవటానికి సమర్థవంతమైన నియమావళి నిర్వహణ పద్ధతులు చాలా అవసరం. రూపొందిన నియమావళి ఉల్లంఘనలను అతికట్టడంలో న్యాయ వర్గం ఉపకరిస్తుంది. నియమావళిని అతిక్రమించినప్పుడు అందుకు విధించాల్సిన శిక్షలు ముందుగానే నిర్ణయంకావాలి. వ్యవస్థలోని సమతౌల్యతను కాపాడటానికి, పరస్పర సంబంధాలను క్రమబద్ధం చేయటంలో న్యాయ వర్గం ఉపకరిస్తుంది. నిర్మితులకు విధులకు మధ్యగల సంబంధాలే ఆల్మండ్ నిర్వచించిన నిర్మితులు - విధుల విశ్లేషణకు క్రమమైన స్వభావాన్ని కలుగజేస్తుంది. ఉత్పాదితాలు వ్యవస్థ పరిసరాలను ప్రభావితం చేస్తాయి. కొత్త ఉత్పాదకాలు రాజకీయ వ్యవస్థలో ఆవిర్భవిస్తాయి. ఈ విధమైన అంతర్ చర్యల మార్పిడిని ఆయన స్పందిత సమాచారం (Feed back) గా వర్ణించారు. అవసరమా సరైన వేనా యున్న

విషయాల జోలికిపోకుండా ప్రతి రాజకీయ వ్యవస్థ పైన వివరించిన విధులను నిర్వర్తిస్తుందని ఆల్మండ్ సాధారణీకరించారు. అయితే విధుల మధ్య పరస్పర సంబంధాలను ఏర్పాటు చేయటంలో ఆల్మండ్ విఫలుడయ్యారు. అన్ని విధులకు ఆయన సమానమైన ప్రాధాన్యతను ఇచ్చారు. అలాగే ఒక రాజకీయ వ్యవస్థ ఏ విధినైనా నెరవేర్చలేకపోయినప్పుడు ఏర్పడే పరిణామాలను ఆయన వివరించలేదు. ఆల్మండ్ తదితరులు ముఖ్యంగా డేవిడ్ ఆప్టర్ చర్చించిన నిర్మితులు - విధులు దృక్పథం కేవలం యథాస్థితిని (Statusquo) మాత్రమే సమర్థిస్తుంది. అభివృద్ధి చెందుతున్న సమాజాల విషయంలో ఈ నమోనా ఎక్కువగా ఉపయోగపడదు. రాజకీయ వ్యవస్థ మనుగడకు అవసరమైన విధులను మాత్రమే ఈ విశ్లేషణ తెలియచేస్తుంది. విధుల నిర్వహణ విచ్ఛిన్నంకావటాన్ని కాని విధులు నిర్వహించటంలో సంభవించగల లోటుపాట్లనుకాని ఊహించలేదు. అంతేకాకుండా నిర్మితులు - విధుల దృక్పథం కేవలం యథా తథ పరిస్థితిని మాత్రమే సమర్థిస్తుంది. రాజకీయ వ్యవస్థ సామ్యవాద మార్గంవైపుకు పయనించకుండా నిరోధించటానికి ఉపకరిస్తుంది. ఈ దృక్పథంలో ఆధునికీకరణం అంటే కమ్యూనిస్టు నమోనాకు వ్యతిరేకంగా ఉండే పాశ్చాత్య పెట్టుబడిదారీ నమోనాలను అనుకరించటమే గాని మరొకటి కాదు. అందువల్లనే నిర్మితులు - విధుల దృక్పథాన్ని సమర్థించేవారిని బూర్జువాలుగా విమర్శిస్తున్నారు. ఈ దృక్పథం మార్క్సిస్టులకు ఆమోదయోగ్యం కాదు.

## 2.10.0 మార్క్సిస్టు దృక్పథం

వ్యవస్థలు, విధులు-నిర్మితుల దృక్పథాలకు భిన్నంగా మార్క్సిస్టు అధ్యయన దృక్పథం మరొకటి ఉంది. వీరు పైన వివరించిన దృక్పథాలను అభివృద్ధి నిరోధకమైనవిగా వర్ణిస్తున్నారు. తమదే విప్లవాత్మకమైనదిగా మార్క్సిస్టులు భావిస్తారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలను విశ్లేషించటంలో ఒక విప్లవాత్మకమైన ఒరవడిని మార్క్సువాద దృక్పథం వివరిస్తుంది. రాజకీయ దృగ్విషయాన్ని విశ్లేషించటంలో రాజకీయ, సామాజిక దృక్పథంకాక రాజకీయ ఆర్థిక (Political Economy) దృక్పథాన్ని మార్క్సిస్టు విశ్లేషణ సూచిస్తుంది. ఉదారవాద ప్రజాస్వామ్య వ్యవస్థల పరంగా రూపొందిన వ్యవస్థల దృక్పథం మౌలికంగా అభివృద్ధి చెందిన పశ్చిమ దేశాల సమాజాలకే పరిమితమైంది. అభివృద్ధిచెందుతున్న దేశాల వ్యవస్థలను విశ్లేషించటానికి సదరు దృక్పథం ఉపయోగపడదని మార్క్సిస్టులు భావిస్తారు. ఇంతకు ముందు వివరించిన దృక్పథాలకు మార్క్సిస్టు దృక్పథం భిన్నమైంది. ఉత్పత్తి శక్తులను, ఉత్పత్తి సరళిని రాజకీయ విశ్లేషణలో కీలకమైనవిగా ఈ దృక్పథం గుర్తిస్తుంది. కారల్ మార్క్స్ తన సిద్ధాంతాన్ని శాస్త్రీయ సామ్యవాదమన్నాడు. సమాజాభివృద్ధిని కొన్ని శాస్త్రీయ నియమాలతో విశ్లేషించ కారల్ మార్క్స్ ప్రయత్నించారు. మార్క్సిస్టు దృక్పథపు మౌలికాంశాలను ఈ కింది విధంగా వివరించవచ్చు.

### 2.10.1 గతి తార్కిక పద్ధతి

గతి తార్కిక పద్ధతిని కారల్ మార్క్స్ హెగెల్ నుండి గ్రహించారు. సమకాలీన సంఘటనలను సమన్వయపరచి, వాటి ప్రభావం ప్రస్తుత కాలంలోనే కాకుండా భవిష్యత్తులోగూడా ఏ విధంగా ఉంటుందో అవగాహన చేసుకొనే ప్రక్రియయే గతి తార్కిక పద్ధతి. మార్క్స్ అభిప్రాయంలో భౌతికవాదం, భౌతిక ప్రపంచాలే వాస్తవికతకు ప్రతీకలు. బాహ్య ప్రపంచానికి, మానవ వికాసానికి గతి తార్కిక పద్ధతి ప్రగతి మార్గాన్ని సూచిస్తుంది. చరిత్ర గడుస్తున్నకొద్దీ మానవుల భావాల్లో మార్పులు వస్తుంటాయి. ఈ మార్పులే గతి తార్కిక వాదానికి నాంది. హెగెల్ ఆది భౌతిక వాదానికి ప్రాముఖ్యమిస్తే మార్క్స్ భౌతికవాదానికి ప్రాముఖ్యమిచ్చారు. ప్రకృతి, మానవ సమాజం భావనా పరంపరల నివాసం. విజ్ఞాన శాస్త్రంలో గతి సూత్రాల వంటివే గతి తార్కిక విధానమని ఏంగెల్స్ వాదిస్తాడు. ప్రపంచం నిశ్చలంగా ఉండకసాగిపోతుంటుంది. ఈ

BRAOU

చలనాన్ని అవగాహన పరచుకోవటానికి అనువైన సూత్రాలను రూపొందించాలి. తన భౌతిక వాదం గతి తార్కికమైనదేకాని యాంత్రికమైంది కాదని మార్క్స్ భావన. మార్క్స్ గతి తార్కిక ప్రక్రియద్వారా పదార్థం (Matter) నుంచే పరిణామం ఏర్పడిందనీ, పరిసరాల ప్రభావం వల్లకాదని వాదిస్తారు. విశ్వం ప్రకృతి సిద్ధంగానే భౌతికమనీ, దానికి సంబంధించిన సంఘటనలన్నీ భౌతిక గతి సూత్రాలపై ఆధారపడి ఉంటాయన్నారు. "మానవుల ఆలోచన, పరిసరాలను మార్చదు. పరిసరాలు వారి ఆలోచనలను చైతన్యాన్ని మారుస్తాయి" అని మార్క్స్ అన్నారు.

## 2.10.2 చారిత్రక భౌతికవాదం

సామాజిక వికాసంలో గతి తార్కిక భౌతికవాద ప్రక్రియను అన్వయించటమే చారిత్రక భౌతికవాదపు లక్ష్యం. దీని ప్రకారం చరిత్రలోని సంఘటన లన్నింటినీ భౌతికవాదం దృష్టితో విశ్లేషించాలి. మానవ కార్యకలాపాల్లో ఉత్పత్తికి ప్రముఖ స్థానం ఉంది. మానవుని ప్రాథమికావసరాలు తీర్చటం సమాజపు ప్రథమ లక్ష్యం. ఈ లక్ష్యసాధన అసాధ్యమైనప్పుడు సంఘర్షణ తల ఎత్తుతుంది. ఉత్పత్తి సాధనాల పరిస్థితి సమాజవ్యవస్థ స్థితిని నిర్ణయిస్తుంది. ఆర్థిక వ్యవస్థలో మార్పులవల్ల "వ్యవస్థ" లో పూర్తి మార్పులు కలుగుతాయి. తత్త్వశాస్త్రం, మతం, చట్టం, సామాజిక, రాజకీయ సంస్థలను ఆర్థికంగా ప్రాబల్యంగల వర్గం తన స్వీయ ప్రయోజనాలకు ఉపయోగించుకొంటుంది. మార్క్స్ ఉద్దేశంలో సమాజ పురోగతి యాదృచ్ఛికంగా జరగటం లేదు. అది ఒక నియమబద్ధమైన చారిత్రకపరిణామం. సమాజంలో బలమైన, బలహీనవర్గాల మధ్య సంఘర్షణ ఎల్లప్పుడూ జరుగుతుంటుంది. బూర్జువాలకు, శ్రామికులకు, ఉన్నవారికి లేదా లేనివారికి మధ్య సంఘర్షణ అనివార్యమవుతుంటుంది. చివరకు ఈ సంఘర్షణ పెట్టుబడిదారులకు శ్రామికులకు మధ్య వర్గపోరాటంగా పరాకాష్ఠ దశకు చేరుకుంటుంది.

BRAOU

## 2.10.3 వర్గ పోరాటం సామాజిక విప్లవం

మార్క్స్ ఉద్దేశంలో చరిత్ర వికాస దశల్లో సమాజం ఒక శాశ్వత యుద్ధభూమిగా తయారైంది. ఆదిమ సమాజంలో స్వేచ్ఛా జీవి బానిస; మధ్య యుగాల్లో శ్రేణి యజమాని, సంచార శ్రామికుడు, రాజవంశీయులు - సామాన్య జనం, భూస్వామి - వెట్టి చాకిరీ చేసేవారు; అణచివేసే వాడు, అణచివేయబడ్డవాడు; ఆధునిక యుగంలో పెట్టుబడిదరు, శ్రామికుడు, వీరిమధ్య నిరంతరం పోరాటం కొనసాగుతూ వస్తున్నది. ఇంతవరకు అణగి మణిగి వున్న వైరుధ్యం పెట్టుబడిదారీ విధానంలో లావాలా ప్రవహిస్తుంది. ఈ సిద్ధాంతం ప్రకారం బూర్జువాలకు, శ్రామికులకు మధ్య సంఘర్షణ తీవ్రమై చివరకు శ్రామికవర్గ విజయానికి దారితీస్తుంది. ఆర్థిక వ్యవస్థ ఎవరి స్వాధీనంలో ఉంటుందో వారి ఆధీనంలోనే మొత్తం రాజ్య యంత్రాంగం, సైన్యం, చట్ట వ్యవస్థ, పోలీసు, ఉద్యోగ బృందం ఇతర సంస్థలు ఉంటాయి. పెట్టుబడిదారీ విధానంలో ప్రజాస్వామ్యం ఉన్నప్పటికీ అది నిజమైన ప్రజాస్వామ్యంకాదు. దారిద్ర్య రేఖకు దిగువన మగ్గే అశేష ప్రజానీకం హీనమైన దయనీయమైన పరిస్థితుల్లో నిస్సహాయస్థితిలో బతుకు వెళ్ళబుచ్చుతుంటారు. అందువల్ల కొద్దిమంది అధికారాన్ని కైవసం చేసుకొని తమ వర్గ ప్రయోజనాలకు రాజ్యయంత్రాంగాన్ని పూర్తిగా వినియోగించుకొంటారు. ఇటువంటి స్థితిలో సామాజిక విప్లవం అనివార్యమని మార్క్స్ సిద్ధాంతీకరించారు.

## 2.11 ముగింపు

మార్క్స్ ఉద్దేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థ పరాకాష్ఠ దశకు చేరుకొని చివరకు సామ్రాజ్యవాదానికి, యుద్ధాలకు దారితీస్తుంది. అటువంటి వ్యవస్థను, రాజ్య యంత్రాంగాన్ని తొలగించి వర్గ రహిత సమాజస్థాపన

శ్రామికవర్గ అంతిమ ధ్యేయం కావాలని మార్క్స్ సూత్రీకరించారు. పై పరిణామాలవల్ల రాజకీయ సామాజిక శాస్త్ర అధ్యయనంలో సామాజిక శాస్త్రజ్ఞులు అనేక అంశాలను దృక్పథాలను, విషయ విపులీకరణ విశ్లేషణాల్లో పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. వాస్తవానికి దగ్గరగా సామాజిక చట్రం పరిధిలో వాటిని అధ్యయనం చేయాల్సి ఉంటుంది.

డా. వి. రవీంద్ర శాస్త్రి

## 2.12 చదువదగిన పుస్తకాలు

| | | | |
|---|---|---|---|
| 1. | Mukhopadya | : | Political Sociology |
| 2. | Rush & Althoff | : | An Introduction to Political Sociology |
| 3. | Taru Bottomore | : | Political Sociology |
| 4. | R-T. Jangam | : | Political Sociology |

## 2.13 నమూనా పరీక్షా ప్రశ్నలు

కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

1. రాజకీయ సమాజశాస్త్ర అధ్యయన దృక్పథాలను పరిశీలింపుము?
2. వ్యవస్థల విశ్లేషణ అంటే ఏమిటి?
3. మార్క్సిస్టు అధ్యయన దృక్పథాన్ని చర్చింపుము?
4. నిర్మితులు. విధుల విశ్లేషణను పరిశీలింపుము?

BRAOU

# భాగం - 3 భారత రాజకీయాలు సామాజిక ఆర్థిక ప్రాతిపదిక

విషయక్రమం


3.1 లక్ష్యాలు

3.2 పరిచయం

3.3.0 ఆదిమ సమాజం - వైదిక వైభవం

3.3.1 వర్ణ వ్యవస్థ

3.3.2 సంపదకోసం దండయాత్రలు

3.4 ఫ్యూడలిజం పుట్టుక - అభివృద్ధి

3.5 విదేశీ పాలన - పరిణామాలు

3.6.0 జాతీయోద్యమం - క్రొత్త సామాజిక వర్గాలు

3.6.1 జాతీయ కాంగ్రెస్ రాజకీయాలు

3.6.2 దళిత చైతన్య స్రవంతి

3.6.3 స్వాతంత్ర్యం - దాని ఫలితాలు

3.6.4 మండల్ కమిషన్ రాజకీయాలు

3.7 ఆంధ్ర ప్రదేశ్‌లో సామాజిక నిర్మాణం - రాజకీయాలు

3.8 సారాంశం

3.9 చదువదగిన పుస్తకాలు

3.10 నమూనా పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 3.1 లక్ష్యాలు

ఈ భాగం చదివితే ఈ క్రింది విషయాలు గ్రహించగలుగుతారు.

- రాజకీయాలకు, సామాజిక నిర్మాణానికి మధ్య గల చారిత్రక సంబంధం
- గ్రామీణ సమాజంలో వర్ణ - వర్గ రాజకీయాల పాత్ర
- విదేశీ పాలనలో భారత రాజకీయాల తీరుతెన్నులు, స్వాతంత్ర్యోద్యమంలో సాంఘిక శక్తుల పాత్ర
- స్వాతంత్ర్యానంతర రాజకీయ పరిస్థితులు.

## 3.2 పరిచయం

ప్రపంచంలో ఏ దేశంలో కూడా మనిషి ఉనికి తోనే రాజకీయాలు లేవు. మనిషి నాగరికత నేర్చుకోవడానికి, పరస్పరం సుస్థిరమైన సంబంధాలు ఏర్పరచుకోవడానికి ఎంతో కాలం పట్టింది. కుటుంబం, ఆస్థి, రాజ్య వ్యవస్థల ఏర్పాటు అనేది ఒక సుదీర్ఘ ప్రక్రియ. దీనికోసం మనిషి ప్రకృతి శక్తులతో నిరంతరం పోరాడవలసి వచ్చింది.

అప్రతిహత ఘర్షణలోనుంచే నూతన సమాజ ఆవిష్కరణ జరిగింది. ఒక మనిషికి మరో మనిషికి మధ్య ఏర్పడ్డ సంబంధాలే రాజ్య అవిర్భావానికి పునాదిగా పనిచేశాయి. ఇప్పటికైనా ఆ రాజ్య మానవ సంబంధాలు అర్థమైతే రాజ్య స్వభావాన్ని అర్థం చేసుకోవడం సులభం.

రాజ్య స్వభావం - రాజకీయాలు అర్థం చేసుకోవడమంటే ఆరాజ్యపు అవిర్భావానికి సంబంధించిన ఆర్థిక సంబంధాలతో, ఆ సంబంధాలనుంచి ఉత్పన్నమయ్యే వర్గాల (సామాజిక సమూహాల) ప్రయోజనాలతో కూడిన సాంస్కృతిక జీవనస్థాయిని అధ్యయనం చేయడమే.

మానవజాతి చరిత్ర మొత్తం వర్గపోరాటాల చరిత్ర అంటాడు కారల్ మార్క్స్. మానవ సమాజాలన్నీ మూడు దశలు దాటి వచ్చాయి. అవి ఆదిమ (ఆటవిక), బానిస, ఫ్యూడల్ దశలు. ఈ పరిణామ క్రమంలో పాలకులకూ, పాలితులకూ మధ్య నిరంతర ఘర్షణ సాగింది. ఈ ఘర్షణ భారతదేశంలో కూడా సాగింది. అదొక సుదీర్ఘ పరిణామం. ఆ మహాప్రస్థానాన్ని అర్థం చేసుకోవాలంటే చారిత్రక మూలాలను వెతుకవలసి ఉంటుంది. దానికోసం భారతీయ సామాజిక క్రమవికాసాన్ని అర్థం చేసుకోవలసి ఉంటుంది. సామాజిక పరిణామ దశలను నాటి తాత్విక భూమికను ఆ దశలో ఆ పరిణామానికి, కారణమైన ఆర్థిక, సాంఘిక పరిస్థితులనూ అధ్యయనం చేయవలసి ఉంటుంది.

ఆదిమ దశ నుంచి ఈ ఆధునిక దశకు మానవ సంబంధాలు ఎదగడానికి కొన్ని శతాబ్దాలకాలం పట్టింది. అనేక యుద్ధాలు, దురాక్రమణలు, దండయాత్రలూ అవసరమయ్యాయి. అనేకానేక సంస్కృతులు, చరిత్రలు కలిగిన మానవ సముదాయాలు కలిసి భారతజాతిగా అవతరించడం ఒక చారిత్రక పరిణామం.

ఎ.ఆర్.దేశాయ్ అనే సామాజిక పండితుడు పేర్కొన్నట్టు "ఒక ప్రత్యేక సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అభివృద్ధి దశలో జాతులు అవతరించాయి." ఆ జాతులు నిర్ణీత భౌగోళిక ప్రాంతానికి పరిమితమై, ఒకే భాషలో పరస్పర సంబంధాలు నెలకొల్పుకొని ఒక మానసిక స్థితిలో ఎదిగాయి. భారత దేశం కూడా ఈ నేపథ్యంలోనే ఎదిగింది సాంస్కృతిక పరంగా.

జన సమూహాలు సమిష్టి పాలనాధికార ఛత్రం కిందికి రావడంతో భారతదేశం ఒక 'జాతీయ దేశం'గా అవతరించింది. భారతదేశం ఏర్పడిన నాటినుంచి ఇప్పటి దాకా కూడా ఆ "భిన్నత్వంలో ఏకత్వం" అలానే కొనసాగుతోంది. భౌగోళిక పరిస్థితులు, భాషలు, మతాలు, ఆచారాలు, వేరయినప్పటికీ భావసారూప్యం భారతదేశాన్ని ఒక జాతిగా నిలబెట్టింది. భారతదేశంలో అంతర్గతంగా భిన్న సంస్కృతులున్నప్పటికీ ఆ సంస్కృతుల మధ్య ఏకత్వం, ఐక్యభావన ఈ విశాల రాజ్యావతరణకు దోహదం చేసింది. నాటి గణ సమూహాలనుంచి, నేటి గణ తంత్ర రాజ్యావతరణ వరకూ మధ్య అనేక రాజ్యాలు, రాచరికాలు, సామ్రాజ్యాలు, సామ్రాజ్యవాదాలు అవతరించాయి. అదే క్రమంలో అంతరించాయి కూడా. ఈ చారిత్రక పరిణామ గతికి ఆయా కాలాల నాటి సామాజిక, ఆర్థిక పరిస్థితులు చోదకశక్తులుగా పనిచేశాయి.

## 3.3.0 ఆదిమ సమాజం - వైదిక వైభవం

ఆదిమ మానవునికి రాజకీయాలు లేవు. స్వార్థం, వాది అనే భావన లేనంతకాలం రాజ్యంతో అవసరం ఏర్పడదు. మనిషి మనిషి కలిసి సహజీవనం సాగించి, సమూహాలుగా ఏర్పడి స్థిరనివాస సముదాయాలుగా ఎదిగి, గ్రామీణ, గణసీమలూ ఏర్పడ్డాయి. ఇదొక సుదీర్ఘ ప్రక్రియ. ఇప్పటివరకు లభిస్తున్న ఆధారాల ప్రకారం గణసీమలే తొలిరాజకీయ సమూహాలు. "ఆహార సేకరణ దశ నుంచి ఆహార ఉత్పత్తి దశకు అంటే సమాజం ఆటవిక వ్యవస్థ నుంచి స్థిర వ్యవసాయ సమాజానికి పరివర్తన చెంది స్వయం సమృద్ధి సాధించిన

BRAOU

గ్రామీణ వ్యవస్థ ఏర్పడింది." క్రమంగా వ్యవసాయ ఉత్పత్తి పెరిగి శ్రమ విభజన మొదలయింది. ఈ దశలో తొలి సామాజిక వ్యవస్థ రూపు దిద్దుకుంది.

ఆటవిక సమాజపు ఆచారాలు, కుదుర్లు, చిహ్నాలు, ఆర్యుల రాకతో సాంఘిక నిర్మాణంలో కీలకపాత్ర పోషించాయి. ఆర్యుల ప్రవేశంతో గ్రామీణ సమాజపు రూపు రేఖలు పూర్తిగా మారిపోయాయి. అప్పటివరకూ కొనసాగిన గణనాయక వ్యవస్థ స్థానే సర్వసత్తాక రాచరిక వ్యవస్థ ఆవిర్భవించింది. ఈ రాచరికం శిక్షిత సైన్యం, పన్నుల వ్యవస్థ పైనే ప్రధానంగా ఆధారపడి నిలబడింది.

ప్రముఖ చరిత్రకారుడు డి.డి. కోశాంబి పేర్కొన్నట్లు పన్నులు, సైనిక బలగం ప్రధానాంశాలుగా ఎదిగిన రాచరికం క్రీ.శ. నాలుగో శతాబ్దినాటికి బలపడింది. దీనినే ఆయన 'సామంత స్వామ్యం' అన్నాడు. ఈ వ్యవస్థలో రాజ్యాలు దొంతర దొంతరలుగా ఉంటాయి. ప్రతి రాజ్యానికి సైన్యంపై అధికారం, పన్నులు వసూలు చేసే యంత్రాంగంపై అదుపుకలిగిన 'రాజు' ఉంటాడు. ఈ రాజుల దొంతరలో కిందివాడు పై వాడికి సామంతుడు. ఇది తొలినాటి రాచరిక స్వరూపం. దీన్నే కోశాంబి, 'మీదినుంచి భూస్వామ్యం' (Feudalism from above) అని పేర్కొన్నాడు.

భారతీయ నాగరికత తొలిదశల్లోని ప్రజాజీవనాన్ని పరిశీలిస్తే మనకు రాజకీయాల తాలూకు ఏ ఆధారమూ కనిపించదు. ఒకరిపై ఇంకొకరు ఆధిపత్యం చెలాయించినట్లుగానీ, యుద్ధాలు జరిగినట్లు గానీ సైనిక వ్యవస్థ ఉన్నట్లుగానీ దాఖలాలు లేవు. హరప్పా శిథిలాల ఆధారంగా అప్పటి ప్రజల సాంఘిక జీవనం తెలుసుకోగలిగామే తప్ప రాజకీయ వ్యవస్థకు సంబంధించిన ఏ ఆధారమూ అక్కడ దొరకలేదు. దీనిని బట్టి ఆర్యులు రాకపూర్వం ఇక్కడ పాలితులు పాలకులు అన్న వర్గ విభజన కనిపించదు. వేదకాలంలోనే ఈ విభజన జరిగింది. అప్పటిదాకా సమస్తరీయ కుదుర్లుగా, శ్రేణులుగా ఉన్న సమాజంలో దొంతరలూ, అంతరాలు ఏర్పడ్డాయి.

BRAOU

## 3.3.1 వర్ణ వ్యవస్థ

ఆర్యుల ప్రవేశంతో అప్పటిదాకా కుదురుగా ఉన్న సమాజం అతలా కుతలం అయ్యింది. పాతసమూహాలు, గణాలు, శ్రేణులు చెల్లాచెదురయ్యాయి. సింధూలోయ నగరాలు ధ్వంసమైపోయాయి. అక్కడి జనం చావగా మిగిలిన వాళ్ళు పారిపోయారు. కొందరు బల ప్రయోగంలో బందీలయిపోయారు. ఇంకొందరిని లొంగదీసుకున్నారు. దాసులుగా మార్చుకున్నారు. దీనికోసం ఆర్యులు, 'సామదాన భేద దండోపాయాలు' కనిపెట్టారు. భారతదేశంలో ఆధిపత్యానికి ఇదే ఆరంభదశ. తాము గొప్పవాళ్ళమని చెప్పడంకోసం ఆర్యులకు వర్ణం (శరీరఛాయ) ఉపకరించింది. నల్లవాళ్ళని తెల్లవాళ్ళు పరిపాలించ వచ్చని సిద్ధాంతీకరించారు. ఆర్యులు తెల్లవాళ్ళు, తెలుపు రంగుకు దగ్గరగా ఉండే గోధుమ వర్ణం కలవారో కావడం వల్ల నల్లని రంగు కల దాస్యులు ఆర్యులకు దాసోహం కావలసి వచ్చింది. ఆ కాలంలో వర్ణం (రంగు) అనేది ఆర్యులను, దాస్యులను వేరుపరచి సమాజాన్ని విడదీసిందని కోశాంబి పేర్కొన్నారు.

శ్రమ విభజన, పాతక్రొత్తల సాంప్రదాయపు పోకడలు, మతం, క్రతువులు, వ్యవసాయం, అదనపు ఉత్పత్తి, వర్తక వాణిజ్యాలు పెరిగాయి. దీంతో సామాజిక విభజన పెరిగింది. యజుర్వేద కాలంనాటికి ఆర్య దశ్యవర్గాల స్థానంలో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్గాలు ఏర్పడినాయి. వేద మంత్రాలు తెలిసిన బ్రాహ్మణ వర్గం శక్తిమంతులు యోధులు అయిన క్షత్రియ వర్గ సహాయంతో వ్యవసాయిక, పశుపోషక జాతులపై ఆధిపత్యం చెలాయించటం మొదలుపెట్టింది. బ్రాహ్మణ వర్గం అండదండల క్రింద రెండు

వర్గాలను క్షత్రియ వర్గం అణగదొక్కి దోచుకోసాగింది. అయితే 'రాజకీయ' వర్గంగా ఎదుగుతున్న క్షత్రియ సమూహాలకు బ్రాహ్మణ ఆధిపత్యం ప్రతిబంధకంగా తయారయ్యింది. ఈ ఆధిపత్యానికి వ్యతిరేకంగా పలుసార్లు కిందివర్గాలు తిరుగుబాటు చేశాయి. ఒక వర్గంపైన మరో వర్గం పట్టుసాధించుకునేందుకు ప్రయత్నించాయి. దీనిని బ్రాహ్మణ వాదం సహించలేకపోయింది. అప్పటిదాకా కొనసాగుతున్న సంబంధాలను చట్టబద్ధమూ, శాశ్వతమూ చేసే ప్రయత్నం విజయవంతంగా చేయగలిగింది. సృష్టికర్త 'బ్రహ్మ' అని అతని తలనుంచి బ్రాహ్మలవర్గం పుట్టిందని బాహువులనుంచి క్షత్రియులు (యోధులు) ఉదరభాగంనుంచి వైశ్యులు (విసులు-వ్యవసాయదారు) పాదాలనుంచి శూద్రులు (సేవకులు) వచ్చారని సిద్ధాంతీకరించారు. అందువల్ల ఈ వర్గాలు వరుసగా ఆలోచన, రక్షణ లేదా పాలన, వ్యవసాయం, సేవలు చెయ్యాలని, ఇది దైవ సంకల్పమని శాస్త్రాలు చేశారు. ఈ నిర్ణయాలు ఉల్లంఘిస్తే శిక్షార్హులని చట్టాలు రూపొందించారు. చట్టం రూపొందించడం బ్రాహ్మణుని పని అయితే దాన్ని అమలు పరచడం క్షత్రియుని విధిగా మారింది. దీనికోసం శిక్షాస్మృతులను కూడా రూపొందించినారు. ఈ గ్రంథాలు రాచరికం అవసరాన్ని నొక్కి చెప్పాయి. తిరుగుబాట్లని అణచివేసేందుకు, జరిమానాలు, పన్నులు విధించేందుకూ అధికారాలు లభించాయి. సామాజిక వ్యవస్థను యథాతదంగా కొనసాగించేందుకు రాజుకు, సభ్యులందరూ దాసోహం కావాలన్నారు. అలాగే పెద్ద చేప చిన్న చేపను మింగే (మత్స్య న్యాయాన్ని) ప్రవేశపెట్టారు. రాజుకు దండనీతిని అంటగట్టారు. హిందూమతం ఈ పద్ధతులను పటిష్టంగా అమలు జరిపేందుకు తగిన జాగ్రత్తలు తీసుకుంది. మతం బలమైన శక్తిగా ఎదగ గలిగింది. మతాధిపతులే మార్గదర్శకులై మొత్తం వ్యవస్థమీద ఆధిపత్యం చెలాయిస్తున్న క్రమంలో అనేక సార్లు తిరుగుబాట్లు జరిగాయి. జైనం, బౌద్ధం, ఈ తిరుగుబాట్లలో భాగమే. ఈ రెండు మతాలూ బ్రాహ్మణ ఆధిపత్యాన్ని ప్రశ్నించాయి. అయితే విశేషమేమిటంటే ఈ తిరిగుబాట్లకు నాయకత్వం వహించిన వారంతా క్షత్రియరాజులు, గణనాయకులే. వీరంతా అప్పటి బ్రాహ్మణవాదానికి ప్రత్యామ్నాయ తాత్విక ఆలోచనలు చేసి కొత్తమతాలు ఆవిష్కరించారు. అయితే పురోహిత హిందూవర్గం వీటిని ఎప్పటికప్పుడు అణచివేస్తూ వచ్చింది. సవరణలూ, సంస్కరణలూ, బ్రాహ్మణాలూ, సంహితాలద్వారా అధికారం అదుపు తప్పకుండా జాగ్రత్త పడింది.

BRAOU

గణ రాజ్యాలు, శ్రేణులూ, తెగల పాలన పూర్తిగా అంతరించి దాని స్థానంలో రాజు, పాలక మండలి (పురోహితులలో కూడిన సభ) కలిగిన 'రాజ్యాలు' ఏర్పడ్డాయి. ఈ పరిణామం క్రీస్తుపూర్వం ఒకటో శతాబ్దం నాటికి ప్రారంభమైనట్లు చరిత్రకారులు పేర్కొంటున్నారు. వీటిని రాజ్యాలు, జనపదాలు, మహాజనపదాలు అన్నట్లు తెలుస్తోంది. గౌతమ బుద్ధుని కాలం నాటికి 16 మహాజన పదాలు ఉన్నట్లు పేర్కొన్నారు. అప్పటికి మగధ, కోసల, వత్స, అవంతి, అంగ రాజ్యాలు స్థిరమైన సరిహద్దు రేఖ కలిగిన మహాజన పదాలుగా వింధ్యకు ఆవల విస్తరించి ఉన్నాయి. రాజ్యాలు సరిహద్దులు ఏర్పడడంతో తగవులు, తగాదాలు మొదలయ్యాయి. నల్లని దేవుణ్ణిమాత్రం సృష్టించారు. ఈ కాలం నిజంగానే బ్రాహ్మణులకు 'స్వర్ణయుగం' అయ్యింది. ఒకవైపు రాచమర్యాదలు మరోవైపు అగ్రహారాలతో ఆవర్గం సకలభోగాలు అనుభవించింది. ఈ ఖర్చును శూద్రకులాలు భరింపవలసి వచ్చేది. వైశ్య శూద్ర వర్గాలపై పెద్ద ఎత్తున పన్నులు విధించారు. ఈ క్రమంలో పన్నులకు తట్టుకోలేక కింది కులాల్లో కొంతమంది తన వృత్తుల్ని వదిలేసి పై కులాల వృత్తులు స్వీకరించి 'వర్ణ సంస్కారం' చేసుకున్నారు. అటు రాచరికం మీద, ఇటు గ్రామీణ ప్రజల మీద పట్టు సంపాదించుకున్న బ్రాహ్మణుల చేతికి పన్నులు, వర్తక వాణిజ్యాలు, వ్యవసాయ భూములమీది ఆధిపత్యం లభించింది. ఐతే దక్షిణాది రాష్ట్రాల్లో మాత్రం పరిస్థితి ఈ విధంగా లేదు. కాకతీయులనుంచీ, చోళ, పల్లవ రాజుల దాకా ఈ ప్రాంతపు రాజులంతా దళిత, శూద్ర కులాలకు కూడా సమాన ప్రాధాన్యత నిచ్చినట్లుగా తెలుస్తోంది.

యుద్ధాలు, సంగ్రామాలు సాగాయి. దీంతో రాజు, రాజరికం బలపడింది. ఇనుము వాడకం ప్రారంభం అయ్యేనాటికి వర్తక వ్యాపారాలు పెరిగాయి.

## 3.3.2 సంపదకోసం దండయాత్రలు

భారతదేశం సుసంపన్నమైన తొలిరోజుల్లోనే విదేశీ దండయాత్రల ధాటికి గురికావల్సివచ్చింది. అప్పుడు పొరుగున ఉన్న ఇరాన్‌ను ఆక్రమించి రోమన్ చక్రవర్తి అలెగ్జాండర్ భారత దేశాన్ని ముట్టడించాడు. చరిత్ర రచనలో పితామహుడైన హిరోడోటస్ (Herodotus) ప్రకారం అలెగ్జాండర్ దండయాత్రకు కారణం అతని రాజ్య విస్తరణ కాంక్షతోపాటు, భారత దేశపు సిరిసంపదలు కూడా. వర్తక వాణిజ్యాలు వ్యవసాయ ఉత్పత్తులు పెరిగే కొద్దీ దండయాత్రల భయం ఎక్కువయింది. యుద్ధాలు కూడా పెరిగాయి. రాజ్యాలు అభద్రతా భావానికి లోనయ్యాయి. అప్పుడు సుశిక్షితమైన సైనిక వ్యవస్థ అవసరమయింది. ఈ సేనల ఖర్చులు తడిసి మోపెడు కావడంలో పన్నులు వసూలు చేయడం తప్పనిసరి అయ్యింది. పన్నుల వసూళ్ళకు ఒక యంత్రాగం అవసరమయ్యింది. దీనికోసం "శూల్కాధ్యక్షుల"ను నియమించేవారు. పన్నులు చెల్లించని వారిని శిక్షించేందుకు న్యాయవ్యవస్థ అవసరమైంది. ఐతే ఈ అన్నింటిపైనా బ్రాహ్మణులదే ఆధిపత్యం ఉండేది. పన్నులు ఎంత చెల్లించాలి, ఎవరెవరు చెల్లించాలి, ఏయే పన్నులు చెల్లించాలి, ఎగవేతదార్లపై ఎటువంటి శిక్షలు విధించాలి అనే అంశాలను బ్రాహ్మణులే నిర్ణయించేవారు. శిక్షలు విధించి అమలు చేయడం రాజు అతని యంత్రాంగం చూసుకునేది. 'దండనీతి' రాజనీతిలో భాగంగా ఉండేది.

వర్ణ వ్యవస్థ బలపడిన కాలంలో బ్రాహ్మణ దార్శనికులు ధర్మశాస్త్రాలు, స్మృతుల రూపంలో నియమాలు, కట్టుబాట్లను రుపొందించారు. అయితే ఈ నిబంధనల్లో పై వర్గాలకు కొన్ని మినహాయింపులుండేవి. కౌటిల్యుని అర్థశాస్త్రం ఆకాలపు కుటిల రాజనీతికి అద్దం పడుతుంది. క్షత్రియులు తమ చెప్పుచేతల్లో ఉండనప్పుడు వారిని బ్రాహ్మణులు దెబ్బతీసిన సంఘటనలూ మనకు చరిత్రలో కనిపిస్తాయి. శూద్రుడయిన చంద్రగుప్తుడిని క్షత్రియులమీది కోపంతోనే చాణక్యుడు అధికారంలోకి తెచ్చినట్లు తెలుస్తుంది. కుట్రలు, కుతంత్రాలలో మునిగి తేలిన రాచరికానికి నిధుల కొరత ఏర్పడింది. వ్యవసాయం మీద, వ్యాపారాలమీద విచ్చలవిడిగా పన్నులు వేయక తప్పలేదు. దీనితో సమాజం మళ్ళీ ఆర్థికంగా సంక్షోభంలో పడింది.

పాలన వ్యవస్థ, సైనికి రక్షణ, సిబ్బంది నిర్వహణ, పన్నుల వసూళ్ళు, న్యాయాధికార యంత్రాంగం ఇట్లా రాజ్యం పరిధి విస్తరించింది. వీరందిరికీ జీతభత్యాలు ఇవ్వాల్సివచ్చింది. ఖజానా ఖాళీ అయి_ఉన్న పరిస్థితుల్లో ప్రభుత్వ కార్యంలో ఉన్న పండితులకు, శుల్కాధ్యక్షులకూ కొన్ని గ్రామాలను జీతం క్రింద దత్తత ఇచ్చేవారు. అంటే ఆ గ్రామాల్లో పన్నులు వసూలు చేసుకునే హక్కులు వారికే ఉండేవి. లోహాలవాడకం పెరిగి లోహపరిశ్రమపై ఆధారపడి పనిచేసే తెగలు వచ్చాయి. వృత్తి పన్నులు విస్తరణ, శ్రమ విభజన పెరిగి, వర్తక వాణిజ్యాలు వికసించిన ఈ దశలో మొత్తం 75 రకాల కులాలున్నట్లు తెలుస్తోంది. వ్యవసాయం, వ్యాపారాల్లో లాభాలు పొందిన కులాలు (ఉదా: వెల్లాలు, జాట్‌లు) సంపన్న వర్గాలుగా ఎదిగాయి. సమాజంలో అంతరాలు పెరిగాయి. ఎడమచెయి కులాలు, కుడి చేయి కులాలుగా విభజన జరిగింది. బ్రాహ్మణ వాదం, గుప్తులకాలం నాటికి సమాజంలో పెరిగిపోతున్న కులాలలో కొన్నింటిని తమవైపు మలుచుకోగలిగాయి. గుప్తుల కాలంలోనే అస్పృస్యులుగా చూడబడే 'ఛండాల' జాతి ప్రస్తావనం ఉంది. ఆ జాతి పురాణాలు, శాస్త్రాలు వినే అవకాశం లేదు. ఐతే ఈ అస్పృస్యజాతికోసం 'కృష్ణుడు' అనే నల్లని దేవుణ్ణి మాత్రం సృష్టించారు. ఈ కాలం నిజంగానే బ్రాహ్మణులకు 'స్వర్ణయుగం' అయ్యింది. ఒకవైపు రాచమర్యాదలు మరోవైపు అగ్రహారాలలో ఆ వర్గం సకల భోగాలు అనుభవించింది. ఆ ఖర్చును శూద్రకులాలు భరించవలసి వచ్చేది. వైశ్య శూద్ర వర్గాలపై పెద్ద ఎత్తున పన్నులుకు తట్టుకోలేక కింది

BRAOU

కులాల్లో కొంతమంది తమ వృత్తుల్ని వదలివేసి పై కులాల వృత్తులు స్వీకరించి 'వర్గ సంస్కారం' చేసుకున్నారు. అటు రాచరికం మీద, ఇటు గ్రామీణ ప్రజలమీద పట్టు సంపాదించుకున్న బ్రాహ్మణుల చేతికి పన్నులు, వర్తక వాణిజ్యాలు, వ్యవసాయ భూముల మీద ఆధిపత్యం లభించిది. అతే దక్షిణాది రాష్ట్రాల్లో మాత్రం పరిస్థితి ఈ విధంగా లేదు. కాకతీయుల నుంచి చోళ, పల్లవ రాజుల దాకా ఈ ప్రాంతపు రాజులంతా దళిత, శూద్రకులాలకు కూడా సమాన ప్రాధాన్యత నిచ్చినట్లు తెలుస్తోంది.

## 3.4 ఫ్యూడలిజం పుట్టుక - అభివృద్ధి

మధ్యయుగపు ఐరోపా సామాజిక రాజకీయ వ్యవస్థ ఫ్యూడలిజం పునాదిగా ఎదిగింది. ఆ నీడలు భారత సమాజంపై కూడా పడినాయి. గుప్తులు, ఢిల్లీ సుల్తానుల పరిపాలన కాలం నాటికే భారతదేశంలో భూస్వాములు, దొరలు బలపడ్డారు.

భారత దేశంలో ఫ్యూడలిజం ఎప్పుడు మొదలయ్యింది అనే విషయంలో చరిత్రకారులు మధ్య ఏకాభిప్రాయంలేదు. కొంతమంది కౌటిల్యుని అర్థశాస్త్రంలోనే ఫ్యూడలిజం ఉందంటుండగా మరికొందరు ముస్లిం పాలకుల కాలంలో ఫ్యూడలిజం అభివృద్ధి చెందిందని అంటున్నారు. మరికొందరు అసలు ఫ్యూడలిజం అనే దశ భారతదేశ చరిత్రలో లేనేలేదని వాదిస్తున్నారు. మానవ సంబంధాలను, ఉత్పత్తి సంబంధాలను పరిశీలిస్తే సమాజంలో ఫ్యూడల్ స్వభావం బలీయంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఫ్యూడలిజం యొక్క విలక్షణ గుణం ఏమంటే "ఉత్పాదకునికి తన ఇష్టాయిష్టాలలో నిమిత్తం లేకుండా యజమాని విధించే కొన్ని ఆర్థిక డిమాండ్లను తీర్చే బాధ్యత ఉంటుంది. ఆ డిమాండ్లు సేవలు చేయాలనే డిమాండ్లు కావచ్చు. డబ్బు రూపం లోనో వస్తు రూపంలోనో సుంకాలు చెల్లించాలనేవీ కావచ్చు. కె.ఎస్.గిల్ తన "భారతీయ ఆర్థిక వ్యవస్థ" లో పేర్కొన్నట్లు నాగలి పట్టిన భారతీయ రైతుకు ఖడ్గాలు ధరించిన పాలకుని పట్లా, అతని మనుషుల పట్లా అలాంటి బాధ్యత వాస్తవంగా ఉంది. అయితే, యూరప్‌లోని ఫ్యూడలిజానికి భిన్నంగా ఇక్కడి రైతు సుంకాల రూపంలో సేవలు చెల్లించేవాడు. డి.డి.కోశాంబీ రచనల ప్రకారం క్రీ.శ. 17వ శతాబ్దం నుంచి ఔరంగజేబు రాజ్యం అంతరించేదాక ఫ్యూడలిజం బలంగా ఉందని తెలుస్తోంది. ఫ్యూడలిజంపై తొలిసారిగా అధ్యయనం చేసిన ప్రొఫెసర్ ఆర్. ఎస్. శర్మ ప్రకారం క్రీ.పూ. 300 నుంచి 750 సంవత్సరాల మధ్య కాలంలో ఫ్యూడలిజం పుట్టింది. అలాగే క్రీ.శ.1000 నుంచి 12000 సంవత్సరాల మధ్యకాలంలో భారత ఆర్థిక సామాజిక వ్యవస్థ పూర్తిగా ఫ్యూడలిజం నియంత్రణ కిందికి వచ్చిందని పేర్కొన్నారు. అది భూస్వామ్యమా, అర్థ భూస్వామ్యమా (Semi Feudalism) అన్న సందేహాలు కొందరికి ఉన్నప్పటికీ అప్పటి జనజీవనం ఇంచుమించుగా ఐరోపాలోని ఫ్యూడలిస్టు సామాజిక పరిస్థితుల్లోని జీవనం మాదిరిగానే ఉండింది.

భారతదేశంలో ఫ్యూడలిస్ట్ ధోరణులు తలెత్తడానికి గుప్తులకాలం నాటి రాజకీయ ఆర్థిక పరిణామాలు కారణమయ్యాయి. రాజులు బ్రాహ్మణులకు (పురోహిత వర్గానికి) దానోహమయ్యి భూమి మీద హక్కులను వారికి ధారాదత్తం చేయడం దానిలో పాటు పన్నుల వసూళ్ళు, న్యాయ పంచాయితీలు, శిక్షలు అమలుపరిచే శాసనాధికారం, కుటుంబకలహాలు, ఆస్తుల గొడవల పరిష్కార అధికారం కూడా అప్పగించడంలో ఆ వర్గ అధిపత్యం బలపడి ఇది భూమిమీద వంశ పారంపర్య అధికారానికి, తద్వారా భూస్వామ్యానికి దారి తీసింది. వ్యవసాయ భూమిమీద వచ్చే ఆదాయాన్ని అనుభవించడంతోపాటు భూమిపై సర్వాధికారాలు బ్రాహ్మణులకే అయినాయి. దీనితో గ్రామ ఆర్థిక వ్యవస్థ తద్వారా గ్రామ రాజకీయ వ్యవస్థ ఆ వర్గం చేతికిందికి వచ్చాయి. ఈ వర్గం తమకనుకూలంగా ఉండే వర్గాలను ప్రోత్సహిస్తూ వారికి ఈనాంల రూపంలో గ్రాంటుల

రూపంలో కొత్త సేద్యపు అధికారాలు ఇవ్వడంతో కొత్త వ్యవసాయ - భూస్వామ్యవర్గాలు ఏర్పడినాయి. ఈ భూస్వాములు అపరిమితమైన భూమిని తమ నియంత్రణలోకి తెచ్చుకోవడంతోపాటు ఆ భూమిని కూడా సమకూర్చుకోగలిగారు. దీనికోసం రాజులు ఆజ్ఞలు జారీ చేసి కొన్ని నిమ్నకులాలను ఈ పనిలో నియుక్తం చేసేవారు. ఆ వర్గం భూ యజమానికి లోబడి పని చెయ్యాల్సి ఉండేది. భూమి యజమాని మారినప్పుడు (గ్రాంటు వేరే వ్యక్తికి మార్చినప్పుడు) ఈ బానిసలు కూడా ఆ కొత్త యజమాని అదుపులోకి వెళ్లేవారు. ఇలాంటి వర్గాన్ని 'సేద్యబానిస' (Agriculture Serfs) అనేవారు. గుప్తుల కాలంలో ఈ బానిసలతో 'విష్టి' (Visti) చేయించుకున్నట్లు తెలుస్తుంది. ఫ్యూడలిజంలో కులం రెక్కలు విప్పసాగింది. సామాజిక విభజనతోపాటు రాజకీయ స్థిరీకరణ కూడా విస్తృతమయ్యింది. పౌరునిమీద గతంలో ఒక్క రాజుకు మాత్రమే ఉండే అధికారం ఈ దశలో అంచెలంచెలుగా మారింది. క్రొత్త సామాజిక వర్గాలతోపాటు రాజకీయ గ్రూపులు కూడా అవతరించాయి. నిమ్నకులాలుగా సేవలు చేస్తూ వచ్చిన కొన్ని కులాలు శ్రమవిభజన క్రమం అధికార వ్యవస్థలో అంతర్భాగమైనాయి. పదకొండవ శతాబ్దంనాటికి వాణిజ్యం తిరోగమనం పట్టపగ్గాలు విచ్ఛిన్నం కాసాగాయి. గ్రామీణ ప్రాంతాల్లో భూస్వామ్యం పటిష్టం కావడానికి ఇది ఎక్కువగా దోహదం చేసింది. వికేంద్రీకృత పాలనలో సామంతులు, భూస్వాములు, పెద్ద రైతులు, ఠాకూర్లు రణకులు, రౌతులు (గుర్రాలను దౌడు తీయించేవారు) మొదలైనవారు అధికారంలో నిచ్చెనగా ఏర్పడ్డారు. అంటే రాజ్యం తన అధికారాలను అంచెల వారీగా విభజించి పంచిందన్నమాట. సైన్యంలోని ఆశ్విక దళంలో ప్రధానయోధులుగా ఉన్న రాజపుత్రులు ఒక శక్తివంతమైన జాతిగా అవతరించింది. ఈ కాలం లోనే ఈ శక్తి సామర్థ్యాలు, సాయుధ సంపత్తి భూ ఆక్రమణలకి ఉపయోగపడ్డాయి. అక్బరు కాలంనాటికి భూస్వాముల్లో రాజపుత్రులదే పై చెయ్యి అయ్యింది.

BRAOU

గ్రామీణ భారతదేశంలో భూస్వామ్యంలో అవతరించిన జాతివాళ్ళల్లోనే సుల్తానుల దండయాత్రలు మొదలైనాయి. మహమ్మదీయుల రాకతో అప్పటిదాకా నిరంతర యానంగా కొనసాగిన హిందూ సామాజిక క్రమానికి అవరోధాలు ఏర్పడ్డాయి. ఈ మహమ్మదీయ రాజులు కేవలం పాలకులుగా మాత్రమే రాలేదు. వాళ్ళతోపాటు ఇస్లాం మతంకూడా రావడంతో అప్పటివరకు ఉన్న హిందూ ఆధిపత్యం దెబ్బతినక తప్పలేదు. ముస్లిం పాలన ఇస్లాం మతాన్ని దాంతోపాటు కొత్త సామాజిక విలువల్ని ప్రవేశపెట్టింది. ఈ కాలంలోనే పట్టణాల ద్రుక్పథం ఎక్కువయ్యింది. పట్టణాలకు జనం వలస రావడం అవసరాల రీత్యా క్రొత్త వృత్తులు చేపట్టడం జరిగింది. ప్రభుత్వోద్యోగులకు జీతాలకు బదులు జాగీర్లు (భూములపై హక్కులు) ఇవ్వడం ముస్లింల పాలనలో కూడా కొనసాగింది. తుగ్లక్ ఇటువంటి కేటాయింపులు చేసినట్లు తెలుస్తోంది. దీనివల్ల రైతాంగంలో సంపన్న వర్గం ప్రవేశించింది. సుల్తానులు మొట్టమొదటసారిగా గ్రామాన్ని ఒక యూనిట్‌గా గుర్తించి పాలన సాగించారు. వ్యవసాయాన్ని ప్రధాన ఆర్థిక వనరుగా గుర్తించారు. వృత్తి సంఘాల ఏర్పాటు చేసి అధికారం వికేంద్రీకరణకు పూనుకొన్నారు. దీనివల్ల క్రొత్తగా గ్రామస్థాయిలో నాయకత్వం ఎదిగింది.

మొట్టమొదటిసారిగా వ్యవసాయాన్ని సమగ్రంగా అభివృద్ధి పరిచే అవకాశం మొఘల్ చక్రవర్తుల కాలంలో లభించింది. అప్పటిదాకా రాజులు వ్యవసాయ రంగాన్ని కేవలం పన్నులు వేయడానికి పనికి వచ్చే వృత్తిపరమైన వ్యవస్థగానే చూశారు తప్ప దానికొక రూపం కల్పించలేకపోయారు. అక్బర్ అధికారంలోకి వచ్చిన వెంటనే మొత్తం తన రాజ్యంలోని భూమిని శాస్త్రీయ పద్ధతిలో సర్వే జరిపించాడు. భూసారాన్ని బట్టి సేద్యపు భూమిని గ్రేడులుగా విభజించాడు. రైతులే నేరుగా ప్రభుత్వానికి పన్నులు చెల్లించేలా వ్యవస్థను ఏర్పాటు చేసాడు. భూసారాన్ని బట్టి శిస్తు నిర్ణయించాడు. ఈ పద్ధతిని 'బందోబస్త్' అన్నారు. రైతులకే భూమిమీద హక్కులు ఉండే విధంగా 'రైత్వారీ విధానం' అమలు జరిపారు. ఐతే ఇది భూమిమీద ప్రైవేటు పెత్తనానికి దారితీసింది. డబ్బువుండి పన్నులు చెల్లించగలిగే సత్తా ఉన్న పై వర్గాల చేతుల్లో భూమి ప్రైవేటు

ఆస్తిగా మారింది. మొఘల్ చక్రవర్తుల పన్నుల విధానం గురించి వ్రాసిన ఒక డాక్యుమెంటులో ఆనాటి గ్రామాల్లోని పరిస్థితు గురించి ఈ విధంగా పేర్కొన్నారు.

"ప్రతిగ్రామంలో కొందరు ముఖద్దమాలు (పెద్ద మనుషులు) ఉంటారు. వీరే గ్రామాలకు యజమానులు. వీరు గాక వందలాదిమంది ఆసాములు అని పిలువబడే రైతులుంటారు. ఆసామి రెవెన్యూ కలెక్టర్ నుండి ముఖద్దమాలనుండి అనుమతి తీసుకుని పొలం తయారుచేస్తాడు. గెట్లు వేస్తాడు. వ్యవసాయం చేస్తాడు. ఆ ఋతువులో మొదట్లో నిర్ణయించిన మేరకు ముఖద్దమాల ద్వారా ప్రభుత్వానికి పన్ను చెల్లిస్తాడు."

తమ వ్యవసాయం తామే చేసుకుందుకు చాలా మంది ముఖద్దమాలు కూలీలకు, సేవకులను పెట్టించు కుంటారు. వీరితో దుక్కిదున్నించి విత్తనాలు వేయించి, పంటలు కోయించి ఈ పనికి గానూ డబ్బు రూపంలోగానీ, ధాన్యం రూపంలో గానీ, అంతకు ముందే నిర్ణయించినట్లు వేతనాలు చెల్లిస్తాడు. పంటపూర్తిగా ఆ యజమాని (ముఖద్దమూ) కి చెందుతుంది. అంటేవారు ఒకే సమయంలో ముఖద్దమాగానూ, ఆ సామిగాను పని చేశారన్నమాట... !

ఇక్కడ మనకు మూడు దొంతరల విధానం కనిపిస్తుంది. వేతన కూలీలతో వ్యవసాయం చేయించే ముఖద్దమాలు, ఆసాములు (వ్యవసాయదారులు), వేతన కూలీలు. ఈనాటి గ్రామీణ రైతాంగంలో కూడా ఈ మూడంచెల భూస్వామ్యం కనిపిస్తుంది. భూమి నియంత్రణలో ఆజమాయిషీలో కీలక పాత్ర వహించిన ముఖద్దమాలు జమీందారులుగా ఎదిగారు. పన్నులు (ప్రభుత్వానికి) చెల్లించలేని పేద రైతాంగం తమ భూమి కౌలు హక్కులను ఈ భూస్వాములకు తాకట్టు పెట్టుకున్న సంఘటనలు అటువంటి రైతుల భూములను చిన్న చిన్న రుణాల సాకుతో భూస్వాములు కాజేసిన సంఘటనలు ఆ కాలం నుంచే ఉన్నాయి.

మొఘల్ ల పాలనలో ఈ రకమైన భూస్వామ్య లావాదేవీల వల్ల గ్రామాలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. రాజుకు గ్రామం లోపలి వ్యవహారాల గురించి గానీ, ప్రజలకు రాజ్య వ్యవహారాలకు సంబంధించిగానీ జ్ఞానం లేకుండా పోయింది. స్వయం పాలన, స్వయం సంవృద్ధి, గ్రామ స్వరాజ్యం పేరిట వేదకాలపు 'నిచ్చెన మెట్లు' వ్యవస్థ గ్రామంలో కూడా కొనసాగింది. పాలకులు వేరు, పాలితులు వేరు, వర్తకులు వేరు, శ్రామికులు వేరు కవులు వేరు కళాకారులు వేరు ఇట్లా మొత్తం గ్రామం అంచెలంచెలుగా వందలాది కులాల కూడలిగా మారిపోయింది. ఈ శ్రమ విభజన తొలుత పనిని విభజించుకునే పరస్పర సహకార ప్రక్రియగా మొదలై చివరికి సమాజాన్ని, సమాజంలోని మనుష్యులను విభజించే శాశ్వత విభజన అయ్యింది. ఈ ముకుళిత (Closed) కులబంధిత నిర్మాణం మూలంగా శ్రామికులు, వృత్తిపనుల వాళ్ళు తమ వృత్తి మార్చుకోవడానికి గానీ, తమ వృత్తిలోనే ఉన్నత స్థాయికి ఎదగడానికి గానీ, మరొక స్థలానికి పోవడానికి గానీ అవకాశాలు లేకపోయినాయి. గ్రామం యొక్క సంకుచిత హద్దుల్లో కొత్త నాయకత్వం గానీ కొత్త ఆలోచనలు గానీ ఎదగలేకపోయాయి. కె.యస్.గిల్ చెప్పినట్లు గ్రామ సమాజం భూమిశిస్తు డిమాండ్లను తీర్చిందే తప్ప రాజ్య వ్యవహారాల పట్ల శ్రద్ధ చూపలేదు. మానవ చరిత్రలో ఒక కీలకమైన సమయంలో జరిగిన ఈ లోపానికి దేశం దీర్ఘకాలం పాటు కఠినమైన శిక్ష అనుభవించింది.

## 3.5 విదేశీ పాలన - పరిణామాలు

భారతదేశానికి బ్రిటిష్ వర్తకులు వచ్చేనాటికి దేశంలో అస్తవ్యస్తమైన పరిస్థితులు నెలకొని ఉన్నాయి. క్రమరహిత సామాజిక వ్యవస్థ, అసమగ్ర రాజకీయ పరిస్థితులు విదేశీ ఆధిపత్యానికి సులభమైన మార్గాల య్యాయి. భారతదేశాన్ని బ్రిటీషువాళ్ళు గెలుచుకోవడం ద్వారా మొట్టమొదటిసారిగా కేంద్రీకృత ప్రభుత్వం ఏర్పాటయ్యింది. ఇది ఎ.ఆర్.దేశాయ్ చెప్పినట్లు 'ప్రాథమిక రాజకీయ, పాలనా వ్యవహారాల 'ఏకీకరణ'గా చెప్పవచ్చు.

BRAOU

"బ్రిటీష్ పాలనకు ముందు దేశంలో ఇలాంటి ఐక్యత లేనేలేదు. అప్పట్లో కోకొల్లలుగా ఉండే భూస్వామ్య, సామంత రాజ్యాలు తమ సరిహద్దులను పెంచుకునేందుకు తమలో తాము కొట్లాడుతూ ఉండేవి. భారతదేశాన్ని ఏకచ్ఛత్రాధిపత్యం క్రిందకి తేవాలని అశోకుడు, సముద్ర గుప్తుడు, అక్బరులాంటి మహారాజులు ప్రయత్నించినప్పటికీ, అధిక సంఖ్యాకులు నివసించే గ్రామీణ ప్రాంతాల్లో స్వపరిపాలనా పద్ధతి ఉండటంవల్ల వారు సాధించిన రాజకీయ పాలనా వ్యవహారాల ఏకీకరణ నామమాత్రమైనదిగా చెప్పక తప్పదు. చిరకాలంగా గ్రామీణ ప్రాంతాలు స్వపరిపాలన కింద ఉన్నాయనేది వాస్తవం. గ్రామీణ సంఘాలతోపాటు, కుల సంఘాలు శాసనేతర గ్రామీణ ప్రభుత్వాలుగా కొనసాగేవి. గ్రామానికి ఆర్థిక, రాజకీయ వ్యవహారాలు చూసే నాయకత్వం కులానికి సామాజిక నియంత్రణాధికార రంగాల పెద్దలు (నాయకులు) ఉండేవారు. వీళ్ళ తీర్పే అంతిమ తీర్పయ్యేది తప్ప రాజుతోగానీ, రాజ్యాంగంతో గాని పని ఉండేదికాదు. బ్రిటిషు వాళ్ళకు పూర్వం ఉన్న జాతీయ సమైక్యత కేవలం భౌగోళిక, సాంస్కృతికమైనదే తప్ప రాజకీయ పరమైందీ, రాజ్యపరమైందీకాదు. సామాజిక, చారిత్రక పరిస్థితుల దృష్ట్యా భారత ప్రజల రాజకీయ సమైక్యత సాధ్యపడలేదు. ప్రజలు సామాజికంగా, ఆర్థికంగా, సమైక్యం కాలేదు కనుక రాజకీయంగా కూడా ఏకం కాలేకపోయారు. బ్రిటిషు ప్రభుత్వం చేపట్టిన పాలనా సంస్కరణలు, కేంద్ర ఆధిపత్యంలో పనిచేసే స్థానిక పరిపాలనా వ్యవస్థ ఏర్పాటు చేయడం వల్ల రాజకీయ పాలనా రంగాల ఏకీకరణ జరిగింది.

సాంప్రదాయ, న్యాయ, సాంఘిక నియంత్రణా పద్ధతులను పక్కకు పెట్టి కొత్త చట్టాలు ప్రవేశపెట్టడం ద్వారా బ్రిటిషు ప్రభుత్వం పౌరులపై పట్టు సాధించింది. దేశమంతటికీ ఒకే చట్టం అమలయ్యేలా చూసింది. ఎ.ఆర్. దేశాయ్ చెప్పినట్లు "బ్రిటిషు పాలన, అసమాన, వివక్షపూరిత పాలన స్థానే సమాన ప్రజాస్వామిక పాలనను ఏర్పాటు చేసింది. అంతకుముందు దేశంలో ఉన్న న్యాయ వ్యవస్థ, చట్టాలు కులానికీ, కులానికీ మధ్య సంఘానికీ, సంఘానికీ మధ్య వివక్షలు పాటించేదికాగా బ్రిటిషు ప్రభుత్వం ప్రవేశపెట్టిన న్యాయవ్యవస్థ సమానత్వ ప్రాతిపదికన ఏర్పాటయింది. మతం, కులం తదితర అంశాల ఆధారంగా అప్పటిదాకా కొనసాగిన సామాజిక వ్యవస్థలో ఇదొక గుణాత్మక మార్పు. న్యాయం ముందు అందరూ సమానులే అనే ప్రజాస్వామిక భావనతో కొత్త న్యాయ విధానం ఏర్పాటయ్యింది. అంతకు ముందున్న వ్యవస్థలో నేరం చేసిన బ్రాహ్మణుడికి విధించే శిక్ష స్వల్పమైనదిగా ఉండేది. అదే నేరం చేసిన బ్రాహ్మణేతరునికి విధించే శిక్ష ఎక్కువగా ఉండేది. కొత్త న్యాయ విధానం కింద కుల, మత, జాతి వివక్షతలకు తావు లేకుండా పోయింది.

పాలనా సంస్కరణలు కూడా గ్రామీణ రాజకీయ ఆధిపత్య వర్గాలను దెబ్బతీసాయి. బ్రిటీష్‌పాలన సాధించిన అభ్యుదయ చర్యల్లో ఇదొకటి. సాంప్రదాయ గ్రామాధికారులైన రాజప్రతినిధులు కులపెద్దలు లేదా పెద్ద కులాల వారి చేతుల్లోనుంచి పాలన ప్రభుత్వాధికారుల చేతికి మారింది. దీనికోసం సర్వీసులు ఏర్పాటు చేసి పాలనతోపాటు అభివృద్ధి బాధ్యత కూడా వారికే అప్పగించింది. దీనివల్ల గ్రామాలు దేశవ్యాప్తంగా ఉన్న కేంద్రీకృతపాలనా వ్యవస్థలో భాగస్వాములైనాయి. సరుకుల ఉత్పత్తి పెరిగి ప్రపంచ మార్కెట్‌లో భారతదేశానికి సంబంధాలు విస్తరించాయి. బ్రిటన్‌లోని పారిశ్రామిక విప్లవం భారత సామాజిక పరివర్తనపై తీవ్రప్రభావం చూపింది. క్రొత్త ప్రభుత్వం విద్యావ్యాప్తిని తన బాధ్యతగా స్వీకరించింది. కొత్త ఆర్థిక, పారిశ్రామిక వ్యవస్థ, పరిపాలనా నిర్వహణ కోసం ఆధునిక, వైజ్ఞానిక, సాంకేతిక విద్యల్లో సుశిక్షితులైన వారి అవసరం పెరగడమే ఇందుకు కారణం. ఈ విద్యావిధానం కారణంగా అప్పటివరకు సాంప్రదాయ వ్యవస్థ ఆధిపత్యంలో ఉండి, ఆర్థికంగా, సాంస్కృతికంగా అభివృద్ధి చెందిన కులాలకు ఎక్కువ ప్రయోజనం చేకూరింది. గ్రామీణ పేదరికం, వృత్తి పనులు, జీవన పరిస్థితుల మూలంగా కింది కులాలు విద్యారంగానికి

BRAOU

చేరువకాలేక పోయాయి. ఐతే ఇంగ్లీషు చదువుద్వారా శాస్త్ర సాంకేతిక విజ్ఞానంతోపాటు ఆధునిక భావనలైనటువంటి స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, సమానత్వం ఈ నయా మేధావి వర్గానికి సామాజిక బాధ్యతను పెంచాయి. కొత్త ప్రాపంచిక దృక్పథాన్ని అలవరచుకొన్న ఈ వర్గంలోని కొందరు కుల, మత, జాతి, లింగ వైషమ్యాలు, వివక్షతలకు వ్యతిరేకంగా ఉద్యమాలు సంస్కరణలు మొదలుపెట్టారు.

ఐతే ఇంగ్లీషు విద్యాసంస్థలు కేవలం 'మెకాలే' రూపొందించిన చదువు మాత్రమే కాక కొత్త దృక్పథాలు ముందుకుతెచ్చాయి. మిషనరీల ఆధీనంలో నడిచే ఈ పాఠశాలలు హిందూ సాంప్రదాయాలను తూలనాడాయి. అసమంజసమైన, కుల, మత వ్యవస్థలను వ్యతిరేకిస్తూ లౌకిక విద్యతోపాటు తమ మత విశిష్టత చాటుకునే ప్రయత్నం చేశాయి. లౌకిక విద్యగా ఆంగ్ల విద్యను గుర్తించిన వారిలో రాజా రామమోహన్ రాయ్ లాంటి అభ్యుదయ వాదులు కూడా ఉన్నారు. "భారతదేశంలో ప్రాచీన విద్యను వదిలపరచాలను కోవడం మూఢవిశ్వాసాలను, సాంప్రదాయ అధికార (కుల) వ్యవస్థను శాశ్వితం చేయడమే, అలాగే భారత దేశాన్ని చీకట్లో ఉంచాలంటే సంస్కృత విద్యావిధానాన్ని కొనసాగనివ్వాలి" అని రాయ్ వ్యాఖ్యానించాడు.

ఆ తర్వాత బ్రహ్మసమాజం, ఆర్య సమాజం, రామకృష్ణా మిషన్, ఆలీఘర్ ఉద్యమం వంటి సంస్థలు, దేశ్‌ముఖ్, చిప్లుంకర్, అంగార్కర్, ముగాల్ భాయ్ కరం చింద్, కార్వే, జ్యోతి బాపులే, తిలక్, గోఖలే, మౌలీలు వంటి ప్రముఖులు ఆధునిక విద్యావ్యాప్తికి కృషిచేశారు. సమాజంలోని అన్ని వర్గాలకు కుల వివక్షతకు తావు లేకుండా విద్య లభించాలన్నారు. స్త్రీ, పురుషుల బేధ భావం ఉండకుండా మహాత్మాజ్యోతి బాపులే స్త్రీలకోసమే ప్రత్యేక విద్యాలయాలు స్థాపించారు. దీంతో నూతన ప్రాపంచిక జ్ఞానంతోపాటు, ఆత్మాభిమానాన్ని పెంపొందించే అంశాల బోధన కూడా జరిగింది. ఎ.ఆర్. దేశాయ్ అన్నట్లు "ఆధునిక విద్య రెండు విభిన్నమైన పాత్రలు పోషించింది. బ్రిటిష్ సామ్రాజ్యం పటిష్టత కోసం ఆధునిక విద్యను ప్రవేశ పెట్టినప్పటికీ అదే బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడడానికి కూడా ఈ విద్య దోహం చేసింది. బ్రిటిష్ పాలనలో కొత్త సామాజిక, రాజకీయ, సాంస్కృతిక శక్తులు జనించాయనేది వాస్తవం. ఈ శక్తులు నిలబడిపోలేదు. పురోగమించాయి. ఈ పురోగమనం భారతజాతీయోద్యమానికి నాంది అయ్యింది. అందుకే మనకు స్వాతంత్రోద్యమ కాలంలో నాయకత్వం వహించిన పేర్లలో ఎక్కువగా ఈ చదువుకున్న బ్రాహ్మణ యువకుల పేర్లే కనిపిస్తాయి.

నిజానికి కొత్త సామాజిక, రాజకీయ, ఆర్థిక శక్తులు ఎదుగుతున్న క్రమంలోనే ఘర్షణ మొదలయ్యింది. పందొమ్మిదవ శతాబ్దం రెండో భాగంలో చదువుకున్న భారతీయ యువకుల సంఖ్య పెరిగింది. ఉద్యోగాలివ్వాలని, తెల్లవారి చేతుల్లో ఉన్న ఉన్నత హోదాల్లో తమకు భాగస్వామ్యం ఉండాలని వారి వాదన. భారతీయ పారిశ్రామిక భూర్జువాలు పెరిగాయి. భారత పరిశ్రమల పరిరక్షణ ఆర్థిక ప్రతిపత్తి వంటి డిమాండ్లతో ఈ వర్గాలు దేశభక్తులైనారు. భూమిశిస్తును తగ్గించాలన్నది వ్యవసాయదారుల డిమాండ్ అయ్యింది. కార్మికులు తమ స్థితిగతుల మెరుగు, జీవన వేతనం కోరుకున్నారు. మొత్తంగా హక్కులు, పత్రిక స్వేచ్ఛ, ఎన్నికల పద్ధతి, ఓటింగ్ హక్కు, ప్రాతినిధ్య సంస్థలు, ప్రాంతీయ ప్రతిపత్తి, హోంరూల్ ఇవన్నీ కలసి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలన్న డిమాండ్‌కు పురి కొల్పాయి.

ఇంగ్లీషు చదువులో, సామాజిక స్వేచ్ఛ, ప్రకృతి విజ్ఞానం, హేతువాదతత్వం, సాహిత్యం, సమానత్వ భావన, లౌకికవాదం, ప్రజాస్వామ్య సూత్రాలు, భారతీయ యువతను ప్రభావితం చేసాయి. బానిసత్వానికి, అణచివేతకు నిలయమైన కులం పెత్తనం, ప్రతి ఘాతశక్తులు, ప్రాచీన సాంప్రదాయాలపై తిరుగుబాటుకు ఇది దోహదం చేసింది. ఇది అంతిమంగా రాజ్యంపై తిరుగుబాటుగా మారింది.

BRAOU

## 3.6.0 జాతీయోద్యమం - కొత్త సామాజిక వర్గాలు

బ్రిటిష్ వారి పరిపాలన, సంస్కరణలు, శాసనాలు భారత సాంప్రదాయ, సామాజిక స్వరూపాన్ని మార్చి వేశాయి. అయితే మార్పు సంపూర్ణంగా జరుగక పాత వ్యవస్థలు కొనసాగుతూనే వాటితో పాటు కొత్త విలువలు ఎదగాల్సివచ్చింది. అసంపూర్తిగా జరిగిన పారిశ్రామికీకరణ ఫలితంగా పెట్టుబడి దారీ వ్యవస్థ ప్రవేశానికి ముందున్న పాత ఆర్థిక వ్యవస్థ నాటి చేతి వృత్తులు, గ్రామీణ వృత్తులు అవశేషాలు కొనసాగుతూ వచ్చాయి. అదే విధంగా లోపభూయిష్టమైన భూ సంబంధమైన చట్టాల మూలంగా గ్రామీణ రైతాంగం పరిస్థితి మారలేదు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో బ్రిటిష్ ప్రభుత్వం రైత్వారీ పద్దతి వల్ల తలెత్తిన భూస్వామ్యం స్థిరపడింది. అలాగే భూ యాజమన్య హక్కులు పొందిన జగీర్దారులు, పరోక్ష భూస్వాములు, జమిందార్లు, వారికింద పనిచేసే కౌలుదార్లు, రైతుస్వాములు (రైతులు), వ్యవసాయ కూలీలు, వ్యాపార వేత్తలు, వడ్డీ వ్యాపారులు, షావుకార్లుగా అసమానతలతో కూడిన సామాజిక నిర్మాణం ఏర్పడింది. అలాగే అరకొరగా జరిగిన పారిశ్రామికీకరణ, నగరీకరణ మూలంగా అధునిక పెట్టుబడిదార్లు, పారిశ్రామిక వేత్తలు, వ్యాపారస్తులు, వైద్యులు, న్యాయవాదులు, మేనేజర్లు, సాంకేతిక నిపుణులు, ఇట్లా పాశ్చాత్య తరహా స్తరీకరణ నగరాల్లో జరిగింది. అయితే ఇంగ్లండ్, ఫ్రాన్స్‌లో మాదిరి కాకుండా ఇక్కడ ఈ కొత్త వర్గాలతోపాటు పాత సాంప్రదాయ వర్గాలు సహజీవనం సాగించడం మొదలు పెట్టాయి. కొత్త అవకాశాలను ఈ పాత అధిపత్యకులాలు సమర్థవంతంగా ఉపయోగించుకున్నాయి.

## 3.6.1 జాతీయ కాంగ్రెస్ రాజకీయాలు

BRAOU

చదువుకున్న ఉన్నత కులాల్లో ప్రతిభావంతులైన కొందరు అప్పుడప్పుడే పైకి వస్తున్న వాణిజ్య, పారిశ్రామిక బూర్జువాల మద్దత్తుతో 1885 లో మొట్టమొదటి జాతీయ రాజకీయ పక్షంగా భారత జాతీయ కాంగ్రెస్‌ను స్థాపించారు. కాంగ్రెస్ ఇంగ్లిష్‌ను వ్యవహార భాషగా స్వీకరించింది. ఈ విధంగా మేధావి వర్గం మొట్టమొదటి కాంగ్రెస్ నాయికులయ్యారు.

అగ్రవర్ణ మేధావి వర్గంలో అటు గోఖలే, నౌరోజీ, బెనర్జీ, రనడే వంటి ఉదార జాతీయ వాదుల నుంచి మొదలుకొని చిత్తరంజన్ దాస్, రాజగోపాలాచారి, నెహ్రూ, రాజేంద్రప్రసాద్, సుభాష్ చంద్రబోస్ వంటి సోషలిస్టుల దాకా ఉన్నారు. అయితే రెండో దశలో నాయికత్వం సోషలిస్టులు, కమ్యూనిస్టులు, చేతినుంచి జారిపోవడంతో కార్మిక, కర్షక వర్గానికి పోరాటాలకి న్యాయం జరుగలేదు. ఇండియన్ నేషనల్ కాంగ్రెసు 1919-20లో గాంధీజీ సిద్ధాంతాలు రాజకీయ నాయకత్వ ప్రభావానికి లోనయ్యింది. అయితే గాంధీజీ ఈ పోరాడే కార్మికుల వర్గపక్షంగా నిలబడకుండా వర్గ సామరస్యం పెట్టుబడిదారీ ధర్మకర్తృత్వం, పెట్టుబడిదారులు తండ్రులు, శ్రామికులు వారి సంతతి తదితర సిద్దాంతాలు ప్రవేశ పెట్టాడు. ఇవి పారిశ్రామిక వేత్తలకు బాగా నచ్చాయి. వర్గపోరాట ప్రాతిపదికగా ఎదుగుతున్న కార్మిక ఉద్యమాలను ఇవి నీరు గార్చాయి. ఈ పరిస్థితిని భగత్ సింగ్ తన చివరి రెండు లేఖల్లో వివరిస్తు "రైతులు విదేశీ దాస్యబంధాలు నుంచే కాక భూస్వాముల, పెట్టుబడిదార్ల చెరనుంచి కూడా విముక్తి సాధించాలి". అని కరాఖండిగా చెప్పి ఎలాంటి జంకులేకుండా ఉరికంబం ఎక్కాడు. కాగా గాంధీజీ పెట్టుబడిదారీ పారిశ్రామిక వర్గాల్లో బహుళ కీర్తిని పొందారు. బిర్లా, బజాజ్, అంబాలాల్ సారాభాయ్, కస్తూరీభాయ్ లాల్ భాయ్ తదితర సంపన్న పారిశ్రామిక వేత్తలందరూ గాంధీజీ నాయకత్వం కింద ఉన్న కాంగ్రెస్‌ను సమర్థించడమే గాకుండా పెద్ద ఎత్తున విరాళాలు, నిధులు అందజేసారు. ఈ రకంగా భారత జాతీయ కాంగ్రెసు, బ్రాహ్మణ పారిశ్రామిక వేత్తలకు దగ్గరయి అదే దశలో

అణగారిన ప్రజలు, అస్పృశ్యులు, నిరుపేద కార్మికులకు దూరమయ్యింది. అస్పృశ్య వర్గాల ప్రజల డిమాండ్లు, సమస్యలు కాంగ్రెస్ ఎజెండాలో ఆనాడు చోటు చేసుకోలేదు. భారత స్వాతంత్ర్య సమరం ఆర్థిక శక్తులను జాతీయ వాద దిశగా ఏకం చేసినంతగా సాంఘిక శక్తులను చేయలేక పోయింది. జాతీయోద్యమంలో, దళిత బ్రాహ్మణేతర వర్గాలు పాల్గొనడానికి చాలాకాలం పట్టింది. వారిని చైతన్యవంతులను చేయడం అంటే కులమత కట్టుబాట్లు దాటి రావడమే. 1930-40 మధ్యకాలంలో ఈ 'అంధకారం'లో ఉన్న జాతులు జాతీయ రాజకీయ చైతన్య ప్రవంతిలో చేరినట్లు ఎ.ఆర్.దేశాయ్ పేర్కొన్నాడు. దీనికి అంబేద్కర్ నాయకత్వంలోకి రావడం, శాసనోల్లంఘనం వంటి ప్రజా ఉద్యమాలు, ఉద్యమ సాహిత్యం, వర్గదృక్పథం, నమ్మిన అతివాద కాంగ్రెస్ నేతలు ఈ చైతన్యానికి కారణమైనాయి.

ఐతే అటు స్వాతంత్ర్య పోరాటంగానీ, ఇటు చైతన్యానికి దోహదం చేసిన ఉద్యమాలుగానీ అన్నిప్రాంతాల్లో ఏకకాలంలో జరుగలేదు. అంటే జాతీయ స్థాయిలో స్వాతంత్ర్య ఉద్యమం జరిగిందే తప్ప పీడన నుంచి విముక్తి కలగాలని, ప్రతిమనిషికి స్వేచ్ఛ సమానత్వం అందాలని ఎవరూ కోరలేదు. అప్పటి నాయకత్వపు వర్గ దృష్టి వల్ల, ఆ ఉద్యమంలో పాల్గొన్న వారంతా ఒకే సామాజిక వర్గానికి చెందినవారు కావడంవల్ల అది సాధ్యపడలేదు. అయితే స్వాతంత్ర్యోద్యమ చివరి దశలో డా॥ అంబేద్కర్, మహాత్మాగాంధీ తదితరులు అస్పృశ్యతా నిర్మూలనను ఉద్యమంలో భాగంగా చేయడం వల్ల ఈ కొద్దిపాటి చైతన్యం వచ్చింది. ఐనప్పటికి 1917 వరకు జాతీయోద్యమం ఉగ్ర తరగతి, మధ్యతరగతి ప్రజలకే పరిమితం అయ్యింది. సహాయ నిరాకరణోద్యమం అన్నివర్గాల ప్రజలను ఆకట్టుకొని జాతీయోద్యమంగా ఎదిగే దశలోనే బార్డోలీ తీర్మానంలో ఉద్యమ విరమణ నిర్ణయం తీసుకోవడంతో వర్గ చైతన్యం ఏర్పడకుండా పోయింది. గాంధీజీ బూర్జువాలకు మద్దతు నిచ్చిన దరిమిలా ఉద్యమం కూలిపోయిందని లాలా లజపత్‌రాయి, మోతీలాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్ వంటి నాయకులు ఆరోపించారు.

BRAOU

## 3.6.2 దళిత చైతన్య ప్రవంతి:

జాతీయ రాజకీయాల్లో వర్గవిభేదాలు తలెత్తిన కాలంలోనే డా. బి.ఆర్. అంబేద్కర్ వంటి నాయకులు దళితుల చైతన్యానికి నడుం బిగించారు. గాంధీజీ 1932లో అఖిల భారత హరిజన సంఘాన్ని స్థాపించినప్పటికి ఆ సంఘంలో హరిజనేతరుల నాయకత్వం కొనసాగింది. గాంధీకూడా ఎంతసేపు 'ఉపరితలం మారాలన్నాడే తప్ప మూలాలు మార్చాలని చూడలేదు. నాయకత్వంవారికి ఇవ్వలేదు.' తరతరాలుగా దళితులకు అధికారం దూరం చేసిన హిందూ మతానికి వ్యతిరేకంగా అంబేద్కర్ ఉద్యమం కొనసాగించి, ఆ ఆధిపత్యం దెబ్బతీసే ప్రయత్నంలో భాగంగా దేవాలయ ప్రవేశ నిషేధంపై పోరు సల్పాడు. దళిత కులాల సాంఘిక అంతస్తు పెంచడానికి ఆర్థిక ప్రగతి తప్పనిసరి, అలాగే విద్యావ్యాప్తి రాజకీయ హక్కులు అవసరం అని అంబేద్కర్ భావించాడు. ఆయనే తొలిసారిగా దళితులను జాతీయ రాజకీయ ఉద్యమ ప్రవంతిలో కలిపే ప్రయత్నం చేశాడు. అంబేద్కర్ ఒకచోట ఇలా అన్నాడు.

"ఎవ్వరూ మీ అగచాట్లను తొలగించలేరు. రాజకీయాధికారం హస్తగతం కానిదే మీరు ఆపని చేయలేరు... జీవన సామాజిక, ఆర్థిక స్మృతిని సవరించడానికి జంకని మనుషులు అధికారంలో ఉండే ప్రభుత్వం మనకు ఉండి తీరాలి. బ్రిటిషు ప్రభుత్వం ఎన్నటికీ ఆ పాత్ర నిర్వహించలేదు. ప్రజలకోసం, ప్రజల చేత ఏర్పడ్డ ప్రజల ప్రభుత్వం ఒక్కటే. అంటే స్వరాజ్య ప్రభుత్వం ఒక్కటే ఆ లక్ష్యసాధనను సాధ్యం చేస్తుంది."

డాక్టర్ అంబేద్కర్ తన చైతన్యోద్యమాన్ని మహారాష్ట్రలో ప్రారంభించి మొట్టమొదటిసారిగా దళితుల సమస్యను జాతీయ రాజకీయ ఎజెండాలోకి తెచ్చాడు. అంబేద్కర్ మరాఠా సైనిక కుటుంబానికి చెందినవాడు.

మహారాష్ట్రలో శివాజీ కాలం నుంచీ, పీష్వాలు, బ్రిటిష్ వాళ్ళ కాలం దాకా 'మహార్' కులస్తులకు సైన్యంలో ప్రవేశం ఉంది. కొన్నిసార్లు కీలక పదవులు కూడా నిర్వహించేవారు. మహారాష్ట్ర మహార్ కులస్తులదేననే (మహార్-రాష్ట్ర) సిద్ధాంతం కూడా ఒకటుంది. అప్పటి కొల్హాపూర్ మహారాజు ఆర్థిక సహాయం, ప్రోత్సాహంతో విదేశాల్లో చదువు ముగించుకుని అంబేద్కర్ 1917లో ఇండియాకు తిరిగివచ్చాడు. అప్పటి రాజకీయాలు జాతీయోద్యమంతో సంబంధం లేకుండా ఆయన దళితులకు చైతన్యవంతులను చేసే కార్యక్రమం చేపట్టాడు. సమానత్వం కోసం పోరాడాడు. అదే సమయంలో బొంబాయి ప్రెసిడెన్సీ శాసన మండలికి జరిగిన ఎన్నికల్లో 9 శాతం (జనాభా ప్రాతిపదికన) సీట్లు 'అస్పృశ్యుల' కివ్వాలని కోరి సంచలనం సృష్టించాడు. దాదాపు దశాబ్ద పోరాటం తరువాత ఆయన శాసన మండలికి నామినేట్ అయ్యారు. అప్పటినుంచి అస్పృశ్యులను చైతన్యవంతుల్ని చేయడంతోపాటు బ్రిటిషు పాలకులను ఒప్పించి అస్పృశ్యులకు విద్యావకాశాలు కల్పించడంవంటి విషయాల్లో అంబేద్కర్ కృతకృత్యుడయ్యాడు.

తరతరాలుగా అనుభవిస్తున్న అగ్రవర్ణాల ఆధిపత్యాన్ని రాజకీయ అధికారంలో తప్ప దెబ్బకొట్టలేమని అంబేద్కర్ భావించాడు. అందుకే అతను మొదట సమాన రాజకీయ ప్రాతినిధ్యం కావాలని డిమాండు చేసినాడు. సైమన్ కమిషన్ (1928) ముందు కూడా ఆయన అస్పృశ్యుల సమస్యలను నివేదించాడు.

ఇది కాంగ్రెస్‌లోని అగ్రవర్ణనేతలకు ఆందోళన కలిగించింది. ఓటుహక్కు, ప్రత్యేక నియోజక వర్గాల ప్రస్తావన సంచలనం సృష్టించింది. రౌండ్ టేబుల్ సమావేశంలో ఈ ప్రస్తావన తెచ్చినందుకు గాంధీతో సహా జాతీయ నాయకులంతా బ్రిటిష్ వాళ్ళ తొత్తుగా విమర్శించారు. దానికి సమాధానంగా 1930 నాగ్‌పూర్ కాన్ఫరెన్స్‌లో ఇలా అన్నాడు "ఒక దేశంపై ఇంకో దేశం అధికారం చెలాయించరాదు. ఈ విషయంలో నేను కాంగ్రెస్ వాళ్ళతో ఏకీభవిస్తాను. మరో విషయం కూడా ఇక్కడ ముక్కుసూటిగా చెప్పదలచుకున్నాను. ఒక వర్గాన్ని (కులాన్ని) పాలించే అధికారం మరో వర్గానికి కూడా లేదు. ఈ ప్రకటన జాతీయ వాదులకు కంటగింపు అయినప్పటికీ అస్పృశ్యులను బలహీన వర్గాలకు చెందిన ఇతర జాతీయ 'దళితులుగా' సమీకరించగలిగింది. రెండవ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌కు వెళ్ళి తిరిగి వచ్చిన అంబేద్కర్‌కు 114 దళిత కులాలు ఒక్కటై ఘనస్వాగతం పలికాయి. 1932 కమ్యూనల్ అవార్డు ద్వారా అంబేద్కర్ సాధించిన ప్రత్యేక నియోజక వర్గాలకు వ్యతిరేకంగా గాంధీ నిరాహార దీక్షకు పూనుకోవడంలో సవర్ణులకు, అస్పృశ్యులకూ మధ్య వివాదం తారాస్థాయికి చేరింది. చివరకు పూనా ఒప్పందంతో ఇది చల్లారినా దళిత రాజకీయ చైతన్యం మాత్రం పెరిగింది. 1937లో లేబర్ పార్టీ ఏర్పాటు చేసి దానిని సామ్యవాద భావాలు గల విశాల వేదికగా తీర్చిదిద్దే ప్రయత్నం చేశాడు. 1937 ఎన్నికల్లో ఈ పార్టీ బొంబాయి శాసనసభలో పది రిజర్వుడ్ స్థానాలలో మూడు జనరల్ స్థానాలను గెలుచుకుంది. అప్పటినుండి అటు శాసనసభలో తమ హక్కులు ప్రయోజనాలకోసం పోరాడుతూనే, ఇటు బయట హిందూ మతంపై, రాజకీయ ఆధిపత్య వర్గాలపై ఉద్యమం నడిపాడు. అంబేద్కర్ నాయకత్వంలో జాగృతమైన దళితులు స్వాతంత్ర్యకాలంనాటికి బలమైన శక్తిగా ఎదిగారు.

BRAOU

### 3.6.3 స్వాతంత్ర్యం - దాని ఫలితాలు :

బ్రిటిషు పాలకులు స్వాతంత్ర్యం అప్పగించి వెళ్ళడం హఠాత్తుగా జరిగింది. పోరాటం సుదీర్ఘమే అయినా ఫలితం అంత తొందరగా ఉంటుందని ఊహించలేక పోయాయి. అప్పుడు జాతీయ ప్రభుత్వ నాయకత్వం ఎవరు స్వీకరించాలనే ప్రశ్న వచ్చింది. అప్పటిదాకా జాతీయ ఉద్యమ నాయకత్వంలో ఉన్న వర్గం పాలక వర్గంగా అవతరించింది. అయితే చాలా కాలంగా దేశంలోని సాంఘిక అసమానతలగురించి లోలోపల ఆలోచిస్తున్న "సోషలిస్టు" ఆలోచనాపరులైన నెహ్రూ, అతని అనుచరులే అధికారంలోకి రావడంతో సనాతన

సాంప్రదాయ వాదుల మాటలు చెల్లుబాటు కాకుండా పోయాయి. నెహ్రూ నాయకత్వ ప్రభావం ఆర్థిక రంగంపై విశేషంగా పడింది. ప్రజాతంత్ర సామ్యవాద రిపబ్లిక్‌గా భారతదేశానికి సోషలిస్టు రూపం ఇవ్వడానికి నెహ్రూ ప్రయత్నించాడు. ఇందులో భాగంగా సోవియట్ తరహా ప్రణాళికా వ్యవస్థ, పంచవర్ష ప్రణాళికలు, అభివృద్ధి పథకాలు, మిశ్రమ ఆర్థిక వ్యవస్థ, ప్రభుత్వరంగం, వంటి విధానాలు సమగ్ర సామాజిక అభివృద్ధికి దోహదపడినాయి.

అప్పటివరకు దళిత కులాలకు జాతీయ స్థాయి చైతన్యం లేదు. డా. అంబేద్కర్ నాయకత్వంలో మహారాష్ట్రలో, పొరుగునే ఉన్న తమిళనాడు (మద్రాసు రాష్ట్రం)లో దళితులు జాగృతం అయినా రాష్ట్రస్థాయి నాయకత్వం మాత్రమే అందించగలిగారు. నెహ్రూ తన ప్రభుత్వంలోకి డా. అంబేద్కర్‌ను న్యాయశాఖ మంత్రిగా తీసుకున్నాడు. అలాగే అంబేద్కర్ రాజ్యాంగ రచనా సంఘం అధ్యక్షుడుగా కూడా ఎన్నికయ్యాడు. ఇది దళితులకు లాభించింది. సమాన ప్రాతినిధ్యం ప్రయోజనాలకు వీలుగా రాజ్యాంగ రూపకల్పన జరిగింది. రిజర్వేషన్లు, రాజకీయ ప్రాతినిధ్యానికి వీలుగా ప్రత్యేక నియోజక వర్గాలు, సమాన పౌరహక్కులు, అస్పృశ్యత నిర్మూలన, సెక్యులరిజం, వంటి వాటి ద్వారా అంబేద్కర్ తన పోరాట లక్ష్యాన్ని రాజ్యాంగ బద్ధం చేశాడు. అప్పటికే లేబర్ పార్టీ నుంచి రిపబ్లికన్ పార్టీ దాకా ఐదారు వేదికలు దళితులను రాజకీయ స్రవంతిలో కలిపే ప్రయత్నం చేస్తూ వచ్చాయి. ఇది మహారాష్ట్ర రాజకీయాలపై దళితుల పట్టు పెరగడానికి కారణమయ్యింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఇప్పటిదాకా మహారాష్ట్రలో దళితపార్టీలే పాలకవర్గ నిర్ణయాంశంగా మారాయి.

స్వాతంత్ర్యానికి పూర్వంనుంచీ డాక్టర్ అంబేద్కర్ సాగిస్తున్న ఉద్యమం ఇతర రాష్ట్రాల దళితులను కూడా జాగృతం చేసింది. ఇది కేవలం అస్పృశ్యులనే కాకుండా వెనుకబడిన వర్గాలనుకూడా చైతన్యపరిచింది. కామరాజ్ నాడార్ నేతృత్వంలో మద్రాసు రాష్ట్రంలో వెనుక బడిన కులాల ప్రజలు సమానాధికారం కోసం ఉద్యమం ప్రారంభించారు. అప్పటికే మరోవైపు "ఆత్మాభిమాన సంఘం" (Self-Respect Conference) లో ఇ.వి. రామస్వామి నాయకర్ నేతృత్వంలో బ్రాహ్మణ వ్యతిరేక ఆందోళన విధ్వంసకరూపం దాల్చింది. మంటేంగ్- ఛెమ్స్‌ఫోర్డ్ సంస్కరణలలో 1919లో స్థానిక వికేంద్రీకరణ జరిగి ఆ ఎన్నికల్లో వెనుకబడిన కులాలు స్థానిక సంస్థలను హస్తగతం చేసుకున్నాయి.

నాడార్‌ల ఉద్యమానికి అప్పటి కాంగ్రెస్ నేతలు డా.సి. రాజగోపాలాచారి తదితరులు దిగిరాక తప్పలేదు. తమిళనాడు (మద్రాసు) తొలి ముఖ్యమంత్రిగా ఉన్న రాజగోపాలాచారి 1939లో దేవాలయ ప్రవేశ అధికార చట్టాన్ని తీసుకువచ్చారు. ఈ చర్య కాంగ్రెసుకు లాభించింది. అప్పటిదాకా బ్రిటిష్ పాలకులకు మద్దతు నిచ్చిన నాడార్లు అస్పృశ్య కులాలు కాంగ్రెసువైపు మొగ్గారు. అప్పటిదాకా జాతీయ రాజకీయాల్లో ఎటువంటి గుర్తింపు లేని వెనుకబడిన కులాలకు స్వాతంత్ర్యోద్యమం అనంతరం ఎనలేని ప్రాతినిధ్యం లభించింది. కామరాజ్ నాడార్ తిరుగులేని నాయకుడయ్యాడు. అంతేకాక కాంగ్రెస్‌పార్టీకి జాతీయ అధ్యక్షుడుగా, స్వతంత్ర మద్రాసు రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా కూడా ఎదిగాడు. ఆ తరువాత నాడారులు ఇతర వెనుకబడిన కులాలు చీలిపోవడంతో 'ద్రవిడ మున్నేట్రకజఘం' (డి.యం.కె) వంటి పార్టీలు అవతరించాయి. ఈ చైతన్యమే తమిళనాడును వెనుకబడిన తరగతుల రాజకీయ వేదికగా రూపొందించింది. తరువాత వచ్చిన ప్రభుత్వాలన్నీ అన్నాదురై, కామరాజ్ నాడార్, రామస్వామి నాయికర్‌ల తత్వ భూమికలోనే నడిచాయి.

దక్షిణాదిలో వచ్చినంత రాజకీయ చైతన్యం దళితుల్లో ఉత్తర భారతదేశంలో చాలాకాలం దాకా రాలేకపోయింది. పేదరికం, నిరక్షరాస్యత, ఫ్యూడల్ ఆధిపత్యం, బానిసత్వ సంబంధాలు, సనాతన ఆచారాలు వారిని అజ్ఞానంలో ఉంచాయి. స్థానిక సంస్థల ఏర్పాటు, రాష్ట్రాల విభజన, కొత్తరాష్ట్ర ప్రభుత్వాల ఏర్పాటులో

BRAOU

కొత్త నాయకత్వం వచ్చినప్పటికీ, దానిని మొదటినుంచీ గ్రామీణ సమాజంపై ఆదిపత్యం చెలాయిస్తున్న అగ్ర కులాలే హస్తగతం చేసుకున్నాయి. అగ్ర కులాంతో పోటీ పడగలిగే సామాజిక అంతస్తుగానీ, ఆర్థిక హోదాగానీ దళిత కులాల్లో లేకపోవడం దీనికి ప్రధాన కారణమయ్యింది. రాజపుత్‌లు, కాయస్తులు, జాట్‌లు, మాజీ జాగీర్దార్లు, రాజస్థాన్, బీహార్, మధ్యప్రదేశ్‌లలో అధికారంలోకి వచ్చారు. ఐతే అన్ని రాష్ట్రాలలో, జాతీయ రాజకీయాలలో మొదటి బ్రాహ్మణులే ఉన్నారు.

రాష్ట్రాలవారీగా, రెండో తరం నాయకులు రాష్ట్రస్థాయి నాయకులుగా భూస్వామ్య కులాలు ఎదిగాయి. రాజస్థాన్‌లో బ్రాహ్మణులు, జాట్‌లు, కాయస్తులు, మహాజన్‌లు, రాజపుత్రులు ప్రధానంగా ముందుకు వచ్చారు. మొదటి మూడు సాధారణ ఎన్నికల్లోనూ ఈ కులాలే ఆధిపత్యంలో ఉన్నప్పటికీ జాట్‌ల బలం రాను రాను పెరిగింది.

భారత రాజకీయాల పరిణామానికి బీహార్ చక్కని ఉదాహరణగా నిలుస్తుంది. గ్రామీణ సామాజిక స్తరీకరణ ఇక్కడి రాజకీయాల్లో కనిపిస్తుంది. అగ్రవర్ణాల సంఖ్య అతి తక్కువే అయినా రాష్ట్రాన్ని ఎక్కువకాలం పరిపాలించింది ఈ కులాలే. స్వాతంత్ర్యం వచ్చేనాటికి బీహార్ జనాభాలో అగ్రకులాలు 13.22 శాతం. మిగతా జనాభా వెనుకబడిన కులాలు, ఎస్.సిలు, ఎస్.టిలు, ముస్లింలు. 1951 లెక్కల ప్రకారం వీరిలో బ్రాహ్మణులు 5.1 శాతం. రాజ పుత్రులు 4.5 శాతం. వైశ్యులు 3.9 శాతం. వెనుకబడిన కులాలు 38.1 శాతం. ఎస్.సిలు, ఎస్.టిలు 23.2 శాతం ఆదివాసులు (Aboriginals) 2.2 శాతం కాయస్తులు 1.8 శాతం. ముస్లింలు ఇతరులు 23.0 శాతం ఉన్నారు. వీరిలో భూస్వాములు ప్రధానంగా బ్రాహ్మణులు. 71 శాతం భూమి వీరి స్వాధీనంలో ఉంది. అలాగే విద్యావంతులు కాయస్తులు. కాయస్తుల్లో అప్పటికే ప్రతి వెయ్యిమందిలో 372 మంది ఉన్నత విద్య చదివినవారు. అధికారులుగా బ్రిటిష్ ఆస్థాన గణకులుగా వారిదే పైచెయ్యి. భారత కాంగ్రెస్ రాజకీయులవైపు తొలిసారిగా ఆకర్షితులైన బీహారీల్లో అత్యధికులు కాయస్తులే. జనాభాలో కనీసం 2 శాతం కూడా లేని కాయస్తులు యంత్రాంగంలో ఆధిపత్యం వహిస్తూనే ఇటు అధికార వ్యతిరేక ఉద్యమంలోనూ ఆధిక్యత సాధించడం విశేషం. విద్యార్జన మూలంగా విదేశీ ఉదారవాదాన్ని ప్రజాస్వామ్య భావనలను తెలుసుకునే అవకాశం రావడం వల్ల ఈ కులాలు రాజకీయాల్లోకి మొదట ప్రవేశించాయి. 1934లో తీసుకున్న వివరాల ప్రకారం కాంగ్రెస్ కార్యవర్గంలో 54 శాతం కాయస్తులే. ఐతే ఆచారవాద భూస్వామ్యకులాలు రాజకీయాల్లోకి రావడానికి సంస్కరణలు, కాంగ్రెస్ భూస్వామ్య అనుకూల వైఖరి కారణమయ్యాయి. దీంతో 1960 నాటికి కాయస్తుల శాతం ఆశ్చర్యకరంగా 5 శాతానికి పడిపోయింది. 1939లో అసలు ప్రాతినిధ్యం లేని బ్రాహ్మణులకు 1960 నాటికి 43 శాతం ఆధిపత్యం లభించింది. కేవలం పార్టీకే పరిమితం కాకుండా ప్రభుత్వ అధికారంలో కూడా బ్రాహ్మణుల ఆధిక్యత కొనసాగుతూ వచ్చింది. ఐతే ఎమర్జెన్సీ తరువాత జయప్రకాష్ నారాయణ ఉద్యమంలో తిరుగులేని బ్రాహ్మణ ఆధిపత్యానికి గండి పడింది. కుల సమస్యను ప్రధాన సమస్యగా పరిగణించి సంస్కరణల ఉద్యమాలు చేపట్టిన సోషలిస్టులు రాం మనోహర్ లోహియా, 'సంపూర్ణ విప్లవం' ద్వారా జనజాగృత ఉద్యమం రూపొందించిన జయప్రకాష నారాయణ్ కృషివల్ల ఎమర్జెన్సీ అనంతరం 1978-79 ఎన్నికల్లో జనతాపార్టీ అఖండ విజయం సాధించింది. బీహార్‌లో మొట్టమొదటిసారిగా వెనుకబడిన కులానికి చెందిన కర్పూరీ ఠాకూర్ ముఖ్యమంత్రి కాగలిగాడు. ఐతే ఈ సంఘటితత్వం ఎంతోకాలం నిలువలేదు. మరుసటి ఎన్నికల్లో తిరిగి బ్రాహ్మణులే అధికారంలోకి వచ్చినప్పటికీ ఆ తరువాత 'మండల్ కమిషన్' రాజకీయాలు బి.సి.లను ఒక బలమైన శక్తిగా ముందుకు తెచ్చాయి.

BRAOU

### 3.6.4 మండల్ కమిషన్ - రాజకీయాలు :

స్వాతంత్ర్యం అనంతరం వచ్చిన రాజకీయ ఉద్యమాల్లో "మండల్ కమిషన్" నివేదిక వెలువడిన తరువాత సాగిన ఉద్యమం ప్రధానమైంది. 1989 ఎన్నికల్లో అధికారం లోకి వచ్చిన జనతాదళ్ ప్రభుత్వం దాదాపు దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న మండల్ కమిషన్ నివేదికను వెలికి తీసింది. జనతా ప్రభుత్వ హయాంలో బిందేశ్వరీ ప్రసాద్ మండల్ (1979) అధ్యక్షతన నియమించిన కమిటీ సిఫారసుల్లో భాగాలైన వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లను వి.పి. సింగ్ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కేంద్ర సర్వీసుల్లో బి.సి.లకు 27 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వివాదాస్పదమై దేశవ్యాప్త ఆందోళనకు కారణమయ్యింది. ఉద్యమం వెనుకబడిన తరగతులను చైతన్యపరచి "రాజకీయ వికేంద్రీకరణకు" కారణమైంది. ఉత్తరప్రదేశ్, బీహార్ ప్రభుత్వాలు వెనుకబడిన తరగతుల వశమైనాయి. ఉత్తరప్రదేశ్‌లో తరువాత జరిగిన ఎన్నికల్లో సమాజ్‌వాది, బహుజన సమాజ్ గెలుపొందడానికి కూడా ఈ చైతన్యమే కారణమైంది. "ఓట్లు మావి - సీట్లు మీవా" అన్న నినాదంతో ముందుకొచ్చిన బహుజన సమాజ్ పార్టీ నేత కాన్షీరాం కూడా జనాన్ని ఆకర్షించగలిగారు.

మండల్ కమిషన్ రాజకీయాల ప్రభావం 1990 - 95 మధ్య కాలంలో అధికారంలోకి వచ్చిన అన్ని ప్రభుత్వాల పైనా ఉంది. వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు కల్పించడం ఒక్కటే కాకుండా దళితుల చిరకాలవాంఛలు అనేకం నెరవేరాయి. పార్లమెంట్ సెంట్రల్ హాలులో అంబేద్కర్ చిత్రపటాన్ని ఆవిష్కరించారు. అంబేద్కర్‌కు 'భారతరత్న' పురస్కారం ఆలస్యంగానైనా ఇవ్వాల్సివచ్చింది. తొలిసారిగా ఒక దళిత కులానికి చెందిన వ్యక్తి దేశ ఉపరాష్ట్రపతిగా ఎన్నికకాగలిగారు. ఇటువంటి అనేక పరిణామాలతోపాటు తమిళనాడు, కర్నాటక, ఒరిస్సా, బీహార్ తదితర రాష్ట్రాల్లో రిజర్వేషన్లు పెరిగాయి. వెనుక బడిన తరగతుల పోరాట చరిత్రలో ఈ కాలాన్ని కొందరు సామాజిక శాస్త్రవేత్తలు 'నిశ్శబ్ద విప్లవంగా' అభివర్ణించారు. అయితే ఇదేకాలంలో నిమ్నవర్గాల ఆర్థిక సమృద్ధి దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాలవల్ల మిశ్రమ ఆర్థిక వ్యవస్థ నీరుగారింది. పబ్లిక్ రంగం బాగా దెబ్బ తిని మూసివేసే పరిస్థితికి చేరుకుంది. మార్కెట్ ఆర్థిక వ్యవస్థ పెరిగింది. నెహ్రూ విధానాలు కనుమరుగైపోయాయి. ఇది చాపకింద నీరులా జన జీవనాన్ని సంక్లిష్టం చేసింది.

BRAOU

---

## 3.7 ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక నిర్మాణం - రాజకీయాలు

---

భారత రాజకీయ చిత్ర పటంమీద ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు ఒక ప్రత్యేకత ఉంది. ఆంధ్ర రాజకీయాలు ఆధిపత్యకులాల రాజకీయాలే అయినప్పటికీ ఇవి రెండు సమ ఉజ్జీల గ్రూపుల మధ్య జరిగినటువంటి సమరంలో భాగంగా ఎదిగాయి. దేశవ్యాప్తంగా జరిగిన స్వాంత్ర్య పోరాటంలో ఆంధ్రప్రదేశ్ నుంచి పాల్గొన్నది విద్యాధికులైన బ్రాహ్మణ యువకులే. స్వాతంత్ర్య పోరాటంలో ముందు వరసలో నిలబడిన వారిలో టంగుటూరి ప్రకాశం పంతులు, దేశోద్ధారక నాగేశ్వరరావు, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, బూర్గుల రామకృష్ణారావు వంటి వారు ముఖ్యులు. వీరిలో టంగుటూరి ప్రకాశం పంతులు, బూర్గుల రామకృష్ణారావు తొలి ముఖ్యమంత్రులుగా పనిచేశారు. 1956వరకు ఆంధ్రప్రదేశ్ ముక్కచెక్కలుగా ఉంది. మొదట కోస్తా ఆంధ్ర మద్రాసు రాష్ట్రంలో తెలంగాణా నిజాం స్టేట్‌లోనూ ఉండటంవల్ల స్వాతంత్ర్యంకోసం సంఘటిత పోరాటం జరుగలేదు.

ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ఆంధ్రలో స్వాతంత్ర్యోద్యమం కాలంనుంచీ కమ్మ, బ్రాహ్మణ వైరం ఉండేది. కమ్మ కులస్తులు త్రిపురనేని రామస్వామి చౌదరి నాయకత్వంలో జస్టిస్ పార్టీలో ఉండగా

బ్రాహ్మణులు కాంగ్రెస్ పార్టీకి ప్రాతినిధ్యం వహించారు. బ్రాహ్మణ వ్యతిరేక కూటమిని బలోపేతం చేసేందుకు కమ్మ కులస్తులు దళిత, అస్పృశ్య కులాలతో కలిసి పనిచేశారు. సహపంక్తి భోజనాలు, సాంస్కృతిక ఉద్యమాలు ఆ కాలంలో కమ్మ నాయకత్వంతోనే నడిచాయి. జస్టిస్ పార్టీతోపాటు ఈ వర్గం బ్రిటిష్ పాలనకు అనుకూలంగా మెలిగేది. మరోవైపు తెలంగాణా ప్రాంతంలో (హైదరాబాద్ స్టేట్) రెడ్డి వర్గం గ్రామీణ వ్యవసాయ భూమిపై పట్టా సంపాదించుకుని నిజాం నవాబుకు అనుకూల రాజకీయాలు నడిపింది. ఈ కాలంలో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో బ్రాహ్మణ విద్యావంతులు స్వాతంత్ర్యం కోసం పని చేయగా కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో కమ్మవర్గం తెలంగాణాను నిజాం పాలననుంచి విముక్తం చేయడానికి పోరాడింది. కమ్యూనిస్ట్ పార్టీకి కమ్మయువకులు నాయకత్వం వహించడంతో రెడ్డి, కమ్మ వైరం మొదలయ్యింది. స్వాతంత్ర్యపోరాటం, ఆ తరువాతి తొలదశ రాజకీయాల్లో బ్రాహ్మణ, రెడ్డి వర్గం ఒకవైపు కమ్మ వర్గం మరో వైపు నిలబడి తమ తమ ఆధిక్యత చాటుకునే ప్రయత్నం చేశాయి.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత స్థానిక సంస్థల్లో శాసన సభ నియోజక వర్గాల్లో భూస్వామ్య కులాలైన కమ్మ, రెడ్డి వర్గాలనుంచే నాయకత్వం వస్తున్న. రాయలసీమ, తెలంగాణా ప్రాంతాల రెడ్డి కులస్థులు, ఆంధ్ర ప్రదేశ్ అవతరణ తరువాత వెలుగులోకి వచ్చి రాష్ట్రప్రభుత్వంపై పట్టు సాధించుకున్నారు. పంచాయితీరాజ్ ఏర్పడిన తరువాత గ్రామీణ భూస్వామ్య కులాలన్నీ అధికార చట్రంలో ఇమడగలిగాయి. అటు కోస్తాలో కమ్మ ప్రాబల్యం, తెలంగాణా, రాయలసీమల్లో రెడ్డి ఆధిపత్యం పెరిగిపోయింది. నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా పనిచేసినప్పటినుంచి క్రమక్రమంగా రెడ్డి వర్గం మొత్తం రాష్ట్రాన్ని శాశించే శక్తిగా ఎదిగింది. గ్రామీణ ఫ్యూడల్ సంబంధాల్లో మార్పు తీసుకురావడానికి పి.వి. నరసింహారావు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో చేసిన ప్రయత్నాలేవీ నెరవేరలేదు. పి.వి. నరసింహారావు (1972లో) ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో భూసంస్కరణల చట్టాన్ని ప్రతిపాదించారు. ఐతే శాసన సభ్యుల్లో అత్యధికులు భూస్వామ్య కులాలవారే కావడంతో ఆ ప్రతిపాదన అనేక సవరణలకు గురయి నీరుగారి పోవాల్సివచ్చింది.

1983లో ఎన్.టి.రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించి అధికారంలోకి రావడం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పెద్ద మలుపు. అప్పటిదాకా సినీరంగంలో కీర్తి ప్రతిష్టలు సంపాదించికున్న రామారావు ఆంధ్ర రాజకీయాల్లో కొత్త సంచలనం సృష్టించి పార్టీ ప్రారంభించిన తొమ్మిది నెలల్లోనే అధికారం చేపట్టారు. దీంతో కమ్మరాజకీయనేతల చిరకాల వాంఛ నెరవేరడమేకాకుండా ఆంధ్రప్రదేశ్ రాజకీయ స్థిరీకరణను అతలాకుతలం చేసింది.

ఎన్టీరామారావు పాలనా సంస్కరణలు, పథకాలు కూడా భూస్వామ్య కులాల ఆధిపత్యానికి కళ్లెం వేశాయి. పంచాయితీ సమితుల స్థానంలో అధికార వికేంద్రీకరణ చేసి మండల ప్రజాపరిషత్‌ల ఏర్పాటు వల్ల సాంప్రదాయ ఆధిపత్యం కుల రాజకీయాలు దెబ్బతినడమే కాకుండా మండల వ్యవస్థలో ఎస్.సి, ఎస్.టి, ఓ.సిలతోపాటు కొత్తగా ఓ.సిలు మహిళలకు కూడా రిజర్వేషన్లు కల్పించడంతో బలహీన వర్గాల్లో కొత్త నాయకత్వం ఎదిగి వచ్చింది. ఇదొక ప్రగతిశీలమైన పరివర్తన కాగా గ్రీమీణ ప్రాంతాల్లో ఎప్పుడో మొఘల్ నవాబుల కాలంనుంచి భూముల లావాదేవీలు చూస్తూ వస్తున్న సాంప్రదాయక గ్రామాధికారులు (కరణం - మునసబు) వ్యవస్థను రద్దు చేయడం మరో పరిణామం. గ్రామాధికారుల రద్దు వల్ల బ్రాహ్మణ ఆధిపత్యాన్ని దెబ్బదీయడమే కాక పాలనావ్యవస్థను పూర్తిగా ప్రభుత్వం పట్టుకిందకు తేగలిగాడు. ఐతే అధికార యంత్రాంగంలో, మంత్రివర్గంలో కమ్మ ప్రాబల్యం ఇంకా బలపడింది ఈ దశలోనే. 1989లో రాష్ట్రంలో అధికారం మళ్లీ కాంగ్రెస్ చేతికి వచ్చింది. ఇది అణగి ఉన్న రెడ్డి వర్గానికి కొత్త ఊపిరినిచ్చింది.

BRAOU

ఇది ఎంతోకాలం నిలువలేదు. ఐదేళ్ళలో ముగ్గురు ముఖ్యమంత్రులు మారడం ఈ ముగ్గురు రెడ్డి వర్గానికి చెందిన వారే కావడం పాలకవర్గ పదవుల్లో ఒకే కులం ప్రాబల్యం పెరిగిపోవడం వల్ల 1994 ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారం కోల్పోవలసి వచ్చింది. ఆసక్తి కలిగించే విషయమేమిటంటే స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మొదటి దశలో మినహా ఎప్పుడూ బ్రాహ్మణుల ఆధిపత్యం నిలబడలేదు. అలాగే వెనుకబడిన కులాలకు ఉన్నత పదవి దక్కలేదు. పార్లమెంటరీ రాజకీయాల్లో బొమ్మ బొరుసుల్లాగా కొంతకాలం రెడ్డివర్గం ఆధిపత్యం వహిస్తే మరికొంతకాలం కమ్మ పెత్తనం కొనసాగింది.

## 3.8 సారాంశం

భారత రాజకీయం మూలాలు తెలుసుకోవాలంటే భారత సామాజిక చరిత్రను, చరిత్రలో ఎదిగిన సామాజిక శక్తులను అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. సమస్తరీకరణ సామాజిక సంబంధాలు కలిగి ఉన్న భారత సమాజం ఆర్యుల రాకతో విషమస్తరీయ వ్యవస్థగా మారింది. వర్ణ వ్యవస్థ, ప్రాచీన భారత రాజకీయాలను, ఆర్థిక వ్యవస్థను మొత్తం సమాజాన్ని శాసించింది. ఈ సామాజిక స్తరీకరణపైనా రాజకీయాలు నిర్మితం కావడంతో భారత రాజకీయాల్లో కూడా 'పిరమిడ్' వ్యవస్థ మాదిరి ఆధిపత్య సంస్కృతి ప్రవేశించింది.

విదేశీ పాలన ప్రవేశపెట్టిన ఆధునిక విద్య, వికేంద్రీకరణ అధికార వ్యవస్థ, పాలనా వ్యవహారాల సర్వీసుల మూలంగా సనాతన సామాజిక వ్యవస్థలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ కాలంలో జాతీయస్థాయి రాజకీయ ఏకీకరణసాధ్యమై జాతీయ భావం తలెత్తింది. ఇంగ్లీషు చదువు చదువుకున్న ఉన్నతకులాల్లో ప్రజాస్వామ్య ఆధునిక భావనలు మొలకెత్తి స్వాతంత్ర్యం, సౌభ్రాతృత్వం ధోరణి బలపడింది. ఈ విద్యావంతులైన మేధావి వర్గం స్వాతంత్రోద్యమానికి సన్నాహాలు చేసి పోరాటం నడిపింది.

BRAOU

స్వాతంత్ర్యం వచ్చి ప్రజాస్వామ్య పార్లమెంటరీ వ్యవస్థ ప్రాణం పోసుకున్నప్పటికి ప్రజల చైతన్యవంతు లయ్యేంతవరకు రాజకీయాల్లో ఆధిపత్యకులాల అధికారమే రాజ్యమేలింది. ప్రణాళికా బద్ధమైన అభివృద్ధి పథకాలు, రిజర్వేషన్లు, మండల్ కమిషన్ ఇతర ఉద్యమాలు 1990 దశకం తొలినాటికి రాజకీయాల్లో ఆధిపత్య సంస్కృతికి అడ్డుకట్ట వేశాయి. ఆంధ్రతో సహా భారతదేశంలోని అన్ని రాష్ట్రాల్లో మొదటి దశలో బ్రాహ్మణ నాయకత్వం ఉన్నప్పటికీ రెండో దశలో భూస్వామ్య ఆధిపత్య కులాలే రాజకీయంగా ఎదిగి అధికారం చెలాయించాయి. మూడో దశలో చైతన్యవంతమైన దళిత వర్గం అధికారం కోసం పోటీపడి పురోగమిస్తుంది.

-- ఘంటా చక్రపాణి

## 3.9 చదువదగిన పుస్తకాలు


| | | | |
|---|---|---|---|
| 1. | ఎ.ఆర్. దేశాయ్ | : | భారత జాతీయ భావ సామాజిక పూర్వ రంగం |
| 2. | డి.డి. కోశాంబి | : | భారత దేశ చరిత్ర పరిచయ వ్యాసాలు |
| 3. | డి.డి. కోశాంబి | : | The Basis of Ancient Indian History |
| 4. | బిపిన్ చంద్ర | : | ఆధునిక భారతదేశ చరిత్ర |
| 5. | కె.యస్. గిల్ | : | భారతీయ ఆర్థిక వ్యవస్థ |
| 6. | ఇర్ఫాన్ హబీబ్ | : | భారత చరిత్రలో రైతు |
| 7. | R.S. Sarma | : | Ancient India |
| 8. | Romilla Thaper | : | From Lineage to State |

| | | | |
|---|---|---|---|
| 9. | Du mont | : | Homo Hiearchicns |
| 10. | Rajani Kothari | : | Caste In Indian Politics |

## 3.10 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తుల సమాధానం రాయండి.

1. భారత రాజకీయాల పూర్వరంగాన్ని సామాజిక, ఆర్థిక పరిస్థితుల ఆధారంగా వివరించండి.
2. భారత సమాజంలో ఫ్యూడల్ ధోరణులు - పరిణామాలను చర్చించుము.
3. స్వాతంత్ర్య పోరాటంలో వివిధ సామాజిక వర్గాల పాత్రను విశ్లేషింపుము.
4. భారతదేశంలో దళిత రాజకీయాల తీరు తెన్నులు విమర్శనాత్మకంగా చర్చింపుము.

II. ఈ క్రింది ప్రశ్నలకు పది పంక్తులలో సమాధానం రాయండి.

1. 'వర్ణ వ్యవస్థ' గురించి క్లుప్తంగా వివరింపుము ?
2. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కులం పాత్రను విశ్లేషింపుము.
3. మండల్ కమిషన్ నివేదిక పరిణామాలు చర్చింపుము.
4. స్వాతంత్ర్య పోరాటంలో మేధావి వర్గం పాత్రను వివరింపుము.

BRAOU

# భాగం - 4 సామాజిక స్తరీకరణ

## విషయక్రమం


4.1 లక్ష్యాలు
4.2 పరిచయం
4.3 అర్థవివరణ
4.4 నిర్వచనాలు
4.5 విభేదీకరణ - స్తరీకరణ
4.6 సామాజికస్తరీకరణ - లక్షణాలు
4.7.0 సామాజికస్తరీకరణ - దృక్పథాలు
4.7.1 ప్రకార్యవాద దృక్పథం
4.7.2 మార్క్సిస్టు దృక్పథం
4.8 సైద్ధాంతిక స్తరీకరణ
4.9.0 భారతదేశంలో సామాజిక స్తరీకరణ
4.9.1 జాతి, మత స్తరీకరణ
4.9.2 సైద్ధాంతిక స్తరీకరణ
4.10 సారాంశం
4.11 చదువదగిన పుస్తకాలు
4.12 నమూనా పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 4.1 లక్ష్యాలు

ఈ భాగం చదివితే ఈ కింది విషయాలు గ్రహించ గలుగుతారు.

- సామాజిక స్తరీకరణ అంటే ఏమిటి
- సామాజిక స్తరీకరణ ఏయే దృక్పథాల్లో వివరించారు.
- సైద్ధాంతిక స్తరీకరణ అంటే ఏమిటి
- భారతదేశంలో స్తరీకరణ ఎట్లావుంది.

## 4.2 పరిచయం

మానవసమాజం ఒకే రకంగా లేదు. సమాజంలోవున్న మనుషులందురు కూడా ఒకే రీతిగా ఉండరు. ప్రతిసమాజంలోనూ అనేక వైవిధ్యాలు కనిపిస్తుంటాయి. పరస్పర వైరుధ్యం కలిగిన అనేక సమూహాలూ సమాజంలో ఉంటాయి. సంపన్నులు, నిరుపేదలు, పాలితులు, పాలకులు, రైతులు, కూలీలు, అధికారులు, ఉద్యోగులు ఈ విధంగా సమాజం వివిధ వృత్తులు, హోదాలు, సంస్కృతులతో కూడిన సమూహాల దొంతరగా నిర్మితమై ఉంటుంది. ఈ విధంగా మానవ సమాజాన్ని పరస్పరం విభేధించుకునే ధర్మాల ఆధారంగా అంచెలంచెలుగా విభజించడాన్నే సామాజిక స్తరీకరణ అంటారు.

## 4.3 అర్థవివరణ

'స్తరం' అనే పదాన్ని పొర అనే అర్థంలో వాడుతున్నాం. అంటే సాధర్మత కలిగిన ఒక విభాగాన్ని లేదా 'అంచె' ను స్తరం అనవచ్చు. స్తరీకరణ అంటే సాధర్మ్యత పరస్పర సంబంధం ఉన్న అంచెలు లేదా దొంతరలుగా విభజించడం. వాతావారణాన్ని ఏరకంగానయితే వాటి అణువుల ధర్మాన్ని బట్టి విభజిస్తున్నామో అదే విధంగా సమాజంలోని వ్యక్తులను, సమూహాలను కూడా సామజిక లక్షణాలు ఆధారంగా వివిధ సముదాయాలుగా స్తరీకరించవచ్చునని సామాజిక శాస్త్రవేత్తల భావన. వాతవరణంలోని స్తరాలలో వున్న అణువుల మధ్య ఏ విధంగానయితే అనుసందానం, పరస్పర సంబంధం వుంటుందో అదే విధంగా సామాజిక స్తరీకరణ కూడా పరస్పర సంబంధం కలిగిన వ్యక్తులు, సంస్థలు, సముదాయాలు మరియు సంస్కృతుల సమ్మేళనమై ఉంటుంది. ఈ రకంగా వైధర్మ్యత కలిగి ఉన్నప్పటికి ఈ శక్తులన్నీ ఒక క్రమానుగత శ్రేణిలో వుంటూ పనిచేసినప్పడే ఆ సమాజానికి ఒక రూపం ఉంటుంది.

## 4.4 నిర్వచనాలు

సామాజిక స్తరీకరణకు ఒక్కొక్క శాస్త్రవేత్త ఒక్కొక్క నిర్వచనాన్ని ఇచ్చినప్పటికీ ఆందరి భావనా సమాజాన్ని శాస్త్రబద్ధంగా సమాన ప్రాధాన్యతవున్న, సర్వస్వతంత్ర వ్యవస్థలు లేదా యూనిట్లుగా విడగొట్టడమే ఇక్కడ కొన్ని నిర్వచనాలను పరిశీలిద్దాం.

సమాజంలోని ప్రజలను హెచ్చుతగ్గుల హోదాలతో కూడిన సమూహాలుగా విభజించి ఒక క్రమానుగత శ్రేణిలో ఉంచడాన్ని స్తరీకరణగా ఆగ్బర్న్ మరియు నిమ్‌కాఫ్ (Ogburn and Nimkoff) లనే సామాజిక శాస్త్రవేత్తలు నిర్వచించారు.

BRAOU

సమాజంలోని వ్యక్తులను వారివారి ధర్మాల ఆధారంగా వివిధ ఖండికలు లేదా యూనిట్లుగా క్షితిజ క్రమశ్రేణిలో వర్గీకరించడాన్ని రేమాండ్ ముర్రే (Raymond W. Murray) సామాజిక స్తరీకరణగా పేర్కొన్నారు. సోరోకిన్ (Sorokin) మహాశయుని అభిప్రాయంలో ఆదిమ సమాజం నుంచి ఈనాటి అధునిక రాజ్యాలదాకా ప్రతి సమాజం కూడా అనేక వైధర్మ్యతలు, వ్యత్యాసాలతో కూడిన సమూహాల సమ్మేళనమే. స్తరీకరణ అంటూ లేని సమాజం ఈ సృష్టిలో ఏనాడూ, ఎక్కడా లేదని, సంఘంలోని సభ్యులందరికీ సమానమైన హోదా, అంతస్తు పలుకుబడి ఉండటం చరిత్రలో కనీవినీ ఎరుగమని, అటువంటి సర్వసమానత్వం కలిగిన సమాజం ఉందని, ఉంటుందనీ అనుకోవడం 'మిధ్య' అని సోరకిన్ పేర్కొన్నారు.

"పరస్పర సంబంధాలు, ఆధిపత్యం కలిగి ఉండి ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉండే శాశ్వత విభాగాలుగా సమాజాన్ని వర్గీకరించడమే సామాజిక స్తరీకరణ" గా గిస్బర్ట్ నిర్వచించాడు.

ఈ నిర్వచనాలను బట్టి సామాజిక స్తరీకరణ అంటే సమాజాన్ని వివిధ భాగాలుగా విభజించడం అని అర్థమౌతుంది. అయితే ఈ విభజనకు ప్రాతిపదిక ఏమిటి? అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. కేవలం మనకు కనిపించే భౌతిక లక్షణాలు ఆధారంగానే కాకుండా సమాజంలో ఆవ్యక్తి హోదా, గుర్తింపు, పలుకుబడి, అధికారం విధుల ఆధారంగా వర్గీకరించడాన్ని, ఈ రకంగా ప్రజలను పరస్పర ఆధారభూతమైన, స్వతంత్రమైన యూనిట్లుగా విభజించడాన్ని సామాజిక స్తరీకరణ (Social Stratification) అనవచ్చు.

## 4.5 విభేదీకరణ - స్తరీకరణ

తరచుగా సామాజిక స్తరీకరణను విభేదీకరణను ఒకే అర్థంలో వాడుతున్నారు. విస్తృతార్థంలో ఇవిరెండూ ఒకే రకంగా కనిపించినప్పటికీ ఈ రెండింటి మధ్య స్పష్టమైన వ్యత్యాసం ఉంది. సామాజిక స్తరీకరణ అంటే కేవలం సమాజంలో కనిపించే అసమానతలు, విభేదాలు కాదని 'హరలాంబస్' అనే శాస్త్రవేత్త పేర్కొన్నారు.

విభేదాలు లేదా అసమానతలు అంటే కేవలం సామాజిక పరంగా అగుపించే తేడాలు మాత్రమేనని స్తరీకరణ సమాజంలో ఒక వ్యక్తికి ఉన్న సంపద, ప్రతిష్ఠ, అధికారం ఆధారంగా ఆసమాజంలో వ్యక్తికి లభిస్తున్న గౌరవం, హోదాని తెలుపుతుందని ఆయన పేర్కొన్నారు. ఒక సమాజంలో ఒకేస్తరంలో వున్న వ్యక్తులకు ఉమ్మడి ప్రయోజనాలు, ఉమ్మడి సాంఘిక హోదా, కట్టుబాట్లు, విలువలు, జీవన ప్రమాణాల్లో సారూప్యత ఉంటాయి. ఒక స్తరం ఇంకో స్తరంతో, ఒక సమూహం ఇంకో సమూహంతో ఈ సామాజిక విలువల ప్రాతిపదికనే విభేదిస్తూ ఉంటుంది. ఈ రకంగా సమాజం పరస్పరం విభేధిస్తూ, సామాజిక గుర్తింపు, ప్రాధాన్యత కలిగి వుండి సామాజిక నిర్మాణానికి ప్రాతిపదికగా నిలిచే సాధర్మ్య సముదాయాల క్రమశ్రేణిగా ఉంటుంది.

స్తరీకరణ అంటే కేవలం పాత్రల విభజనతో కూడిన క్రమానుగత శ్రేణి మాత్రమే కాదు. ఇది హోదా, పలుకుబడితో కూడిన శ్రేణిగా డార్విన్ వారిగ్ పేర్కొన్నారు. ఒక్కొక్కసారి సమాజంలో ఇద్దరు వ్యక్తులు ఒకేరకమైన పాత్రపోషణ చేస్తున్నప్పటికీ, ఒకే సామాజిక శ్రేణిలో ఉన్నప్పటికీ వారివారి పలుకుబడి జీవన ప్రమాణాల్లో, హోదాలో తేడాలు ఉంటాయి. ఉదాహరణకు కమ్మరి, కంసాలి ఒకే శ్రేణిలో ఉన్నప్పటికీ ఇనుము పనిచేసే కమ్మరి కంటే స్వర్ణకారుడికి ఎక్కువ పలుకుబడి ఉంటుంది. దీనిని బట్టి సామాజిక స్తరీకరణకు ఉన్న విస్తృతార్థం విశదమవుతుంది.

BRAOU

## 4.6 సామాజిక స్తరీకరణ - లక్షణాలు

సమాజాన్ని ఎవరు ఏరకంగా స్తరీకరించినప్పటికీ దానికొక ప్రాతిపదిక ఉంటుంది. సామాజిక స్తరీకరణకు పూనుకోనే ముందు ఆసమాజపు లక్షణాలు, వైధర్మ్యతలు, సంస్కృతి విలువలను పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. అధికారం, సంపదల పంపణీ, సామాజిక వికాసగతి వంటి అంశాల ఆధారంగా సమాజ నిర్మాణాన్ని అర్థం చేసుకోవలసి వుంటుంది. మెల్విన్‌ట్యుమిన్ (Melvin Tumin) 'సామాజిక స్తరీకరణ' అనే తన గ్రంథంలో స్తరీకరణకు ఐదు ప్రాథమిక లక్షణాలు ప్రతిపాదించారు.

**1. స్తరీకరణ సామాజిక ప్రాధాన్యత కలిగి ఉంటుంది:**

తొలిదశలో సామాజిక శాస్త్రవేత్తలు స్తరీకరణను కేవలం జైవిక, భౌతిక లక్షణాలను బట్టి మాత్రమే విశదీకరించారు. తరువాతి కాలంలో స్తరీకరణ అంటే కేవలం భౌతిక, జైవిక లక్షణాల్లో వున్న తేడా మాత్రమే కాదని, ఇదొక సామాజిక ప్రాధాన్యత గలిగిన ప్రత్యేకాంశమని గుర్తించారు. ట్యుమిన్ ప్రకారం సామాజిక ప్రాధాన్యత లేని అంశాల ఆధారంగా వ్యక్తుల్లో, సమాజంలో వున్న వ్యత్యాసాలను గుర్తించడం స్తరీకరణ కాజాలదు. వ్యక్తికీ వ్యక్తికీ మధ్య ఎంతటి వ్యత్యాసం ఉన్నప్పటికీ దానికి సామాజిక ప్రాధాన్యత లేనప్పుడుగానీ, ఆ వ్యత్యాసం వల్ల ఆ వ్యక్తి గౌరవం, హోదా, సంఘంలో లభించే పలుకుబడిలో ఎలాంటి తేడా లేనప్పుడుగానీ ఆ వ్యత్యాసానికి విలువ లేదు. ఉదాహరణకు సమాజాన్ని స్త్రీ పురుషులుగా విభజించాం అనుకుందాం. ఆ

వ్యత్యాసం లేనప్పుడు ఆ విభజన లింగపరమైన జైవిక విభజనే అవుతుంది తప్ప సామాజిక స్తరీకరణ కాజాలదు. అదే సమాజంలో స్త్రీలు, పురుషుల మధ్య అధికారంలో గానీ, హోదాలోగానీ, గుర్తింపులో గానీ తేడా వున్నట్లయితే దానికి సామాజిక ప్రాధాన్యత వుంటుంది. అలాగే వయస్సును బట్టికూడా మనం స్తరీకరణ చేయలేం. వయస్సనేది కొన్ని సార్లు సామాజిక ప్రభావితాంశం కాకపోవచ్చు. ఉదాహరణకు 80 సంవత్సరాల వృద్ధుడు వయస్సులో పెద్దవాడే అయినప్పటికి కొన్నిసార్లు 20 సంవత్సరాల యువకుడి కంటే తక్కువ హోదాను, గౌరవాన్ని, అధికారాన్ని కలిగివుండవచ్చు. అంటే వ్యక్తికి జైవిక అంశాలకంటే ఇక్కడ ఆ వ్యక్తికి లభిస్తున్న సామాజిక అంతస్తు, హోదా గౌరవం, ఆ వ్యక్తికి ఉన్న అధికారం, పలుకుబడి తదితర అంశాలు స్తరీకరణలో ప్రముఖ పాత్ర వహిస్తాయి.

కొన్ని సందర్భాల్లో స్తరీకరణ సామాజిక విలువలు, కట్టుబాట్లు, ఆచారాలను బట్టికూడా వుంటుంది. సమాజంలో వ్యక్తికి పలుకుబడి, అంతస్తు అనేవి ప్రధానంగా రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి సంపాదించుకుంది లేదా సాధించినది రెండవది అపాదించబడింది. ఆదిమ సమాజాల్లో గిరిజన సముదాయాల్లో, ఫ్యూడల్ వ్యవస్థలో రాజరికంలో ఇలాంటి ఆపాదిత అంతస్తులు మనకు కనిపిస్తాయి, . ఈ సమాజాల్లో సాంప్రదాయాలు, ఆచారాలు, కట్టుబాట్లు వ్యక్తి సామాజిక హోదాను నిర్ణయిస్తాయి. కాని ఆధునిక సమాజంలో ఆర్జిత స్తోమత, లేదా సంపాదించుకున్న హోదా ప్రధానం. ఇక్కడ వ్యక్తి ప్రతిభాసంపత్తులే ప్రధానంగా వుంటాయి. ఇవే సామాజిక స్తరీకరణలో కీలక పాత్ర వహిస్తాయి.

2. స్తరీకరణ పురాతనమైంది:

ఆధునిక సమాజాల్లో రోజురోజుకు పెరుగుతున్న సంక్లిష్టత సామాజిక స్తరీకరణను హెచ్చుతగ్గులను మరింత సంక్లిష్టం చేస్తుంది. అంతే తప్ప ఈ హెచ్చుతగ్గులు కొత్తగా వచ్చినవి కాదు. చరిత్రలో సంపద, అధికారాలను బట్టి బానిసలు యజమానులు, భూస్వాములు, కుంతలు, కార్మికులు, యజమానులు ఇట్లా వ్యక్తులు, సమూహాలు వివిధ వర్గాలుగా సమాజం విభజితమై వుంటూ వచ్చింది.

సామాజిక శాస్త్రవేత్త సోరోకిన్ (Sorokin) ప్రకారం "సామాజిక వికాస క్రమంలో నాటి నుంచి నేటిదాక సమానత్వం ఉన్న సమాజం ఏదీలేదు; సర్వసమానమైన సమాజం ఉందనుకోవడం మిధ్య." చరిత్రలో మెసపటోమియా, బాబిలోనియా, పర్షియా,హిబ్రూ, గ్రీకు లాంటి అతిప్రాచీన సమాజాలలో సైతం ప్రజల మధ్యన సంపద, ఆధిపత్యపరమైన వ్యత్యాసాలున్నట్లు ఆధారాలున్నాయి. అతిప్రాచీనమైన భారతీయ సంస్కృతిలో కూడా వైదిక కాలం నుంచే స్తరీకరణ వర్ణవ్యవస్థ ద్వారా కనిపిస్తుంది. చాతుర్వ ర్ణ వ్యవస్థ కేవలం ధార్మిక, మత వ్యవస్థగా కాక ప్రజల సామాజిక, ఆర్థిక, రాజకీయ జీవనాన్ని ప్రభావితం చేసి సామాజిక స్తరీకరణకు ప్రధాన ఆధారమయ్యింది.

3. ఇది విశ్వజనీనమైనది:

సమాజంలోని వ్యత్యాసాలు, బీద గొప్ప తేడాలు కేవలం భారతదేశానికి మాత్రమే పరిమితం కాదు సామాజిక స్తరీకరణ ప్రపంచ పరివ్యాపితమైంది. ప్రపంచంలో పెట్టుబడిదారీ దేశాలనుంచి సామ్యవాద సమాజాల దాక, రాచరిక రాజ్యాలనుంచి ప్రజాస్వామ్యపాలనా వ్యవస్థల దాకా ప్రతి సమాజంలోనూ మనిషికీ మనిషికీ మధ్య ఈ వ్యత్యాసం కనిపిస్తుంటుంది.

భారతీయ సమాజంలో కులాల మధ్య వ్యత్యాసం ఉన్నట్టే అమెరికాలో పని నిపుణుడికి సాధారణ కూలికి, ఆఫ్రికాలో ఒక తెగకి, మరో తెగకి మధ్య అధికారంలో, హోదాలో పలుకుబడిలో తేడా ఉంది. కొన్ని

BRAOU

ఆఫ్రికాలో ఒక తెగకి, మరో తెగకి మధ్య అధికారంలో, హోదాలో పలుకుబడిలో తేడా ఉంది. కొన్ని సమాజాల్లో ఇప్పటికీ వ్యక్తి పూర్వీకులవల్ల, మతం వల్ల, కులం వల్ల సంస్కృతి వల్ల ఈ హోదా లభిస్తే మరికొన్ని సమాజాల్లో వ్యక్తి నైపుణ్యం, ప్రతిభాపాటవాల వల్ల ఈ హోదా లభిస్తుంది. ఈ రకంగా వ్యక్తికీ వ్యక్తికీ మధ్య ఉన్న తేడాలు ఆయా దేశాల సామాజిక, రాజకీయ వ్యవస్థలను ప్రభావితం చేస్తునే వున్నాయి.

4. భిన్న రూపాలలో కనిపిస్తుంది:

స్తరీకరణ అనేది అపరిమితమైంది. ఏ సమాజాన్ని కూడా మనం ఒకటో, రెండో స్తరాల్లో మాత్రమే విభజించలేం. ఆ విధంగా విభజించాలని ప్రయత్నించినా ఒక్కొక్క స్తరంలో కూడా పరస్పరం విభేదించుకునే అనేక అంశాలు కనిపిస్తుంటాయి. దీనికి భారతీయ సమాజాన్ని ఉదాహరణగా పేర్కొనవచ్చు. ప్రాచీన భారతీయ సమాజంలో మొదట వైదిక యుగంలో నాలుగు వర్ణాలే ఉన్నాయనుకున్నప్పటికీ రానురాను ఈ చాతుర్వర్ణాల్లో వేలాది స్వతంత్ర కులాలు కనిపించాయి. ఈ కులాల్లో అనేక ఉపకులాలు, గోత్రాలు, శాఖలు కనిపిస్తాయి.

ఇనుప పనిముట్లను, బంగారు నగలను, కంచుపనులను, ఇతర లోహపాత్రలను చేసే వివిధ కులాలను కలిపి మనం విశ్వబ్రాహ్మణులుగా వ్యవహరిస్తున్నాం. ఒక రకంగా ఈ కులాలన్నీ ఒకే చట్రంలో వున్నట్టు కనిపిస్తాయి. కానీ సామాజిక అంతస్తులో హోదాలో పలుకుబడిలో ఈ కులాల మధ్య ఎంతో వ్యత్యాసం కనిపిస్తుంటుంది అదే విధంగా వర్గసమాజాల్లో, పెట్టుబడిదారీ దేశాల్లో కూడా ఆర్థిక రాబడిని బట్టి అంతస్తు, అంతస్తును బట్టి అధికారం లభిస్తున్నాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో సామాజిక స్తరీకరణ మరింత క్లిష్టంగా ఉంటుంది.

5. ప్రభావం చూపేదిగా వుంటుంది:

BRAOU

సామాజిక స్తరీకరణ ప్రభావాలు సమాజంపై తీవ్రంగా ఉంటాయి. అధికారం, ఆస్తిపాస్తులు, పలుకుబడి, వ్యక్తివికాసంపై, గతిశీలత (Mobility) పై ప్రభావం చూపుతుంది. సామాజిక అంతస్తు, హోదా, పలుకుబడి అనేవి వ్యక్తి జీవన అవకాశాలు (Life Chances) జీవన రీతుల (Life Styles) ను నిర్దేశిస్తుంది. స్తరీకరణను సాంఘిక హోదాను బట్టే జీవనప్రమాణాలు అవకాశాలు చివరకు జనన మరణాలు, వివాహాలు విడాకులు కూడా వ్యక్తి స్తరాన్ని బట్టే నిర్ణయమవుతాయి. మొత్తంగా స్తరీకరణ, సామాజిక, సాంస్కృతిక జీవనాన్నే కాక వ్యక్తి మూర్తి మొత్తాన్ని కూడా ప్రభావితం చేస్తుంటుంది.

## 4.7.0 సామాజిక స్తరీకరణ - దృక్పథాలు

సమాజం ఆధునికీకరణ చెందుతున్న కొద్దీ సంక్లిష్టమవుతూ వస్తున్నది. దీని మూలంగా మానవ సంబంధాల్లో మార్పులు వస్తున్నాయి. వ్యక్తికీ వ్యక్తికీ మధ్య సమూహానికీ సమూహానికి మధ్య సంబంధాలు మారుతున్నాయి. సామాజిక వికాస తొలిదశలో ఈ మార్పు మందకొడిగా ఉన్నప్పటికీ ఉత్పత్తి క్రమంలో పెట్టుబడి ప్రవేశించిన తరువాత ఆస్తి పాస్తులను బట్టి అధికారం, అధికారాన్ని బట్టి పలుకుబడి, హోదా, గౌరవం లభించడంతో సామాజిక సంబంధాల్లో మార్పు తీవ్రమయ్యింది. ఈ దశలో అనేక మంది శాస్త్రవేత్తలు సామాజిక తత్వవేత్తలు సామాజిక వికాస క్రమాన్ని మానవ సంబంధాల్లో వచ్చిన మార్పులను, సామాజిక విలువలను అధ్యయనం చేయడం ప్రారంభమయ్యింది.

ఫ్రెంచి విప్లవం, పారిశ్రామిక విప్లవం పర్యవసానంగా సామాజిక శాస్త్ర అధ్యయనం ఒక అనివార్య అంశమయ్యింది. సామాజిక అధ్యయన క్రమంలో సామాజిక, ఆర్థిక, రాజకీయవేత్తలు సమాజాన్ని సాధర్మ్య లక్షణాల

ఆధారంగా వివిధ సముదాయాలుగా విభజించి అధ్యయనం చేయడం ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో తత్వవేత్తలు సామాజిక నిర్మాణాన్ని ఆ నిర్మాణానికి దోహదపడే సామాజిక అంశాలని, సాముదాయిక లక్షణాలని ఆధారం చేసుకుని సామాజిక స్తరీకరణను సిద్ధాంతీకరించారు.

సామాజిక స్తరీకరణ సిద్ధాంత కర్తల్లో కార్లమార్క్స్, టాల్కాట్ పార్సన్స్, కింగ్స్లే డేవిస్, విల్బర్ట్ మోర్, మెల్విన్ ట్యుమిన్, మిఖాయిల్ యంగ్, రోసెన్ ఫీల్డ్, మాక్స్‌వెబర్ ముఖ్యులు. ఆ తరువాత కూడా అనేక మంది స్తరీకరణను విశ్లేషిస్తూ వచ్చినప్పటికీ ఈ అధ్యయనాలన్నీ ఈ క్రింది దృక్పాథాల్లో జరిగాయి.

## 4.7.1 ప్రకార్యవాద దృక్పథం

సామాజిక స్తరీకరణ సిద్ధాంత కర్తల్లో ప్రకార్యవాదులను ప్రధానంగా చెప్పుకోవచ్చు. వీరు స్తరీకరణను మొత్తం సామాజిక అధ్యయనంలో భాగంగానే పరిశీలించారు. ప్రకార్యవాదుల దృష్టిలో ప్రతిసమాజానికి కొన్ని విధులుంటాయి.

అంటే ఆ సమాజంలోని వ్యక్తులు, సముదాయాలు కొన్ని విధులను, ప్రకార్యాలను (Functions) పాటించవలసి వుంటుంది. ఇట్లా ప్రత్యేకత గలిగిన ఒక విధిని, లేదా పనిని నిర్వహించే అనేక మంది వ్యక్తులు కలిసి సముదాయంగా ఏర్పడతారని ఈ సముదాయాల సమిష్టి రూపమే సమాజమని ప్రకార్యవాదుల అభిప్రాయం. అంటే పరిపూర్ణమైన సమాజంలో సభ్యుడైన ప్రతి వ్యక్తి ఏదో ఒక విధిని నిర్వహిస్తుంటాడు. ఆ వ్యక్తి విధిగా నిర్వహించే పని సమాజ మనుగడకు దోహదపడతుంటుంది. ఇట్లా ఒక ప్రత్యేక మైన విధిని నిర్వహిస్తూ సామాజిక మనుగడకు దోహదపడే జనసమూహాన్ని ప్రకార్యవాదులు "స్తరంగా" పేర్కొన్నారు. ఒక చెట్టులో వ్రేళ్లు, కాండము, పత్రాలు, పుష్పాలు ఏ రకంగానయితే దేని విధి అది నిర్వహిస్తూ మనుగడ సాగిస్తుందో సమాజంలోని సముదాయాలు కూడా అదే విధంగా సమాజ మనుగడకు దోహద పడుతాయని ప్రకార్యవాదుల భావన. ప్రాచీన భారత సమాజంలోని కులవ్యవస్థను దీనికి ఉదహరణగా పేర్కొనవచ్చు.

BRAOU

ప్రకార్యవాదుల్లో టాల్ కాట్ పార్సన్స్ ముఖ్యుడు. సామాజిక స్థరీకరణ అనేది ఉమ్మడి సామాజిక విలువల నుంచి ఏర్పడింది. ఈ సామాజిక విలువల పట్ల సమాజంలోని వ్యక్తులందరికి ఏకాభిప్రాయం కుదిరినప్పుడే సమాజంలో సుస్థిరత, సహకారం పెంపొందడానికి అవకాశం ఉంటుందని పార్సన్స్ భావించాడు. ఈ సామాజిక విలువలను ఎవరైతే తూచా తప్పక పాటిస్తారో, ఈ విలువలను ఎవరైతే ఎక్కువగా గౌరవిస్తారో, ఎవరు చేసే పనివైతే సమాజంలో ఎక్కువ ఉపయోగం ఉంటుందో వారికి సమాజంలో ఎక్కువ పలుకుబడి ఉంటుందని ఆయన భావన. ఉదాహరణకి వైదిక కాలంలో బ్రహ్మణుడికి ఎక్కువ గౌరవం లభించినట్లే; గిరిజన సముదాయంలో వ్యక్తికంటే ఆ వ్యక్తి యొక్క శక్తియుక్తులకి లేదా ఆ వ్యక్తి నిర్వహించే ప్రకార్యానికి విలువ ఉంటుంది. ఈ ప్రకార్యవిలువను బట్టి హోదా, పలుకుబడి ఉంటుంది. ఇట్లా సమాజంలో వ్యక్తికి లభించే హోదా, పలుకుబడి ఆధారంగా సామాజిక స్తరీకరణ ఏర్పడుతుంది.

అమెరికన్ సామాజిక శాస్త్రవేత్తలు డేవిస్, మూర్ (Davis & Moor) 1945 సంవత్సరంలో సరికొత్త సామాజిక స్తరీకరణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. స్తరీకరణ అనేది ప్రకార్య ఆవశ్యకతగా ప్రతి సమాజానికి తప్పని సరి అవసరంగా పేర్కొన్నారు. ఏ సమాజంలో నైనా అసమానతలు తప్పవని, ఈ అసమానతలు పూడ్చేందుకు సమాజాన్ని ప్రాధన్యతలను బట్టి ప్రకార్యపరమైన యూనిట్లుగా విభజించి, ఆ యూనిట్లను సామర్థ్యం, నైపుణ్యం ఉన్న వ్యక్తులతో నింపాలని ప్రతిపాదించారు డేవిస్, మూర్‌ల ప్రతిపాదన పెద్ద ఎత్తున విమర్శలకు గురైంది. మెల్విన్ ట్యుమిన్ (Melvin Tumin) అనే సామాజిక శాస్త్రవేత్త సమాజాన్ని ఈ

విధంగా విడదీసి ఒక స్తరాన్ని ఉన్నతమైనదిగా, మరొక స్తరాన్ని తక్కువ ప్రాధాన్యత కలదిగా గుర్తించడం సాధ్యపడదని పేర్కొన్నాడు. ట్యూమిన్ ప్రకారం అసమానతలకి అధికారం ఆయువుపట్టు. సమాజంలో ఒక సమూహం నిర్వహిస్తున్న విధికంటే ఆ సమాజంలో ఆ సమూహానికి ఉన్న అధికారాలను బట్టి పలుకుబడి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. మనదేశంలో వ్యవసాయం చేసే రైతు అన్ని వ్యక్తుల కంటే గొప్పదైన కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నప్పటికీ, సమాజంలో చదువుకున్న సంపన్నులకంటే, ఉద్యోగుల కంటే తక్కువ హోదాని గౌరవాన్ని పొందుతున్నాడు. అంటే ఇక్కడ వ్యక్తి ప్రకార్యాన్ని పనిని, ఆ పనికున్న ప్రాధాన్యతని బట్టి కాకుండా ఆ వ్యక్తికి ఉన్న అధికారాన్ని సంపదని, పలుకుబడిని బట్టి గౌరవం హోదా గుర్తింపు లభిస్తున్నాయి. ట్యూమిన్ ప్రకారం అనుభవిస్తున్న అధికారాన్ని బట్టి మాత్రమే సమాజాన్ని అంచెలంచెలుగా విభజించడం లేదా స్తరీకరించడం వీలుపడుతుంది.

డేవిస్, మూర్‌ల వాదన ప్రకారం వ్యక్తుల శక్తియుక్తుల బట్టి పాత్రల విభజన, విధుల కేటాయింపు జరగాలి. కానీ సంకుచిత సాంప్రదాయ వ్యవస్థలో అలా జరగదని ట్యూమిన్ పేర్కొన్నాడు. ఇతని దృష్టిలో సామాజిక స్తరీకరణ చాలాసార్లు ప్రతిభా వంతులకు ప్రతిబంధకంగా ఉంటూ వస్తుంది. దీనికి భారతదేశంలోని కులవ్యవస్థని ఆయన ప్రధానంగా పేర్కొన్నాడు. భారత సామాజిక వ్యవస్థలో దళిత కులానికి లేదా నిమ్నకులానికి చెందిన వ్యక్తులు ఎంత ప్రతిభావంతులైనప్పటికి సామాజిక వ్యవస్థలోనూ ఉన్నత స్తరంలో స్థానం సంపాదించుకోలేక పోతున్నాడని, బ్రాహ్మణుడిలా సమాజాన్ని శాసించే అధికారం పొందలేక పోతున్నాడని అదే విధంగా అమెరికాలో నల్లజాతి ప్రజలు ఈనాటికీ రాజకీయాల్లో ఇతర పరిపాలనా వ్యవస్థల్లో ఉన్నతస్థానానికి చేరుకోలేకపోతున్నారని ఇతను పేర్కొన్నాడు. అయితే సమాజం అభివృద్ధి దిశలో ముందుకు పోతున్న కొద్దీ కొంతవరకు ప్రతిభ, సామర్థ్యాల ప్రాతిపదికగా విధుల కేటాయింపు జరుగుతుందని ఆయన అంగీకరించాడు.

ప్రకార్యవాదుల ప్రకారం సమాజాన్ని విభిన్న స్తరాలుగా విభజించి నైపుణ్యత, ప్రతిభ కల్గిన వారితో ఆయాస్తరాలను లేదా విభాగాలను భర్తీ చేయాలి. ఈ విధంగా చేయడం వల్ల సుస్థిర సామాజిక వ్యవస్థ ఏర్పడుతుంది. అయితే ఈ అభిప్రాయాన్ని ట్యూమిన్ పూర్తిగా వ్యతిరేకించాడు. ఈ రకమైన హోదాలు ఇవ్వడం మూలంగా ఒక స్తరంలో ఉన్నవారికి ఇంకో స్తరంలో ఉన్నవారితో ఘర్షణ తప్పదని ఆయన పేర్కొన్నాడు. భారతదేశంలో కులాలు తొలిదశలో సామాజిక అవసరాల రీత్యా అంటే ప్రకార్యాల పరంగా ఏర్పడినప్పటికీ ఇప్పుడు వివిధ కులాల మధ్య అసమానతలు తలెత్తి ఘర్షణలు జరుగుతున్నాయి. అదేవిధంగా ప్రకార్యాల వారీగా ఏర్పడ్డ సామాజిక సాంప్రదాయ స్తరీకరణను ధిక్కరించి సమాన హక్కులు, సమాన హోదా, సమాన అధికారం కోసం ఆందోళనలు సాగుతున్నాయి. సమాజంలో సంక్లిష్టత పెరిగిన క్రమంలో మానవ సంబంధాల్లో కూడా సంక్లిష్టత తీవ్రమైంది. ఈ దశలో మార్క్సిస్టు దృక్పథం వెలుగులోకి వచ్చి నూతన శాస్త్రీయ సామాజిక స్తరీకరణను ప్రతిపాదించింది.

## 4.7.2 మార్క్సిస్టు దృక్పథం

ప్రకార్యవాదుల సామాజిక స్తరీకరణ సిద్ధాంతాన్ని త్రోసిపుచ్చి ప్రత్యామ్నాయాన్ని ప్రతిపాదించిన వారిలో మార్క్సిస్టులను ప్రధానంగా పేర్కొనవచ్చు. కారల్ మార్క్స్ ప్రతిపాదించిన గతి తార్కిక భౌతిక వాద దృక్పథంలో చరిత్రను విశ్లేషించే పద్ధతిని మార్క్సిస్టు దృక్పథం అంటున్నారు. సామాజిక స్తరీకరణ ప్రకార్యవాదులు చెబుతున్నట్లు ఐక్యతను పెంపొందిస్తుందను కోవడం భ్రమ అని, సమాజాన్ని విడదీయడానికి, సమాజంలో అసమానతలను పెంచడానికి తప్ప ఇది ఇంకెందుకూ పనికి రాదని మార్క్సిస్టుల అభిప్రాయం. ఈ అసమానతలు ఒక సమూహాన్ని ఇంకో సమూహం దోచుకోవడానికి ఉపయోగపడతాయని మార్క్స్

పేర్కొన్నాడు. ఈ రకంగా సమాజంలో ఆర్థిక, అధికార అసమానతల మూలంగా ఏర్పడే స్తరాలనే కార్ల మార్క్స్ వర్గాలుగా పేర్కొన్నాడు. మార్క్స్ ప్రకారం ఏ సమాజంలో నైనా రెండు ప్రధాన వర్గాలుంటాయి. ఒకటి పాలక వర్గంగా ఉంటే రెండోది పాలిత వర్గంగా ఉంటుంది. ఉత్పత్తి శక్తులమీద ఉత్పత్తి సాధనాల మీద అధిపత్యం కలిగి ఉన్న వర్గం ఎప్పుడైనా పాలక వర్గంగా ఉంటుంది. ఈ రకంగా ఉత్పత్తి శక్తుల మీద అసమాన అధిపత్యమే సమాజంలో ఒక వర్గానికి ఇంకో వర్గానికి మధ్య ఘర్షణలకు లేదా వర్గ పోరాటలకు కారణమవుతుంది. సమాజంలోని న్యాయ వ్యవస్థ రాజకీయ వ్యవస్థ తదితర సంస్థలు కూడా అధిపత్యవర్గం చెప్పుచేతల్లో ఉంటాయి. ఉత్పత్తి శక్తులు సమాజ పరమైనప్పుడే వర్గాలు అంతరించిపోతాయి. వర్గాలు అంతరించిపోయినప్పుడే దోపిడి పీడన కూడా అంతరిస్తుందని మార్క్స్ పేర్కొన్నాడు.

మార్క్స్ ప్రకారం చరిత్రలో ప్రతి సమాజంలో కూడా ఉత్పత్తి శక్తుల మీద అధికారం ఒక వర్గానికే ఉండటం మూలంగా లేదా ఉత్పత్తి శక్తులు కొందరి చేతుల్లోనే ఉండడం మూలంగా మిగతా జనం దోపిడీకి గురి అయ్యారు. ఇక్కడ వర్గం అంటే ఉత్పత్తి సంబంధాల ప్రాతిపదికన ఏర్పడిన సాధర్మ్య సామాజిక సమూహాంగా మార్క్స్ పరిగణించాడు. ఫ్యూడల్ వ్యవస్థలో భూస్వాములు భూమిలేని నిరుపేద కూలీలు పెట్టుబడి దారీ వ్యవస్థలో కంపెనీ యజమానులు, పెట్టుబడుదారులు లేదా బూర్జువాలు కార్మికులు ఇట్లా రెండు వర్గాలుగా సమాజం విభజించబడి ఉంటుంది. ఈ వర్గాలు ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్నప్పటికీ నిరంతరం సంఘర్షిస్తూనే ఉంటాయని మార్క్స్‌ఇజం చెబుతుంది.

సమాజ క్రమంలో అదిమ కమ్యునిస్టు వ్యవస్థలో స్తరీకరణ హెచ్చు తగ్గులు లేవని, ఎప్పుడైతే అదనపు ఉత్పత్తి ప్రైవేటు అస్తి ఏర్పడిందో అప్పటినుంచి సమాజంలో వర్గాల వారీ స్తరీకరణ మొదలైందని మార్క్స్ సూత్రీకరించాడు. సమాజంలో ఉత్పత్తి శక్తులపై అంటే ఫ్యూడల్ సమాజంలో భూమిపై, పెట్టుబడి దారీ సమాజంలో పరిశ్రమలపై అధికారం ఏ వర్గానికైతే ఉంటుందో ఆవర్గానికి రాజకీయ వ్యవస్థపై పట్టు ఉంటుందని పేర్కొన్నాడు. భూస్వామ్య పెట్టుబడి దారీ వర్గమే ఆయా సమాజాల్లో పాలక వర్గం అవుతుందని ఈ పాలక వర్గం తన కవసరమైన రీతిలో చట్టాలు రూపొందించుకొని న్యాయ వ్యవస్థను, ఇతర సంస్థలను చెప్పుచేతల్లో ఉంచుకొంటుందని మార్క్స్ పేర్కొన్నాడు. ఈ రకంగా స్తరీకరణకు ఉత్పత్తి శక్తుల మీద అధిపత్యం ఆర్థిక అసమానతలు, మూలకారణమని మార్క్సిస్టుల అభిప్రాయం.

BRAOU

మార్క్స్ తరువాతి కాలంలో వచ్చిన సామాజిక శాస్త్రవేత్తలు కొందరు మార్క్సిస్టు దృక్పధాన్ని అంగీకరిస్తునే కొన్ని సవరణలు చేసారు. వీరిలో మాక్స్ వెబర్ అనే జర్మన్ సామాజిక శాస్త్రవేత్త ముఖ్యుడు. సమాజం అర్థిక ప్రాతిపదికన వివిధ వర్గాల వల్ల ఏర్పడినప్పటికీ మార్క్స్ చెప్పినట్లు ఈ వర్గాలు రెండే కాదని హోదా, పలుకుబడి, సంపదలను బట్టి సమాజంలో అనేక వర్గాలుంటాయని అయున ప్రతి పాదించాడు. ప్రతిసమాజంలో వ్యక్తికి ఉత్పత్తి శక్తులమీద అధికారంతో పాటు సంఘంలో లభిస్తున్న హోదా, లేదా గౌరవాలను బట్టి కూడా వర్గాలు ఏర్పడతాయని వెబర్ అన్నాడు. ఆర్థిక వ్యత్యాసాల వల్ల ఏర్పడే అంతరాలతో పాటు సామాజిక హోదా, వ్యక్తి శక్తి సామార్థ్యాలు, వృత్తి నైపుణ్యత వంటివి కూడా స్తరీకరణకు ప్రమాణాలౌతాయని ఆయున సూత్రీకరించాడు.

## 4.8 సైద్ధాంతిక స్తరీకరణ

సమాజంలోని ప్రజలు నమ్ముతున్న రాజకీయ విశ్వాసాల ఆధారంగా సమాజాన్ని అంచెలవారీగా విభజించ... సైద్ధాంతిక స్తరీకరణ అంటారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజలను ఈ రకంగా సైద్... విభజించడం అనాదిగా వస్తూనే ఉన్నది. మొట్టమొదటిసారిగా మొదటి...

బ్రిటన్‌లో ప్రజలు సైద్ధాంతికంగా విడిపోయారు. యుద్ధం ముగిసిన తరువాత అప్పటిదాక వున్న రాచరికం యధాతథంగా కొనసాగాలని ఒక వర్గం పట్టుబట్టగా, రాచరికం స్థానంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ప్రతిష్టింపజేయాలని మరోవర్గం ప్రయత్నించాయి. ఈ రెండు వర్గాల్లో రాచరికాన్ని బలపరచాలన్న వారిని 'విగ్గు'లని, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని కోరిన వారిని 'టోరీ'లనీ అన్నారు. ఆ తరువాత ఇది యూరప్‌లోని ఇతర ప్రాంతాలకు కూడా వ్యాపించింది.

ప్రపంచ వ్యాప్తంగా ఆధునికీకరణ పారిశ్రామికీకరణ విస్తృతమైన నేపథ్యంలో పెట్టుబడిదారీ వ్యవస్థ బలోపేతమయ్యింది. ఈ పెట్టుబడిదారులు క్రమక్రమంగా పాలనాంగం న్యాయవ్యవస్థపై కూడా పట్టు సంపాదించుకున్నారు. ఈ క్రమంలో పెట్టుబడిదారీ విధానాన్ని, దాని పర్యవసానాలన్నీ అలాగే పెట్టుబడిదారుల చెప్పుచేతల్లోవున్న పార్లమెంటరీ వ్యవస్థను వ్యతిరేకించే వర్గం బలపడింది. కారల్ మార్క్స్ రాసిన 'కమ్యునిస్టుమేనిఫెస్టో' ప్రాతిపదికన సమానత్వం కలిగివుండే సర్వస్వతంత్ర ,గణతంత్ర వ్యవస్థ స్థాపన కోసం ఈ వర్గం పనిచేయడం ప్రారంభించింది. వీరిని సోషలిస్టులుగా కమ్యూనిస్టులుగా పిలువటం మొదలుపెట్టారు. వీరి సిద్ధాంతాన్ని 'మార్క్సిజం' అన్నారు. మార్క్సిజం సహజంగానే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పీడితులను ఆకర్షించింది. యూరపియన్ దేశాల్లో కార్మికవర్గ పార్టీగా అవతరించిన కమ్యునిస్టుపార్టీ తరువాతకాలంలో విశ్వవ్యాప్తంగా పీడితులు, కార్మిక, కర్షకుల్లో ఒక సైద్ధాంతిక అవగాహనకు కారణమైంది. ఈ దశలో కమ్యునిస్టులు కమ్యునిస్టేతరులుగా ప్రజలు విభజింపబడ్డారు. పీడితులు కమ్యునిస్టు సిద్ధాంతాన్ని బలపరిస్తే పెట్టుబడిదారులు భూస్వాములు, పాలనా వ్యవస్థలో భాగస్వాములైన ఉద్యోగులు కమ్యూనిజాన్ని వ్యతిరేకించారు. ప్రపంచంలోని అన్ని ప్రాంతాల్లోను ఇటీవలకాలం వరకూ ఇటువంటి రెండు రాజకీయ భావజాల శిబిరాలు నిరంతరం సంఘర్షిస్తూ నిలదొక్కుకుంటూ వచ్చాయి.

BRAOU

కమ్యునిస్టులు సోషలిస్టుల మధ్య భావసారూప్యత ఉన్నప్పటికీ కొద్దిపాటి విభేదాలు కూడా ఉన్నాయి. అలాగే కమ్యూనిస్టేతరుల్లో కూడా అనేక అభిప్రాయభేదాలు కనిపిస్తాయి. బ్రిటన్‌లో కన్సర్వేటివ్‌పార్టీ, లేబర్‌పార్టీ అమెరికాలో రిపబ్లికన్ పార్టీ, డెమోక్రటిక్ పార్టీ ఇండియాలో భారత జాతీయ కాంగ్రెస్, భారతీయ జనతాపార్టీ వంటివి కమ్యునిస్టేతర పార్టీలే. ఈ పార్టీలు ప్రజలను సిద్ధాంతాల వారీగా విడదీసి బలమైన శక్తులుగా కూడా ఎదిగాయి.

## 4.9.0 భారతదేశంలో సామాజిక స్తరీకరణ

ప్రపంచంలోని అన్ని సమాజాలకంటే గూడా భారతీయ సమాజం స్తరీకరణ విషయంలో సంక్లిష్టమైనది. అత్యంత ప్రాచీన చారిత్రక, తాత్త్విక పునాదిగలిగిన భారతీయ సమాజం ప్రపంచంలోని సాంప్రదాయ సమాజాలకు ఒక నమూనాగా చెప్పుకోవచ్చు. భారతదేశంలో స్తరీకరణ అనాదిగా సాంప్రదాయ బద్ధంగా వుంది. వైదిక కాలంనుంచే భారత సమాజం అంచెలంచెలుగా విభజింపబడి ఉన్నట్టు ఆధారాలున్నాయి. అంటే భారతీయ సామాజిక స్తరీకరణ నాలుగు వేల సంవత్సరాలకంటే ముందునుంచీ వున్నదన్నమాట. ఈ స్తరీకరణ బాహ్యరూపంగా వుంటూ సామాజిక వికాసగతిలో ప్రధానమైన పాత్ర నిర్వహిస్తూ వస్తున్నది. మొదట భారతసమాజం ఒకేజాతి, ఒకేమతం, ఒకే సంస్కృతి కలిగి ఉన్నప్పటికీ పరిణామక్రమంలో భిన్నజాతులు, విభిన్నమతాలు అనేక సంస్కృతులతో సంక్లిష్టదశకు చేరుకున్నది. ఇప్పుడు భారతసమాజం అంచెలంచెలుగా విడిపోయి స్త[illegible]స్థగా మిగిలిపోయింది.

## 4.9.1 జాతి, మతపర స్తరీకరణ

భారతదేశ చరిత్రలో నాలుగైదువేల సంవత్సరాలు వెనక్కి వెళితే అప్పుడు సమాజం ఇంత సంక్లిష్టంగా లేదు. సమాజంలో ఇన్ని దొంతరలు ఇన్ని హెచ్చుతగ్గులు లేవు. చరిత్రలో ఆర్యుల ఉనికితో ఈ భేదాలు, హెచ్చుతగ్గులు మొదలయినాయి. గోధుమ వర్ణంగల వారిని ఆర్యులని, దసవర్ణం (నల్లని రంగు) వారిని దస్యులనీ మొదటి సారిగా స్తరీకరించిన దాఖలాలున్నాయి. అప్పుడు కూడా స్తరీకరణ రెండు అంచెలతోనే వుంది. ఆ తరువాత వేదాలు ఉపనిషత్తుల కాలంలో ఈ రెండు స్తరాలు నాలుగు అంచెలుగా మారిపోయాయి. సమాజంలో ఒకరిపై ఒకరికి అధికారాలు పెరిగిపోయి చాతుర్వర్ణవ్యవస్థ ఏర్పడింది. వైదిక మత దార్శనికులు, పండితులు బ్రహ్మ తల భాగం నుంచి బ్రహ్మణుడు, బాహువులనుంచి క్షత్రియుడు, ఉదరభాగం నుంచి వైశ్యుడు, పాదాల నుంచి శూద్రుడూ పుట్టినట్టు చెప్పారు. ఆ ప్రకారంగా సమాజంలో విధులను పాత్రలను కేటాయించారు. అది ఆ కాలానికి స్తరీకరణ అయింది.

యజ్ఞయాగాదులు, వేదపారాయణం చేసేవారిని బ్రాహ్మణులుగా, రాజ్యపాలన రక్షణ వ్యవహారాలు చూసేవారిని క్షత్రియులని, వ్యవసాయ, వ్యాపారలావాదేవీల నిర్వాహకులను వైశ్యులని వ్యవహరిస్తూ నాలుగో తరంలో వుంటూ పై మూడు వర్ణాలకు సేవలు చేసే వారిని శూద్రులనీ పిలిచారు. ఆ కాలంలో ఆర్యులు, ఆర్యులకు అండగా నిలిచిన వారు పై మూడు వర్ణాలుగా, ద్రవిడులు, స్థానికులు శూద్రులుగా వ్యవహరింపబడ్డారు. ఇట్లా జాతిపరమైన స్తరీకరణ ఒక రూపాన్ని ఏర్పరచుకుంది. ఆతరువాత ఈ స్తరీకరణలో అనేక మార్పులు జరిగి భారత సమాజం ఆచారాలు పద్ధతులు, సంస్కృతులు, ఆహారపుటలవాట్లు కట్టుబట్లు వారీగా శాఖోపశాఖలుగా చీలి పోయింది. ఒక్కో సమూహం ఒక్కొక్క శ్రేణిగా సామాజిక వ్యవస్థలో ప్రధనమైన అంశంగా ఎదిగింది. ఈ శ్రేణులే ఇప్పుడు వివిధ కులాలుగా మారిపోయి భారతీయ సమాజం ఒక సంకుచిత దృఢ (Closed & Risid) వ్యవస్థగా రూపొందింది.

BRAOU

దీనితో పాటు మహమ్మదీయుల సుధీర్ఘపాలన ఆంగ్లేయుల ఆధిపత్యం కూడా సమాజాన్ని మరింత సంక్లిష్టం చేశాయి. మహమ్మదీయుల పాలనలో అవసరాల రీత్యా కొందరు ఆకర్షితులై కొందరు ఇస్లాం మతం స్వీకరించడం, పర్షియా, గల్ఫ్ ప్రాంతాలనుంచి వలసలు రావడం వల్ల దేశంలో ఇస్లాం ఒక బలమైన మతంగా ఎదిగింది. అదే విధంగా ఆంగ్లేయుల ప్రోత్సాహం వల్లా క్రైస్తవ మిషనరీల వల్ల దేశంలో అనేక మంది క్రైస్తవ మతం స్వీకరించారు. నీటికంటే ముందు నుంచీ వున్న భౌద్ధమతం, జైనమతాలు కూడా ఇంకా ఉనికిలో వున్నాయి. ఈ ప్రభావాల మూలంగా భారతీయ సమాజం అనేక సంస్కృతుల సంగమంగా మారిపోయింది.

భిన్న మతాలు, విభిన్నమైన జాతులు భాషలు అనేకమైన కులాలు సంస్కృతులతో భారతీయ సమాజం విస్తృతంగా స్తరీకరించబడిన వ్యవస్థగా రూపొందింది.

## 4.9.2 భారతదేశంలో సైద్ధాంతిక స్తరీకరణ

భారతదేశం చాలాకాలం వరకు సాంప్రదాయ ప్రభువులపాలనలో, వలస వాదుల ఏలుబడిలో వుంది. అయినప్పటికీ హిందూ మత ధర్మాలు పద్ధతులే చాలా వరకు ప్రజల విశ్వాసాలని, జీవన విధానాలనీ ప్రభావితం చేస్తూ వచ్చాయి. ఆంగ్లేయుల పాలన నుంచి విముక్తమై దేశం స్వాతంత్ర్యం పొందిన తరువాత అంటే 1947 తరువాతే దేశంలో భిన్న రాజకీయ విశ్వాసాలు, సిద్ధాంతాలు ప్రవేశించాయి.

దేశంలో మొదటి రాజకీయ పార్టీలు చాలావరకు సోషలిస్టు సిద్ధాంతం వైపు ఆకర్షితమైనాయి. క్రమక్రమంగా వాటిలో కొన్ని మధ్యేవాద పార్టీలుగా మారి పోయాయి. రాజకీయ సిద్ధాంతాల వారీగా భారత పార్లమెంటరీ పార్టీల్లో కాంగ్రెస్, జనతా, కమ్యూనిస్టు, భారతీయ జనతా పార్టీలు ముఖ్యమైనవి. మొదట కాంగ్రెస్ సోషలిస్టు

సోషలిస్టులు కొందరు జనతాపార్టీ ఏర్పాటుచేసారు. అదే వర్గం మరికొందరు కాంగ్రెస్ వాదులతో 1980 చివరి కాలంలో జనతాదళ్‌గా కొత్త పార్టీ పెట్టారు. కాంగ్రెస్ జనతా (దళ్) కూటములు వేరువేరు అయినప్పటికీ కాంగ్రెస్‌లో సోషలిస్టులు, జనతా (దళ్)లో కాంగ్రెస్ వాదులు కొనసాగారు.

భారతీయ కమ్యూనిస్టుల లక్ష్యం ఒకటే అయినప్పటికీ మార్గంలో వున్న అభిప్రాయ భేదాల మూలంగా అనేక చీలికలకు గురయ్యారు. వీరిలో సాయుధ పోరాటం చేపట్టిన మార్క్సిస్టు లెనినిస్టులు CPI(ML) పార్లమెంటరీ వ్యవస్థపై విశ్వాసం ప్రకటించిన CPI, CPM ఫార్వర్డ్‌బ్లాక్ వంటి పార్టీలను ముఖ్యంగా చెప్పుకోవచ్చు.

భారత రాజకీయాలను సిద్ధాంత పరంగా విడదీస్తే మూడో వర్గం కూడా కనిపిస్తుంది. సనాతన హిందూ ధర్మాన్నే రాజకీయ విశ్వాసంగా మలిచిన విశ్వహిందూ పరిషత్, భారతీయ జనతాపార్టీలు దీనికి ఉదాహరణ. 70వ దశకంలో జనసంఘ్‌గా వున్న నాయకులు జనసంఘను రద్దుచేసి భారతీయ జనతాపార్టీని ఏర్పాటు చేశారు. భారత రాజకీయాలు ఈ మూడు ప్రధాన భూమికల్లో స్తరీకరించబడ్డాయి.

## 4.10 సారాంశం

సమాజాన్ని వివిధ సాధర్మ్య సమూహాలుగా విభజించడాన్ని సామాజిక స్తరీకరణ అంటారు. ఒక స్తరం ఒకే లక్షణాలు, ఒకే సంస్కృతులు, జీవన విలువలు వృత్తి ప్రవృత్తులు కలిగిన వ్యక్తుల సమూహంగా వుంటుంది. సమాజ నిర్మాణం ఇటువంటి అనేక స్తరాల లేదా అంచెలతో కూడుకుని వుంటుంది. సమాజాన్ని అర్థం చేసుకోవడానికి, ఈ క్రమానుగత శ్రేణులను అర్థం చేసుకోవలసివుంటుంది. వ్యక్తి పలుకుబడి, సంపద, అధికారం వంటివాటి ఆధారంగా సామాజిక భేదాలభిస్తుంది. స్తరీకరణ విశ్వవ్యాప్తంగా వుంది. హెచ్చుతగ్గులు ఆదిమ కాలం నుంచీ ఉన్నాయి. చేసే పనిని, ఆ పనినైపుణ్యాన్ని బట్టి వ్యక్తికి సమాజంలో ఒక స్తరంలో స్థానం లభిస్తుందని ప్రకార్య వాదులు చెబితే, సంపద లేదా ఆస్తిపాస్తులు హెచ్చుతగ్గులే సమాజంలో వర్గాలు సృష్టించాయని మార్క్సిస్టుల వాదన.

సామాజికంగానే కాకుండా సైద్ధాంతికంగా, రాజకీయంగా కూడా సమాజాన్ని క్రమశ్రేణిలో విభజించవచ్చు. ప్రపంచంలో కమ్యూనిస్టులు సోషలిస్టులు, కేపిటలిస్టులు ఇట్లా అనేక భావజాలాలు వున్నాయి. భారతీయ సమాజానికి విస్తృతంగా స్తరీకరణ చెందిన పురాతన సమాజంగా పేరుంది. జాతులు, మతాలు, కులాలు, సంస్కృతులు, భాషల వారీగా భారతీయ సమాజం వేలాది శ్రేణులుగా విభజితమైవుంది. స్తరీకరణను అర్థం చేసుకుంటే ఆ సమాజపు రాజకీయ వ్యవస్థను సులభంగా అర్థం చేసుకోవచ్చు.

- ఘంటా చక్రపాణి

## 4.11 చదువదగిన పుస్తకాలు


1. Bottomore T.B. : Sociology
2. Haraiambos M. : Sociology Themes and Perspectives
3. Jangam T.R : Political Sociology


BRAOU

## 4.12 నమూనా పరీక్షాప్రశ్నలు

I ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తులలో సమాధానాలు వ్రాయండి.

1. సామాజిక స్తరీకరణను నిర్వచించి, స్తరీకరణకు విభేదీకరణకు గల వ్యత్యాసాన్ని వివరించండి
2. ప్రకార్యవాద (Functionalist) మార్క్సిస్టు స్తరీకరణల గురించి వ్రాయండి?
3. భారతదేశ సామాజిక స్తరీకరణపై ఒక వ్యాసము రాయండి

II కింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానాలు రాయండి

1. స్తరీకరణ లక్షణాలు రాయండి
2. సామాజిక వ్యవస్థ వలెనే రాజకీయ వ్యవస్థ కూడా స్తరీకరించ బడి వుంది. వివరించండి?
3. సైద్ధాంతిక స్తరీకరణను వివరించండి.

BRAOU

BRAOU

# ఖండం - 2 భావనలు

BRAOU

రాజకీయ సమాజశాస్త్రంలో కొన్ని ప్రాతిపదిక భావనలు ఉన్నాయి. వీటిని ముందుగా తెలుసుకోవాల్సిఉంది. వీటి అవగాహన లేకుండా రాజకీయ వ్యవస్థ తీరు తెన్నులను అంచనా వేయటం కష్టం. ఈ ప్రాతిపదిక భావనల ఆధారంగానే రాజకీయ సమాజశాస్త్రాన్ని అర్థం చేసుకోవాల్సి ఉంది.

BRAOU

# భాగం - 5 రాజకీయ సామాజికీకరణం

## విషయక్రమం


5.1 లక్ష్యాలు
5.2 పరిచయం
5.3 రాజకీయ సమాజికీకరణం - అర్థం
5.4 సామాజికీకరణపు మూలకాలు
5.5 రాజకీయ సమాజికీకరణ అవిర్భావం - పరిణామక్రమం
5.6.0 రాజకీయ సమాజికీకరణంలో రకాలు
5.6.1 స్పష్టమైన రాజకీయ సామాజికీకరణం
5.6.2 విక్షిప్తమైన రాజకీయ సామాజికీకరణం
5.6.3 ప్రత్యేకమైన రాజకీయ సామాజికీకరణం
5.6.4 సార్వజనీన రాజకీయ సామాజికీకరణం
5.6.5 ఖచ్చితమైన రాజకీయ సామాజికీకరణం
5.6.6 DIFFUSE SOCIALISATION
5.7 రాజకీయ సామజికీకరణ దశలు
5.8.0 సామాజికీకరణ సాధనాలు
5.8.1 కుటుంబం
5.8.2 పాఠశాల
5.8.3 స్నేహవర్గాలు
5.8.4 ప్రసారసాధనాలు
5.8.5 రాజకీయ పక్షాలు
5.8.6 రాజకీయ వ్యవస్థ
5.8.7 కులవ్యవస్థ
5.9 ముగింపు
5.10 చదువదగిన పుస్తకాలు
5.11 నమూనా పరీక్షాప్రశ్నలు


BRAOU

## 5.1 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదివాక మీరు

- రాజకీయ సామాజికీకరణం అర్థం
- రాజకీయ సామాజికీకరణం మూలకాలు
- రాజకీయ సామాజికీకరణం రకాలు
- రాజకీయ సామాజికీకరణ సాధనాలను

బాగా వివరించగలుగుతారు.

## 5.2 పరిచయం

రాజకీయ వ్యవస్థతో పరిచయం కలుగ చేసుకొనే ప్రక్రియను రాజకీయ సమాజికీకరణమని వ్యవహరిస్తున్నారు. ఇది రాజకీయాలపై వ్యక్తి అభిప్రాయాలను నిర్ధారించుటయే గాక; రాజకీయ ప్రక్రియతో వ్యక్తి ఏ విధంగా ప్రతిస్పందిస్తాడో తెలియ చేస్తుంది. సమాజపు సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక వాతావరణం వ్యక్తి సామాజికీకరణ ప్రక్రియను ప్రభావితం చేస్తుంది. వ్యక్తి వ్యక్తిత్వం, అనుభవాలు, కూడా సామాజికీకరణ ప్రక్రియకు దోహదం చేస్తాయి. అందువల్లనే రాజకీయ సమాజశాస్త్ర అధ్యయనంలో రాజకీయ సమాజికీకరణ ప్రధానాంశంగా పరిగణనను పొందింది. రాజకీయ భాగస్వామ్యం, భర్తీ, ప్రసరణాలు సమాజికీకరణ ప్రక్రియతో ముడిపడి ఉన్నవి. రాజకీయ సామాజికీకరణ ప్రక్రియలో ప్రసారాలు క్రియాశీలక పాత్రను నిర్వహిస్తుంటాయి. వ్యక్తి సామాజిక, రాజకీయ ప్రవర్తనలు ఒకదానిపై మరొకటి ఏ విధంగా ఆధారపడుతాయో, ఒకదానితో మరొకటి ఏ విధంగా సంబంధం కలిగి ఉంటుందో రాజకీయ సామాజికీకరణ వివరిస్తుంది. పర్యవసానంలో సామాజికశాస్త్రాలు ఒకదానితో మరొకటి ఏ విధంగా ఆధారపడి ఉంటాయో వివరించుతూ; ప్రత్యేకంగా రాజకీయశాస్త్రం, సమాజశాస్త్రం ఏ విధంగా పరస్పరం ఆధారపడి ఉంటాయో కూడా విశదీకరిస్తుంది.

## 5.3 రాజకీయ సమాజికీకరణం - అర్థం

రాజకీయ సామాజికీకరణం ప్రధానంగా అభ్యసించె ప్రక్రియగా చెప్పవచ్చును. వ్యక్తులు ప్రధానంగా అనుభవాల ద్వారా అభ్యసిస్తుంటారు. దీనినే ఎబెర్లీ చర్యా ధోరణిగా పేర్కొన్నారు. గ్రహించిన విషయాలు వ్యక్తుల ప్రవర్తనల ద్వారా బహిర్గతమవుతాయి. విజ్ఞానం సమాచారం లక్ష్యాలు విలువలు అభివృత్తులు అభిప్రాయాలు ద్వారా వ్యక్తుల ప్రవర్తనను తెలుసుకోవచ్చు. సామాజికీకరణం ఒక్క వ్యక్తుల ప్రవర్తనలకే పరిమితం కాక వ్యక్తుల సమూహాల ప్రవర్తనలకు కూడా సంబంధించి ఉంటుంది. సామాజికీకరణం వ్యక్తి బాల్య కౌమార దశలకే పరిమితంకాక వయోజన జీవన పర్యంతం సంబంధం కలిగి ఉంటుంది. సామాజిక చర్యలకు సామాజికీకరణం ప్రాతిపదిక. అంతరంగాను బాహిరంగాను సామాజికీకరణ సామాజిక ప్రవర్తనలను విశదీకరిస్తుంది.

BRAOU

సామాజికీకరణ ప్రక్రియ వ్యవస్థ మనుగడకు ఎంతవరకు దోహదం చేస్తుంది? సామాజికీకరణం సామాజిక మార్పుల మధ్య సంబంధాలను పరిశీలించటానికి సమాజికీకరణ ప్రక్రియ చాల ప్రధానమైన విషయం. మరో విధంగా వ్యవస్థ నిర్వహణకు సామాజికీకరణం ఏ విధంగా ఉపయోగపడుతుందో తెలుసుకోవడానికి కూడా ఉపకరిస్తుంది. తనకు ఆవశ్యకమనుకొన్న విలువలను ప్రవర్తనా ధోరణులను సమాజం నూతనంగా ప్రవేశించే సభ్యులకు బోధించటం ద్వారా శాశ్వతత్వం సిద్ధించుకోవటానికి ప్రయత్నిస్తుంది. సామాజికీకరణం అభ్యసించే ప్రక్రియయేగాక భోదించే ప్రక్రియగూడా. ఇది ఎంతవరకు బాహిరంగాను, అంతరంగాను, చేతనంగాను, అచేతనంగాను ఉంటుందో పరిశీలించాల్సిన అవసరం ఉన్నది.

సమాజంలోని వివిధ ఏజెన్సీల ద్వారా వ్యక్తికి లభించిన సామాజిక స్థితికి తగిన సామాజిక ధోరణుల అభ్యాసమే రాజకీయ సామాజికీకరణం (Political Socialisation) అని హైమన్ నిర్వచించారు. పిల్లలు పెద్దవారుగాను. పెద్దవారు వివిధ పాత్రలలో భర్తీ అవుతున్నప్పుడు అభ్యసించే రాజకీయ అభివృత్తులు ధోరణుల అభ్యాసమే రాజకీయ సామాజికీకరణమని ఆల్మండ్ పావెల్ నిర్వచించారు.

ఎన్‌సైక్లోపీడియా ఆఫ్ సోషియల్ సైన్స్‌స్‌లో రాజకీయ సామాజికీకరణాన్ని ఈ విధంగా విశదీకరించారు. ఈ నిర్వచనంచాల విస్తృతమైనదిగా ఉన్నది. వ్యక్తి తన జీవిత చక్రంలో లాంఛనంగాను లాంఛనేతరంగాను

రాజకీయ రాజకీయేతరమైన విషయాలతో పాటుగా రాజకీయాలకు సంభంధించిన రాజకీయేతర వ్యక్తిత్వం మొదలైన వ్యక్తిత్వస్వభావాలను అభ్యాసం చేయటాన్ని రాజకీయ సామాజికీకరణమని నిర్వచించింది.

వ్యక్తుల రాజకీయ ప్రవర్తనా ధోరణులను భావాలను అభ్యసించే అభివృద్ధి ప్రక్రియలను రాజకీయ సామాజికీకరణమని డేవిడ్ ఈస్టను నిర్వచించారు.

ఆల్మండ్ వెర్బాలు రాజకీయ సామాజికీకరణ భావాన్ని వివరిస్తూ రాజకీయ సంస్కృతుల నిర్వహణ మార్పులకు సంబంధించిన ప్రక్రియయే రాజకీయ సమాజికీకరణమన్నారు.రాజకీయ సమాజికీకరణం మనోవైజ్ఞానిక సంభందమైన భావం. రాజకీయాల లక్ష్యాల గురించి వ్యక్తుల భావాలే రాజకీయ సామాజికీకరణానికి సంబంధించిన ప్రధాన మూలకాలు. ఈ విధమైన భావాలను సమాజంలోని శ్రేష్ఠులు, జనసందోహం, వివిధ సమూహాలు, సామాజిక ఉద్యమాలనుండి గ్రహించవచ్చు. రాజకీయ సామాజికీకరణ ప్రక్రియ ఒక నిరంతర ప్రక్రియ. వ్యక్తుల రాజకీయ భావాలు, విలువలు, అభివృత్తులు, నిరంతరం మార్పులకు గురౌతుంటాయి. చుట్టూ సంభవిస్తున్న రాజకీయసంఘటనలు వ్యక్తులను ప్రభావ పరుస్తుంటాయి.

ఐతే రాజకీయ సామాజికీకరణ ప్రక్రియ ఎల్లప్పుడూ ఒకే విధంగా ఉండదు. కొన్ని సమయాల్లో అది చాలా నెమ్మదిగా సాగుతుంటుంది. ప్రధానమైన సంక్లిష్ట సమయాలలో రాజకీయ సామాజికీకరణం చాల త్వరితంగాను వేగంగాను జరుగుతుంటుంది. రాజకీయ కారణాల వల్ల లంచగొండితనం, రాజకీయ అసమర్ధతలు పెరిగినప్పుడు సామన్య ప్రజల అభివృత్తులు చాలా త్వరితగతిని మార్పులకు గురౌతుంటాయి. ఇలాంటి సందర్భాలలో ప్రజల భావాలు ఒక్కసారిగా మారిపోతుంటాయి.

వ్యక్తి సమాజంలోగల తన స్థానానికి గల సామాజిక విధులను, నడవడికను వివిధ సాధనాల ద్వారా అలవరచుకోనే, నేర్చుకునే ప్రక్రియయే సామాజికీకరణ. బాలురు కౌమార దశకు చేరుటలో, కౌమార దశనుండి యవ్వనదశకు చేరుకొనుటకు, యవ్వనదశనుండి వృద్ధాప్యదశకు అడుగిడటంలో ఆయా పాత్రలకు అనుగుణమైన రాజకీయ ప్రవర్తనలును వివిధ పద్ధతుల ద్వారా అలవరచుకొనటమే రాజకీయ సమాజికీకరణ. వ్యక్తులలో రాజకీయ విలువలను, పద్ధతులను, సమాచారాన్ని కావాలని కలుగచేయుటమే రాజకీయ సమాజికీకరణం అవుతుంది. అన్ని పద్ధతులతో, అన్నివిధాలుగా సమాజం గాని సమాజేతరంగాని రాజకీయ విలువలను ప్రవృత్తులను సంపాదించుకొనటమే రాజకీయ సమాజికీకరణం. రాజకీయ ప్రవృత్తులను, పద్ధతులను వ్యక్తి తన వ్యక్తిత్వపు వృద్ధిక్రమంలో అలవరచుకోవటం రాజకీయ సమాజికీకరణం అవుతుంది. రాజకీయాలంటే ఏమిటి? ఎప్పుడు, ఏ విధంగా వ్యక్తికి అవగాహన కలుగుతుందో వివరించేది రాజకీయ సమాజికీకరణ. రాజకీయ సామాజికీకరణ అస్పష్టంగాను, పరోక్షంగాను వివిధ ప్రక్రియల ద్వారా జరుగుతుంటుంది. రాజకీయ సామాజికీకరణ రాజకీయసమాచర గృహణకు ఎంత ప్రాధాన్యత ఇస్తుందో, రాజకీయ ఉద్రేకాలకు, తాదాత్మ్యతలకు కూడా అంతే ప్రాముఖ్యత ఇస్తుంది. కుటుంబం, పీరు గ్రూపులు, పనిచేయుప్రదేశం, లాంటి వివిధ వ్యవస్థల ద్వారానే గాక లాంఛన ప్రాయమైన విద్యనభ్యసించుట ద్వారా కూడా సమాజికీకరణం జరుగుతుంది. అదివ్యక్తి జీవితాంతం కొనసాగే ప్రక్రియ. జీవితంలో జరిగే సంఘటనలు, అనుభవాల ద్వారా మౌలిక రాజకీయ దృక్పథం పరిపక్వం చెందుతుంది. జీవితకాలంలో ఏ దశలో కూడా సంపూర్ణ రాజకీయ సమాజికీకరణం జరగదు. అది ఏ దశలో కూడా ఆగదు. ఈ రాజకీయ సమాజికీకరణంలో పరిపూర్ణత అనేదిలేదు. అలాంటిది ఎన్నడూ సిద్ధించదు. నిరంతరం కొనసాగుతుంటుంది.

BRAOU

## 5.4 సామాజికీకరణపు మూలకాలు

స్థూలంగా రాజకీయ సామజికీకరణంలో మూడురకాలైన మూలకాలు ఉన్నాయి. అవి. 1. భౌతిక, 2. పరిసరాలు, 3. సాంస్కృతిక.

జన్మత బాలుడు సంపాదించుకొన్న లక్షణాలను పరిమితులను భౌతిక మూలకాలని పిలుస్తున్నారు. ఈ మూలకాలు బాలుని సామాజికీకరణ ప్రక్రియకు సహాయకంగాను నిరోధకంకాను ఉండవచ్చు.

ఇక పరిసరాల్ల మూలకం సామాజికీకరణ ప్రక్రియను ప్రభావ పరుస్తుంటుంది. ప్రతివ్యక్తి పరిసరాల వాతావరణంలో పెరుగుతాడు. ప్రతి సమూహానికి ప్రత్యేకమైన ఆచారాలు అలవాట్లు ఉంటాయి. వ్యక్తి తన చుట్టూగల తోటి వారికొన్ని చర్యలను అంగీకరిస్తాడు. మరికొన్నింటిని తిరస్కరిస్తాడు. ఈ విధమైన వ్యక్తి చర్యలు ప్రతిచర్యలు సమాజికీకరణానికి దోహదం చేస్తుంటాయి. సమాజపుసంస్కృతి కూడా వ్యక్తిసామాజికీకరణ ప్రక్రియ వేగాన్ని ప్రభావ పరుస్తుంది.

వ్యవస్థలోని వివిధ వర్గాలు సమాజంలోని సభ్యులు అనుసరించే సామాజిక దృక్పథాలు మరియు భావాల క్రమపద్ధతిని సమాజికీకరణగా భావించడం జరిగింది. రాజకీయ సమాజికీకరణలో కేవలం ప్రభుత్వ విషయా లేకాక అధికారం, ఉపయోగం, దత్తతలాంటి విషయాలు కూడా చేరిఉన్నాయి. రాజకీయ సంస్కృతిలోకి ప్రవేశం కల్పించే పద్ధతులనే రాజకీయ సామాజికీకరణ అని ఆల్మండ్ అన్నారు. రాజకీయ సామాజికీకరణ అనగా రాజకీయ వ్యవస్థల విషయంలో వ్యక్తి ఏర్పరచుకొన్న ఉద్దేశ్యాలు, భావాల మరియు గుర్తింపుల సముచ్ఛయము. రాజకీయ వర్గాలు, వ్యవస్థలు పద్దతులకు అనుగుణమైన ప్రవర్తనను వ్యక్తి అలవరచుకొనుటమే రాజకీయ సామాజికీకరణ అని లివైన్ అన్వయించాడు. రాజకీయ వ్యవస్థలకు అంగీకారయోగ్యమైన రాజకీయ ప్రవర్తనా సూత్రాలు ఒక తరంనుండి ఇంకొక తరానికి మార్పిడి అగుటను తెలుసుకోవడాన్ని రాజకీయ సామాజికీకరణగా భావించవచ్చును. ఇంకో రకంగా చెప్పాలంటే రాజకీయనుబంధమైన భావాలు నమ్మకాలు, గుర్తింపులు విలువలను వ్యక్తి తనలో అంతర్గతం చేసుకోవడంగా భావించవీలున్నది. రాజకీయాలు వ్యక్తుల ప్రవర్తననుసరించి ఉంటాయన్న అనుభవ పూర్వక నిర్ణయమే రాజకీయ సామాజికీకరణ సిద్ధాంతానికి గుర్తింపు ఇచ్చింది.

BRAOU

ఇటీవలి కాలంలో రాజకీయ సమాజికీకరణ విద్యార్థులు అనుభవ పద్ధతి పైననే ఎక్కువగా కేంద్రీకరిస్తున్నారు. రాజకీయాల్లో, ఎవరు; ఎవరినుండి ఎవరు ఏ సందర్భంలో ఏ విధమైన ప్రభావం; అనే విషయాలపై మనస్సును లగ్నం చేస్తున్నారు. రాజకీయ ధ్యేయాలపై వ్యక్తులకు గల అనుబంధాల అధ్యయనమే రాజకీయ సామాజికీకరణ. దీన్ని సమాజంలోని ప్రజలు, ఉద్యమాలు, వివిధవర్గాలు శ్రేష్ఠులు మొదలైన వారిలో అధ్యయనం చేయవచ్చును.

సందర్భానుసారంగా అనుబంధాలు, విలువలు మారినపుడు రాజకీయ సంస్కృతిలో కూడా మార్పులు వస్తాయి. రాజకీయ భావాల విషయంలో వ్యక్తి సమకాలీన మార్పులకు ప్రభావితుడౌతాడు. అందువల్లనే రాజకీయ సామాజికీకరణ వ్యక్తి జీవితాంతం జరుగుతునే ఉంటుంది. అన్ని వేళలా రాజకీయ సామాజికీకరణ జరుగుతున్నప్పటికి, క్లిష్టసమయాల్లో మరింత త్వరితగతిన జరుగుతుంది. రాజకీయ నాయకులలో అసమర్ధత పెరిగి లంచగొండితనం పరాకాష్టకు చేరినపుడుగాని, యుద్ధం జరుగుతున్నపుడుగాని, తీవ్రసంక్షోభం ఏర్పడి నప్పుడుగాని "ప్రజా" భావాలు తీవ్రమార్పులకు గురి అవుతాయి. ఈ శతాబ్దపు ఉత్తరార్థ ఆరంభకాలంలో వియత్నాం అమెరికా సంయుక్త రాష్ట్రాల యుద్ధం తీవ్ర సంచలనం కలిగించిన విషయం ఇందుకు ఉదాహరణ.

వ్యక్తుల వ్యక్తిత్వం సమాజంలోని వారి అనుభవాల మీద ఆధారితమై ఉంటుంది. అనుభవాలద్వారా విజ్ఞానాన్ని, విలువలను, లక్ష్యాలను, వ్యక్తులు సంతరించుకొంటారు. వ్యక్తులు ఏర్పరచుకొనే లక్ష్యాలు, విలువలు, విజ్ఞానమే వారి అనుభవాలు. ఈ అనుభవాలే వారి వ్యక్తిత్వాన్ని నిర్ధారిస్తాయి. వ్యక్తుల అనుభవాలు, వారు సమాజంలోని వివిధ ఏజెన్సీల ద్వారా పొందుతుంటారు. ఈ ఏజెన్సీలే వ్యక్తుల జీవనాన్ని ప్రభావ పరుస్తుంటాయి. కుటుంబం, విద్య, పీర్‌గ్రూపులు, తోటివ్యక్తులు మతసమూహాలు, ప్రజామాధ్యములా వ్యక్తులను ప్రభావపరుస్తుంటాయి. వ్యక్తుల చర్యలు ఏజెన్సీల పైనకూడా ప్రభావం కలుగ జేస్తుంటాయి.

రాజకీయ సమాజీకీకరణ ప్రక్రియకు ఖచ్చితమైన పద్ధతి అంటూ ఏదిలేదు. అది వివిధ రాజకీయవ్యవస్థలలో వివిధములుగా ఉండవచ్చు లేక ఉండకపోవచ్చును కూడా. సమాజీకీకరణ బాల్య కౌమార, యవ్వన దశలను ప్రభావితం చేస్తూ వ్యక్తుల జీవితకాలమంతా కొనసాగుతుంది. కాని ప్రతి దశలోను ఇది ఒకే విధంగా వ్యక్తులను ప్రభావితం చేస్తుందని చెప్పలేం. రాజకీయ సమాజీకీకరణ జరుగుతున్న వ్యవస్థలలో కూడా వ్యక్తి ఒక క్రమంలో సమాజీకీకరణ చెందుతాడని ఇదమిద్దంగా చెప్పలేం. రాజకీయ సమాజీకీకరణపు మూలకాలను గుర్తించవచ్చును. కాని ఈ మూలకాలను కూడా ఒక క్రమపద్ధతిలో వ్యక్తి పొందలేకపోవచ్చు. మూలకాలన్నింటికి సమానమైన ప్రాముఖ్యత ఉండకపోవచ్చు. సమయానుకూలంగా ఆయా మూలకాల ప్రాముఖ్యతలలో మార్పుచేర్పులు ప్రవేశిస్తుంటాయి. ఒక అంశంపై ఒక వ్యక్తికిగల జ్ఞానం, సమాచారం, విలువలు, నమ్మకాలు, ప్రవృత్తులు వివిధములుగా ఉండవచ్చు. జ్ఞానం మిగతామూలకాలను ప్రభావితం చేస్తుంటుంది. వీటిలో ముందు వెనుకల ప్రసక్తిలేదు. జ్ఞానం, విలువలు, ప్రవృత్తులు సమాచారం అంశాలు వ్యక్తి ప్రవర్తనకు మౌలికమైన అంశాలు. ఇవి ఒకదానికి ఒకటి సంబంధాలు కలిగిఉంటాయి. వీటిని వివిధములుగా కూడా చూడవచ్చును. రాజకీయ సమాజీకీకరణకు కావల్సిన మూలకాలను వ్యక్తి వివిధ సాధనాల ద్వారా గ్రహిస్తాడు. ఇందులో ఏ ఒక్కసాధనానికి ప్రాముఖ్యత అంటగట్టే వీలులేదు. సమయానుకూలంగా ఒక్కొక్క సాధనానికి ప్రాముఖ్యత లభిస్తుంది. రాజకీయ సమాజీకీకరణానికి ఒక్కొక్క సాధనం దోహదం చేసే మార్గంకాని వాటి ప్రభావంకాని ఎల్లవేళలా ఒకే విధంగా ఉండదు. కాలానుగుణ్యంగా మారుతుంటుంది. వ్యక్తుల రాజకీయ ప్రవర్తన వారి రాజకీయ, ఆర్థిక అనుభవాల మీద ఆధారపడిఉంటుంది. ఈ ఉమ్మడి అనుభవాలు వ్యక్తుల రాజకీయ వ్యక్తిత్వాన్ని నిర్ధారిస్తాయి. రాజకీయ సమాజీకీకరణ వ్యక్తి వ్యక్తిత్వంపై ఆధారపడి ఉంటుంది. వ్యక్తిత్వం సామాజిక పరిసరాల వల్ల కొంతవరకు ప్రభావితం అవుతుంది. వ్యక్తి మనో వైజ్ఞానిక భావనలు కూడా అప్పుడప్పుడు సామాజిక పరిస్థితులకు అతీతంగా కూడా ఉండే అవకాశాలున్నాయి. ఈ భావనలు వ్యక్తి రాజకీయ సమాజీకీకరణం పై ప్రభావం చూపి అతని రాజకీయ ప్రవర్తనను శాసింపవచ్చు. రాజనీతి శాస్త్రజ్ఞులు సమాజీకీకరణపై మొదట అంతగా శ్రద్ధ చూపలేదు. కాని సమాజ మనో వైజ్ఞానికులు, సమాజ శాస్త్రవేత్తలు మొదటినుండి సమాజీకీకరణ ప్రాధాన్యతను గుర్తించారు. వీరిభావాలనుండి మనం సమాజీకీకరణ అర్థాన్ని గ్రహించవచ్చు.

సమాజీకీకరణం ఒక అధ్యయన ప్రక్రియ. వ్యక్తులు అనుభవాల ద్వారా నేర్చుకొంటారు. నేర్చుకొన్న విషయాలు వ్యక్తుల జ్ఞానం, విలువలు, ప్రవృత్తులను నిర్ధారిస్తాయి. వ్యక్తి ప్రవర్తనయేగాక, వ్యక్తుల సమూహాల ప్రవర్తనకూడా సమాజీకీకరణ నిర్దేశిస్తుంది. సమాజీకీకరణం కేవలం బాల్య యవ్వన దశలకే పరిమితం కాదు. అది జీవితాంతం కొనసాగుతుంది. సామాజిక కార్యకలాపాలకు సమాజీకీకరణం మూలం. సమాజీకీక రణమే వ్యక్తిని సామాజిక కార్యకలాపాలపై ఆసక్తిని రేకెత్తిస్తుంది. వ్యక్తి ప్రవర్తన అతని సామాజికీకరణంపై ఆధారపడటమే గాక ఆ ప్రవర్తనను సామాజికీకరణ విశద పరుస్తుంది. వ్యవస్థ మనుగడ లేక మార్పు, వ్యవస్థను గూర్చిన ఖచ్చితమైన భావాలను కలిగించటమే రాజకీయ సమాజీకీకరణంలోని మౌలికాంశం.

## 5.5 రాజకీయ సమాజీకీకరణ ఆవిర్భావం - పరిణామక్రమం

ప్లేటో రాజనీతి తత్వ విచారంలో రాజకీయ సమాజీకీకరణ భావనను మనం చూడవచ్చు. అప్పటినుండి ప్రతి రాజనీతి తత్వ విచారంలోను పౌర శిక్షణకు సంబంధించిన సమస్యల ప్రస్తావన వస్తునే ఉన్నది. కాని ప్రస్తుతపు రాజకీయ సమాజీకీకరణ భావన 1950 దశకంలోనే ప్రారంభమైందని చెప్పవచ్చు. ప్లేటో, అరిస్టాటిల్ సమాజ సభ్యుల రాజకీయ శిక్షణ ఆవశ్యకతను ప్రాధాన్యతను గుర్తించారు. సామాజిక విలువల స్పృహను వ్యక్తులలో కలిగించుటకు విద్య ప్రాధాన్యతను పాత్రను రూసో ప్రబలంగా గుర్తించారు. 19వ శతాబ్దపు ఉదార రాజకీయ వాద తత్త్వవేత్తలు రాబర్టులోవి (Robert Lowi) నాయకులకు విద్య అవసరాన్ని గణనీయమైనదిగా పేర్కొన్నారు. సమాజీకీకరణ అధ్యయనం 1920 దశకంలోనే ప్రారంభమైనప్పటికీ దానికి 1950 నాటికి గాని తగినంత ప్రాచుర్యం లభించలేదు. సమాజీకీకరణ సాధనాల విషయంలో 1950 నాటికి ఒక అవగాహన ఏర్పడింది. 1959లో సమాజీకీకరణ భావనకు హెర్బర్ట్ సైమన్ నూతన ఉత్తేజం, జీవం కల్పించారు. 1960 దశకంలో సమాజీకీకరణకు సంబంధించి ఎన్నో నూతన దృక్పథాలు అధ్యయనాలు వెలువడటమేగాక సమాజీకీకరణకు సంబంధించి చాలా విషయసేకరణ జరిగింది. వీటిలో డేవిడ్ ఈస్టన్, హెస్, ఆల్మండ్ వెర్బాల అధ్యయనాలను ప్రముఖంగా పేర్కొనాలి. రాజకీయ సమాజీకీకరణం ప్రాముఖ్యతను చాలాకాలంగా గుర్తిస్తూవస్తున్నారు. ఈ మధ్యకాలం వరకు దాని ఉనికి అంతర్గతంగానే ఉంటూ వచ్చింది. వ్యక్తిగతగుణాలు ఎన్నికలలో ఓటింగ్ సరళుల మధ్య సంబంధాన్ని గుర్తించినప్పటి నుండి దాదాపు అన్ని ఓటింగ్ అధ్యయనాల్లో సమాజీకీకరణ ప్రస్తావన అంతర్గతంగా కనపడుతునే ఉంది.

## 5.6.0 రాజకీయ సమాజీకీకరణంలో - రకాలు

BRAOU

జన్మించగానే బాలుడు సంఘజీవి కాలేడు. అతనిని సమాజంలోకి ప్రవేశ పెట్టేందుకు తోటి వారు సహాయం చేస్తారు. స్వానుభవం ద్వారా, ఇతరలనుండి నేర్చుకోవడం ద్వారా బాలుడు సమాజీకీకరణం చెందుతాడు. ఈ రకమైన అధ్యయనం కేవలం నేర్చుకోవడానికే పరిమితంకాక ఆచరించుటకు ప్రోత్సాహం కలుగజేస్తుంది. ఈ విధమైన నేర్చుకోవటం వల్ల వ్యక్తులు కొన్ని విలువలను జీర్ణించుకొంటారు. అవి వారి సామాజిక ప్రవర్తనలను ప్రభావితం చేస్తాయి. ఈ విధంగా జీర్ణించుకొన్న విలువలు నైతికమైన వని, న్యాయ సమ్మతమైనవని వ్యక్తులు నమ్ముతుంటారు. ఈ ప్రక్రియ బాల్యం నుండి మొదలై కౌమార, యవ్వన దశలను దాటి వృద్ధాప్యంలో కూడా కొనసాగి మరణంతో అంతమవుతుంది. ఆల్మండ్, పావెల్ చెప్పినట్లు రాజకీయ సమాజీకీకరణం రెండు విధాలు. ఒకటి స్పష్టమైనది (Manifest) రెండవది నిక్షిప్తమైంది (Latent).

### 5.6.1 స్పష్టమైన రాజకీయ సమాజీకీకరణం

రాజకీయాంశలపై ఖచ్చితమైన విలువలను అనుభూతులను ప్రత్యక్షంగా స్పష్టంగా మరొకరికి అందజేయుటమే స్పష్టమైన రాజకీయ సమాజీకీకరణం. పాఠశాలల్లో, ఉన్నత విద్యాలయాల్లో రాజకీయాంశాలపై భోదించే విషయాలన్నీ ఈ కోవకు చెందినవే. ప్రజాస్వామ్యం, పౌరహక్కులు, అధికారానిక విధేయత, అధికారం పట్ల గౌరవం, రాజకీయ వ్యవస్థలపై మక్కువ, మమకారాలు ఇందుకు ఉదాహరణలు.

## 5.6.2 విక్షిప్తమైన రాజకీయ సమాజికీకరణం

రాజకీయేతర విషయాలపై ఉన్న అవగాహన రాజకీయాంశాలపై అవగాహనకు తోడ్పడినట్లయితే అదినిక్షిప్తమైన రాజకీయ సమాజికీకరణం. ఉదాహరణకు కుటుంబ యజమానికి ఇచ్చే గౌరవ మర్యాదలు తరువాతికాలంలో రాజకీయ వ్యవస్థకు గౌరవ మర్యాద లిచ్చుటకు దోహదపడుతుంది. ఈ రకమైన సమాజికీకరణ మనకు తెలువకుండానే మన ప్రవర్తనలను ప్రభావితం చేస్తుంది. ఇతరుల ప్రవర్తనలను చూస్తూ తనుకూడా అలాంటి ప్రవర్తననే అనుసరించటానికి నిక్షిప్తరాజకీయ సమాజికీకరణం తోడ్పడుతుంది. ఒక బాలుడు రాజకీయ నాయకుల పట్ల, తోటి వారల పట్ల అవగాహనభావం తోను, లేక దురుసుతనంతోను తనకై తానే తన అనుభవాల ద్వారా నేర్చుకుంటాడు. ఇదంతా సహజం, యాంత్రికంగా తెలువకుండానే జరిగిపోతుంది.

## 5.6.3 ప్రత్యేకమైన రాజకీయ సమాజికీకరణం

వ్యక్తి ప్రత్యేక్షంగా ఒక అంశం పైననే అలవరచుకునే భావాలు ఈ కోవకు చెందుతాయి. ఇతర అంశాలపై ఆ వ్యక్తికి ఎలాంటి అవగాహన ఉండదు. మతం, కులం పై ఏర్పరచుకునే ప్రత్యేకాభిమానం ఈ రకానికి చెందుతుంది. అనగా ప్రత్యేకమైన విలువలవైపుకు వ్యక్తిని మళ్ళించటం ప్రత్యేకసమాజికీకరణంగా చెప్పవచ్చు.

## 5.6.4 సార్వజనీన రాజకీయ సమాజికీకరణం

ఈ రకమైన సమాజికీకరణం వ్యక్తిని ఒక ప్రత్యేకమైన విలువలవైపుకుగాక సార్వజనీన విలువలవైపుకు మళ్ళించటం జరుగుతుంది. ఆధునిక సమాజంలో వ్యక్తి లౌకిక విషయాలవైపు తన దృష్టిని మళ్ళించటాన్ని ఉదాహరణగా పేర్కొనవచ్చు. అంతర్జాతీయభావం సార్వజనీన సామాజికీకరణంలో అత్యున్నతస్థాయి.

BRAOU

## 5.6.5 ఖచ్చితమైన రాజకీయ సామాజికీకరణం

ఖచ్చితమైన విలువలను, ఖచ్చితమైన వ్యవస్థల ద్వారా సంపాదించుకోవడం ఈ విధమైన సామాజికీకరణంలో ఉంటుంది. ఆధునిక సమాజంలో వివిధ సామాజిక వ్యవస్థలను ఖచ్చితమైన రూపంలో చూడవచ్చు. మతసంస్థలు, విద్యాసంస్థలు రాజకీయ పార్టీలు మొదలుగా గల సంస్థలు తమకు సంబంధించిన విషయాలపై వ్యక్తి ఖచ్చితమైన అభిప్రాయం విలువలు పెంపొందించుకొనేందుకు చేసే ప్రయత్నాలు.

## 5.6.6 DIFFUSE SOCIALISATION

స్పష్టంగా లేని అంశాలపై అనగా మతం, రాజకీయాలు, ఆర్థిక విషయాలు మొదలుగాగల అంశాలపై వ్యక్తి ఏర్పరచుకునే అవగాహన ఇది. రాజకీయ సామాజిక వ్యవస్థలను, చిన్నచిన్న రూపాలలో అవతరించని సామాజిక వ్యవస్థలలో Diffused Socialisationను చూడవచ్చును.

సామాజికీకరణం వ్యక్తి జీవితాంతం కొనసాగే ప్రక్రియ. ప్రవృత్తులు కేవలం బాల్యంలోనే ఏర్పడుతాయని, పదేండ్ల వయస్సు దాటిన తరువాత మారవని అనుకోవడం కేవలం భ్రమ. అవి వ్యక్తి సామాజిక అనుభవాలద్వారా స్థిరపడనూ వచ్చు లేక మారనూ వచ్చు. ఈ ప్రక్రియ జీవితాంతం కొనసాగుతునే ఉంటుంది.

బాలుడు తన బాహ్య ప్రపంచాన్ని గుర్తించటం మొదలు పెట్టినప్పటి నుంచి రాజకీయ సామాజికీకరణం మొదలవుతుంది. సమాజపు ప్రత్యేక స్థితిగతులను గుర్తించుతూ బాలుడు క్రమంగా ఒక స్థితినుండి వేరొకస్థితికి

గల సంబందాలను గ్రాహ్యం చేసుకోవటం మొదలు పెడ్తాడు. ఈ ప్రవృత్తి వ్యక్తులకు సర్వసామాన్యంగా మూడవ సంవత్సరం వయస్సు నుండి ఆరంభమవుతుంది. కుటుంబానికి వెలుపల గల అధికార వ్యవస్థను గుర్తించటంతో వ్యక్తి రాజకీయ సామాజికీకరణ ఆరంభం అవుతుంది. వ్యక్తి కుటుంబంలో సభ్యుడు, విస్తృతసమాజంలో గూడా సభ్యుడుగా తనను తాను గుర్తించుకోవటం మొదలు పెడతాడు.

## 5.7 రాజకీయ సామాజికీకరణ దశలు

రాజకీయ సామాజికీకరణ బాల్యం నుంచి వృద్ధాప్యం వరకు కొనసాగుతూనే ఉంటుంది. సామాజికీకరణలో నాలుగు దశలున్నాయి.

ప్రారంభ దశ:- పాశ్చాత్య దేశాలు జరిపిన అధ్యయనాలన్నింటిలోను సామాజికీకరణ శైశవ దశనుండే అనగా బాలుడు మూడు సంవత్సరాల వయస్సులో నున్నపుడే ప్రారంభం అవుతుందని విశదం అయింది. ఈ వయస్సులోనే బాలుడు రాజకీయ విషయాలకు సంబంధించిన పోలీసు, అధ్యక్షుడులాంటి రాజకీయ చిహ్నాలపై భావాలను ఏర్పరచుకొంటాడు.

బాల్య దశ:- ఈ దశలో బాలురు అధ్యక్షుడు, ప్రధాన మంత్రిలాంటి వ్యక్తిత్వ చిహ్నాలను వదిలి ఆయా వర్గ స్వభావాలకు చెందిన వివిధ విషయాలను అర్థం చేసుకొంటారు. వివిధ అధికారుల విధులు, హోదాలు, అధికారాల పరిజ్ఞానం విపులంగా తెలుసికొంటారు. అమెరికాలో 14 సంవత్సరాల బాలుడు తమకు ఏ పార్టీ అంటే ఇష్టమో చెప్పగలిగే స్థితిలో ఉంటారు.

BRAOU

కౌమార దశ:- కౌమారదశలో వ్యక్తులు ఊహాత్మక సిద్ధాంతాలపై ఎక్కువ మక్కువ చూపుతూ, సమాజాన్ని బాగుపరచాలనే భావాలను కలిగి ఉంటారు. సమాజంలోని ఆశ, దోపిడి, జాతి, విద్వేషం లాంటి విషబీజాలను ఏరిపారవేసి నవసమాజాన్ని నిర్మించాలనే కోరికలు వెల్లడిస్తుంటారు.

యువ్వన దశ:- ఈ దశలో వ్యక్తులు జీవితంలో స్థిరపడతారు. సమాజంలో సముచిత స్థానాన్ని సంపాదించుకొంటారు. ప్రభుత్వపు విధానాల జయాపజయాలపై నిర్దిష్ట భావాలను ఏర్పరచుకొంటారు. రాజకీయ ప్రభావాలకు లోనయి, వాటి విషయాల్లో ఎక్కువ శ్రద్ధ కనబరుస్తారు. రాజకీయ భాగస్వామ్యం విషయంలో సైద్ధాంతిక హద్దులను గుర్తించి తన ఇష్టాయిష్టాలను ఏర్పరచుకుంటారు.

వృద్ధాప్య దశ:- అరవై ఏళ్ళ వయస్సు అడుగిడేవరకు రాజకీయాల విషయంలో వ్యక్తి వృద్ధాప్యదశ ఆరంభమవుతుంది. రాజకీయాలపై విముఖత ఏర్పడడం మొదలవుతుంది. సమాజ ఆర్థిక, సాంఘిక విషయాలపై పట్టుసడలి శారీరక బలహీనతలు మొదలై రాజకీయంగా ఆసక్తి తగ్గుతూ ఉంటుంది. రాజకీయ సంస్కృతిని గూర్చి చర్చించే ప్రవర్తనావాదులు, మార్క్సిస్టులు రాజకీయ సామాజికీకరణంపై కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసారు. సామాజికీకరణ దశల విషయంలో ఏకాభిప్రాయంలేదు. మౌలిక రాజకీయ అంశాలపై బాల్యదశలోనే అవగాహన కలుగుతుందని ప్రవర్తనా వాదులు వాదిస్తున్నారు. ఈ దశలో కుటుంబపు ప్రభావం వ్యక్తుల మీద ప్రబలంగా ఉంటుంది. బాల్యదశాంతంలో ఈ భావాలకే తగిన సమాచారం అంది, వ్యక్తి రాజకీయ భావాలు స్థిరపడుతాయని ప్రవర్తనావాదుల అభిప్రాయం. బాల్యంలో ఏర్పడిన భావాలే కౌమార దశలో స్థిరత్వం సంతరించుకొంటాయి. కాని అభిప్రాయాలలో మార్పులు సాధారణంగా జరగవు. బాల్యావస్థ ప్రాధమికదశ, చివరిదశ, కౌమారదశలోని సామాజికీకరణం ఉమ్మడిగా బాలుని యువ్వన రాజకీయ జీవితానికి బాటను వేస్తాయి. ప్రవర్తనావాదుల దృక్పథంలో సామాజికీకరణలో ప్రాధమికదశకు బాగా ప్రాధాన్యం ఇవ్వటం జరిగింది. ప్రాధమికదశలో అలవరచుకొన్న రాజకీయభావాలే

చాలా ప్రధానమన్ని అవి, యవ్వనదశ రాజకీయ అనుభవాలను అన్వయించుకోవటంలో ప్రముఖ పాత్రను నిర్వహిస్తాయని ప్రవర్తనా వాదుల భావన.

మార్క్సిస్టులు సామాజికీకరణ ప్రక్రియలో బాల్యదశలో అలవరచుకొన్న భావాలకు ప్రాధాన్యమివ్వక; సమకాలీన పరిస్థితులలో కలిగే భావాలకే ప్రాధన్యమిచ్చారు. దాదాపు సగం మరచిపోయిన బాల్యదశ భావాలకన్న యువ్వన దశలో అలవరచుకునే భావాలే వ్యక్తి రాజకీయ ప్రవర్తనను ప్రభావితం చేస్తాయి. ఈ దశలో వ్యక్తి పొందిన అనుభవాలు బాగా ప్రాధాన్యం వహిస్తాయని మార్క్సిస్టుల వాదన. యువ్వన దశలోని అనుభవాలకు ప్రాధాన్యత ఉంది కనుక వీరు రాజకీయ ప్రసరణలకు సామాజికీకరణ ఏజెంటుగా అంత ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వరు. వర్గభావాలను ప్రసరణం ద్వారా ఒకరినుండి మరొకరిలో కలుగజేసే ప్రక్రియను మార్క్సిస్టులు సామాజికీకరణగా భావించగా; ఒకతరం నుండి మరొకతరానికి కుటుంబం ద్వారా జరిగే విలువల పంపిణీ సామాజికీకరణంగా ప్రవర్తనావాదులు భావిస్తున్నారు. ఈ రెండు దృక్పథాలు ఒకదానితో మరొకటి పూర్తిగా విభేదించవు. సామాజికీకరణలో ఈ రెండు ప్రక్రియలు కొనసాగుతునే ఉంటాయి. నియంతృత్వ రాజకీయ వ్యవస్థలలో జరిగే రాజకీయ సామాజికీకరణం ఉదార స్వభావం గల వ్యవస్థలలో కన్నా భిన్నంగా ఉంటుంది. ఉదార రాజకీయ వ్యవస్థలలో రాజకీయ సామాజికీకరణ వ్యక్తి ఇష్టానుసారం జరుగుతుంది. వ్యక్తికి తన ఇష్టం వచ్చిన రాజకీయ భావాలను ఏర్పరచుకునే స్వేచ్ఛ ఉంటుంది. ఇలాంటి స్వేచ్ఛ నియంతృత్వ వ్యవస్థలలో ఉండదు. నియంతృత్వ వ్యవస్థలలో వ్యవస్థను బలపరచుట కొరకు ప్రత్యేక వర్గాల ద్వారా సామాజికీకరణానికి అన్ని సాధనాలను వినియోగించుకొంటారు. ఉదాహరణకు రాజకీయ వ్యవస్థలలో రాజకీయ సామాజికీకరణ రాజ్యవ్యవస్థ ద్వారా పటిష్టంగా జరగదు. నియంతృత్వ రాజకీయ వ్యవస్థను విశ్వసించే రాజకీయ సిద్ధాంతాలు విలువలు వ్యక్తిలో పెంపొందించుట నియంతృత్వ వ్యవస్థ మనుగడకు చాలా అవసరం.

సంపూర్ణాధికార రాజ్యం సమాజపు అన్ని దృక్కోణాలను నియంత్రించటానికి ప్రయత్నిస్తుంది. ఇలాంటి రాజ్యాలలో సాధారణంగా సామాజికీకరణానికి, ప్రత్యేకంగా రాజకీయ సామాజికీకరణానికి అత్యధిక ప్రాధన్యత ఉంటున్నది. అన్ని చర్యలకు వ్యవహారాలకు రాజ్యపు సిద్దాతం ప్రాతిపదికగా ఉంటుంది. రాజకీయ సామాజిక ప్రక్రియను రాజ్యం నిర్ధారిస్తుంది. అలా నిర్ధారించకపోయినట్లయితే రాజ్యంలోని వ్యక్తుల సామాజీకరణం రాజ్య సిద్ధాంతానికి వ్యతిరేకమైన వాతావరణం ఏర్పరిచే ప్రమాదం ఉంటుంది. వ్యక్తుల ఆలోచనలను అభిప్రాయాలను రాజ్య అవసరాలకు తగినట్లుగా మలచుకోవలసి ఉంటుంది. అన్ని ప్రభుత్వాలు తమ ప్రజలను తమకు అనుకూలమైన వారిని తీర్చిదిద్దటానికి రాజకీయ సామాజికీకరణ ప్రక్రియను ఉపయోగించు కొంటాయి.

సామాజికీకరణం పాత్రను ఆదిమ సమాజాలలో, ప్రత్యేకంగా సుదీర్ఘకాలంగా ఆచార సాంప్రదాయాలకు కట్టుబడి ఉన్న ఆదిమ సమాజాలలో మనం బాగా గమనించవలసివున్నది. వివిధ ఆదిమ సమాజాల్లోని సమాజికీక రణాల్లో భేదాలు ఉండటాన్ని కూడా మనం గమనించవచ్చు. సాధారణంగా సామాజిక పాత్రలను అవగాహన చేసుకోవటంలో రాజకీయ సామాజికీకరణం అంతర్గతంగా ఉండటాన్ని కూడా మనం గ్రహించవచ్చు. ఆదిమ సమాజాలలోని ఆచారాల ప్రాధాన్యత, పూజలు, ప్రకాశ సంస్కారాలు, స్థాయి మొదలైనవన్నీ ఆదునిక ప్రజాస్వామ్యాలకు ఆదిమ సమాజాలకు మధ్య సంధానకర్తలుగా ఉంటాయి.

ఆదిమ సమాజాల్లో జరిగే రాజకీయ సామాజికీకరణ, ఆధునిక సమాజాలలో జరిగే దానికంటె భిన్నంగా ఉంటుంది. ఆదిమ సమాజాలలో రాజకీయ, రాజకీయేతర విషయాలలో ఎక్కువ భేదం కన్పించదు. ఆ వ్యవస్థలలో రాజకీయసామాజికరణ సాధారణ సామాజికీకరణ ఒకే విధంగా ఉంటుంది. కాని ఆధునిక సమాజాలలో ప్రతిసామాజిక వ్యవస్థ భిన్నంగా ఉండి ప్రత్యేకతలను కలిగి ఉంటాయి. సాధారణ సామాజి

BRAOU

కీకరణం, రాజకీయ సామాజికీకరణాలలోని భేదాన్ని గుర్తించవచ్చు. సాధారణ సామాజికీకరణం, రాజకీయ సామాజికీకరణాన్ని ప్రభావితం చేస్తుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో రాజకీయ సామాజికీకరణంపై సాంప్రదాయ భావాల ప్రభావాన్ని ప్రముఖంగా గమనించవచ్చు. పాశ్చాత్యా దేశాల భావాల సమ్మేళనాన్ని సాంప్రదాయ భావాలను అభివృద్ధి చెందే దేశాలలో స్పష్టంగా చూడవచ్చు.

కొత్తపాతలమేలు కలియిక మనకు అభివృద్ధి చెందుతున్న సమాజాలలో బాగా కన్పిస్తుంది. వలస పాలకులు తమఅధీన ప్రాంతాలలో పాశ్చాత్య రాజకీయ సంస్థలు, ఉద్యోగి స్వామ్యం, సంస్కృతి, విద్యలను ప్రవేశ పెట్టారు. చాలదేశాలలో ఈ పాశ్చాత్య దేశాల పాలనా పర్యవసానాలు పూర్తిగా కాకపోయినా కొంత వరకైనా మిగిలిపోయాయి. ఇవే ఆ సమాజాలలో ఆధునికీకరణకు దోహదం చేస్తున్నాయి. వీటికి తోడుగా వలస పాలనకు పూర్వం గల సాంప్రదాయభావాలు కూడా కొనసాగుతున్నాయి. విమోచనోద్యమాల కాలంలో జాతీయస్వాతంత్ర్య లక్ష్యంలో సాంప్రదాయక ఆలోచనలు, ఆచారాలు మరుగున పడ్డాయి. ఒక్కసారి స్వాతంత్ర్యం రాగానే సాంప్రదాయక భావాల ప్రభావాలకు బలం లభించి రాజకీయ పార్టీలకు, ప్రయోజన వర్గాలకు ప్రాతిపదికగా మారనారంభించాయి. ఫలితంగా ఆధునిక, సాంప్రదాయక రెండూ కలిసిన మిశ్రమ సంస్కృతి ఆవిర్భవించ నారంభించింది. ఆధునిక సంస్థలు సాంప్రదాయక భావాల ప్రాతిపదికపై వృద్ధిచెందసాగాయి. సాంప్రదాయక భావనలు, పారిశ్రామికీకరణం, నగరీకరణం ప్రభావాలకు ఒత్తిడులకు గురౌతున్నది. ఈ సమాజాలలో సమాజికీకరణ సాంప్రదాయ ప్రక్రియలతో కొనసాగుతూ అధిక సంఖ్యాక ప్రజల ప్రవర్తనలను ప్రభావపరచసాగింది. అభివృద్ధికి ఆటంకంగా వున్న సాంప్రదాయక భావాలను తొలగించటానికి రాజకీయనాయకులు ప్రయత్నించసాగారు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో చాలవరకు వివిధ సాంప్రదాయిక సమాజాలు సమైక్యమై ఉన్నాయి. ఈ సాంప్రదాయిక సమాజాలు రాజకీయ శక్తిని పొందుటకు పరస్పరం పోటీపడుతున్నాయి. కొన్ని సందర్భాలలో సామాజిక రాజకీయ విషయాల మధ్య విభేదాలు చాలా తీవ్రంగా ఉంటున్నాయి. సాంప్రదాయిక సమాజాల పరిణామాలుగా రాజకీయసంస్థలు కార్యనిర్వాహక, శాసన, న్యాయవర్గాలు రూపొందలేదు. ఈ సామాజాలలోని సమాజికీకరణం పాశ్చాత్యరాజకీయ సంస్థలు అభివృద్ధికి అనుకూలంగా ఉండటం లేదు. ఈ రాజకీయ సంస్థలు ఆయా సమాజాలలో నిలదొక్కుకొనలేకపోతున్నాయి. ఫలితంగా వాటిశాసన బద్ధత అంతంత మాత్రంగానే ఉంటున్నది. సంస్థలకు సంస్థలను నిర్వహిస్తున్నవారి మధ్య భేదంసన్నగిల్లిపోతున్నది. సంస్థను నిర్వహించేవారి అసమర్థత సంస్థపై ప్రభావాన్ని కలుగ చేస్తున్నది.

చాలా కొత్తదేశాలు ఆధునికత, సాంప్రదాయకతలు సృష్టించిన సమస్యలను రాజకీయ విద్యను బోధించటం ద్వారా పరిష్కరింపబూను కొంటున్నాయి. దేశరాజకీయ వ్యవస్థకు అనుకూలంగా ఉండే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దే విద్యా విధానాన్ని అనుసరిస్తున్నాయి.

అభివృద్ధి చెందుతున్న సమాజాలలో కొత్తదేశాల సిద్ధాంతాలు ఒక "మతం"గా రూపొందటమే రాజకీయసామాజికీకరణపు ప్రధానమైన సమస్యలని డేవిడ్ ఈస్టన్ అభిప్రాయం వెలిబుచ్చారు. రాజ్యంలో నాయకులకు దైవత్వం ఆపాదించే రాజ్యపు సిద్ధాంతం ఒక మతంగా రూపొందుతున్నది. ఇలాంటి ప్రక్రియ ఆధునికీకరణ, పారిశ్రామికీకరణానికి సహాయకారి అవుతుందేమోకాని రాజకీయ మార్పులు కష్టతరమౌతాయి. రాజకీయాలలో మార్పులకు రాజ్యంలోని "మతం" లో కూడా మార్పులు రావాల్సి ఉంటాయి. అభివృద్ధి చెందుతున్న సమాజాలలో రాజకీయ సమాజికీకరణం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య రాజకీయ మార్పు. రాజకీయ సామాజికీకరణ స్వభావం ఆయా పరిసరాలు, సమయ సందర్భాలు మీద ఆధారపడి ఉంటుంది. అందువల్ల రాజకీయ సామాజికీకరణానికి రాజకీయ వ్యవస్థ రూపానికి దగ్గర సంబంధాలు ఉన్నాయి.

## 5.8.0 సామాజికీకరణ సాధనాలు

రాజకీయ సామాజికీకరణ ప్రత్యక్ష, అప్రత్యక్ష రూపాలలో ఉండవచ్చును. ప్రకటించబడిను సమాచారం, విలువలు, భావాలు, స్పష్టంగా రాజకీయం ఐనప్పుడు ప్రత్యక్షసామాజికీకరణ అనవచ్చును. ప్రభుత్వ పద్దతులు మరియు విధులు ఇతర రాజకీయ సాధనాలు విషయంలో క్షుణ్ణమైన పౌరజ్ఞానం కలిగి ఉంటారు. కొన్ని సందర్భాలలో సామాజికీకరణ కొరకు ఉపయోగపడ్డ సాధనాల అంతర్గత క్రియా విశేషము వల్ల వ్యక్తులు రాజకీయంగా నూతన భావాలను ఏర్పరచుకొంటారు. రాజకీయ శక్తి విషయంలో సమయానుకూలమైన దృక్పథాన్ని అవలంభిస్తుంటారు. రాజకీయేతర దృక్పథంగా ఏర్పడిన సామాజికీకరణ రాజకీయానుబంధంగా మారే అవకాశం కూడా ఉంది. ఈ విధమైన సామాజికీకరణను అప్రత్యక్షసామాజికీకరణ అంటారు. రాజకీయేతర భావాలు రాజకీయ భావాలుగా మారి వ్యక్తి రాజకీయ దృక్పథాన్ని ప్రభావితం చేస్తున్నది.

ప్రత్యక్ష రాజకీయ సామాజికీకరణ, అనుకరణలు, ఊహాపూర్వక ప్రవర్తనలు, రాజకీయ విజ్ఞానం, రాజకీయ అనుభావాల ద్వారా ఏర్పడుతుంది. అప్రత్యక్ష రాజకీయ సామాజికీకరణ వ్యక్తుల మధ్య మార్పిడుల ద్వారా జరుగుతుంది. వ్యవస్థా పూర్వక సమాజాలు, జాతులు, సభ్యులలో సామాజికీకరణను సమాజంలోని వివిధ సాధనాలకు వదిలివేశారు. ప్రాధమికంగా ఈ సాధనాలను ఉమ్మడి కుటుంబం, పాఠశాల శిష్టవర్గాలుగాను, మాధ్యమికంగా, వార్తాప్రసార సాధనాలు, రాజకీయ పక్షాలుగాను గుర్తించడం జరిగింది. ఇవన్నీ రాజకీయ సమాజికీకరణ ప్రధానసాధనాలు.

### 5.8.1 కుటుంబం

చిన్నపిల్లల మనుస్సుల మీద కుటుంబం అంతర్గతంగాను, బహిర్గతంగాను ప్రభావితం చేస్తుంది. అధికారానికి విధేయత గురించి అంతర్గత ప్రభావాన్ని కలుగజేస్తుంది. బహిర్గతంగా పిల్లల రాజకీయ అభిప్రాయాల వృద్ధిక్రమంలో ప్రత్యక్షపాత్ర వహిస్తుంది. పిల్లలలో వ్యవస్థపట్ల విధేయత, సహకారం, లేక నిరసన భావాలవృద్ధికి ప్రాధమికంగా కుటుంబమే రూపకల్పన చేస్తుంది. కుటుంబ సభ్యుల రాజకీయ భావాలే పిల్లలకు రాజకీయ వ్యవస్థలపై దృక్పథాన్ని ఏర్పరచుకోవడానిక దోహదం చేస్తుంది. అంతర్గత సామాజికీకరణ సాధనాలపై ఏర్పరుచుకోవడానికి దోహదం చేస్తుంది. అంతర్గత సమాజికీకరణ సాధనాలపై ఎక్కువగా ఆధారపడి వుండే రాజకీయ ఆచారాలు, అలవాట్లు, మరియు నమ్మకాల ప్రసారానికి కుటుంబం ప్రత్యేక సాధనంగా పేర్కొనవచ్చు. ఆసియా, ఆఫ్రికా ఖండాలలోని అభివృద్ధి చెందుతున్న రాజ్యాల నాయకులు బాల్యావస్థలోని రాజకీయ సామాజికీకరణ కార్యక్రమాలను తమపట్ల విధేయతను సమకూర్చుకోడానిక ఉపయోగిస్తున్నారు.

### 5.8.2 పాఠశాల

పాఠశాల కూడ వ్యక్తుల సామాజికీకరణలో అంతర్గత, బహిర్గత ప్రభావాలను కలుగజేస్తుంది. ఒక రకమైన పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు రాజకీయ వ్యవస్థపై ఒక ప్రత్యేక అభిప్రాయాన్ని కలిగి ఉంటారు. కౌమారదశలో లభ్యమయ్యే విజ్ఞాన సముపార్జనా పద్దతులకే రాజకీయ సమాజికీకరణ పదాన్ని ఇటీవల కాలంలో ప్రధానంగా వాడుతున్నారు. తరగతిలోని పాఠ్యాంశాలు, పుస్తకాలు వ్యక్తులలో నూతనత్వాన్ని కలుగజేస్తాయి. వ్యక్తుల మనస్సులను, ఆలోచనలను కంట్రోలు చేయడం ద్వారా రాజకీయ వ్యవస్థకు కావలసిన విధేయతను సమకూర్చుకోవడాన్ని బాహ్య సామాజికీకరణ, ప్రభావిత సామాజికీకరణ అని అంటారు. పాఠశాల వాతావరణంలో చేసే ప్రయత్నాలు కొంతవరకు పిల్లల రాజకీయ పరిజ్ఞానాన్ని వృద్ధిచేస్తాయి. పిల్లలు దేశభక్తిని గురించి తెలుసుకోవడాన్ని జాతీయ రాజ్యాల భవిష్యత్తుకు పునాదిగా భావించే సామాజికీకరణ

BRAOU

Dr. BRAOU LIBRARY Acc. No: CM-0143 Class No: 320

అనవచ్చును. రాజకీయ పక్షాలు, వాటిమీద విశ్వాసాలు వాటి మధ్యగల విభేదాలను గురించిన విజ్ఞానాన్ని ఎన్నికల జయాపజయాల సమాజికీకరణగా భావించవచ్చును. అందువలననే పాఠశాలల విద్యావిధానం, పిల్లలకు రాజ్యం యెడల విధేయతను వృద్ధిచేసి వ్యవస్థల గురించిన అభిప్రాయాలు ఏర్పడడానికి సహాయపడుతుంది.

## 5.8.3 స్నేహవర్గాలు

సంబంధిత వర్గాలుగా పిలువబడే స్నేహవర్గాలు రాజకీయ సామాజికీకరణలో ప్రధాన పాత్ర నిర్వహిస్తాయి. స్నేహవర్గంతో పొందిన అనుభవాల ద్వారా, వ్యవస్థను గురించి ఏర్పడ్డ మనోభావాలలో ఒక్కొక్కసారి మార్పులు కలిగే అవకాశాలు ఉన్నాయి. ఉద్యోగంలోని అనుభవాలు ముఖ్యంగా యజమాని ఉద్యోగ సంబంధాలు, మానవ స్వభావాన్ని అర్థం చేసుకోవడానికి ఉపయోగ పడతాయి. అమెరికాలో జరుపబడిన ఓటింగ్ ప్రవర్తనా సరళి అధ్యయనాలలో ఏకధర్మంగల వర్గాలలో భార్యభర్తల తరువాత స్నేహబృందాలు, ఉద్యోగబృందాలే ప్రధానమైన స్థానం కల్పించుకొన్నాయి.

## 5.8.4 ప్రసార సాధనాలు

ప్రసార సాధనాలు ప్రజల నమ్మకాలను, ప్రజాభిప్రాయాన్ని రూపకల్పన చేయడంలో తోడ్పడుతాయి. కేవలం రాజకీయ సంఘటనల సమాచారాన్ని అందియ్యడమే కాకుండా వ్యక్తుల ప్రాథమిక భావాల రూపకల్పనకు కూడా ప్రసార సాధనాలు ఉపయోగపడతాయి. ప్రసార సాధనాలు రాజకీయ సమాజికీకరణలో కీలకమైన పాత్రను నిర్వహిస్తున్నాయి. దేశంలోని ప్రసార సాధనాల మీద నియంత్రణ విధించడంద్వారా రాజకీయ వ్యవస్థకు అవసరమైన విధేయతను పొందుటలో విజయం సాధించవచ్చును. ప్రసార సాధనాలైన వార్తాపత్రికలు, రేడియో, టెలివిజన్‌లకు స్వేచ్ఛ ఉండడం వల్ల వ్యక్తుల మనోభావాల్లో భిన్నమైన విలువలు చోటు చేసుకొంటాయి.

BRAOU

## 5.8.5 రాజకీయ పక్షాలు

రాజకీయ చర్యలకు అవసరమైన సమీకరణం, రాజకీయ విలువల క్రోడీకరణము, రాజకీయ నాయకుల ఎంపిక కొరకు రాజకీయ పక్షాలు ఏర్పడతాయి. రాజకీయ పక్షాలు ధ్యేయాత్మకమయిన రాజకీయ సమీకరణకు సాధనాలు. సమాజంలో జరిగే రాజకీయ చర్యలలో పాల్గొనడానికి రాజకీయ పక్షాలు ప్రోత్సాహన్ని ఇస్తాయి. రాజకీయ సంస్కృతిలో మార్పులు తేవడానికైనా, ధృవపరచడానికైనా రాజకీయ పక్షాలు కృషి చేస్తూ ఉంటాయి.

## 5.8.6 రాజకీయ వ్యవస్థ

రాజకీయ సామాజికీకరణలో వ్యవస్థకు చాలా ప్రాధాన్యత కలదు. ప్రభుత్వం నిర్వహించే విధులతో వ్యక్తులు ప్రత్యక్ష సంబంధం కలిగి ఉంటారు. ప్రభుత్వం ఏం చేయదలుచుకున్నది, ఏం చేస్తుంది, అనే విషయాలలో క్షుణ్ణమైన పరిజ్ఞానం కలిగి ఉంటారు. అందువల్లనే వ్యక్తుల సామాజికీకరణ ప్రభుత్వ వ్యవస్థల వల్ల దృఢపడడం కాని లేక మార్పు చెందడంకాని జరుగుతుంది. రాజకీయ సైద్ధాంతిక క్షాళన విషయంగా ప్రభుత్వం కలుగజేసుకొన్న సందర్భాలు చాలా ఉన్నాయి. రెండవ ప్రపంచ యుద్ధంలో జర్మనీ భూభాగాన్ని ఆక్రమించుకొన్న మిత్రరాజ్యాలు నాజీ సమాజికీకరణాన్ని యువకుల మనస్సుల్లోంచి తొలగించడానికి తీవ్ర ప్రయత్నాలు చేసినాయి. రాజకీయ సైద్ధాంతిక క్షాళన ప్రజాస్వామ్య రాజ్యాలలో కూడా మనకు అప్పుడప్పుడు కన్పిస్తుంది. దేశాలు అనుసరించే విద్యావిధానాన్ని ఇందుకు ఉదాహరణగా పేర్కొనవచ్చు. ప్రభుత్వాల

ఈ ప్రయత్నాలు ప్రశంసలకు, విమర్శకులకు దారి తీస్తున్నాయి. ఆ విధానాలు ప్రజాస్వామ్య విలువల ప్రాధాన్యతను వివరిస్తూ ప్రభుత్వంలో ప్రజాస్వామ్య పరంగా భాగస్వాములు కావడాన్ని ప్రోత్సహిస్తాయి.

### 5.8.7 కుల వ్యవస్థ

భారతదేశంలోని కులవ్యవస్థ వ్యక్తి సామాజికీకరణలో ప్రధానపాత్ర వహిస్తున్నది. గ్రామీణ జీవనంలో కుల వ్యవస్థకు ప్రాధాన్యత ఎక్కువగా ఉన్నది. గ్రామీణ రాజకీయాలపై కుల వ్యవస్థ ప్రభావం ఉండడం వల్ల రాజకీయ సామాజికీకరణకు కుల వ్యవస్థ కూడా సాధనంగా మారుతున్నది. యదార్థంగా సమాజంలోని అన్ని, రంగాలలో కులవ్యవస్థ ప్రభావం రోజురోజుకూ పెరిగిపోతున్నది. రాజకీయ వ్యవస్థలోని విధాన నిర్ణేతలకు, భూస్వామ్య వర్గాలకు మధ్య సయోధ్య పెరగడానికి తోడ్పడుతుంది. భూస్వామ్య వర్గాల పిల్లల మనస్సుల్లో రాజకీయ సామాజికీకరణ లక్ష్యాలు ధ్యేయాత్మకమయిన రాజకీయ సమీకరణకు సాధనాలు. సమాజంలో జరిగే రాజకీయ చర్యలలో పాల్గొనడానికి రాజకీయ పక్షాలు ప్రోత్సాహాన్ని ఇస్తాయి.

ఆయా సమయసందర్భాలను అనుసరించి రాజకీయ సమాజికీకరణ మారుతూ ఉంటుంది. అందువల్లనే రాజకీయ సామాజికీకరణానికి రాజ్యవ్యవస్థతోను దానిలో జరిగే మార్పుల స్వభావంతోను దగ్గరసంబంధాలు ఉంటాయి.

రాజ్యవ్యవస్థ స్థిరమైన దైనప్పుడు రాజకీయ సామాజికీకరణ ప్రధాన ఏజెన్సీలు నిర్దుష్టమైనవిగా ఉంటాయి. ఇందుకు భిన్నంగా సంపూర్ణాధికారేతర రాజ్యవ్యవస్థలలో మార్పుల స్థాయి పెరిగిన కొద్దీ రాజకీయసామాజికీకరణ ఏజెన్సీలు కూడా విభిన్నమైనవిగా ఉంటాయి. రాజ్యవ్యవస్థ ప్రాతిపదికలో మార్పు చేర్పులు వచ్చినప్పుడు రాజకీయ సామాజికీకరణ ఏజెన్సీలు ప్రత్యేకమైనవిగా ఉంటాయి. రాజకీయ సామాజికీకరణకు దోహదం చేయుగల ఏజెన్సీలను ఏర్పరచకుండా ఏ విప్లవాలు కూడా పూర్తికావు. సాంప్రదాయక విలువల కొనసాగింపు కొత్త పాలక వర్గానికి వ్యతిరేకమైనవిగా ఉంటాయి. అందువల్ల కొత్త పాలకవర్గం తనకు అనుకూలమైన రాజకీయ సామాజికీకరణ ఏజెన్సీలను ఏర్పరచుకొంటుంది. రాజకీయ మార్పులు పూర్తిగా సంపూర్ణాధికార స్వభావాన్ని కలిగినప్పుడు, రాజకీయ సామాజికీకరణపు ప్రధాన ఏజెన్సీలు చాలా చిన్నవిగా ఉండి ఎక్కువ సంఖ్యలో ఉంటాయి. చాలా కాలంగా విడదొక్కుకొని ఉన్న సజాతీయ (Homogeneous) సమాజంలో రాజకీయ సామాజికీకరణ ప్రక్రియ విస్పష్టంగా నిర్దేశితమై ఉంటుంది. ఇలాంటి సమాజాలలో రాజకీయ సమాజీకీకరణం ప్రక్రియ బహిరంగ నియంత్రణకు లోనవుతుంటుంది ఇందుకు విరుద్ధంగా తరచు మార్పులకు గురయ్యే నానా జాతీయ (Heterogeneous) సమాజాలలో రాజకీయ సమాజీకీకరణ ప్రక్రియ విభాగాలుగా ఉండి సమాజానికంతటికీ వర్తించేదిగా ఉంటుంది. ప్రతి సమూహానికి ఒక్క ప్రత్యేకమైన రాజకీయ సామాజికీకరణ ప్రక్రియ ఉంటుంది.

ఏ కాలంలోనైనా, ఏ సమాజానికైనా దాని రాజకీయ విలువలు, సామాజిక అభివృత్తులకు అనుకులంగా ఉండే రాజకీయ సంస్కృతియే రూపం సంతరించుకొని ఉంటుంది. రాజకీయ సమాజికీకరణం, రాజకీయ సంస్కృతి సంబంధాలు చాలా కీలకమైనవి. రాజకీయ సంస్కృతి ద్వారానే ఆయా అభివృత్తులు, విలువలు, ఒక తరం నుండి మరొక తరానికి సంక్రమిస్తుంటాయి. అలా ఆవి అభివృత్తులు, విలువలు, విభజించ వీలుపడవని భావించరాదు. సమాజికీకరణ ప్రక్రియ నిరంతరం కొనసాగుతూ ఉంటుంది. అందువల్ల రాజకీయ సామాజికీకరణం విలువలు అభివృత్తుల మార్పులకు దోహదకారి అవుతుంటుంది.

## 5.9 ముగింపు

రాజకీయ సామాజికీకరణం ఒక అధ్యయన ప్రక్రియ. ఈ ప్రక్రియ పర్యవసానమే రాజకీయ సంస్కృతి. ఈ విధంగా రాజకీయసామాజికీకరణ, రాజకీయ సంస్కృతి ఒకదానితో మరొకటి ఇమిడి ఉన్నాయి. ఒకటి లేకుండా మరొకటి మనజాలదు. అవి పరస్పరం ప్రభావితం అవుతుంటాయి. ఈ ప్రక్రియకు అంతంలేదు. అదేవిధంగా ఒక వర్గపు రాజకీయ సంస్కృతి ఎల్లప్పుడు ఒకే విధంగా ఉండదు. సామాజికీకరణకు అనుగుణంగా సంస్కృతిలో మార్పు చేర్పులు జరుగుతాయి.

సామాజికీకరణం అంటే కేవలం రాజకీయ సామాజికీకరణమేకాదు. వ్యక్తి వివిధ రంగాలలో ప్రవేశం సంపాదించుకొని, వాటిపై ఒక అవగాహన ఏర్పరచుకొంటాడు. రాజకీయ రంగం వాటిలో ఒకటి. ఈ విధంగా వ్యక్తి రాజకీయ సంస్కృతితో పాటుగా సాధారణ సంస్కృతిని కూడా అలవరచుకుంటాడు. ఇవి రెండూ ఏక కాలంలో జరుగుతాయి. స్థిరమైన రాజకీయ సంస్కృతి అభివృద్ధి కొరకు సాధారణ సంస్కృతికి దోహదం చేసే సామాజికీకరణ, రాజకీయ సంస్కృతికి దోహదం చేసే సామాజికీకరణ ఒకే రకంగా ఉండాలి. అవి ఒకదానిని ఇంకొకటి బలపరుస్తుంటాయి. ఆరెండింటి మధ్యభిన్నత్వం స్థానం పొందరాదు. భిన్నత్వం అస్థిరత్వానికి దారి తీయటమేగాక పరాయీకరణానికి దోహదం చేస్తుంది.

రాజకీయ సామాజికీకరణం, రాజకీయ వ్యవస్థలను తులనాత్మకంగా అధ్యయనం చేయటంలో తోడ్పడుతుంది. రాజకీయ సంస్కృతికి ఆధారం రాజకీయ సామాజికీకరణం. సామాజికీకరణాల తులనాత్మక అధ్యయనం సమాజంలో కన్పించే వివిధ సంస్కృతుల ఆవిర్భావం, ఉనికిని విశదీకరిస్తుంది. ప్రత్యేక రాజకీయ సంస్కృతి పెరుగుదల కాలం, స్వభావాలను ఈ అధ్యయనం ద్వారా ఖచ్చితంగా గుర్తించ వచ్చు. రాజకీయ సామాజికీకరణం రాజకీయ భర్తీని సులభతరం చేస్తుంది. భాగస్వామ్యపు విలువలను జీర్ణించుకొన్న వ్యక్తి పరిపూర్ణ నాయకత్వ లక్షణాలను సంతరించుకొంటాడు. నాయకులను గుర్తించటంలో వారికి గల గుణగణాలను తెలుసుకొవటంలోను, రాజకీయాలలో వారు ఎంత వరకు లీనం (Involve) కాగలరో అన్న విషయాలను వారి రాజకీయ సామాజికీకరణ అధ్యయనం ద్వారా తెలుసుకోవచ్చు. ప్రాంతీయంగా, సామాజికవర్గాల పరంగా రాజకీయ సామాజికీకరణంలో ఏర్పడే భేదాల అధ్యయనాలు ఒకదేశంలోని రాజకీయ సమస్యలను అర్థం చేసుకోవటానికి దోహదపడుతాయి. రాజకీయ స్థిరత్వం, అభివృద్ధిని సక్రమంగా అధ్యయనం చేయటంలో, రాజకీయ సామాజికీకరణ అధ్యయనం బాగా తోడ్పడుతుంది. వ్యక్తి రాజకీయ ప్రవర్తన అతని సామాజికీకరణకు దోహదం చేసిన వివిధ ప్రక్రియాలపై ఆధారపడి ఉంటుంది.

BRAOU

ఇటీవల కాలంలో రాజకీయ సామాజికీకరణ పరిధి బాగా అభివృద్ధి చెందింది. రాజకీయ సమాజికీకరణను క్రింది విధంగా అధ్యయనం చేయవచ్చు.

1. రాజకీయ వ్యవస్థలో సామాజికీకరణ ఏ విధంగా ప్రభావం కలుగజేస్తుంది.

2. బాల్యంలో నేర్చుకొన్న విమర్శనాత్మక విలువలు సామాజికీకరణ విధానాలు, సాధనాలు భారతదేశంలోని శిష్టులను, సామాన్యులను ఏ విధంగా ప్రభావితం చేస్తున్నాయో తెల్పుకోవచ్చు. నూతనంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో రాజకీయ సామాజికీకరణ ప్రాధాన్యతగల సిద్ధాంతంగా భావింపబడుతున్నది. జాతి నిర్మాణం అంటే ప్రభుత్వ వ్యవస్థల ఏర్పాటు, అధికారుల నియామకమే కాదు, జాతికి అంకితము కాగల పౌరులను తీర్చిదిద్దడం కూడా ఉంటుంది.

రాజకీయ సామాజికీకరణ కార్యక్రమాల వల్ల రాజకీయంగా సమైక్య జాతి నిర్మాణం సాధ్యం అని వివిధ అధ్యయనాల్లో నిరూపించబడింది. పౌరులు సమాజం అనుసరించే విధానాల్లో సిద్దాంతాల్లో పరిపూర్ణ నమ్మకం

కలిగి సమైక్య కృషి జరిపే అవకాశం ఉంది. వివిధములైన జాతీయాభివృద్ధి కార్యక్రమాలు ఆయా రాజకీయ సామాజికీకరణ విధానాలకు అనుగుణంగా ఉన్నాయో, లేదో కూడా అధ్యయనం చేయవచ్చు.

--ఆచార్య॥ ఎం. రాంచందర్

## 5.10 చదువదగిన పుస్తకాలు

| | | |
|---|---|---|
| Herbert Hyman | : | Political Socialisation |
| Amalkumar Mukhopadhyaya | : | Political sociology |
| Rusle & Althoff | : | An Introduction to Political Sociology |

## 5.10 నమోనా పరీక్షాప్రశ్నలు

ఈ కింది ప్రశ్నలకు వ్యాస రూపంలో సమాధానాలు రాయుండి.

1. రాజకీయ సామాజికీకరణం అనగా ఏమిటి దాని స్వభావాన్ని చర్చించండి.
2. రాజకీయ సామాజికీకరణ సాధనాలను చర్చించండి?
3. రాజకీయ సామాజికీకరణం వివిద రకాలను విశ్లేషింపుము?

కింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయుము

1. సామాజికీకరణపు మూలకాలు
2. రాజకీయ సామాజికీకరణ వృద్ధిక్రమం
3. సామాజిక మార్పులు - రాజకీయ సామాజికీకరణం

BRAOU

# భాగం -- 6 రాజకీయ సంస్కృతి

## విషయక్రమం

6.1 లక్ష్యాలు

6.2 పరిచయం

6.3 రాజకీయ సంస్కృతి - అర్థం

6.4 రాజకీయ సంస్కృతి - దృక్కోణాలు

6.5 రాజకీయ సామర్థ్యం

6.6 రాజకీయ సంస్కృతి అంతర్భాగాలు

6.7 ఆల్మండ్, వెర్బాల అధ్యయనం

6.8 రాజకీయ సంస్కృతి - మార్క్సిస్టు దృక్పథం

6.9 రాజకీయ సంస్కృతి - రకాలు

6.10 రాజకీయ ఉపసంస్కృతి

6.11 రాజకీయ సంస్కృతి వృద్ధికి మూలకాలు

6.12 చదువదగిన పుస్తకాలు

6.13 నమోనా పరీక్షా ప్రశ్నలు

BRAOU

## 6.1 లక్ష్యాలు

ఈ పాఠాన్ని చదివాక మీరు

- రాజకీయ సంస్కృతి, అర్థం, స్వభావం, అంతర్భాగాలు
- వివిధ అధ్యయనాలు, మూలకాలను

బాగా వివరించగలుగుతారు.

## 6.2 పరిచయం

రాజనీతి శాస్త్రంలో బహుళ ప్రచారం పొందిన సిద్ధాంతాలలో రాజకీయ సంస్కృతి ఒకటి. రాజకీయ ప్రపంచాన్ని గురించిన అవగాహనయే రాజకీయ సంస్కృతి. అది వ్యక్తి పరమైన విలువల, నమ్మకాల అవగాహనల ప్రోవు. ప్రతి రాజకీయ వ్యవస్థ ఒక్కొక్క రకమైన రాజకీయ విధానాల అవలంబనకై కట్టుబడి ఉంటుందని అల్మండ్ చెప్పారు. సిడ్నీ వెర్బాల పదాలలో రాజకీయ సంస్కృతి అనగా ఏయే సందర్భాలలో ఏయే విధానాలు అవలంబించవలెనో నిర్దేశించే విలువలు, అనుభవపూర్వక విశ్వాసాలు, సంకేతాలు.

గతంలో రాజకీయాలు, రాజకీయ విలువలు, సిద్ధాంతాలు, జాతీయ భావం సాంస్కృతిక భావాలుగా వర్ణింపబడిన వాటిన్నిటిని కలిపి ఒకే భావం ఏర్పాటు చేయాలన్న ప్రయత్న ఫలితమే రాజకీయ సంస్కృతి. ఇది సమాజంలో రాజకీయ చర్యల విషయంలో గల భావ సముచ్ఛయము. ఇది వ్యవస్థలోని సభ్యులకు సందర్భానుసారంగా వర్తిస్తుంది. రాజకీయ సంస్కృతి ఒక సమాజం రాజకీయ ప్రవర్తన గురించి వెలువడిన నిర్దిష్టభావమేకాని ఔపచారికంగా అనుకునేది కాదు. పరస్పరం బలపరిచే రాజకీయమైన సమగ్ర విధానాలే రాజకీయ సంస్కృతి. ప్రతి వ్యక్తి సమకాలీన సమాజపు రాజకీయ సంస్కృతిని ప్రతిబింబిస్తాడు. రాజకీయ భావాలు, విశ్వాసాల తులనాత్మక విలువలు మానసిక సంబంధమైనవి. గనుక రాజకీయ సంస్కృతి మూలాన్ని మనోవైజ్ఞానిక శాస్త్రం ద్వారా తెలుసుకోవచ్చు.

## 6.3 రాజకీయ సంస్కృతి - అర్థం

సమాజపు విస్తృత సంస్కృతిలోని భాగమే రాజకీయ సంస్కృతి. చారిత్రక అనుభవాల ద్వారా సామాజికీకరణ చెందే వ్యక్తి ప్రయత్నాలే రాజకీయ సంస్కృతి. సమాజంలోని విలువలు, భావాలు వారసత్వం ద్వారా లభిస్తుంటాయి. కొత్తపాతల సంఘర్షణల మధ్య సమాజంలో ఏర్పడ్డ నూతన విలువలు కొత్త రాజకీయ సంస్కృతికి రూపురేఖలను దిద్దుతాయి. సమాజంలో అందరికీ ఆమోదయోగ్యమైన విలువల నియమాలే రాజకీయ సంస్కృతి. సమాజంలోని ఆచరణాత్మక ఆశయాలు అర్థాలే ఆ సమాజపు రాజకీయ సంస్కృతియని ఆల్మండ్ చెప్పారు. రాజకీయ సమాజంలోని సభ్యులు రాజకీయ విషయాలలో ఏర్పరచుకొన్న వ్యక్తిగత భావాలు ధ్యేయాలు, సముదాయాన్ని రాజకీయ సంస్కృతిగా ఆల్మండ్ నిర్వచించారు.

వివిధ రాజకీయ వ్యవస్థలలో నిర్మితుల విషయంలోనే గాక అభివృద్ధి చెందిన సంస్కృతుల విషయంలో కూడా విభేదాలుంటాయి. బ్రిటన్‌లో విజయవంతమైన పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఆశియా, ఆఫ్రికా రాజ్యాలలో విఫలం కావటానికి కారణం ఆయా దేశాలలోని రాజకీయ సంస్కృతులేనని చెప్పవచ్చు. ఒకే రకమైన ప్రభుత్వం వివిధ రాజ్యాలలో భిన్నమైన మనుగడను కొనసాగిస్తుంటాయి. అభివృద్ధి చెందుతున్న చాలా దేశాలు పార్లమెంటరీ ప్రజాస్వామ్య ప్రభుత్వ విధానాన్ని చేపట్టాయి. కాని వివిధ దేశాలలో ఫలితాలు ఒకేరకంగా లేవు. కొన్ని దేశాలలో ప్రజాస్వామ్య వ్యవస్థలకు బదులు సైనిక నియంత్రత్వాలు, మరికొన్నింటిలో పౌరసంపూర్ణాధికార ప్రభుత్వాలు అవతరించాయి. కొన్ని దేశాలలో ప్రజాస్వామ్య వ్యవస్థలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. మరికొన్నింటిలో విఫలమయ్యాయి. శాసనబద్ధమైన చట్టమొక్కటే ప్రభుత్వ విజయానికి కారణమని భావించ వీలులేదు. శాసన చట్టానికి భిన్నమైన విషయం మరొక్కటి అభివృద్ధికి దోహదకారి అవుతున్నది. ఈమరో విషయమే రాజకీయ సంస్కృతి. రాజకీయ సంస్కృతి రాజకీయ వ్యవహార సరళిని నిర్దేశిస్తుంది. రెండు రాజ్యాలలో రాజ్యాంగం, పార్టీ వ్యవస్థ, ఒకే విధమైనవి కావచ్చును. కాని రెండింటి రాజకీయాలు భిన్నంగా ఉంటాయి. ఆ రెండు దేశాలలోని సమస్యలు భిన్నమైనవి కావటమేగాక దేశ రాజకీయాలపట్ల ప్రజల సాధారణ అభివృత్తులు, విశ్వాసాలు ప్రవర్తనలు ఒకే విధంగా ఉండవు. దేశంలోని రాజకీయాలపట్ల ప్రజలకు గల సాధారణ అభివృత్తులు, విశ్వాసాలు, విలువలు, ప్రవర్తనలు మొదలగు ప్రక్రియలనే రాజకీయ సంస్కృతిగా పేర్కొనడం జరుగుతున్నది. ఆల్మండ్, పవల్ దృష్టిలో మొత్తం దేశ ప్రజలలో గల అభివృత్తులు, విశ్వాసాలు, విలువలు, నైపుణ్యాలే రాజకీయ సంస్కృతి. ప్రజలలోని వివిధ వర్గాలలో గల ప్రత్యేక విభేదాలు, ధోరణులు కూడా ఇందులోనే అంతర్గతమై ఉంటాయి.

రాజకీయ సంస్కృతి ఒక ప్రత్యేక రాజకీయ చర్యనుగాని ప్రతి చర్యను కాని సూచించదు. అది ఒక ప్రత్యేకమైన అభివృత్తిని కాని, భాగస్వామ్యాన్నికాని, విధానానికి మద్దతును గాని సూచించదు. రాజకీయ

BRAOU

చర్యలు ధోరణులకు మార్గదర్శకంగా ఉండే సాధారణ అభివృత్తులు, విశ్వాసాలు, ప్రవర్తనలను మాత్రమే సూచిస్తుంది. రాజకీయ ప్రవర్తను నిర్దేశించే లేక ప్రభావపరిచే మార్గదర్శక సూత్రాలను ప్రాతిపదిక ధోరణులను మాత్రమే సూచిస్తుంది.

రాజకీయ సంస్కృతి భావన రాజకీయ వ్యవస్థలోని మనోవైజ్ఞానిక సంబంధ విషయాలైన అభివృత్తులు, విశ్వాసాలు, ఆశయాలకే ప్రాధాన్య మిస్తుంది. రాజకీయ సంస్కృతిలో ప్రజలలో గల విశ్వాసాలు, విలువలు, అభివృత్తులు, నైపుణ్యాలతో పాటుగా కొంతమందికే పరిమితమైన ప్రత్యేక సామర్థ్యతలు కూడా చేరి ఉంటాయి. దేశంలోని జనాభాలో ప్రాంతీయమైన విభేదాలు, తెగ సంబంధమైన ప్రత్యేకతలు, సామాజిక వర్గాలు, భిన్నత్వాలు ఉండవచ్చును. వీటినే మనం ఉపసంస్కృతులుగా వ్యవహరిస్తున్నాం.

ఏ దేశానికైనా అన్వయించుకొన్నప్పుడు రాజకీయ సంస్కృతిలో రాజకీయ విశ్వాసాలు, ప్రకటిత సంకేతాలు, రాజకీయ సందర్భాల విలువలు చేరిఉంటాయి. రాజకీయ సంస్కృతి రాజకీయాల పరిపూర్ణ పరిధిని వివరించదు. ఐతే రాజకీయ సంస్కృతి రాజకీయ వ్యవస్థలోగల రాజకీయ విశ్వాసాలు, గుర్తింపులు, బాధ్యతలు, మనోవైజ్ఞానిక ధోరణులు వివరిస్తుంది. రాజకీయ సంఘటనల, సంస్థల ధోరణిని రాజకీయ సంస్కృతి వివరిస్తుంది. రాజకీయ ప్రపంచంలో ఏమి జరుగుతున్నదన్న విషయాన్నిగాక, అలాంటి సంఘటనను ప్రజలు ఏవిధంగా భావిస్తున్నారన్న విషయానికి రాజకీయ సంస్కృతి ప్రాధాన్యమిస్తుంది. సమాజంలోని సమిష్టి విశ్వాసాలు యాధృచ్ఛికమైనవి కావు. అవి పరస్పర సంబంధితమైన తార్కిక విషయాలు. రాజకీయ విభేదాల మధ్య ప్రతి సమాజం ఒక ప్రత్యేక రాజకీయ సంస్కృతిని ప్రతిబింబిస్తుంది.

దేశంలోని చారిత్రక అనుభవాలు, వ్యక్తులపై వ్యక్తిగత అనుభవాలు రాజకీయ సంస్కృతి రూపకల్పనకు దోహదం చేస్తాయని లూసియన్‌పై వివరించారు. వ్యక్తులు మొదట సమాజంలో సభ్యులు అటు తరువాతనే రాజకీయ వ్యవస్థలో సభ్యత్వం పొందుతారు. రాజకీయ ప్రక్రియలలో పేరుకొనిపోయిన ప్రజల అనుభవాల గుచ్ఛాలే రాజకీయ సంస్కృతి. ప్రతితరం రాజకీయాలపట్ల అభివృత్తులను విశ్వాసాలను వారసత్వంగా పొందుతుంది. జరుగుతున్న రాజకీయాలపట్ల కూడా తమ భావాలను ప్రజలు రూపొందించు కొంటారు. రాజకీయ సంస్కృతి ఒక విధంగా అభ్యాస ప్రక్రియగా ఉన్నది. అది ప్రజల యదార్థ అనుభవాల ప్రోది.

రాజకీయ సంస్కృతి రాజకీయ చర్యల పరిమితులను నిర్ధారిస్తుంది. విశ్వాసాలు, అభివృత్తులు, ప్రవర్తనలే రాజకీయ సంస్కృతి ఐనందున అది ప్రజలు రాజకీయాలలో ఏవిధంగా పాల్గొంటున్నారన్న విషయాన్ని వివరిస్తుంది. రాజకీయాల నిర్వహణా ప్రమాణాలను రాజకీయ సంస్కృతిని అవగాహన చేసుకోవటం ద్వారానే మనం ఒక దేశపు రాజకీయాలను పూర్తిగా అర్థం చేసుకోవటానిక వీలవుతుంది. రాజకీయ భావనలు పరస్పర సంబంధం కలిగి ఉంటాయి. ఒకే వ్యక్తిలోని రాజకీయ బావనలలో కూడా పరస్పర సంబంధం ఉంటుంది. దేశ ప్రజలలో గల రాజకీయ భావనలలో రాజకీయ వ్యవస్థ వ్యవహార సరళిపై గణనీయమైన ప్రభావాలు కలుగజేస్తాయి. రాజకీయ చర్యల గురించిన ప్రత్యేక ధోరణుల క్రమం, ప్రతి రాజకీయ వ్యవస్థలోని చర్య, ప్రతిచర్య ఒక క్రమధోరణి ఉంటుంది. ఈ క్రమధోరణియే ఆ రాజకీయ వ్యవస్థకు, సంస్థలలో క్రమశిక్షణకు, వ్యక్తుల చర్యలకు, ప్రాతిపదికగా ఉంటుంది. సమాజ సాంప్రదాయాలు, ప్రజాసంస్థల స్వభావాల కాంక్షలు, పౌరుల సమిష్టి హేతుబద్ధ స్వభావం, రాజకీయ నాయకుల వ్యవహారసరళి మొదలైనవన్ని యాధృచ్ఛికమైన చారిత్రకాంశాలు కావు. అవి అన్ని కూడా గమనించవీలున్న నిర్మితులలోని అంతర్భాగాలుగా ఉంటాయి. రాజకీయ ప్రవర్తనకు అనువైన మార్గదర్శక సూత్రాలను రాజకీయ సంస్కృతి పౌరులకు ఏర్పరుస్తుంది. రాజకీయ సంస్కృతి రాజకీయ వ్యవస్థకు విలువల ప్రాతిపదిక గల నిర్మితులను హేతుబద్ధతలను పొందుపరుస్తుంది.

BRAOU

## 6.4 రాజకీయ సంస్కృతి - దృక్కోణాలు

జాతీయతా భావం, రాజకీయ ధర్మ కర్తృత్వం, ఔరసత్వం, రాజకీయ సమర్థత అనునవి రాజకీయ సంస్కృతి ప్రధాన దృక్కోణాలు.

జాతీయతా భావం:- వ్యక్తుల రాజకీయ విశ్వాసాలలో జాతీయతాభావం చాలా ప్రధానమైంది. రాజ్యంలో సభ్యుడుగా భావింపబడటానికి జాతీయతా భావం చాలా ముఖ్యం. ఇది ఆయా వ్యక్తుల భావనలమీద, విశ్వాసాలమీద ఆధారపడి ఉంది. ప్రాంతీయ, మత, వర్గ తెగలకు విధేయతకంటే మిన్నగా ప్రాథమిక రాజకీయ విధేయతయే రాజకీయ స్థిరత్వాన్ని, సామర్థ్యాన్ని ధృడపరుస్తుంది.

రాజకీయ ధర్మ కర్తృత్వం:- దీని విలువ రాజకీయ సంస్కృతిలో అతి గొప్పది. ఇది వ్యవస్థపై ప్రజలకు గల నమ్మకాన్ని విశదీకరిస్తుంది. ఇది అధికారంలో ఉన్నవారిపై వారి సక్రమ అధికార నిర్వహణపై విశ్వాసం కలిగిస్తుంది. ప్రజాస్వామ్య రాజకీయ సంస్కృతిలో ఇట్టి విశ్వాసాలు చాలా ప్రధానమైనవి. అధికారంలో ఉన్నవారి నాయకత్వాన్ని శాంతియుతంగా మార్పిడి చేయగలరనే నమ్మకం కూడా ఇందులో కలిసి ఉంది.

ఔరసత్వం:- ఏ వ్యవస్థ కూడా నియమాల అమలుకోసం కేవలం బలప్రయోగం మీదనే ఆధారపడదు. వ్యవస్థలోని ప్రజలే స్వచ్ఛందంగా నియమావళిని అంగీకరించి ప్రవర్తించాలి. అధికారంలో ఉన్న వారికి శాసన బద్ధంగానే అధికార ప్రాప్తి కలిగిందన్న భావం, రాజకీయ నిర్ణయాలను అనువైన కార్యక్రమం ద్వారానే అమలు పరచగలరన్న విశ్వాసం, ప్రజల స్వంత విషయాల్లో ప్రమేయం కలిగించుకోరన్న నమ్మకం కలిగించాలి. వ్యవస్థ ఔరసత్వాన్ని (Legitimacy) ప్రశ్నించినప్పుడు స్థిరత్వానికి దెబ్బ తగులుతుంది. రాజకీయ వ్యవస్థలన్నీ అంగీకార యోగ్యమైన సూత్రాల పైననే ఆధారపడి ఉన్నవి. పదవిలో ఉన్నవారు సమాజం అంగీకరించిన ప్రాతిపదికమీద అధికారం పొందారు కనుక ప్రజలు వారి అధికారాన్ని ఆమోదిస్తారు.

BRAOU

## 6.5 రాజకీయ సామర్థ్యం

రాజకీయ యోగ్యతలు కలవారందరూ వారికి అనుకూలం అనుకున్నప్పుడల్లా వ్యవస్థలోని రాజకీయాలను ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తారని మనం భావించవచ్చు. అట్టివారు రాజకీయాల్లో పాల్గొనడం వారు వ్యవస్థను అర్థంచేసుకొన్న దాన్నిబట్టే ఉంటుంది. ప్రభుత్వ నిర్ణయాలపై కూడా వారి ప్రభావం ఉంటుంది.

రాజకీయ సంస్కృతి సిద్ధాంతం, రాజనీతి సిద్ధాంతానికి గణనీయమైన అంశంగా చేకూర్చబడింది. తులనాత్మక పద్ధతుల విషయాల్లో జరిగిన వైజ్ఞానికాభివృద్ధి వైఖరుల విషయంలో కనుగొనబడిన అనుభవ పూర్వక విషయ పరిజ్ఞానం రాజకీయ సంస్కృతి సిద్ధాంతానికి క్రమానుగతి సాధనలో ప్రాతపదికలుగా ఏర్పడ్డాయి. ప్రవర్తనా వాద ధోరణుల మూలంగా వ్యక్తిగత రాజకీయ ప్రవృత్తుల విషయంలో కుశాగ్ర పరిశీలనలు ప్రారంభం అయినాయి. ఈ విషయం కారణంగా రాజకీయ సంస్కృతి చాలా ముఖ్యమైన సిద్ధాంతం, తప్పనిసరి విషయం కూడా. సూక్ష్మ స్థూల విశ్లేషణల్లో ప్రవర్తనావాద వైఖరి విషయంలో ఏర్పడిన అవగాహన అగాధాన్ని రాజకీయ సంస్కృతి పరిశోధనా పరికరంగా రాజనీతి శాస్త్ర అధ్యయనానికి సమగ్రత చేకూర్చింది. రాజకీయాలలో ఆర్థిక, సామాజిక విషయాలకు గల సంబంధాన్ని పరిశీలించే పరికరంగా రాజకీయ సంస్కృతి తోడ్పడుతుంది.

రాజకీయ సంస్కృతి మరోరకంగా కూడా అన్వయించుకోవచ్చు. రాజకీయ మార్పులు, ఆధునికీకరణం వల్ల ఏర్పడే సమస్యలను వ్యాఖ్యానించే వైఖరి, సిద్ధాంతంగా రాజకీయ సంస్కృతిని మనం అంగీకరించవచ్చు.

## 6.6 రాజకీయ సంస్కృతి అంతర్భాగాలు

ఆల్మండ్ పవల్ రాజకీయ సంస్కృతిలో మూడు అంతర్భాగాలను ఈ క్రింది విధంగా గుర్తించారు.

1. జ్ఞాన ప్రవృత్తులు Cognitive Orientations :- రాజకీయమైన నమ్మకాలు, ధ్యేయాల విషయంలో జ్ఞానం కలిగి ఉండటాన్ని జ్ఞానప్రవృత్తిగా గుర్తించవచ్చును. సమాజంలోని సభ్యులు వ్యవస్థ మరియు అది ఎదుర్కొంటున్న సమస్యల విషయంలో పరిపూర్ణజ్ఞానం కలిగి ఉంటారు.

2. ప్రాభావిక ప్రవృత్తులు Affective Orientation :- ఇందులో సభ్యులు రాజకీయ ధ్యేయాల విషయంలో వ్యవస్థకు అనుకూలంగా ఉండడంకాని, లేక వ్యతిరేకంగా కాని ఉండడం గమనించవచ్చు. కొంతమంది వ్యవస్థ విషయంలో వ్యతిరేకతను ప్రదర్శిస్తూ వ్యవస్థకు కొత్తరూపు కల్పించాలని భావిస్తుంటారు.

3. మూల్యాంకన ప్రవృత్తులు Evaluative Orientations :- రాజకీయ ధ్యేయాల విషయంలో సభ్యులు తులనాత్మక భావాలను ప్రదర్శిస్తుంటారు. ప్రతి రాజకీయ ఆశయాన్ని తులనాత్మక దృష్టితో పరిశీలిస్తుంటారు.

పైన చెప్పిన మూడు ప్రవృత్తులు పరస్పర సంబంధం కల్గినట్టివి. రాజకీయ వ్యవస్థలోని భిన్న ప్రవృత్తుల సముదాయాలను మూల్యాంకనం ద్వారా గుర్తించ వీలున్నది.

## 6.7 ఆల్మండ్, వెర్బాల అధ్యయనం

BRAOU

ఉదార ప్రజాస్వామ్య దేశాలలో రాజకీయ సంస్కృతిని అర్థం చేసుకోవడానికి రెండు పద్ధతులున్నాయి. చాలా ప్రజాస్వామ్యసమాజాలలో జాతీయ రాజకీయ సంస్కృతి చారిత్రక పరిణామాల ఫలితమని; అది ఒక తరం నుండి మరొక తరానికి, కుటుంబం లాంటి సామాజిక వ్యవస్థల ద్వారా సంక్రమిస్తుందని ప్రవర్తనా వాదుల భావన. దీన్ని మార్క్సిస్టులు తిరస్కరిస్తూ, ప్రాబల్యం ఉన్న వర్గాలు తమ విలువలను; తమకంటే తక్కువ స్థాయి వర్గాలపై ప్రసారణ యంత్రాంగాల ద్వారా సంక్రమింపు జేసే ప్రయత్నాల ఫలితమే రాజకీయ సంస్కృతి అన్న దృక్పథాన్ని వ్యక్తీకరించారు. ఒక తరం మరొక తరానికి సంక్రమింప జేసే విలువలను ప్రవర్తనా వాదులు అధ్యయనం చేస్తూ, దానినే సామాజికీకరణం అని అన్నారు. కాని మార్క్సిస్టులు ఈ విలువల సంక్రమణ వర్గాల మధ్య ఏర్పడినదని అది Indoctrination అని అన్నారు. సహజంగా జాతీయ రాజకీయ సంస్కృతి సామాజికీకరణ చరిత్రనుండి ఆవిర్భవించిందని ప్రవర్తనా వాదులు అనగా; పెట్టుబడిదారీ సమాజంలో జాతీయ రాజకీయసంస్కృతి బలహీనమైనదని, నిరంతరం ఆ సంస్కృతి ద్వారా లబ్ధిపొందే వర్గాలనుండి విచ్ఛిన్నం కాకుండా సహాయం పొందుతుందని మార్క్సిస్టులు అన్నారు.

ఆల్మండ్, వెర్బాలు పౌర సంస్కృతి అధ్యయనం ద్వారా ప్రవర్తనా వాదుల రాజకీయ సంస్కృతి భావనను విపులీకరించవచ్చు. ఉదారవాద ప్రజాస్వామ్య సమాజాలలో రాజకీయ సంస్కృతి బలంగా ఉండటమే కాక క్రమాభివృద్ధి చెందుతుందని ఆల్మండ్, వెర్బాలు ధృవపరచుటకు ప్రయత్నించారు. వీరు మూడు స్వచ్ఛమైన రాజకీయ సంస్కృతులను పేర్కొన్నారు. అవి సంకుచిత (Parochial), పాలితుల Subject, భాగస్వామ్యపు సంస్కృతులు. సంకుచిత రాజకీయ సంస్కృతిలో పౌరునికి కేంద్ర ప్రభుత్వ ఉనికిపై అంతగా అవగాహన ఉండదు. Subject రాజకీయ సంస్కృతిలో పౌరుడు రాజకీయ ప్రక్రియలో భాగస్వామిని అని అనుకోక అతడు తనను కేవలం పాలితునిగానే భావించుకొంటాడు. భాగస్వామ్యపు రాజకీయ సంస్కృతిలో పౌరుడు

తాను వ్యవస్థ నిర్వహణలో భాగస్తుడగుటయేగాక దాని ప్రభావానికి గూడా గురౌతుంటానన్న నమ్మకంతో ఉంటాడు.

భాగస్వామ్యపు రాజకీయ సంస్కృతిలోని Subject మరియు Parochal సంస్కృతులు సమతౌల్యం పరచిన సమాజంలో స్థిరమైన ప్రజాస్వామ్యం మనగలదని ఆల్మండ్, వెర్బాలు భావించారు. ఈ మిశ్రమ సంస్కృతిని పౌరసంస్కృతియని చెప్పారు. ఈ సంస్కృతిలో పౌరుడు తన ప్రథమ గణ్యాన్ని (Preference) ప్రభుత్వానికి తెలియ చేయుటంలో క్రియాశీలక పాత్రను నిర్వహిస్తూ, ప్రత్యేక సమస్యల పై శిష్టవర్గాల నిర్ణయాలను శిరసావహించుటకు వెనుదీయడు. పౌరుడు తాను ప్రభుత్వాన్ని ప్రభావ పరచుటకు సమర్థుడనని భావిస్తాడు. కాని సాధారణంగా ఆ పని చేయుటానికి ఇష్టపడడు. ఆ విధంగా ప్రభుత్వానికి కావలసిన సరళత్వాన్ని (Flexibility) అందిస్తాడు. ఆల్మండ్, వెర్బాలు అధ్యయనం చేసిన ఐదు దేశాలలో వీరి భావాలకు చాలా చేరువలోకి వచ్చిన దేశం బ్రిటన్. తరువాత స్థానం అమెరికా సంయుక్త రాష్ట్రాలది. బ్రిటన్‌లో Subject రాజకీయ సంస్కృతి ప్రధానంగా ప్రాముఖ్యత వహించగా, అమెరికాలో భాగస్వామ్యపు Orientations కు అధిక ప్రాధాన్యత లభించింది.

ఆల్మండ్, వెర్బాల అధ్యయనం 1950 దశకంలో జరిగినప్పటికీ, వారి పరిశీలనలో 1980 దశకం వరకు కూడా మౌలికమైన మార్పులు రాలేదు. 1960 తరువాత కాలంలో జాతీయ, అంతర్జాతీయ రంగాలలో వచ్చిన మార్పుల ఫలితంగా అమెరికా, బ్రిటన్‌లలోని ప్రభుత్వాలపైన నమ్మకాలు సడలినప్పటికీ ఆయా దేశాల రాజకీయ సంస్కృతులలో మౌలికమైన మార్పులు రాలేదు. ఇప్పటికీ వారువారి రాజకీయ వ్యవస్థల గూర్చి గర్వపడటమేగాక గౌరవ ప్రపత్తులుగుడా కలిగి ఉన్నారు. ప్రభుత్వాల పనితీరుపై నిరసనలు వ్యక్తం చేసినప్పటికీ రాజకీయ ప్రక్రియలపై వారి విశ్వాసం సడలలేదు. ఆల్మండ్, వెర్బాల రాజకీయ సంస్కృతి భావనపై నాలుగు ప్రధాన విమర్శలు వచ్చాయి.

BRAOU

(1) రాజకీయ సంస్కృతి రాజకీయ వ్యవస్థను ప్రతిబింబిస్తుందే కాని దానిని ప్రభావ పరచదు.

(2) సాధరణంగా రాజకీయ స్థిరత్వానికి పౌరసంస్కృతి తోడ్పడుతుంది. ప్రత్యేకంగా ప్రజాస్వామ్య వ్యవస్థలకే ఇది పరిమితం కాదు.

(3) ప్రజాస్వామ్య ప్రభుత్వాలకు పౌర సంస్కృతి ఇచ్చే సరళత్వం (FLEXIBILITY), ప్రధానంగా విధాన నిర్ణయాలలో; ఉదారవాద ప్రజాస్వామ్య సమాజాలలో ప్రజాస్వామ్యాన్ని హరించే విధంగా మారవీలున్నది.

(4) ఆల్మండ్, వెర్బాలు పౌరసంస్కృతిని చర్చిస్తూ రాజకీయ ఉపసంస్కృతులను పూర్తిగా మరిచిపోయారు. జాతీయసంస్కృతులకు భిన్నంగా కొన్ని వర్గాలు ప్రత్యేక రాజకీయ భావాలను దృక్పథాలను కలిగిఉంటాయి. ఒక్కొక్కసారి ఈ ఉపసంస్కృతులు జాతీయ సంస్కృతి ఉన్నాదా లేదా అన్న భావాన్ని కలిగిస్తుంటాయి.

## 6.8 రాజకీయసంస్కృతి - మార్క్సిస్టుదృక్పథం

తమను దోపిడీ చేసే పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా శ్రామికవర్గం ఎందుకు తిరుగుబాటు చేయదో విపులీకరించటం మార్క్సిస్టులకు తీవ్రవాద రాజకీయ వాదులకు ప్రధానమైన కర్తవ్యమయింది. ఉత్పత్తి సాధనాలను నియంత్రించే వారే భావోత్పత్తి సాధనాలను కూడా అదుపు చేస్తారని మార్క్స్ అన్నారు. కాలగమనంలో పెట్టుబడిదారీ విధానంలోని సమస్యలే శ్రామిక వర్గం తిరుగుబాటు చేయుటకు దారితీస్తుందని

కూడా అన్నారు. కాని ఇటీవల కాలపు మార్క్సిస్టులకు దీనిపై విశ్వాసం లేదు. వారు ఉపరితల నిర్మితుల (Super Structures) రాజకీయ సంస్కృతికి అనుకూలంగా రాజకీయాలను మలచటంలో ప్రధానపాత్రను నిర్దేశించారు. వ్యవస్థ మౌలిక ఆర్థికస్వరూపంలో మార్పులు రానప్పటికీ విచ్ఛిన్నంకానప్పటికీ, రాజకీయ క్రియాశీలత, రాజకీయ అభివృత్తులను (Attitudes) మారుస్తుందని వాదించారు. రాజకీయ సంస్కృతి దేశ చారిత్రక పరిణామక్రమంలో ఉద్భవించిన Neutral Product కాదని; అది ప్రభావ వర్గాలు, తమసామాజిక ఆర్థిక ప్రాబల్యానికి శాసన బద్ధత కల్పించటకు ఉద్దేశ్యపూర్వకంగా చేసిన ప్రక్రియల ఫలితమని మార్క్సిస్టులు భావిస్తున్నారు. ప్రసారణ యంత్రాంగాలు, విద్యావ్యవస్థలు, వ్యాపార వ్యవస్థలు, మతసంస్థల ద్వారా పెట్టుబడిదారి విధానం రాజకీయ సంస్కృతి ఒకతరం నుండి మరొక తరానికి అందుతున్నది. మార్క్సిస్టు వాదుల దృష్టిలో ప్రాధాన్య విలువలను (Dominant Values) సాధారణంగా అంగీకరించినప్పటికీ తీవ్రవాద కార్యకలాపాల జీవితాన్ని వారు విస్మరించటం లేదు. శ్రామికవాదుల రాజకీయసంస్కృతి కేవలం ప్రాధన్య విలువలను వ్యతిరేకించకుండా అంగీకరించటంకాదు. ఈ సంస్కృతిలో అన్ని శ్రామిక వర్గాలకు వామపక్షరాజనీతికి, సమ్మెను విశ్వసించే వర్గాలకు, విలువలకు, అభివృత్తులకు తగిన ప్రాతినిధ్యం ప్రాధాన్యత ఇవ్వబడింది. మార్క్సిస్టురాజకీయ సంస్కృతిలో ప్రవర్తనావాదుల రాజకీయ సంస్కృతికన్నా ఉపసంస్కృతులు అధిక ప్రాధాన్యతను పొందాయి.

మార్క్సిస్టుల రాజకీయ సంస్కృతి భావనలో కొన్ని బలహీనతలు ఉన్నాయి. వారిదృష్టిలో క్రింది తరగతి వర్గాలు, అధీనవర్గాలు అన్ని స్వతహాగా తీవ్రవాదాన్ని అనుకరిస్తాయి. కాని వారు ప్రాధాన్య భావజాలం (Dominant Ideology) ద్వారా ప్రలోభాలకు గురై వామపక్ష వాదం నుండి బయటికి రప్పించబడుతున్నారన్నది మార్క్సిస్టుల వాదన. కాని లిప్‌సెట్ (Lipset) దృష్టిలో శ్రామికులు కూడా కొంతవరకు Conservative భావాలు కలవారే. శ్రామికులకున్న పరిమిత విద్యావకాశాలు, ఆర్థిక భద్రతారాహిత్యం వారిని అధికారయుత రాజకీయ దృక్పథాన్ని బలపరిచేటట్లు చేస్తున్నాయి. ఈ విషయంలో ప్రాధాన్యవర్గాల (Dominant Class) ప్రసక్తిలేదు. భారత రాజకీయ వ్యవస్థలోని రాష్ట్రాల ప్రభావం రాజకీయసంస్కృతిపై ఏవిధంగా ఉంటుందో కమ్యూనిస్టు ప్రభుత్వాలు ఉన్నరాష్ట్రాలు చక్కగా వివరిస్తున్నాయి. కమ్యూనిస్టు సిద్ధాంతం, పార్టీ విద్యాసాంస్కృతిక సంస్థలలోకి చొరబడి నూతన కమ్యూనిస్టు వ్యక్తిని - వర్గరహిత, మతరహిత, సామ్యవాద పెట్టుబడిదారీ విధానపు వాసలను చూడని - రూపొందించటానికి కృషి చేస్తున్నాయి. కమ్యూనిస్టు విప్లవం రాకముందు, విప్లవం తరువాత, సమాజరాజకీయ సంస్కృతిని పరిశీలించిన కమ్యూనిస్టు పార్టీలకృషి అవగతమౌతుంది. చాలా సందర్భాలలో ఈ ప్రయోగం ఆశించినంతగా విజయం సాధించలేదు. నూతన వ్యక్తి ఆవిర్భావం కలగానే మిగిలిపోయింది. ఆర్థిక, సైనిక విషయాలలో కొంత ఉన్నతిని శాసన బద్ధతను సాధించినప్పటికీ, పూర్వపు సంస్కృతిక సాంప్రదాయాలైన మత, జాతిభావం, రాజకీయాలవైపు అనుమానాస్పద భావాలుగా సామ్యవాద భావనలతోపాటుగా సహజీవనం గడుపుతున్నాయి. పర్యవసానంగా కమ్యూనిస్టు దేశాలలో రాజకీయ సంస్కృతి, ఉదార వాద ప్రజాస్వామ్యసమాజాలలో కంటే అస్పష్టతా లోపంతోనూ, నిరంతరత లేమితోను దర్శనమిస్తున్నాయి.

## 6.9 రాజకీయ సంస్కృతి - రకాలు

మొదటి ప్రపంచపు రాజకీయసంస్కృతిలో భాగస్వామ్య సంస్కృతి పోకడలు పుష్కలంగా ఉన్నా; రెండవ ప్రపంచపు రాజకీయ సంస్కృతిలో పాలితుల సంస్కృతి (Subject) వాసనలు కనపడుతున్నాయి. మూడవ ప్రపంచదేశాల రాజకీయ సంస్కృతిలో సంకుచిత భావాలుంటాయా? మూడవ ప్రపంచపు దేశాలు అనగా అభివృద్ధి చెందుతున్నదేశాలలో రాజ్యాధికారం పటిష్టంగా ఉండదు. అది సామాజిక వ్యవస్థలలో అంతర్గతంగా

చాలా లోతులో ఉంటుంది. అందుకే అది ప్రజల దృష్టిని అంతగా ఆకర్షించదు. రాజ్యవ్యవస్థ బలహీనంగా ఉండటానికి ఈ సంకుచిత సంస్కృతియే కారణమా? ఇది కొంతవరకు యదార్థం. స్వాతంత్ర్యానంతరం నాయకులు రాజకీయ సంస్కృతిని జాతీయం చేయ ప్రయత్నించారు. వర్ణాలకు, వర్గాలకు కాక రాజ్యానికి విధేయులుగా ఉండవలెనని ప్రాథమిక విద్యలో భోదించటం, ప్రజామాధ్యమాల ద్వారా జాతీయోద్యమాల ప్రధానాంశాలను పదేపదే వల్లె వేయించటం లాంటి వాటి ద్వారా రాజకీయసంస్కృతిని జాతీయం చేయప్రయత్నించారు. నూతనవ్యక్తిని సృష్టించటంలో కమ్యూనిస్టులు ఏ విధంగా కృతకృత్యులు కాలేదో అదే విధంగా మూడవ ప్రపంచపుదేశాలు గూడా పాక్షికంగానే విజయం సాధించాయి. పర్యవసానంలో జాతి నిర్మాణ కార్యక్రమాలు లాంఛనప్రాయమైనవి గానే మిగిలిపోయాయి. కొత్త సంస్కృతి నిర్మాణ కార్యక్రమంలో మూడవ ప్రపంచదేశాలు అంతర్గత సమస్యలతోపాటుగా బలహీనమైన పౌరసమాచార వ్యవస్థ, సమాచారం ప్రజలకందించలేనట్టి జటిల సమస్యలతో తలమునకలై ఉన్నాయి. సాంప్రదాయ నాయకులద్వారా మాత్రమే మూడవ ప్రపంచ దేశాలు నూతన విలువలను ప్రజలకందించ గలుగుతున్నాయి.

మూడవ ప్రపంచదేశాలలో జాతీయ ప్రభుత్వ కార్యకలాపాలు పెద్దగా ప్రాముఖ్యత పొందవుగాని స్థానిక ప్రభుత్వాలను గూర్చి ప్రజలకు ఎక్కువగానే అవగాహన ఉంటుంది. ఈ ప్రభుత్వాలనుండి ప్రజలకు ఎక్కువగా సేవాసౌకర్యములు లభించుటయే ఇందుకు కారణం. మూడవ ప్రపంచదేశాలను బహుళ సంస్కృతుల దేశాలుగా వర్ణించటం భావ్యం. బలహీన జాతీయ రాజకీయ సంస్కృతి, ప్రత్యేకమైన ఉపసంస్కృతులు గల దేశాలుగా వర్ణించటం సమంజసమైన విషయం కాదు. సాంప్రదాయం, ఆధునికతలను ప్రత్యేకించి అధ్యయనం చేయటాన్ని మూడవ ప్రపంచదేశాల రాజకీయ సంస్కృతి విశ్లేషణగా భావించటం జరుగుతున్నది. చాలామంది రచయితలు స్థానికత్వం లేదా సంకుచితత్వం మూడవ ప్రపంచదేశాల రాజకీయ సంస్కృతికాదని, అది సాంప్రదాయ భావం అని అంటున్నారు. అది ఆదేశాల రాజకీయ సంస్కృతి మూలమని అంటున్నారు. సాంప్రదాయ సంబంధాలు, రక్త సంబంధాలు (Kinship) ను ఆధారంగా చేసుకొని ఏర్పడుతాయి. అందుకే రక్త సంబంధీకులకు మిత్రులకు మద్దతుదారులకు సహాయం చేయడాన్ని మూడవ ప్రపంచదేశాలలో Corrupt Practices గా భావించటంలేదు. పాశ్చాత్య దేశాలలో Corrupt చర్యలుగా భావించే వాటిని, మూడవ ప్రపంచదేశాలలో సామాజిక Obligations ముక్కుకు సూటిగా నిర్వహించటమని చెప్పవచ్చు. రాజకీయ సంస్కృతిని సాంప్రదాయం ఆధునికతల మధ్య విభేదించేదిగా విశ్లేషించటం ఉపయోగకరంగా ఉంటుంది. ఉదాహరణకు కేంద్రం, కేంద్రం చుట్టూ (Periphery) అన్నవిభేదాలు; సాంప్రదాయ ఆధునికతల మధ్య ఉద్రిక్తతల మూలంగానే అని వివరించవచ్చు. అలాంటప్పుడు ఆర్థికాభివృద్ధి, బలమైన స్వతంత్రమైన రాజ్యంగా రూపొందుటకు రాజకీయ సంస్కృతిని ఆధునికమైనదిగా మార్చటమే జవాబు అవుతుందా? కాదు అని చెప్పవచ్చు. సాంప్రదాయం, ఆధునికతలు సహజీవనం చేయగల్గుతాయి. అవిరాజ్య అభివృద్ధికి స్థిరత్వానికి దోహదపడుతాయి. ఆర్థిక, సామాజికాభివృద్ధికి సాంప్రదాయక సంస్కృతి అడ్డుగోడకాదని అది కొంతవరకు అభివృద్ధిని సాధించుటకు దోహదపడగలదని చాలమంది రాజకీయశాస్త్రజ్ఞులు అంగీకరిస్తున్నారు.

BRAOU

ఆల్మండ్ మరియు వెర్బాలు మూడు రకాలైన రాజకీయ సంస్కృతులను గుర్తించారు. 1. సంకుచిత రాజకీయ సంస్కృతి, 2. పాలితుల రాజకీయ సంస్కృతి, 3. భాగస్వాముల రాజకీయ సంస్కృతి.

సంకుచిత రాజకీయ సంస్కృతిని సాంప్రదాయక సమాజాలలో గుర్తింప వచ్చును. సాంప్రదాయక సమాజంలోని సభ్యులు తమతమ సాంప్రదాయ పద్ధతులనే అనుసరిస్తూ సంతృప్తి చెంది నూతనత్వం విషయం పట్టించుకోరు. ఇలాంటి సమాజంలో వ్యక్తి వ్యవస్థ గురించి ఎక్కువగా ఆలోచించడు. రాజకీయ ధ్యేయాల విషయంలో వ్యతిరేక ప్రవృత్తినికూడా ప్రదర్శిస్తుంటాడు. వ్యవస్థలోని వివిధ సంస్థలు అతనిని ప్రభావితం

చేయులేవు. తమ తమ సంకుచిత పరిధుల వ్యవస్థల నిర్మాణాల గురించి ఆలోచిస్తుంటారు. ఇంకోవిధంగా చెప్పాలంటే వ్యవస్థాగతమైన రాజకీయ చర్యల విషయంలో వ్యక్తులకు ఏ రకమైన అభిప్రాయాలు, అనుభూతులుండవు.

వ్యవస్థాగత విషయంలో అధిక పరిజ్ఞానం కలిగి ఉండడం పాలితుల సంస్కృతిగా భావింపబడింది. పౌరులు ఎప్పుడూ రాజకీయ చర్యల దోహదాలను గురించియే ఆలోచిస్తుంటారు. తమకు రాజకీయ చర్యలలో పాత్ర లేదన్న విషయాన్ని గ్రహిస్తారు. పాలితుల సంస్కృతిలో పౌరులు నిష్క్రియావాదులుగా ఉంటారు. వ్యవస్థను ప్రభావితం చేయాల్సిన అవసరం లేదని భావిస్తుంటారు. వ్యవస్థలో మార్పు తేలేరు గనుక యధాతథంగా వ్యవస్థను అంగీకరించాల్సిన ప్రాధాన్యతను గుర్తిస్తాడు. రాజకీయ నాయకుల ఆదేశాలను విధేయుడుగా అంగీకరిస్తాడు. ఇలాంటి సంస్కృతిని మనం తూర్పు యూరోపియన్ రాజ్యాలలోనూ మరియు అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనూ గుర్తించవచ్చు.

సమాజంలో విస్తృత ప్రాతిపదిక మీద నూతన ప్రవృత్తులు ఏర్పడే అవకాశం ఉండడాన్ని భాగస్వామ్య సంస్కృతిలో గుర్తించవచ్చు. ఈ సంస్కృతిలో వ్యక్తులు చాలా క్రియాశీలురుగా వ్యవహరిస్తుంటారు. రాజకీయ వ్యవస్థ విషయంలో అతని వైఖరులన్నియు ప్రభావితం చేసేవిగాను, గుర్తింపును సూచించేవిగాను ఉంటాయి. దేశంలో వున్న వివిధ రాజకీయ వైఖరుల విషయంలో అనుకూలతనుగాని, వ్యతిరేకతనుగాని ప్రదర్శించవచ్చు. అంగీకారంగాని, తక్షణ తిరస్కారంగాని తెలుపు భిన్న ప్రవృత్తుల్ని ప్రదర్శిస్తుంటారు.

ఏ సమాజంలో కూడా పైన చెప్పిన మూడు రాజకీయ సంస్కృతులు స్పచ్ఛమైన రూపంలో కన్పించవు. అవి ఏవి కూడా ఏకత్వాన్ని ప్రదర్శించవు. ఇందుచేతనే ఆల్మండ్ మిశ్రమ రాజకీయ సంస్కృతులను గురించి వివరించాడు. అవి సంకుచిత పాలిత సంస్కృతి, పాలిత భాగస్వామ్య సంస్కృతి, సంకుచిత భాగస్వామ్య సంస్కృతులు. ఈ గుణాలన్నీ ఉండే పౌరసంస్కృతి, మరొకటి. ఈ రకమైన పౌరసంస్కృతి మనకు బ్రిటన్, అమెరికా దేశాలందు కన్పిస్తుంది.

BRAOU

## 6.10 రాజకీయ ఉపసంస్కృతి

వివిధ దేశాల్లోని రాజకీయ సంస్కృతుల అధ్యయనానికి చాలా ప్రయత్నాలు జరిగాయి. ఈ ప్రయత్నాల ఫలితంగా రాజకీయ సంస్కృతి సిద్ధాంతాన్ని మరింత విశదీకరించడం జరిగింది. ఈ నాటి పరిస్థితుల్లో ఏ సమాజం కూడా ఏకత్వంగల రాజకీయ సంస్కృతిని ప్రతిబింబించదు. ఏ దేశంలో కూడా రాజకీయ సంస్కృతి భౌగోళిక హద్దుల్లో ఉన్న ప్రజలందరికి వర్తించేదిగా లేదు. విద్యాస్థాయి, జాతి విభేధాలు, భాషావాదం, మతం వర్గం, కులం మరియు భౌగోళిక ప్రాతిపదికలలో భిన్నత్వం గోచరిస్తుంది. దేశంలోని ఏ ప్రాంతమైనా ప్రత్యేకతను సంతరించుకొన్నప్పుడు దానిని ప్రత్యేక ఉపసంస్కృతిగా పేర్కొంటున్నారు. ఏ రాజకీయ వ్యవస్థలోనైనా పాలకుల శిష్ట రాజకీయ సంస్కృతిని పాలితుల, ప్రజల రాజకీయ సంస్కృతికి భేదాన్ని మనుం గమనించవచ్చు. ఇవేకాక ఇందున్న ఉపసంస్కృతులను గూడ మనం గుర్తించ వచ్చును.

అమెరికాలోని తెల్లవారికి నల్లవారికి మధ్యనున్న రాజకీయ సంస్కృతీ విభేదాలు మనందరికీ తెలిసినవే. కొన్ని యూరోపియన్ రాజ్యాలలో రోమన్ కాథలిక్కులు ప్రొటెస్టెంటుల మధ్య రాజకీయ సంస్కృతీ భేదం గమనించదగింది. మన భారత దేశంలో హిందూ-ముస్లింల భిన్న రాజకీయ ఉపసంస్కృతులు మనకు తెలిసిన విషయాలే.

ఇదివరకే చెప్పినట్లుగా రాజకీయ వ్యవస్థలలో గల జనాభా అంతటికి ఒకే రాజకీయ సంస్కృతి ఉంటుందన్న విషయం సరియైనదికాదు. దేశ జనాభాలో కొంతమంది భాగస్వామ్య సంస్కృతిని అలవరచుకొంటారు. మరికొందరు పాలితుల సంస్కృతినే అంటిపెట్టుకొని ఉంటారు. ఇందుకు విద్య, తెగలో సభ్యత్వం, భౌగోళిక ప్రాంతం, ఆర్థిక రాజకీయ, మత సంబంధమైన భిన్నత్వాలు కారణం కావచ్చును. రాజకీయ సంస్కృతికి తగిన విధంగా రాజకీయ నిర్మితులు లేనప్పుడు కూడా ఇలాంటివే సంభవిస్తుంటాయి. నిర్మితులలో మార్పులు లేకుండా ప్రజల మనోభావాలలో త్వరితగతిని మార్పులు ప్రవేశించే అవకాశాలు ఉండటం కూడా కారణం కావచ్చు. శ్రేష్ఠులు దేశంలో ప్రవేశపెట్టిన కొత్త సంస్కృతిని కొంతమంది అనుసరించలేకపోవచ్చును కూడా. ఈ వివిధ కారణాల వల్ల దేశంలోని ప్రజలలో వివిధములైన రాజకీయ భావాలు నెలకొనిపోయే అవకాశాలున్నాయి. ఒక రాజకీయ వ్యవస్థలోని ప్రజల రాజకీయ భావాలలో గుర్తింపదగిన విభేదాలు ఉన్నప్పుడు మనం వాటిని రాజకీయ ఉపసంస్కృతులుగా పేర్కొంటున్నాం.

జన సమూహ సంస్కృతి (Mass culture):- ప్రతి దేశంలోను పాలకులు, పాలితుల సంస్కృతుల మధ్య విభేదాలు ఉండటాన్ని మనం గమనింపవచ్చును. ప్రభుత్వ నిర్ణయాలు చేసే బాధ్యత కలవారు తక్కిన ప్రజలకంటె భిన్నమైన మనోభావాలను కలిగిఉంటారు. ఇలాంటి విభేదాలను మనం ప్రజాస్వామ్య రాజ్యాలలో గూడా గమనించవచ్చు. ఫలితంగా జనసమూహ సంస్కృతి, శిష్టసంస్కృతి అను రెండు విభిన్న సంస్కృతులను మనం గమనించవీలున్నది.

మైరన్ వీనర్ భారత రాజకీయ సంస్కృతిలో జనసమూహ సంస్కృతి, శిష్ట సంస్కృతుల రెండింటిని విశ్లేషించారు. కుల, మత, ప్రాంతీయతత్వాలు భారతదేశపు జనసమూహ సంస్కృతికి ప్రాతిపదికలుగా ఉన్నాయి. స్థానిక స్వార్థ రాజకీయ నాయకులు కుల, మత, ప్రాంత సమూహాలను ప్రత్యేక రాజకీయ వర్గాలుగా తీర్చిదిద్దుతున్నారు. ఈ వివిధ వర్గాలు ఆర్థిక సహాయం, అత్యధిక విద్యాసౌకర్యాలు, ఇండ్ల స్థలాలు మొదలైన వాటినని అభ్యర్థిస్తున్నారు. ఈ అభ్యర్థనలన్నీ ఆధునికీకరణకు చెందిన విషయాలే. ఉద్యోగాల్లో, విద్యాలయాల్లో రిజర్వేషన్ల అభ్యర్థనలు సాంప్రదాయ బద్ధతుకు సంబంధించినవి. ఈ వివిధ వర్గాల రాజకీయ అభ్యర్థనలు దేశ సమగ్రతకు ప్రమాదకారిగా సంభవిస్తున్నాయి. అస్సాంలో మిజోలు, నాగాలు, బోడోలు, పశ్చిమ బెంగాలులో గూర్ఖాలు తమిళనాడులో ద్రావిడ వర్గాలు తెగ విధేయతలకే ప్రాధన్యమిస్తున్నాయి. రాజకీయ పార్టీలన్నీ స్థానికమైన గ్రామీణ నాయకులపై ఆధారపడుతున్నాయి. గ్రామీణ నాయకులలో కుల, వర్గ, తెగ విధేయతలు ప్రబలంగా ఉంటున్నాయి. జాతీయస్థాయి రాజకీయ పార్టీలు కూడా స్థానికమైన ముఠా తగాదాలను ఎదుర్కోవాల్సి వస్తున్నది. అయినప్పటికీ స్థానిక రాజకీయ వర్గాలను సంకుచితమైనవిగా భావింప వీలులేదు. స్థానికవిభాగాలు జాతీయ పార్టీకి అనుబంధించియే ఉంటున్నాయి. జాతీయపార్టీల నాయకత్వం శిష్టసంస్కృతిని సంతరించుకొని ఉన్నది. వివిధ వర్గాల మధ్య తగాదాల పరిష్కారంలో నాయకులు సాంప్రదాయకమైన సర్వజనసమ్మతి, (Consensus) సామరస్య పరిష్కార పద్ధతులనే అనుసరిస్తున్నారు. మధ్యవర్తి పరిష్కారం, సర్వజన సమ్మతి పద్ధతులు ప్రాచీన భారతంలో బాగా అనుసరింప బడుతుండేవి. కేంద్రస్థాయిలోని జాతీయనాయకత్వాన్ని ఇవి బాగా ప్రభావ పరచాయి.

భారతదేశంలో శిష్టసంస్కృతి ఢిల్లీలోనే ప్రబలంగా ఉందని మైరన్ వీనర్ అన్నారు. ఈ సంస్కృతి జాతీయ ప్రణాళికా వాదులలోను, నాయకులలోను ఉన్నతోద్యోగులలోను ప్రతిబింబిస్తున్నది. సాయుధ దళాలలో ఈ సంస్కృతి ప్రబలస్థానాన్ని సంతరించుకొన్నది. ఇంగ్లీషు భాష మాట్లాడే మేధావుల్లో కూడా ఈ శిష్టసంస్కృతి బాగా పేరుకొని పోయింది. ఈ శిష్టసంస్కృతి రాష్ట్రాల రాజధానుల్లో చాలా తక్కువగా ఉంటున్నది. గ్రామాల్లో అసలే లేదు. శిష్టసంస్కృతి ఆధునికత స్వభావాన్ని కలిగి ఉన్నది. అయినప్పటికీ

BRAOU

శిష్టసంస్కృతిలో చాలా సాంప్రదాయక భావాలు కూడా అంతర్గతంగా స్థానం సంతరించుకొన్నాయి.

రాజకీయ అధికార కేంద్రానికి దగ్గర సంబంధం కల వారి నమ్మకాలు, అభివృత్తులు భావనలు శిష్ట రాజకీయ సంస్కృతిగా పేర్కొన్నారు. సంకుచిత, పాలితుల రాజకీయ సంస్కృతులు గల దేశాలలో రాజకీయ Orientation ల విశ్లేషణ కేవలం శిష్టుల విలువలపైననే కేంద్రీకరింపబడిఉంటుంది. ప్రజాసమూహాల అభివృత్తుల రాజకీయాలపై అభివృద్ధి చెందిన ఉదారవాద ప్రజాస్వామ్య సమాజాలలో కూడా శిష్టుల దృక్పథమే రాజకీయ నిర్ణయాలను ప్రత్యక్షంగాను, అమితంగాను ప్రభావితం చేస్తాయి.

మొదటి ప్రపంచ దేశాలలో శిష్టుల రాజకీయ విలువలు సామాన్యుల విలువలకన్న భిన్నంగా ఉంటాయని చాలా అధ్యయనాల్లో వెల్లడి అయింది. శిష్టులు సామాన్యుల కన్నా రాజకీయాలపై భిన్నంగా ఆలోచించటమేగాక, వారు ఆలోచించే అంశాలు కూడా భిన్నంగా ఉంటాయి. శిష్టుల నమ్మకాలు గాఢంగా ఉండటమేగాక అవి సందర్భశుద్ధిగాను స్థిరంగాను ఉంటూ సరియైన సమాచారాన్ని ఆధారంచేసుకొంటాయి. సామన్యుల నమ్మకాలు అంత గాఢంగా ఉండవు. ఒక రకంగా శిష్టులకు మాత్రమే స్థిరమైన నమ్మకాల వ్యవస్థ (Belief System) ఉంటుంది. ఈ నమ్మకాల వ్యవస్థను శిష్టులు ఏ విధంగా అభివృద్ధి పరుస్తారో వ్యక్తపరుస్తారో ఒక్కొక్క దేశంలో ఒక్కొక్క రకంగా ఉంటుంది.

## 6.11 రాజకీయ సంస్కృతి వృద్ధికి మూలకాలు:

ప్రజల అభివృత్తులు, విశ్వాసాలు, విలువలు ప్రవర్తనలే రాజకీయ సంస్కృతికి ప్రాతిపదికలని మనం తెలుసుకున్నాం. ఇవి అన్ని చారిత్రక భౌగోళిక, సామాజిక ఆర్థిక మూలకాలమీద ఆధారతమై ఉంటాయి.

BRAOU

చారిత్రకః- దేశ ప్రజల అభివృత్తుల అభివృద్ధిపైన చారిత్రక వాస్తవాల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఎలాంటి ఒడుదుడుకులు లేకుండా పాత విలువల కొత్త అభివృత్తులలో సమ్మిశ్రితము కావటానికి అవకాశాలు ఉండటంవల్లనే బ్రిటన్‌లోని రాజకీయ నిరంతరతరకు ప్రధాన కారణమని చెప్పవచ్చు. బ్రిటన్‌లో ఇప్పటివరకు వచ్చిన మార్పులు పరిణామాత్మక రూపంలోనే సంభవించాయి. ఫ్రాన్సు విప్లవాలను రుచిచూసింది. ఈ విషయమే ఫ్రెంచివారి తీవ్రవాద స్వభావానికి, బ్రిటిష్‌వారి సాంప్రదాయ వాదానికి ప్రధానకారణమని చెప్పవచ్చు. సుదీర్ఘ కాలం భారతదేశం బ్రిటిష్ వలస పాలనా ప్రాంతంగా మనుగడ సాగించినందున పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలను, రాజ్యాంగ పద్ధతులను అవలంబించ గల్గింది. అలాగే వియత్నాం అల్జీరియా ప్రజలు తమ వలస పాలకులనుండి విప్లవపోరాటాల పాఠాలను అభ్యసించారు.

భౌగోళికః- భౌగోళిక విషయం రాజకీయ సంస్కృతి పునాదులకు ప్రధానమైన మూలకమని వివరించవచ్చు. ద్వీపాలుగా ఉండటంవల్లనే బ్రిటన్ విదేశీదాడులను చక్కగా తప్పించుకోగల్గింది. అందువల్లనే వారు సామరస్య సంస్కృతిని అలవరచుకొన్నారు. భారతదేశంపై చాలామంది విదేశీయులు దండయాత్రలు చేశారు. దండయాత్రలు ముగిశాక విదేశీయులు భారతదేశంలోనే స్థిరపడి పోయారు. ఫలితంగా మనం భాషా, ప్రాంతీయ, తెగ విభేదాలెన్ని వున్నప్పటికీ లౌకికసంక్షేమ రాజ్యవిలువలను సంతరించుకో గల్గాము.

సామాజిక ఆర్థికః- దేశంలోని రాజకీయ సంస్కృతిపై సామాజిక ఆర్థిక పరిస్థితుల ప్రభావాలు గూడా ఉంటాయి. ప్రధానంగా నగరీకరణం, పారిశ్రామికీ కరణం చెందిన సమాజం సంక్లిష్టమైనదిగా ఉంటుంది. విద్యా ప్రమాణాలు ఉన్నతంగా ఉండి ఉన్నత వర్గాలు నిర్ణయకల్పనలో భాగస్వాములుగా ఉంటారు. గ్రామీణ సమాజాలు మార్పులకు సంసిద్ధంగా ఉండవు. అందువల్ల రైతాంగం ప్రధానంగా గల గ్రామీణ సమాజాలు

చాలా వరకు సాంప్రదాయ సంస్కృతినే కలిగిఉంటాయి. సాంకేతిక సేవారంగాలలో నవ్యతలు వృద్ధి చెందటం వల్ల వ్యవసాయం పరిశ్రమలపై ప్రభావం కలుగచేస్తుంది. పర్యావసానంగా రవాణా ప్రసార సాధనాలలో కూడా ప్రభావం వీటిపై ఉంటుంది. వీటన్నింటి ఫలితంగా రాజకీయ విలువలు విశ్వాసాలు గూడా మార్పులకు గురౌతుంటాయి.

రాజకీయ వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకాలు దానిపై ప్రజల అభిప్రాయలు విలువలే రాజకీయ సంస్కృతిని సూచిస్తాయి. ప్రజలదృష్టిలో ప్రభుత్వానికి ఉన్న శాసన బద్దత ప్రభుత్వపు స్థిరత్వానికి సామర్థ్యతకు దోహదం చేస్తాయి. ఈ సందర్భంగా రాజకీయ స్థిరత్వం, ప్రథమగణ్యాల దృష్ట్యా రాజకీయ సంస్కృతికి ప్రాధాన్యత ఏర్పడింది. రాజకీయ సంస్కృతి రాజకీయ వ్యవస్థను ప్రభావితం చేస్తున్నదా లేక రాజకీయ వ్యవస్థ రాజకీయ సంస్కృతికి రూపం కల్పిస్తున్నదా అన్నది ఇంకా చర్చనీయాంశంగానే మిగిలిపోయింది.

--ఆచార్య: ఎం. రాంచందర్

## 6.12 చదువదగిన పుస్తకాలు

| | | |
|---|---|---|
| Almond Gabriel & Sydney Verba | : | The Civic Culture |
| R.T.Jangam | : | Political Sociology |
| Huntington, Samuel .P | : | Political Order in Changing Societies |
| Lipset S.M | : | Political Man |

BRAOU

## 6.13 నమూనా పరీక్షా ప్రశ్నలు

ఈ కింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. రాజకీయ సంస్కృతి అనగానేమి దాని లక్షణాలను పేర్కొనుము?
2. రాజకీయ సంస్కృతిని అధ్యయనం చేసిన ఆల్మండ్, వెర్బాల భావాలను చర్చించండి?
3. మార్క్సిస్టు దృక్పథంలో రాజకీయ సంస్కృతిని గురించి వివరింపుము?
4. ఉప రాజకీయ సంస్కృతి అనగా ఏమి?
5. రాజకీయ సంస్కృతి మూలకాలను చర్చింపుము?

# భాగం - 7 రాజకీయ ప్రసరణం

## విషయక్రమం

7.1 లక్ష్యాలు

7.2 పరిచయం

7.3 స్వభావం - అర్థ వివరణ

7.4 ప్రసరణ రూపాలు

7.5 ప్రసరణ రూపాల స్వయం ప్రతిపత్తి

7.6 రాజకీయ ప్రసరణ : శాసన నిర్మాణం

7.7 రాజకీయ ప్రసరణ : డేవిడ్ ఈస్టన్ వ్యవస్థా సిద్ధాంతం

7.8 రాజకీయ వ్యవస్థ తులనాత్మక అధ్యయనం : రాజకీయ ప్రసరణం

7.9 కార్ల్ డైష్ : రాజకీయ ప్రసరణ పద్ధతి

7.10 చదువదగిన పుస్తకాలు

7.11 నమూనా పరీక్షా ప్రశ్నలు

BRAOU

## 7.1 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదివాక మీరు

- రాజకీయ ప్రసరణం అర్థం, స్వభావం
- తులనాత్మక రాజకీయ అధ్యయనంలో ప్రసరణం

బాగా వివరించ గలుగుతారు.

## 7.2 పరిచయం

శాస్త్రీయ విశ్లేషణా రంగంలో రాజకీయ ప్రసరణా పద్ధతి ఈ మధ్యకాలంలో ఆవిర్భవించి అతివేగంగా అభివృద్ధి చెందుతున్నది. ఈ పద్ధతి ప్రసరణా వ్యవస్థ శాస్త్రమైన Cybernetics ప్రాతిపదికలపై ఆధారపడింది. రెండవ ప్రపంచ యుద్ధానంతరం సాంకేతిక, ఇంజనీరింగ్ రంగాల్లో సంభవించిన తీవ్రమార్పుల ప్రభావానికి సాంఘిక శాస్త్రాలు లోనయ్యాయి. తత్ఫలితంగా రాజనీతి శాస్త్రంలోని సాంప్రదాయకతను నవీన భావాలతో మేళవించి సాంఘిక శాస్త్రాలనుండి, ప్రాకృతిక శాస్త్రాల నుండి రాజనీతి శాస్త్రానికవసరమైన విజ్ఞానాన్ని, దృక్పథాన్ని గైకొనే విధానం అవతరించింది. ప్రసరణం ఆధారంగా రాజనీతి శాస్త్రాన్ని, రాజకీయ అంశాలను విశ్లేషించడానికి కార్ల్. డబ్ల్యూ, డైష్ లాంటి వారు రాజనీతి శాస్త్రంలో రాజకీయ ప్రసరణమునే నూతన పద్ధతిని రూపొందించారు. రాజకీయ వ్యవస్థలను, రాజ్యాన్ని విశ్లేషించడానికి 'రాజకీయ ప్రసరణం' ఉపయోగ పడుతుంది.

## 7.3 ప్రభావం - అర్థవివరణ

జాతి రాజ్యాల పరస్పర చర్యలతో బాటుగా మానవ ప్రవర్తనను అధ్యయనం కావించే అనేక సమకాలీన పద్ధతులకు ఆధారభూతమైన మౌలిక భావనల స్వరూపమే 'ప్రసరణం'. ఈ మాట దాని ఉపయోగాన్ని బట్టి విస్తృత పరిధిలోగాని, సంకుచిత పరిధిలోగాని అన్వయింప వచ్చును. వీవర్ లాంటి గణిత శాస్త్రవేత్త ఉపయోగించిన దాని ప్రకారం 'ప్రసరణమనగా' ఒక మేధస్సు మరొక మేధస్సును ప్రభావిత మొనరించే అన్ని పద్ధతులు. విస్తృత భావంలో ప్రసరణమనగా కేవలం మౌలిక భాషణలే కాకుండా సమస్త మానవ ప్రవర్తనగా ప్రసరణా విషయాలకు చెందిన అనేక భౌతికాంశాల కలయిక అయిన Cybernetics ప్రభావం 'రాజకీయ ప్రసరణం' పై ఉంది. అందువలన దానితో కలిపి రాజకీయ ప్రసరణాన్ని "Political Cybernetics" గా కూడా వ్యవహరిస్తున్నారు. ఈ పద్ధతి ప్రకారం రాజకీయాలు ప్రభుత్వం రెండూ కొన్ని లక్ష్యాలను సాధించటానికి వ్యక్తులు కావించే ప్రయత్నాలకు సారథ్యం వహించే సాధనాలుగా చెప్పవచ్చు.

భావాలను ఒక వ్యక్తి నుండి లేదా సమూహం నుండి మరొక వ్యక్తికి లేదా సమూహానికి చేరవేసే ప్రక్రియను ప్రసారణ ప్రక్రియగా పేర్కొనవచ్చు. సమాజానికి, ప్రసారణ ప్రక్రియకు మధ్య అంగాంగి (Organic) సంబంధం ఉంది. ప్రసారణ ప్రక్రియ లేని సమాజాలను ఊహించలేం. సమాజంలో వ్యక్తులమధ్య నిరంతరం సంబంధాలు కొనసాగుతునే ఉంటాయి. సామాజికీకరణ ప్రసరణ ప్రక్రియద్వారా జరుగుతుంది. ప్రసరణలు లేనప్పుడు సామాజికీకరణ సాధ్యపడదు. ప్రసరణల ద్వారా మాత్రమే సామాజిక అవగాహన ఏర్పడుతుంది. వ్యక్తి ఆలోచనలు గ్రాహ్య ప్రక్రియ (Learning process) ద్వారా వృద్ధి చెందుతాయి. ఈ వృద్ధినే ప్రసరణ వృద్ధిగా కూడా చెప్పవచ్చు. వ్యక్తుల మధ్య గల సంబంధ బాంధవ్యాలే ప్రసారణాల మూలం. సమాచార ప్రసారణలే అభివృద్ధి దిశను, క్రమాన్ని నిర్ధారిస్తాయి. సమాచారాలను అందుకొనే, చేరవేసే సామర్థ్యమే వ్యక్తికి గల సామర్థ్యానికి నిదర్శనం. ప్రసారణ ప్రక్రియ అధ్యయనాన్ని సామాజిక జీవన అధ్యయనంగా భావించవచ్చు. సాధారణ అర్థంలో చెప్పాలంటే సమాచారం గాని భావనలు గాని, అభిప్రాయాలుగాని, ఒకరినుండి మరొకరికి చేరవేయుటమే ప్రసారణ ప్రక్రియ. ఈ సమాచార మార్పిడి ఒకరినుండి ఎక్కువ వ్యక్తులకు; ఒకరి నుండి మరొకరికి, చాల మంది నుండి ఒకరికి లేక ఎక్కువ మందికి జరుగుతుంది.

ప్రసారణ ద్వారా ఒకరు మరొకరి ప్రవర్తనను, ఆలోచనను, ఆలోచనా సరళిని నియంత్రించవచ్చు. వ్యక్తులను సంఘటితం చేయవచ్చు కూడా. వ్యక్తుల మధ్య గల భేద భావాలను అంత మొందించవచ్చు. ఇతరులపై సమాచార ప్రసారణాల ప్రభావం, ప్రసారణల ప్రక్రియను, సామాజిక దృక్పథంతో అర్థం చేసుకోవడానికి సహాయపడుతుంది. అందువల్లనే కేవలం సమాచార ప్రసారణమే ముఖ్యంకాదు. అది సాధించే స్పందన, ప్రభావం చాల ముఖ్యం. ఆశించిన ప్రభావం ఇతరులలో కనిపించినప్పుడు ప్రసారణం ఫలవంతమైనదన వచ్చును. అందుకే సమాచారమంటే ఇతరులతో పంచుకొనే భావపరంపరగా చెబుతారు. ప్రసారణ ప్రక్రియను మానవతా భావంతో చూచినప్పుడు అది భావస్పందనకు దగ్గరైనట్లుగా కన్పిస్తుంది. సామాజికాభివృద్ధికి సమాచార ప్రక్రియ బాగా ఉపయోగ పడుతుంది.

ఉత్పాదిత విధులలో (Input Functions) ప్రసారణ ప్రక్రియకు చాలా ప్రాధాన్యత ఉంది. రాజకీయ విలువలను రూపొందించటంలోను వాటిని సంవర్ధకం చేయటంలోను ప్రసారణ ప్రక్రియ కృషి చేస్తుంది. వ్యక్తులకు వ్యవస్థ పై నిశ్చయాత్మకమైన అవగాహన రూపొందటానికి బలపడటానికి ప్రసారణ ప్రక్రియ బాగా పనిచేస్తుంది. అన్ని రకాలైన రాజకీయ విధుల నిర్వహణలో ప్రసారణలు చాలా సహాయకారిగా ఉంటాయి. వ్యవస్థపై వెలువడే నిరసనలను, అసమ్మతిని, కోరికలను, డిమాండ్లను రాజకీయ ప్రసరణం

BRAOU

క్రమబద్ధీకరించటమే గాక; సరియైన సమాచార ప్రసారణకు దోహదం చేస్తూ; వ్యవస్థలు చేసే నిర్ణయాలకు అవశ్యకమైన సమాచారాన్ని అందచేస్తుంది. అన్ని సామాజిక, రాజకీయ నిర్మితులు ప్రసారణ నిర్వహణలో భాగస్వామ్యం పొందుతాయి. వ్యవస్థ ఉమ్మడి విలువలను దృక్పథాలను సంతరించుకోవటంలో రాజకీయ ప్రసారణం దోహదం చేస్తుంది. రాజకీయ విధుల నిర్వహణలో మార్పుచేర్పులు రాజకీయ ప్రసారణంపై ఆధారపడి ఉంటాయి. రాజకీయ మార్పులను రాజకీయ ప్రసారణలద్వారా అధ్యయనం చేయవచ్చును. ప్రసారణాల నిర్వహణ, నిర్మితులు, రాజకీయ ప్రకటనల స్వభావాల పరిమితి, విషయ భోగట్టాల మధ్య సంబంధాలుంటాయి. పటిష్టమైన ప్రసారణ నిర్మితులు గల దేశాలలో రాజకీయ నాయకులు తమ భావాలను విస్తృతంగా ప్రచారం చేసుకోగలుగుతున్నారు. అవిలేని దేశాలలో నాయకులు సాంప్రదాయ ప్రసారణ పద్ధతులపై ఆధారపడుతున్నారు.

రాజకీయ ప్రసారణ ప్రక్రియలో రెండు అంశాలు నిబిడీకృతమై ఉన్నాయి. రాజకీయ వ్యవస్థలో ఒక భాగంనుండి మరొక భాగానికి సమాచారం చేరవేత మొదటిది. సామాజిక, రాజకీయ వ్యవస్థల మధ్య సమాచారం చేరవేయడం రెండవది. రాజకీయ వ్యవస్థలో ప్రసారణ ప్రక్రియ క్రియాశీలకమైన మూలకం. ఈ ప్రక్రియపైననే సామాజికీకరణ, భాగస్వామ్యం, భర్తీలు ఆధారపడిఉన్నాయి. ఈ మూడింటికి జ్ఞానం, విలువలు, అభివృత్తులు ప్రసారణం పట్టుకొమ్మలు. అవివ్యక్తి రాజకీయాలను, వాటిగతిని నిర్దేశిస్తాయి.

ప్రసారణ వ్యవస్థలో సమాచారమూలం, సమాచార మాధ్యమం, స్పందిత సమాచారాలనే మూడు మూలకాలుంటాయి. ఉదాహరణకు రాజకీయ ప్రసారణ వ్యవస్థలో ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థి సమాచార మూలం; అతని సందేశం విధాన ప్రకటనలు అతనిమాధ్యమం, వార్తాపత్రికలు టి.వి. రేడియో ఇంటర్వ్యూలు, సమావేశాలు మొదలగునవి. ఈ మాధ్యమాల ద్వారా సమాచారం అందుకునే వారు అభ్యర్థి విధానాలను బలపరచటం లేదా వ్యతిరేకించటం స్పందిత సమాచారం అవుతుంది. సమాచార వ్యవస్థ మూలకాలన్ని రాజకీయ వ్యవస్థ నిర్మితులలో భాగం కావలసిన అవసరంలేదు. అవి వ్యవస్థలో నిరంతరం పనిచేయాల్సిన అవసరం కూడా లేదు. పరిస్థితులను బట్టి అవి మారుతుంటాయి. సమాచార మూలం, సమాచారం అనే ప్రసారణ ప్రక్రియలో భేదాలు ఉన్నప్పటికి చాలా రాజకీయ వ్యవస్థలలో ప్రసారణ మాధ్యమాలు ఒకే రకంగా ఉంటున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలలో వార్తాపత్రికలు, రేడియో, టెలివిజన్‌లకు ప్రాధాన్యం ఉంది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో వీటి ఉపయోగం చాలా తక్కువగా ఉంది. అక్కడ సాంప్రదాయక మాధ్యమాలే ఎక్కువ ఉపయోగంలో ఉన్నాయి.

ప్రసార మాధ్యమాలలో టెలివిజన్, రేడియోలతో పోల్చినప్పుడు (Print Media) లో రాజకీయ వార్తలు అధికంగా ఉంటున్నాయి. వార్తా పత్రికలు వాటి చదువరుల అభిలాషలను బట్టి వార్తలందిస్తుంటాయి. ప్రసార మాధ్యమాల ద్వారా సమాచారం తెలుసుకొనే ప్రజలు కూడా ఒకే విధంగా మాధ్యమానికి స్పందించరు. కొన్ని సందర్భాలలోనే సమాచారం తెలుసుకొనే వ్యక్తులు ఆయా సందర్భాలలోనే స్పందిస్తారు. ప్రతిరాజకీయ వ్యవస్థ తన ప్రసారణ వ్యవస్థను తానే రూపొందించుకొంటుంది. వృద్ధి చేసుకొంటుంది. దానిని బట్టి సమాచార మూలం; మాధ్యమం, సమాచారం అందుకొనే ప్రజల ప్రాధాన్యత పాత్ర మార్పు చేర్పులకు గురౌతుంటుంది. అభివృద్ధి చెందని సాంప్రదాయక వ్యవస్థలు మినహా, మిగిలి రాజకీయ వ్యవస్థలలో (Print Media) రేడియో, టెలివిజన్ ప్రసారమాధ్యమాలకు ఎక్కువ ప్రాధాన్యత ఉంది. వీటి ద్వారానే సమాచారం ఒకచోటు నుండి ఇంకొకచోటకు చేరుతుంటుంది. అయినప్పటికీ మిగతా మాధ్యమాల ప్రాధాన్యతను తక్కువగా అంచనావేయ వీలులేదు. రాజకీయ పార్టీలు, ప్రభావ వర్గాలు ప్రసారణ మాధ్యమాలు గణనీయమైన సేవలనందిస్తున్నాయి. ప్రజా మాధ్యమంతో పోల్చినప్పుడు రాజకీయ పార్టీలు, ప్రభావవర్గాల పాత్ర నిర్దిష్టమైనదిగా ఉంటున్నది.

BRAOU

ప్రసార మాధ్యమాలుగా ప్రజామాధ్యమం, లాంఛనప్రాయమైన వ్యవస్థలేగాక వ్యక్తుల మధ్య లేక వ్యక్తి, వ్యవస్థల మధ్య ముఖాముఖి లాంఛనేతర సంబంధాలు గూడా ప్రధానపాత్ర వహిస్తున్నాయి. అన్ని వ్యవస్థలలోను లాంఛనేతర సంబంధాలు కన్పిస్తునే ఉంటాయి. ఇవి సమాచారాన్ని చేరవేయటం కన్నా ప్రజాభిప్రాయాన్ని మలచటంలో ఎక్కువ పాత్రను నిర్వహిస్తుంటాయి.

రాజకీయ వ్యవస్థ అభివృద్ధి పరచే ప్రసార మాధ్యమాలు సమాజంలోని వివిధాంశాలపై ఆధారపడి ఉంటాయి. వీటిలో సమాజంలోని భౌతిక సాంకేతిక అంశాలతోపాటుగా సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ అంశాలు ప్రధానపాత్ర వహిస్తాయి. ప్రసార రంగంలో వచ్చిన సాంకేతిక వైజ్ఞానికాభివృద్ధి భౌతికమైన అడ్డంకుల అధిగమించటంలో తోడ్పడింది. భౌతికమైన అడ్డంకులను తొలగించుకోవటం, సాంకేతిక రంగంలో అభివృద్ధి అధికంగా సాధించిన దేశాలలో ప్రసారయంత్రాంగం పటిష్ఠంగా అభివృద్ధి చెంది నలుమూలల విస్తరించటానికి దోహదపడుతుంది. ఆర్థికాభివృద్ధి బాగా జరిగిన దేశాలలో ముఖాముఖి సంబంధాలకన్నా ప్రజామాధ్యమమే అత్యధిక ప్రాధాన్యతను పొందుతున్నది. సమాచారం ఎక్కువ మందికి లభ్యమౌతున్నది. కాని అభివృద్ధి చెందుతున్న దేశాలలో సమాచార ప్రసారణలకు ప్రజామాధ్యమంపై తక్కువగా ఆధారపడటమేగాక అది చిన్నాభిన్నమైనదిగా ఉంటూ పరిమితమైన లాంఛనేతర పద్ధతులనే వాడటం వల్ల సమాచారం సమాజంలోని కొన్ని ప్రత్యేక వర్గాలకే పరిమితమవుతున్నది. సంపూర్ణ నియంత్రణం ఆ వ్యవస్థల అభిమతం కాదు. ఆ వ్యవస్థల గుణం కూడా కాదు. అయినప్పటికీ రాజకీయకారణాల ప్రభావం తప్పక ఉంటుంది.

రాజకీయ ప్రసరణం ప్రధానంగా ఆధునిక రాజకీయ వ్యవస్థల అధ్యయనానికి, విశ్లేషణకు ఉద్దేశించినట్టిది. ప్రతి రాజకీయ వ్యవస్థకు గమనశీలత్వాన్ని ప్రసాదించేది ప్రసరణయే. అందువల్ల వ్యవస్థను స్థూలంగా అధ్యయనం గావించే విధానంలోనే రాజకీయ ప్రసరణాన్ని కూడా అధ్యయనం గావించవలె. సాధారణంగా వార్తలను, సమాచారాన్ని వ్యాపింపజేయడానికి ఉపయోగపడే ప్రసరణంలో కాకుండా రాజకీయ ప్రసరణాన్ని విడిగా పరిశీలించాలి. అయితే ఈ అధ్యయనంలో వివిధ రకలైన ప్రసరణా సాధనాలను లేదా నిర్మాణాలను కూడా తెలుసుకొనవలసి ఉంటుంది.

BRAOU

## 7.4 ప్రసరణ రూపాలు

ఆల్మండ్ ప్రకారం మానవుల అన్నిరకాల పరస్పర చర్యలు ప్రసరణంలోని అంతర్భాగాలే. అయితే ఈ చర్యల్ని నిర్వహించే వివిధరకాల ప్రసరణా రూపాలు లేక నిర్మాణాలు రాజకీయ వ్యవస్థలను తులనాత్మకంగా పరిశీలించడానికి, విశ్లేషించడానికి ఉపయోగపడతాయి. ఆల్మండ్ దృష్టిలో అయిదు రకాలైన ప్రసరణా నిర్మాణాలు కలవు. అవి,

1. లాంఛనేతరమైన ముఖాముఖి సంబంధాలు,
2. సాంప్రదాయిక సాంఘిక నిర్మాణాలైన కుటుంబం,
3. శాసనసభ, ఉద్యోగి స్వామ్యం లాంటి బహిర్గత రాజకీయ నిర్మాణాలు,
4. రాజకీయ పార్టీలు, ప్రయోజన వర్గాలలాంటి ఉత్పాదక నిర్మాణాలు,
5. ప్రచార సాధనాలు.

1. ఏ రాజకీయ వ్యవస్థలోనైన వ్యక్తుల మధ్య లాంఛనేతరంగా ఉండే ప్రత్యక్ష లేదా ముఖాముఖి సంబంధాలను ఎంత మాత్రం తక్కువగా అంచనా వేయడానికి వీల్లేదు. ప్రచార సాధనాలను, ప్రజాభిప్రాయాన్ని, అధ్యయనం గావించిన కాట్జ్ మరియు లాజర్స్ పెల్డెల దృష్టిలో లాంఛనమైన ప్రచార సాధనాలు అనేకమంది వ్యక్తులపై

ప్రత్యక్ష ప్రభావాన్ని కలుగుజేయడంలేదు. ప్రతి రాజకీయ వ్యవస్థలో కూడా కొంతమంది వ్యక్తులు ఆ వ్యవస్థలో జరిగే రాజకీయ సంఘటనల పట్ల, ఉత్సాహం చూపుతూ ఏదో ఒక కారణంగా వాటిని పరిశీలిస్తుంటారు. అలాంటి వారిలో కొందరు తాము పరిశీలించిన రాజకీయ విషయాలను, తాము పొందిన సమాచారాన్ని తమ తమ మిత్రులకు, ఇరుగు పొరుగులకు, సహోద్యోగులకు అందజేస్తూ ఉంటారు. ప్రతి వ్యవస్థలో కూడా వీరు అభిప్రాయ నాయకులుగా చెలామణి అవుతున్నారు. వీరి కారణంగా ప్రత్యక్షంగా ఇతరుల విశ్వాసానికి, విజ్ఞానానికి ఒక రూపు ఏర్పడే అవకాశాలు ఉంటాయి.

లాంచనేతర వ్యక్తిగత సంబంధాల ద్వారా ఒక సమాజంలోని ప్రవాసంపై కూడా తీవ్రమైన ప్రభావం ఏర్పడుతుంది. ఒక వ్యక్తి గ్రామమునుండి నగరానికి ప్రవాసం వెళ్ళినపుడు అతనికి పూర్తిగా నూతన వ్యక్తులతో ముఖాముఖి సంబంధాలేర్పడుతాయి. నూతన ప్రసరణాలకు అతను దగ్గరవుతాడు. వివిధ విషయాలను సమాచారాన్ని నూతనంగా వివరించే వారి మధ్యకు వెళతాడు. వార్తాపత్రికలు, రాజకీయ పార్టీలలాంటి నూతన సమాచార మార్గాలకు చేరువుతాడు. ఈ రకాల పరిస్థితులలో ఆ వ్యక్తి గతంలో కలిగియున్న నమ్మకాలపై, అవగాహనపై, భావాలపై, నూతనంగా అతను పొందిన ప్రభావం తీవ్రంగా ప్రసరిస్తుంది. ఫలితంగా అతని రాజకీయా జీవితంలో, తదనుగుణ జీవితంలో, మార్పులు సంభవిస్తాయి.

2. ఆధునిక రాజకీయ వ్యవస్థలందు సాంప్రదాయిక సామాజిక నిర్మాణాలు లేదా సంస్థలు నిర్వహించిన ప్రసరణాల పాత్రను సులభంగా విశ్లేషించ వీలవుతుంది. కాని సాంప్రదాయిక మరియు అభివృద్ధి చెందుతున్న సమాజాలందు ప్రసరణం అత్యంత ముఖ్యమైన పాత్ర నిర్వహిస్తుంది. తెగల నాయకులు, పెద్దల సంఘాలు, కుటుంబాల మరియు మతాల నాయకులు సమాచారాన్ని రాబట్టు వారిగా, దానిని వివరించువారుగా అత్యంత శక్తివంతమైన పాత్రను నిర్వహిస్తారు. సాంప్రదాయిక కమ్యూనిటి నాయకులు జాతీయస్థాయి శ్రేష్టులకు మరియు ప్రజలకు మధ్య నిలిచి జాతీయ సమైక్యతామార్గాన్ని సుగమనంగాగాని దుర్గమంగాగాని చేసేశక్తిని కలిగి ఉంటారు.

BRAOU

3. రాజకీయ వ్యవస్థలందు శాసనసభ, ఉద్యోగి స్వామ్యం వంటి సంస్థలు ప్రధానమైన సమాచార మార్గాలను కలిగి ఉంటాయి. రాజకీయ పదవుల నలంకరించిన నాయకులు తాము సమర్థవంతంగా, స్పష్టంగా విధి నిర్వహణ గావించేటందుకై అవసరమైన ఆదేశాలను ప్రసరణం గావించేటందుకు ఈ సంస్థలు, ప్రధానంగా ఉద్యోగి స్వామ్యం ఉపకరిస్తుంది. వివిధ నాయకులకు మామూలు ప్రజానీకానికి మధ్య సంబంధా లేర్పరిచే వివిధ రకాలైన ప్రసరణాలు ఈ సంస్థల ద్వారానే జరుగుతాయి.

4. ప్రయోజనవర్గాలు, రాజకీయ పార్టీలలాంటి ఉత్పాదక నిర్మాణాలు మరొక రకమైన సమాచార మార్గాలుగా పనిచేస్తున్నాయి. వాటి నిర్మాణంలోనే ప్రత్యేక స్వభావం ఉన్న కారణంగా అవి వ్యవస్థలోని రాజకీయ నాయకత్వానికి తమ ప్రయోజన కోరికలను తెలియజేస్తూ ఉంటారు. వాటి ప్రభావం విధాన నిర్ణయాలపై ఉంటుంది. ఇలాంటి సంస్థలు ప్రభుత్వ నియంత్రణ లేకుండా ఏ వ్యవస్థలోనైతే పని చేస్తాయో ఆ వ్యవస్థయందు రాజకీయ శ్రేష్ఠులకు సగటు పౌరులకు మధ్య సత్సంబంధాలుండే అవకాశాలు అనేకం ఉంటాయి. తద్వారా నూతన సంస్థలు ఆవిర్భవించే అవకాశాలు పెరగడంతో బాటుగా పౌరులు తమ కోరికలను బహిర్గతంచేసే అవకాశం ఉంటుంది. ఇలా ప్రజా కోరికలకు సారధ్యం వహించేవిగా మాత్రంకాక ఈ ప్రయోజనవర్గాలు మరియు రాజకీయ పార్టీలు శ్రేష్టుల కార్యకలాపాలను వ్యాపింపజేసే సమాచార సాధనాలుగా ఉపయోగపడతాయి. వీటితోబాటు లాబీ వర్గాలుగా రాజకీయ కార్యకలాపాలకై తమ ప్రభావాన్ని కలుగజేస్తాయి. తమ వర్గ సభ్యుల కోరికలను వ్యక్తం చేస్తాయి. ఈ వర్గాలు తమ ప్రయోజనాలకు భంగకరంగా ఉండే కార్యకలాపాలను జాగరూకతతో

పరిశీలిస్తూ ఉంటాయి. అదే విధంగా ప్రతిపక్షంలో ఉన్న రాజకీయ పక్షాలు అధికారంలో నున్న రాజకీయ పక్షపు పాలనపై నిఘా వహిస్తాయి. ఆధునిక ప్రజాస్వామిక రాజ్యాలందు ఓటర్లలో చైతన్యం కలిగించడానికి, వివిధ రాజకీయ పక్షాలు ప్రజలు స్థాయిలో అభివృద్ధి చెందడానికి ఈ రకమైన సంఘటిత ప్రసరణా సంస్థలే దోహదం చేస్తున్నాయి.

5. వార్తపత్రికలు, రేడియోలు, దూరదర్శన్ లాంటి ప్రచార సాధనాలు చివరి తరగతి ప్రసరణా రూపాలుగా చెప్పవచ్చును. ఇవి అశేష ప్రజానీకానికి అతి తక్కువ ఖర్చుతో సమాచారాన్ని ప్రసరణం గావిస్తాయి. వీటన్నింటిలో వార్తాపత్రికలు ప్రజలలోకి అతి చేరువగా వచ్చి సమాచారాన్ని ప్రజలలోకి ప్రసరణం కావిస్తాయి. రేడియో కూడా ఇందుకు ఉపయోగపడినప్పటికి దీని ద్వారా ప్రసారం కావింపబడిన సమాచారాన్ని ఇతరులకు ప్రసరణం గావించేటప్పుడు వాటిని ప్రసరణం గావించే వ్యక్తి తనకు తోచినట్లుగా వక్రీకరించే అవకాశముంటుంది.

## 7.5 ప్రసరణా రూపాల స్వయం ప్రతిపత్తి

రాజకీయ నాయకులచే, ప్రయోజన వర్గాలచే జోక్యానికి లోను కాకుండా ఉండేటట్లయితే ప్రసరణా నిర్మాణాలు స్వయం ప్రతిపత్తిని అనుభవిస్తాయి. అయితే భారతదేశం అమెరికా లాంటి దేశాల్లో ప్రసరణాల నిర్మాణాల స్వయం ప్రతిపత్తిలో తేడా ఉంది. అలాగే నియంతృత్వ రాజ్యాలకు, ప్రజాస్వామిక రాజ్యాలకు మధ్య ఈ స్వయం ప్రతిపత్తి విషయంలో తీవ్రమైన వైవిధ్యం ఉంటుంది. సోషలిస్టు దేశాల్లో ఆ దేశాలు సాధించవలసిన అభివృద్ధి దృష్ట్యా పార్టీ మరియు రాజకీయ నాయకత్వం అనుమతించిన మేరకు మాత్రమే ప్రజల కోరికలు పైకి వెళ్లగలుగుతాయి. నియంతృత్వ ధోరణులగల రాజ్యాల్లో నియంత ఇష్టా రాజ్యం కారణంగా ప్రసరణా వ్యవస్థ అతనికి అనుకూలంగా ఉంటుంది. ప్రజాస్వామిక రాజ్యవ్యవస్థ వాస్తవంగా ప్రజాస్వామ్యాన్ని ఆచరించినట్లయితే, ఈ ప్రసరణా నిర్మాణాలు స్వయం ప్రతిపత్తిని అనుభవించే అవకాశాలుంటాయి. అట్లు కాని ఎడల అవి ఏవో శక్తుల ఆధిపత్యానికి లోబడుతాయి. ఉదాహరణకు భారతదేశంలో కులం, మతాలు, స్పెయిన్‌లో క్యాథలిక్ చర్చి, లాటిన్ అమెరికా దేశాల్లో భూకామందులు అమెరికాలో యూదులు కొన్ని ప్రసరణా నిర్మాణాలపై ఆధిపత్యం చెలాయించడం జరుగుచున్నది. ప్రసరణా వ్యవస్థలపై ఏదో ఒక రకమైన ప్రభావం, ఏదో ఒక రూపంలో జోక్యం కలుగడం ప్రపంచంలోని ప్రతి వ్యవస్థలో సర్వ సామాన్యమైన విషయంగా పరిణమించింది.

## 7.6 రాజకీయ ప్రసరణం : శాసన నిర్మాణం

ప్రతి వ్యవస్థ యందు కూడా ఆ వ్యవస్థలోని శాసన నిర్మాణంపై, సామాజికీకరణపై, వివిద రకాలైన ప్రసరణాలు తీవ్రమైన ప్రభావాన్ని కలుగజేస్తాయి. శాసనాలు తయారు జేయువారికి తమ విధిని సమర్ధవంతంగా నిర్వహించడానికి, సరియైన విధానాలు రూపొందడానికి వాటికి సంబంధించిన ఖచ్చితమైన సమాచారం అవసరం. శాసనకర్తలు, విధాన నిర్ణాయకులు తమ విధులను నిర్వర్తించడానికి స్థానిక భౌతిక పరిస్థితులు, ప్రజల వైఖరులు, వివిధ చర్యలు గైకొనడానికనసరమయి లభ్యమయ్యే సామాగ్రి మొదలగు విషయాల పరిజ్ఞానం కలిగి యుండవలెను. అట్లుకాని ఎడల తాము తీసుకొన్న నిర్ణయాలు విషాదకర ఫలితాలకు దారి తీయవచ్చును. చరిత్రలో అలాంటి నిర్ణయాలు కోకొల్లలుగా ఉన్నాయి.

ఆల్మండ్ ప్రకారం కేంద్రీకృత, సంక్లిష్ట రాజకీయ వ్యవస్థలందు రాజకీయ శ్రేష్టుల కార్యకలాపాలు క్రింది స్థాయినుండి ఉద్యోగులు పంపే సమాచారం ద్వారా అనేక అటంకాలకు లోనవుతున్నాయి. ఆయన దృష్టిలో అతివేగంగా మారే పరిస్థితుల మధ్య అనేకానేక విధులను నిర్వహించే కేంద్ర ప్రభుత్వాలున్న

రాజకీయ వ్యవస్థలు అన్నియు ఈ రకమైన సమస్యల నెదుర్కొంటాయి. అయిన కేంద్రీకృత అధికారాలు కలిగిన వ్యాపారవర్గాలు కూడా ఈ రకమైన సమస్యల నెదుర్కొంటున్నట్లు పేర్కొన్నాడు. వికేంద్రీకృతించిన వ్యవస్థలందు ఇలాంటి సమస్యలుండవని ఇతని అభిప్రాయం. ఎందుకంటే వికేంద్రీకరించబడిన వ్యవస్థల్లో కేంద్రీకృత వ్యవస్థలవలె సమాచారం యావత్తు కాకుండా కేంద్ర నిర్ణయాలు తప్పనిసరిగా అవసరమైన ముఖ్యమైన విషయాలకు సంబంధించిన సమాచారం మాత్రమే క్రింది స్థాయినుండి క్రమానుగతశ్రేణిలో పైకి పంపించడం జరుగుతుంది.

కేంద్రీకృత రాజకీయ వ్యవస్థలందు కేంద్ర నిర్ణయ కర్తయే వ్యవస్థకందే సమస్త సమాచారాన్ని పరిశీలించి తదనుగుణంగా నిర్ణయాలు గైకొనవలసియుంటుంది. వ్యవస్థ విస్తృతమూ, సంక్లిష్టమూ అయినప్పుడు నిర్ణయాలు తీసుకొనే వ్యక్తి పరిమితమైన సమాచారాన్ని మాత్రమే వినడానికైనా, పరిశీలించడానకైనా యోగ్యుడుగా ఉంటాడు. ఆ కారణంగా ముఖ్యమైన సమాచారమెంతో ముఖ్య నాయకుల పరిశీలనకు లోను కాకుండానే పక్కకు పోతున్నది. అంతేకాకుండా కేంద్రీకృత వ్యవస్థలలో సమాచార ప్రసరణం అంచెలంచెలు గావించవలసి ఉంటుంది. ఆ కారణంగా సమాచారమందు తప్పులు, వక్రీకరణలు ఎక్కువయ్యే అవకాశాలుంటాయి. క్రింది స్థాయిలోని ఉద్యోగులు తాము పైకి సమాచారంను ప్రసరణం గావించేటప్పుడు స్వీయ ఆసక్తులను ప్రదర్శించడం, వీటితోబాటు మానవ సహజమైన తప్పులు దొర్లడం జరుగుతూ ఉంటుంది. అయితే ఈ రెండు రకాలైన లక్షణాలు వికేంద్రీకరించబడిన వ్యవస్థలలోని ప్రసరణంలో కూడా విశేషంగా సంభవించే అవకాశాలు బాగా ఉన్నాయి. ప్రసరణామార్గం ఏలాంటి దైనప్పటికి ఒక నిర్దిష్ట సమయంలో పరిమిత సమాచారమును మాత్రమే స్వీకరించి ప్రసరణ గావించే శక్తి కలిగిఉంటుంది. ఆ కారణంగా వ్యవస్థ నాయకత్వానికి విస్తృత సమాచారం ప్రసరణ గావించవలసి ఉన్నప్పటికి అనివార్యంగా కొంత సమాచారాన్ని తొలగించవలసి యుంటుంది. అట్లు కానిచో సమాచార ప్రసరణానికి గణనీయమైన సమయం పడుతుంది.

కేంద్రీకృత వ్యవస్థలలోని మరొక ముఖ్య సమస్య ఏమిటంటే వ్యవస్థ కవసరమైన సమాచారం రోజురోజుకీ సాంకేతిక సంక్లిష్టతకు లోనవుతుంది. వ్యవస్థ నాయకుడు అన్ని రకాల సమాచారాలను అవగతం చేసుకోవలసిన అవసరం ఉన్నప్పటికి అతను మిలిటరీ సాంకేతిక విషయాలు, వాణిజ్య వ్యవహారాలు, అన్ని రాజకీయ విషయాలు, ద్రవ్యోల్బణం, గ్రామాభివృద్ధి, పట్టణ రవాణా, వైద్య వ్యవహారాలు మొదలగు విషయాలలో అతను నిష్ణాతుడు కాకపోవచ్చు. పర్యావరణం నుండి సమాచారం క్రమరూపంలో కాకుండా ముడి సమాచారంలా లభిస్తుంది. ఈ ముడి సమాచారం అటు వ్యవస్థ నాయకుడు అవగతం చేసుకొనేటట్లు మార్చవలసి ఉండటమే కాకుండా దానిని మామూలు ప్రజానీకపు పరిభాషకు కూడా మార్చబడుతుంది. ఈ ప్రక్రియలో సమాచారం అనేక శాస్త్రీయ ప్రయోగాలకు, నిష్ణాతులకు లోనయే అవకాశం కలిగిఉంది. అందుకే ఆల్మండ్ సమాచారం విస్తృత స్థాయిలోనూ, సాంకేతిక స్వభావాన్ని కలిగిఉన్న కారణంగా విస్తృతమూ, సంక్లిష్టమూ అయిన వ్యవస్థలు అటు వికేంద్రీకరణవైపో అటు అసమర్థ హేతురహిత చర్యలవైపో మొగ్గు చూపుతాయని భావించాడు.

నియంతృత్వ వ్యవస్థయందు పార్టీ, పోలీసు, ఉద్యోగిస్వామ్యం మొదలగు సంస్థలు ప్రసరణా కార్యకలాపాల నిర్వహణాధికారులుగా పని చేయవలసి యుంటుంది. ఉద్యోగిస్వామ్యం వక్రీకరించే ప్రసరణం ఫలితంగా తీసుకొన్న విధాన నిర్ణయాలు, నిర్మించిన శాసనాలు, నూతన సమస్యలను సృష్టిస్తాయి. ఆల్మండ్ దృష్టిలో సోషలిస్టు దేశాలందు ఉద్యోగులు వారి అధికారులకు లోబడిఉండి వారి మన్ననలను పొందడానికి ప్రయత్నిస్తుంటారు. ఇందుకై వారు తమ పై అధికారులు, నాయకులు వినడానకి ఇష్టపడిన సమాచారాన్ని మాత్రమే అందజేయడం జరుగుతుంది. తద్వారా విధాన నిర్ణయాల్లో ఎన్నో తప్పులు దొర్లే అవకాశాలుం

టాయి. కాని వీటికి భిన్నంగా వున్న వ్యవస్థలందు స్వయం ప్రతిపత్తిగల ప్రసరణా మార్గాలుండడంవల్ల వ్యవస్థ నాయకులు తమను వక్రీకరించే సమాచారాన్ని సరిగానించుకొనుటకు, పత్రికలు చదవడం స్వయంగా కలువడం, స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుపడం ఇత్యాది చర్యలద్వారా ప్రజాభిప్రాయాన్ని నిష్పాక్షికంగా అర్థం చేసుకొనే అవకాశం ఉంటుంది. తద్వారా సరయైన శాసనాలు తయారు కావడం, అవసరమైన విధానాలు రూపొందించడం జరుగుతుంది. అయితే ఆల్మండ్ భావించినట్లుగా స్వయం ప్రతిపత్తిగల ప్రసరణా మార్గాలున్నట్లుగా చెప్పబడుతున్న దేశాలందు విధాన నిర్ణాయకులు వాస్తవంగా అట్టడుగు ప్రజానీకం, సగటు ప్రజానీకం అభిప్రాయాని కనుగుణంగా తమ విధానాలను రూపొందించడం లేదు. ఆ దేశాలందు రాజకీయ శ్రేష్టుల ప్రయోజనాల మేరకే ప్రసరణం నిరోధించబడుతున్నది. అయితే బారింగ్టన్ మూర్ దృష్టిలో సోషలిస్టు దేశాలందు వ్యవస్థ నాయకులు తాము సమాచారాన్ని పొందడానికి ఏదో ఒక ప్రసరణా మార్గంపై మాత్రమే ఆధారపడడంకాని, ఆ సమాచార ఆధారంగా విధానాలు రూపొందించడంగాని జరుగదు. సమాచార ప్రసరణం గావించే వేరు వేరు సంస్థలను ఒకదాని సమాచారం మరొకటి సరిచేసేవిగా ఉండేటట్లువని చేయించడం జరుగుతుంది. రహస్య పోలీసుదళం, పార్టీ, ఉద్యోగస్వామ్యం మూడు కూడా ప్రసరణ కుపయోగపడతాయి. ఈ మూడింటిలో ప్రతి ఒకటి కూడా మిగతా రెండు వక్రీకరించిన సమాచారాన్ని అందజేయడం జరుగుతుంది. తద్వారా సమాచార వక్రీకరణ జరుగకుండా సరిచేయబడుతుంది.

ఏ రాజకీయ వ్యవస్థ అయినా ఆ వ్యవస్థలోని భాగాలన్ని పరస్పరం ప్రసరణం గావించుకొనకపోతే పని చేయలేదు. అందువల్ల రాజకీయ వ్యవస్థలోని ఒక భాగాన్నుండి మరొక భాగానికి కోరికలు, నిర్ణయాలు మారుతూ ఉండే ప్రసరణాన్ని గమనించడమే ప్రసరణా అధ్యయనంగా కొందరు భావించారు.

రాజకీయ ప్రసరణా అధ్యయనం పూర్తిగా రాజకీయ వ్యవస్థ అధ్యయనంతో సంబంధం కలిగి ఉంటుంది. రాజకీయ వ్యవస్థ చలన శీలత్వానికి ప్రసరణం దోహదకారిగా వుంటుంది. అందువల్ల రాజకీయ వ్యవస్థను అధ్యయనం గావించినట్లుగానే రాజకీయ ప్రసరణాన్ని అధ్యయనం గావించవలసి వస్తుంది. డేవిడ్ ఈస్టన్ వివరించిన వ్యవస్థా సిద్ధాంతమును రాజకీయ ప్రసరణం దృష్ట్యా ఇచ్చట పరిశీలించ వచ్చును.

BRAOU

## 7.7 రాజకీయ ప్రసరణం - డేవిడ్ ఈస్టన్ వ్యవస్థా సిద్ధాంతం

ఈస్టన్ వివరించిన రాజకీయ వ్యవస్థలో రెండు రకాలైన వ్యక్తులుంటారు. ఒకరు సభ్యులు మరొకరు అధికారులు. సభ్యులు అనగా ఏదో ఒక రూపంలో రాజకీయ జీవితంలో భాగస్వాములయ్యే ప్రజలు. అధికారులనగా ప్రభుత్వం. వ్యవస్థా నాయకత్వం. ఈ వ్యవస్థలో సభ్యులుగా పిలువబడే ప్రజలు వ్యవస్థకు రెండు రకాలైన ఉత్పాదకాలను సరఫరా చేస్తారు. అవి 1. కోరికలు, 2. మద్దతు, వ్యవస్థ తన అధికారులనబడే ప్రభుత్వం ద్వారా పనిచేస్తే ఈ కోరికలు మరియు మద్దతుల ఆధారంగా నిరంతరం మార్పు ప్రక్రియను నిర్వహిస్తుంది. తత్ఫలితంగా ఉత్పాదకాలు బయటపడతాయి. అవియే నిర్ణయాలు, విధానాలు, చర్యలు మరియు సేవలు. ఈ ఉత్పాదకాలన్నీ వ్యవస్థ పర్యావరణంతో సంపర్కం చెందుతాయి. తద్వారా తిరిగి నూతనంగా కోరికలు జనిస్తాయి. మద్దతు ఉదయిస్తుంది. ఈ రెండూ వ్యవస్థలోకి Feed back గావించబడతాయి. అది మార్పు ప్రక్రియకు లోబడి తిరిగి ఉత్పాదితాల రూపంలో, విధానాలు, నిర్ణయాలు బయటకు వస్తాయి. ఈ రకంగా మార్పు ప్రక్రియ నిరంతరం కొనసాగుతూ ఉంటుంది. అయితే వ్యవస్థకు మద్దతు ప్రసరణం గావించబడకపోతే ఆ వ్యవస్థ పటుత్వం లోపిస్తుంది. ఈస్టన్ తన దృష్టిని వ్యవస్థ పటుత్వంపై నిలిపి నందున వ్యవస్థపై వచ్చే ఒత్తిడులపట్ల చాలా శ్రద్ధ వహించాడు. అసంఖ్యాకంగాను, వైవిధ్యంతో గాని కోరికలు ప్రజల్లో తలెత్తినపుడు లేదా వ్యవస్థకు మద్దతు లోపించడం జరిగినపుడు వ్యవస్థ తీవ్రమైన ఒత్తిడికి గురవుతుంది.

## 7.8 రాజకీయ వ్యవస్థ తులనాత్మక అధ్యయనం : రాజకీయ ప్రసరణం

రాజకీయ వ్యవస్థ కార్యకలాపాలన్నియు ప్రసరణం ద్వారానే నిర్వహించబడుతున్నాయి. ఉదాహరణకు కుటుంబాల యజమానులు, పాఠశాలలు మరియు కళాశాలల అధ్యాపకులు ప్రజలలో విలువలను నూరిపోసే కార్యాన్ని నిర్వహిస్తున్నారు. ప్రయోజన వర్గాలు, రాజకీయ పక్షాలు వ్యవస్థ విధానాలను రూపొందించడానికవసరమైన సమాచారాన్ని ప్రసరణం గావించే విధిని నిర్వహిస్తున్నాయి. తమ తోటి సభ్యులు మరియు మంత్రులు సరఫరా చేసిన సమాచారం ఆధారంగా శాసన సభ్యులు శాసనాలను రూపొందిస్తున్నారు. సమాజాన్నుండి, ప్రభుత్వ సంస్థల నుండి ప్రసరణం గావించబడిన సమాచారం ఆధారంగా ప్రభుత్వాధికారులు తమ విధి నిర్వహణ గావిస్తున్నారు. ఘర్షణ పడుతున్న పక్షాలు అందజేసిన సమాచారం ఆధారంగా ఉన్నతాసనాలపై కూర్చున్న న్యాయమూర్తులు తమ తమ తీర్పులను వినిపిస్తారు. ఈ రకంగా పరిశీలించిన రాజకీయ ప్రసరణమనేది లేదనీ, అన్ని రాజకీయ కార్యకలాపాల్లో రాజకీయ ప్రసరణం రాజకీయ వ్యవస్థలను వేరు వేరుగా చూచుటకు వాటి లక్షణాలను, కార్యకలాపాలను పరిశీలించుటకు అవసరమైన సాధనం.

రాజకీయ ప్రసరణాన్ని ఆధునిక - ఆదిమ రాజకీయ వ్యవస్థలను పోల్చి చూడడానికి ఒక సాధనంగా ఉపయోగించవచ్చు. ఒక రాజకీయ వ్యవస్థలోని నిర్మాణాలన్నియు అవి శాసనసభ, కార్యనిర్వాహకవర్గ, న్యాయశాఖ, రాజకీయ పక్షాలు, ప్రయోజన వర్గాలు మొదలగు లాంఛన నిర్మాణాలయినా, కుటుంబం, రక్తసంబంధం, ఇరుగు పొరుగు సమూహాలు, ముఖాముఖి వర్గాలు, కులాలు, హోదాలు, సజాతీయ వర్గాలు, భాషా సమూహాలు మొదలగు లాంఛనేతర నిర్మాణాలన్నియు ప్రసరణా కార్యకలాపాల నిర్వహణలో ప్రధాన పాత్ర వహిస్తాయి. అయితే ఆధునిక రాజకీయ ప్రసరణానికి మధ్య తేడా వుంటుంది. ఆధునిక వ్యవస్థల్లో ప్రత్యేకీకరించిన ప్రసరణా నిర్మాణం విస్తృతంగా వ్యాపించింది. ఈ ప్రసరణ ఆదిమకాలంలో రక్తసంబంధం, కుటుంబం, హోదా మరియు గ్రామ వర్గాలద్వారా నిర్వహింపబడే ప్రత్యేకీకరించని ప్రసరణంపై ఆధిపత్య చెలాయిస్తుంది.

రాజకీయ వ్యవస్థల తులనాత్మక అధ్యయనం గావించడానికి ఆల్మండ్ 4 ఉపాంశాలను సూచించాడు.

అవి:

1. రాజకీయ సమాచార సజాతీయత
2. సమాచార గమనం
3. సమాచార మొత్తం
4. సమాచార ప్రవాహదిశ

అయన ప్రకారం అభివృద్ధిచెంది, ఆధునికీకరణకు లోనైన రాజకీయ వ్యవస్థలందు, సమాచార సజాతీయత, సమాచార గమనం మరియు అధిక మొత్తంలో సమాచారం బహుముఖాలుగా ప్రవహించడం జరుగతుంది. ప్రాచీన వ్యవస్థలందునూ, పరివర్తన చెందుతున్న వ్యవస్థలందునూ సమాచారం విజాతీయంగానూ, గమనరహితంగానూ ఉండి సమాచార ప్రవాహం అతి పరిమితంగా వుంటుంది. వ్యవస్థలు Open యా, closedయా, ఆధునికమా, ఆదిమమా, అభివృద్ధి చెందనవారు, చెందినివారులని తెలుసుకోవడానికి ఈ ఉపాంశాలు ఉపయోగకరంగా ఉంటాయని ఆల్మండ్ వివరించాడు. ఈ విధంగా ప్రసరణకు సంబంధించిన రాజకీయ కార్యకలాపాల ఆధారంగా ఆల్మండ్ తన వివరణను గావించి రాజకీయ వ్యవస్థల నిర్వహణకు, వాటిని పోల్చి చూచుటకు ప్రసరణం ఎంత అవసరమో సూచించడం జరిగింది.

BRAOU

## 7.9 కార్ల్‌డైష్ : రాజకీయ ప్రసరణ పద్ధతి

నార్బర్ట్ వీనర్, రోస్ ఆష్బీలాంటి గణిత, ప్రాకృతిక శాస్త్రవేత్తలు రూపొందించిన Cybernetics అనే ఒక పద్ధతిని ఆధారంగా చేసుకొని రాబర్ట్‌నార్త్, కెన్నెత్ బౌల్డింగ్, కార్ల్‌డైష్‌లాంటి సామాజిక శాస్త్రవేత్తలు రాజకీయ ప్రసరణా పద్ధతి రూపొందించినారు. వీరిలో కార్ల్‌డైష్ ప్రముఖుడుగా పరిగణింప బడుతున్నాడు.

డైష్, తన రాజకీయ ప్రసరణా పద్ధతిని "The nerves of Govt". అనే గ్రంథంనందు వివరించినాడు. రాజకీయవ్యవస్థలు ఎలా జీవిస్తున్నాయో కాకుండా ఆవ్యవస్థల అభివృద్ధిని వివరించడానికి, రాజకీయ వ్యవస్థల యొక్క నిర్మాణాలను ప్రభావితం గావించే మార్పుల పరిణామలను అంచనా వేయడానికి Cybernetics యొక్క పద్ధతుల నుపయోగించుకొవడం డైష్ ప్రధానమైన ఉద్దేశ్యం, డేవిస్ మరియు లూయిస్‌ల ప్రకారం ఈస్టన్ వివరించిన నమూనాలో నిబిడీకృతమై యున్న కొన్ని తలంపులను వివరించడానికి మరియు ఈస్టన్ వివరించిన రాజకీయ వ్యవస్థ జీవన విధానంయొక్క విశ్లేషణ మరింత మెరుగుపరచి స్వల్ప తేడాతో ముందుకు తీసుకు వెళ్ళడానికి కార్ల్‌డైష్ ప్రయత్నించాడు.

ఆధునిక కాలంలో ఆవిర్భవించిన Neno Politicsకు డైష్ విశిష్ట సేవ చేశాడు. అతని Nerno Politics అను గ్రంథంలో Feed back ఒక ప్రధాన భావన. వ్యవస్థలోకి సరఫరా చేయబడిన సమాచారమునకు బదులుగా సంభవించే చర్యల ద్వారా తన తదనంతర ప్రవర్తనను మార్చుకొనే ప్రసరణా వ్యవస్థను Feed back గా డైష్ అభిప్రాయపడ్డాడు. అయితే ఈ Feed back వ్యవస్థలో Negativeగా గాని Positiveగా గాని యుండవచ్చు. వ్యవస్థ తాను మార్పునకు లోనయ్యే సమాచార ప్రసరణపు వ్యవహారాల్ని Load, Lag, Gain మరియు Lead అనే అంశాలు కూడా సూచిస్తాయి. ఇవియే Servomechanicsకు చెందిన పదాలు. ఒక నిర్ణీత సమయంలో ఒక రాజకీయ వ్యవస్థ కలిగియున్న మొత్తం సమాచారాన్ని Load సూచిస్తుంది. వ్యవస్థ తీసుకొన్న నిర్ణయాల ఫలితంగా ఏర్పడిన పరిణామాలను వ్యవస్థలోకి తిరిగి పంపించడానికి, తత్ఫలితంగా వ్యవస్థగై కొనే చర్యలకు మధ్య నుండే వ్యవధిని Lag సూచిస్తుంది. వ్యవస్థ తాను తన చర్యల ఫలితంగా ఏర్పడిన పరిణామల సమాచారాన్ని తిరిగి పొందడం ద్వారా ఎలా స్పందించదనే విషయాన్ని Gain సూచిస్తుంది. తాని గైకొనబోయే చర్యలు మరియు తీసుకొనబోయే నిర్ణయాల ఫలితంగా సంభవించనున్న పరిణామాలను ఏ మేరకు రాజకీయ వ్యవస్థ అంచనా వేయగలిగిందనే విషయాన్ని Lead సూచిస్తుంది.

రాజనీతి అధ్యయనానికి డైష్ అవలంభించిన పద్ధతి వినూత్నమైనది. ఆయన దృష్టిలో ఒక వ్యవస్థలో నిర్ణయాలు తీసుకోడానికి, తీసుకోబడిన నిర్ణయాలను అమలు చేయడానికి అవలంభించే అన్ని పద్ధతులు ఏవో లక్ష్య సాధనకుపయోగించబడితేనే తప్ప వేటికవే లక్ష్యాలు కానట్లే రాజకీయాలు కూడా వాటికవే లక్ష్యాలు కావు. H.G. Wells అభిప్రాయంలో నేటి ఆధునిక ప్రపంచంలో వ్యక్తులకు సామాజిక శిక్షణను కల్పించుటకు రాజనీతి ప్రధాన సాధనంగా ఉపయోగపడుతుంది. వ్యవస్థలోని విషయాలను నిశితదృష్టితో చూస్తూ రాజనీతి, సమాజానికి మార్గదర్శకత్వం నెరిపిన యెడల ఆ వ్యవస్థ అభివృద్ధికి, ఆ వ్యవస్థ జీవనానికి ఒక సాధనంగా తోడ్పడుతుందే తప్ప ఆ వ్యవస్థ వినాశనమునకుపయోగపడదు.

రాజకీయ ప్రసరణం మానవ ప్రవర్తనను యాంత్రికం గావించి, ఇంజనీరింగ్ దృక్పథంతో పరిశీలించడం పలు విమర్శలకు గురి అయింది. మానవ ప్రవర్తన స్థిరమైనదిగాని, నిర్ణీతమైనదిగాని కాదు. అలాంటి ప్రవర్తనను స్థిరమై, నిర్ణీతమూ అయిన అనేకనేక విషయాలతో కూడిన Electrical Engineering లాంటి ప్రాకృతిక

BRAOU

శాస్త్రాలకు చెందిన సూత్రాలతో సమన్వయంగావింపబడడాన్ని పలువురు ఖండించారు. మానవుడు యంత్ర ప్రాయుడు కానందున సమాజం యాంత్రికమైన ఏర్పాటుగా పరిగణింపబడడానికి వీలులేదు. అంతేకాకుండా ప్రాకృతిక శాస్త్రాలు పూర్తిగా రాజకీయ ప్రసరణానికుపయోగపడవు. ప్రాకృతిక శాస్త్రానికి మరియు సాంఘిక శాస్త్రానికీ మధ్య ఏ మేరకు సారూప్యముంటుందో ఆ మేరకు మాత్రమే రాజకీయ ప్రసరణం పరిమితమై ఉంటుంది.

ప్లేటో, జాన్ ఆఫ్‌సాలిన్‌బరీ, హాబ్స్, రూసో మరియు హెర్బర్ట్ స్పెన్సర్ మొదలగు తాత్త్వికులు తమ తమ స్వంత పద్ధతులలో రాజనైతిక విషయాలను అర్థం చేసుకోవడానికి మరియు వాటిని వివరించడానికి ప్రాకృతిక శాస్త్రాలను ఉపయోగించుకొన్నారు. అవే విషయాలను వివరించడానికి కార్ల్ డైష్‌లాంటి ఆధునికులు కూడా Electrical Engineering లాంటి ప్రాకృతిక శాస్త్రాలలోని పదాలనుయోగించారు. యంగ్ అభిప్రాయంలో ప్రాకృతిక శాస్త్రాలనుండి సాంఘిక శాస్త్రానికవసరమయిన సమాచారం సరఫరా కావడంలో అనేకనేక ముఖ్యమైన అవరోధాల నెదుర్కొంటూ తత్కారణంగా కార్ల్‌డైష్ ప్రతిపాదించిన రాజకీయ ప్రసరణా సిద్ధాంతం సంక్లిష్టమై నిరుపయోగమైన నమూనాగా మిగులుతుంది.

అభివృద్ధికి తగిన అభివృత్తులను ప్రసారణ ప్రక్రియ సమకూరుస్తుంది. ప్రసారణ యంత్రాంగం ద్వారా సమాచారం నలువైపులా వ్యాపించి ప్రజలు తమ తమ అవసరాలను చర్చించుకొని వాటిపై తగిన అవగాహన ఏర్పరచుకొనుటకు అవకాశం ఉంది. దేశ సమస్యలగూర్చి తెలుసుకొనే అవకాశాన్ని ప్రసారణ యంత్రాంగం కల్పిస్తుంది. సమస్యలపై సరియైన సమాచారం లభించటం వల్ల విధాన నిర్ణయాలను ప్రభావ పరిచే అవకాశం ప్రజలకు లభిస్తుంది. తద్వారా విధాన నిర్ణయాలలో ప్రజలు భాగస్వాములవుతారు. ప్రసారణల ద్వారా అన్ని రకాలైన రాజకీయ విధులను నిర్వర్తింప వచ్చు. రాజకీయనిర్మితులన్ని కూడా ప్రసారణ నిర్వహణలో భాగస్వాములవుతాయి. అందుకే రాజకీయాలకు ప్రసారణలకు దగ్గరి సంబంధం ఉంది.

BRAOU

ఆచార్య. ఎం. రాంచందర్

## 7.10 చదువదగిన పుస్తకాలు


| | | |
|---|---|---|
| Jangam.R.T. | : | Political Sociology |
| Tharu Bottomore | : | Political Sociology |
| Rush and Althoff | : | An Introduction to Political Sociology |


## 7.11 నమూనా పరీక్షాప్రశ్నలు

కింది ప్రశ్నలకు వ్యాసరూపంలో సమాధానాలు రాయండి.

1. రాజకీయ ప్రసరణ మనగానేమి?
2. రాజకీయ ప్రసరణం వివిధ రూపాలను వివరించండి
3. రాజకీయ ప్రసరణం, ఈస్టన్ వ్యవస్థ సిద్ధాంతంపై వ్యాసాన్ని రాయండి.

# భాగం - 8 శిష్ట వర్గం

## విషయక్రమం


8.1 లక్ష్యాలు

8.2 పరిచయం

8.3 శిష్టవర్గం అంటే ఏమిటి

8.4.0 శిష్టవర్గ సిద్ధాంతాలు

8.4.1 పరేటో శిష్టవర్గ సిద్ధాంతాలు

8.4.2 గెటానో మోస్కా

8.4.3 రాబర్టు మిచెల్స్

8.4.4 జోసె ఆర్టేగ్ వై. గాసెట్

8.4.5 కారల్ మార్క్స్

8.4.6 సి. రైట్ మిల్స్

8.4.7 లాస్‌వెల్

8.4.8 థామస్ డై, హర్మన్ జిగ్లర్

8.4.9 రాబర్టు థాల్

8.5 శిష్ట సిద్ధాంతం - ప్రజాస్వామ్యం

8.6 విమర్శనాత్మక పరిశీలన

8.7 చదువదగిన పుస్తకాలు

8.8 నమూనా పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 8.2 పరిచయం

ఆధునిక రాజనీతి శాస్త్ర అధ్యయనంలో "రాజకీయ శిష్టవర్గం" (Political Elites) భావన అత్యంత ప్రాధాన్య స్థానాన్ని సంతరించుకొన్నది. శిష్ట వర్గంగా పిలువబడే అల్ప సంఖ్యాకులు నిర్వహిస్తున్న రాజకీయ పాత్రకు గల ప్రాముఖ్యత మరే ఇతర అంశానికి లభించుటలేదు. ఏ సమాజంలోనైనా శిష్ట వర్గం చాలా అల్పసంఖ్యలో ఉండి చాలా ఎక్కువ నిర్ణయాలను తీసుకొంటుంది. మరో విధంగా చెప్పాలంటే వారే సమాజ నిర్ణేతలు. సామాజిక, రాజకీయ, ఆర్థిక విలువలకు శిష్టవర్గం ఏకైక మూలాధారం. ప్రతి సమాజం అది ఎటువంటి రాజకీయ వ్యవస్థను కలిగి ఉన్నప్పటికీ-ప్రాచీన, సాంప్రదాయ, ఆధునిక, అభివృద్ధి చెందుతున్న, ప్రజాస్వామ్య, పరిపూర్ణాధికార,- ఆ వ్యవస్థలో శిష్టవర్గం కీలకపాత్రను నిర్వహిస్తున్నది. ప్రజాస్వామ్య, నియంతృత్వ,

సైనిక, ఏక పక్ష రాజకీయ వ్యవస్థలలో శిష్ట వర్గ ప్రాముఖ్యం ఆయా వ్యవస్థల నిర్మాణంపై ఆధారపడి ఉంటుంది. ఎలాంటి రాజకీయ వ్యవస్థలోనైనా శిష్ట వర్గానికి కీలకస్థానం ఉండటంవల్లనూ, పూర్వం, ప్రస్తుతం గల ప్రభుత్వకార్యకలాపాల్లో ప్రముఖ పాత్రను నిర్వహించటల్లనూ, ఆధునిక రాజనీతిశాస్త్ర అధ్యయనంలో రాజకీయ శిష్టవర్గం ఒక ప్రధాన మూలక అధ్యయనాంశంగా పరిగణన పొందింది.

శిష్ట వర్గ భావనను సామాజిక, చారిత్రక, మనోవైజ్ఞానిక, రాజనీత శాస్త్రవేత్తలు చాలా సందర్భాలలో ఉపయోగిస్తున్నారు. అందువల్ల శిష్టవర్గం భావన అధ్యయనాన్ని ఒక్క నిర్వచనంతో ప్రారంభించటం అంత సబబైన విషయంకాదు. ప్రాబల్యశిష్ట వర్గం (Power Elites), సామాజిక శిష్టవర్గం (Social Elites) అల్పజనపాలన (Oligarchy), పాలకవర్గం (Ruling class) మొదలైన పదాలు మనకు ఎదురౌతుంటాయి.

## 8.3 శిష్ట వర్గం అంటే ఏమిటి

సమాజంలో కొందరు పాలింపబడటానికి మరికొందరు పాలించటానికి తగిన వారని ప్రముఖ గ్రీకు తత్వవేత్త అరిస్టాటిల్ అన్నారు. శిష్ట వర్గం అనగా "ఎన్నుకోబడినకొద్దిమంది" (Chosen Few) అని అన్నారు. తమ అత్యున్నత లక్షణాలతో (Superior Quality) తమనైపుణ్యంలో శిఖరాగ్ర స్థాయికి చేరుకున్న వ్యక్తుల సమూహమే శిష్టవర్గం. కార్మికసంఘాల్లో, ఉద్యోగి స్వామ్యంలో, సైనిక దళాలలో ఎంపిక అయిన కొద్దిమంది శిష్టులు ఉంటారు. పరేటో మాటల్లో శిష్టవర్గం అనగా ప్రతివృత్తిలోను సామాజిక శ్రేణిలోను అగ్రస్థాయికి చేరుకున్న వ్యక్తుల సమూహం. ఉదాహరణకు న్యాయవాదులలో న్యాయ వాద శిష్ట వర్గం, ఉద్యోగి స్వామ్యంలో ఉద్యోగ శిష్ట వర్గం. "ప్రజలను నియంత్రించే సామర్థ్యం గల కొద్దిమంది వ్యక్తుల సమూహమే శిష్టవర్గం" అని మిచెల్స్ అన్నారు. రాజకీయ వ్యవస్థలో (Body Politic) ప్రాబల్యం పొందినవారే శిష్టులు. వారే సమాజంలో అత్యున్నత స్థాయిని సంతరించుకొని ఉంటారని లాస్‌వెల్ పేర్కొన్నారు. వ్యూహాత్మక శ్రేణులలో (Strategic Heirarchies) నాయకస్థానానికి చేరుకొన్న వారే శిష్ట వర్గమని C. రైట్ మిల్స్ నిర్వచించారు. సమాజంలో సమాజ సభ్యుల దృష్టిలో మతం, వ్యాపారం, వివిధ సంఘాలు, శాసనసభ, పౌర సంఘాలలో (Civic Bodies) నాయకత్వ హోదాను అనుభవిస్తున్న వాస్తవ విధాన నిర్ణేతలే శిష్టవర్గమని హంటర్ నిర్వచనం. ఈ నిర్వచనాలన్నింటిని పరిశీలిస్తే కింది అంశాలు విదితమౌతాయి.

1. విశిష్ట లక్షణాలు (Distinct Qualities) శిష్టవర్గాన్ని రూపొందిస్తాయి;
2. శిష్టవర్గపు గౌరవం, హోదా, ప్రాధాన్యత;
3. సమైక్య, సమూహ భావంతో ఆలోచనలు;
4. ప్రాబల్యం, అధికారం, ప్రభావం, ఇతర వనరులను పొంది ఉండటం.

శిష్ట వర్గం భావన సమాజపు ఒక రంగంలో ఉన్నత స్థాయిలలో ఉన్న కొద్ది మంది ప్రముఖులకే వర్తిస్తుంది. వారు వ్యాపార రంగంలో ప్రముఖులు కావచ్చు. సామాజిక రంగంలో అతి ముఖ్యులు కావచ్చు. విద్యారంగంలో ఉన్నత మేధావి వర్గం కావచ్చు. ఒక్క మాటలో చెప్పాలంటే పాలన, ఆర్థిక, సైనిక, రాజకీయ, మత వ్యవస్థలలో శిఖరాగ్ర స్థానానికి చేరుకొన్న కొద్దిమంది ప్రముఖ వ్యక్తులకు శిష్టవర్గం భావన వర్తిస్తుంది. రాజకీయ రంగంలో ఉన్నత స్థానాన్ని ఆక్రమించి విధాన నిర్ణయంనుంచి, విధానాల వివరణ, ప్రచారం, అమలు మొదలైన వాటిపై ఆధిపత్యం, ప్రభావం చూపించే రాజకీయ శిష్ట వర్గం ఆధునిక రాజకీయ, సామాజిక విశ్లేషణలలో ప్రముఖ స్థానాన్ని సంతరించుకొంది.

BRAOU

## 8.4.0 శిష్ట వర్గ సిద్ధాంతాలు

సమాజంలో అధికారం ఏ విధంగా రూపొందుతున్నదన్నది శిష్ట వర్గ అధ్యయనంలో ప్రధానాంశం. అధికారం ఏ విధంగా రూపొందుతుంది? అధికారం కేవలం అల్ప సంఖ్య గల వర్గంచేతిలోనే ఉంటుందా? అలా ఉండటం కేవలం కాకతాళీయమా? లేక అనివార్యమా? అసలు అధికారం స్వభావం ఏమిటి? ఇవన్నీ శిష్ట వర్గ అధ్యయనానికి సంబంధించిన ప్రశ్నలు.

స్థూలంగా రాజకీయ వ్యవస్థలను రెండు వర్గాలుగా విభజించవచ్చు. అవి పాలకులు, పాలితులు. పాలకులను పాలకవర్గం అంటారు. రాజకీయ వ్యవస్థలో పాలకవర్గం చాలా కీలకమైంది. రాజకీయ శిష్ట వర్గం వ్యవస్థలో చాలా ముఖ్యమైన స్థానంలో ఉండి విధానాలను రూపొందించటంలోను, వాటిని అమలు జరపటంలోను, ప్రజలు వాటిని అంగీకరించేటట్లు చేయటంలోనూ కృషి జరుపుతూఉంటుంది. అతి ముఖ్యమైన విధాన నిర్ణయాలన్నీ శిష్ట వర్గంనుండే ఆవిర్భవిస్తాయి. రాజకీయ రంగంలోని అతిముఖ్యమైన నాయకులతో రాజకీయ శిష్టవర్గం ఏర్పడుతుంది. రాజకీయ శిష్ట వర్గపు ఆసక్తి, కార్యక్రమాలు, పాత్ర, ప్రభావం ప్రాబల్యాలను విశ్లేషించటంద్వారా రాజకీయ వ్యవస్థ తీరు తెన్నులను అధ్యయనం చేయటం సాధ్యమవుతుంది.

'శిష్టవర్గం' పదాన్ని మొదట 17 వ శతాబ్దపు వర్తకులు తమ అత్యుత్తమ వ్యాపార దక్షతను, వాణిజ్యపు నైపుణ్యాన్ని వర్ణించేటందుకు వాడారు. క్రమేణా అది "కులీన శిష్ట వర్గం"గా ప్రచారంలోకి వచ్చింది. 19వ శతాబ్దంలో ఈ భావనను రాజకీయ, సామాజిక, విశ్లేషణలలో పాలకవర్గానికి లేదా ఆధిపత్యవర్గానికి వర్తింపజేశారు. పరేటో, మోస్కా, మిచెల్స్, లాస్‌వెల్ మొదలగువారు శిష్టవర్గాన్ని నిర్వచించారు. రాజకీయ సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, వైజ్ఞానిక రంగాలలో ఉన్నతస్థానంలో ఉన్న వ్యక్తులందరికీ శిష్ట వర్గం పదం స్థూలంగా వర్తిస్తుంది.

BRAOU

రాజనీతి శాస్త్రంలో భాగంగా 19 వ శతాబ్దపు చివరన, 20వ శతాబ్దపు ఆరంభంలో శిష్ట వర్గానికి చెందిన అధ్యయనాలు మొదలయ్యాయి. ప్రతి సమాజంలోను రెండు రకాలైన వ్యక్తులుంటారన్న భావం మీద శిష్టవర్గ సిద్ధాంతం ఆధారపడి ఉంది. 1. ఎంపికైన కొద్దిమంది అత్యున్నత నాయకత్వ సామర్థ్యాన్ని కలిగి ఉంటారు. 2. మెజారిటీ సంఖ్యగల ప్రజాసమూహం. వీరు పాలింపబడటానికే అర్హులు. మొదటగా ఈ సిద్ధాంతం పశ్చిమ, కేంద్ర యూరోపు ఖండదేశాలలో ప్రజాస్వామ్యాన్ని, సామ్యవాదాన్ని విమర్శించేదిగా అవతరించింది. తరువాత అమెరికా సంయుక్త రాష్ట్రాలలో చాలామంది రచయితలు ప్రజాస్వామ్య దేశాలలో రాజకీయ ప్రక్రియలను వివరించటానికి ఈ సిద్ధాంతాన్ని వినియోగించారు. 1950 దశకంలో అమెరికన్ సామాజిక శాస్త్రవేత్తలయిన షంపీటర్, లాస్‌వెల్, సి. రైట్ మిల్స్ మొదలగువారు ఫాసిజం వృద్ధి చెందుతున్న కాలంనాటి యూరోపియన్ తత్వవేత్తల రచనలు అందులో ముఖ్యంగా పరేటో, మోస్కా, మిచెల్స్, గాసెట్ రచనలపై జరిపిన చర్చలు రాజకీయ శిష్టవర్గ సిద్ధాంతం ఆవిర్భావానికి దోహదం చేశాయి. రాజకీయాలలో ప్రత్యక్షంగానో పరోక్షంగానో పాల్గొనే శిష్టులను పాలకశిష్టులు అని అన్నారు. రాజకీయాలలో గుర్తింపులేని చర్యలలో పాల్గొనే వారిని పాలకేతర శిష్టులన్నారు. శిష్టవర్గ సిద్ధాంతకర్తలలో పరేటో, మోస్కా, మిచెల్స్, గాసెట్, కారల్ మార్క్స్, సి. రైట్ మిల్స్ ప్రముఖులు.

## 8.4.1 పరేటో శిష్ట వర్గ సిద్ధాంతం

విల్‌ఫ్రెడ్ పరేటో ఇటలీకి చెందిన సామాజికశాస్త్రవేత్త. (1848-1923) తులనాత్మక రాజకీయాల

అధ్యయనంలో శిష్ట వర్గ దృక్పథం ప్రారంభం కావడానికి తోడ్పడినవారిలో పరేటో ముఖ్యుడు. రాజకీయ అధికారం నిర్వహించటానికి తగిన లక్షణాలు ( Qualities) గల వారే ప్రతి సమాజాన్ని పాలిస్తున్నారని విశ్వసించారు. ప్రతి వృత్తిలోనూ విజయం సాధిస్తూ శిఖరాగ్రానికి చేరుకున్న వ్యక్తుల సమూహామే శిష్టవర్గం. ప్రతి సమాజంలోను రెండు వర్గాలు ఉంటాయి: 1. (a) ఉన్నత స్థాయిలో శిష్ట వర్గం; పాలక, పాలకేతర శిష్టవర్గంగా రూపొందుతారు. (b) తక్కువస్థాయిలోని శిష్టవర్గానికి చెందనివారు. 2. బలప్రయోగం, జిత్తులమారి తనం ద్వారా పాలక శిష్టవర్గం ప్రజలను పాలిస్తుంటుంది. ఇందులో బలప్రయోగానికే అధిక ప్రాముఖ్యత ఉంటుంది. పరేటో శిష్ట వర్గ చక్రభ్రమణభావాన్ని బాగా వృద్ధి చేశారు. చరిత్ర కులీన పాలకుల శ్మశానమని ఆయన పేర్కొన్నారు. (History is a grave yard of Aristocracies) ప్రతి సమాజంలో శిష్ట వర్గంలో వ్యక్తులు ఉన్నత స్థాయినుండి అథమస్థాయికి, అధమస్థాయినుండి ఉన్నత స్థాయికి నిరంతర గమనం చేస్తుంటారు. అధికారంలో ఉన్న వర్గాలు క్షీణించగా, పాలిత వర్గాలలో ఉన్నత లక్షణాలు సంతరించుకొన్న నూతన శిష్ట వర్గం రూపొంది అధికారంలో ఉన్న శిష్ట వర్గంతో పోరాటానికి దిగుతుంది. పర్యవసానంలో శిష్ట వర్గంలోకి కొత్త సమూహాలు చేరుతాయి. అప్పటికే ఉన్న శిష్ట వర్గం పూర్తిగా అంతరించి దాని స్థానంలో కొత్త శిష్టవర్గం రావచ్చు. వివిధ శిష్ట వర్గాల మనోవైజ్ఞానిక భావాల్లో మార్పులు రావటం వల్లనే శిష్టులభ్రమణం జరుగుతుంటుంది. వివిధ సందర్భాలలో వివిధరకాలైన శిష్టవర్గాలను, వాటి మధ్య జరిగే చక్రభ్రమణం గురించి పరేటో రాశారు. అవి (i) వివిధ పాలకవర్గాల మధ్య జరిగే భ్రమణం; (ii) పాలక శిష్ట వర్గం, తక్కిన జనాభాకు మధ్య జరిగే భ్రమణం. రెండవదానిలో (a) అధమ వర్గం (Lower Strata) లోని వ్యక్తులు ఇంతకు ముందే ఉన్న శిష్ట వర్గ స్థాయిని అందుకుంటారు. (b) అధమ వర్గంలోని వ్యక్తులు కొత్త శిష్టవర్గంగా అవతరించి అప్పటికి నిలిచి ఉన్న శిష్టవర్గంలో ప్రాబల్యం నిమిత్తం పోరాటానికి దిగుతారు. ఏయే కారణాలవల్ల సామాజిక సమతౌల్యంలో మార్పులు జరిగి శిష్టవర్గాలలో భ్రమణాలు జరుగుతాయన్న విషయాన్ని పరేటో సవివరంగా విశ్లేషీకరించారు.

BRAOU

శిష్ట వర్గాలలోని వివిధ రకాలైన వ్యక్తుల మనోవైజ్ఞానిక స్వభావాలలో మార్పులు ఏర్పడటం ప్రధాన కారణంగా భావించారు. ఈ సందర్భంలోనే పరేటో అవక్షేప భావన (Residue)ను వృద్ధి చేశారు. సామాజిక జీవనంలోని వ్యక్తుల తార్కిక తార్కికేతర చర్యలలోని విభేదాలలో అవక్షేపభావన దాగి ఉందని పరేటో గుర్తించారు. లక్ష్యసాధనకు వినియోగపడే చర్యలను, అందుకు అనుగుణంగా ఉండే పద్ధతులను అనుసరించటాన్ని తార్కికేతర చర్యలుగా గుర్తించారు. ఏ లక్ష్యసాధనకు వినియోగ పడని చర్యలను తార్కిక మతచర్యలుగా పరేటో గుర్తించారు. జీవితంలో వృద్ధి చెందటానికి తోడ్పడే లక్షణాలను (Qualities) పరేటో అవక్షేపాలన్నారు. ఆయన 1. హఠం (Resistence) 2. సామాజికత (Sociability) 3. కార్యకలాపాలు (Activities) 4. సమగ్రత (Integrity) 5. లైంగిక (Sex) 6. సంయోగ సహజత్వం (Instinct of Combinations) గా వాటిని వివరించారు. వీటిలో మొదటి, చివరిదానికి పరేటో ప్రాముఖ్యమిచ్చారు. వీటి సహాయంతో పాలక వర్గ శిష్టులు అధికారంలో కొనసాగటానికి ప్రయత్నిస్తుంటారు. సంయోగ సహజత్వం గల వ్యక్తి తన ప్రేరణలు, సహజతాలు, ఆవేశాలద్వారా ఇతరులు తన వాదాన్ని అంగీకరించేటట్లుగా ఒప్పించగలుగుతాడు. తన స్థితిని భద్రపరచుకొని, సాధించినదానిని నిలబెట్టుకొనే స్వభావాన్ని హఠంగా వివరించారు. సంయోగ సహజత స్వభావం జిత్తులమారి తనాన్ని, హఠాన్ని, బలాన్ని సూచిస్తుంది. ఇవి రెండూ మాకియవెల్లి సూచించిన స్వభావాలైన సింహం, నక్కలపోలికలకు సరిపోతున్నవి. రెండు రకాల శిష్టులలో ఒకరు మోసం ద్వారాను, మరొకరు బలంద్వారాను పాలిస్తారు. వీరినే Reutiers అని Speculators అని వ్యవహరిస్తున్నారు. అధికార ఉపయోగాన్ని సమర్థించుకోనటానికి, ప్రజలనుండి విధేయత పొందుటకు శిష్టులు వివిధ వ్యుత్పత్తులను (Derivations) కల్పితాలను సృష్టిస్తారు. అవక్షేప స్వభావంతో తీసుకొన్న చర్యలు హేతుబద్ధమైనవని

సమర్థించుకుంటారు. సామాజిక సమతౌల్యం కొనసాగటానికి సమయానుకూలంగా శిష్టవర్గ చక్రభ్రమణం అవసరమని పరేటో పేర్కొన్నారు. సమాజంలో ఉన్నత వర్గ సంచయనం (Accumulation) ద్వారా విప్లవాలు సంభవిస్తాయని అన్నారు. వర్గ భ్రమణం నెమ్మదిగా తగ్గటం; లేదా అధికారంలో ఉన్నవారు తమ అధికారాన్ని కొనసాగించటానికి అవక్షేపభావన తగినది కాదనుకున్నప్పుడు లేదా బలప్రయోగంవల్ల ప్రయోజనాలు సిద్ధించకపోవటం; లేదా సమాజంలో అధమ స్థాయి వ్యక్తులు ఉన్నతస్థాయి లక్షణాలను సంతరించుకొని అవక్షేపనను పొంది పాలన కార్యకలాపాలను నిర్వహించటానికి బలాన్ని ఉపయోగించటంలో తగిన ఆసక్తిని కనబర్చినప్పుడు శిష్ట వర్గ పరిభ్రమణం జరుగుతుందని పరేటో తన రచనలలో పేర్కొన్నారు. బలప్రయోగం విషయంలో పాలక శిష్టవర్గం సామర్థ్యానికి, ఆసక్తికి, పరేటో అత్యధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలుస్తుంది. ప్రజాస్వామ్య సమాజాల శిష్టులలో రాజకీయ పార్టీ నాయకులను ఆయన చేర్చారు. ప్రభుత్వంలో భాగస్వామ్యం లేకుండా వ్యతిరేకించేవారు శిష్టవర్గానికి వెలుపల ఉంటారు. శిష్టుల మనోవైజ్ఞానిక స్వభావాన్ని పరేటో బాగా వివరించారు. కాని అవశిష్ట భావనను సంతృప్తికరంగా వివరించలేదు. వివిధ రాజకీయ సందర్భాలలో అవశిష్టం వివిధములుగా ఉండే అవకాశాలున్నాయి. అవి చాలామంది చారిత్రికుల, సమాజ శాస్త్రజ్ఞుల పరిశోధనలను విస్మరిస్తున్నాయి. మానవుల స్పందనల విషయంలో పరిసరాల ప్రభావాలను కూడా విస్మరిస్తున్నాయి.

## 8.4.2 గెటానో మోస్కా

మోస్కా రాజనీతి శాస్త్రజ్ఞుడు. (1858-1941) మనోవైజ్ఞానిక శాస్త్రవేత్త పరేటో రూపొందించిన రాజకీయ శిష్టవర్గం, శిష్టవర్గ చక్ర భ్రమణం భావనలను మోస్కా మరింత వృద్ధి చేశారు. అరిస్టాటిల్ ప్రభుత్వాల వర్గీకరణంలోని రాజరికం, కులీన పాలన, ప్రజాస్వామ్యాలను మోస్కా విమర్శిస్తూ అల్పజన పాలనయే సరియైన ప్రభుత్వంగా నిర్వచించారు. సమాజాలన్నింటిలోనూ,- అతి తక్కువగా వృద్ధిచెంది, నాగరికత తొలిదశలో ఉన్న, అభివృద్ధి చెందిన శక్తివంతమైన సమాజాలలో- రెండు వర్గాలప్రజలు కనిపిస్తారని మోస్కా పునరుద్ఘాటించారు. 1. పాలకులు, 2. పాలితులు. పాలకవర్గం సభ్యులు తక్కువ సంఖ్యలోను, పాలిత వర్గ సభ్యులు అత్యధిక సంఖ్యలోను ఉంటారు. తక్కువ సంఖ్య సభ్యులు గల పాలకవర్గం రాజ్యపు రాజకీయ కార్యకలాపాలను నిర్వహిస్తూ, అధికార గుత్తాధిపత్యాన్ని కలిగి ఉంటూ, తద్వారా లభించే ప్రయోజనాలను అనుభవిస్తుంటారు. సంఖ్యాబలం ఎక్కువగా గల పాలిత వర్గం ఎల్లవేళలా పాలకవర్గం నిర్దేశాలకు, నియంత్రణలకు లోబడి శాసన బద్ధతను సంతరించుకొంటుంది. శిష్టులు సమాజాలన్నింటిలోనూ ఉంటారు. అయితే సామాజిక, నాగరక స్థాయిననుసరించి ప్రతి సమాజంలోను శిష్టుల స్వభావం ఒక రకంగా ఉండక భిన్నంగా ఉంటుంది. ప్రత్యేక స్థాయిని సంతరించుకొన్న వ్యక్తులు శిష్టవర్గ సభ్యత్వస్థాయిని పొందుతారు. మోస్కా దృష్టిలో మైనారిటీలో ఉన్న శిష్టులు వ్యవస్థీకృత రూపంలో ఉన్నందువల్ల మెజారిటీ ప్రజలపై పాలనను సాగిస్తుంటారు. మెజారిటీలో గల ప్రజలు వ్యవస్థీకృతమై ఉండరు. వ్యవస్థీకృతం కాకుండా ఉన్న మెజారిటీ ప్రజలపై, వ్యవస్థీకృతమై ఉన్న మెజారిటీ శిష్టుల ఆధిపత్యం అనివార్యమవుతున్నది. మెజారిటీలో ఉన్న వ్యక్తులు మైనారిటీ వర్గ ఆధిపత్యాన్ని ఎదిరించలేరు. మైనారిటీగా ఉన్న శిష్టులు స్వప్రయోజనాల దృష్ట్యా వ్యవస్థీకృతమై ఉంటారు. సాధారణంగా మైనారిటీ వర్గం అత్యున్నతస్థాయిని సంతరించుకొన్న వ్యక్తుల సంకలనం. పాలకవర్గంలోని మైనారిటీ సభ్యులు సమాజంలో అత్యధిక హోదాను కల్గి ఉంటారు. వంశపారంపర్యత విషయంలో మోస్కా కొన్ని ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. రాజకీయ వర్గాలన్నీ శాసనరీత్యా కాకపోయినా, వాస్తవంలోనైనా వంశపారంపర్యతను సంతరించుకొంటాయి. భౌతికశాస్త్రంలో స్తబ్దతశక్తి (Force of Inertia) స్వభావాన్ని రాజకీయ శక్తులు కలిగిఉంటాయి. వాటికి స్థిరత్వం పొందేగుణం ఉంటుంది. కొన్ని కుటుంబాలకు చెందినవారు కొన్ని ప్రత్యేకమైన పదవులనే అంటిపెట్టుకొని సుదీర్ఘకాలం

BRAOU

వరకు ప్రభావాన్ని కలుగజేస్తుంటారు. ప్రజాస్వామ్య వ్యవస్థలకు జరిగే ఎన్నికలలో విజయం పొందే వ్యక్తులలో కొందరికి వంశపారంపర్య లక్షణాలు ఉంటాయి. చాలా దేశాల పార్లమెంటులలో సభ్యుల, మాజీ సభ్యుల, మాజీ మంత్రుల, మంత్రుల కొడుకులు, కూతుళ్ళు, కోడళ్ళు, అల్లుళ్ళు సభ్యులుగా ఉండటాన్ని మనం చూస్తున్నాం. వంశపారంపర్యంగా ఒక కులం ప్రాధాన్యతను సంతరించుకొన్నాకే, అది తన ఆధిక్యతకు శాసనబద్ధతను కల్పించుకొంటుంది. మోస్కా ఈ సందర్భంలో భారతదేశంలోని అనువంశికపు కులాలను కొన్నింటిని ప్రస్తావించారు.

రాజకీయ శిష్టులను కొన్ని సామాజిక శక్తులు (Social Forces) ప్రభావపరుస్తాయని మోస్కా పేర్కొన్నారు. శిష్టులు కేవలం బల ప్రయోగంద్వారానే పాలన చేయరు. సమాజంలోని ప్రాధాన్య వర్గాలుకూడా ప్రభావవంత మైన పాత్రను నిర్వహించగలవని మోస్కా అన్నారు. ఈ సందర్భంలోనే మోస్కా 'ఉప-శిష్ట' (Sub-elite) భావాన్ని ప్రవేశపెట్టారు. సమాజంలోని కొత్త మధ్యతరగతివర్గం, ప్రభుత్వోద్యోగులు, పరిశ్రమల మేనేజర్లు, శాస్త్రజ్ఞులు, మేధావులు, మొదలైనవారిని ఆయన ఉప-శిష్ట వర్గంగా పేర్కొన్నారు. ఇది ప్రభుత్వపు మూలకం. ఈ రెండవ వర్గపు నైతికత, తెలివితేటలు, కార్యక్రమాలపైననే రాజకీయ స్థిరత్వం ఆధారపడి ఉంటుందని కూడా మోస్కా పేర్కొన్నారు.

పరేటో వలెనే మోస్కాగూడా శిష్టవర్గ చక్రభ్రమణ సిద్ధాంతాన్ని విశ్వసించారు. రాజకీయాధికారాన్ని నిర్వహిస్తూ, రాజకీయ నియంత్రణ చేయగల అభివృద్ధిని శిష్ట వర్గ లక్షణంగా మోస్కా పేర్కొన్నారు. పాలకవర్గం ఈ లక్షణాన్ని కోల్పోయినప్పుడు పాలిత వర్గ ప్రజలు ఈ లక్షణాన్ని సంతరించుకొని, అధికార పీఠం మీద ఉన్న పాలకవర్గాన్ని కూలదోసి అధికారం హస్తగతం చేసుకొనే అవకాశం ఉంది. పాలక శిష్ట వర్గం కాలక్రమంలో ప్రజావసరాలను తీర్చలేకపోవటంలేదా వారందించే సేవలు ప్రజలలో ప్రాముఖ్యతను కోల్పోయినప్పుడు లేదా ఒక కొత్త మతం ఆవిర్భవించినప్పుడు లేదా ఇటువంటివే మార్పులు సంభవించినప్పుడు అధికార మార్పిడి అనివార్యమౌతుంది. ఈ మార్పులకు మోస్కా మానసిక సంబంధకారణాలతోపాటు సామాజిక కారణాలను లేదా సామాజిక వత్తిడులను పేర్కొన్నారు. ఆయన సామాజిక పరిస్థితులలో మార్పులకు వ్యక్తుల లక్షణాలకు మధ్య కొంత సంబంధాన్ని ఏర్పరచారు. సమాజంలో కొత్త ఆసక్తులు, అధర్మాలు ఏర్పడి కొత్త సమస్యలు ఉత్పన్నమై శిష్టవర్గ చక్రభ్రమణం ప్రక్రియ ప్రారంభమవుతుంది. మోస్కా సంచార సమాజాన్ని (Mobile Society) ప్రోద్బలం ద్వారా (Persuation) మార్పులను కోరుకొన్నారు. ప్రజాభిప్రాయానికి అనుకూలంగా క్రమంగా రాజకీయ వ్యవస్థలో మార్పులు చేయమని పాలక శిష్టవర్గానికి మోస్కా సలహా ఇచ్చారు.

BRAOU

మోస్కా Political Formula అనే భావనను రూపొందించారు. ప్రతి సమాజంలోనూ పాలక శిష్ట వర్గం అధికారంలో కొనసాగటానికి నైతికత కోసం, శాసనబద్ధతకోసం ప్రయత్నిస్తుంటుంది. సర్వసాధారణంగా పాలక శిష్టవర్గం ప్రజల గుర్తింపుకు, సిద్ధాంతాల అంగీకారానికి, విశ్వాసాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది.

రాజకీయంగా అమిత ప్రాబల్యం వహించే శిష్టవర్గం ఏ విధంగా కొనసాగుతుంది? ఏ విధంగా దానికి పదవీ భ్రష్టతలభిస్తుంది? ఇందుకు మోస్కా ఐదు కారణాలను పేర్కొన్నారు. అవి: 1. ప్రజా జీవన విధానంలో కలసిపోయి ఉండటం; 2. రాజకీయ సిద్ధాంతాలను తరచుగా ఉపయోగించుకోవటం; 3. అనుకరణ; 4. శిష్ట వర్గంలోని సభ్యుల మధ్య పదవుల పంపిణీల మార్పులు; 5. సైన్యం మద్దతు. ప్రజా జీవితంతో సన్నిహిత సంబంధం ఏర్పరచుకొని, వారి ఆశయాలను తరచు ప్రకటిస్తూ; వాటికి అనుగుణమైన రాజకీయ సమాధానాలను పేర్కొంటూ, పాలక వర్గంలో ఎక్కువమందికి పదవులు పంపకం చేస్తూ; కొత్తవారికి అధికార పీఠ సాన్నిహిత్యాన్ని కలుగజేస్తూ సైనిక దళాల మద్దతుకు ప్రజల స్వామిభక్తిని, నిర్బంధ శక్తిని

జోడించి రాజకీయ శిష్టవర్గం అధికారంలో కొనసాగుతుందని మోస్కా వివరించారు.

## 8.4.3 రాబర్ట్ మిచెల్స్

మోస్కా శిష్యుడు మిచెల్స్ (1876-1936). వ్యవస్థాత్మక దృక్పథపు ప్రాముఖ్యతను వివరించారు. ఆయన దృష్టిలో శిష్టుల నియంత్రణ రాజకీయ వ్యవస్థపై ఆధారపడి ఉంటుంది. వ్యవస్థీకృత సమాజపు నిర్మితులు శిష్ట వర్గ ఆవిర్భావానికి తప్పక దోహదం చేస్తాయన్నారు. అల్ప జన పాలన అభివృద్ధికి మద్దతుగా మిచెల్స్ జన సమూహపు మనస్సు (Mass Mind) భావాన్ని ప్రవేశపెట్టాడు. ప్రజలలో చాలామంది రాజకీయ వ్యవహారాలపట్ల నిరాసక్తులుగా ఉంటారు. వారు ఇలాంటి విషయాల్లో నిరంతరం అసమర్థులుగానే ఉంటారు. అందువల్ల సామాన్య ప్రజలు స్వపరిపాలనకు పనికిరారు. ప్రజల ఈ స్వభావాన్ని గ్రహించిన నాయకులు అధికారంలో శాశ్వతంగా కొనసాగుతుంటారు. ఒకసారి అధికారంలోకి వచ్చిన నాయకులను తొలగించటం అంత సులువైన విషయంకాదు. నిరంకుశ పాలకులను విప్లవాలద్వారా ప్రజలు తొలగించిన ఉదాహరణలు ఎన్ని ఉన్నా, కొత్త గా నియంతలు ఆవిర్భవిస్తూనే ఉన్నారు. మిచెల్స్ దృష్టిలో సార్వజనీన వోటింగ్ హక్కు ఉన్నా, మెజారిటీ ప్రజలకు తమను పాలించుకోవడం సాధ్యమయ్యే విషయంకాదు. ప్రజాస్వామ్యం అంటే ప్రజల పాలన అన్నది దుస్సాధ్యమైన విషయం. ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థలలోకూడా కొద్దిమంది మాత్రమే ప్రధాన నిర్ణయాలు చేస్తుంటారు. ప్రజాస్వామ్య వ్యవస్థలలో పరస్పరం పోటీలుపడే వర్గాలుంటాయి. వారిమధ్య పోటీలు వారి మద్దతుదార్లను ప్రభావపరుస్తుంటాయి. ప్రజల సమస్యల విషయంలో చాలామంది నిరాసక్తంగా ఉంటారు. చాలామంది తమ తరఫున కొద్దిమంది నిర్ణయాలు చేయటాన్నే అభిలషిస్తుంటారు. విప్లవాల విషయంలో కూడా నిర్ణయాలనుకొందరికే వదలివేస్తుంటారు.

## 8.4.4 జోసె ఆర్టేగ్ వై. గాసెట్

BRAOU

గాసెట్ (1883-1953) ప్రజా సమూహ సిద్ధాంతాన్ని ( Theory of Masses) రూపొందించారు. ఎంపికైన కొద్దిమంది ప్రతినిధులలో తమ చిహ్నాన్ని తెలుసుకోగల జన సమూహపు సామర్థ్యంపై ఒక రాజ్యం ఘనత ఆధారపడి ఉంటుందన్నాడు. ఎంపిక అయిన ప్రజలు (Chosen People) ప్రజాసమూహాలకు నాయకత్వం వహిస్తారు. వీరు సమాజం మొత్తంపై ప్రభావాన్ని కలిగిస్తుంటారు. వ్యవస్థీకృత మానవ సమూహమే రాజ్యం. ఎంపికైన స్వల్ప సంఖ్యాకల వ్యక్తులే రాజ్య నిర్మితులు. ఈ స్వల్పసంఖ్యలో గల వ్యక్తులే ప్రజా సమూహం తరఫున నిర్ణయాలు చేస్తుంటారు. ఒక రాజ్యం శాసనబద్ధంగా ప్రజాస్వామ్యాన్ని లేదా కమ్యూనిస్టు విధానాన్ని ఎంచుకోవచ్చు. వాస్తవంలో ప్రజలను ప్రభావ పరచగలిగిన మైనారిటీ సభ్యులే ఆ నిర్ణయాన్ని చేస్తారు. వీరే ప్రజలకు నాయకత్వం వహిస్తారు. గాసెట్ వీరిని కులీనులుగా (Aristocrats) పేర్కొన్నారు. వీరు అసమర్థులైనప్పుడు, అవినీతికి పాల్పడ్డప్పుడు ప్రజలు వీరిపై తిరుగుబాటు చేస్తారు. ఈ తిరుగుబాటు లక్ష్యం కులీన పాలనను వ్యతిరేకించటంకాదు. ఇంతకంటె ఎక్కువ సామర్థ్యం గల కులీన పాలన ఏర్పాటు ప్రధాన లక్ష్యంగా ఉంటుంది. ఎక్కడైతే సమష్టి జన సమూహంపై అల్పసంఖ్యాకుల వర్గం ప్రభావం ఉండదో అక్కడ సమాజం ఉండదని గాసెట్ అభిప్రాయం. ఒకదేశపు జనసామాన్యం కులీన పాలన లేకుండా తమంతట తాము తమ పనులు నిర్వహించుకోగలమని అనుకున్నట్లయితే ఆజాతి తప్పనిసరిగా క్షీణిస్తుందన్నారు. వారి భ్రమలు తొలగిపోవటంతో జన సమూహం (Mass) కొత్త నాయకత్వం వైపు మొగ్గు చూపుతుందని; ఫలితంగా కొత్త కులీన పాలన ఏర్పడుతుందని గాసెట్ అన్నారు.

## 8.4.5 కారల్ మార్క్స్

ప్రతి సమాజంలోను రెండు వర్గాలుంటాయని మార్క్స్ భావన. ఒకటి పాలకవర్గం, రెండవది పాలిత వర్గం. ప్రధాన ఆర్థిక ఉత్పత్తి సాధనాలన్నీ పాలకవర్గం చేతిలో ఉంటాయి. వీరికి సైనిక బలాలపై నియంత్రణ ఉంటుంది. తద్వారా పాలకవర్గం రాజకీయ ఆధిపత్యం రాజకీయ ప్రభావాన్ని కలిగి ఉంటుంది. పాలక, పాలిత వర్గాల మధ్య నిరంతరం పోరాటం జరుగుతూ ఉంటుంది. పెట్టుబడిదారీ సమాజాలలో వర్గ పోరాటం ప్రారంభమవుతుంది. పెట్టుబడిదారీ సమాజంలో సంపద ఒకచోట దారిద్ర్యం మరొక చోట కేంద్రీకృతమై ఉంటాయి. శిష్ట వర్గ నియంతృత్వ పాలనకు శ్రామిక వర్గ నియంతృత్వ మొక్కటే ప్రత్యామ్నాయమని మార్క్స్ పేర్కొన్నారు. ధనిక, పేద వర్గాల మధ్య కొనసాగే వర్గ పోరాటం శ్రామిక వర్గ విజయంతో అంతమౌతుంది. ఫలితంగా వర్గ రహిత సమాజం అవతరిస్తుంది.

మార్క్స్ పాలక వర్గ సిద్ధాంతాన్ని చాలామంది శిష్టవర్గ సిద్ధాంత కర్తలు విమర్శించారు. పరేటో, మోస్కాలు చారిత్రక మార్పులను ఆర్థికపరంగా, వ్యాఖ్యానించలేమని మార్క్స్ వాదాన్ని విమర్శించారు. కాని మార్పులకు ఆర్థికాంశాలు ఒక్కటే కారణమని మార్క్స్ ఎన్నడూ చెప్పలేదు. మార్పులను ఆర్థిక పరంగా చక్కగా వివరించవచ్చునని మాత్రమే మార్క్స్ పేర్కొన్నారు. సామాజిక మార్పులకు ఆర్థికేతర కారణాలు కూడా మూలకాలని విమర్శకుల అభిప్రాయం. రేమండ్ ఆరన్ సామ్యవాద సమాజంలో ఒక్క శిష్ట వర్గం (One Elite) మాత్రమే అధికారంలో కొనసాగుతుందన్నారు. శిష్ట వర్గ వాదానికి మార్క్సిజానికి మధ్య తీవ్రమైన విభేదాలు ఉన్నప్పటికీ జేమ్స్ బరన్‌హోమ్ తనగ్రంథంలో ఇవి రెండూ పరస్పర భంజకాలని, రెండింటిని కలుపవచ్చని నిరూపింప ప్రయత్నించారు. కొన్ని విషయాలలో బరన్‌హోమ్ దృక్పథం మార్క్స్ దృక్పథాన్ని పోలి ఉంటుంది. ఆయన దృష్టిలో శిష్టుల బలం, శక్తి వారికి ప్రధానమైన ఉత్పత్తి, పంపిణీలపై గల నియంత్రణాధికారం మీద ఆధారపడి ఉంటుంది. ఆర్థిక ఉత్పత్తి సాధనాలపై వారికి గల అధికారమే వారిని అధికార పీఠం మీద కూర్చోబెడుతుంది. ఏసమాజంలోనైనా ఎవరికి ఆదాయం ఎక్కువ ఉన్నదో గ్రహించినట్లయితే పాలకవర్గాన్ని సులభంగా గుర్తించవచ్చు. బరన్‌హోమ్ పెట్టుబడిదారీ వ్యవస్థను సమర్థించటమే లక్ష్యంగా పెట్టుకొన్నాడు. కేవలం ఉత్పత్తి సాధనాల మీద నియంత్రణను శిష్టవర్గానికి ప్రాతిపదికగా ఎంచుకొన్నాడు. ఆయన దృష్టిలో పెట్టుబడిదారీ వ్యవస్థ క్షీణదశలో ఉన్నది. దాని స్థానంలో వ్యవస్థా నైపుణ్యంగల మానేజర్ల శిష్టవర్గం అధికారాన్ని స్వీకరిస్తుంది. శిష్టవర్గంలోని మార్పుల వల్లనే సమాజంలో మార్పులు సంభవిస్తుంటాయి.

BRAOU

## 8.4.6 సి. రైట్ మిల్స్

సి. రైట్ మిల్స్ శిష్ట వర్గపుస్థాయి, స్వభావాన్ని, సామాజిక ఆర్థిక నిర్మితులు సందర్భంలోనే వివరించ సాధ్యమవుతుందన్నారు. సామాజిక వ్యవస్థనుండే శిష్ట వర్గం అవతరిస్తుంది. ఆధునిక సమాజాలలో శక్తి (Power) వ్యవస్థీకృత రూపాన్ని ధరించింది. సామాజిక నిర్మాణంలోని కొన్ని సంస్థలలో ఉన్నతస్థాయి పదవుల నలంకరించిన అధికారులను శిష్టవర్గంగా వ్యవహరిస్తున్నారు. ఆజ్ఞలు ఇచ్చే స్థాయినిబట్టి శిష్టవర్గపు స్థాయిని నిర్ణయించవచ్చు. రైట్ మిల్స్ అమెరికాలోని కార్పొరేట్ అధిపతులు, రాజకీయనాయకులు, సైన్యాధ్యక్షులు, మొదలగు వారిని ప్రధాన శిష్టులుగా పేర్కొన్నారు. వీరి మధ్య సామాజిక, సన్నిహిత వ్యక్తిగత, కుటుంబ సంబంధాలు ఉంటాయి. ఈ మూడు రంగాలలోని శిష్టులమధ్య తరచుగా అంతర్గత మార్పిడులు జరుగుతుంటాయి. శిష్టవర్గం జనసామాన్యం తరపున ముఖ్యమైన నిర్ణయాలను చేస్తుంటుంది.

## 8.4.7 లాస్‌వెల్

ప్రభావ, ప్రభావితుల అధ్యయనమే రాజకీయాల అధ్యయనమని లాస్‌వెల్ నిర్వచించారు. అనుభవించటానికి గల దానినంతా పొందశక్తి గలవారే ప్రభావ పరచేవారు. వ్యక్తులు తమకు కావాలని కోరే దానిని లాస్‌వెల్ విలువగా గుర్తించారు. భేదము, ఆదాయం, రక్షణలను ఆయన ప్రాథమిక విలువలన్నారు. ఈ విలువలను ఎక్కువగా అనుభవించేవారిని శిష్టులంటున్నారు. మిగతా వారినందరినీ కలిపి ప్రజాసమూహమంటున్నారు. శిష్టవర్గాన్ని నైపుణ్యతల పరంగా కూడా గుర్తించవచ్చు. హింస, వస్తువులు, సంకేతాల లాంటి అనుకూల పరచుకొనే పద్ధతులు శిష్టుల అదృష్టాన్ని నిర్ణయిస్తాయి. స్థిరమైన క్రమపు సంకేతమే సిద్ధాంతం. వ్యతిరేకించేవారి భావాలను వారు ఊహాలంటారు. అంగీకృత పదాలైన, నినాదాలు, సంకేతాలద్వారా శిష్టులు శ్రమ, పన్నులు, రక్తం, చప్పట్లు, హర్షామోదాలు పొందుతుంటారు. తమకు రక్షణ, ఇతరులపై పెత్తనం చేసే విషయాలలో హింసపై ఆధారపడుతుంటారు. సంపదను సమకూర్చలేనప్పుడు శిష్టులు ఆంతరంగిక విమర్శలకు గురౌతుంటారు. వస్తువుల కొరత, ధరల పెరుగుదలల మీద శిష్టుల రక్షణ ఆధారపడి ఉంటుంది. అందువల్లనే శిష్టులు ధరలు, వస్తువుల సరఫరాలమీద నియంత్రణను నెలకొల్పుతుంటారు. విప్లవాల ద్వారా శిష్టవర్గంలో మార్పులు సంభవిస్తుంటాయి. లాస్‌వెల్ శిష్టభావాన్ని పెట్టుబడిదారీ దేశాలు, కమ్యూనిస్టుదేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాలలోను పరిశీలించారు.

## 8.4.8 థామస్ డై, హర్మన్ జిగ్లర్

వీరు శిష్ట వర్గ సిద్ధాంతం, ప్రభుత్వ విధానాల గురించి ఈ విధంగా పేర్కొన్నారు. సమాజంలో ప్రాబల్య కొద్దిమంది, ప్రాబల్యం లేని చాలామంది ఉంటారు. కేవలం కొద్ది మంది మాత్రమే సమాజం కొరకు విలువలను పంపిణీ చేస్తారు. ప్రజాసమూహం ప్రభుత్వ విధానాలను నిర్ణయించలేదు. శిష్ట వర్గానికి సమాజంలో ఉన్నత స్థాయి, సాంఘిక, ఆర్థిక హోదాలు ఉంటాయి. సమాజంలో విప్లవాలను నివారిస్తూ, స్థిరత్వాన్ని కొనసాగించాలంటే శిష్ట వర్గ చక్రభ్రమణం నెమ్మదిగా నిరంతరం కొనసాగుతుండాలి. శిష్ట వర్గాన్ని అంగీకరించిన ప్రజలు పాలితులుగా కొనసాగుతారు. సామాజిక వ్యవస్థ మౌలిక విలువలు, వ్యవస్థ కొనసాగింపులు శిష్టులు భాగస్వాములవుతారు.

BRAOU

## 8.4.9 రాబర్టు ధాల్

రాబర్టు ధాల్ తన "ఎవరు పరిపాలిస్తున్నారు" (Who Governs) అన్న గ్రంథంలో నిర్ణయ కల్పన దృక్పథాన్ని వివరించాడు. ప్రజాస్వామ్యవ్యవస్థలలో ఎవరు పాలిస్తున్నారు అన్న విషయంలో వివిధ పరికల్పనలను (Hypothesis) ధాల్ పరిశీలించారు. సమాజంలో ప్రభావాల, వనరుల పంపిణీలలో అసమానతలున్నాయ న్నారు. సంపద స్థాయి, ఉన్నతస్థితి గలవారే రాజ్యశక్తిని ఉపయోగిస్తున్నరని ధాల్ భావన. ఈ పరికల్పనలను పరిశీలించటానికి ధాల్ సమాజంలోని కొన్ని రాజకీయ నిర్ణయాలను పరిశీలించప్రయత్నించారు. ఇందుకు ఆయన న్యూహెవెన్ సొసైటీ (New Heaven Society) ని ఎంచుకొన్నారు. ఆయన శిష్టుల ప్రభావ రంగాలను పరిశీలించటానికి మూడు రకాలైన సమస్యావేదికలను ఎన్నుకొన్నారు. పట్టణ అభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలలు, రాజకీయ నామినేషన్లు అనే మూడు సమస్యావేదికలలోని నిర్ణయ కల్పన ప్రక్రియను పరిశీలించారు. ప్రతి సమస్యలోను కల వివిధ అంశాలపై జరిగిన నిర్ణయాలను విశ్లేషించారు. ప్రజాస్వామ్యం అప్రధానమన్న కొన్ని విషయాలను; నాయకులు అప్రధాన మనుకొన్న కొన్ని విషయాలను ఆయన చర్చించారు. చివరకు ధాల్ మూడు రకాలైన నాయకులను గుర్తించారు. (1) రాజకీయ వాదులు, (2) సమాజపు గుర్తింపును పొందిన నాయకులు; (3) ఆర్థిక గుర్తింపును పొందిన నాయకులు. పైన వివరించిన మూడు రకాలైన నాయకులు నిర్ణయ కల్పన ప్రక్రియలో ఏ విధమైన పాత్రను నిర్వహిస్తారో ధాల్ తన అధ్యయనాలలో చర్చించారు.

నిర్ణయ కల్పన ప్రక్రియ బహుత్వ మార్గంలో ఉంటుందని థాల్ భావించారు. దీనినే ఆయన పాలియార్కీగా (Polyarchy) పేర్కొన్నారు. పాలియార్కీ లో మైనారిటీ గ్రూపులు అధిక సంఖ్యలో ఉంటాయి. రాజకీయ వనరుల పంపిణీ సమానంగా ఉండదు. కొన్ని గ్రూపులకు తక్కిన వారికంటే ఎక్కువ ప్రభావం ఉంటుంది. సమాజంలోని ప్రతివారు హక్కులను సమానంగా అనుభవిస్తారు. అధికారం కోసం పోటీ పడే శిష్టులు మైనారిటీ గ్రూపుల ప్రజల కోరికలను విస్మరింపలేరు. అందు వల్ల శిష్టులు సమాజంలో అందరికీ ఆమోద యోగ్యమైన కార్యక్రమాలనే చేపట్టుతారు. పాలియార్కీలో రాజకీయ భాగస్వామ్యం సమానంగా ఉండదు. ఓటింగ్ హక్కును ఉపయోగించటం ద్వారా ప్రజలు పరోక్షంగా రాజకీయాలను ప్రభావ పరుస్తారు. రాజకీయ చైతన్యం వృద్ధి చెందటం వల్ల ప్రతి మైనారిటీ గ్రూపు అభిప్రాయాలను శిష్టులు మన్నించాల్సి ఉంటుంది. మెజారిటీ సంఖ్యలో గల ప్రజలు రాజకీయాలలో చురుకుగా పాల్గొనరు. కాని మెజారిటీ ప్రజలు ప్రభావం లేనివారని భావించవీలులేదు. రాజకీయ సమాజంలోని ప్రతి గ్రూపు ప్రభుత్వ నిర్ణయాలను ప్రభావ పరచగల స్థితి యందుంటుంది. రాజకీయ ప్రక్రియలలో కొన్ని విషయాలపై నియంత్రణాధికారం కలిగి ఉన్నవారినే శిష్టులని పిలుస్తున్నారు.

## 8.6 శిష్ట సిద్ధాంతం - ప్రజాస్వామ్యం

శిష్ట వర్గ భావ సిద్ధాంతాలన్ని ప్రజాస్వామ్య భావనకు ప్రాతిపదిక అయిన ప్రజల చేతుల్లో అధికారం ఉంటున్నదని విషయాన్ని వ్యతిరేకిస్తున్నాయి. ప్రజలు పరిపాలకులనే భావం కేవలం ఒక భ్రమ మాత్రమేనని, ప్రభుత్వస్వరూపం ఏదైనప్పటికీ కార్యసాధకపాలకులెప్పుడూ పరిమిత సంఖ్యలో ఉండే శిష్టులేనని పరేటో, మోస్కా ప్రభృతులు అభిప్రాయ పడ్డారు. అధిక సంఖ్యలోని ప్రజలు ప్రజాస్వామ్యంలో ప్రభావ పరచటం ఏ విధంగా చూచినా అసంభవమేనని వారి ఉద్దేశ్యం. పరేటో, మోస్కాల తరువాత శిష్ట వర్గ సిద్ధాంత కర్తలు రాజకీయ శిష్టవర్గ సిద్ధాంతంతో రాజీపడే నూతన ప్రజాస్వామ్య సిద్ధాంతాన్ని రూపొందించ ప్రయత్నించారు. వీరు "ప్రజాస్వామ్యం" అనే రాజకీయ వ్యవస్థను రూపొందించారు. ఈ రాజకీయ వ్యవస్థలో రాజకీయ పార్టీలు ప్రజల ఓట్లకై పోటీ పడతాయి. ఇందులో శిష్టులు సాపేక్షికంగా బహిర్గతంగా ఉంటూ మెరిట్ ఆధారంగా భర్తీ అవుతారు. జనసమూహం వివిధ ప్రత్యర్థి శిష్టుల మధ్య తమ ఎంపికను (Choice) ఉపయోగించుకుంటూ రాజ్యపాలనలో పాల్గొంటుంది. శిష్టవర్గ సిద్ధాంతానికి, ప్రజాస్వామ్యానికి మధ్య రాజీ కుదర్చటంలో కారల్ మానహీమ్ (Karl Mannheim 1893 - 1947) ప్రధాన పాత్ర వహించారు. విధాన రూపకల్పన శిష్టుల చేతిలో ఉన్నంత మాత్రాన అది ప్రజాస్వామ్య సమాజం కాదనడానికి వీలు లేదన్నాడు. ప్రజాస్వామ్యప్రభుత్వంలో ప్రజలు అన్నివేళలా ప్రత్యక్షంగా పాల్గొనలేకపోయినా వారి ఆశయాలను (Aspirations) గుర్తించే అవకాశాలు ఉన్నాయి............ ప్రజాస్వామ్యంలో పాలితులు వారి నాయకులను తొలగించవచ్చు లేదా అధిక సంఖ్యాకుల ఆసక్తులకను కూలంగా నిర్ణయాలు చేసేటట్లు నాయకుల మీద ఒత్తిడి కలుగ చేయవచ్చు. రాజకీయాధికారం ఎల్లప్పుడూ అల్పసంఖ్యాకులైన శిష్టుల చేతనే నిర్వహింపబడుతుందన్న పరేటో అభిప్రాయంతో ఏకీభవిస్తూ మిచెల్స్ అల్ప జనపాలనను పార్టీ నిర్వహణగా రూపొందిస్తూ శిష్ట వర్గ సిద్ధాంతానికి, ప్రజాస్వామ్యానికి మధ్య అసంగతంలేదని ఆయన పేర్కొన్నారు. సంపూర్ణాధికార వాదానికి ప్రజాస్వామ్యానికి మధ్య విభేదం కేవలం మొదటిదానిలో కొద్దిమంది మాత్రమే నియంతలుగా పాలిస్తారు. ప్రజస్వామ్యంలో నాయకులు నియంతలైతే ప్రజలే వారిని తొలగిస్తారు. లేదా తమ ఆసక్తులకనుగుణంగా నిర్ణయాలు జరిగేటట్లు నాయకులపై ఒత్తిడి చేస్తారు.

జోసెఫ్ షుంపీటర్ (Joseph Schumpeter 1883 - 1950) "పెట్టుబడి దారీ వ్యవస్థ, సామ్యవాదం, ప్రజా స్వామ్యం" అనే గ్రంథంలో ప్రజాస్వామ్యం పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో ఉద్భవించి, దానితో సంబంధం

కలిగి ఉంటుంది కనుకనే ఆ పరిస్థితుల దృష్ట్యా (Context) అర్థం చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్య సమాజంలో ప్రజల పాత్ర పాలించటం కాదు. లేదా ప్రధాన రాజకీయాంశాలపై సాధారణ నిర్ణయాలు తీసుకోవడం కాదని షుంపీటర్ వివరించారు. ప్రభుత్వాన్ని రూపొందించటమే ఓటర్ల పాత్ర. అది జాతీయ కార్యనిర్వాహక వర్గాన్ని ఏర్పరుస్తుంది. షుంపీటర్ అభిప్రాయంలో ప్రజాస్వామ్యం అంటే "ప్రజల ఓట్ల కోసం పోటీ పడే రెండు లేదా అంతకంటె ఎక్కువ సంఖ్యలో గల రాజకీయ పార్టీలు ఎన్నికలలో ప్రజల మద్దతు పొంది మరల ఎన్నికలదాకా పాలనాధికారాన్ని నిర్వహించే యంత్రాంగం." లేదా ప్రజల ఓట్ల కోసం పోటీపడి ఎన్నికలద్వారా నిర్ణయ శక్తిని పొందే వ్యక్తులు తిరిగి ఎన్నికలు వచ్చే దాకా రాజకీయ నిర్ణయాలు చేసే వ్యవస్థా పద్ధతి. తమకోసం నిర్ణయం తీసుకోనే వ్యక్తులను ఎన్నుకోవడమే ఓటర్ల పాత్ర. ప్రజలు రాజకీయంశాలను నిర్ణయించటం లేదా ఆ నిర్ణయాలను అమలు పరిచే ప్రతినిధులను ఎన్నుకోవటంలేదు. షుంపీటర్ మిచెల్స్ కంటే ఇంకా ముందుకు వెళ్ళి రాజకీయాధికారాన్ని నిర్ణయించే అంశాలు ఏ విధంగా ఎందుకు రాజకీయ సార్వభౌమాధికారాన్ని పరిహాసం చేస్తుందో వివరించారు. ప్రజాస్వామ్య ప్రక్రియ పోటీ పరిస్థితులలో ఉండి, ప్రజాప్రాధాన్యతలకు అవకాశం కల్పిస్తూ తద్వారా వ్యక్తులు విధాన రూపకల్పన చేసే అధికారాన్ని పొందుతారని ఆయన పేర్కొన్నారు. షుంపిటర్ ప్రజాస్వామ్యాన్ని "రాజకీయ వేత్తల పాలన" గా భావించారు. ఒక సారి ఎన్నికైన తరువాత, పౌరులనుండి అతి స్వల్పజోక్యంతో మాత్రమే తమకప్పగించిన పాలనా భాధ్యతను నిర్వర్తించటానికి రాజకీయనాయకుల్వాన్ని అనుమతించాలని షుంపీటర్ అభిప్రాయ పడ్డారు. ప్రజాస్వామ్యంలో పౌరుని పాత్ర రాజకీయ నాయకులను అంగీకరించటం లేదా తిరస్కరించటం మాత్రమేనన్నారు. ప్రజాస్వామ్యంలో ఆయననైతికతకు తావులేదన్నారు. ఆయన దృష్టిలో ప్రజాస్వామ్యం మార్కెట్ యంత్రాంగం వంటింది. అందులో ఓటర్లు వినియోగదారులు, రాజకీయ నాయకులు, నిర్వాహకులు. షుంపీటరు దృష్టిలో రాజకీయ ప్రక్రియ విశ్లేషణలో మనం నిజమైన (Genuine) ఇచ్ఛతో గాక కృతకమైన ఇచ్ఛతో విభేదిస్తాం. ప్రజలు సమస్యలను రేకెత్తించరు. నిర్ణయించరు. వారి అదృష్టాన్ని మలచటానికి వారి తరుపున నిర్ణయాలు తీసికొంటారే కాని అవి నియోజకుల ఇష్టానిష్టాలపై ఆధారపడవు. ఆర్థిక శాస్త్రవేత్తలు మార్కెటింగ్ వ్యవస్థను రాజకీయ రంగానికి అన్వయించారు. చాలామంది రాజనీతి శాస్త్ర వేత్తలు అనుభవవాద పరిశోధనల (Empirical Investigation) ద్వారా పాశ్చాత్య ప్రజాస్వామ్య దేశాల్లో ఓటర్ల ప్రవర్తన, వారి ప్రవర్తనకు రాజకీయ వ్యవస్థ స్పందన విషయాలను విశ్లేషించారు.

ఆంథోని డౌన్స్ (Anthony Downs) ఆర్థిక శాస్త్రవేత్త, ప్రజాస్వామ్యాన్ని ప్రజాస్వామ్య ఆర్థిక సిద్ధాంతం (The Economic Theory of Democracy) గా వర్ణించారు. ఆయన ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థలలోని రాజకీయ పార్టీలను లాభాలు ఆర్జించే ఆర్థిక వ్యవస్థల నిర్వాహకులతో పోల్చారు. లాభాన్ని పొందటానికి రాజకీయ పార్టీలు, నిర్వాహకులు, తమ తమ విధానాలను రూపొందించుకొంటారు. అత్యధిక లాభాలను పొందటానికి వాణిజ్య వ్యవస్థల నిర్వాహకులు వస్తూత్పత్తులను చేసినట్లుగా రాజకీయ పార్టీలు అత్యధిక ఓట్లపొందటానికి అనువుగా తమ తమ విధానాలను రూపొందించుకొంటాయి. వివిధ సమూహాలు వ్యక్తులు ప్రజా మద్దతుకు వివిధ మార్గాలను అన్వేషించినట్లే వివిధ రాజకీయ పార్టీలు ఏర్పడి ప్రజల మద్దతు పొందటానికి పోటీపడుతుంటాయి. ఇది శిష్టుల బహుత్వానికి దారితీసి, ప్రజాస్వామ్య సమాజాలలో ఒకరకమైన నిరోధ సమతౌల్య వ్యవస్థ ఏర్పాటుకు దోహదం చేస్తుంది. అన్ని రకాలైన వృత్తుల ఆధారంగా వృత్తిపరమైన రాజకీయ సంఘాలు ఏర్పడి ప్రభుత్వాన్ని Business of Compromises గా మార్చి వేస్తాయి. వివిధములైన శిష్టులు, ఉత్పత్తి సాధనాలను స్వాధీన పరచుకొన్న నిర్వాహకులు, కార్మిక సంఘాల నాయకులు తమ తమ అసోసియేషన్లును ఏర్పరచుకొని తమ సభ్యుల ఆసక్తులను కాపాడుకోవటానికి ప్రయత్నిస్తారు.

షుంపీటర్, డౌన్స్ ప్రధానంగా ఆర్థిక శాస్త్రవేత్తల వలెనే రాజనీతి శాస్త్రవేత్తలైన హెరాల్డ్ లాస్వెల్,

BRAOU

రాబర్టు థాల్, వలె ప్రజాస్వామ్యపు శిష్టవర్గ భావనను ధృఢంగా బలపరచారు. లాస్‌వెల్ శిష్ట వర్గ సామర్ధ్యం Manipulative Functions గా నొక్కివక్కాణించారు. వీరు శాస్త్రీయ విధాన రూపకల్పనకు ప్రాధాన్యమిచ్చారు. థాల్, సర్టోరి ప్రజాస్వామ్యాన్ని పాలియార్కీతో పోల్చారు. వీరి వాదన ప్రకారం పాలి యార్కీ అనగా విధాన రూపకల్పన చేసే మైనారిటీ సంఖ్యగల వారికి, ఆ విధానాలవల్ల ప్రభావితమయ్యే వారికి మధ్య స్వేచ్ఛా పరమైన పోటీ లక్షణంగా గల రాజకీయ వ్యవస్థ. స్వేచ్ఛా యుత పోటీల వల్ల రెండు వర్గాల మధ్య సఖ్యత ఏర్పడగల అవకాశాలున్నాయని రాబర్టు థాల్ పేర్కొన్నారు. సార్టొరి ప్రకారం ప్రజాస్వామ్యం అనగా మెజారిటీ సంఖ్యలో గల ప్రజల ఆసక్తులకు హామీ ఇస్తూ, ఆ బాధ్యతను నిర్వహించటకు ఎన్నికైన మైనారిటీ సంఖ్యలో సభ్యులుగల రాజకీయ వ్యవస్థ. ఎన్నికలైపోయాక ప్రజలు ప్రక్కకు నెట్టి వేయబడతారు.

షుంపీటర్ ప్రజా స్వామ్యనమూనాను "రాజకీయ మార్కెట్ వ్యవస్థ" అన్న పేరుతో సమర్ధించారు. ఈ వ్యవస్థ రాజకీయ వస్తువుల సప్లయి, డిమాండల అభిలషణీయ సమతౌల్యానికి దారితీసి తద్వారా పౌర వినియోగ సార్వభౌమాధికారాన్ని ఏర్పరస్తుంది. కాని ఈ సమతౌల్యం అసమానతల సమతౌల్యాన్ని ఏర్పరచి వినియోగదా రుని సార్వభౌమాధికారాన్ని భ్రమగా మార్చుతూ ప్రజాస్వామ్య సూత్రమైన సమానత్వాన్ని అనుభవించకుండా చేస్తుంది. ఆర్థిక వ్యవస్థ డిమాండ్‌కి రాజకీయ మార్కెట్ వ్యవస్థకు స్వామ్యం ఉంది. కోనుగోలు శక్తి అనగా డబ్బుసంపాదించటం రాజకీయాలలో పార్టీలు, వ్యక్తులు ఎన్నికల ప్రచారానికి కావలసిన సాధన సంపత్తులు సమకూర్చుకోవటానికి కూడా డబ్బుకావాలి. సంపదలో అసమానతలు, సంపదను పోగుచేసుకోవడానికి గల అవకాశాలు, వినియోగదారుని సార్వభౌమాధికారంలో గల అసమానతలు వాస్తవంలో వినియోగదారుల పేదవారినిగా చేస్తాయి. ఉన్నతస్థాయి నందుకున్న సామాజిక, ఆర్థిక వర్గాలే ప్రభావవంతమైన డిమాండ్లు చేయుగలవు. సామాజిక, ఆర్థిక అసమానతలు పేద ప్రజలలో రాజకీయాల పట్ల అనాసక్తతను కల్పిస్తాయి.

BRAOU

రాజకీయ శిష్ట వాదానికి, ప్రజాస్వామ్యానికి రాజీకుదిర్చే ఈ ప్రయత్నం వికృతరూపం దాల్చిన ప్రజాస్వామ్యంపై ఆధారపడిందా? ప్రజాస్వామ్యం గురించి పరేటో, మోస్కా, మిచెల్స్, మాన్‌హీం. షుంపీటర్, డౌన్స్, లాస్‌వెల్, థాల్, సర్టొరిలు ఎలాంటి వ్యాఖ్యానాలు చేసినప్పటికీ, సాంప్రదాయకంగా ప్రజాస్వామ్యాన్ని రాజకీయ హక్కులు సామాజికవిధానాలను ప్రభావ పరచగల అధికారం ప్రజలకు ఉంది; వాస్తవంలో వాటిని తోసి పుచ్చే నిరంతర ప్రక్రియ అని పేర్కొనవచ్చు. మరోరకంగా చెప్పాలంటే సమాజంలో ధనిక వర్గం, కులీనుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా వర్గాల రాజకీయ ఉద్యమం. రెండవప్రపంచయుద్ధం తరువాత సైద్ధాంతికులు ప్రజాస్వామ్యాన్ని నిర్ణీత వ్యవధి ఎన్నికలు ద్వారా అనుమతి పొందిన శిష్ట వర్గ పాలన కలిగిన స్థిరమైన రాజకీయ వ్యవస్థతో పోల్చారు. ఏది ఏమైనప్పటికీ సాంప్రదాయిక ప్రజాస్వామ్య భావన అయిన వ్యవస్థీ కృత రాజకీయ పార్టీలు, వ్యవస్థీకృత శిష్ట వర్గ సమూహాలు ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడకు సరిపోతాయని కాని అవసరమనికాని భావించ వీలులేదు. ఉత్తమమైన ప్రజాస్వామ్యరాజ్యం వర్గ రహిత సమాజం వైపుకు పయనించాలి. సామాజిక వర్గాలు అంతరిస్తే రాజకీయ పార్టీల అవతరణకు కూడా తెరపడుతుంది. కారల్ మాన్ హీమ్ దృష్టిలో పౌరుల ఆశయాలను కొన్ని ప్రత్యేక సమయాలలోనే గుర్తించే అవకాశం గల ప్రజాస్వామ్యం సరైందికాదు. షుంపీటర్, ఆరన్ మొదలైనవారు ప్రజాస్వామ్యం విజయవంతం కావటానికి కావలసిన పరిస్థితులు వివరించ ప్రయత్నించారు. కాని వారు వివరించిన పరిస్థితులు పాశ్చాత్య ప్రజాస్వామ్య సమాజాలలో సహితం లేవు. పాశ్చాత్య ప్రజా స్వామ్యాలలో పాలకవర్గాలు సాంప్రదాయిక ఉన్నత వర్గాల నుండే భర్తీ అవుతున్నాయి. అరిస్టాటిల్ పేర్కొన్నట్లు కొందరు పరిపాలించటానికి మరికొందరు పాలింపబడటానికి జన్మిస్తారన్నట్లు ఉన్నత వర్గాల వారికే పాలనాధికారం ప్రాప్తిస్తుంది. రాజకీయ శిష్ట వర్గ సిద్ధాంతాన్ని, ఆధునిక ప్రజాస్వామ్యాన్ని సంలీన పరచ ప్రయత్నించటం రెండు వర్గాల మధ్య ఉండే మౌలిక సంఘర్షణను తొలగించటకు చేయు ప్రయత్నం వంటిది. సంపద ఆదాయాలలో పౌరుల మధ్య సమానత్వం

సాధించకుండా, సార్వత్రికవిద్య, పాలక వర్గాల జీవన ప్రమాణాలలో పొదుపు సాధించటం వల్ల సక్రమమైన ప్రజాస్వామ్యం సాధించవచ్చుననటం ఆశ్చర్యం కలిగిస్తుంది.

## 8.6 విమర్శనాత్మక పరిశీలన

మార్క్సిజానికి వ్యతిరేకంగా శిష్టవర్గ సిద్ధాంతం రూపొందింది. శిష్టవర్గ సిద్ధాంతంలోనూ కొన్నిలోపాలు ఉన్నాయి. శిష్ట వర్గ సిద్ధాంత కర్తలు మార్క్సిజంలోని వర్గపోరాటానికి ప్రత్యామ్నాయాన్ని సూచించటంలో విఫలమయ్యారు. మార్క్సియన్ సిద్ధాంతానికి ప్రతిగా శిష్టసిద్ధాంతం రూపుదిద్దుకొంది. అది మధ్య తరగతి వారి రాజకీయ సిద్ధాంతం (A political theory of middle class). ఈ రాజకీయ సిద్ధాంతం ప్రజా ప్రభుత్వమనే ప్రజాస్వామ్య సూత్రానికి విరుద్ధమైనది. ప్రజాస్వామ్యం ధనిక, లేదా, కులీన వర్గాల ఆధిపత్యానికి వ్యతిరేకంగా సమాజంలోని పేద వర్గాల ఉద్యమం. 20వ శతాబ్దపు సైద్ధాంతికులు నిర్ణీత వ్యవధి ఎన్నికల ద్వారా శిష్ట పాలనకు అనుమతి నిచ్చే స్థిర రాజకీయ వ్యవస్థలో ప్రజాస్వామ్యాన్ని గుర్తించారు. మార్క్సియన్ దృక్పథంలో లోపాలు ఉండవచ్చు కాని సామాజిక మార్పుకు ప్రాబల్య శిష్టవర్గ సిద్ధాంతం సంతృప్తి కరమైన వివరణగా అంగీకరించటం కష్టమైన పని. శిష్టులు ప్రాబల్యం, శక్తి అను భావనలను తప్పుగా అర్థం చేసుకొన్నారు. ప్రాబల్యం, శక్తి, అధికారం, ప్రభావం పదాల మధ్యగల తేడాలను వారు గుర్తించలేదు. న్యాయ బద్ధత భావనకు అధికారంతో అవినాభావ సంబంధం ఉంది. వత్తిడుల ద్వారా, ప్రజలను భయపెట్టడం ద్వారా ప్రాబల్యాన్ని చెలాయించవచ్చుకాని ప్రజలు శాసన బద్ధమైన శక్తిని మాత్రమే అంగీకరిస్తారు. శక్తి శిష్టులలో ఒక్కరికే గాక వివిధ శిష్టులకు వివిధ రూపాల్లో లభిస్తుంది.

BRAOU

రహస్య రాజకీయాలను తారు మారు చేసే ఉనికిని అమలు పరచటాన్ని శిష్ట వర్గ సిద్ధాంతం సమర్థిస్తుంది. దీని పట్ల అవగాహన వల్ల మనం ఆధునిక యుగపు తొలి దినాల్లో మాకియవెల్లీ, థామస్‌హాబ్స్ చెప్పినదానికి సన్నిహితంగా వెళతాం. మహాత్మాగాంధీ చెప్పిన ఉత్తమ రాజకీయాలను మనం విస్మరించేటట్లు చేస్తుంది. అన్ని వేళాలా మనం రాజకీయలనుండి నైతిక, ఆధ్యాత్మిక, మానవీయ అంశాలను వేరు చేయలేం. ఒక వేళ శిష్ట రాజకీయాల నమూనాను ఒక్క దానినే అమలుపరిచినట్లయితే ఉత్తమ జీవిత సిద్ధి అందులో సాఫల్యం ఉండదు. అధికారంలో ఉన్ననాయకునికి, అతని అనుచరులకు మధ్య శిష్ట వర్గ సిద్ధాంతం తప్పుడు సంబంధాన్ని వివరించింది. నాయకుడు అతని అనుచరులకు మధ్యగల సంబంధాలలో Motivations పాత్రను పరిగణనలోనికి తీసుకోలేదు. సామాజిక రాజకీయ విశ్లేషణలలో ప్రాబల్య శిష్టవర్గం భావనలు పద్ధతులు తప్పనిసరే, కాని ప్రాబల్యస్థాయిని, ప్రాబల్యపురకాన్ని అంచనావేయడంలోను, విశ్లేషించటంలోనూ శిష్ట వర్గ వాదన్ని ఒక భావనగా ఉపయోగిస్తున్నారు.

వీటిన్నింటి మించి సాంప్రదాయిక ప్రజాస్వామ్యవాదులు శిష్టవర్గవాదంతో ఏకీభవించరు. విధాన నిర్ణయాలలో అల్పసంఖ్య కలవారి ఇచ్ఛయే పరిగణింపబడుతుందని మెజారిటీ ప్రజల ఇచ్ఛ వట్టి భ్రమ అనే శిష్ట వర్గం వాదంతో ప్రజాస్వామ్యసిద్ధాంతం ఏకీభవించదు. శిష్టుల ఉనికిని పాత్రను విస్మరించరు కాని ఎన్నికైన కొద్ది మంది ఇష్టానికే అధిక ప్రాముఖ్యత ఉంటుందనే వాదాన్ని ఖండిస్తారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో వ్యక్తుల ప్రాధాన్యతలు బహిర్గతంగా ఉంటుయి. ఈ ప్రాధాన్యతలు వ్యక్తులను సంప్రదించటం, బేరమాడటం అనే అంశాలమీద ఆధారపడి ఉంటాయి. ఇన్ని విమర్శలున్నప్పటికీ అనుభవవాద రాజకీయ శాస్త్రరంగంలో శిష్టవర్గ సిద్ధాంత అనుగుణ్యత ( Relevance) ను విస్మరింపలేం. ఈ సిద్ధాంతం సహాయంతో ప్రపంచ సంఘటనలను విశ్లేషించవచ్చు. సామాజిక దృగ్విషయాలను పరిశీలించడానికి శిష్ట వర్గ సిద్ధాంతాన్ని ఉపయోగిస్తూ సామాజిక రాజకీయ మార్పులను వివరింపవచ్చు. కొత్త సిద్ధాంత నిర్మాణానికి సామాజిక రాజకీయ మార్పులను

వివరింపవచ్చు. కొత్త సిద్ధాంత నిర్మాణానికి ఈ సామాజిక రాజకీయ మార్పులు ఉపకరిస్తాయి. అభివృద్ధి చెందుతున్న రాజ్యాల రాజకీయాలను అవగాహన చేసుకోవడానికి ఇది ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంది. ఈ దేశాలలో రాజకీయ రాజకీయేతర మార్పులు, సామాజిక నిర్మితిలో మార్పులు తెస్తూ, వివిధ సామాజిక సమూహాల ప్రతిష్టకు అధికారంలో మార్పులు, శిష్టుల వృద్ధికి పతనానికి దారితీస్తాయి. అభివృద్ధి చెందుతున్న సమాజాలలో కొత్త శిష్టుల ఆవిర్భావం, ఆధునికీకరణ ప్రక్రియలో శిష్టం కార్యకలాపాల నిర్ణయించే సామాజిక శక్తులను పరీక్షించ వచ్చు. దీనితోపాటు ఆర్థికనిర్మాణం, సామాజిక నిర్మాణం, శిష్టులతో సమూహాల నిర్మాణం, రాజ్యాంగ నిర్మాణాల మధ్య గల సంబంధాన్ని పరిశీలించవచ్చు.

--డా॥ కె. లక్ష్మి

## 8.7 చదువవదగిన పుస్తకాలు


| | | |
|---|---|---|
| Bottomore, T.B. | : | Elites and Society |
| Mosca Gaetano | : | The Ruling class |
| Schumpeter Joseph. A | : | Capitalism Socialism And Democracy |
| Almond Gabriel & Sydney Verba | : | The Civic Culture |


BRAOU

## నమూనా పరీక్షా ప్రశ్నలు

కింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. రాజకీయ శిష్టం అర్థాన్ని వివరిస్తూ వివిధ రకాలను పేర్కొనండి.
2. పరేటో శిష్ట వర్గ భ్రమణ సిద్ధాంతాన్ని వివరించండి?

# భాగం - 9 రాజకీయ భాగస్వామ్యం

## విషయక్రమం


9.1 లక్ష్యాలు

9.2 పరిచయం

9.3 రాజకీయ భాగస్వామ్యం అంటే ఏమిటి

9.4 రాజకీయ భాగస్వామ్యం - నిర్వచనాలు

9.5 రాజకీయ భాగస్వామ్యం - పరిధి

9.6.0 రాజకీయ భాగస్వామ్య చర్యలు

9.6.1 గ్లేడిటోరియల్ కార్యక్రమాలు

9.6.2 ట్రాన్సిషనల్ కార్యక్రమాలు

9.6.3 స్పెక్టటోరియల్ కార్యక్రమాలు

9.7 రాజకీయ భాగస్వామ్య వర్గీకరణ

9.8 రాజకీయ ఉదాసీనత - పరాయీకరణ

9.9 రాజకీయభాగస్వామ్యం - కారకాలు

9.10 రాజకీయభాగస్వామ్యం - ప్రేరణలు

9.11 రాజకీయ భాగస్వామ్యం - ఎన్నికలు

9.12 ముగింపు

9.13 చదువదగిన పుస్తకాలు

9.14 నమూనా పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 9.1 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదివాక మీరు
రాజకీయ భాగస్వామ్యం అర్థం, పరిధి,
రాజకీయ భాగస్వామ్య చర్యలు, కారకాలు, ప్రేరణలను,
బాగా వివరించగలుగుతారు.

## 9.2 పరిచయం

సమకాలీన సమాజాలు ఎదుర్కొంటున్న ఎన్నో క్లిష్ట సమస్యలపై రూపొందించే ప్రభుత్వ విధానాలు ప్రజాసమ్మతిని పొందటమనేది అతి ప్రధానాంశం. ఆధునిక రాజ్యాలు చాలావరకు ప్రజాస్వామ్య రాజ్యాలు. ప్రజాస్వామిక ప్రభుత్వ కార్యకలాపాలలో ప్రజల భాగస్వామ్యం ప్రముఖ స్థానం ఆక్రమించి ఉంది. రాజకీయ భాగస్వామ్యం ప్రభుత్వ విధానాలను నియంత్రించటానికి అవకాశం కల్పిస్తుంది. అధిక సంఖ్యలో పౌరులు ప్రభుత్వ విధానాలను ప్రభావ పరిచే స్థితిలో ఉన్నట్లయితే అది ప్రతిభావంతమైన భాగస్వామ్యం అవుతుంది. ప్రజల భాగస్వామ్యం రాజకీయ వ్యవస్థకి శాసన బద్ధతను చేకూర్చడమే కాక ప్రభుత్వ విధానాలకు ప్రజల సమ్మతిని కల్పిస్తుంది. భాగస్వామ్యం స్వేచ్ఛా స్వాతంత్ర్యాల సారాంశం. రాజ్య వ్యవహారాలలో ప్రజల

భాగస్వామ్యాన్ని నిరాకరిస్తే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అర్థరహితం. రాజకీయ భాగస్వామ్యం అంటే ప్రజలు ప్రభుత్వ కార్యకలాపాలలో వాస్తవంగా పాల్గొనటాన్ని అధ్యయనం చేయటం. భాగస్వామ్యం అనుచర్య ద్వారా పౌరులు పాలకులను, వారి చర్యలను ప్రభావితం చేస్తారు. రాజకీయ భాగస్వామ్యం ప్రధానంగా ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడంలో, అనేక విధాలైన ఏకాభిప్రాయాలను సేకరించే కార్యక్రమాలలో, ప్రభుత్వం ముఖ్యమైన నిర్ణయాలను తీసుకోవడంలో కీలకపాత్ర వహిస్తుంది. రాజకీయ సామాజికీకరణం, రాజకీయాలలో పాల్గొనటానికి వ్యక్తికి కావలసిన ప్రేరణ కలిగిస్తుంది. ఈ ప్రేరణ ప్రభావం వ్యక్తి రాజకీయ భాగస్వామ్యంపై ఎంతవరకు, ఏ స్థాయిలో, ఏ విధంగా చూపిస్తుందో పరిశీలించటమే రాజకీయ భాగస్వామ్యపు అధ్యయనం. రాజకీయ భాగస్వామ్యం అనే భావన ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రముఖ స్థానం ఆక్రమించి ఉంది.

## 9.3 రాజకీయ భాగస్వామ్యం అంటే ఏమిటి?

18, 19 శతాబ్దాలలోని ప్రజాస్వామ్య విప్లవానికి ముందు చాలా రాజ్యాలలో ప్రజలు తమను పరిపాలించిన ప్రభుత్వం చేత ఏమాత్రం ప్రభావితం కాకుండా పూర్తిగా అజ్ఞానంలో ఉన్నట్లు కనిపిస్తుంది. ఈ దశలో వ్యక్తి క్రియారహిత వస్తువు లేదా అచేతనుడే కానీ భాగస్వామ్య పౌరుడు కాదు. నేడు దాదాపు అన్ని రాజ్యాలలో సగటు ప్రజలు ప్రభుత్వాలను గురించిన పరిజ్ఞానం కలిగి తమ ప్రభుత్వాల చేత ప్రభావితులవుతున్నారు. రాజకీయ ప్రక్రియలో ఏదో ఒక విధంగా పాల్గొనేట్లు ప్రజలను ప్రోత్సహించడం జరుగుతున్నది. సంప్రదాయక లేదా పురాతన రాజ్యానికి భిన్నంగా ఆధునిక రాజకీయ వ్యవస్థలో విస్తృతమైన రాజకీయ భాగస్వామ్యాన్ని ఆధునికి రాజకీయ వ్యవస్థ లక్షణాలలో ఒకదానినిగా గుర్తించడమైంది.

BRAOU

న్యాయబద్ధ రాజకీయ అధికారాన్ని ప్రజా సార్వభౌమాధికారం ఆధారంగా గుర్తించడం వల్ల ప్రజల రాజకీయ భాగస్వామ్యం విస్తృతం అయింది. ప్రజాస్వామ్యం, నియంతృత్వ వ్యవస్థలు రెండింటిలోనూ ప్రజాసార్వభౌ-మాధికార సూత్రం అంగీకరించబడి, రాజకీయ భాగస్వామ్యం ద్వారా ప్రజల సమ్మతిని పొందుతున్నాయి. రాజకీయాధికారం ప్రజలనుంచి పొందవలసి ఉంటుంది. కనుక ప్రజలు తమ సార్వభౌమాధికారాన్ని ఉపయోగించటానికి రాజకీయాలలో పాల్గొనవలసి ఉంటుంది.

ప్రజాస్వామ్య సిద్ధాంతంలో సాధారణ పౌరుని పాత్ర కీలకమైంది. ప్రజాస్వామ్యవాది ఇష్టంతో, ప్రజాస్వామ్య వ్యతిరేకి అయిష్టంగా ఇద్దరూ కూడా పౌరుని ముఖ్యపాత్రను గుర్తించారు. పౌరుని ఈ పాత్ర ప్రజాస్వామ్య నిర్మాణానికి మూలాధారం. కాబట్టి ప్రజాస్వామ్యాన్ని సమర్థించేవారు విమర్శకులు ఇద్దరూ ప్రజాస్వామ్య సిద్ధాంతంలో పౌరుని ప్రాధాన్యతను గుర్తించారు.

ప్లేటో కాలం నాటినుంచే ప్రభుత్వ వ్యవహారాలలో రాజకీయ భాగస్వామ్యం అనే అంశం పట్ల రాజనీతి శాస్త్రంలో ఆసక్తి ఏర్పడింది. అరిస్టాటిల్ కాలం నాటినుంచి ప్రభుత్వ విధులను పంచుకోవడం ద్వారా ప్రజాస్వామ్య ప్రభుత్వం ప్రాధాన్యం పొందింది. అరిస్టాటిల్ నిర్వచనం ప్రకారం పౌరుడంటే న్యాయపాలనలో, ప్రభుత్వ కార్యాలయంలో పాల్గొనేవాడు. 1789 ఫ్రెంచ్ విప్లవ ప్రకటన ప్రకారం పౌరులందరికీ వ్యక్తిగతంగా కాని లేదా తమ ప్రతినిధులద్వారా కానీ చట్టరూపకల్పనలో పాల్గొనే హక్కు ఉంటుంది. అయితే మారుతున్న కాలానుగుణంగా రాజ్య కార్యకలాపాలతోపాటు రాజకీయ భాగస్వామ్యం అర్థం కూడా మారిపోయింది. స్వేచ్ఛా విధానం (Laisseg Faire) అమలులో ఉన్న కాలంలో రాజకీయ భాగస్వామ్యం పాత్ర విధాన రూపకల్పనకే పరిమితం చేయడమైంది. సామ్యవాద రాజ్యావతరణ, రాజ్యకార్యకలాపాలు విస్తరించడంలో

రాజకీయ భాగస్వామ్యం స్వభావం, పరిధి విస్తృతమయ్యాయి. సార్వత్రిక రాజకీయ భాగస్వామ్యం మానవ స్వాతంత్ర్యానికి సాధనం, లక్ష్యం అని కార్ల్‌మార్క్స్ నొక్కి వక్కాణించాడు. అది న్యాయబద్ధ సామాజిక క్రమానికి సాధనం.

రాజ్యం చరిత్రలో భాగస్వామ్యం ఆదినుంచి ఏదో ఒక రూపంలో ఉంటూ వచ్చింది. ఆసక్తి కలిగిన వ్యక్తులు, సమూహాలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో తమ కోరికలను, విజ్ఞాపనలను వివిధ స్థాయిలలో ఉండే ప్రభుత్వాధికారులకు తెలియజేసేవారు. ప్రజాస్వామ్యం పౌరులకు రాజకీయాలలో పాల్గొనడానికి అత్యధిక అకాశాన్ని కల్పిస్తుంది. ప్రాచీన గ్రీకు ప్రజాస్వామ్యాలు ప్రత్యక్ష భాగస్వామ్య సూత్రంపై పనిచేశాయి. ఆధునిక ప్రజాస్వామ్యాలు ప్రాతినిధ్య సంస్థలద్వారా పరోక్ష ప్రజాస్వామ్య సూత్రంపై పనిచేస్తున్నాయి. ప్రభుత్వ కార్యకలాపాలలో పౌరుల ప్రత్యక్ష, పరోక్ష భాగస్వామ్యం, ప్రభుత్వ కార్యకలాపాలలో వారి పాత్ర పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి అత్యంత అవశ్యకమైంది. ప్రజాస్వామ్యంలో అధికారాన్ని (Power) పంచుకోవడం, వికేంద్రీకరించడం జరుగుతుంది. అంతేకాక సమాజానికి సంబంధించిన అధికార పూర్వక నిర్ణయాలు పౌరుల ప్రాతినిధ్యంపై తీసుకొంటారు. పౌరుల రాజకీయ భాగస్వామ్యం అధిక సంఖ్యాకుల ఆసక్తులకు వ్యతిరేకంగా ఉండే కొద్దిమంది ప్రత్యేక హక్కుల, స్వార్థపర ఆసక్తులపై తనిఖీ చేస్తుంది. కాబట్టి ఆధునిక సంక్షేమ రాజ్య కార్యకలాపాలలో పౌరుల భాగస్వామ్యం అత్యంతావశ్యకమైంది.

ప్రజల భాగస్వామ్యానికి ప్రజాస్వామ్య ప్రాతినిధ్య సిద్ధాంతానికి సన్నిహిత సంబంధం ఉంది. ప్రజాస్వామ్య విజయం ప్రధానంగా స్థానిక స్థాయిలోని భాగస్వామ్య విస్తరణపై ఆధారపడి ఉంటుంది. ఆల్మండ్, (Almond and Verba) తమ ఆరు రాజ్యాల అధ్యయనంలో "పౌరుడు పాలితుడేగాక రాజకీయ విధానరూపకల్పన ప్రక్రియలో క్రియాశీలక భాగస్వామి" అని పేర్కొన్నారు.

BRAOU

ప్రతి రాజకీయ వ్యవస్థకు రాజకీయ భాగస్వామ్యం అత్యంత ప్రధానమైన అంశం. అయినప్పటికీ ప్రతిదేశంలో కొద్దిమంది ప్రముఖుల గుత్తాధిపత్యంలో రాజకీయాధికారం కేంద్రీకృతమై ఉంది. ఏదో ఒక విధమైన ప్రజల రాజకీయ భాగస్వామ్యం తప్పనిసరిగా కనిపిస్తుంది. దీనికి కారణం రాజ్య కార్యకలాపాలలో పౌరులను అధిక సంఖ్యలో లీనం అయ్యేటట్లు చేసి రాజకీయ అధికారానికి న్యాయబద్ధతను కలగజేయడం ద్వారా రాజకీయ వ్యవస్థ స్థిరత్వం కాపాడడానికి రాజకీయ భాగస్వామ్యం అత్యంతావశ్యకం. ఏ వ్యవస్థలోనైనా అత్యధిక సంఖ్యాక ప్రజల రాజకీయ భాగస్వామ్యాన్ని నిరాకరిస్తే అది ఆ రాజకీయ వ్యవస్థకు గొడ్డలిపెట్టు అవుతుంది. కాబట్టి ఆధునిక ప్రజాస్వామ్యేతర రాజకీయ వ్యవస్థ (Modern non- democratic political systems) లలో కూడా రాజకీయ భాగస్వామ్య భావాలు చోటుచేసుకొన్నాయి. ఆధునిక ఫాసిస్ట్ ప్రభుత్వాలు, నియంతలు, ఏ విధమైన అధికారం చెలాయించదలచినా, పరోక్షంగా ప్రజల రాజకీయ భాగస్వామ్యం పొందటానికి ప్రయత్నిస్తాయి.

## 9.4 రాజకీయ భాగస్వామ్యం - నిర్వచనాలు

ప్రజాసమూహాలు, వ్యక్తులు రాజకీయ వ్యవస్థలో వివిధ స్థాయిలలోని రాజకీయ కార్యకలాపాలలో పాల్గొనడమే రాజకీయ భాగస్వామ్యం. నై, వెర్బా (Nie and verba) నిర్వచనం: ప్రభుత్వాధికారుల ఎంపిక లేదా వారు చేపట్టబోయే చర్యలను ప్రభావితం చేయడానికి పౌరులు చేపట్టే న్యాయబద్ధమైన కార్యకలాపాలే రాజకీయ భాగస్వామం. హంటింగ్‌టన్, నెల్సన్ నిర్వచనం ప్రకారం రాజకీయ భాగస్వామ్యమంటే ప్రభుత్వ విధాన రూపకల్పనను ప్రభావితం చేయడానికి పౌరులు ప్రతిపాదించే చర్య.

రాజకీయ భాగస్వామ్యం ప్రభుత్వ విధాన రూపకల్పన, ప్రభుత్వ చర్యలను ప్రభావితం చేయడానికి పౌరులు చేపట్టబోయే చర్యలను సూచిస్తుంది. ఇంకోమాటలో చెప్పాలంటే సమాజంకోసం అధికారయుతంగా సంపిణీ చేసే విలువలను ప్రభావితం చేయడానికి గల ప్రజల ప్రయత్నాలను తెలుసుకోవడానికి రాజకీయ భాగస్వామ్య విద్యార్థులకు ఆసక్తి ఉండటం. కానీ ఈ ప్రయత్నాలన్నీ లాంఛప్రాయమైన ప్రభుత్వ నిర్ణయాల ద్వారా అమలుకావు. ప్రభుత్వం జోక్యం లేకుండానే సమాజంలో వివిధ సమూహాల మధ్య వనరుల పంపిణీ జరుగుతుంది.

కొన్ని రాజకీయ భాగస్వామ్య అధ్యయనాలలో వాస్తవిక రాజకీయ ప్రవర్తనతోపాటు దృక్పథాలను కూడా చేర్చడం జరిగింది. ఆల్మండ్, వెర్బాలు (Almond and Verba) రాజకీయ భాగస్వామ్యం మానసిక భావాలు, ఆలోచనల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించారు.

బెరిల్‌సన్, లాజర్ ఫెల్డ్ మెక్‌ఫీ (Berelson, Lazarfeld Mc Phee) రాజకీయాలలో పౌరులు కనబరచిన ఆసక్తిని ఓటింగ్ తరవాతి రాజకీయ భాగస్వామ్యంను కొలిచే సాధనంగా పేర్కొన్నారు. వీరు రాజకీయ సామాజికీకరణ ప్రక్రియ కొనసాగింపే రాజకీయ భాగస్వామ్య ప్రక్రియ అంటారు. రాజకీయ సామాజికీకరణ ప్రక్రియ వ్యక్తులకు రాజకీయ వ్యవస్థతో పరిచయం చేస్తూ అతని రాజకీయ దృక్పథాలను రాజకీయ వ్యవస్థతో అతని ప్రతిచర్యలను నిర్ణయిస్తుంది. ఇంకో పక్క రాజకీయ భాగస్వామ్యం పౌరులు రాజకీయ వ్యవస్థలో వాస్తవంగా లీనం అయినప్పుడు వారి ప్రవర్తనా ప్రక్రియను సూచిస్తుంది.

రష్, అల్‌త్రోఫ్ (Rush and Althroff)ల నిర్వచనంలో రాజకీయ సామాజికీకరణ ప్రక్రియ వ్యక్తులకు రాజకీయ ఉత్తేజాన్ని కలిగిస్తుంది. ఫలితంగా వ్యక్తులు రాజకీయ వ్యవస్థలో వివిధ స్థాయిలలోని రాజకీయ భాగస్వామ్య ప్రక్రియలో పాల్గొంటారని వివరించారు.

BRAOU

రాజకీయ పరిజ్ఞానం, రాజకీయాలలో ఆసక్తి, రాజకీయ సామర్థ్యం, రాజకీయ దృక్పథాలు మొదలైన వాటికి ఒక వ్యక్తి రాజకీయ ప్రవర్తనతో సన్నిహిత సంబంధం ఉంటుందని హంటింగ్‌టన్, నెల్సన్ వాదించారు. కాని కొన్ని సమయాలలో వాటి మధ్య సంబంధం ఉండదు. వీరిని గురించి అధ్యయనం చేయడానికి ప్రత్యేక పద్ధతులు అవసరమవుతాయి. కాబట్టి వీరు పరాశ్రయ (Objective) రాజకీయ చర్యలు, వ్యక్తి ఆశ్రయ (Subjective) రాజకీయ దృక్పథాలను వేరువేరు కారకాలుగా పరిగణిస్తున్నారు. రాజకీయ భాగస్వామ్యం పట్ల ఉన్న మానసిక దృక్పథాలు రాజకీయ భాగస్వామ్యానికి ముఖ్య ఆధారాలని, వై, వెర్బాలు పేర్కొన్నారు. కాబట్టి రాజకీయ భాగస్వామ్యం ద్వారా ప్రభుత్వాన్ని ప్రభావితం చేయడానికి ప్రయత్నించే పౌరుల వాస్తవిక ప్రవర్తనను రాజకీయ భాగస్వామ్యంగా గుర్తించారు.

## 9.5 రాజకీయ భాగస్వామ్యం - పరిధి

భాగస్వామ్య రూపాల దృష్ట్యా రాజకీయ భాగస్వామ్యం అనే పదం పరిధి క్రమంగా విస్తృతమయింది. ప్రారంభంలో ఈ భావన సంకుచితంగా ఉపయోగించడం జరిగింది. ఎన్నికల ప్రక్రియలో పౌరుల ఓటింగ్, ఎన్నికల ప్రచారం, పార్టీ కార్యక్రమాలలో పాల్గొనడం, రాజకీయాలు చర్చించడం, అభ్యర్థులకు ప్రచారం చేయడం, పార్టీ సాహిత్యాన్ని పంపిణీ చేయడం, రాజకీయ సమావేశాలకు హాజరుకావడం, విరాళాలివ్వడం మొదలైనవి. తరువాత ఈ భావన విస్తృతం అయి ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేసే పౌరుల ప్రయత్నాలు కూడా చేర్చడం జరిగింది. ఈనాడు అనేక అంశాలపై (issues) పౌరులు పాల్గొనే వివిధ పద్ధతులు లేదా మార్గాలు రాజకీయ భాగస్వామ్యంలో చేర్చడం జరిగింది.

డి.ఆర్. మాథ్యూస్, జె. డబ్ల్యూ. ప్రోతో (D.R. Mathews and J.W. Protho) నిర్వచనం ప్రకారం ప్రజలు తమ రాజకీయ అభిప్రాయాలను ప్రత్యక్షంగా వ్యక్తం చేయడానికి దోహదం చేసే అన్ని రకాల ప్రవర్తనే రాజకీయ భాగస్వామ్యం.

సోయ్‌సల్ (Soysal) అభిప్రాయం ప్రకారం భాగస్వామ్యం అనే పదం రాజ్యయంత్రాంగం అమలులో పౌరులు పాల్గొనటానికి చేపట్టే అన్ని రకాల చర్యలను తెలియచేయడానికి తరచుగా వాడడం జరిగింది.

భాగస్వామ్యం అన్ని రకాల సాంఘిక సమస్యలకు సంబంధించిన లక్ష్యాలను, సాధనాలను సూచించే ప్రక్రియ. భాగస్వామ్యం ద్వారా పౌర నియమాలను అధ్యయనం చేయడమవుతుంది. రాజకీయ వ్యవస్థలో పాల్గొనటానికి సామర్థ్యం లేకపోవడాన్ని రాజకీయ వ్యవస్థలో సంపూర్ణ సభ్యత్వం లేకపోవడంగా పేర్కొవచ్చు.

రాజకీయ భాగస్వామ్యం ప్రజాస్వామానికి, ఆధునికీకరణకు మైలురాయి. సాంప్రదాయక సమాజంలో ప్రభుత్వం, రాజకీయాలు కొద్దిమంది శిష్టులకు మాత్రమే పరిమితం కాక దీనికి భిన్నంగా అభివృద్ధి చెందిన రాజ్యాలు క్రియాశీలక పౌరసత్వ సూత్రాన్ని అంగీకరించాయి. సాంఘిక, ఆర్థిక ఆధునికీకరణ భాగస్వామ్యాన్ని విస్తృతం చేసింది.

చాలాదేశాలలో పౌరులకు రాజకీయ కార్యకలాపాలు భాగస్వామ్యం నుంచి ప్రభుత్వ పదవులను చేపట్టేవరకు అందుబాటులో ఉంటాయి. సాధారణంగా రాజకీయాలలో పాల్గొనటానికి చాలా సమయాన్ని వెచ్చించాల్సి వస్తుంది. కాబట్టి చాలాకొద్దిమంది మాత్రమే రాజకీయాలలో పాల్గొంటారు. ఒక వ్యక్తి రాజకీయాలలో ఏ స్థాయిలో పాల్గొంటాడనేది అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. అవి, వ్యక్తుల దృక్పథాలు, నమ్మకం, వ్యక్తిగత లక్షణాలు. అవేకాకుండా రాజకీయ కారకాలు కూడా రాజకీయ భాగస్వామ్యాన్ని ప్రభావితం చేస్తాయి. అవి వార్తా ప్రసార సాధనాల ద్వారా పొందే రాజకీయ సమాచారం లేదా వ్యక్తిగత సంబంధాలు, రాజకీయ పార్టీ నిర్మాణం, వ్యవస్థీకృతమైన ఇతర రాజకీయ పార్టీ నిర్మాణం, వ్యవస్థీకృతమైన ఇతర రాజకీయ సంస్థలతో ఉన్న సంబంధం, ఎన్నికల ప్రాధాన్యత అమలులో ఉన్న ప్రభుత్వ దృక్పథం మొదలైనవి.

BRAOU

వర్గం, వృత్తి, స్త్రీ పురుషభేదం మొదలయిన సాంఘిక, ఆర్థికాంశాలు కూడా రాజకీయ భాగస్వామ్యాన్ని ప్రభావితం చేస్తాయి. వ్యక్తులు ఓటు వేస్తారా? లేదా వేయాలి? అనేది అనేక సాంఘిక అంశాలపై ఆధారపడి ఉంటుందని ఓటింగ్ ప్రవర్తనపై జరిపిన అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. యస్. ఎమ్. లిప్‌సెట్ (S.M. Lipset) రాజకీయ మానవుడు (Political man) అనే గ్రంథంలో రాజకీయ భాగస్వామ్యాన్ని ప్రభావితం చేసే ప్రధాన సాంఘిక కారకాలను సమీక్షిస్తూ ఒక వ్యక్తి విద్యాస్థాయికి అతని రాజకీయ భాగస్వామ్య స్థాయికి పరస్పర సంబంధం ఉంటుందని, విద్యావంతుడైన పౌరుడు రాజకీయ ప్రక్రియలో నిరక్షరాస్యుని కంటే ఎక్కువగా పాల్గొనే అవకాశముందని పేర్కొన్నాడు.

## 9.6.0 రాజకీయ భాగస్వామ్య చర్యలు

రాజకీయ భాగస్వామ్యం రాజకీయ ప్రక్రియపై వ్యక్తుల అనేక స్వచ్ఛంద చర్యలను తెలియజేస్తుంది. ఆ చర్యలను ప్రధానంగా కింది విధంగా పేర్కొనవచ్చు.

అవి: (1) ఎన్నికలలో ఓటు వేయటం.

(2) ప్రభావ వర్గాలలో సభ్యుడుగా వాటికి మద్దతును అందించటం

(3) శాసన సభ్యులతో వ్యక్తిగత సంబంధం

(4) రాజకీయ పార్టీ కార్యక్రమాలలో పాల్గొనటం

(5) రాజకీయ సిద్ధాంతాలను, పార్టీ కార్యక్రమాలను ఇతరులకు చెప్పడం.

రాజకీయ భాగస్వామ్యంలో ఈ కింది అంశాలుకూడా చేరి ఉంటాయి.

అవి : (1) ప్రభుత్వ విధానాలను ఒత్తిడిద్వారా ప్రభావితం చేయడానికి రూపొందించిన చర్యలు. లేదా అమలులో ఉన్న విధానాల కొనసాగింపు, మార్పులు చేయడం మొదలయిన లక్ష్యాలను ప్రభుత్వంతో సంప్రదింపులద్వారా సాధించడం.

(2) లాబీయింగ్, ఓటింగ్, ఎన్నికల ప్రచార కార్యక్రమం మొదలయిన ఎన్నికల కార్యక్రమాలలో పాల్గొనడం.

(3) నిరసనలు, సమ్మెలు, ధర్నాలు, హింసకు పాల్పడడం మొదలయినవి.

లెస్టర్ మిల్‌బ్రత్ అనే రాజనీతి శాస్త్రవేత్త రాజకీయ భాగస్వామ్యంలోని కార్యక్రమాలను ఈ కింది విధంగా విభజించాడు. కార్యక్రమాలన్నింటిలో ఉన్నతస్థాయిలో వ్యక్తి భాగస్వామ్యం తక్కువగా ఉండి రానురాను తక్కువస్థాయిలో వ్యక్తుల భాగస్వామ్యం ఎక్కువగా ఉంటుందని మిల్‌బ్రత్ వివరిస్తూ కిందిస్థాయి వరకు భాగస్వామ్యాన్ని విభజించారు.

(1) గ్లాడియేటోరియల్ కార్యక్రమాలు

(2) ట్రాన్సిషనల్ కార్యక్రమాలు

(3) స్పెక్టోటోరియల్ కార్యక్రమాలు

## 9.6.1 గ్లేడియేటోరియల్ కార్యక్రమాలు

BRAOU

(ఎ) ప్రభుత్వ, పార్టీ పదవులు చేపట్టడం

(బి) ఎన్నికలలో ఒక పార్టీ అభ్యర్థిగా పోటీ చేయటం

(సి) పార్టీకి నిధులను సమకూర్చటం

(డి) పార్టీ సమావేశంలో పాల్గొనటం

(ఇ) రాజకీయ పార్టీలో క్రియాశీలక సభ్యుడు కావడం

(ఎఫ్) పార్టీ ప్రచారంలో పాల్గొనడం

## 9.6.2 ట్రావిషనల్ కార్యక్రమాలు :

(ఎ) రాజకీయ సమావేశానికి లేదా ప్రదర్శనకు హాజరుకావటం

(బి) పార్టీ అభ్యర్థికి ఆర్థిక సహాయం చేయడం

(సి) ప్రజాధికారులలో లేదా పార్టీ ప్రతినిధులలో సంప్రదించటం.

## 9.6.3 స్పెక్టోటోరియల్ కార్యక్రమాలు :

(ఎ) రాజకీయ సంప్రదింపులలో పాల్గొనటం, ఇతరులను పాల్గొనేట్లు చేయటం

(బి) ప్రత్యేక రాజకీయ గుర్తు గల బటన్‌ను ధరించటం లేదా మోటారు కారుకు స్టిక్కర్స్ అంటించటం

(సి) ఇతరులకు ఓటు వేసే విధానం తెలియజెయ్యటం

(డి) ఓటు చేయటం

(ఇ) రాజకీయ చర్చలలో పాల్గొని ఇతరులను రాజకీయపరంగా ప్రేరేపించటం.

రష్, ఆల్‌ట్రోఫ్ (Rush and Altroff) అన్నిరకాల రాజకీయ వ్యవస్థలలో అందుబాటులో ఉన్న రాజకీయ భాగస్వామ్యం క్రమాన్ని వివరించారు. అక్కడక్కడ కొద్ది మార్పులు మినహాయించి రష్, ఆల్‌ట్రోఫ్ రాజకీయ భాగస్వామ్య విభజన పద్ధతి ఇంచుమించుగా మిల్‌బ్రాత్ విభజనను పోలి ఉంది.

## 9.7 రాజకీయ భాగస్వామ్య వర్గీకరణ

(1) రాజకీయ లేదా పరిపాలక పదవులు ఉండడం.

(2) రాజకీయ లేదా పరిపాలక పదవులను పొందడానికి ప్రయత్నించడం.

(3) రాజకీయ సంస్థలలో క్రియాశీలక సభ్యత్వం పొందడం.

(4) క్వాజీ రాజకీయ సంస్థలో క్రియా రహిత సభ్యత్వం ఉండటం.

(5) పబ్లిక్ మీటింగులు, ప్రదర్శనలు మొదలయిన వాటిలో పాల్గొనటం.

(6) అనియత రాజకీయ చర్చలలో పాల్గొనటం.

(7) రాజకీయాలలో సాధారణ ఆసక్తి ఉండటం.

(8) ఓటు చేయడం.

(9) పూర్తి సామర్థ్యం.

రాజకీయ వ్యవస్థలో రాజకీయ పరిపాలన మొదలయిన సంస్థలలో వివిధ రకాల పదవులు ఉండడం రాజకీయ భాగస్వామ్యం వర్గీకరణలో ప్రథమ స్థానం వహిస్తుంది. రాజకీయ పార్టీలు, ప్రభావవర్గాలు, ట్రేడ్ యూనియన్లు, ఇతర ప్రభావ వర్గాలు మొదలయిన రాజకీయ అర్ధరాజకీయ (Semi-Political) క్వాజీ రాజకీయ సంస్థలలో వాస్తవంగా పదవులు చేపట్టిన వారితోపాటు పదవులను చేపట్టబోయేవారుకూడా ఉంటారు. ఈ సంస్థలు రాజకీయ సమీకరణ ఏజెంట్లుగా కూడా పనిచేస్తాయి. ఈ సంస్థల ద్వారా ప్రజలు రాజకీయ కార్యక్రమాలలో పాల్గొంటారు. ప్రజలు పబ్లిక్ మీటింగ్ లేదా ప్రదర్శనతోపాటు కుటుంబం, పీర్ గ్రూపులలో జరిగే అనియత రాజకీయ చర్చలలో కూడా పాల్గొనవచ్చు.

"ది సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్" వారు 1967 సాధారణ ఎన్నికలకు సంబంధించి జరిపిన అఖిలభారత సర్వేలో రాజకీయ కార్యక్రమాలలో పాల్గొనేస్థాయిని బట్టి వయోజనులను ఐదు (5) రకాలుగా విభజించారు.

(1) ఉదాసీనులు (Apathetics):- రాజకీయ వ్యవస్థలో మానసికంగా లీనంకానివారు లేదా రాజకీయాలపట్ల ఆసక్తిలేనివారు.

(2) పెరిఫెరల్స్ (Peripherals):- రాజకీయాల పట్ల కొంత ఆసక్తి లేదా సమాచారం ఉండి కేవలం ఓటు చేసేవారు.

(3) స్పెక్టేటర్స్ (Spectators):- రాజకీయాల పట్ల కొంత ఆసక్తి లేదా సమాచారము ఉండి ఓటు చేయుటంతోపాటు కొద్దిస్థాయి రాజకీయ ప్రేరణతో ఇతర కార్యక్రమాలలో పాల్గొనేవారు.

(4) సహాయకులు (Auxiliaries) ఒక మోస్తరు (మీడియం స్థాయి) ఆసక్తి, సమాచారం కలిగి రాజకీయ కార్యక్రమాలలో క్రియాశీలకంగా పాల్గొనేవారు.

(5) పోలిటిస్ట్‌లు (Politists):- ఇది అత్యధిక స్థాయి రాజకీయ భాగస్వామ్యం. ఓటు చేయడంతోపాటు అత్యధిక ఆసక్తి, పరిజ్ఞానంతో రాజకీయ కార్యక్రమాలలో పాల్గొనేవారు. అధిక

లేదా మధ్యమస్థాయి ఆసక్తి, పరిజ్ఞానంలో మూడు లేదా అంతకంటే ఎక్కువ కార్యక్రమాలలో పాల్గొనేవారు.

ఈ సర్వే రాజకీయ భాగస్వామ్యంలోని కార్యక్రమాలను 12 రకాలుగా విభజించింది. అవి:-

1. ఓటు చేయడం
2. అభ్యర్థుల కోసం ప్రచారం చేయడం
3. ఓటర్లను సమీకరించడం
4. సమావేశాలను, ప్రదర్శనలను నిర్వహించడం
5. ఊరేగింపులో పాల్గొనడం
6. కరపత్రాలను పార్టీ సాహిత్యాన్ని పంచడం, ప్రచారం చేయడం
7. ఇతర విధాలైన ప్రచార కార్యక్రమాలలో పాల్గొనడం
8. సంస్థ, సమూహాల ద్వారా ప్రచారం
9. పబ్లిక్ మీటింగ్‌లకు, ప్రదర్శనలకు హాజరుకావడం
10. రాజకీయ పార్టీలలో సభ్యత్వం
11. సమస్యల పరిష్కారం కోసం పార్టీనాయకులను సంప్రదించడం
12. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాధికారులతో సంప్రదించడం

రాజకీయ వ్యవస్థలో ప్రతి ఒక్కరు ఏదో ఒక విధంగా రాజకీయాలలో పాల్గొంటారు. ఏ ఒక్కరు వాటినుంచి తప్పించుకోలేరు. రాజకీయ భాగస్వామ్యం రాజనీతి తత్వవేత్త నిఘంటువులలోను ఇతర ప్రాచీన భావనల వలె కాక ఆధునిక రాజనీతి శాస్త్ర పదకోశంలో ముఖ్యస్థానాన్ని ఆక్రమించింది. సమకాలీన రాజనీతి శాస్త్ర జర్నల్స్‌లో ప్రచురితమయ్యే పరిశోధనా నివేదికలలో ఏదో ఒక రకమైన రాజకీయ భాగస్వామ్యం గురించి ఉంటుంది. ఓటరు, పార్టీ కార్యకర్త, ప్రభావవర్గ అభ్యర్థి, విద్యార్థుల ప్రదర్శన, రెవల్యూషనరి కాడర్‌లకు (Cadre) సంబంధించిన అధ్యయనాలను సాధారణంగా రాజకీయ భాగస్వామ్య అధ్యయనాలుగా విభజించారు.

కొంతమంది ప్రజలు అన్ని రకాల రాజకీయ భాగస్వామ్యానికి దూరంగా ఉంటారు. లేదా అతి తక్కువ స్థాయిలో పాల్గొంటారు. ఏ సమాజంలోనైనా అనేక రకాల రాజకీయ కార్యక్రమాలలో పాల్గొనే ప్రజలు తరచుగా అల్ప సంఖ్యలో ఉంటారు.

## 9.8 రాజకీయ ఉదాసీనత - పరాయీకరణ

భాగస్వామ్య చర్చలలో పాల్గొనని వారిని ఉదాసీనులు, నిరాశావాదులు, పరాయీకరణం చెందినవారు (Anomic) గాను విభజించవచ్చును. ఇవి పర్యాయపదాలు కావు. అయినప్పటికీ ఒకదానితో ఒకటి పోల్చి చూస్తే కొన్ని సాధారణ లక్షణాలు కనిపిస్తాయి.

ఉదాసీనత అంటే వ్యక్తులు, పరిస్థితులు లేదా సమకాలీన సమాజంలో ఏమి జరుగుతుందనే వాటిపై ఆసక్తి లేకపోవడం లేదా పట్టించుకోకపోవడం. రాజకీయ భాగస్వామ్యం దృష్ట్యా చూస్తే ఉదాసీనుడు రాజకీయ కార్యక్రమాలలో పాల్గొనడం లేదా ఉదాసీనులకు రాజకీయాలలో ఆసక్తి ఉండదు.

మారిస్ రోజన్‌బర్గ్ (Marries Roserberg) రాజకీయ ఉదాసీనతకు కారణాలు పేర్కొన్నాడు. మొదటిది, రాజకీయ చర్యల ఫలితాలను లేదా ప్రభావాన్ని తెలిసినవాడు కావడం. రెండోకారణం రాజకీయ కార్యక్రమాలలో

పాల్గొనడానికి ప్రేరణ లేకపోవడం ఉదాసీనతా భావానికి దారితీస్తుంది.

నిరాశావాదం ఉదాసీనతకు భిన్నంగా రాజకీయ క్రియారహిత దృక్పథాన్ని తెలుపుతుంది. రాబర్ట్ ఆగర్ (Robert Agger), అతని సహచరులు నిరాశావాదాన్ని విలువలేని అపనమ్మకమైన మానవస్వభావంగా పేర్కొన్నారు. నిరాశావాదులకు రాజకీయాలు రుచించవు. వారిని రాజకీయాలు ఏ విధంగానూ ఉత్తేజపరచలేవు. కాబట్టి నిరాశావాదులలో రాజకీయ భాగస్వామ్యం తగ్గిపోతుంది. నిరాశావాదం ఇతరుల చర్యలను, ఉద్దేశాలను అనుమానిస్తూ వ్యక్తులు తమ సొంత ఆసక్తులను చూసుకొంటారు. రాజకీయంగా నిరాశావాదం అనేక రకాలుగా కనిపిస్తుంది. నిరాశావాది ఏ రకమైన రాజకీయ భాగస్వామ్యాన్నైనా నిష్ప్రయోజనంగా భావిస్తూ సంపూర్ణ ఉదాసీనులతో చేరతాడు. నిరాశావాదం ఒక ప్రత్యేకమైన వ్యక్తి ఒక ప్రత్యేకస్థాయిలో రాజకీయ కార్యక్రమాలలో పాల్గొనకపోయినప్పటికీ అది ఇతరుల రాజకీయ భాగస్వామ్యాన్ని పరిమితం చేయులేదు.

నిరాశావాదం రాజకీయాలపట్ల, రాజకీయ నాయకుల పట్ల అయిష్టతను సూచించగా పరాయీకరణ ప్రతికూలతను సూచిస్తుంది. రాబర్ట్ లెవ్ (Robert Lave) రాజకీయ పరాయీకరణను ఈ విధంగా నిర్వచించాడు: "రాజకీయాలు, ప్రభుత్వం పట్ల వేర్పాటుధోరణి, ప్రభుత్వం, దేశరాజకీయాలు కొద్దిమంది చేత వారి ప్రయోజనం కోసమే రూపొందించబడిన నియమాల ద్వారా పరిపాలిస్తున్నారనే దృక్పథం". ఇది నిరాశావాదాన్ని అధిగమించింది. పరాయీకరణ చెందినవారు సమాజంలో తెగతెంపులు చేసుకొని సమాజమంటే వారికి ప్రతికూల భావాలు ఉంటాయి.

డర్క్‌హీమ్ (Durkheim) తన అధ్యయనంలో క్రమరహితుడు (Anomic) గురించి వివరించాడు. (Anomic) అంటే విలువలను కోల్పోవడం, మార్గదర్శకత్వం లేకపోవడం వల్ల ఒక వ్యక్తి తన లక్ష్యాలను, రాజకీయ కార్యక్రమాలలో క్రియారహితుడవుతాడు.

BRAOU

రాజకీయ ఉదాసీనతకు సాధారణ ఉదాసీనతతో చాలా దగ్గరి సంబంధం ఉంటుంది. రాజకీయ నిరాశావాదం వ్యక్తిగత నిరాశావాదంలో ముడిపడి ఉంటుంది. (Anomic) అనే భావన మదింపు పద్ధతి (Scale) రాజకీయ దృక్పథాలు కాకుండా సాంఘిక దృక్పథాలను ఆధారంగా తీసుకొని స్రోలో (Scrole) అనామిక్ స్కేలును రూపొందించాడు. రాజకీయ సామాజికీకరణ ప్రక్రియగా రాజకీయ ప్రవర్తనలో ఒక అంతర్గత భాగం. ఒక వ్యక్తి సాధారణంగా సాంఘిక కార్యక్రమాలలో ఎంత ఎక్కువగా పాల్గొంటాడో అంత ఎక్కువగా రాజకీయ కార్యక్రమాలలో పాల్గొనే అవకాశం ఉంటుంది. విలియం ఎర్బే (William Erbe) రాజకీయ భాగస్వామ్యం అనే అధ్యయనంలో అన్ని స్థాయిలలోని రాజకీయ భాగస్వామ్యానికి ముందు వ్యక్తి సంస్థలలో పాల్గొంటాడని కనుక్కొన్నాడు. ఉదాసీనత, నిరాశావాదం, పరాయీకరణ, అనామీ మధ్య తేడాను గమనించడం ఎంతైనా అవసరం. ఉదాసీనత అంటే ఆసక్తి లేకపోవడం, నిరాశావాదం అంటే అయిష్టత, పరాయీకరణ అనామిక్ వేర్పాటు ధోరణి లేదా సంఘం నుంచి విడిపోవడంలను తెలియజేస్తున్నాయి. కానీ పరాయీకరణ అంటే రాజకీయాల పట్ల ద్వేషం ఉండటం, (Anomic) అంటే సందిగ్ధం (Confusion). వాటి స్థాయిలో తేడా ఉన్నప్పటికీ ఇవన్నీ రాజకీయ కార్యక్రమాలలో పాల్గొననివారితో పాటు రాజకీయాలలో పాల్గొనేవారిని కూడా ప్రభావితం చేస్తాయి. పరాయీకరణ రాజకీయ క్రియారహిత చర్యగా కాక తగినంత రాజకీయ కార్యక్రమాలకు దారి తీసి హింసాత్మక రాజకీయ చర్యలకు దారి తీయవచ్చు.

## 9.9 రాజకీయ భాగస్వామ్యం - కారకాలు

రాజకీయ వ్యవస్థ పనితీరుతో సంతృప్తి చెందిన ప్రజలు అసంతృప్తి పొందినవారికంటే ఎక్కువగా పాల్గొం-టారు. ఆర్థికంగా సంతృప్తి చెందినవారు ఆర్థికంగా వెనుకబడినవారికంటె ఎక్కువగా పాల్గొనే అవకాశం ఉంది. రాజకీయ భాగస్వామ్యస్థాయిని రాజకీయాల పట్ల ఉన్న ఆసక్తిని, రాజకీయ సామర్థ్యం, రాజకీయ కార్యక్రమాలలో వాస్తవంగా పాల్గొనటాన్ని బట్టి చూడవచ్చు.

వివిధ ఎన్నికల అధ్యయనాలను సమీక్షిస్తూ యస్.యమ్. లిప్ సెట్ (S.M.Lisset) అనేక పరిసర కారకాలు ఓటర్ల ప్రవర్తనను ప్రభావితం చేస్తాయన్నారు. అవి, ఎన్నికల కాలం, ప్రభుత్వ విధానాలు, రాజకీయ పరిజ్ఞానం, సమూహాల ఒత్తిడి మొదలైనవి. వయస్సు, వృత్తి, హోదా, విద్యాస్థాయి, రాజకీయ ఆసక్తి, వార్తా ప్రచార సాధనాలు, నివాసస్థలం కూడా రాజకీయ భాగస్వామ్యాన్ని ప్రభావితం చేస్తాయి. పట్టణ ప్రాంతాలలో ఉండే ప్రజలు ఉన్నత సాంఘిక హోదా, ఎక్కువ ఆదాయం, వృత్తిపరంగా ఉన్నతమైన హోదా, రాజకీయ పరిజ్ఞానం, అత్యధిక రాజకీయాసక్తి, రాజకీయ సమాచారం కలిగి ఉంటారు. వీటికి భిన్నంగా ఉండే గ్రామీణ ప్రజలకన్నా ఎక్కువగా రాజకీయ కార్యక్రమాలలో పాల్గొనే అవకాశముంది. రాజకీయ భాగస్వామ్యం సామాజిక పరిస్థితులపై కూడా ఆధారపడి ఉంటుంది. విభిన్న సాంఘిక, రాజకీయ వ్యవస్థలున్న వివిధ రాజ్యాలలో రాజకీయ భాగస్వామ్యంలో తేడాలుంటాయి. కానీ మౌలిక పద్ధతులు మాత్రం ఒకే విధంగా ఉంటాయి. మిల్ బ్రాత్ నాలుగు ప్రధాన కారకాల ననుసరించి రాజకీయ భాగస్వామ్యంలో తేడాలుంటాయని పేర్కొన్నాడు : 1. ఒక వ్యక్తి పొందే రాజకీయ ప్రేరణ/ఉత్తేజస్థాయి, 2. వ్యక్తుల వ్యక్తిగత లక్షణాలు, 3. వ్యక్తుల సామాజిక లక్షణాలు, 4. తన చుట్టూ ఉన్న రాజకీయ పరిస్థితులు/వాతావరణం.

వ్యక్తుల, సంస్థలతో గల సంబంధాలు, వార్తా ప్రచార సాధనాలద్వారా ఒక వ్యక్తి పొందే రాజకీయ ప్రేరణనుబట్టి అతడు రాజకీయ కార్యక్రమాలలో పాల్గొంటాడు. రాజకీయ సామాజికీకరణ ప్రక్రియలో ఒక వ్యక్తి రాజకీయ పరిజ్ఞానానికి ఇంకో వ్యక్తి రాజకీయ పరిజ్ఞానానికి తేడా ఉంటుంది. రాజకీయాలలో ఎవరికైతే ఆసక్తి ఉంటుందో వారికి రాజకీయ ప్రక్రియలో పాల్గొనే అవకాశం ఉంటుంది.

వ్యక్తుల పరిజ్ఞానం, విలువలు, దృక్పథాలు, అనుభవాలు, వ్యక్తిత్వం మొదలైన అంశాలు ఒక వ్యక్తి రాజకీయ ప్రేరణను, రాజకీయ కార్యక్రమాలలో పాల్గొనే స్థాయిని ప్రభావితం చేస్తాయి. ఇదే విధంగా వ్యక్తుల విలువలు, దృక్పథాలు, రాజకీయ భాగస్వామ్యానికి వ్యతిరేకంగా పనిచేసి, అతనిని నిరాశావాదిగా, పరా-యీకరణ పొందినవాడుగా, అనామిక్ చేయువచ్చు లేదా రాజకీయ కార్యక్రమాలను ప్రోత్సహించవచ్చు. ఎందుకంటే వారు తమ విధులను, విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తించరని లేదా లక్ష్యాలను సాధించరనే భావన కలిగించవచ్చు. సాంఘికంగా ఆధిక్యత ఉన్నవారు బహిర్ముఖ (extrovert) వ్యక్తిత్వం గలవారు సాంఘికంగా అణిచివేయబడినవారి కంటే, అంతర్ముఖ (Inrovert) వ్యక్తిత్వం గలవారికంటే ఎక్కువగా రాజకీయ కార్యక్రమాలలో పాల్గొనే అవకాశముంది.

ఒక వ్యక్తి సాంఘిక, ఆర్థిక హోదా, అతని సాంఘిక లేదా జాతి సమూహం, వయస్సు, స్త్రీ పురుషభేదం, మతం గ్రామీణ పట్టణ నివాసం, స్వచ్ఛంద సంస్థల సభ్యత్వం మొదలైన సాంఘిక పరిస్థితులు అతని రాజకీయ భాగస్వామ్యాన్ని ప్రభావితం చేస్తాయి.

ఒక ప్రత్యేక రాజకీయ వ్యవస్థలోని రాజ్యాంగ, సంస్థాపరమైన ఏర్పాట్లు, రాజకీయ పార్టీ స్వభావం, ప్రాంతీయ

అసమానతలు, ప్రత్యేక సంఘటనలను ప్రభావితం చేసే కారకాలు మొదలైన రాజకీయ పరిస్థితులు రాజకీయ భాగస్వామ్యాన్ని ప్రభావితం చేస్తాయి. ఇదేవిధంగా ఎన్నికల వ్యవస్థ కూడా రాజకీయ భాగస్వామ్యాన్ని ప్రభావితం చేస్తుంది. సంఘం ధనిక, పేద వర్గాలుగా విభజించబడి ఉంది. ఈ వర్గాలు రాజకీయ పార్టీల వృద్ధికి దోహదం చేస్తూ పార్టీల కొనసాగింపు, తక్కువ వర్గాలలో భాగస్వామ్యం వృద్ధి చెందడానికి దోహదం చేస్తాయి. ప్రాంతీయ అసమానతలు ఓటింగ్ ప్రవర్తనలో తేడాకు ఆధారం అవుతున్నాయి. రాజకీయ భాగస్వామ్య రూపం, స్వభావం వివిధ రాజకీయ వ్యవస్థలలో వేరువేరుగా ఉంటుంది. ఇన్ని తేడాలున్నప్పటికీ అన్ని రాజకీయ వ్యవస్థలలో రాజకీయ భాగస్వామ్యానికి, వ్యక్తిగత సామాజిక లక్షణాలు కలిగిన రాజకీయ క్రియాశీలకులకు మధ్య ఒక రకమైన సంబంధం కనిపిస్తుది. ఈ సంబంధం ప్రతి రాజకీయ వ్యవస్థ సాంఘిక, రాజకీయ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంధి. ఆధునిక ప్రజాస్వామ్యాలకు సరళ సామాజిక స్థరీకరణ వ్యవస్థ, సిద్ధాంతపరంగా రాజకీయ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే రాజకీయ పరిస్థితులు ఉంటాయి. ప్రాచీన సమాజాలు సామాజిక రాజకీయ సమగ్రతను అందించాయి. ఈ సమాజాలలో ఆధునిక సమాజాల మాదిరికాక రాజకీయ, ఇతర కార్యకలాపాల మధ్య తేడా చాలా తక్కువగా ఉండేది. సంపూర్ణాధికార రాజ్యాలలో కూడా సాంఘిక, రాజకీయ కార్యకలాపాల మధ్య సమైక్యత సాధించడం జరుగుతుంది. కానీ సాంప్రదాయక సమాజాలలో మాదిరి కాక రాజకీయ పరిస్థితులు సిద్ధాంత రూపం దాల్చి సాంఘిక పరిస్థితులపై ఆధిక్యతను పొందుతాయి. అభివృద్ధి చెందుతున్న సమాజాలలో సాంఘిక, రాజకీయ పరిస్థితులు వేరువేరుగా ఉంటాయి. సాంఘిక పరిస్థితులు దృఢమైన సంప్రదాయ వ్యవస్థపై ఆధారపడి ఉండగా, సామాజిక స్థరీకణ ఆధునికీకరణ వత్తిడులు సంప్రదాయ సాంఘిక విలువలను పడగొట్టడానికి ప్రయత్నిస్తుంటాయి. రాజకీయ పరిస్థితులు ఆధునికీకరణపై ఆధారపడి ఆధునిక రాజకీయ సంస్థలు ఏర్పాటు చేయగా, రాజకీయ ప్రవర్తనను సాంప్రదాయక వత్తిడులు నిర్ణయిస్తాయి.

BRAOU

వ్యక్తిగత రాజకీయ ప్రవర్తన, రాజకీయ భాగస్వామ్యాల గురించి వివరించడం ఏమంత కష్టం కాదు. యస్.యమ్. లిప్‌సెట్ (S.M.Lipset) విస్తృత స్థాయిలో అధ్యయనాలు, సమాచారాన్ని బట్టి ఓటు చేయటం మొదలుకొని ఎన్నికల ప్రవర్తన, ఓటు చేసే దిశ, అధికార ఉద్యమాలకు మద్దతుకు సంబంధించిన వివిధాంశాలను వివరించాడు. వ్యక్తికి సంబంధించిన (రాజకీయ ప్రవర్తన) సాంఘిక, రాజకీయ దృక్పథాల మధ్య పరస్పర చర్య, అతని చుట్టూ ఉన్న పరిస్థితులు అతని రాజకీయ ప్రవర్తనను నిర్ణయిస్తాయని, అధిక సంఖ్యలో జరిగిన అధ్యయనాల వల్ల తెలుస్తున్నది. వివిధ వ్యక్తిగత సాంఘిక లక్షణాల మధ్య సంబంధం సృజనాత్మక, సృజనాత్మకం కాని ప్రేరణ ఫలితమే రాజకీయ ప్రవర్తన.

## 9.10 రాజకీయ భాగస్వామ్యం - ప్రేరణలు

వెబర్ నాలుగు రకాల ప్రేరణలను సూచించాడు. అవి:

1. హేతుబద్ధమైన విలువ (The value - rational):- ఒక సమూహం లేదా ఉద్యమం విలువలు హేతుబద్ధంగా ఉండటం.
2. ఉద్రేకపూర్వక పీడిత/ఉద్రేకానికి గురియైన (The emotional - affectual):- ఒక భావం (Idea) సంస్థ లేదా వ్యక్తి పట్ల నిరసన లేదా ఆసక్తి (enthusiasm)
3. సాంప్రదాయక (The Traditional):- ఒక వ్యక్తి తాను చెందిన సాంఘిక సమూహ ప్రవర్తనను అంగీకరించడం.
4. హేతుబద్ధమైన ఉద్దేశాలు (The Purposive - Rational):- వ్యక్తి ప్రయోజనం ( Advantage)..

మీద ఆధారపడి ఉంటుంది.

రాబర్ట్ హవ్ (Robert Have) తన అధ్యయనంలో రాజకీయ భాగస్వామ్యం నాలుగు కార్యకలాపాల నిర్వహణను పూర్తిచేస్తుంది అన్నాడు.

1. ఆర్థిక అవసరాలను సాధించటం
2. సాంఘిక సర్దుబాటు, ఆవశ్యకతను సంతృప్తిపరిచే సాధనం
3. ప్రత్యేకమైన విలువలను సాధించే సాధనం
4. సృజనాత్మకమైన మానసికమైన అవసరాలను తీర్చుకొనే సాధనం.

వెబర్, రాబర్ట్ హవ్‌ల విశ్లేషణను పరిశీలించిన తరవాత రాజకీయ భాగస్వామ్యాన్ని వ్యక్తి సాంఘిక, రాజకీయ దృక్పథాలు నిర్ణయిస్తాయని చెప్పవచ్చు. వ్యక్తిగత, సాంఘిక, రాజకీయ పరిస్థితులతో అతని రాజకీయ ప్రవర్తనకు సన్నిహిత సంబంధం ఉంటుంది. సాంఘిక, రాజకీయ పరిస్థితులు వివిధ సమాజాలలో వేరువేరుగా ఉంటాయి కాబట్టి రాజకీయ భాగస్వామ్యం స్థాయి కూడా ఒక రాజకీయ వ్యవస్థకు ఇంకొక రాజకీయ వ్యవస్థకి తేడా ఉంటుంది. వ్యక్తి, సాంఘిక, రాజకీయ పరిస్థితులలో తన అనుభవం ద్వారా తన రాజకీయ పునశ్చరణ (Orientation) వివిధ రకాల రాజకీయ ప్రవర్తనను అలవరచుకొంటాడు. నిరవధికంగా కొనసాగే సామాజికీకరణ ప్రక్రియలో ఇదొక భాగం. అంతేగాక వ్యక్తి భవిష్యత్ భాగస్వామ్యాన్ని ప్రభావితం చేసే సంక్లిష్ట కారకం.

మార్క్సిస్టుల ప్రకారం ప్రజల రాజకీయ భాగస్వామ్యం వ్యక్తిగతమైంది కాదు వర్గపరమైంది. కాబట్టి రాజకీయ భాగస్వామ్యమంటే కార్మిక కర్షక వర్గ రాజకీయ కార్యక్రమం. రాజకీయ భాగస్వామ్యం కీలక చర్య ప్రధానంగా కేంద్ర రాజకీయపరమైంది.

BRAOU

రాజకీయ భాగస్వామ్యం, రాజకీయ పరిజ్ఞానం రాజకీయ వ్యవస్థలో ప్రధాన అంశాలు. రాజకీయ వ్యవస్థ స్థిరత్వం, న్యాయ బద్ధత ఆ సమాజంలో అధిక సంఖ్యాక ప్రజలు రాజకీయ కార్యకలాపాలలో పాల్గొనటంపై ఆధారపడి ఉంటుంది. రాజకీయ భాగస్వామ్యం కొనసాగింపుకు రాజకీయ పరిజ్ఞానం, రాజకీయాలలో పాల్గొనడం ప్రధాన అంశాలుగా గుర్తించడమైంది. రాజకీయాభివృద్ధికి రాజకీయ భాగస్వామ్యం ప్రధాన సూచికగా రాజనీతి శాస్త్ర సాహిత్యంలో గుర్తింపు పొందింది. ఈ మధ్యకాలంలో రాజకీయ ప్రక్రియలో పౌరుని భాగస్వామ్య విశ్లేషణా పరిధిని విస్తృతం చేయటానికి ప్రయత్నాలు జరిగాయి.

సాంప్రదాయక రాజకీయ సిద్ధాంతవేత్తలు రాజకీయ భాగస్వామ్యం అర్థవివరణ చేయుటంలో చాలాకాలం విభేదించగా, ప్రైవేట్ వ్యక్తులు తమ కోరికల సాధనకై చేపట్టే సాధనంగా రాజకీయ భాగస్వామ్యాన్ని అర్థం చేసుకొనటంలో, నిర్వచించటంలో శాస్త్రీయ విద్యార్థుల మధ్య అంగీకారం ఏర్పడింది.

ఉదార ప్రజాస్వామ్యాలు, కమ్యూనిస్టులు చాలావరకు మూడో ప్రపంచ రాజ్యాలలోని రాజకీయ ప్రక్రియలో సాధారణ ప్రజానీకాన్ని కనీసం కొంత పాత్ర నిర్వహించవలసిందిగా కోరడం జరిగింది. ఆధునిక ప్రపంచంలో వాడుకలో ఉన్న ప్రజా సమూహాల రాజకీయ భాగస్వామ్యాన్ని ప్రజా సార్వభౌమాధికారాన్ని న్యాయబద్ధం చేస్తుంది.

వివిధ రాజ్యాలను రాజకీయ భాగస్వామ్య స్థాయిపై కాక స్వభావంపై విభజించడం జరిగింది. ఉదార ప్రజాస్వామ్యాలలో స్వచ్ఛంద రాజకీయ భాగస్వామ్యం ప్రమాణంగా తీసుకోవడమైంది. కానీ కమ్యూనిస్ట్ దేశాలలో నిర్బంధ రాజకీయ భాగస్వామ్యం సర్వసాధారణం. ప్రభుత్వాధికారాన్ని బలపరచడానికి రాజకీయ

భాగస్వామ్యం ఉపకరిస్తుంది. మూడో ప్రపంచ రాజ్యాలలో వ్యక్తిగత రాజకీయ భాగస్వామ్యం లక్షణం.

ఉదార ప్రజాస్వామ్య రాజ్యాలలో రాజకీయ భాగస్వామ్యం ఎంత తక్కువగా ఉన్నదనేది అత్యంత ప్రధానమైన యధార్థం. చాలా దేశాలలో మెజారిటీ ప్రజలు ఓటింగులో పాల్గొంటారు కాని మొత్తం ప్రజాస్వామ్య ప్రపంచంలో ఓటింగు తరవాత రాజకీయ కార్యకలాపాలలో అతి తక్కువమంది పాల్గొంటారు. కొంతమందికి రాజకీయాలలో, ప్రజాకార్యక్రమాలలో ఏమాత్రం ఆసక్తి ఉండదు.

జనాభాను మూడు ప్రధానమైన సమూహాలుగా (groups) విభజించవచ్చు.

1. తక్కువ సంఖ్యలో ఉండే పార్టీ కార్యకర్తలు. వీరు తమ చుట్టూ తమపై జరిగే పార్టీ యుద్ధంలో సైనికులు వంటివారు.
2. మెజారిటీలో ఉండే ఓటర్లు.
3. రాజకీయాలను విస్మరించే క్రియారహితులు/అచేతనులు (రాజకీయాలపట్ల ఆసక్తిలేనివారు).

రాజకీయ భాగస్వామ్యం విద్యాధికులు మధ్యతరగతి, మధ్య వయస్కుల మధ్యనే కేంద్రీకరించబడుతుంది. సాంఘికంగా ప్రత్యేక సౌకర్యాలు కలిగి ప్రయోజనం పొందే ప్రజలు (సాంఘికంగా వృద్ధి చెందినవారు) సాంఘికంగా వెనకబడిన ప్రజల కన్న ఎక్కువగా రాజకీయాలలో పాల్గొనే అవకాశం ఉందని తులనాత్మక రాజకీయాలు (Comparative Politics) నిర్ధారించాయి. రాజకీయ భాగస్వామ్య పద్ధతులు సాంఘిక అసమానతలను ప్రతిబింబిస్తాయి. రాజకీయ భాగస్వామ్యంలోని తేడాలను, రాజకీయ అవకాశాలు, ఆసక్తిలో గల తేడాలను బట్టి వివరించవచ్చు.

BRAOU

కమ్యూనిస్ట్ రాజ్యాలలో విధాన రూపకల్పన, నాయకుల ఎంపికలో శక్తిమంతమైన కమ్యూనిస్ట్ పార్టీ నాయకులే పార్టీ శిష్టవర్గం ప్రధాన పాత్ర నిర్వహిస్తారు. సాధారణ పౌరుల పాత్ర పరిమితం చేయబడింది. ఏది ఏమైనప్పటికీ రాజకీయ కార్యక్రమాలలో క్రియాశీలకంగా పాల్గొనే జనాభా నిష్పత్తి ఉదాహరణకు ప్రజాస్వామ్యాలలో కంటే కమ్యూనిస్ట్ రాజ్యాలలోనే ఎక్కువగా ఉంది. ప్రతిపాదించిన విధానంపై పౌరుడు నిర్దేశించిన విధంగా చర్చలు, అపార్ట్‌మెంట్ లేదా కమ్యూనిస్ట్ పాలనను నిర్వహించే కమిటీలు మొదలైన కార్యక్రమాలలో పాల్గొంటారు. ఈ కార్యక్రమాలలో కమ్యూనిస్ట్ పార్టీ సభ్యులు ప్రధాన పాత్ర నిర్వహిస్తూ తోటి పౌరులకు ఉత్తేజాన్ని కలిగిస్తారు. కమ్యూనిస్ట్ రాజ్యాలలో వత్తిడి ద్వారా రాజకీయ భాగస్వామ్యం ఎక్కువగా ఉందనటం సరియైంది కాదు. కార్మికుని కమ్యూనిటి సర్వీసును నొక్కి చెప్పడం ద్వారా చాలావరకు కమ్యూనిస్ట్ శిష్టవర్గాలు స్వచ్ఛంద ప్రజాసమూహాల భాగస్వామ్యాన్ని అధికం చేస్తారు.

కమ్యూనిస్ట్ దేశాలలోని ప్రజాసమూహాల భాగస్వామ్యాన్ని రెండురకాలుగా వ్యాఖ్యానించడం జరిగింది. మొదటిది సంప్రదాయవాదులు (Order School) రాజకీయాలలో ప్రజలను నిర్బంధం ద్వారా పాల్గొనేటట్లు చేయడమైంది. రెండోది, కొన్ని కమ్యూనిస్ట్ రాజ్యాలలో రాజకీయ భాగస్వామ్యం ప్రధానమైందని ఈ మధ్యకాలంలో అభిప్రాయ పడింది. ఈ అభిప్రాయం ప్రకారం కమ్యూనిస్ట్ రాజ్యాలలో రాజకీయాలలో పాల్గొనే అవకాశాల పరిధి ఉదార ప్రజాస్వామ్యాలలో కంటే ఎక్కువగా ఉన్నది. ప్రజల డిమాండ్స్ (కోరికలు) విద్యాధికులకు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేయటానికి అధిక స్వాతంత్ర్యం ఇవ్వడం పట్ల స్థానిక రాజకీయ నాయకులకు గౌరవం పెరుగుతుందని అంచనా వేయడం జరిగింది. నేడు ప్రతిభావంతమైన రాజకీయ భాగస్వామ్యం కోసం ప్రజలకు ఎక్కువ అవకాశాలు కల్పించాలని నొక్కిచెప్పడం జరుగుతోంది. కమ్యూనిస్ట్ రాజ్యాలు వృద్ధిని సాధించిన సమాజాలుగా మారడంతో రాజకీయ భాగస్వామ్య స్వభావంలో అభివృద్ధి వచ్చిందని

నిస్సందేహంగా చెప్పవచ్చు. కమ్యూనిస్ట్ ప్రపంచమంతటా ఒకే నమూనా భాగస్వామ్యం లేదు. మొదటి ప్రపంచ రాజ్యాలలో కంటే రెండో ప్రపంచరాజ్యాల రాజకీయాలలో గుణాత్మక రాజకీయ భాగస్వామ్యం ఉన్నదనటంలో సందేహం లేదు. పౌరునికి స్వపరిపాలనలో శిక్షణనివ్వడం కమ్యూనిస్ట్ సిద్ధాంతంలోని ప్రధానమైన అంశం. అయితే పార్టీ అత్యున్నతాధికారాన్ని కొనసాగించటం దీనికంటే మౌలికమౌంది. కమ్యూనిస్ట్ రాజ్యాలలో జాతీయ విధానాలకు సంబంధించిన రాజకీయ భాగస్వామ్యం చాలా తక్కువగా నియంత్రించడమవుతుంది. ప్రత్యేక విధానాలు సాధారణ పౌరులకంటే ప్రత్యేక నిపుణులు రూపొందిస్తారు. పార్టీ అత్యున్నతాధికారం కింద స్థానిక ప్రత్యేక సాంకేతిక భాగస్వామ్య రూపాలు వ్యవస్థ సునాయాసంగా కొనసాగడానికి దోహదం చేస్తాయి.

సోవియట్ పౌరులు తరచుగా నిర్వహించే ఎన్నికలలో పాల్గొంటారు. వారు వివిధ రకాల సమూహాలకు చెంది ఉండి రాజకీయ ప్రక్రియలో తమ పాత్రను నిర్వహిస్తారు. తద్వారా అధికారులకు ప్రభుత్వ వ్యవస్థ ప్రజామద్దతు పొందడమే లక్ష్యం కాని విధానాన్ని ప్రభావితం చేయడం లేదా నాయకులను ఎన్నుకోవడం కాదు. ఎన్నికల నిర్వచనం వల్ల అభ్యర్థుల ఎంపికలో శిష్టులమధ్య పోటీగా కాక రాజకీయ శిష్టవర్గం కార్యక్రమాలను ప్రచారం చేయడానికి ప్రజాస్వామికంగా మద్దతును సాధించడమే లక్ష్యం. ఎన్నికలలో ఓటర్లు 99% ఓటింగ్‌లో పాల్గొంటారు. అదే విధంగా ట్రేడ్‌యూనియన్లు, వృత్తి సంబంధమైన సంస్థలు ప్రజలను నియంత్రించడానికి సాధనంగా ఉపయోగపడతాయి. ఉద్యోగాలు పొందడానికి ఈ సంస్థలలో సభ్యత్వం తప్పనిసరి.

సోవియట్ రష్యాలో రాజకీయ భాగస్వామ్యం మద్దతు పొందటానికి తగిన ప్రోత్సాహం ఉంది. ఫలితంగా సాంఘిక, వ్యక్తిగత చర్యలు రాజకీయ చర్యలుగా మారాయి. భాగస్వామ్యం కేవలం జీవనోపాధి సాధించే సాధనం కాదు. రాజ్యలక్ష్యాలను సాధించటానికిది ఒక మార్గం. పౌరుల రాజకీయ భాగస్వామ్యం తమ కోరికల సాధన కోసం ప్రభుత్వంపై వత్తిడి చేయడం కోసం కాక అధికారుల విధానాలకు మద్దతు చేయడం కోసం కాక అధికారుల విధానాలకు మద్దతు పొందటం వాటిని పాటించటానికి సాధనంగా పరిగణించటం జరుగుతుంది.

BRAOU

చైనాలో రాజకీయ కార్యక్రమాలలో పౌరుల భాగస్వామ్య లక్ష్యం పౌరుల పునఃసామాజికీకరణ అన్ని రకాల రాజకీయ చర్యలు ప్రజలను విద్యావంతులను చేయటానికి అవసరంగా ఉపయోగించడం జరిగింది. [అధ్యయన సమూహమే రాజకీయ భాగస్వామ్య రూపంగా ఉపయోగించబడిది]. పౌరులు చిన్న సమూహాలలో పాల్గొనడంతోపాటు తరచుగా పౌరులు ప్రజాప్రదర్శనలు, ఊరేగింపులలో పాల్గొనటానికి ప్రజా కార్యక్రమాలలో పాల్గొంటారు. జాతీయ స్థాయి ప్రచార ఉద్యమంలో వ్యక్తిగత భాగస్వామ్యాన్ని పెంచుతున్నామనే భావనను కలిగించటంలో ప్రజాకార్యక్రమాలు ప్రధానపాత్ర వహిస్తాయి. పౌరులు ఎన్నికల ప్రక్రియలో కూడా పాల్గొంటారు. ఎన్నికలు పార్టీ విధానాలను ప్రచారం చేయడానికి, ప్రజామద్దతును పెంచడానికి సాధనాలుగా ఉపయోగపడతాయి కాని నాయకులను ఎన్నుకోవడానికి కాదు. చైనాలో రాజకీయ భాగస్వామ్యం మొత్తంమీద నియంత్రించబడి ఎక్కువస్థాయిలో ఉంది.

అభివృద్ధి చెందుతున్న దేశాలలో రాజకీయ భాగస్వామ్యం విలాసవంతమైంది. (Luxury), ఎందుకంటే సాధారణ మానవుడు తన సామర్థ్యాన్ని, సమయాన్నంతా జీవించడానికి కావలసిన జీవనోపాధిని సంపాదించటానికి వెచ్చిస్తాడేకాని రాజకీయాల గురించి ఆలోచించడు. నిరక్షరాస్యత, వార్తా రవాణా సౌకర్యాల కొరత, కులం, జాతి, మత సంబంధ విధేయతలు జాతీయ సమైక్యత సమస్యలనెదుర్కొనటం, సాంస్కృతికంగా బహుళజాతి రాజ్యంలోని రాజకీయాలలో పాల్గొనటానికి ప్రధానమైన ఆటంకాలు.

అతి తక్కువ భాగస్వామ్యం అభివృద్ధిని కుంటుపరుస్తుంది. ఒక రాజ్యం అభివృద్ధి చెందాలంటే ప్రజల సామర్థ్యం, నైపుణ్యం, రాజ్యాభివృద్ధి, ఆర్థిక కార్యక్రమం, సాంఘిక సంస్కరణలో ఉపయోగించడం జరగాలి. ఇంకా ప్రతిభావంతమైన రాజకీయ సంస్థలను రూపొందించడం అనేది తరచుగా పౌరుల భాగస్వామ్యంపై ఆధారపడుతుంది.

అత్యధిక భాగస్వామ్యం ఇంకొక పక్క అస్థిరత్వానికి దారి తీయవచ్చు. సాంఘిక, ఆర్థికమార్పు, రాజకీయాభివృద్ధి వల్ల పెంపొందిన ఉద్రిక్తలు నిరసనలకు, ధర్నా, దొమ్మి, హింస వివిధ రూపాలలో రాజకీయ విమర్శలకు దారితీసి నూతన రాజకీయ సంస్థలకు వీటిని నియంత్రించడం చాలా కష్టమవుతుంది. రాజకీయ సంస్థలను నూతనంగా ఏర్పాటు చేసి తగినంతగా అభివృద్ధి చెందకపోతే తక్కువస్థాయి రాజకీయ భాగస్వామ్యం కూడా రాజకీయ సంస్థలకు అంతరాయం కావచ్చు. త్వరితగతిని సాధించే సాంఘిక, ఆర్థిక ఆధునికీకరణ సాంఘిక ప్రమాణాలను, విలువల పతనానికి దారితీయవచ్చు. ఈ పరిస్థితులలో ప్రజాసమూహాల రాజకీయ భాగస్వామ్యం హింసకు దారితీసి అమలులో ఉన్న రాజకీయ సంస్థ పతనానికి దారితీయవచ్చు.

రాజకీయ భాగస్వామ్యాన్ని విస్తృతం చేయడంద్వారా రాజకీయ సంస్థను పటిష్టం చేస్తూ దేశంలో రాజకీయ స్థిరత్వం, శాంతి భద్రతలను పెంపొందించినప్పుడే రాజకీయ సంస్థలు నూతనంగా రాజకీయాలలో పాల్గొనే ప్రజలను నియంత్రించగల సామర్థ్యం పొందుతాయి.

మూడో ప్రపంచ రాజ్యాలలో ప్రజా సమూహాల రాజకీయ భాగస్వామ్యం గుణాత్మకంగా పరిమితమైంది. తక్కువ విద్యాస్థాయి, తరచుగా నిరక్షరాస్యులైన జనాభా, అనారోగ్యంతో, గ్రామీణ నివాసం, రాజ్య కార్యక్రమాలలో చాలా పరిమితంగా పాల్గొంటారు. బలహీనమైన ప్రభావవర్గాలు, భాగస్వామ్యం కంటే పదవిలో కొనసాగాలనుకొనే నాయకులతో మూడో ప్రపంచంలోని ఉదార ప్రజాస్వామ్యాలు, కమ్యూనిస్ట్ రాజ్యాలు రెండింటిలోను రాజకీయ భాగస్వామ్యాన్ని పెంపొందించాలని ఊహించడంలేదు. మూడో ప్రపంచ రాజ్యాలలో కూడా రాజకీయ భాగస్వామ్య స్థాయిలలో గుణాత్మక, పరిమాణాత్మక తేడాలున్నాయి. రాజకీయ భాగస్వామ్యం, సాంస్కృతిక చరిత్ర, వారసత్వం, స్వాతంత్ర్యం పొందిన సమయం, ప్రభుత్వం సాధించే ఆర్థిక, సాంఘిక అభివృద్ధి విధానాలు, రాజ్య ప్రభుత్వ స్వభావాలపై ఆధారపడి ఉంటుంది. మూడో ప్రపంచంలో రాజకీయ భాగస్వామ్య పద్ధతులు దశలు ప్రత్యేకమైనవి. యజమాని - సేవిక (Patron - client), పోషకుడు- పోషింపబడేవాడు సంబంధాల ద్వారా సాధారణ ప్రజలను రాజకీయాలలోకి తెప్పిస్తున్నారు. ఈ రకమైన విధేయతా సేవలు ఉన్నతమైన హోదా కలిగిన యజమానికి తక్కువ హోదాగల సేవకులకు మధ్య సంబంధం ఉంటుంది. యజమానికి విశ్వాసపాత్రులై సేవకులు ప్రతిఫలంగా కొంత రక్షణ, భద్రత పొందుతారు. మూడో ప్రపంచ రాజ్యాలలో ఈ రకమైన సంబంధాలు ఉండడానికి కారణం రాజకీయ భాగస్వామ్య మార్గాలైన రాజకీయ పార్టీలు, ప్రభావ వర్గాలు కానికావు. దారిద్ర్యం, అసమానతలు ప్రధానమైన కారణాలు.

ప్రజాస్వామ్యం అంటే ప్రజాప్రభుత్వం. ఇది ప్రజాభీష్టం, వయోజనుల మద్దతుపై ఆధారపడి ఉంది. ప్రజాస్వామ్య ప్రక్రియలో ఎన్నికలు అత్యంతావశ్యకమైన, విడదీయరాని భాగం. ఎన్నికలు లేకుండా ప్రజాభీష్టం నిర్ణయించలేం. ప్రజాస్వామ్యంలో ప్రజాభీష్టానికి ఆధిక్యత ఉంటుంది.

## 9.11 రాజకీయ భాగస్వామ్యం - ఎన్నికలు

రాజకీయ భాగస్వామ్యం అనే పదం ఎప్పుడైతే ఎన్నికలతో ముడిపడిందో అప్పటినుంచి భాగస్వామ్య

BRAOU

అధ్యయనానికి ఎన్నికలు ప్రధాన కేంద్రంగా మారాయి. పౌరులు రాజకీయాలలో పాల్గొనడానికి ప్రత్యామ్నాయ మార్గాలున్నప్పటికీ భారతదేశంలో ప్రజలకు రాజకీయాలలో పాల్గొనడానికి ఎన్నికలు మాత్రమే అవసరమైన ప్రేరణను కల్పిస్తాయి. ఈ పరిస్థితులలో బహిర్గతమయ్యే రాజకీయ భాగస్వామ్యంలోని వివిధ అంశాలను పరిశీలించవచ్చు.

ప్రాతినిధ్య సంస్థలకు నిర్వహించే ఎన్నికలు ప్రజాస్వామ్య సమాజ పునర్నిర్మాణానికి, రాజకీయాభివృద్ధి కార్యరీతికి సాధనాలు. లాంఛన ప్రాయమైన ప్రాతినిధ్య ప్రజాస్వామ్య సంస్థలను రూపొందించడం జరిగింది. ఒక సంవత్సరం, ఇంకొక సంవత్సరానికి, ఒక ఎన్నికకు మరొక ఎన్నికకు భౌతిక గమనశీలత, రాజకీయ భాగస్వామ్యం పెరుగుతున్నది.

ప్రవర్తనావాద విప్లవం రాజనీతిశాస్త్ర అధ్యయనం నూతనోత్సాహం పొందుతూ 1950, 1960 దశకాలలో రాజకీయ ప్రవర్తన, ఓటింగ్ ప్రవర్తనను కీలక అంశాలుగా ఎన్నికల ప్రక్రియ అధ్యయనంపై కేంద్రీకరించింది. ఓటింగ్ ప్రవర్తన విషయంలో రాజకీయ భాగస్వామ్యం నూతనమైన క్రియాశీలక అర్థాన్ని సంతరించుకుంది. ప్రజల రాజకీయ భాగస్వామ్యంలో అత్యంత ప్రాధాన్యతగల సాధనం ఓటింగ్. ప్రజాస్వామ్యంలో రాజకీయ ప్రక్రియను అర్థం చేసుకోవడానికి రాజకీయ భాగస్వామ్యం ప్రధాన సాధనంగా మారింది. రాజకీయ వ్యవస్థ రూపాలను బట్టి రాజకీయ భాగస్వామ్యం మారిపోతుంది. ఉదారప్రజాస్వామ్య ప్రభుత్వంలో రాజకీయ భాగస్వామ్యం అత్యధికంగా ఉంటుంది. రాజకీయాభివృద్ధికి రాజకీయ భాగస్వామ్యం ప్రామాణికమని కొందరు అభిప్రాయపడ్డారు. రాజకీయ భాగస్వామ్యం రాజకీయ వ్యవస్థకు స్థిరత్వాన్ని, న్యాయబద్ధతను చేకూరుస్తుంది. ఈ విధంగా కమ్యూనిస్ట్ రాజ్యాలు కూడా రాజకీయ భాగస్వామ్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నాయి.

BRAOU

అన్ని రకాల రాజకీయ వ్యవస్థలను పరిశీలించిన తర్వాత భారతదేశం ప్రజాస్వామ్య ప్రభుత్వం వైపు మొగ్గు చూపింది. కానీ ఇంత సుదీర్ఘమైన అనుభవం తర్వాత చాలామంది భారతీయులు ప్రజాస్వామ్యం వాస్తవికత కంటే ప్రేరణ కల్పించేదిగానే మిగిలిపోయిందని భావిస్తున్నారు. కాబట్టే రాజకీయ భాగస్వామ్యం ప్రాధాన్యత సందర్భాన్నిబట్టి ఉంటుంది.

1947 సంవత్సరంలో స్వాతంత్ర్యం పొందిన నాటినుంచి పార్లమెంటరీ ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలు క్రమం తప్పకుండా నిర్వహించిన దేశాలలో భారతదేశం ఒకటి. భారత ప్రభుత్వం జాతి, కుల, వర్ణ విచక్షణ లేకుండా సాహసోపేతమైన వయోజన ఓటింగ్ వ్యవస్థను నిరక్షరాస్యులైన భారతీయులపై అత్యంత విశ్వాసంతో అమలు చేసింది. కానీ భారత ప్రజలు నిరక్షరాస్యులైన యజమానులుగా తమ నాయకుల, దేశ సౌభాగ్యాన్ని తిరిగి రాయడంలో తమ సామర్థ్యాన్ని రుజువు చేసుకొన్నారు. ఏ ప్రభుత్వం విజయమైనా, అపజయమైనా ప్రభుత్వ కార్యక్రమాలలో ప్రజల భాగస్వామ్యం మీద ఆధారపడి ఉంటుంది. భారత దేశం దీనికి అతీతం కాదు.

ఎన్నికలు ప్రజలకు తమ ప్రతినిధులను ఎంపిక చేసుకోవడానికే కాక రాజకీయాలలో పాల్గొనటానికి అవకాశం కల్పిస్తాయి. సమకాలీన రాజకీయ అంశాలను తెలియజేస్తూ, రాజకీయ వ్యవస్థలో మార్పులు తేవడానికి ఎన్నికలు ప్రధానమైనవి. ఆధునిక రాజ్యం ఎన్నికల వ్యవస్థ ఒక రాజకీయ పద్ధతిగా ప్రజావ్యవహారాలలో పాల్గొంటున్నామనే భావాన్ని కలిగిస్తాయి.

ఎన్నికలు ఓటరు, రాజకీయ వ్యవస్థల పట్ల విభిన్న విధులను నిర్వర్తిస్తాయి. ఓటరుకు రాజకీయ భాగస్వామ్యానికి సాధనంగాను రాజకీయ వ్యవస్థకు న్యాయబద్ధత, విశ్వాసాలను ప్రసాదిస్తూ వ్యవస్థ కొనసాగింపుకు

మద్దతును సాధించే ముఖ్యసాధనంగా ఎన్నికల వ్యవస్థ విభిన్న పాత్రలు నిర్వహిస్తుంది.

ఎన్నికల ప్రధానవిధి రాజకీయ భాగస్వామ్యానికి అవకాశాలను, మార్గాలను కల్పించడం. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఆవశ్యకమైన రాజకీయ భాగస్వామ్యానికి ఎన్నికలు అతి ప్రధానమైనవి. రాజకీయ భాగస్వామ్యం ప్రజాస్వామ్య వ్యవస్థను పటిష్ఠం చేస్తుంది.

## 9.12 ముగింపు

రాజకీయాలలో పాల్గొనటానికి ఉండే రూపాలు, ప్రేరణ ఒక రాజకీయ వ్యవస్థకు ఇంకొక రాజకీయ వ్యవస్థకు తేడా ఉంటుంది. విభిన్న రాజకీయ వ్యవస్థలలో రాజకీయ భాగస్వామ్యంపై కొన్ని పరిమితులు ఉండవచ్చు. దారిద్ర్యం, నిరక్షరాస్యత, వార్తా రవాణా సౌకర్యాలలో ఉండే సాధారణ సమస్యల వల్ల అభివృద్ధి చెందుతున్న దేశాలలో రాజకీయ భాగస్వామ్యం పరిమితంగా ఉంటుంది. సంపూర్ణాధికార రాజ్యాలలో రాజకీయ భాగస్వామ్యం పరిపాలకులు నియంత్రిస్తారు. ఉదార ప్రజాస్వామ్య రాజ్యాలలో ప్రజల సహకారం, విశ్వాసం పొందడానికి సాధారణంగా రాజకీయ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం జరుగుతుంది.

ఆర్థిక, పరిసరాలు, రాజకీయ వ్యవస్థ, న్యాయ అవసరాలు గ్రామీణ, పట్టణ సంస్కృతి వ్యక్తి రాజకీయ ప్రవర్తనను ప్రభావితపరిచే కొన్ని ప్రధాన కారకాలు. ధనవంతులు వారికివారే రాజకీయ కార్యక్రమాలలో పాల్గొంటారని భావించడమైంది. ఎన్నికల కాలం, ఎన్నికల ప్రాధాన్యత గురించి అందించిన సమాచారం ఎన్నికలలో ఎక్కువమంది ఓటర్లు ఓటింగ్‌లో పాల్గొనేటట్లు చేయవచ్చు. ఒత్తిడులు, ప్రతివత్తిడులు ఓటు చేయడానికి ఒత్తిడి తేవచ్చు. వయస్సు, విద్య, మతం, కులం, లింగభేదం, గ్రామీణ పట్టణవైవిధ్యం, వార్తా ప్రచారసాధనాలు, పరిజ్ఞానం సాధారణ ఆసక్తి మొదలైన పరిసర కారకాలు రాజకీయ భాగస్వామ్యం పరిధిని నిర్ణయిస్తాయి.

BRAOU

మిల్‌బ్రాత్ నాలుగు ప్రధాన కారకాలు దృష్ట్యా రాజకీయ భాగస్వామ్యంలో తేడాలుంటాయని పేర్కొన్నాడు. అవి:-

1. వ్యక్తి పొందే రాజకీయ ప్రేరణ పరిధి.
2. వ్యక్తి వ్యక్తిగత గుణగణాలు.
3. వ్యక్తి సాంఘిక గుణగణాలు.
4. వ్యక్తి నివసించే రాజకీయ పరిసరాలు ఈ కారకాల గురించి ఇంతకు ముందే చర్చించాం.

రాబర్ట్ ఎ. ఢాల్ అభిప్రాయం ప్రకారం కొంతమంది ప్రజలకు రాజకీయాల పట్ల ఉదాసీనతాభావం ఉండగా ఇతరులు రాజకీయాలలో సంపూర్ణంగా లీనమౌతారు. ఈ విధంగా రాజకీయాలలో లీనమయ్యేవారిలో కొద్దిమంది మాత్రమే అధికారాన్ని పొందుతారు. అధికారం పొందేవారిలో కూడా కొంతమంది మిగతావారికంటే ఎక్కువ అధికారాన్ని పొందుతారు.

రాబర్ట్ ఎ. ఢాల్ ప్రజలు రాజకీయాలలో ఎందుకు పాల్గొంటారనే దానికి నాలుగు కారణాలు సూచించాడు.

1. కుటుంబం, స్నేహితులు, అభిమానం (affection), గౌరవం, ఆటలాడటం, చదవటం మొదలైన మానవ కార్యక్రమాల వల్ల పొందే పురస్కారం (rewards), పారితోషికం కన్నా రాజకీయ పరిసరాలవల్ల పొందే పారితోషికం తక్కువగా ఉంటుందని అంచనా వేస్తే ప్రజలు రాజకీయాలలో తక్కువగా పాల్గొనవచ్చు.
2. ప్రజల ముందున్న ప్రత్యామ్నాయాలలో ప్రధానమైన తేడాలేనప్పుడు పర్యవసానంగా ఏమి

చేసినా పర్వాలేదనుకున్నప్పుడు వ్యక్తులు రాజకీయాలలో పాల్గొనవచ్చు.

3. ఒక వ్యక్తి తాను రాజకీయాలలో పాల్గొనడం వల్ల ప్రధానమైన మార్పు తేలేననుకొన్నప్పుడు అతను రాజకీయాలలో చాలా తక్కువగా పాల్గొనే అవకాశం ఉంది.
4. ప్రజలు రాజకీయాలలో తమ ప్రమేయం లేకుండానే కలిగే ఫలితం తృప్తికరంగా ఉంటుందని విశ్వసించినట్లయితే తక్కువగా పాల్గొనే అవకాశముంది.
5. ప్రజలు తమకు పరిమితమైన రాజకీయ పరిజ్ఞానం ఉన్నదని తద్వారా రాజకీయాలను ప్రభావితం చేయలేమని అనుకొన్నప్పుడు రాజకీయాలలో తక్కువగా పాల్గొనవచ్చు.
6. చివరగా తన మార్గంలో ఎక్కువ ఆటంకాలున్న వ్యక్తి రాజకీయాలలో తక్కువగా పాల్గొనే అవకాశముంది.

ఈ కారకాలన్నీ వ్యతిరేకంగా కూడా పనిచేయవచ్చు. అంటే ఒక వ్యక్తి రాజకీయాలలో ఎక్కువగా పాల్గొనవచ్చు.

1. అధిక ఫలితాలు లేదా పారితోషికం పొందవచ్చుననిఅంచనా వేసినప్పుడు.
2. తనకున్న ప్రత్యామ్నాయాలలో ఇది ప్రధానమనుకొన్నప్పుడు.
3. ఫలితాలను మార్చగలనని విశ్వసించినప్పుడు.
4. రాజకీయాలలో పాల్గొనకపోయినట్లయితే అసంతృప్తి కలుగుతుందని అతడు విశ్వసించినప్పుడు.
5. తన ముందున్న ప్రశ్నకు సమాధానం తెలుసుకొన్నప్పుడు లేదా విజ్ఞానం, నైపుణ్యం తనకున్నాయని అనుకొన్నప్పుడు.
6. రాజకీయాలలో పాల్గొనటానికి తక్కువ ఆటంకాలున్నప్పుడు.

BRAOU

**ఈ** కారకాలవల్ల కొంతమంది ప్రజలకు రాజకీయాలలో ఆసక్తి ఉండి రాజకీయాల గురించి తెలుసుకొంటారు. **రాజకీయాలలో** పాల్గొంటారు.

**లేన్ (Lane)** వంటి విద్యావేత్త రాజకీయ భాగస్వామ్యం నాలుగు విధులను పూర్తి చేస్తుందని వాదించాడు. **అవి:-**

1. భాగస్వామ్యం ఆర్థికపరమైన కోరికలను తృప్తిపరచడానికి దోహదం చేస్తుంది.
2. సామాజిక సర్దుబాటుకు సహాయపడుతుంది.
3. ప్రత్యేకమైన విలువలను సాధించడానికి తోడ్పడుతుంది.
4. అర్ధచైతన్య (Sub-conscisou) అవసరాలను తృప్తిపరచడంలో తోడ్పడుతుంది. దీనినిబట్టి వ్యక్తి రాజకీయ భాగస్వామ్యాన్ని వ్యక్తిగత సాంఘిక, రాజకీయ దృక్పథాలు, వ్యక్తి వ్యక్తిగత, సామాజిక గుణగణాలు, సాంఘిక రాజకీయ పరిసరాలు నిర్ణయిస్తాయి.

రాజకీయ అభీష్టం ఒక రాజకీయ వ్యవస్థకు ఇంకొక రాజకీయ వ్యవస్థకు మారుతుంది. ఎందుకంటే ఒక సమాజానికి ఇంకొక సమాజానికి ఉండే సాంఘిక, రాజకీయ పరిసరాలలో తేడా ఉంటుంది. కనీస అవసరాలైన ఆహారం, ఆప్యాయత, నిద్ర మొదలైనవి సంతృప్తి చెందిన తరువాతే రాజకీయ భాగస్వామ్యం పెరుగుతుంది. ఇవన్నీ పరిసరాల మీద ఆధారపడతాయి. కాబట్టి రాజకీయ భాగస్వామ్యం పరిసరాల స్వభావం, జనాభా సంబంధ (demographic) కారకాలపై ఆధారపడుతుంది.

-ఆచార్య ఎం. రాంచందర్

## 9.13 చదువదగిన పుస్తకాలు

| | | |
|---|---|---|
| Mukhopadhaya | : | Political Sociology |
| Taru Bottomore | : | Political Sociology |
| R.T. Jangam | : | Political Sociology |

## 9.14 నమూనా పరీక్షా ప్రశ్నలు

కింది ప్రశ్నలకు వ్యాసరూపంలో సమాధానాలు రాయండి.

1. రాజకీయ భాగస్వామ్యం అంటే ఏమిటి? అది ఎన్ని రకాలుగా ఉంటుంది.
2. ప్రజాస్వామ్యేతర దేశాలలో రాజకీయభాగస్వామ్యాన్ని విశ్లేషించండి.
3. రాజకీయ భాగస్వామ్య కారకాలను చర్చించండి.
4. రాజకీయ భాగస్వామ్యం - ఎన్నికలు విశ్లేషించుము.

BRAOU

# భాగం - 10 రాజకీయ పరాయీకరణం

## విషయక్రమం


10.1 లక్ష్యాలు

10.2 పరిచయం

10.3 రాజకీయ పరాయీకరణం స్వభావం.

10.4 రాజకీయ పరాయీకరణం

10.5 ఆది భౌతిక సిద్ధాంతం : నిత్యావసర, వాస్తవ అంశాల మధ్యఏకత.

10.6 మార్క్సియన్ సిద్ధాంతం : పరాయీకరణం

10.7 మార్క్స్ తదనంతరం : పరాయీకరణం

10.8 పరాయీకరణం : విమర్శలు

10.9 చదువవలసిన పుస్తకాలు

10.10 నమూనా పరీక్షా ప్రశ్నలు


## 10.1 లక్ష్యాలు

BRAOU

ఈ భాగాన్ని చదివాక మీరు

- పరాయీకరణం అంటే ఏమిటి
- దానిస్వభావం, ఆది భౌతిక, మార్క్స్
- మార్క్స్ తదనంతర పరాయీకరణ భావాలను

బాగా విశదీకరించగలుగుతారు.

## 10.2 పరిచయం

సాంస్కృతిక పునరుజ్జీవన యుగంలో హేతుబద్ధుడైన మానవునిపై మిధ్య ఆధిపత్యం వహించగా, 18వ శతాబ్దంలో మానవుడు సహజ మానవుడుగాను, 19వ శతాబ్దంలో మానవుడు ఆర్థిక, రాజకీయ మానవుడుగాను గోచరించగా, ఇరవైవ శతాబ్దపు చరిత్రకారులకు పరాయికరణ పొందిన మానవుడుగా గోచరిస్తాడని రాబర్టు నిస్‌బెట్ (Robert Nisbet) వివరించారు.

ఆధునిక రాజ్యపురాజకీయ ప్రక్రియలలో సామాజిక, ఆర్థిక సంక్షోభాలకు గల కారణాలలో పరాయికరణం ఒకటి. సామాజిక జీవనం సంక్లిష్టమైన కొద్ది వ్యక్తి సంఘం నుంచి దూరమవుతున్నాడు. వ్యక్తిగత సమస్యలు సంక్షోభాలు ఇబ్బందుల మూలంగా వ్యక్తి సమాజానికి దూరమయ్యే క్రమాన్నే పరాయీకరణం అంటున్నాం. తత్వశాస్త్రం, సామాజికశాస్త్రం, మనోవైజ్ఞానికశాస్త్రం అర్థశాస్త్ర వ్యవహారాలను రాజకీయాల అధ్యయనంతో కలిపి పరాయికరణం చర్చించాల్సి ఉంటుంది. ఉన్నతస్థాయి పారిశ్రామిక పెట్టుబడిదారీ స్వేచ్ఛా సమాజం, లేదా, కేంద్రీకృత వ్యవస్థల సంపూర్ణాధికార రాజ్యంలోనైనా ఏకరూపత బరువుకింద (Dead Weight of Uniformity) మానవుని వ్యక్తిత్వం నలిగిపోతున్నది. పర్యవసానంలో మానవుడు ఆర్థిక

కార్యకలాపాలలో నిమగ్నమై, తన గురించి ఆలోచించుకోవడానికి లేదా తన జీవితం గురించిన వాస్తవాలను తెలుసుకోవడానికి గాని అవకాశాలు లేకుండా పోయాయి. ఆధునిక సామాజిక రాజకీయ సిద్ధాంతకర్తలు దీనిని స్వీయపరాయీకరణం పొందిన మానవుడు (Self Alienated Man) గా పేర్కొన్నారు. ఒక వ్యక్తి వాస్తవిక అస్థిత్వం అతని స్వీయ అస్థిత్వంతో సరిపోలదు (Correspond). అనగా వ్యక్తి వాస్తవ సారాంశం అతనికే సరిగా గోచరించదు.

సంఘం విస్తృతమై, సంక్లిష్టమైనదై, ఉత్పాదకనైపుణ్యంపై ఆధారపడిన ఉన్నత సంస్థగా మారిపోయింది. మానవుడు ఉత్పాదకుడుగా (Producer) పరిగణింపబడటంవల్ల, అతని వ్యక్తిగత సంబంధాలు అర్థరహిత మైనవైనవి. సాపేక్షకంగా సమాజం సంపన్నమైంది. ఉత్పత్తి కార్యక్రమాలు పెద్దఎత్తున అభివృద్ధిచెందాయి. పెట్టుబడిదారుడు (Capitalist) తన స్వంత ఆస్తిని పెంచుకోవడానికి శ్రామికుని శ్రమనుదోపిడీ చేస్తుంటే, సాధారణ మానవుడు తన ఆర్థికహోదాను మెరుగుపరచుకోవటానికి నిత్యం ప్రయత్నాలు చేస్తున్నాడు. ప్రతి వ్యక్తి తన వృత్తిలో పూర్తిగా నిమగ్నమైపోయినందున, స్వీయదర్శనం (Look within himself) చేసుకోవటానికి లేదా తన స్వంత జీవనపు బాగోగుల పరిశీలనకు ఆలోచనలకు సమయం లభించటంలేదు. ఫ్యాక్టరీలోకాని, వర్క్‌షాప్‌లోకాని, సమూహాలలో గాని ఒకరి నొకరు కలుసుకొనే అవకాశాలు లేక తనకు తానుగా ఒంటరివాడై సమాజం నుండి వేరు పడినవాడుగా జీవనం వెళ్ళబుచ్చాల్సి వస్తున్నది. ఈ విధమైన పరాయికరణం, అతని చుట్టు పక్కలగల పరిస్థితులు మానవుని అవిశ్రాంతికి (Restless) గురిచేసినవి. అతని స్వంత సమాజం, రాజ్యం వెలుపల అత్యధిక విధ్వంసకశక్తి గల రాజ్యాల గురించి వార్తాపత్రికలలో చదివి వ్యక్తిగత భయందోళనలకు గురి అవుతున్నాడు. రాజనీతి శాస్త్రకారులు 19వ శతాబ్దాన్ని వ్యక్తి శ్రేయోవాదం, హేతువాద యుగంగా భావిస్తూ మానవుడు గతంలోని క్రూర, నిర్హేతుక స్థాయినుండి విముక్తి పొందాడని పేర్కొన్నారు. 19వ శతాబ్దపు రచయితలు వ్యక్తిగత మార్పు, అభివృద్ధి, హేతువు, స్వాతంత్ర్యం మొదలగు పదాలను వాడారు. కాని 20వ శతాబ్దం ఆరంభంనుండి ఈ భావం అంతరించిపోయింది. ఈనాటి సామాజిక, రాజకీయ రచయితలు Disorganisation అసమగ్రత, క్షీణత (Decline) అరక్షణ, అస్థిరత్వం మొదలగు పదాలను ఉపయోగిస్తున్నారు.

## 10.3 రాజకీయ పరాయికరణ స్వభావం

తత్వశాస్త్రం, మనోవైజ్ఞానికశాస్త్రం, సామాజిక శాస్త్రాలలో 'పరాయీకరణం' పదం ప్రత్యేకంగా ఉపయోగించారు. అయినప్పటికీ పరాయీకరణ భావం రాజనీతిసిద్ధాంతంలో ప్రాముఖ్యతను సంతరించుకొన్నది. ఆధునిక రాజనీతి సిద్ధాంతం, రాజకీయ శాసన బద్ధత (Political Legitimacy) రాజకీయ పరాయీకరణం భావాలను ఇతర శాస్త్రాలనుండి గ్రహించింది. రాజకీయ పరాయీకరణం అధ్యయనాల్లో ప్రముఖ మనోవైజ్ఞానిక శాస్త్రవేత్తలు సిగ్మండ్ ఫ్రాయిడ్, మాక్స్‌వెబర్, తత్వశాస్త్రవేత్తలైన హెగల్, ఫియర్ బాష్ (Feurbach) సామాజికశాస్త్రవేత్తలైన టాల్కాట్ పార్సన్స్, డేవిడ్ రిస్‌మాన్, సైమెల్ (Simmesl) నాథస్ గ్లాజర్, మార్క్స్, ఏంగెల్స్, నియోహెగ్లిస్టులయిన ఎరిక్ ఫ్రామ్, హెర్‌బర్ట్ మార్‌కూస్ మొదలగు వారి అభిప్రాయాలు స్థానం పొందాయి. ఇందువల్ల రాజకీయ పరాయికరణాన్ని అర్థం చేసుకోవాలంటే ముందుగా ఈ పదపు సాధరణ భావాలను; ఉదార వాదులు, మార్క్సిస్టు తత్వవేత్తలు వృద్ధి చేసిన రాజకీయాల కొత్త అర్థంలో అన్వయం చేసుకోవాల్సి ఉంటుంది.

రాజకీయ పరాయీకరణమనగా సంఘం, మతం, పరిపాలనలనుండి వేరు పడ్డానన్న భావమేగాక తననుండి తనను వేరు పరచుకోవటం, ఒంటరితనం, దూరం కావటం, ఆలోచనల్లో సానుభూతుల్లో దూరంగా

BRAOU

ఉంచటమన్న అర్థాలు చెప్పవచ్చు. సామాజిక శాస్త్రాలలో కర్ట్‌లాంగ్ (Kurtlong) భావంలో సంపూర్ణ వ్యక్తిత్వం నుండి, ప్రాపంచిక అనుభవపు ప్రధానాంశాలనుండి వేరు చేయబడటంగా వ్యాఖ్యానించాడు. దీనిలో వస్త్వాశ్రయపు వేరుచేయబడటమన్న భావన; వేరుచేయబడటమన్న వక్తిత్వంచే వేరుచేయబడటానికి ఉద్దేశించబడింది అన్న అంశాలు ఉన్నాయి. స్వీయ, వస్త్వాశ్రయపు, స్వంత అంశాలనుండి వేరు చేయబడి తనకే వ్యతిరేకంగా వ్యక్తి మారుతాడు. ఉదాహరణకు వేరుచేయబడిన శ్రమ లేదా పరాయీకరణం చెందిన శ్రమ.

కొన్ని ప్రత్యేక సమూహాలు అధిపత్యం కలిగిఉండే వ్యవస్థలలో నిర్ధారించబడిన వివేచనా న్యాయం, దానిచే నియమితులైన అధికారుల ద్వారా, దాని ఉనికికి సహాయపడే పరిస్థితులను ప్రభావ పరచుటకు వినియోగిస్తుంటారు. శ్రమవిభజన ద్వారా నిర్దేశిత విధులను నిర్వహించే వివిధ విభాగాల పాత్రలను (Segmental Roles) సంస్థాపర అంచనాలతో నిర్ధారించిన పర్యవసానమే పరాయికరణం అని సాధారణార్థంలో వాడటం జరిగింది. శ్రామికుడు తన స్వంత అవసరాలను పట్టించుకోకుండా వస్త్వాశ్రయ, పరాయి డిమాండ్ల కోసం పనిచేస్తాడు. పరాయీకరణ పొందిన అతని శ్రమ అతని అస్థిరత్వానికి వ్యతిరేకంగా పనిచేస్తుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని సామాజిక తిరుగుబాటుదారుడైన ఎరిక్‌ఫ్రాం (Eric Fromme) ఈ విధంగా పేర్కొన్నారు. మానవుడు ఎప్పుడైతే తన చర్యలచే సృష్టించుకొన్న తన ప్రపంచాన్ని అనుభవించజాలడో, అప్పుడే అతడు పరాయీకరణ జీవితాన్ని కొనసాగిస్తుంటాడు. అతని చర్యలు, వాటి పర్యవసానాలు, ఫలితాలు అతను విధేయత చూపే, పూజించే యజమానికి చెందుతాయి.

పరాయీకరణ భావన "వేరుచేయటం" అనే స్థితినుండి ఉత్పన్నం అయింది. ఉదాహరణకు ఒకవ్యక్తి తన శారీరక రుగ్మత కారణంగా తననుండి తాను (Self from the Self) వేరు చేయబడుతున్నా అనే భావనయే పరాయీకరణ. ఈ స్థితిలో సాధారణ జీవితపు అంతర్భాగాలైన ఆవేశాలను కోల్పోతాడు. బాహ్యప్రపంచంలో తనకుండే ఆవేశపూరిత ఆసక్తిని ఉపసంహరించుకోవడం అనగా తన భావాలను, ఆలోచనలను మార్చుకోవటం, లేదా మితిమీరిన Sensitivity లేదా ఆలోచనలను అణచుకోవటం వలన ఒంటరి తనపు ప్రభావం లేదా చైతన్యవంతమైన వ్యక్తిత్వం నుండి వేరుపడటం జరుగుతుంది.

BRAOU

పరాయీకరణమనే భావన వాస్తవానికి శారీరక రుగ్మతగా గుర్తించారు. దాని పుట్టుక, పాశ్చాత్యతత్వశాస్త్ర ఆలోచనల కాలక్రమంలో అభివృద్ధి దాయకమైన లౌకికవాదం ముసుగులో కప్పబడింది. తత్వశాస్త్ర చరిత్రకారులు (Historians of Philosophy) పరాయీకరణం భావన ప్లాటినస్ (Plotinus) రచనలలో ఉన్నట్లు తెలియచెప్పారు. ప్రముఖ జర్మన్ ఆదర్శవాది అయిన హెగెల్ పరాయీకరణను మత లేదా తాత్విక దృక్పథంతో పరిశీలించాడు. ఏది ఏమైనప్పటికీ సమకాలీన సమాజశాస్త్ర దృక్పథంలో కార్ల్ మార్క్స్ పరాయీకరణం భావనను ఆది భౌతిక శాస్త్రం నుండి సామాజిక శాస్త్ర భావనగా రూపొందించాడు.

పరాయీకరణం అనగా "మానవసమాజనిర్మాణం, విజ్ఞానాన్ని సృష్టించడం కొరకు మానవుని సామర్థ్యాన్ని ఉపేక్షించటం/విస్మరించటం"గా అన్వయిస్తున్నారు. (1) తత్వశాస్త్రంలో హెగెల్, ఫ్యూర్ బాష్‌లు పరాయీకరణం భావనను ఆదర్శ దృక్పధంతో పరిశీలించారు. మతం, చిదాత్మలనుండి మానవుని వేరుచేయాలన్న భావాన్ని వారు నొక్కి చెప్పారు. సంపూర్ణ చైతన్యం (Total Consciousness) వైపు నిరంతర చర్యలు చరిత్రలో సాగాయి. చిదాత్మ చరిత్ర ద్వారా ప్రకటితమౌతుంది. చిరాత్మతనంతటతానే సంఘర్షించుకొంటుంది. ఈ చర్యబాహ్యమైంది తెలియనిది కూడా. చిదాత్మవేర్వేరు సమయాల్లో పునర్జీవి అయి వేరు చేయబడని చైతన్యం వైపు పయనిస్తుంది.

(2) మనోవైజ్ఞానికశాస్త్రంలో సిగ్మండ్ ఫ్రాయిడ్, మాక్స్‌వెబర్‌ల దృష్టిలో పరాయీకరణమనగా నిస్సహాయత, శక్తిహీనత, తనపట్ల, ఇతరులపట్ల అసహ్యత కలగటం, తానొక పశువునే భావన.

(3) సమాజ శాస్త్రంలో సిమ్మెల్, పార్సన్స్; కారల్ మార్క్స్‌చే ప్రేరణ పొంది పరాయికరణం భావానికి ప్రత్యేకమైన అర్థం చెప్పేటందుకు ప్రయత్నించారు. కారల్‌మార్క్స్ దృష్టిలో బూర్జువా సమాజంలో మానవుడు తన జీవిత చర్యలనుండి, భౌతిక ప్రపంచం నుండి, తన సహచరులనుండి వేరుకాబడుతాడు. బ్లానర్ (Blanner) ప్రకారం పరాయీకరణ మనగా అర్థం లేకపోవడం, ( Meaninglessness) శక్తిహీనత, నియమాలు లేకపోవటం, ఏకాంతం, తననుండి తాను వేరుచేయబడ్డానన్న ఆలోచన. సమకాలీన సమాజశాస్త్రకారుల నిర్వచనంలో (Standardised Production) ప్రమాణీకృతమైన ఉత్పత్తి, శ్రమ విభజన, అంతిమ వస్తూత్పత్తిలో శ్రామికుని పాత్రను తగ్గిస్తుంది.

(4) అర్థశాస్త్రంలో పెట్టుబడిదారులు శ్రామికులను దోపిడీ చేసే పెట్టుబడిదారీ వ్యవస్థ మౌలిక ఆధారాలను కారల్‌మార్క్స్ వివరించారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో శ్రామికుడు తన జీవితం నుండి వేరుకాబడి; శ్రమ ఒక్కటే జీవితసాధనం కాగా పెట్టుబడిదారు కేవలం విలువను పొంది "మిగులు విలువను" రూపొందించుకొంటాడు. ఫలితంగా శ్రామికుని శ్రమశక్తి పెట్టుబడిశక్తిగా మారుతుంది. కారల్ మార్క్స్ ఆర్థిక దోపిడి ప్రక్రియలో పరాయీకరణపు భౌతిక వివరణను వివిధ రాజకీయ ఆర్థిక వ్యవస్థలలో కనుగొన్నాడు.

(5) సమకాలీన రాజనీతి శాస్త్రం చాలా అంశాలను ఇతర శాస్త్ర విజ్ఞానాల నుండి గ్రహించింది. వాటిలో పరాయీకరణం భావన ప్రథమ స్థానాన్ని ఆక్రమిస్తుంది. రాజకీయ విశ్లేషణలో మానవ వ్యక్తిత్వపు అనుగుణ్యతతో రాజనీతి శాస్త్రజ్ఞుడు సంబంధం కలిగి ఉన్నాడు. ప్రజాస్వామ్య వ్యవస్థలలో పరాయీకరణం ప్రాముఖ్యత, దానివల్ల కలిగే ప్రమాదం పై జరుగుతున్న చర్చలు రాజనీతిశాస్త్ర సిద్ధాంతానికి, తాత్విక, మనోవైజ్ఞానిక, సాంఘిక, ఆర్థిక భావనల విలువలను తెలియజేస్తున్నవి. అందువల్ల ప్రస్తుత రాజకీయ వ్యవస్థలో పరాయీకరణం అవిధేయతను, శక్తిహీనతను, నియమరహిత ప్రవర్తనలను తెలియచేస్తుంది. పరాయీకరణం వ్యక్తి రాజకీయ వ్యవస్థనుండి ఉపసంహరించుకోవటాన్ని సూచిస్తుంది.

BRAOU

నేడు పరాయీకరణం పదం సమాజశాస్త్రం, మనోవైజ్ఞానిక శాస్త్రం, సాహిత్యం, అర్థికశాస్త్రం, తత్వశాస్త్రం, రాజనీతిశాస్త్రాలలో విరివిగా స్థానం పొందింది. సాంస్కృతికవిభాగాలలో సాంఘిక ఏకాంతం, అర్థికదోపిడీ, తాత్త్విక (Abstraction) రాజకీయ అవాస్తవికతలను వివరించే పదంగా వాడుతున్నారు.

## 10.4 రాజకీయ పరాయీకరణం

రాజకీయ పరాయీకరణానికి సుదీర్ఘమైన చరిత్ర ఉంది. అందువల్ల రాజకీయ పరాయీకరణానికి సంబంధించిన అనేక ఊహాభావనలు దాని విజ్ఞాన సారస్వతాన్ని బాగా విస్తృతం చేశాయి. రాజకీయ వ్యవస్థలోని ప్రక్రియలు, నిర్మితుల పట్ల గల పౌరుల దృక్పథాన్ని అనుభవవాద పద్ధతులలో వ్యక్తీకరించటానికి పరాయీకరణం భావన వినియోగపడుతుంది. రాజకీయవ్యవస్థలలో పరాయీకరణాన్ని ఏఏరూపాలలో వ్యక్తం చేయువీలున్నదో గమనిద్దాం.

(1) రాజకీయ శక్తిహీనత (Political Powerlessness) : ప్రభుత్వ చర్యలను ప్రభావపరచలేననే వ్యక్తిగత ఆలోచనగా రాజకీయశక్తి హీనతను నిర్వచించవచ్చు. రాజకీయ వ్యవస్థల ప్రక్రియలలో సమాజంకోసం అధికారయుతంగా పంపిణీచేసే విలువలపై వ్యక్తుల ప్రభావం ఉండదు. ఒక వ్యక్తి తాను జీవించటానికి కావలసిన పరిస్థితులను నిర్ణయించే రాజకీయ నిర్ణయాలను ప్రభావ పరచటంలో తాను బలహీనుడనన్న

ఆలోచనా భావమే పరాయీకరణం. ఈ రకమైన పరాయీకరణం ఓటింగ్ ప్రవర్తనల అధ్యయనంలో ప్రాధాన్యత వహిస్తుంది. దీనికి రాజకీయ సామర్థ్యం (Political Efficacy) భావనతో సన్నిహిత సంబంధం ఉంది.

(2) రాజకీయ అర్థరహితం (Political Meaningless): రాజకీయ నిర్ణయాలు ఊహించలేనివిగా (Unpredictable) ఉంటాయని చెప్పవచ్చు. విధాన నిర్ణయాలలో అనుసరించే రాండమ్ పద్ధతి (Random Method) రాజకీయ వ్యక్తులను అర్థం చేసుకోనివ్వదు. ఈ రకమైన పరాయీకరణ శక్తిహీనతకు భిన్నమైనటువంటిది. శక్తిహీనమైన నిర్ణయాలు సవివరంగా ఉహించరానివిగా ఉండవచ్చు. కాని అవి వ్యక్తి ప్రభావానికి లోనుగావు. అర్థరహితం విషయంలో వ్యక్తికి నిర్దిష్టమైన పద్ధతి ఉండదు. పరాయీకరణ ఆలోచన అర్థవంతమైన రాజకీయ ప్రత్యామ్నాయాల మధ్య భేదాన్ని తెలుసుకోని అసమర్థతను తెలియ చేస్తుంది. రాజకీయ ప్రత్యామ్నాయాలు ప్రతిదీ అర్థరహితం. వాటి ఫలితాలనుగాని, పర్యవసానాలనుగాని, సామాజిక స్థితిగతుల మార్పుకు వాటిని ఉపయోగించటం కాని ఎవ్వరూ ఊహించలేరు.

(3) రాజకీయ ఏకాంతం (Political Isolation): ప్రసిద్ధ సామాజిక శాస్త్రకారుడు డర్క్‌హీం (Dorkheim) ఎనామీ (Anomie) గురించి వివరించారు. వ్యక్తి ప్రవర్తనలను క్రమబద్ధం చేసే సామాజిక నియమాల వికేంద్రీకరణ; తద్వారా పొందిన రాజకీయ నియమరహితం (Perceived Political Normlessness). రాజకీయ సంబంధాలక్రమబద్ధం చేయడానికి ఉద్దేశించిన నియమనిబంధనలను ఉల్లంఘించినట్లుగా వ్యక్తి భావించుకోవటాన్ని పరాయీకరణ మనవచ్చు. అలాగే శాసనబద్ధతను ఉల్లఘించటం లేదా ప్రభుత్వవిధానాలలో ప్రజాభిప్రాయాన్ని విస్మరించటంగా నమ్మటం ఈ రకమైన పరాయీకరణంగా నిర్వచించవచ్చు.

BRAOU

(4) రాజకీయ ఏకాంతత : సమాజంలోని ఇతర సభ్యులుకోరే రాజకీయ నియమాలను లక్ష్యాలను తిరస్కరించటం. దీనికి (Perceived normlessness) కు తేడా ఉంది. నియమరహితం అనగా అంగీకృతనియమాలలో కొన్నింటిని కొందరు పాటించకపోవటం రాజకీయ ఏకాంతతగా చెప్పవచ్చు. రాజకీయ ఏకాంతత అనగా ఓటింగ్‌లో పాల్గొనకపోవటం కూడా అవుతుంది. ఈ రకమైన పరాయీకరణాన్ని లేన్ (Lane) "ఒక ఆటనియమనిబంధనలు పక్షపాతవైఖరిగలవిగా అన్యాయమైనవిగా, రాజ్యాంగ విరుద్ధమైనవిగాను, తనకు అనుకూలంగా లేవనే భావంగా వివరించారు. సామాజిక నియమనిబంధనలు, సాంప్రదాయాలు కాలానుగుణ్యంగా మార్పుచేర్పులకు గురౌతుంటాయి. అలాగే ఒక సంస్కృతికి మరో సంస్కృతికి నియమనిబంధనలలో తేడాలుంటాయి. ఆయా సమాజాలను అనుసరించి పరాయీకరణాన్ని అర్థం చేసుకోవాల్సి ఉంటుంది."

(5) రాజకీయ స్వీయపరాయీకరణం (Political Self Estrangement) తనదేశ రాజకీయాలలో పాల్గొనే పరిస్థితులు అవకాశాలు తనకు అందుబాటులో లేవని తనకు వేరు చేసుకోనే ఆలోచన యే రాజకీయ స్వీయ పరాయీకరణం. ఉదాహరణకు ఓటరు సాధారణంగా ఇతరుల చేతిలో ఒక వస్తువుగా లేదా ఒక సాధనంగా మారానని భావిస్తాడు. తెలియని లక్ష్యంకోసం తన వ్యక్తిత్వం ఒక సాధనంగా మారిందని సేల్స్‌గర్ల్ భావించినట్లుగా వ్యక్తి తనను తానువేరు చేసికొన్నట్లు భావిస్తాడు. ఒకవిధంగా పరాయీకరణం ముందుగా ఊహించే బహుమతుల ( Rewards) కోసం ఆరాటపడే ప్రవర్తనాస్థాయి మీద ఆధారపడి ఉంటుంది. అనగా ఒక చర్య బయట ఏదో దాగి ఉంటుంది. ఉదాహరణకు ఒక కార్మికుడు కేవలం వేతనం కోసం పనిచేస్తాడు. ఒక గృహిణి తనవంతు కార్యక్రమంలో

భాగంగా వంట పూర్తి చేస్తుంది. అదేవిధంగా రాజకీయ మానవుడు తనపాత్రను నిర్వహిస్తాడేగాని స్వీయ బహుమతికోసం నిర్వహించడు. అందువల్ల రాజకీయ మానవుని జీవితపు దృక్కోణం నుండి రాజకీయాలను అధ్యయనం చేయాలి. ఒకప్పటి విలువలు, ప్రవర్తనలు, అంచనాలు మారుతుంటాయన్న విషయాన్ని పరాయీకరణం తెలియజేస్తుంది.

పరాయీకరణం భావనసామాజిక శాస్త్రాలలోని మానవ సంబంధాల అధ్యయనాల్లో ప్రధానమైన స్థానాన్ని ఆక్రమించింది. సమకాలీన సమాజశాస్త్ర అధ్యయనాల్లో వ్యక్తికి సంబంధం లేని (Unattached) నిరాసక్తమైన (Obsessive) నియమరహిత (Normless) ఏకాంతత (Isolated) మొదలైన విషయాలను పరీక్షించటానికి పరాయీకరణం కేంద్ర బిందువు అయింది.

## 10.5 ఆదిభౌతికసిద్ధాంతం : నిత్యావసర, వాస్తవ అంశాల మధ్య ఏకత

పరాయీకరణం భావన ఆది భౌతిక శాస్త్రంలో (Metaphysics) అవశ్యక (Essential); వాస్తవిక (Real)తల మధ్య తార్కిక సంబంధం వివరించడానికి వాడారు. ఈ విధంగా ఆలోచించిన తాత్త్వికులలో ప్లేటోకు ప్రధముడుగా గుర్తింపు లభించింది. స్వీయపరాయీకరణం చెందిన మానవునిలో అసమానత్వం; వాస్తవిక స్వభావం, అస్థిరత్వాల మధ్య చీలుతుంది. ఫ్యూర్‌బాష్ ( Feurbach) తన Essence of Christianity లో అదర్శవాదం ద్వారా వ్యక్తీభవించిన మానవుని ఆవశ్యకస్వభావమే మతమని వాదించారు. ఆయన దృష్టిలో మత శాస్త్రమే (Theology) మానవశాస్త్రం. (Anthropology). మానవుని దైవిక సారాంశమే దేముడు. మామూలు మాటల్లో మతం, తత్వశాస్త్రం అంతర్గతంగా ఉన్న భావాలకు రూపాన్ని ఇస్తాయి. ఇదే భావనను హెగెల్ తన తత్వశాస్త్రంలో వివరించారు. మానవ చరిత్రను ఆయన నిరపేక్షచిదాత్మ (Absolute spirit) గా వివరించారు. నిరపేక్షచిదాత్మ అనగా గతితార్కిక వైరుధ్యాల ద్వారా స్వీయజ్ఞానం వైపుకు పయనించే మానవ చరిత్ర సారాంశం. ఎప్పుడైతే చిదాత్మనైతిక ప్రపంచంలో ఒకటవుతుందో అప్పుడు "అపరిమిత జాగరూగతయే అంతిమస్థితి అవుతుంది. సాంస్కృతిక పునరుజ్జీవనం, ఫ్రెంచి విప్లవం మొదలైనవి పరావర్తనం చెందని ఐక్యతనుండి చిదాత్మ గతితార్కికాభివృద్ధి వైపు పయనించాయి. నిర్దిష్ట పరిస్థితుల దృష్ట్యా హెగల్ చారిత్రికాభివృద్ధిని విశ్లేషించారు. ప్రతిచారిత్రక దశలో చిదాత్మ అంతర్భాగంగా ఉంటూ ప్రతి దశలోను సంఘర్షణకు గురిఅవుతూ వికాసం పొందుతున్నది. ఇలాంటి చర్య బాహ్యామైనది. తెలియని సందర్భాలలో రుగ్మతకు గురిఅవుతూ పాక్షికంగా నిరపేక్షత వైపుకు పయనిస్తుంది. దీనినే Non-Alienated Consciousness అని అంటున్నాం.

హెగెల్ తన Phenomenology లో వివరించిన "అసంతోష జాగరూకత" (Unhappy Consciousness) ను మనం పరాయీకరణపు ఆది భౌతిక భావనగా అర్థంచేసుకోవాలి. హెగెల్ దృష్టిలో ఈ వస్త్వాశ్రయ ప్రపంచం (Objective world) ప్రత్యేకత గలది, తనంతటతానే ఉద్రిక్తతాస్థితిలో పడిపోవటం కన్నా భిన్నమైంది. దీనినే ఆయన Objective cynicism అని అన్నారు. గతి తార్కిక వికాస భావన ఒక వైపు మానవ అవసరాలు మరోవైపు సామాజిక వాతావరణం మధ్య ఉద్రిక్తతాస్థితి నుండి పరిణామం చెందుతుంది. ఈ స్థితిలో మేథస్సు తనంతటత తానే పరాయీకరణం చెంది స్వీయ చైతన్యాన్ని పొందుతుంది. పరాయీకరణ, లేదా అసంతోష చైతన్యం అర్థం చేసుకోవటమేగాక ఈ తాత్విక సమస్యకు పరిష్కారాన్ని కనుక్కోవటం హెగల్ గొప్పతనం. స్వీయ ప్రకృతి, (Self and Nature) మేథస్సు, పదార్థా (Mind and Matter) లతో రాజీ పడే చిదాత్మతత్వాన్ని హెగెల్ వివరించాడు. మేథస్సు నిదానంగా క్రమంగా హేతువుసహాయంతో తనకు ప్రపంచానికి మధ్య వైరుధ్యం లేదని తెలుసుకొంటుంది. అప్పుడు ప్రపంచం బాహ్యామైనదిగా గాక

జీవితంలో [illegible] పరిగణన పొందుతుంది. పరాయీకరణపు వైరుధ్యాన్ని అధిగమించుటకు మేథస్సు ఒకవైపు ప్రపంచం మరో వైపు చేరి రెండు వైపులనుండి ఐక్యం చేసే నిరపేక్ష చిదాత్మగా (Absolute spirit) రూపొందుతుంది. మానవుని చిదాత్మ నిజమైన స్వాతంత్ర్యం స్వీయ చైతన్యంలో భౌతిక ప్రపంచ పరిమితులకు లోబడి సంఘర్షణ జరిగి Object, Subject ల మధ్య సఖ్యత ఏర్పడుతుంది.

స్వాతంత్ర్యంకోరకు జరిగే అన్వేషణలో పరాయీకరణం సమస్యకు పరిష్కారం లభిస్తుంది. వ్యక్తి, వస్తువ్రశయు ప్రపంచం రెండిటికి గుర్తింపు లభించినప్పుడు అనంతమైన తత్త్వవిచారంపై విజయం సాధించటంతో పరాయీకరణను జయించినట్లువుతుంది. హెగల్ నాగరిక సమాజంలో వ్యక్తిగుర్తింపును కోరినట్లు తెలుస్తుంది. స్వాతంత్రాన్ని వ్యక్తులు సమాజం, రాజ్యం పరిధిలోనే పొందగలరు. అరిస్టాటిల్ దృష్టిలో సామాజిక రాజకీయ పరిధుల వెలుపల స్వాతంత్ర్యం క్షీణిస్తుంది. మానవ వ్యక్తిత్వ వికాసానికి సమాజం, రాజ్యం మాత్రమే ఎక్కువగా దోహదం చేస్తాయి. వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడని పరిస్థితులను మానవుడు వ్యతిరేకిస్తాడు.

సామాన్య మానవుడు అర్థం చేసుకోలేని అత్యున్నత అమూర్తమంతం, అధి భౌతిక వివరణలే ఈ సిద్ధాంతపు బలహీనతలు. వీటిని రుజువుచేయలేం. పరాయీకరణ భావనను హెగల్ అదిభౌతిక భావంలో వివరించగా; కారల్‌మార్క్స్ దీన్ని అర్థికాంశాల దృష్టితో వివరించారు. మార్క్స్ వాదనలో మానవులు వారి అస్థిత్వానికై సామాజిక ఉత్పత్తిలో భాగస్వాములవుతుంటారు. నెలకొని ఉన్న సామాజిక సంబంధాలు వారి ఇచ్ఛకు భిన్నంగా ఉంటాయి. మార్క్స్ వ్యక్తి చైతన్యాన్ని నిర్ణయించే సామాజిక పరిస్థితులను వివరించారు. హెగల్ పరాయీకరణ భావనను అర్థంకాని భాష, భావనలో వివరించగా; మార్క్స్ పరాయీకరణాన్ని సమాజపు ఆర్థిక నిర్మితుల దృష్టిలో వివరించారు.

BRAOU

## 10.6 మార్క్సియన్ సిద్ధాంతం : పరాయీకరణం

మార్క్స్ పరాయీకరణం భావాన్ని హెగల్ నుండి గ్రహించి దానికి సామాజిక, ఆర్థిక ప్రాతి పదికను వివరించారు. మార్క్స్ వివరణలో పెట్టుబడి దారీ వ్యవస్థలో శ్రమనిర్వహణకు మానవుని శ్రమశక్తి అమ్మకానికి యోగ్యమైన వస్తువుగా మార్చగల ప్రభావాన్ని కలిగి ఉంటుంది. మానవ శ్రమ ఫలితంగా ఉత్పత్తి అయిన వస్తువు, అ తరువాత శ్రమకు వ్యతిరేకమైన పరాయి వస్తువుగా, స్వతంత్ర శక్తిగా రూపొందుతుంది. శ్రామికుని శ్రమశక్తి భౌతిక వస్తువుగా రూపాంతరం చెందుతుంది. మార్క్స్ పరాయీకరణం భావాన్ని హెగెల్ నుండి గ్రహించినప్పటికీ అతనికి భిన్నంగా వివరించాడు. హెగెల్ పరాయీకరణ, Objectification లను పర్యాయ పదాలుగా వాడుకోగా, మార్క్స్ దానిని విమర్శిస్తూ రెండు పదాలు ఒకే అర్థాన్ని ఇవ్వవు అని అన్నారు. మార్క్స్ పరాయీకరణం భావాన్ని నాలుగు దృక్కోణాలనుండి వివరించారు. (1) ప్రకృతినుండి; (2) తననుండి (Himself); (3) తోటివారినుండి; (4) సమాజం నుండి. పెట్టుబడిదారీ వ్యవస్థలో మానవశ్రమ పరాయీకరణం చెందుతుంది. పెట్టుబడిదారి వ్యవస్థలో పెట్టుబడి (Capital) పూర్తి అధికృత వహించగా శ్రామికుడు కేవలం శ్రమనందించే వ్యక్తిగా మారుతాడు. ఈ వ్యవస్థ మానవుని తన స్వంత శ్రమ ఫలితంగా తయారైన వస్తువునుండి వేరు చేస్తుంది. మానవశ్రమ ఫలితం పరాయివస్తువుగా మారుతుంది. ఎంత ఎక్కువగా శ్రామికుడు పనిచేస్తే, అంత అధికంగా తన శ్రమ ఫలితంగా తయారైన వస్తువుల చేత నియంత్రణకు గురౌతాడు. శ్రామికుడు తన జీవితాన్ని వస్తూత్పత్తికి పణంగా పెడతాడు. పర్యవసానంలో అతని జీవితం అతనికి చెందక, అతను తయారుచేసిన ఉత్పత్తులకు చెందుతుంది. వస్తూత్పత్తిలో మమేకమైన వ్యక్తిశ్రమ అతని స్వంతం కాదు. ఉత్పత్తి పెరిగిన కొద్దీ వ్యక్తి క్షీణతకు గురౌతుంటాడు. పరాయీకరణం

భావన మార్క్స్ మలి రచనలలో బాగా స్థానం పొందింది. తను శ్రమించి పనిచేసి ఉత్పత్తి చేసిన వస్తువులు వ్యక్తికి చెందవు. అవి పెట్టుబడికి చెందుతాయి. పెట్టుబడి శ్రమతో ముఖాముఖిగా ఎదుర్కొని వ్యక్తి శ్రమపై అధిపత్యం వహించే శక్తిగా మారుతుంది. తన Critique of Economy గ్రంథంలో మార్క్స్ ఈ విధంగా అన్నారు. "అధికమవుతున్న మూలధన సంచయనం దాని కేంద్రీకరణకు దారితీయటాన్ని మనం చూస్తున్నాం. అప్పుడు పెట్టుబడి శక్తి పెరిగే కొలది సామాజిక ఉత్పత్తి పరిస్థితులు; వాస్తవిక ఉత్పత్తిదారుల చేతులనుండి పరాయీకరణం ద్వారా పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్తుంది. పెట్టుబడి ఒక సామాజిక శక్తిగా మారుతుంది. ఫలితంగా పెట్టుబడిదారుడు సమాజంలో శక్తివంతుడవుతాడు. ఈ సామాజికశక్తికి శ్రామికుని శ్రమసృష్టించినదానికి ఏవిధమైన సంబంధం ఉండదు. శ్రామికుని శ్రమశక్తి శ్రామికునితో సంబంధంలేని స్వతంత్ర సామాజిక శక్తిగా మారి పెట్టుబడిదారు అధికారానికి ఆధారమైన సమాజాన్ని వ్యతిరేకిస్తుంది. ".

సాధారణ పదాలలో పెట్టుబడిదారీ విధానం కింద శ్రమ ప్రక్రియ తప్పని సరిగా పరాయీకరణకు దారితీస్తుంది.

(1) శ్రామికుడు తన శ్రమశక్తిని పెట్టుబడిదారుకు అమ్మటం వలన తన శ్రమతో తయారు చేసిన వస్తువు తనకు పరాయిదవుతుంది. శ్రామికుని శ్రమ అతనికిచెందని, అతనికి వ్యతిరేకమైన పెట్టుబడిదారుడు సామాజికశక్తిని సృష్టిస్తుంది.

(2) ఉత్పత్తిక్రమంలోనే పరాయీకరణం గుర్తింపును పొందుతుంది. శ్రామికుడు సృజనాత్మకంగా పనిచేయ లేడు. తన శ్రమశక్తిని తనకోరికలను తృప్తిపరచుకోవటానికి బదులు అవసరాలను తీర్చుకొనే సాధనంగా వాడుకొంటాడు. మరొకవైపు ఉత్పత్తిప్రక్రియపై నియంత్రణ, యాజమాన్యం పెట్టుబడిదారు చేతిలో ఉంటుంది. శ్రామికుడు ఏమి ఉత్పత్తిచేయాలి? ఎంత పరిమాణంలో ఉత్పత్తిచేయాలి? ఏపద్ధతిలో చేయాలి? ఏవిధంగా అమ్మాలో పెట్టుబడిదారుడే నిర్ణయిస్తాడు. ఉత్పత్తి ప్రక్రియలోని సాంకేతిక పరిజ్ఞానం శ్రామికుని యంత్రానికి బానిసగా చేస్తుంది.

BRAOU

రెండు మార్గాలలో మానవుడు అతని ఉనికి, వ్యక్తిత్వం నుండి పరాయీకరణం చెందుతాడు. ఆధునిక సమాజంలో ప్రధానంగా కనిపించే మానవరుగ్మతలను (Human ill) గుర్తించటానికి లేదా లక్షణాలను వివరించటానికి మార్క్స్ పరాయీకరణం భావాన్ని ఉపయోగించారు. దాని లక్షణాలు:

(1) ఆధునిక సమాజంలో ప్రజలనావిరించి ఉన్న వివిధ మంచి చెడులు, హేతువిరుద్ధాల మధ్య సంక్లిష్ట అంతర్ సంబంధాలను మార్క్స్ తెలుసుకొన్నారు;

(2) శ్రమ, ఉత్పత్తి మధ్యగల అంతర్గతమైన హేతు విరుద్ధాల వ్యవస్థయే ఆధునిక సమాజం;

(3) చారిత్రక పరిణామదశలో ప్రత్యేక రకమైన శ్రమ ఒక లక్షణంగా మానవచరిత్రను నిర్దేశిస్తుందని మార్క్స్ పేర్కొన్నారు.

(4) "మానవ వికాసం" మాతృగర్భంలో ముందుగానే నిర్దేశితంకాదు. నిరంతరం విస్తరిస్తున్న సామాజిక ఉత్పాదిక శక్తులు నిర్దేశిస్తాయి. ఉత్పత్తికి సంబంధించిన సామాజిక సంబంధాలు అభివృద్ధి క్రమాన్ని నిర్ణయిస్తాయి.

కారల్ మార్క్స్ పెట్టుబడిదారీ వ్యవస్థ బలహీనతలను గుర్తించటంతోపాటుగా దాని సమస్యలకు పరిష్కారాన్ని కూడా సూచించారు. పరాయీకరణం ఎప్పుడు అంతమవుతుంది? అన్నప్రశ్నకు పెట్టుబడిదారీ వ్యవస్థ అంతమై దాని స్థానంలో సామ్యవాద వ్యవస్థ అవతరణతో మానవజాతి విముక్తి, అంతర్గతంగా పరాయీకరణం అంతమవుతుందని మార్క్స్ వివరించారు. మార్క్స్ జానికి ఒక నిర్దిష్ట లక్ష్యం ఉంది. పరాయీకరణ అంతం కమ్యూనిస్టు సమాజంలోనే సాధ్యమౌతుంది. ఈ దశలో ప్రత్యేకవృత్తి పాత్రను నిర్దేశించే శ్రమ

విభజన ఉండదు. స్వంత కోరిక ప్రకారం వ్యక్తులు వివిధ వృత్తి పాత్రలను చేపట్ట వీలవుతుంది. ఒక వేళ పరాయీకరణ మానవ స్వభావాన్ని అనేక విధాలుగా చేస్తున్నట్లయితే కమ్యూనిజం మానవస్వభావ పునరేకీకరణకు దోహదం చేయగలదని మనం ఊహించవచ్చు. శ్రమ విభజన అంతంకావటం, వర్గరహిత సమాజం ఏర్పడటం మొదలగు అనేక అంశాలను సంపూర్ణ కమ్యూనిస్టు సమాజానికి ఆపాదించటం జరిగింది.

మార్క్స్ పరాయీకరణ సిద్ధాంతాన్ని రెండు అంశాలుగా విమర్శించటం జరిగింది. (1) యువకుడుగా కారల్ మార్క్స్ సామాజిక శాస్త్రవేత్త యని, వృద్ధుడుగా మార్క్స్ ఆర్థికశాస్త్రవేత్తయన్న ద్వైదీ భావంతో మార్క్స్ వ్యక్తిత్వానికి విభేదం ఆపాదించారు. యువమార్క్స్ పెట్టుబడిదారీ వర్గానికి స్నేహితుడు; తాత్వికుడు, మార్గ దర్శకుడు. పెట్టుబడిదారీ వ్యవస్థ బలహీనతలు అతనికి బాగా తెలుసు. ఆ వ్యవస్థ పతనం కాకుండా సాధ్యమైనంత త్వరలో ఆ బలహీనతలను తొలగించాలన్నారు. మేధావంతుడైన కారల్ మార్క్స్ పెట్టుబడిదారీ వ్యవస్థకు బద్ధ శత్రువు. దాని పరిపూర్ణ పతనాన్ని కోరుకున్నాడు. మార్క్స్ సామాజిక, ఆర్థిక, రాజకీయ భావాలలో మౌలిక వైరుధ్యాలున్నాయి. పెట్టుబడిదారీ సిద్ధాంతాన్ని క్రమబద్ధంగా విశ్లేషించటం ద్వారా ఆయనకు గుర్తింపు లభించింది. తాత్వికభావన అయిన పరాయీకరణను ఆర్థికాంశాలద్వారా వివరించటానికి మార్క్స్ చేసిన ప్రయత్నం విఫలమయిందని; అందుకు కారణం, శ్రమ రూపాలను సరిగా వివరించలేకపోవటమేనని విమర్శకుల అభిప్రాయం.

ఇందుకు భిన్నంగా కారల్ మార్క్స్‌ను సమర్థించే వారు ఆయన మలి రచనల్లో పరాయీకరణం సిద్ధాంతంలో స్వతస్సిద్ధమైన వైరుధ్యాలేవీలేవన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఆయన పరాయీకరణం సిద్ధాంతం "కాపిటల్" గ్రంథంలో నిర్దిష్టతను, శాస్త్రీయతను సంతరించుకొంది. శ్రమ విభజన, ఫ్యాక్టరీ ఉత్పత్తి విధానం మానవుని భౌతిక, మేధా పరిస్థితులను ఏ విధంగా నాశనం చేస్తుందో వివరిస్తూ, అదే సమయంలో శ్రామికవర్గ రాజకీయ చైతన్యాన్ని కూడా పెంపొందిస్తుందని మార్క్స్ వివరించారు. పెట్టుబడిదారీ వ్యవస్థలోని లోపాలను మార్క్స్ ఎదుర్కొనడాన్ని మనం అంగీకరించవచ్చు. కాని సామ్యవాదపు ఉన్నత దశ కమ్యూనిజం స్థాపనతో పరాయీకరణం అంతరిస్తుందన్న వాదనతో మనం అంగీకరించకపోవచ్చు కూడా. కమ్యూనిస్టు సమాజంలో మానవ విలువలు, విముక్తి చెందిన మానవుడు, వర్గరహిత సమాజం ఉంటుంది కనుక పరాయీకరణానికి స్థానం ఉండదని మార్క్స్ పేర్కొన్నారు.

## 10.7 మార్క్స్ తదనంతరం : పరాయీకరణం

కారల్ మార్క్స్ మరణానంతరం మార్క్సియన్ రాజకీయ సిద్ధాంతంలో పరాయీకరణం భావనకు గల ప్రాధాన్యత క్రమేపి తగ్గు ముఖం పట్టింది. మార్క్స్ అనుయాయులు పరాయీకరణం భావనను పునరుద్ఘాటించటంలో విఫలమయ్యారు. కాని మాక్స్ వెబర్, జార్జి సిమెల్ లాంటి కొద్దిమంది రచనలలో పరాయీకరణం ప్రస్తావనకు వచ్చింది. 1932లో మార్క్స్ తొలిరచనలను Economic And Philosophic Manuscripts గా ప్రకటించటంలో పరాయీకరణం భావనకు బాగా ప్రచారం లభించింది. అస్తిత్వవాదులైన (Existentialists) హెడెగర్ (Heidegger) సార్త్రే (Sartre) లపై పరాయీకరణం భావన ప్రభావం పడింది. హంగేరియన్ మార్క్సిస్టు రచయిత లుకాక్స్ (Lukaks) 1971లో ప్రచురించిన "వర్గచైతన్యపు చరిత్ర" (History of class consciousness) మార్క్స్‌ను విప్లవకారుడు, తాత్విక ఆదర్శవాది యని నేరంమోపిన సనాతన మార్క్సిస్టు వాదుల (Orthodox marxist circle)లో కదలికను సృష్టించింది. ప్రముఖ జర్మన్ సామాజిక శాస్త్ర వేత్త మాక్స్‌వెబర్ తన (Ideal type Bureaucracy) గ్రంథంలో పరాయీకరణం భావనను అధ్యయనం చేశారు. పెట్టుబడిదారీ వ్యవస్థ పతనంతో పరాయీకరణ అంతమవుతుందన్న మార్క్స్ వాదనను ఆయన ఖండించారు.

విజ్ఞానాత్మక సమాజాలలో దేనిలోనైనా Intensified Technical Rationalisation స్థానం పొందుతూ సామ్యవాద వ్యవస్థలో పరాయీకరణం సిద్ధాంతం బూర్జువా, సామ్యవాద వ్యవస్థలు రెండింటిలోను ఉద్యోగి స్వామ్య ఆధిపత్యం (Bureaucratic Domination) స్థానం సంతరించుకొంటుంది. ఈ రెండు వ్యవస్థలకు ఉద్యోగి స్వామ్య నిర్వహణ చాలా అవశ్యకం. రెండు వ్యవస్థలలో ఉద్యోగి స్వామ్యం సమాన ప్రాముఖ్యతను పొందుతుండటం వల్ల పరాయీకరణ ఏదో ఒక రూపంలో తప్పనిసరిగా ఉంటుంది. ఉద్యోగిస్వామ్యంలేకుండా పెట్టుబడిదారీ వ్యవస్థ కొనసాగటం అసంభవం. సహజంగానే పెట్టుబడిదారీ విధానం వృద్ధి ఉద్యోగి స్వామ్య Rationality తో ముడిపడిఉంటుంది. ఇది మానవ నియంత్రణకు వెలుపల స్వతంత్రంగా పనిచేస్తుంది. హెర్బర్ట్ మార్క్యూస్ రచనలలో వెబర్ Technical Determination ప్రతిధ్వనిస్తున్నది. ఆయన దృష్టిలో నాగరికతా ప్రపంచమంతటా ఒక వ్యక్తి పై మరొక వ్యక్తి ఆధిపత్యం వృద్ధి చెందుతుంది. శ్రామికులకు తమ శ్రామికశక్తిపై ఎలాంటి ఆధిపత్యంకాని నియంత్రణకాని ఉండదు. వ్యక్తులు తమ స్వంత జీవితాలను గడపరు. ముందుగానే నిర్దేశితమైన విధులను నిర్వర్తిస్తూంటారు. వారుపని చేయలేనప్పుడు వారి స్వంత అవసరాలను తీర్చుకోలేరు. మానవుడు తాను శ్రమించేదాంతో తృప్తిచెందడు. అతని జీవితం కేవలం శ్రమసాధనంగా మారుతుంది. అతను చేసిన శ్రమ, పర్యవసానంగా ఉత్పత్తి అయిన వస్తువులు అతని నుండి వేరు చేయబడి కొత్తరూపాన్ని శక్తిని సంపాదించుకొంటాయి. మార్క్స్ వలెగాక హెర్బర్ట్ మార్క్యూస్ పరాయీకరణం సమస్యకు పరిష్కారంగా శ్రమ ఆహ్లాదకరమైనదిగా మారుతుందంటాడు. సామాజిక సంస్థలలో మార్పులు తీసుకొనిరావటం, అవసరాలనుబట్టి సామాజిక ఉత్పత్తుల పంపిణీ, సామర్థ్యాన్ని బట్టి విధుల అప్పగింత, ఆకర్షణీయమైన శ్రమ నిబంధనలు మొదలైన వాటి ద్వారా పరాయీకరణం సమస్యకు పరిష్కారాన్ని సూచిస్తాడు.

BRAOU

లుకాక్స్ పరాయీకరణంపై మార్క్స్ అభిప్రాయాలను పునరుద్ఘాటించారు. పరాయీకరణం ప్రక్రియలో మానవుని వివిధ గుణాలు (Qualities) సామర్థ్యాలు (Capacities) అతని నుండి వేరై ఇతరులకు చెందుతాయి. లుకాక్స్ వాదన వెబర్ వాదానికి వామపక్షవాదం వలె కన్పిస్తుంది. పరాయీకరణం చెందిన నిర్మితులను నిర్మూలించటం ద్వారా మాత్రమే అభివృద్ధి వైరుధ్యాలను తొలగించవచ్చు. ఇదే ప్రేరణతో జార్జి సిమ్మెల్ (George Simmel) తన రచనలలో ఈ విధంగా వాదించారు. బూర్జువా సమాజం శ్రమశక్తిని ఒక వస్తువుగా మారుస్తుంది. పర్యవసానంలో శ్రామికుల స్థితి సామాజిక వాస్తవంగా రూపొందుతుంది. సమాజం వస్తు మార్పిడి ద్వారా తన అవసరాలను తీర్చుకోవడంలోనే పరాయీకరణం దాగి ఉంటుంది. పెట్టుబడి దారీ సమాజం అభివృద్ధి పరాయీకరణం నిర్మితిని పటిష్టం చేయటం ద్వారా, సామాజిక చైతన్యంపై ఆధిపత్యాన్ని పొందుతుంది.

సిమ్మెల్ శ్రమ విభజన వ్యవస్థలోని చెడును ఖండిస్తూ ఉత్పత్తిదారుడు, వస్తువును ఉత్పత్తి చేసినవాడి మధ్య దూరాన్ని పేర్కొన్నారు. వస్తూత్పత్తిలో ప్రత్యేకీకరణ ఎక్కువైనప్పుడు శ్రామికుడు అభివృద్ధిలో తగినంతగా భాగస్వామ్యం పొందలేడు. ఆయన Rationalised Technology ని ఖండించారు. అది మానవుని పరాయీకరణం చేస్తుంది. మానవుని సాంస్కృతిక వికాసంలో భాగమైన వస్తువులు అతని నుండి వేరు చేయబడుతాయి.

పైన వివరించిన వివిధ వాదనలను బట్టి మార్క్స్‌ను అంగీకరించినట్లుగా, మార్పుచేసినట్లుగా, గోచరిస్తుంది. ఇది వాస్తవంలో మార్క్స్ పరాయీకరణం భావానికి Extension కాదు. మార్పుకూడా కాదు. మార్క్సిజం గతితార్కిక భౌతికవాదం పై ఆధారపడుతుంది. పరాయీకరణం వర్గ నిర్మితుల మధ్యగల సంబంధాన్ని సూచిస్తుంది. సాధారణంగా శ్రామికుడు వర్గ నిర్మితి ద్వారా నిరంతరం తన ప్రతిఘటనను కొనసాగిస్తుంటాడు.

ఉత్పత్తి ప్రక్రియలో శ్రామికుని చర్యలు అతనిని ఆమూర్త మానవుని (Abstract Entity) గా మారుస్తాయి. శ్రామిక వర్గం ప్రత్యేకమైన సమాజాలలోనే ఉంటుంది. శ్రామికవర్గం స్థానిక, జాతీయ, సాంప్రదాయాలను, పాలకవర్గ సిద్ధాంతాలతో మిళితమైన చైతన్యాన్ని కలిగి ఉంటుందన్న వాదన కూడా ఉంది. సామాజిక అభివృద్ధిలో పారంపర్యంగా వస్తున్న వైరుధ్యాలను అర్థం చేసుకోవటానికి చేసిన ప్రయత్నంగా దీన్ని మనం పేర్కొనవచ్చు. వ్యక్తి తనను తాను తండ్రిగా, భర్తగా, శ్రామికుడుగా, ఆటగాడుగా విశ్వసించలేని పరిస్థితి. తనను తాను నమ్మకపోవడాన్ని సాహసోపేతమైన విషయంగా భావిస్తాడు. ఇతరులను అనుకరించటం, ఇతరుల వలె జీవించటం చాలా సులభం.

ఈ మార్గాన్ని అనుసరించిన వారిలో సార్త్రే ప్రముఖుడు. ఈయన మానవుని Non-Authentic జీవితాన్ని గురించి వివరిస్తూ పరాయీకరణం సమస్యను ప్రస్తావించారు. వ్యక్తి ఇతరులనుండి వేరుకాబడిన వాడుగా ఆలోచిస్తాడు. సార్త్రే పెట్టుబడిదారీ వ్యవస్థలో పరాయీకరణం చెందిన మానవుని స్పష్టంగా చిత్రీకరించే ప్రయత్నంలో మార్క్స్ మార్గాన్ని అనుసరించాడు. శ్రామికుడు ఒక కారును తయారు చేయుటంలో, లేదా, ఒక కారును కొనుక్కోవటంలో అలసిపోతాడు. అతనిని దోపిడీ చేసే వ్యవస్థే అతనికొక లక్ష్యాన్ని దాన్ని చేరుకొనే అవకాశాన్ని అందిస్తుంది. వాస్తవంలో పరాయీకరణం చెందిన వ్యక్తి జీవితం అర్థ రహితం. అవసరాలు కృత్రిమంగా రూపొంది లాభార్జనయే లక్ష్యంగా ఉంటుంది, అస్తిత్వ సిద్ధాంతంలో వ్యక్తి ముఖ్యుడు.

అస్తిత్వసిద్ధాంతంలో పరాయీకరణం అనధికార జీవితంగా (In authentic life) గుర్తింపును పొందింది. మార్క్స్ Disalienations ను కోరగా అస్తిత్వవాదులు Authentic జీవితాన్ని వాంఛించారు. మొదట Authenticity, In authenticity పదాలను మార్టిన్ హెడ్‌గార్ వాడారు. ఈ పదాలను సార్త్రే మార్పు చేర్పులతో పరస్పర విరుద్ధ మానవ అస్తిత్వ రీతులను తెలుసుకోవటానికి ఉపయోగించారు. ఈ రెండు పదాలు అస్తిత్వ సిద్ధాంతం అందించిన అతి ముఖ్యమైన అంశాలు.

BRAOU

అస్తిత్వవాదుల దృష్టిలో Non Alienated లేదా Inauthentic life లో మానవుడు యదార్థంగా మానవుడు కాదు. వారి దృష్టిలో వ్యక్తిత్వానికి ప్రాముఖ్యత ఉంది. స్వేచ్ఛగా పుట్టిన మానవుడు స్వేచ్ఛగానే ఉండాలని కోరుతారు. అయితే అస్తిత్వ వాదులందరూ ఒకే అంశానికి ప్రాధాన్యత ఇవ్వలేరు. యాథార్థంలో వారంతా ఏమి కోరుకుంటున్నారో తెలుసుకోవటం చాలా కష్టం. వారి Inauthentic జీవితాన్ని, దాని స్థానంలో Aithentic జీవితాన్ని ఏ విధంగా సాధిస్తారో స్పష్టంగా వివరించలేదు.

## 10.8 పరాయీకరణం : విమర్శలు

పరాయీకరణం భావన ఆధునిక నాగరిక సామాజిక జీవిత లక్షణాలను దెబ్బతీస్తున్నప్పటికీ, దాని మరోదృక్కోణాన్ని చూడటంలో విఫలమైంది. ఆధునిక సమాజపు పోటీ జీవితంలో మానవుడు చిక్కుకొనిపోయి అతి ఘోరంగా తన అస్తిత్వాన్ని కోల్పోయాడు. పరాయీకరణాన్ని అధిగమించటానికి ఉపయోగించిన యంత్రాంగం లోపభూయిష్టమైనటువంటిది. దాని పరిష్కారానికి మార్గంలేనందువల్ల కొనసాగుతూ ఉంది.

రాజకీయ పరాయీకరణం కేవలం మార్క్సియన్ సిద్ధాంతం అందించిన భావన. హెగెల్ ఆది భౌతికవాదం నుండి ప్రేరణ పొందిన కారల్‌మార్క్స్ ఆభావాన్ని సామాజిక శాస్త్రంలో ఉపయోగించి అంతిమంగా తన రాజకీయ అర్థశాస్త్రంలో అంతర్భాగ లక్షణంగా చేశారు. శ్రమ పరాయీకరణం మానవుని స్వీయపరాయీకరణంగా మారి, ఆధునికీకరణ ఫలితంగా రూపొందిన నవ్యసమాజాల అవసరాలను తీర్చటంలో విఫలమైందని మార్క్సిజం విమర్శకుల భావన. దీన్ని మనం అంగీకరించనూ వచ్చు లేదా తిరస్కరించనూవచ్చు.

పరాయీకరణం సమస్య పరిష్కారానికి మార్క్స్ ప్రవేశ పెట్టిన వాదం ఉహాజనితవాదం. దీనికి భిన్నంగా అనుభవవాద రాజకీయ సిద్ధాంతం రూపొందింది. సామ్యవాదదేశాలలో ఇటీవల సంభవించిన పరిణామాల దృష్టిలో పరాయీకరణం భావనను పరిశీలించాల్సి ఉంది. మార్క్స్ పరాయీకరణం భావనను ఉత్పత్తి పరిస్థితుల సందర్భంగా ఎందుకు చూసాడన్నది అర్థం చేసుకోవటం చాలా కష్టం.

రాజకీయ పరాయీకరణం భావనను ఎవ్వరూ ఇంతవరకు పరిపూర్ణంగా అధ్యయనం చేయలేదు. అనుభవవాద రాజకీయ సిద్ధాంతం కేవలం అందుబాటులోగల వాస్తవాలను బట్టి మాత్రమే పరాయీకరణం భావనను అధ్యయనం చేస్తున్నది. ఆధునిక సామాజిక శాస్త్రవేత్తలకు కారల్ మార్క్స్ నుండి, ఆయన విమర్శకుల నుండి, ప్రేరణ లభించినట్లు విదితమవుతున్నది. పర్యవసానంలో పరాయీకరణం భావనకు పరిపూర్ణ స్పష్టత ప్రాప్తించలేదు. కొంతమంది శాస్త్రవేత్తలు సమగ్రంగా ఆలోచించక అస్పష్టవాదనలు చేస్తున్నారు. వారు రాజకీయ ఏకాంతం (Political Isolation) రాజకీయ నిరాశావాదం (Political cynicism) లాంటి పదాలను పరాయీకరణకు పర్యాయపదాలుగా వాడుతున్నారు. మరికొంతమంది రచయితలు రాజకీయ పరాయీకరణం ప్రజల కోపోద్రేకాలుగా మారి తిరుగుబాటుగా బహిర్గతమవుతున్నది అంటున్నారు.

సామాజిక, రాజకీయ మౌలికాంశాలకు వెలుపల రాజకీయ పరాయీకరణం భావనను వివరించటం సరైన విషయంకాదు. మానవుడు స్వభావరీత్యా సంఘజీవి, రాజకీయజీవి కూడా. కొన్ని సందర్భాలలో మానవుడు సంఘంలో జీవిస్తున్నప్పటికీ తన సమాజపు రాజకీయాలలో సమీపసంబంధం లేనట్లుగా వ్యవరించవచ్చు. రాజకీయ జీవితంలో క్రియా శీలకంగా పాల్గొనకపోవచ్చు. రాజకీయ సంస్థల వృద్ధినికాని, సామాజిక విలువల విషయాన్ని కాని పట్టించుకోకపోవచ్చు. అయినా వారు సమాజంలోనే కొనసాగుతుంటారు. మానవుని ప్రభావితం చేసే సంబంధాల జోలికి పోకుండా, పట్టించుకోకుండా ఎవరూ సమాజపు సమిష్టి జీవనంలో భాగస్వాములు కాజాలరు. ఈ సంబంధాలు కొనసాగుతున్నంతకాలం రాజకీయ వ్యవస్థలు కొనసాగుతుంటాయి.

BRAOU

--డా॥ కె. లక్ష్మి

## 10.9 చదువదగిన పుస్తకాలు

| | | |
|---|---|---|
| Mitchell. W.C. | : | Sociological Analysis and Politics |
| Rathore | : | Political Sociology |
| Jangam. R.R. | : | Political Sociology |

## 10.10 నమూనా పరీక్షా ప్రశ్నలు

కింది ప్రశ్నలకు వ్యాసరూపంలో సమాధానాలు రాయండి.

1. పరాయీకరణం అనగా ఏమిటి.
2. రాజకీయ పరాయీకరణం స్వభావాన్ని చర్చించండి.
3. పరాయీకరణంపై మార్క్స్ భావజాలపు సంబంధాన్ని వివరించండి.
4. రాజకీయ పరాయీకరణం భావనను విమర్శనాత్మకంగా పరిశీలించండి

BRAOU

# డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
# సామాజిక శాస్త్రాల విభాగం
## రాజనీతిశాస్త్రంలో స్నాతకోత్తర అధ్యయన కార్యక్రమం
## ఎం.ఎ. రెండవ సంవత్సరం
## పాఠ్యప్రణాళిక
## పాఠ్యాంశం - III రాజకీయ సమాజ శాస్త్రం


ఖండం - 1 ప్రవేశిక

భాగం - 1 రాజకీయ సమాజశాస్త్రం - స్వభావం, పరిధి

భాగం - 2 అధ్యయన దృక్పథాలు

భాగం - 3 రాజకీయాల సామాజిక ఆర్థిక ప్రాతిపదికలు

భాగం - 4 సామాజిక స్థరీకరణం

ఖండం - 2 భావనలు

భాగం - 5 రాజకీయ సమాజీకరణం

భాగం - 6 రాజకీయ సంస్కృతి

భాగం - 7 రాజకీయ ప్రసరణం

భాగం - 8 రాజకీయ శిష్ట వర్గం

భాగం - 9 రాజకీయ భాగస్వామ్యం

భాగం - 10 రాజకీయ పరాయీకరణం

ఖండం - 3 చలన సూత్రాలు

భాగం - 11 శక్తి, అధికారం, శాసనబద్ధత

భాగం - 12 సామాజిక మార్పు - రాజకీయ ప్రక్రియలు

భాగం - 13 రాజకీయ ఆధునికీకరణం

భాగం - 14 రాజకీయ అభివృద్ధి

భాగం - 15 సమైక్యత : సమస్యలు

ఖండం - 4 స్థిర దృక్కోణాలు

భాగం - 16 రాజకీయ పార్టీలు

భాగం - 17 ప్రభావ వర్గాలు

భాగం - 18 నాయకత్వ నమూనాలు

భాగం - 19 సామాజిక మార్పు - గాంధీ సిద్ధాంతం

భాగం - 20 మార్క్సిస్టు నమూనా


BRAOU

BRAOU

# డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
## సామాజిక శాస్త్రాల విభాగం
## రాజనీతిశాస్త్రంలో స్నాతకోత్తర అధ్యయన కార్యక్రమం
## ఎం.ఎ. రెండవ సంవత్సరం
## పాఠ్యప్రణాళిక
## పాఠ్యాంశం 3 : రాజకీయ సమాజశాస్త్రం
## నమూనా ప్రశ్నా పత్రం

కాలం: 3 గంటలు] [మార్కులు : 100

### భాగం - A

కింది ప్రశ్నలకు జవాబులు రాయుము. 4 x 15 = 60

1. రాజకీయ సమాజశాస్త్రమును నిర్వచించి దాని పరిధిని చర్చింపుము.

లేదా

రాజకీయ సమాజశాస్త్ర అధ్యయన దృక్పథాలను పరిశీలింపుము?

2. సామాజిక స్థరీకరణం అంటే ఏమిటి? మనదేశంలో సామాజిక స్థరీకరణను పరిశీలింపుము?

లేదా

రాజకీయ సమాజీకీకరణం అనగా ఏమిటి?

3. రాజకీయ సంస్కృతిని విశ్లేషింపుము

లేదా

ప్రజాస్వామ్య వ్యవస్థలలో రాజకీయ భాగస్వామ్యాన్ని చర్చించండి?

4. పరేటో వివరించిన విశిష్ట వర్గ భ్రమణ సిద్ధాంతాన్ని చర్చించండి?

లేదా

రాజకీయ పరాయీకరణ మనగా నేమి? వివరింపుము.

### భాగం - B

కింది ప్రశ్నలకు జవాబులు రాయండి. 5 x 8 = 40

5. రాజకీయ అభివృద్ధి

లేదా

శిష్టులు

6. రాజకీయ ఆధునికీకరణం

లేదా

భారతదేశపు సమైక్యతా సమస్యలు

BRAOU

7. రాజకీయ పార్టీలు

లేదా

ప్రభావవర్గాలు

8. గాంధీ మార్గంలో సామాజికమార్పు

లేదా

రాజకీయ ప్రసరణం ప్రాధాన్యత

9. కాంగ్రెసు సంస్కృతి

లేదా

సామాజిక మార్పులకు మార్క్సిస్టు నమూనా

BRAOU

# రాజకీయ సమాజశాస్త్రం

BRAOU

డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
హైదరాబాద్
1996

# రచయితల బృందం

సంపాదకుడు
ఆచార్య ఎం. సత్యనారాయణ రావు

సహసంపాదకుడు
శ్రీ ఘంటా చక్రపాణి

రచయితలు
ఆచార్య ఎం. రాంచందర్
డా. వి. రవీంద్రశాస్త్రి
డా. కె. లక్ష్మి
శ్రీ ఘంటా చక్రపాణి

తెలుగు భాష పరిశీలన
శ్రీ పి. వేణుగోపాలస్వామి

ముఖచిత్రం
రమేష్

BRAOU

డా బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

ప్రథమ ప్రచురణ 1996

© 1996 డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం. అన్ని హక్కులు విశ్వవిద్యాలయానివి ఈ పుస్తకంలో ఏ భాగమైనా ఉపయోగించదలచుకుంటే విశ్వవిద్యాలయం అనుమతిపొందాలి. ఈ పాఠాలు సార్వత్రిక విశ్వవిద్యాలయం పాఠ్య ప్రణాళికలో ఒక భాగం. పాఠ్య ప్రణాళిక వివరాలు చివరలో ఉన్నాయి.

ఇతర వివరాలకు: డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

ముద్రణ: తేజా ఆఫ్‌సెట్ ప్రింటర్స్, 318/3అర్‌టి, ఎస్.ఆర్. నగ

# డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

## సామాజిక శాస్త్రాల విభాగం

### రాజనీతి శాస్త్రంలో స్నాతకోత్తర అధ్యయన కార్యక్రమం

### ఎం.ఎ. రెండవ సంవత్సరం

విషయసూచిక


| | | |
|---|---|---|
| భాగం 11 | శక్తి అధికారం శాసనబద్ధత | 2 |
| భాగం 12 | సామాజిక మార్పు : రాజకీయ ప్రక్రియలు | 16 |
| భాగం 13 | రాజకీయ ఆధునికీకరణ | 31 |
| భాగం 14 | రాజకీయ అభివృద్ధి | 47 |
| భాగం 15 | సమైక్యత సమస్యలు | 62 |
| భాగం 16 | రాజకీయ పక్షాలు | 76 |
| భాగం 17 | ప్రభావ వర్గాలు | 89 |
| భాగం 18 | నాయకత్వ నమూనాలు | 99 |
| భాగం 19 | సామాజిక మార్పు సిద్ధాంతం గాంధీ సిద్ధాంతం | 111 |
| భాగ[illegible] | మార్క్సిస్టు నమూనా | 123 |


BRAOU

BRAOU

# పరిచయం

రాజకీయ సమాజశాస్త్రం ఆలస్యంగా అతి తక్కువ కాలంలో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకొంది. రాజనీతిశాస్త్రం ఎంత ప్రాచీన చరిత్రను కలిగి ఉందో రాజకీయ సమాజశాస్త్రం అంత ఆధునికమైంది. విశ్వవ్యాప్తంగా కొత్త సామాజిక శక్తులు ఆవిర్భవిస్తున్న నేటి నేపథ్యంలో రాజకీయ సమాజశాస్త్ర అధ్యయనం ఆవశ్యకత బాగా పెరిగింది. రెండవ ప్రపంచ యుద్ధానంతర దశలోనే రాజకీయ సమాజశాస్త్రం అవతరించింది. పారిశ్రామిక విప్లవ ఫలితాలు, శాస్త్రసాంకేతిక విజ్ఞానాభివృద్ధి, సమాజాన్ని సంక్షోభంలో పడేశాయి. మానవ సంబంధాల్లో సంభవించిన మార్పులు సామాజిక వర్గ నిర్మితులను మార్చివేశాయి. కొత్త ఆధిపత్య వర్గాలు రూపొందాయి. సమాజంలో భిన్న దృక్పథాలు అభివృద్ధి చెందాయి. రెండవ ప్రపంచ యుద్ధం దృక్పథాలను అంతర్జాతీయ ఎజెండాలో చేర్చింది. యూరోపు ఖండం అందునా జర్మనీకి చెందిన మేధావులు యుద్ధ వైఫల్యాలను, ఫలితాలను చర్చించ ప్రారంభించారు. అమెరికాకు వలసవచ్చి స్థిరపడిపోయిన మేధావివర్గం అటు మార్క్సిస్టు ఆలోచనాధోరణితోపాటుగా, మాక్స్‌వెబర్ రచనల ప్రభావంతో సామాజిక శక్తులు, రాజకీయ సంబంధాలపై చర్చను ప్రారంభించారు. ఇది 1930లో ఆరంభమై 1950 నాటికి ఒక రూపం దాల్చింది. విద్యావేత్తల మధ్య చర్చనీయాంశంగానే కాక, అమెరికన్ విశ్వవిద్యాలయాల్లో రాజకీయ సమాజశాస్త్రం ఒక ప్రత్యేక అధ్యయనాంశంగా వృద్ధి చెందింది. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక, అంతకుముందు రాజకీయాలు–సమాజానికి మధ్య సంబంధాలపై అధ్యయనాలు జరిగినప్పటికీ, రాజకీయ సమాజశాస్త్రం ఇటీవలి కాలంలోనే విశ్వవిద్యాలయాల అధ్యయనాంశపు స్థాయికి పెరిగింది.

BRAOU

19వ శతాబ్దం మధ్య కాలం దాకా రాజనీతి శాస్త్రవేత్తలు కేవలం రాజనీతి ఆలోచనా విధానాన్ని మాత్రమే అధ్యయనం చేశారు. రాజ్యం, రాజ్య ఆవిర్భావానికి సంబంధించిన అంశాలపైననే తమ దృష్టి సారించారు. ఆ తరువాత కాలంలో కూడా రాజ్యం–అధికార యంత్రాంగం చుట్టూ మాత్రమే అధ్యయనాలు జరిగాయి. రెండవ ప్రపంచ యుద్ధానంతరమే మేధావి వర్గం రాజకీయాలను ప్రభావితం చేస్తున్న సామాజిక శక్తులను గురించి ఆలోచించటం మొదలైంది. సమాజాన్ని ప్రభావితం చేసే అనేకానేక సంస్థల్లో రాజ్యం ఒకటి మాత్రమే తప్ప సమాజానికి ప్రత్యామ్నాయం కాదన్న వాదనలు రాజకీయ, సమాజ శాస్త్రాల మధ్య పరస్పర సంబంధాలు నెలకొల్పాయి. పర్యవసానంలో అంతర్వర్గీయ అధ్యయనాంశంగా రాజకీయ సమాజశాస్త్రం ఆవిర్భవించింది. సామాజిక నిర్మితులు, సాంఘిక శక్తులను అర్థం చేసుకోకుండా రాజనీతిని, రాజకీయాలను అర్థం చేసికోవడం కుదరని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ పరిస్థితుల్లో రాజకీయ దృగ్విషయాలను సామాజిక శక్తుల దృక్కోణం నుంచి అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఏర్పడింది.

రాజనీతి శాస్త్ర స్నాతకోత్తర అధ్యయన కార్యక్రమంలో రాజకీయ సమాజశాస్త్రాన్ని చేర్చాం. ఇందులో నాలుగు ఖండాలున్నాయి. మొదటి ఖండంలో స్వభావం, పరిధి, అధ్యయన దృక్పథాలను చేర్చాం. రండవ ఖండంలో వివిధ రాజకీయ సమాజశాస్త్ర ప్రభావాలను చర్చించాం. మూడవ ఖండం చలన సూత్రాలను చర్చిస్తుంది. నాల్గవ ఖండంలో వివిధ స్థిరమైన దృక్కోణాలను చర్చించాం. ఈ అధ్యయనం ద్వారా సామాజిక శక్తులు రాజకీయాలను; రాజకీయాలు, సామాజిక శక్తులను ఎలా ప్రభావపరుస్తున్నాయో అవగాహన చేసుకోవడానికి ఉపయోగపడుతుంది.

BRAOU

# ఖండం –3 చలన సూత్రాలు

ఏ సమాజంలోనైనా మార్పు ఒక అనివార్యమైన ప్రక్రియ, నిరంతరం మారుతుండటం మానవ సమాజపు స్వభావం, మార్పు అంతర్గత శక్తుల చలన శీలత వల్లనే సాధ్యపడుతుంది. ఈ ఖండంలో వివిధ చలన సూత్రాలను చర్చించాం.

BRAOU

BRAOU

# భాగం 11 – శక్తి, అధికారం, శాసనబద్ధత

విషయక్రమం


11.1 లక్ష్యాలు
11.2 పరిచయం
11.3 నిర్వచనం
11.4.0 సిద్ధాంతాలు
11.4.1 శక్తి సిద్ధాంతం
11.4.2 మానసిక విశ్లేషణ సిద్ధాంతం
11.4.3 సామాజిక సిద్ధాంతం
11.4.4 ఉదార ప్రజాస్వామ్య సిద్ధాంతం
11.4.5 మార్క్స్ సిద్ధాంతం
11.4.6 శిష్ట సిద్ధాంతం
11.5 అధికారం
11.6.0 అధికారాలు–రకాలు
11.6.1 హేతుబద్ధమైన – న్యాయ అధికారం
11.6.2 సాంప్రదాయిక అధికారం
11.6.3 సమ్మోహనాధికారం
11.7.0 శాసనబద్ధత
11.7.1 సిద్ధాంతపరమైన మూలం
11.7.2 నిర్మితుల పరమైన మూలం
11.7.3 వ్యక్తులనాశ్రయించుకొన్న శాసనబద్ధత
11.8 శాసనబద్ధత వివిధ సిద్ధాంతాలు
11.9 ముగింపు
11.10 సంప్రదించదగిన రచనలు
11.11 నమూనా పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 11.1 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదివిన తరువాత మీరు

★ శక్తి అధికారం శాసన బద్ధతల భావనలను అర్థం చేసుకోగలుగుతారు.

★ శక్తికి సంబంధించిన సిద్ధాంతాలు, అధికారాల తీరు తెన్నులు వివరిస్తారు.

★ శక్తి, అధికారం శాసన బద్ధతల సమన్వయాన్ని విశ్లేషించగలుగుతారు.

## 11.2 పరిచయం

రాజకీయ సమాజ శాస్త్ర సిద్ధాంతాలలో శక్తి ఒక ముఖ్యమైన భావన. సమాజం, రాజకీయాల మధ్య సంబంధాలను సక్రమంగా, సంపూర్ణంగా అర్థం చేసుకోవాలంటే శక్తి స్వరూపస్వభావాలను తెలుసుకోవడం ముఖ్యం. శక్తిని దాని

వివిధ రూపాల విషయంలో అవగాహన లేనప్పుడు సమాజంలో రాజకీయాలను సక్రమంగా అధ్యయనం చేయలేమన్నది అతిశయోక్తి కాదు.

## 11.3 నిర్వచనం

శక్తి సిద్ధాంతాన్ని రాజనీతి సామాజిక శాస్త్రంలో విస్తృతంగా చర్చించారు. రాజకీయాల అధ్యయనానికి శక్తి, కీలకమైన విషయమని రాజనీతి శాస్త్ర విద్యార్థులు భావిస్తున్నారు. శక్తి అధ్యయనం రాజనీతి శాస్త్ర పరిధికే పరిమితంకాని చాలా విస్తృతమైన విషయం. వెబర్ (Weber) దృష్టిలో శక్తి సామాజిక సంబంధాలలో నిర్ణయాన్ని బలవంతంగా అమలుపరచగల సామర్థ్యం. ప్రతిఘటనలు ఎదురైనప్పటికీ తమ ఇష్టం వచ్చినట్లుగా సమాజంలోని తక్కిన వాళ్ళపైన నిర్ణయాలను అమలుపరచగలగటాన్ని శక్తి అంటారు. వ్యక్తి గాని, వ్యక్తుల సమూహంగాని తమ ఇష్టప్రకారం సమాజంలోని సభ్యుల నడవడికలను తీర్చిదిద్ద గల సామర్థ్యమే శక్తి. అట్లాంటివారు తమ నడవడికలో తమకు ఇష్టంలేని మార్పులు తెచ్చే ప్రయత్నాలను ప్రతిఘటిస్తారు. ఇతరులకు ఇష్టమున్నా లేకున్నా వారి ప్రవర్తనను మార్చి వారి చేత పనులు చేయించగల సామర్థ్యానికి శక్తి అని పేరు.B అనే వ్యక్తిచేత ఇతరత్రా చేయించలేని పనినిA చేయించగలగడాన్ని B పై A కున్న శక్తి అని ప్రఖ్యాత రాజనీతి శాస్త్రజ్ఞుడు ఢాల్(Dhal) నిర్వచించాడు. ఒక వ్యక్తిగానీ, సంస్థగానీ తన అధికారాన్ని ఇతర వ్యక్తులు లేదా సంస్థల ప్రవర్తనను ప్రతిఘటించే వాతావరణంలో కూడా అదుపుచేయగల సామర్థ్యాన్ని శక్తి అనవచ్చు.

శక్తి ప్రక్రియ వివిధ రూపాలలో బహిర్గతం కావచ్చు. బలప్రయోగం మొదలుకొని సహకారం, అనునయం దాకా శక్తి ఏ రూపంలోనైనా కనబడవచ్చు. శక్తిని అధికారికంగా కూడా గుర్తించవచ్చు. శాసనబద్ధమైన శక్తే అధికారం.

హాబ్స్ తన లెవియథాన్(Leviathan)ను రచించినప్పటి నుంచి జాతీయ, అంతర్జాతీయ రంగంలో శక్తి సిద్ధాంతం రాజనీతిజ్ఞులను విశేషంగా ఆకర్షించి విపరీతమైన చర్చ జరగడమేకాక అది ఒక ప్రాథమిక పరిశోధనాంశంగా మారింది. శక్తిని నిర్వచించడంలో, అర్థ వివరణ ఇవ్వడంలో ఏకాభిప్రాయం కుదరలేదు. శక్తి సామాజిక, రాజకీయ, ఆర్థిక, మానసిక, ఆధ్యాత్మిక ఆపాదనలే(implications) ఇందుకు కారణం. రాజకీయ సిద్ధాంతాలలో శక్తి, ఇటీవలి కాలంలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకొంది. రాజకీయాల అర్థం రాష్ట్రం, ప్రభుత్వాల అధ్యయనం నుంచి మారిపోయి శక్తి స్వరూపం, ఉపయోగాలతోపాటుగా పోటీపడుతున్న విలువల, భావనల, వ్యక్తుల ప్రయోజనాల, డిమాండ్ల మధ్య సక్రమమైన ఎంపిక చేయడం కూడా రాజకీయాల అధ్యయనమే అవుతుంది. ఖచ్చితంగా నిర్వచించడం అంత సులభం కాదు. ఒకవైపు ఫ్రెడ్రిక్ (Friedrich) శక్తిని సాధారణమైన మానవ సంచితంగా గుర్తిస్తే మరోవైపు టానీ (Tawney) శక్తిని ఇతరుల ప్రవర్తనను తమకు ఇష్టమైన పద్ధతిలోకి మార్చుకొనే ఒక శక్తి లేదా వ్యక్తుల సమూహం సమర్థతగా పేర్కొన్నాడు. లాస్‌వెల్ (Lasswell) శక్తిని ప్రభావంగా భావిస్తే, మావో శక్తి తుపాకి బారల్ నుంచి ఆవిర్భవిస్తుందంటే, గాంధీజీ శక్తిని సత్యం, ప్రేమలుగా గుర్తించాడు.

శక్తికి బదులుగా ఎన్నో పర్యాయ పదాలను వాడటం జరుగుతోంది. ఉదాహరణకు – నియంత్రణ, ప్రభావం, బలం, బుజ్జగింపు, ప్రాబల్యం. కానీ ఇవి ఏవీ శక్తికి సమానార్థకాలు కావు. అలాగే అధికారమూ శక్తి ఒకటికావు. శాసనబద్ధత కలిగిన శక్తి అధికారం. బలం, శక్తి వేరువేరు. బలంలో భౌతికమైన బలం కనబడుతుంది. అది శక్తిలో ఉండవచ్చు, ఉండకపోవచ్చు.

శక్తి రాజకీయ, ఆర్థిక ప్రక్రియేకాక అది ఒక సామాజిక ప్రక్రియ. శక్తిని హోదా, అధికారం, ప్రభావం వంటి ఇతర ప్రక్రియల నుంచివేరు చేసి అధ్యయనం చేయాలి. శక్తి నిగూఢమైంది. బలం ప్రకటితమైంది. అధికారం వ్యవస్థీకృతమైన శక్తి. శక్తి లాంఛన ప్రాయమైన వ్యవస్థలలో లాంఛనేతరమైన వ్యవస్థలలో, వ్యవస్థీకృతం కాని వర్గాలలో వివిధ రూపాలలో కనబడవచ్చు. శక్తి మూలాన్ని, దాని వివిధ అంగాలను(Components) సంఖ్యాబలం, సామాజిక వ్యవస్థలు, సామాజిక వనరుల సమ్మేళనంగా చూడవచ్చు.

BRAOU

సాధారణంగా గాని, రాజనీతి శాస్త్ర పరిభాషలోకాని శక్తిని అర్థం చేసుకోవటంలో రాజనీతిశాస్త్రజ్ఞుల మధ్య ఏకాభిప్రాయం లేదు. ఈ విషయంలో రాజనీతి శాస్త్రజ్ఞులలో శక్తి, అధికారం, నియంత్రణ, ఒప్పించడం, బలం నిర్బంధం అనే పదాలు వాడటంలో కూడా ఏకాభిప్రాయం లేదు.

సమాజంలో శక్తి నిర్వహించే పాత్రను అర్థం చేసుకొన్న మాకియవెల్లీ శక్తిని వివిధ అర్థాల్లో నిర్వచించడానికి ప్రయత్నించాడు. వివిధ అర్థాలను సమన్వయం చేసి నిర్వచించడంకోసం గత కొన్ని శతాబ్దాలుగా తీవ్ర ప్రయత్నాలు సాగుతున్నాయి. బెయిర్ స్టెడ్(Biersted) తన సామాజిక శక్తి విశ్లేషణలో ఐదు సూత్రాలను అనుసరించి శక్తిని అర్థం చేసుకోవచ్చన్నాడు.

(1) శక్తి అనేది కేవలం రాజకీయ, ఆర్థిక విషయమే కాక అత్యున్నత సామాజిక లక్షణం.

(2) గౌరవం, ప్రభావం, ఆధిక్యత, బలం అధికారాల నుంచి శక్తిని వేరుగా గుర్తించాల్సి ఉంటుంది.

(3) శక్తి అంతర్గతమైన బలం. బలం ప్రకటితమైన శక్తి. అధికారం వ్యవస్థీకృతమైన శక్తి.

(4) సభ్యుల నుంచి ప్రతిఘటన ఉన్నప్పుడు శక్తి సమాజం వివిధ వ్యవస్థలలో రూపు ఏర్పరుచుకొంటుంది.

(5) శక్తికి ఆధారాలు దాన్ని ఆమోదించే వారి సంఖ్యా బలం, సామాజిక వ్యవస్థలు, వనరులు.

సమాజం అంతటా శక్తి ఉనికిని హాలే (Hawley) గుర్తించాడు. సమాజంలోని ప్రతి వ్యక్తి శక్తి స్వరూపమని చెబుతూ ప్రతి సమాజ సంబంధం లేదా సామాజిక సంస్థ వ్యవస్థీకరించిన శక్తి అని అతడు భావించాడు.

ప్రతిఘటనను అధిగమించే, ప్రతిఘటన వాతావరణంలో మార్పులు ప్రవేశపెట్టే వ్యక్తికున్న సాధారణ ప్రాబల్య సంపదే శక్తి అని ఎట్జియోనీ (Etzioni) అభిప్రాయపడ్డారు.

కానీ డూబిన్ (Dubin) ప్రాబల్య సంపదను శక్తితోకాక వ్యవస్థ అవసరాలకు సామూహిక విధేయతలో చూశాడు. వ్యవస్థ లక్ష్యాలను సాధించే అధికార స్థానాలలో ఉన్న వ్యక్తుల పరంగా డూబిన్(Dubin) శక్తిని గుర్తించాడు. "An Analysis of Social Power" అనే వ్యాసంలో బెయిర్ స్టెడ్ శక్తి సామాజిక ప్రక్రియ అని, అది సమాజంలో నిక్షిప్తమై ఉంటుందని పేర్కొన్నాడు. సామాజిక శక్తిలో రాజకీయ, ఆర్థిక శక్తులు అంతర్భాగాలని అతని భావం. అన్ని సామాజిక సంబంధాలలో శక్తి అంతర్భాగమై ఉంటుంది. శక్తి సార్వజనీనం. నిగూఢమైన బలాన్ని శక్తిగా వర్ణించవచ్చు. శక్తిని హోదా, ప్రభావం, ఆధిక్యత హక్కు, అధికారం, బలం నుంచి వేరుచేసి పరిశీలించాలి. బెయిర్ స్టెడ్ శక్తిని మూడు స్థానాల్లో గుర్తించాడు. మొదటిది లాంఛన ప్రాయమైన వ్యవస్థలు. ఈ వ్యవస్థలలో శక్తి అధికారం, సమాజపు కట్టుబాట్లు (సూత్రాల సముదాయం), హోదాలపై ఆధారపడి ఉంటుంది. రెండోది లాంఛనేతరమైన వ్యవస్థలు. ఈ వ్యవస్థలో శక్తి వ్యక్తి గతమైన గొప్పతనం, సమాజేతర కట్టుబాట్లు, ప్రవర్తనలపై ఆధారపడి ఉంటుంది. ముఖ్యమైన మూడో స్థానం వ్యవస్థీకృతమైన సామాజిక వర్గాలు. ఇక్కడ శక్తి ఒకేరకమైన వర్గ సంబంధాలలో, ఒకే రకం కాని వర్గసంబంధాలపై ఆధారపడి ఉంటుంది. సామాజిక శక్తి, వ్యక్తుల సంఖ్య, సామాజిక వ్యవస్థ, సామాజిక వనరులు అనే మూడు మూల సమ్మేళనాల నుంచి ఏర్పడుతుంది. ఈ శక్తి సామాజిక ప్రాథమిక నడవడిని, కట్టుబాట్లను సమర్థిస్తూ వాటిపై ఆధారపడిన సామాజిక వ్యవస్థను రక్షిస్తుంది. శక్తిలేనిదే వ్యవస్థ లేదు. శక్తి లేనిది సామాజిక నడవడి, కట్టుబాట్లు లేవు.

## 11.4.0 సిద్ధాంతాలు

ఎమర్సన్ (Emerson) శక్తిని వ్యక్తిగతమైన గుణంగాకాక సామూహిక వ్యవస్థ ముఖ్య లక్షణంగా పేరొన్నాడు. అది ఇద్దరు లేదా అంతకన్న ఎక్కువ వ్యక్తుల లేదా వర్గాల మధ్య ఉన్న అధీనతా సంబంధాలను సూచిస్తుంది. ప్రతిఘటనను

BRAOU

అధిగమించే స్థాయిని బట్టి శక్తిని అంచనా వేయవచ్చు. అందుకే శక్తి సంబంధాలు సమతౌల్యంగా గాని, అసమతౌల్యంగాగాని ఉండవచ్చు. సమతౌల్యంలోని సంబంధాలు అస్థిరతను సూచిస్తాయి.

మిల్, రైస్‌మన్‌లు శక్తిని అధ్యయనం చేస్తూ సమాజంలో దాని ఉనికిని భిన్న దృక్కోణం నుంచి పరిశీలించారు. శక్తి నిర్మాణం, దాని నిర్మాణంలో మార్పులు, శక్తి నిర్వహణ, దాని అసలు, శక్తి మూలం, శక్తి దాని పర్యవసానాల విషయంలో వీరిద్దరూ భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. మిల్, రైసన్‌లు శక్తి భావనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేస్తే కారన్ హేజర్ మధ్యే మార్గాన్ని అనుసరించాడు మిల్(Power Elite)కు రైసన్ (Pluralist) భావనకు మధ్య కారన్ హేజర్ తన భావనలకు రూపకల్పనచేశాడు.

శక్తి భావనను అర్థం చేసుకోవడానికి వివిధ సిద్ధాంతాలు వెలువడ్డాయి.

## 11.4.1 శక్తి సిద్ధాంతం

ఈ సిద్ధాంతంలో శక్తిని భౌతిక బలం రూపంలో అధ్యయనం చేయడం జరిగింది. థామస్ హాబ్స్ శక్తి సిద్ధాంతాన్ని చాలా విపులంగా చర్చించాడు. భవిష్యత్తులో కొంతవరకు బాగా కనిపించే దానిని సంపాదించడానికి అనుసరించే ప్రస్తుతమార్గమే శక్తి. శక్తిసాధన మానవుని స్వాభావిక కాంక్ష. ఈ కాంక్ష భిన్న దృక్పథాలు, కోరికలవల్లగాక అప్రయత్నంగా స్వభావంతో జనించి నిరంతరం కొనసాగుతూ ఉంటుంది. హాబ్స్ శక్తిని ఇలా నిర్వచించాడు. ''అపరిమిత సామర్థ్యం, రూపం, ప్రాజ్ఞత, నేర్పరితనం, మాటకారితనం, ఉదారత్వం, ఔన్నత్యం మొదలైన మానసిక గుణాల ప్రోపుశక్తి. స్వాభావిక శక్తి, సంపద, ఖ్యాతి, స్నేహితులు, అదృష్టం అనే కనబడని భగవంతుడి సహాయం, మానవునికి శక్తి సాధకాలుగా ఉపయోగపడతాయి''. పై నిర్వచనాన్ని విశ్లేషణాత్మకంగా పరిశీలించినప్పుడు శక్తి సాధనా ప్రయత్నాలే వ్యక్తుల మధ్య పోటీకి ప్రధాన కారణాలుగా కనిపిస్తాయి.

BRAOU

తరవాత హెగెల్ శక్తి సిద్ధాంత చర్చ చేసి సార్వభౌమత్వ అధికారానికి నిరపేక్షతను కల్పించాడు. 19వ శతాబ్దంలో జర్మన్ రచయిత లైన(Nietzshe, Trietschke, Bernharde) లు శక్తి సిద్ధాంతాలను చర్చించారు. 1922లో ఇటలీలో ఫాసిజం ఆవిర్భవించి ''రాజ్యానికి ఎదురు లేదు. అంతకంటే ఉన్నతమైంది లేదు'' అన్న ముస్సోలినీ ప్రకటన తరవాత శక్తి సిద్ధాంతానికి పరిపూర్ణత లభించింది. దీనికి వ్యతిరేకంగా ప్రఖ్యాత చికాగో తత్వ విచారణ పద్ధతి మూల పురుషుడు చార్లెస్ మెరియమ్ తీవ్ర విమర్శ లేవనెత్తాడు. ఆయన శక్తి సిద్ధాంతపు మూల సూత్రాలన్నింటినీ కూలంకషంగా చర్చించి ఏ సందర్భాలలో శక్తి ఆవిర్భవిస్తుందో పరిశీలించాడు. వైరుధ్యం, విధేయతల మధ్య శక్తి సాధనలో ఎవరు గెలిచారు, శక్తి ఉపయోగంలో ఇవ్వగల సమాధానాలు, బలహీనతలు, అనైక్యతలు, అధికారాన్ని కూలదోసే ప్రయత్నాలు మొదలైన వాటిని చర్చించాడు. శక్తి సిద్ధాంతంలోని యథార్థతను మనం కాదనలేకున్నా శక్తిని భౌతికపరంగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాం. కానీ శక్తి నిభౌతికమైన బల ప్రదర్శనగా భావించడం కంటె దాన్ని విస్తృత దృక్పథంగల సిద్ధాంతంగా భావించాలి. ఉదాహరణగా మనం సామాజిక శక్తిని తీసుకోవచ్చు. హాన్స్ మార్గంథో తన ("Politics Among Nations) అనే గ్రంథంలో అంతర్జాతీయ రాజకీయాలు అన్ని రాజకీయాలలాగే శక్తికోసం జరిపే పోరాటమని, అంతర్జాతీయ రాజకీయాల అంతిమ గమ్యం ఏమైనా తక్షణ గమ్యం శక్తి సంపాదనే ని పేర్కొన్నాడు.

## 11.4.2 మానసిక విశ్లేషణ సిద్ధాంతం

ఈ సిద్ధాంతంలో శక్తిని ప్రభావంతో, ప్రభావం చూపగల వ్యక్తుల, సమూహాలతో గుర్తించబడింది. ఈ విషయంలో లాస్‌వెల్ (Lasswell), కాప్లాన్ (Kaplan), ధాల్ (Dhal) లాంటి ఆధునిక రచయితలు క్షుణ్ణంగా చర్చించారు. శక్తి

సిద్ధాంతం విషయంలో వారు చేసిన చర్చలు గణనీయమైనవి. రాజనీతి శాస్త్రంలో శక్తి సాధనను వారు అధ్యయన విషయంగా భావించారు. రాజకీయ పద్ధతులన్నీ శక్తి సాధనకు ప్రయత్నిస్తాయి. రాజనీతి తత్వవిచారాన్ని కేవలం కొన్ని రాజకీయ వ్యవస్థల విశ్లేషణ కోసమే పరిమితం చేయరాదు. సామాజిక పద్ధతుల నుంచి శక్తిని ప్రత్యేకంగా వేరుచేయదగినటువంటిది కాదు. సమాజంలో రాజకీయ విషయాలన్నింటిలోను శక్తికి ప్రమేయముంది. లాస్‌వెల్ దృష్టిలో శక్తి ప్రభావకులు ప్రభావితుల శక్తి, శక్తి వంతుల మధ్య విషయపరమైన ఏకత్వాన్ని సాధించే సిద్ధాంతం. ఆయన శక్తి, ప్రభావాల మధ్యగల భేదాన్ని గుర్తించడానికి ప్రయత్నించాడు. నిర్ణయాలు చేయడంలో పాల్గొనడాన్ని శక్తిగా, ప్రభావమనేది వ్యక్తికిగాని, వ్యక్తుల సమూహానికిగాని ఉన్న విలువలుగా భావించాడు. ఇక్కడ శక్తిని సాధక విషయంగా అర్థం చేసుకొన్నాడేగాని స్వాభావికంగా శక్తికిగల విలువకు ప్రాముఖ్య మివ్వలేదు. రాజకీయ పద్ధతులన్నీ శక్తి రూపకల్పనకు, విభాగానికి, ఆచరణకు ఉద్దేశించినవి కాబట్టి నీటికి రాజనీతి శాస్త్రంలో చాలా ప్రాముఖ్యముంది. సమాజంలోని వ్యక్తులు కొన్ని రంగాలలో రాజకీయ వ్యవస్థ ద్వారా శక్తిసాధనకు ప్రయత్నిస్తూ తక్కిన వారి విధేయతను కోరతారు. ధాల్ (Dhal) తన మానసిక విశ్లేషణాధ్యయనంలో ఈ విషయాన్ని విపులంగా చర్చించాడు. ఒక్కరి అవసరాలు, కోరికలు, ప్రాముఖ్యతలు, ఉద్దేశాలు ఇంకొకరిని ప్రభావితం చేసి, వారిని కార్యసన్నద్ధులుగా చేయడాన్ని ప్రభావమని అన్నారు.

రాజకీయ ప్రభావం అన్ని వ్యవస్థలో సమానంగా లేకపోవడానికి మూడు కారణాలను చూపెట్టాడు:

(1) ఇతరుల ప్రవర్తనపై ప్రభావం కలగజేసే సాధనాల, వనరుల విషయంలో భేదాలున్నాయి. డబ్బు, సమాచారం, ఆహారం, బలప్రయోగపు బెదిరింపు, ఉద్యోగాలు, స్నేహాలు, సమాజంలోని హోదా, శాసనాలు తయారుచేసే హక్కు, ఓట్లు ఇవన్నీ రాజకీయ ప్రయోజనాలు సాధనకు వనరులు.

(2) రాజకీయ ప్రయోజనాల సాధనకున్న వనరుల వినియోగంలోని నిపుణత భేదాన్ని కలగజేస్తుంది. రాజకీయ నైపుణ్యం రాజకీయాలపై వ్యక్తులకు ఆసక్తి ఉండటానికిగల అవకాశాలనుబట్టి వృద్ధి అవుతుంది.

(3) రాజకీయ ప్రయోజనాలకు వ్యక్తులు వనరులను ఎంతవరకు వినియోగించగలుగుతారనే విషయంలో కూడా భేదాలున్నాయి.

రాజకీయ ప్రయోజనాల సాధనకు ఇద్దరు వ్యక్తులు డబ్బును ఎంతవరకు ఉపయోగించగలరో అనేదాన్ని ఉదాహరణగా గ్రహించవచ్చు. ఒకరు డబ్బును రాజకీయ పలుకుబడికి వినియోగిస్తే మరొకరు వ్యాపారాభివృద్ధికి వినియోగిస్తారు.

రాజకీయాలలో శక్తికున్న పాత్రను తెలుసుకోవడానికి వివిధ రాజకీయ వ్యవస్థలలో ప్రభావం ఏఏ రూపాలలో ఉపయోగిస్తారనేది మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. అనుకూలపరుచుకోవడాలు, అనుమానాలు, శక్తి, నిర్బంధం, బెదిరింపు, బలప్రయోగం లాంటివి రాజకీయ జీవితంలో ఉపయోగపడే నిత్యసాధకాలు. ప్రతిరాజ్యం కూడా తన ప్రభుత్వ విధానాలపట్ల విధేయతకు బుద్ధిపూర్వకంగానే శక్తిని ఉపయోగిస్తుంది. అంతర్జాతీయ రాజకీయాల్లో అనుకూలపరుచుకోవటాలు, అనునయాలు, నిర్బంధాలు, విప్లవాలలో కూడా శక్తిని ఉపయోగించడం జరుగుతూనే ఉంటుంది. రెండు వర్గాలు తమ నిర్ణయాలకు విధేయత చూపాల్సిందిగా నిర్బంధిస్తూనే ఉంటాయి. సిద్ధాంతపు మంచి చెడ్డల మాట అటుంచి ప్రాథమికంగా సిద్ధాంతంలో కొన్ని లోపాలున్నాయి. ప్రధానంగా ఈ సిద్ధాంతం శక్తికున్న పరిధిని విస్తృతపరచడం ద్వారా అర్థ వివరణ కూడా చేయడం జరిగింది.

### 11.4.3 సామాజిక సిద్ధాంతం

ఈ సిద్ధాంతంలో శక్తిని సమాజంలోని అంతస్తుల ఆరోహణ క్రమంలో సామాజిక వనరులను, విలువలను అధికార యంత్రాంగం పంపిణీ చేసే ఉపకరణాలు (tools) గా భావించడం జరిగింది.

BRAOU

అధికారికంగా విలువల విభజనమే శక్తి. విధేయత కోసం పోటీపడే వివిధ వ్యవస్థల మధ్య సమాజంలో జరిగే మార్పులలో శక్తికి ప్రత్యేకమైన అస్తిత్వముంది. యథార్థంలో శక్తి అంటే సామాజిక శక్తి. ఇతరులపై నియంత్రణ లేకుండా ప్రభావితం చేసే గుణం శక్తికి ఉంటుంది. విశాల సమాజంలో అంతర్గతంగా ఎన్నో మానవసమూహాలుంటాయి. ఇవన్నీ తమ ఉద్దేశాల సాధనకు శక్తి రూపాలైన నియంత్రణ, ప్రభావం, అనుకూలపరుచుకోవటం, ప్రోద్బలం లాంటి వాటిని సాధనాలుగా ఉపయోగిస్తుంటాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని సాముదాయిక శ్రేయస్సుకు సమాజం సమకూర్చుకొనే వనరులనే శక్తిగా నిర్వచించారు. ఈవిధమైన శక్తి అధ్యయనం రాజకీయాల అర్థాన్ని పూర్తిగా మార్చివేస్తుంది. రాజకీయాల అర్థం రాజ్యం, ప్రభుత్వం మొదలైన వాటి అధ్యయనం కాకుండా పోతుంది. విస్తృతార్థంలో కుటుంబాలు, కార్మిక సంఘాలు, క్లబ్బులు, రాజకీయ పక్షాలు, ఇతరాలైన అధికార వర్గాలు మొదలైన వ్యవస్థల విశాల సామాజిక అధ్యయనంగా మారిపోతుంది. యథార్థంలో ఇవన్నీ రాజకీయ వ్యవస్థలలో పాల్గొనే పాత్రను నిర్వహిస్తాయి. కనక శక్తిరూపాలైన నియంత్రణ, ప్రభావం, నిర్బంధం, ఒప్పించడం, అనుకూలపరుచుకోవడం లాంటివన్నీ రాజకీయాల అధ్యయనంలో భాగాలైపోతాయి. శక్తిని సమాజంలోని వివిధ వ్యవస్థల మీద వికీర్ణంచేసి సామజిక సిద్ధాంతం శక్తి పరిధిని విస్తృతపరిచింది. ఈ సందర్భంలోనే శక్తి శాసనబద్ధత అనే విషయం చర్చకు వస్తుంది. బహుత్వ గుణం కలిగిన ఉదార ప్రజాస్వామ్య సమాజంలోనే శక్తికి సామాజిక సిద్ధాంతం ఇచ్చిన అర్థం అన్వయిస్తుంది.

### 11.4.4 ఉదార ప్రజాస్వామ్య సిద్ధాంతం

ఈ సిద్ధాంతంలో అభివృద్ధి, బహిర్గతంచేసే సామర్థ్యంలో శక్తిని గుర్తించడం జరిగింది. ఇంతవరకు చర్చించిన సిద్ధాంతాన్నీ, శక్తిని అనుభవపూర్వకమైన భౌతిక విషయంగా మాత్రమే చర్చించాయి. కాని శక్తికున్న నిర్మాణాత్మక గుణాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. వ్యక్తిత్వాన్ని ఏర్పాటుచేసుకోవడానికి ఉన్న సామర్థ్యం కాని లేదా ఇతరుల నుంచి అలాంటి సామర్థ్యాన్ని గ్రహించి ఉపయోగించగలగటం కాని శక్తి అవుతుంది. శక్తిని రెండు రకాలుగా భావించవచ్చు. (1) అభివృద్ధిపూర్వక శక్తి (2) ఇతరుల నుంచి రాబట్టుకొనే శక్తి. మొదటిది నైతికమైంది. రెండోది నిర్మాణాత్మకమైంది. సామర్థ్యాన్ని ఉపయోగించుకోవటమే శక్తిగా భావించినప్పుడు దాన్ని అభివృద్ధి పూర్వకమైనదిగా అభివర్ణించవచ్చు. ఇక్కడ శక్తి గుణాత్మక విషయం.

BRAOU

### 11.4.5 మార్క్స్ సిద్ధాంతం

శక్తి వర్గ ప్రాబల్యానికి సాధనం. ఈ సిద్ధాంతంలో శక్తిని, రాజకీయాలను ఆర్థిక విషయాలతో సంబంధం కలిగిన సాధనంగా వర్ణించడం జరిగింది. ఒక వర్గం మరోవర్గాన్ని పీడించడానికి వ్యవస్థీకృతమైన శక్తిని ఉపయోగించడాన్ని రాజకీయ శక్తిగా నిర్వచించడం జరిగింది. సమాజంలో ఆధిక్యతను నిలబెట్టుకోడానికి ఉపయోగించే రాజకీయ శక్తిని మార్క్స్ వర్గ శక్తిగా భావించాడు. రాజకీయ శక్తిని స్వాధీనపరుచుకోవడమే కార్మిక శక్తి అంతిమ ధ్యేయం. శక్తికి మార్క్స్ ఆపాదించిన గుణాన్ని, వర్తమాన సామాజిక ఆర్థిక వ్యవస్థలో అంతర్భాగంగాకన్నా ప్రస్తుత రాజకీయ వ్యవస్థ అంతరించి సామూహిక జీవన పద్ధతిని ఆశించే రాజ్యవ్యవస్థలో ఎక్కువగా మనం గమనించవచ్చు.

### 11.4.6 శిష్ట సిద్ధాంతం

శక్తి వనరులు రాజకీయ, ఉద్యోగి స్వామ్య వ్యవస్థలో ఉంటాయని మార్క్స్ సిద్ధాంతానికి పూర్తిగా వ్యతిరేకమైన వాదనను మనం శిష్ట సిద్ధాంతంలో గమనించవచ్చు. శక్తి ఆస్తి యాజమాన్యం నుంచి గాక రాజకీయ, ఉద్యోగస్వామ్య వ్యవస్థల నుంచి ఏర్పడుతుంది. పోటీలుపడే ప్రయోజన వర్గాలు ఏర్పాటు చేసుకొన్న సమైక్య సాధనమే రాజకీయ శక్తి అనే వాదనను బలపరుస్తుంది. శాస్త్రీయ శిష్ట సిద్ధాంతాన్ని సమర్థించిన పెరేటో (Pareto), మోస్కా (Mosca),

మిఛెల్స్(Michels)ల వాదనలు మార్క్స్ సిద్ధాంతపు ప్రధాన భావాన్ని ఖండించడానికి ఉపయోగపడ్డాయి. రాజకీయ వ్యవస్థలు సామాజిక, ఆర్థిక సంబంధాలను మాత్రమే ప్రతిబింబిస్తాయనే మార్క్స్ వాదనను వీరు అంగీకరించలేదు. ఆర్థిక విషయాల ప్రాధాన్యతను తగ్గించలేకున్నప్పటికీ, అవి రాజకీయ వ్యవస్థల్లోని శక్తిని నిర్దేశించేవి కావని అంటారు. శిష్టుల చేతుల్లో శక్తివనరులు చాలా ఉన్నాయి. రాజకీయ సాధనాలు కూడా అధికం. వీటి ద్వారా శిష్టులు ఆర్థిక శక్తులను నియంత్రించడానికి గానీ ఉపయోగిస్తారు. రాబర్ట్ మిఛెల్స్(Robert Michels) చెప్పిన (Iron Law of Oligarchy)లో శక్తి కొద్ది మంది చేతుల్లోనే ఉంటుందన్న విషయాన్ని విశదీకరించాడు. ఇందుకు ఆయన అల్పజనపాలన అనివార్యం అన్న సామాజిక సిద్ధాంతాలను ఉదహరించారు. సూత్రరీత్యా వ్యవస్థలు ప్రజాస్వామికమైనప్పటికీ యథార్థంలో విధిగా అల్పజన పాలనకు అధికార స్వామ్యానికి దారి తీస్తాయని చెప్పాడు.

ఈ సిద్ధాంతవాదులు (Cart wright, Mills)లు ఆధునిక సమాజాల్లో శక్తి వ్యవస్థీకృతమైందని, తత్ఫలితంగా కొన్ని వ్యవస్థల్లో అత్యున్నతస్థానముందన్న అధికారులు సమాజ నిర్మాణ కీలక స్థానాల్లో ఉన్నారన్నారు. అందువల్ల శక్తికి వర్గ స్వరూపంలేదు. అదివ్యవస్థలోని అంతర్భాగం. వ్యవస్థలో విధాన నిర్ణయాలు చేసేవారు శిష్టవర్గంగా ఏర్పడతారు. ఇది శిష్ట సిద్ధాంతం ఉనికిని కనుక్కోటానికి బాగా ఉపకరిస్తుంది. కొన్ని ఇతరాలైన ప్రధాన విషయాలను విస్మరిస్తుంది.

శక్తి సిద్ధాంతాల అధ్యయనం ద్వారా శక్తి ప్రాథమిక గుణాలను కిందివిధంగా పేర్కొనవచ్చు:

(1) రాజకీయాల కీలక సిద్ధాంతాలలో శక్తి ప్రధానమైనదిగా భావించడం జరిగింది.

(2) శక్తికి నిర్మాణాత్మక, అనుభవపూర్వక పరిణామాలున్నాయి.

(3) రాజకీయ శాసన బద్ధతల సిద్ధాంతంతో శక్తి సిద్ధాంతానికి అంతర్గత సంబంధం ఉంది.

(4) శక్తి సిద్ధాంతానికి సమగ్ర లక్షణ ముంది.

(5) విధాన నిర్ణయ పద్ధతుల్లో శక్తి క్రియాశీలకంగా పాల్గొంటుందనే విషయం గూర్తించాల్సి ఉంటుంది.

BRAOU

సమాజంలో శక్తి అంటే:

(a) సమాజంలో కింది స్థాయిలో కాకుండా ఉన్నత స్థాయిలో ఉండేది.

(b) సామజిక వనరులపై నియంత్రణ కలిగి ఉంటూ వాటిని సాధించే మార్గాలపై కలిగి ఉంటుంది.

(c) సమాజంలో వ్యక్తులను, సామాజిక లక్ష్యాలను సాధించడం కోసం పాటు పడేట్లుగా శాసించేది.

తత్వవేత్తలు, రాజనీతిజ్ఞులు శక్తిని నిర్వచించడానికి ప్రయత్నించినప్పటికీ ఖచ్చితమైన నిర్వచనాన్ని అందించలేకపోయారు. వివిధరకాల శక్తి రూపాలను ఒక నిర్వచనం కిందికి తీసుకొనిరావాలనే తపనయే ఈ పరిస్థితికి కారణం. శక్తిని ఏవిధంగా ఉపయోగించి ఉత్తమమైన ప్రజాస్వామ్యాన్ని పొందవచ్చునో అని సమకాలీన రాజనీతి శాస్త్రజ్ఞుల ప్రయత్నం.

## 11.5 అధికారం

అధికారమన్న పద వివరణ వివాదాలకు, గందర గోళానికి దారితీస్తుందని హన్నా ఆరెన్ డెట్(Hannah Arendet) అన్నారు. సమాజంలో కొందరు వ్యక్తులకు నిర్బంధం, ప్రోద్బలం, బేరసారాలు వగైరా పద్ధతులను అనుసరించకుండా ఇతరులను ప్రభావితం చేయగలిగిన సామర్థ్యం ఉంటుంది. అలాంటి వారిని ప్రజలు ఎలాంటి వెనకా ముందు ఆలోచనలు లేకుండా, ప్రతిఘటించకుండా ఆమోదిస్తారు. అలాంటి వారి ప్రత్యేకమైన శక్తి–సమర్థతను అధికారం అని అంటారు. రాజకీయశక్తికి శాసన బద్ధత ఏర్పడినప్పుడు అధికారం అని అంటారు. రాజకీయ శక్తికి పదాలైన anctor, anctorilas anctor అంటే కట్టుబాట్లకు, ఆజ్ఞలకు మూలవ్యక్తి లేదా ప్రవర్ధకుడు కావచ్చు). ఒక క్రియను అధీకృతం చేసినప్పుడు అధీకృతం చేసే వ్యక్తగానీ వ్యక్తులుగానీ ఉంటారు. ఆజ్ఞలకు,

నిర్ణయాలకు, ప్రవచనాలకు తప్పక మూలవ్యక్తులుంటారు. సామాజిక నడవడికి, శాంతి భద్రతలకు ఈ మూలవ్యక్తులు కారణమవుతుంటారు. వీరికున్న ఈ బలమే అధికారం. ఈ బలానికి సమాజ మద్దతు స్వచ్ఛందంగాకాక వేరె కారణాలవల్ల లభించినప్పుడు సమాజానికి స్థిరత్వం ఉండదు. శాంతి భద్రతల ... ంగం కలిగే అవకాశముంటుంది.

శాసనబద్ధమైన శక్తిని ప్రతిఘటించడానికి వీలు లేదు. ఒకవేళ ఎదిరిస్తే శిక్ష తప్పదు. శాసనబద్ధం కాని ఇతర అధికార స్వరూపాలను ఎదిరించవచ్చు. సమాజపరమైన అభిశంసలు మాత్రం వ్యక్తి అనుభవించవచ్చు. కానీ శాసన బద్ధమైన శిక్షలు ఉండవు.

ఒకవైపు అధికారాన్ని బలప్రయోగం, శక్తి నుంచి వేరొకవైపు నాయకత్వ ప్రభావాల నుంచి వేరు చేసేది శాసనబద్ధత. సమ్మతి పూర్వక విధేయత ఒక అధికారానికే ఉంది. ఈ విధేయత బలానికీ ప్రభావానికీ శక్తికీ లేదు. న్యాయసమ్మతమైన వ్యక్తిని ఆమోదించడం అధికారానికి లోబడటమే. ఆమోదమనేది లొంగిపోవడానికి నూటికి నూరుపాళ్ళు ఒప్పందం కాదు. అధిక శాతం ప్రజల మద్దతు ఉన్న శాసన సముదాయానికి విధేయత ప్రకటించడం లొంగుబాటు కాదు. అది అధికారానికి ప్రజల మద్దతు సూచిస్తుంది. శాసనబద్ధమైన పాత్రను సమాజంలో నిర్వహించడమే అధికారాన్ని అనుభవించడం. ఈ అధికారానిర్వహణ సమాజాభివృద్ధికోసమనే భావన ప్రజలలో ఉన్నంతవరకూ అధికారానికి తిరుగులేదు. ప్రజలు తమ బాగోగులకోసమే అధికారానికి విధేయులుగా ఉంటారు. విధేయతకు కారణం ప్రధానంగా ప్రజల శ్రేయస్సే.

అధికారానికి కొన్ని పరిమితులున్నాయి. నైతిక విలువలు, అంతరాత్మ ప్రబోధం, సశ్శీలతలు అధికారానికి పరిమితులు కల్పిస్తాయి. నైతిక విలువలకు భంగం కలిగించే ఉత్తర్వులు అధికారాన్ని కించపరుస్తాయి.

అధికారం, శక్తి మధ్య ఉన్న ప్రత్యేకతలు:

(1) అధికారానికి విధేయత పొందే సామర్థ్యం ఉండగా శక్తికి ప్రభావపరిచే లేదా శాసించే సామర్థ్యముంది.

(2) అధికారం సమ్మతిపూర్వక విధేయతపై ఆధారపడి ఉంది.

(3) అధికారం హేతుబద్ధమైంది. శక్తిలో అది లోపించి ఉంటుంది.

(4) అధికారంలో స్వచ్ఛందమైన లొంగుబాటు ఉంటే శక్తిలో బలవంతపు లొంగుబాటు కనబడుతుంది.

(5) అధికారానికి శాసనబద్ధతతో కూడిన – అంటే శాసనబద్ధత సమర్థన – అధికారానికి ఉంది. శక్తికి అదిలేదు. శక్తికి శాసనబద్ధత జోడించినప్పుడు అది అధికారమవుతుంది.

అధికారాన్ని వివిధచోట్ల వివిధ రూపాలలో చూడవచ్చు. ప్రజలపై రాష్ట్రానికున్న అధికారం, తల్లిదండ్రులకు పిల్లలపై ఉన్న అధికారం, శిష్యులపై గురువుకున్న అధికారం, వైద్యునికి రోగిపై ఉన్న అధికారం లాంటివన్నీ అధికారానికి ఉదాహరణలే. వీటన్నింటిలో అధికారానికి బద్ధులైనవారు తమ ఇష్టపూర్వకంగా కట్టుబాట్లకు సమ్మతించినవారే. ఈ అన్నిరకాల అధికారాలలో కంటే రాష్ట్రానికి ప్రజలపై ఉన్న అధికారం సర్వోత్కృష్టమైంది.

అధికారం శక్తి స్వరూపం. ఇది ఒక వ్యక్తికి సమాజంలో తన స్థానానికున్న బాధ్యతలను సక్రమంగా నిర్వహించినప్పుడే లభిస్తుంది. రాజ్యవ్యవస్థలో అధికారాన్ని శాసన బద్ధమైన శక్తిగా గుర్తించడమైంది. అందుకే శాసనబద్ధమైన శక్తిని అధికారమనవచ్చు. బలప్రయోగం కాని ఇతర రకాలైన ప్రలోభాలుగానీ లేకుండా ఇష్టపూర్వకంగా ప్రజల విధేయతల నుంచి ఉద్భవించినది అధికారం. అందుకే శక్తికన్న అధికారానికి ఆదరణ ప్రభావం ఎక్కువ. సమాజంలో చాలా సాంఘిక, రాజకీయ, ఆర్థిక వ్యవస్థలు అధికారం చెలాయిస్తూ ఉన్నాయి. ఇవన్నీ కూడా సమ్మతిపైనే ఆధారపడి ఉన్నటువంటివి.

అధికారం న్యాయబద్ధంగా, హక్కుగా అనుభవించడం (Dejure) అధికారమవుతుంది. అలాకాక న్యాయబద్ధతలేక

BRAOU

ఇంకొకరి నుంచి సంక్రమించి, లేదా సంగ్రహించి అధికారాన్ని అనుభవించడం (De Facto) అధికా... వుతుంది.

అధికారం శక్తి ప్రత్యేక రూపానికి ఇచ్చిన మారుపేరు. మరోరకంగా చెప్పాలంటే ప్రత్యక్ష నిర్బంధం, లేదా ప్ర... ప్రోత్సాహం లేకుండా శక్తి ఉపయోగించే చర్యలను ప్రజలు ఆమోదించడాన్ని అధికారంగా భావించవచ్చు. శక్తికి పునాదులు పటిష్ఠంగా లేనిదే ఏ రాజకీయ వ్యవస్థ కూడా దీర్ఘకాలం మనజాలదు. ఈ భావనలోనే అధికారం ప్రాధాన్యత కనిపిస్తుంది. శక్తి సంబంధాలకు శాశ్వతత్వం కల్పించడానికే కాక తక్కువ వనరులతో శక్తిని ఉపయోగించగల సామర్థ్యం ఉండటమే అధికారమని భావించవచ్చు. నిర్బంధంగాకాక అధికారంతోపాలన సాగించడం ఆర్థికంగా సులభసాధ్యమైన విషయం. అయితే అధికారం స్థాపించడమనేది అంత సులభమైన విషయం కాదు. పాలితులచే పాలకులు చెలాయించే అధికారాన్ని గుర్తింపజేయడానికి వ్యవస్థీకృతమైన ప్రయత్నాలు చేయాల్సి ఉంటుంది. అంటే అధికారానికి శాసనబద్ధత ఏర్పరచాల్సి ఉంటుందన్నమాట.

## 11.6.0 అధికారాలు – రకాలు

నిలకడ తక్కువగా ఉన్న రాజకీయ వ్యవస్థల్లో అధికారానికి శాసనబద్ధత ఏర్పాటుచేసుకోవడంలో సిద్ధాంతపరమైన ఆలోచనలు ఆధారపడదగిన సాధనాలుగా ఉంటాయి. కానీ కేవలం సిద్ధాంతపరంగా మాత్రమే అధికారానికి శాసనబద్ధత ఏర్పడదు. మాక్స్‌వెబర్ (Max Weber) అధికారానికి శాసన బద్ధత లభించడమనేది హేతుబద్ధమైన, సాంప్రదాయకమైన, సమ్మోహనాత్మకమైన మూడు మార్గాల ద్వారా లభిస్తుందన్నాడు. ఈ మూడు సాధన మార్గాల ద్వారా లభిస్తుందన్నాడు. ఈ మూడు సాధన మార్గాల ద్వారా లభించే మూడు రకాల అధికారాలను వెబర్ గుర్తించాడు.

### 11.6.1 హేతుబద్ధమైన–న్యాయమైన అధికారం

BRAOU

హేతుబద్ధ, న్యాయమైన అధికారం ఆయా వ్యవస్థల్లో ప్రయత్నపూర్వకంగా నిర్వహించిన హక్కులు, బాధ్యతలు ఉన్న పదవులలో ఉంటుంది. ఈ సందర్భంలో పదవిని నిర్వహిస్తున్న వ్యక్తికిగాక ప్రజలు పదవికే విధేయత చూపుతుంటారు. ఉదాహరణకు – ప్రధాన మంత్రి, అధ్యక్షుడు. భారత ప్రధాన మంత్రికి భారత రాజ్యాంగం శాసన బద్ధమైన అధికారం ఏర్పాటుచేసింది. శాసనబద్ధంగా వ్యవస్థీకరించిన సాధారణ ప్రాబల్యాన్ని అధికారంగా గుర్తించే మనస్తత్వంపై హేతుబద్ధమైన అధికారం ఆధారపడి ఉంటుంది.

### 11.6.2 సాంప్రదాయిక అధికారం

సాంప్రదాయిక అధికారం సమాజంలోని సంప్రదాయాలపై ప్రజలకున్న గౌరవాన్నిబట్టి ఉంటుంది. తెగనాయకుడు, గ్రామ పెద్ద, కులపెద్దల అధికారం సాంప్రదాయికంగా ప్రజలు గౌరవిస్తున్న ఆచారాలమీద ఆధారపడి ఉంటుంది. ఆచారాలను విధిగా ఆచరించాలనే, గౌరవించాలనే నమ్మకాలు ప్రజలకు ఉంటాయి. సాంప్రదాయిక అధికారం వ్యవస్థల శాసనబద్ధతపై ఆధారపడుతూ ఆనవాయితీగా వచ్చే వ్యవస్థల అధికారాన్ని శిరసావహించే మనస్తత్వాలపై ఆధారపడి ఉంటుంది.

### 11.6.3 సమ్మోహనాధికారం

సమ్మోహనాధికారం (Charismatic Power) హీరోఇజమ్ (Heroism) పైనగాని, శాంక్టిటీ (Sactity) పైగాని, నాయకుని గొప్ప మేధా సంపత్తిపై గాని ఆధారపడి ఉంటుంది.

వ్యక్తిలోని ప్రత్యేక లక్షణాలను బట్టి సమ్మోహనాధికారం లభిస్తుంది. ఉదాహరణకు – హిట్లర్, నెహ్రూ, ఇందిరాగాంధీ మొదలైనవారు. సమ్మోహనాధికారం ఒక్కసారి ఏర్పాటైనట్లయితే అది వ్యవస్థీకృతమైన, హేతుబద్ధ న్యాయసమ్మత సాంప్రదాయిక అధికారాలలో నిర్మాణాత్మకమైన మార్పుకు దారితీస్తుంది. ఇలాచేయటం సమ్మోహక శక్తి దైనందిన కార్యక్రమంగా అయిపోతుంది అని మాక్స్‌వెబర్ పేర్కొన్నాడు.

వెబర్ ఈ మూడు అధికారాలను ఆదర్శప్రాయమైనవిగా భావించి, యథార్థంలో అధికారం ఈ మూడింటి మిశ్రమమేనని అంగీకరించాడు.

ఈనాటి ప్రజాస్వామ్య రాజకీయ రంగం సమన్యాయంపై ఆధారపడుతున్న అధికారం యథార్థంలో హేతుబద్ధమైన–న్యాయమైనదే. అధ్యక్షుడు, ప్రధాన మంత్రి లాంటి రాజకీయ శిష్టవర్గం తమ అధికారాన్ని రాజ్యాంగ బద్ధతకు విరుద్ధంగా సమర్థించలేరు. నిశ్చయంగా అధికారం శాసనబద్ధమే అయినప్పటికీ, విధేయత కొనసాగించుటకు సమ్మోహన సామర్థ్యం మీద, సంప్రదాయాల మీద ఆధారపడకతప్పదు. అభివృద్ధి సాధించిన పారిశ్రామిక దేశాలలో అధికారం హేతుబద్ధమైంది. న్యాయబద్ధమైందే. అది శాసన బద్ధతకోసం సమ్మోహన శక్తి మీదకానీ సంప్రదాయాలమీదకాని ఆధారపడాల్సిన అవసరం లేదు. పారిశ్రామిక దేశాలలో ఉత్పత్తుల క్రమానికి శాంతి భద్రతల పరిరక్షణ అవసరం. శాంతి భద్రతల ఏర్పాటుకు రాజకీయాధికారం ఉపయోగాన్ని గమనించిన ప్రజలు విధేయులై ఉంటారు. కానీ అభివృద్ధిచెందని దేశాలలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంటున్నది. ఇది సమర్థత లోపానికి, నిష్క్రియా తత్వానికి దారితీస్తుంది. శాసనబద్ధ అంగీకారం బలహీనమైపోతుంది. అందువల్లనే ఆసియా దేశాలలో అధికారం సమ్మోహనమీద అధికంగా ఆధారపడి సంప్రదాయాలను ఎక్కువగా గౌరవించడం జరుగుతూ ఉంటుంది. నేటి భారతీయ రాజకీయ వ్యవస్థను ఇందుకు చక్కటి ఉదాహరణగా పేర్కొనవచ్చు.

అధికారానికి శాసనబద్ధత లోపించినప్పుడు అది శక్తిగా మారుతుంది. ప్రజల మద్దతు ఉన్నప్పుడే శక్తి అధికారంగా మారుతుంది. ఈ మద్దతు ఎన్నికల ద్వారా పొందినప్పుడు సంపూర్ణ శాసన బద్ధత లభిస్తుంది. బలప్రయోగ పద్ధతుల ద్వారా కూడా మద్దతు కూడగట్టుకొనడం జరుగుతుంది. కానీ దీనికి ఎన్నికల ద్వారా పొందినంత మన్ననగాని, అంతర్జాతీయ గుర్తింపుగాని లభించదు. శాసనబద్ధమైన శక్తికే అంతర్జాతీయ రంగంలో గుర్తింపు లభిస్తుంది.

BRAOU

## 11.7.0 శాసనబద్ధత (Legitimacy)

సుస్థిర ప్రభుత్వ మనుగడ కేవలం ఆర్థికాభివృద్ధిపైనే ఆధారపడి ఉండదు. అభివృద్ధితోపాటు ప్రభుత్వ సమర్థత, శాసనబద్ధతపై ఆధారపడి ఉంటుంది. ఆర్థికాభివృద్ధి లోపించినప్పుడు ప్రభుత్వం ఏవిధంగా సమస్యలనెదుర్కొంటుందో అదేవిధంగా శాసనబద్ధత సమస్యలు కూడా ప్రభుత్వాన్ని అతలాకుతలం చేయవచ్చు. శాసనబద్ధత సమస్య నాయకత్వానికి సవాలు లాంటిది. శాసనబద్ధత సమస్య ప్రభుత్వాన్ని మార్చివేయవచ్చు లేదా ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యాలలో మార్పు తీసుకొనిరావచ్చు.

ప్రస్తుత రాజకీయ వ్యవస్థ, దాని సంస్థలు ప్రస్తుత పరిస్థితుల్లో అత్యుత్తమమైందని ప్రజలలో ఉన్న భావనే శాసనబద్ధత. ప్రస్తుత ప్రభుత్వం అత్యంత విలువైనదని, గౌరవ ప్రదమైనదని ప్రజలు భావించాలి. ఎటువంటి అనుమానాలు లేకుండా ప్రభుత్వ యంత్రాంగాలకు విధేయులై ఉండటం శాసన బద్ధత భావనలో కనబడుతుంది.

''స్వాభావికంగా ఎదురుచెప్పకుండా తమపై ఆధిపత్యం నెరపే వ్యవస్థను సంపూర్ణంగా సమర్థించడం శాసనబద్ధత అని బ్లాండెల్ (Blondel) నిర్వచించాడు.

విధ్యుక్త ధర్మాన్ని, విధులను సంప్రదాయంగా నెరవేర్చే సామర్థ్యం రాజకీయ వ్యవస్థకున్నదని ప్రజలు సంతృప్తి చెందినప్పుడే ప్రజలు ప్రభుత్వానికి విధేయులై ఉంటారు. అంటె ప్రజల కోరికలు తీర్చేశక్తి సామర్థ్యాలు ప్రభుత్వ

వ్యవస్థలకున్నాయని ప్రజలలో నమ్మకం కలిగించి దానిని నిభాయించుకోవడం శాసన బద్ధతభావనలో నిక్షిప్తమై ఉంటుంది. పాలించడానికి అర్హులుగా ప్రజలు ఆమోదించడమనేది శాసనబద్ధత సంపాదించుకోవడమే అవుతుంది. అధికారంవైపు ప్రజల దృక్పథం శాసన బద్ధతను నిర్ణయిస్తుంది. ప్రజల రాజకీయ, సామాజిక, ఆర్థిక, నైతిక విలువలను రాజకీయ వ్యవస్థలు ఏమేరకు సమర్థించి, గౌరవిస్తాయో అనే దానినిబట్టి వ్యవస్థపై ప్రజల శాసనబద్ధత భావన ఆధారపడి ఉంటుంది. వ్యవస్థపై ప్రజలకున్న నమ్మకం శాసన బద్ధతకు పునాది లాంటిది. నమ్మకం వ్యవస్థ పనిచేసే సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది.

శాసనబద్ధత, శక్తి ఒకటి కాదు. ప్రజా లక్ష్యాలను సాధించడానికి సామాజిక వనరులను ఉపయోగించడం శక్తి. శక్తికి ఆ సామజిక వనరులను ఉపయోగించుకొనే హక్కును ప్రసాదించే నైతిక బలమే శాసనబద్ధత. శాసన బద్ధత పొందిన శక్తే అధికారం.

న్యాయబద్ధమైన – అంటే శాసనబద్ధత గల ప్రభుత్వమే ప్రజల విధేయతను పొందగలిగి ప్రజలను రాజ్యంకోసం ఏ త్యాగానికైనా వెనకాడకుండా సంసిద్ధులను చేస్తుంది. అందుకే రాజకీయ వ్యవస్థ విలువలు, ప్రజల విలువలు ఒకటే అని ప్రజా సమూహంభావించినప్పుడు శాసన బద్ధత భావన కలుగుతుంది. అధికారానికి వ్యవస్థలకు మద్దతు శాసన బద్ధత భావన నుంచి ప్రధానంగా లభ్యమవుతుంది. అధికారాన్ని వినియోగించుకోవడంలో సాధారణంగా ప్రతి ప్రభుత్వం బలం, ప్రతిఫలం, లేదా బహుమానం(reward)పై ఆధారపడి ఉంటుంది. ఈ రెండూ – అంటే బలం, బహుమానం శాసన బద్ధతపై ఆధారపడి ఉంటాయి. ప్రజలు తమ బాగోగులకోసం ప్రభుత్వం బలాన్ని ఉపయోగించడానికి తమ సమ్మతి తెలపటంలో శాసన బద్ధత కనబడుతుంది. అంటే ప్రభుత్వ బలం ప్రజల ఉమ్మడిబలమే. ప్రభుత్వ బలం ప్రజల సమ్మతిపై ఆధారపడి ఉంటుంది. అంటే ప్రజలు తమ ఇష్టపూర్వకంగానే ప్రభుత్వాధికారానికి లోబడి ఉంటారు. ప్రభుత్వాధికారంలో తమ అధికారాన్నిగాని, తమ సమ్మతినిగాని వారు చూడగలుగుతారు. శాసన బద్ధత ముఖ్య గుణాలను సమర్థతలో, సామర్థ్యం, కార్యసాధకతలో ప్రభావితం చేసే శక్తి, సమస్యలను విడదీసే యోగ్యతలుగా గుర్తించవచ్చు. ఈ శక్తులున్న వ్యవస్థకు ప్రజల మద్దతు, సహకారం లభించినప్పుడు దానికి అధికారయోగ్యత కలుగుతుంది. అధికార భావనలో శాసన బద్ధత భావన అంతర్లీనమై ఉంటుంది. చాలా రాజకీయ వ్యవస్థలలో శాసన బద్ధత ప్రభుత్వానికి మద్దతు తెలిపే భావన ప్రజలలో పెరగడానికి దోహదమవుతున్నది. ప్రజలలో ఐకమత్యం పెంపొందించే సంప్రదాయ వ్యవస్థలు శాసన బద్ధత భావనను పెంపొందించడానికి తోడ్పడుతున్నాయి. ఎప్పుడైతే ప్రజలలో నూతన వర్గాలు రాజకీయంగా చైతన్యవంతమవుతాయో వారికి న్యాయబద్ధమైన రాజకీయ వ్యవస్థలను అందుబాటులోకి తేవడం ద్వారా వారి విధేయతను రాజకీయ వ్యవస్థలు పొందుతున్నాయి. తద్వారా ఇదివరకు అధికారంలో ఉన్న వర్గాలు తమ ఉనికిని సంరక్షించుకోవగలుగుతున్నాయి.

BRAOU

శాసన బద్ధతకు మూడు ముఖ్యమైన మూలాలున్నాయి. అవి: (1) సిద్ధాంతపరమైనవి(Ideological), (2) నిర్మితులపరమైనవి (structural), (3) వ్యక్తులనాశ్రయించుకొన్నవి (Personal).

## 11.7.1 సిద్ధాంతపరమైన మూలం

రాజకీయ లక్ష్యాలు సాధించడంకోసం ఏర్పరుచుకొన్న కొన్ని భావనల సమూహాల సిద్ధాంతం, క్రియోన్ముఖమైన రాజకీయ భావనల సిద్ధాంతం సూచిస్తుంది. రాజకీయ భావనలను క్రియారూపంలో అమలుపరచడంలో సిద్ధాంతం ప్రధానపాత్ర నిర్వహిస్తుంది. దీనిలో క్రియ, సంసిద్ధతలు నిబిడీకృతమై ఉన్నాయి. రాజకీయాలకు లక్ష్యం, గమ్యం, వ్యవస్థ, పరిహద్దులను నిర్ణయించేదే సిద్ధాంతం. రాజకీయాధికారం ఒక సిద్ధాంతాన్ని నమ్మి ఆచరించడానికి ప్రయత్నంచేసినప్పుడు ప్రజలు ఆ సిద్ధాంతానికి తమ మద్దతు, సహకారం, విధేయతను అందించాలనుకొన్నప్పుడు ఆ సిద్ధాంతానికి, ఆ రాజకీయ వ్యవస్థకు, శాసన బద్ధత లభించినట్లే. సిద్ధాంత ఆచరణలో ప్రజలు తమ సంక్షేమం

చూసుకొన్నప్పుడు ప్రజల మద్దతు వ్యవస్థకు లభించడం ద్వారా వ్యవస్థ శాసన బద్ధతను సంతరించుకొంటుంది. ఒక్కొక్కప్పుడు బలం ద్వారా కూడా వ్యవస్థ ప్రజల మద్దతు సంపాదించుకోవచ్చు. కానీ ఇది శాశ్వతం కాదు. స్వచ్ఛందంగా లభించిన మద్దతు శాశ్వతమైంది. ఐచ్ఛికంగా అందించే మద్దతుపై ఆధారపడిన శాసన బద్ధత నిరంతరంగా కొనసాగుతుంది. ప్రజలను ఆకట్టుకొన్న సిద్ధాంతాన్ని Legitimating ideology గా భావించవచ్చు.

Legitimating ideology ప్రజలమద్దతును రెండు ప్రాతిపదికలపై కూడగట్టుకొంటుంది. (1) సిద్ధాంతం, దా పనితీరు, (2) మానసికంగా సిద్ధాంతభావన ప్రజలను ఏ మేరకు సిద్ధాంత భావనలను ప్రజలకు అర్థమయ్యేలా గా వివరిస్తారో, ఏ మేరకు సిద్ధాంత ఆచరణలో అంగబలాన్ని సమకూర్చుకొనడంలో కృతకృత్యులవుతారో అన్న వాటిపై కూడా శాసనబద్ధత సిద్ధాంతపరంగా లభ్యంకావడానికి దోహదపడుతుంది.

## 11.7.2 నిర్మితులపరమైన మూలం

వ్యవస్థలకున్న నిర్మితులు, అవి వ్యవస్థీకృతమైన విధానం, అవి పనిచేసే తీరు, వాటిని నడిపించే సూత్రాలు ప్రజలను ప్రభుత్వాధికారానికి విధేయులుగా ఉండేటట్లుచేస్తాయి. ఇక్కడ శాసన బద్ధతకు మూలం నిర్మితులే. వ్యవస్థలకున్న నిర్మితుల ద్వారా అధికారాన్ని నడిపినప్పుడు ఆ అధికారానికి శాసనబద్ధత తనంతట తానే సమకూరుతుంది. నిర్మితులపై ప్రజలకున్న విశ్వాసమే శాసన బద్ధతకు మూలం. అధికారం న్యాయబద్ధంగా పొంది నిర్మితుల ద్వారా శాసనబద్ధంగా నిర్వహించినప్పుడు అధికారాన్ని వినియోగించడం శాసనబద్ధతకు మూలం. దీనినే structural legitimacy అని అంటారు. నిర్మితులను పొందటంలో వాటికున్న అధికారాలను నిర్వహించటంలో శాసన బద్ధతను పాటించటాన్ని ప్రజలు సమ్మతించిన అధికారానికి శాసనబద్ధత ఉన్నట్లే.

## 11.7.3 వ్యక్తులనాశ్రయించుకొన్న శాసనబద్ధత

BRAOU

ఒక్కొక్కసారి అధికారాన్ని న్యాయబద్ధంగా సంపాదించుకొన్నారా, లేదా న్యాయసమ్మతంగా దాన్ని వినియోగించడం జరుగుతోందా అన్నదానికి ప్రాధాన్యం ఇవ్వకుండా అధికారాన్ని నిర్వర్తించే వ్యక్తిని ఆధారంగా చేసుకొని మద్దతునివ్వడం జరుగుతూ ఉంటుంది. శాసనబద్ధత ఇక్కడ వ్యక్తికి మద్దతు ఇవ్వాలనే భావన శాసన బద్ధత ఆపాదించడానికి కారణమవుతుంది. ఈ నైతిక సమర్థన అనేక విషయాలపై ఆధారపడి ఉంటుంది. అవి: (1) ఆకర్షణ, (2) వ్యక్తిత్వ ప్రభావం, (3) అధికారంలో ఉన్న వ్యక్తిని తమవాడుగా భావించడం, (4) అధికారంలో ఉన్న వారిని తప్పక సమర్థించడం లాంటివి ఏవైనా కావచ్చు. ఇక్కడ వ్యక్తికున్న వ్యక్తిగతమైన క్షతలే ప్రజల మద్దతు సంపాదించుకోవడానికి కారణమవుతాయి. ఈ విధంగా తమ అధికారానికి శాసన బద్ధతను కల్పించుకొనే వారు ఆచరణలో ఉన్న సిద్ధాంతాలను, సూత్రాలను తోసిరాజనవచ్చు. ఇక్కడ వ్యక్తి అధికారానికి ప్రజలు ఇష్టపూర్వకంగా దాసోహం అంటున్నారు. వ్యక్తిగతమైన యోగ్యతలు, విలువల నుంచి వ్యక్తిగత శాసనబద్ధత (Personal legitimacy) ఉద్భవిస్తుంది.

## 11.8 శాసనబద్ధత – వివిధ సిద్ధాంతాలు

ఎ) ఆదర్శ సిద్ధాంతం: శాంతియుత, క్రమబద్ధమైన వ్యవస్థకు శాసనబద్ధత లభించునని ఈ సిద్ధాంతం తెలుపుతుంది. సోక్రటీస్, ప్లేటో, అరిస్టాటిల్ మొదలుకొని రూసో, కాంట్, హెగెల్ వరకు ఈ వాదనతో ఏకీభవించే రాజనీతిజ్ఞుల అనేకులున్నారు. న్యాయబద్ధమైన, ధర్మబద్ధమైన పాలన ఇచ్చే వ్యవస్థలకు శాసనబద్ధత ఉంటుందని వీరిభావన. వ్యక్తి పరిపూర్ణుడు. రాజ్యవ్యవస్థను తీర్చిదిద్దుతాడుకాబట్టి రాజ్యానికి శాసనబద్ధత లభిస్తుందని ఆదర్శవాదులవాదన అందుకే వారు రాజ్యవ్యవస్థకు మూలం సమ్మతేకాని బలం కాదన్నారు.

బి) Prescriptive Theory : సాంప్రదాయిక బలమే శాసనబద్ధతకు మూలం అని ఈ సిద్ధాంత భావన. సంప్రదాయాల, ఆచార వ్యవహారాల మద్ధతు అధికారం శాసన బద్ధమవుతుంది. సంప్రదాయవాదాన్నిబట్టి వ్యవస్థ శాసన బద్ధతనీ నిర్ణయించవచ్చు.

సి) ఉదారవాద సిద్ధాంతం: గ్రీకుతత్వ వేత్తల నుంచి నేటి రాజనీతిజ్ఞుల వరకు ప్రజామోదం కలిగిన అధికార వ్యవస్థను కనుక్కోవడంలో నిమగ్నమయ్యారు. పాలక మండలికి శాసనబద్ధతయన్నది ముఖ్యమని వెబర్ అభిప్రాయం. అధికార వ్యవస్థకు సార్వజనీనత చాలా ముఖ్యమని ఈ సిద్ధాంతం భావిస్తుంది. ప్రజా సమ్మతిలేని అధికార వ్యవస్థ మనలేదు. ప్రజలు ఐచ్ఛికంగా ఇచ్చిన సమ్మతే రాజ్యవ్యవస్థకు శాసనబద్ధతను ఇస్తుంది.

డి) మార్క్సిస్టు సిద్ధాంతం: వర్గపోరాట సిద్ధాంతంలో శాసనబద్ధత భావనను మార్క్స్ చూడగలిగాడు. ఆర్థిక అధిపత్యం ద్వారా బూర్జువాలు అధికారం సంపాదించుకొన్నారని ఆధిపత్యం శ్రామిక వర్గానికి లభించిన శాసనబద్ధతకు శ్రామికుల మద్ధతు లభించడ ద్వారా ప్రజల మద్ధతు పభుత్వానికి లభ్యమైనట్లుగా భావించవచ్చు. కమూనిస్టు వ్యవస్థలో అందరూ శ్రామికులే. కాబట్టి రాష్ట్ర వ్యవస్థ శ్రామికులదే అవుతుంది. వర్గపోరాటంలో బూర్జువాలు అంతంకావడం ద్వారా శ్రామికులు అధికారాన్ని హస్తగతం చేసుకొంటారు. శ్రామికుల విలువలకు, శ్రామిక ప్రభుత్వ విలువలకు భేదం ఉండదు కాబట్టి ప్రజల మద్ధతు ప్రభుత్వానికి స్వచ్ఛందంగా లభ్యమవుతున్నందువల్ల ప్రభుత్వానికి శాసనబద్ధత లభిస్తుంది.

శాసనబద్ధతలో ఈ మధ్య సమస్యలను తరుచు చూస్తున్నాం. శాసనబద్ధతలో సమస్యలు రాజ్యాంగ నిర్ణయాలు విఫలం కావడంవల్లగాని, లేదా ప్రభుత్వ వ్యవస్థల పనితీరు లోపంవల్లగాని సంభవిస్తాయి. అధికార స్వభావాన్ని అర్థం చేసుకోవడంలో విభేదాలు తలెత్తడం ద్వారా ఈ వైఫల్యాలు సంభవించవచ్చు. మార్పుకు సంబంధించిన సమస్యలు శాసన బద్ధత సమస్యలకు దారితీయవచ్చు. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగంలో తలెత్తే సమస్యలు శాసనబద్ధతలో సమస్యలను సృష్టించవచ్చు.

BRAOU

రాజకీయ విధేయతా భావనకు శాసన బద్ధత భావన ముఖ్యమైన పూరకం. ప్రభుత్వానికి ప్రజలు విధేయులై ఉంటారు. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వానికి శాసనబద్ధత ఉన్నదని ప్రజలు భావించడమే. అందుకే రాజ్య శాసనాలను, ఆజ్ఞలను శిరసావహించడానికి తమ ప్రాణాలను త్యాగం చేయటానికి కూడా ప్రజలు సిద్ధపడతారు. చరిత్రగతిలో ఎన్నో విధాలైన వ్యవస్థలు చాలా కాలం మనగలగటానికి ప్రధాన కారణం వీటికి శాసనబద్ధత ఉందని ప్రభుత్వాలు భావించడమే. వీటికి ప్రజలు మద్ధతు ఇవ్వడంతో వీటికి శాసనబద్ధత లభించినట్లయింది. ఏ రాజ్యవ్యవస్థ మనుగడకైనా ప్రజల మద్ధతుకావాలి. ఈ మద్ధతు వ్యవస్థకు శాసనబద్ధతను కల్పిస్తుంది. వ్యవస్థ శాసనబద్ధతను ప్రజల గుర్తింపు ద్వారా మాత్రమే లభిస్తుంది.

## 11.9 ముగింపు

శక్తి అధికారం శాసనబద్ధత అనేవి రాజకీయ వ్యవస్థకు ప్రధాన స్థంభాలు. శక్తి అధికారాన్ని, అధికారం శాసనబద్ధతనూ కల్పిస్తూ పరస్పరం అధారపడి వుంటాయి. శక్తి ఒక సామాజిక ప్రక్రియ. శక్తి అధికారం-సమాజపు కట్టుబాట్లు విలువలమీద ఆధారపడి వుంటాయి. అయితే శక్తి కొన్నిసార్లు ఆ కట్టుబాట్లను ప్రభావితం చేస్తుంది. శక్తి ప్రజల మద్ధతు పొందితే అధికారం అవుతుంది. అధికారం అమలయ్యే తీరును శాసనబద్ధత అంటారు. అంటే సామాజిక వనరులను ఉపయోగించుకోవడానికి శక్తికి కావాల్సిన నైతికబలం ఇది. స్థూలంగా శక్తి వుంటేనే అధికారం, అధికారం ద్వారానే శాసనబద్ధత లభిస్తాయి.

–ఆచార్య ఎం. రాంచందర్

## 11.10 సంప్రదించదగిన రచనలు

1. Dhal, R.A. : Modern Political Analysis.
2. Friedrich, C.J. : Authority
3. Laski, H.J. : Authority of The Modern State.

## 11.11 నమూనా పరీక్షా ప్రశ్నలు

I వ్యాసరూప ప్రశ్నలు

1. శక్తి అనగానేమిటో నిర్వచించి, సిద్ధాంతములను గురించి చర్చించుము.
2. శక్తి, అధికారం, శాసనబద్ధతల మధ్యగల సంబంధమును వివరించుము.
3. అధికారం అంటే ఏమిటి? వెబర్ పేర్కొన్న అధికారాల గురించి రాయండి.

II సంక్షిప్త ప్రశ్నలు

1. శక్తి అధికారానికి మూలం వివరించుము.
2. సమ్మోహనాధికారం
3. శాసనబద్ధత వివిధ సిద్ధాంతాలు.

BRAOU

# భాగం 12: సామాజిక మార్పు: రాజకీయ ప్రక్రియలు

విషయక్రమం


| | |
|---|---|
| 12.1 | లక్ష్యాలు |
| 12.2 | పరిచయం |
| 12.3 | సామాజిక మార్పు - భావన |
| 12.4 | మార్పుకు ఆధారాలు |
| 12.5.0 | సామాజిక మార్పు కారకాలు |
| 12.5.1 | జైవిక కారకాలు |
| 12.5.2 | సాంస్కృతిక కారకాలు |
| 12.5.3 | సాంకేతిక కారకాలు |
| 12.6.0 | సామాజిక మార్పు-రకాలు |
| 12.6.1 | ప్రణాళికా రహిత మార్పు |
| 12.6.2 | ప్రణాళికాయుత మార్పు |
| 12.7 | రాజకీయ ప్రక్రియలు |
| 12.8 | రాజకీయ ప్రక్రియలు సిద్ధాంతాలు |
| 12.9 | రాజకీయ ప్రక్రియలు - ప్రేరకాలు |
| 12.10.0 | భారత సమాజం - రాజకీయ ప్రక్రియలు |
| 12.10.1 | స్వాతంత్ర్య పూర్వదశ |
| 12.10.2 | స్వాతంత్ర్యానంతర దశ |
| 12.11 | రాజకీయ ప్రక్రియ : ఒక పరిశీలన |
| 12.12 | సారాంశం |
| 12.13 | చదవదగిన గ్రంథాలు |
| 12.14 | నమూనా పరీక్షా ప్రశ్నలు |


BRAOU

## 12.1 లక్ష్యాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు

- ★ సామాజిక మార్పును వివరించగలుగుతారు.
- ★ సామాజిక మార్పునకు దోహదపడే వివిధ కారణాలు విశ్లేషించగలుగుతారు.
- ★ భారతదేశంలో రాజకీయ ప్రక్రియలను ప్రభావాలను అర్థం చేసుకోగలుగుతారు.

## 12.2 పరిచయం

ఏ సమాజంలోనైనా మార్పు ఒక అనివార్యమైన ప్రక్రియ. మానవ సమాజం నిరంతరంగా మారుతూ ఇవాళ ఈ ఆధునిక దశను చేరుకుంది. మార్పు అంతర్గత శక్తుల చలన శీలతవల్లనే సాధ్యపడిందని, శక్తుల చలన శీలత వల్లనే

సాధ్యపడిందని కొందరు భావిస్తే, అది బాహ్య పరిసరాల ప్రభావమని మరికొందరు సూత్రీకరించడం జరిగింది. ఏది ఏమైనప్పటికీ మార్పు అనేది చారిత్రక సత్యం.

ఉపరితలం నుంచి మార్పును ప్రేరేపిస్తూ, మార్పుకు దోహదపడుతున్న అంశాల్లో రాజకీయాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. రాజకీయాల ప్రమేయం మార్పు గమన దిశమీద ఖచ్చితమైన ప్రభావాన్ని చూపుతోంది. అయితే ఈ మార్పు ఏ మేరకు వుంది? రాజకీయాలు, ప్రణాళికలూ, విధానాలు సమాజాన్ని ఏ దిశకు తీసుకెళుతున్నాయి? అనే అంశాలను గురించి సవివరంగా తెలుసుకోవలసిన అవసరం వుంది.

## 12.3 సామాజిక మార్పు – భావన

మార్పు విశ్వజనీనమైన ప్రక్రియ. అన్ని కాలాల్లో, అన్ని రూపాల్లో, అన్ని ప్రాంతాల్లోనూ మార్పు కొనసాగుతున్నది. ఏ వ్యవస్థయినా ఒక దశ నుంచి మరో దశకు, ఒక రూపం నుంచి మరో రూపానికి, ఒక పరిస్థితి నుంచి మరో స్థితికి చేరితే దానిని మార్పు అంటున్నాం. అంటే మార్పు ప్రస్తుత స్థితికి భిన్నంగా ఏర్పడే క్రమం. అణువు నుంచి విశ్వాంతరాళం దాకా సృష్టిలోని ప్రతి వస్తువూ మార్పుకు లోనవుతూ వస్తున్నదే. వసంతం నుంచి శిశిరం దాకా శిశిరం దాటి గ్రీష్మం దాకా కాలంలో వచ్చే క్రమానుగుణ గతినీ మార్పు అంటున్నాం. అలాగే జననం నుంచి మరణం దాకా కొనసాగే జీవన ప్రక్రియా మార్పే.

సామాజిక మార్పు జైవిక మార్పులకు భిన్నమైనదిగా వుంటుంది. సమాజం మారిందీ అంటే సమాజంలో ఎడ్లబండ్ల స్థానంలో, కార్లు మోటార్లు, వీధి భాగవతాల స్థానంలో సినిమాలు, టెలివిజన్లూ వచ్చాయని కాదు. అవి మానవత్వాన్ని మంటగలిపినా, సమాజాన్ని ధ్వంసం చేసినా మార్పు జరిగినట్టే లెక్క. మార్పు అంటే అభివృద్ధి మాత్రమే కాదు. అధోగతి కూడా. అంటే మార్పుకు రెండు దిశలూ ఉంటాయన్న మాట. సామాజిక మార్పు సామాజిక స్వరూపంలో సమూలమైన తేడాగా పేర్కొన్నారు. అంటే సామాజిక వ్యవస్థ స్వరూపంతోపాటు విలువలు, సంబంధాలు, హోదాలు, అంతస్తులు, సంస్కృతి తదితర అంశాల్లో మార్పు సంభవిస్తే దాన్ని సామాజిక మార్పు అంటారు. ఇది సామాజిక వ్యవస్థలో, సంబంధాల్లో జీవన విధానాల్లో విలువల్లో వచ్చే మార్పు.

BRAOU

## 12.4 మార్పుకు ఆధారాలు

సామాజిక మార్పు దానంతట అదే జరుగదు. మార్పు అంతః సంఘర్షణల ఫలితం అన్నారు కారల్ మార్క్స్. వ్యవస్థలోని పరస్పర భిన్నమైన శక్తుల మధ్య సంఘర్షణ మార్పుకు దోహదపడుతుంది. మరికొందరు మార్పు బాహ్యశక్తుల ఫలితం అన్నారు. పరిసరాలు, ప్రయత్నాల ప్రభావంవల్లే మార్పుకు వీలవుతున్నదని వారి వాదన.

నిజానికి ఈ రెండూ వాస్తవమే. ఈ రెండూ కలిసే ఉంటాయి కూడా. మార్పు మొత్తానికి అంతర్ వ్యవస్థ బాహ్య వ్యవస్థ రెండూ కారణాలేనని టాల్కాట్ పార్సన్స్ అనే సామాజిక శాస్త్రవేత్త పేర్కొన్నారు.

అంతర్ వ్యవస్థ అనేది మార్పు చెందుతున్న వ్యవస్థ లోపలవుండి మార్పుకు ప్రేరేపిస్తున్న అంశం. విత్తనంలోని జీవపదార్థం లాగా ప్రతి వ్యవస్థలోనూ అంతర్గత ధాతువులు వుంటాయి. ఇవి చలన శీల స్వభావం కలిగి వుంటాయి. దీనికి బాహ్య వ్యవస్థ ఒత్తిడి తోడయినప్పుడు మార్పు బయటపడుతుంది. బాహ్య వ్యవస్థ అనేక రూపాల్లో, అనేక దశల్లో ఉంటుంది. ప్రకృతి పరిసరాల ప్రభావం రూపంలో, మానవ ప్రయత్నం రూపంలో వివిధ దశల్లో ఇది పనిచేస్తుంటుంది.

## 12.5.0 సామాజిక మార్పు -- కారకాలు

సామాజిక మార్పుకు ఏదో ఒక్క ప్రభావాన్నే కారణంగా చూపలేం. అనేకానేక కారకాలు మార్పుకు దోహదపడుతున్నాయి. సామాజిక శాస్త్రవేత్తలు మార్పుకు దోహదపడుతున్న కారకాలను ప్రధానంగా మూడు రకాలుగా విభజించారు. అవి 1. జైవిక కారకాలు, 2. సాంస్కృతిక కారకాలు, 3. సాంకేతిక కారకాలు.

### 12.5.1 జైవిక కారకాలు

సామాజిక మార్పులో జైవికాంశాల పాత్ర కూడా వుంది. జైవికాంశాలు అంటే జీవశాస్త్రపరమైన అంశాలని, జీవ సంబంధ అంశాలని అర్థం. సమాజం అంటే కేవలం జన సంబంధాలు మాత్రమే కాదు. మొత్తం జీవావరణ వ్యవస్థ కూడా సమాజంలో భాగమే. ఇతర జీవాలు జంతువులను పక్కనబెట్టినా మనుషులకు సంబంధించిన జనాభా వ్యవహారాలు, చావుపుట్టుకలు, లైంగికాంశాలు, ఇవన్నీ మార్పును ప్రభావితం చేస్తాయి. సామాజిక పరిణామం (జనసంఖ్య) లో వచ్చే మార్పులు, సంబంధాలను, పరస్ప చర్యలనూ ప్రభావితం చేస్తాయనేది వాస్తవం. పరస్పర చర్యల్లో, సంబంధాల్లో వైఖరుల్లో దృక్పథాల్లో వచ్చే మార్పులనే మనం సామాజిక మార్పుగా పేర్కొంటున్నాం.

జనాభా పెరుగుదల రేటు ప్రపంచ వ్యాప్తంగా చాలా ఆందోళనకరంగా వుంది. ప్రతి ఏటా కనీసం మిలియన్ల పెరుగుదల రేటుతో జనాభా పెరుగుతోంది. 2,030A.D. నాటికి ప్రపంచ జనాభా 6 బిలియన్లు దాటుతుందని అంచనా. మరోవైపు జీవన పరిధి పెరుగుతోంది. శిశు మరణాలు తగ్గిపోయాయి. వ్యాధుల నియంత్రణ క్రమబద్ధీకరణా విజయాలు సాధిస్తున్నది. ఇదంతా భౌతిక ఉత్పాదక శక్తులపైన ప్రభావం చూపుతుంది. ఆకలి, దారిద్ర్యం, నిరుద్యోగ సమస్యలకు జనాభా పెరుగుదల ఆజ్యం పోస్తున్నది. జీవన స్థాయి పడిపోయి ఆర్థిక సంక్షోభాలు, సామాజిక సమస్యలూ తలెత్తుతున్నాయి. ఇవన్నీ మార్పును ప్రభావితం చేస్తున్నవి.

BRAOU

### 12.5.2 సాంస్కృతిక కారకాలు

ఏ సమాజంలోనైనా కేవలం జన సంఖ్య పెరిగితే ఆ సమాజం మార్పు చెందినట్టేనా అంటే కాదు. జనాభా పెరుగుదలకు పర్యవసానాలుంటాయి. దాని ప్రభావం సాంస్కృతిక చట్రంపై పనిచేస్తుంటుంది. అలవాట్లు, పద్ధతులు, ధోరణులు, విలువలు, ఆచారాలు సాంప్రదాయాలు ఇవన్నీ సాంస్కృతిక అంశాలు. సమాజంలో ఇమిడివుండి సామాజిక సంబంధాలను ప్రభావితం చేస్తున్న అంశాలు.

సంస్కృతి రెండు రూపాల్లో వుంటుంది. ఒకటి భౌతిక సంస్కృతి కాగా మరొకటి భావ సంస్కృతి. దినదినం పెరిగిపోతున్న అవసరాలు తీర్చుకోవడం కోసం రూపొందించుకున్న పరికరాలు, సాధనాలను భౌతిక సంస్కృతి అంటున్నాం. కంప్యూటర్లు, కార్లు, మోటారు వాహనాలు, యంత్రాలు, టెలివిజన్లు మొదలైన వస్తురూప ఆధునిక సాధన సంపత్తి భౌతిక సంస్కృతి కిందకు వస్తుంది. ఇది భావ చైతన్యాన్ని ప్రభావితం చేస్తుంటుంది. కాలక్రమంలో మన కళలు, సాహిత్యం, మత విలువలు, విద్యావకాశాలు మన వైఖరులను, పద్ధతులను, అలవాట్లను, దృక్పథాలను మారుస్తుంటాయి. ఇది భావపరమైన అభౌతిక సంస్కృతిగా పేర్కొనవచ్చు. ఈ రెండు సంస్కృతులూ సమ స్థాయిలో పోతే తప్ప అభివృద్ధి, ప్రగతి సాధ్యపడదు.

ఈ రెండింటిలో ఏ ఒక్కటి లోపించినా వెనుకబాటుతనం తప్పదు. జనాభా పెరుగుదల, జీవపరమైన ఒత్తిడి పెరిగినా

సమాజాలు ఖచ్చితంగా నూతనావకాశాలను, నూతన జీవన విలువలను ఆవిష్కరించుకోవడం తప్పనిసరి. ఇందుకోసం మనిషికి సాంకేతిక వ్యవస్థ అవసరమవుతుంది.

### 12.5.3 సాంకేతిక కారణాలు

సామాజిక మార్పును పరిశీలించేటప్పుడు, పరిగణనలోకి తీసుకునే అంశాల్లో సాంకేతిక ప్రగతి ఒకటి. సామాజిక అభివృద్ధిని ఆ సమాజం వాడే పనిముట్లు, సాధనాలు, వాటి సాంకేతిక స్థాయినిబట్టి నిర్ధారించవచ్చు. మానవ సమాజాల వికాసం అంతా ఈ సాంకేతిక అంశాలతో ముడిపడే సాగింది. వేటాడుతూనో, పళ్ళు, ఆకులు, అలమలను ఏరుకుంటూనో సంచారిగా తిరిగిన మనిషి నుంచి ఇవాల్టి ఆధునిక మానవుని పరిసరాల దాకా పరిశీలిస్తే సాంకేతికాభివృద్ధి మనిషిని ఎంతగా ప్రభావితం చేసిందో వూహించవచ్చు.

ఈటె, బాణం, గొడ్డలి, నాగలి వంటి పనిముట్లు ప్రాచీన మానవుని జీవన రేఖను పూర్తిగా మార్చివేశాయి. ఆ తరువాతి పారిశ్రామిక విప్లవం దాని పర్యవసానంగా వచ్చిన పరిశ్రమలు, ఉత్పత్తి సాధనాలు సాంకేతికాభివృద్ధికి పరాకాష్ట. ఈ పరిశ్రమలు – ఉత్పత్తులు మనుషులను, వారి జీవన విలువలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. పారిశ్రామికీకరణ, నాగరీకరణకు, నాగరీకరణ వలసలకు, వలసలు గతిశీలతకు సాంప్రదాయ సమాజాల మార్పుకు, కొత్త నాగరిక జీవనానికీ ఇట్లా మొత్తం మానవ సంబంధాల్లోనే మార్పుకు ఇవి దోహదపడుతున్నాయి.

యంత్రాలు, పరిశ్రమలు కేవలం టి.వి.లు, రేడియోలను, సైకిళ్ళు, మోటారుకార్లను ఉత్పత్తిచేసి జీవన విలువలు మాత్రమే మార్చలేదు. ఇవి సామాజిక పునాదులను కదిలించాయి. సామాజిక ధాతువులను పునస్థాపింపజేసాయి. ఉత్పత్తి సంబంధాల్లో మార్పులు వచ్చాయి. ఫలితంగా సమాజంలో పెట్టుబడిదారులు, వృత్తికారులు, మేనేజర్లు, కార్మికులు ఇట్లా అనేక వర్గాలు ఏర్పడ్డాయి. దాని ప్రభావం మొత్తం మానవ సంబంధాలనే ప్రభావితం చేసింది.

ఈ రకంగా సామాజిక మార్పుకు ఒకవైపు జనాభాదానికి సంబంధించిన అంశాలు మరోవైపు సాంస్కృతిక విలువలు పద్ధతులు, సాంకేతికాభివృద్ధి దోహదపడ్డాయి.

BRAOU

## 12.6.0 సామాజిక మార్పు – రకాలు

సామాజిక మార్పు కారకాలు, ప్రభావాలు ఏమయినప్పటికీ మార్పు సమాజంలో రెండు రకాలుగా వుంటుంది. ఒకటి ప్రణాళికా రహితమైన మార్పు కాగా మరొకటి ప్రణాళికాయుతమైన మార్పు.

### 12.6.1 ప్రణాళికా రహిత మార్పు

దానినే సహజ మార్పు అని కూడా అంటారు. అంటే మనిషి ప్రమేయం లేకుండా, ప్రయత్నం లేకుండా జరిగే మార్పు అన్నమాట. మార్పు అనేది అనూహ్యం. ఎప్పుడు ఏం జరుగుతుందో కూడా తెలియని రీతిలో వుంటుంది. మనిషి సాంకేతికంగా, శాస్త్రీయంగా ఎంత ముందంజ వేసినా కొన్నిసార్లు సహజ పరిణామాలు, ప్రకృతి విపత్తుల ముందు తలవంచక తప్పడం లేదు.

సుసంపన్నంగా, సస్య శ్యామలంగా పాడి పంటలతో విలసిల్లుతున్నదనుకున్న దేశం ప్రకృతి వైపరీత్యాలకు లోనై తల్లడిల్లే పరిస్థితి రావచ్చు. భూకంపాలు, తుఫానులు, అతివృష్టి అనావృష్టి ఇతర సహజమైన ప్రకృతి పరమైన పర్యవసానాలను ఎదిరించే అవకాశం. నివారించే అవకాశం ఇప్పటికీ లేదు. ఈ మార్పును ఎవరూ వూహించలేదు. వీటికి ప్రణాళికలు, పథకాలు కూడా వుండవు. ఈ ఉపద్రవాలూ, విపత్తులు చాలాసార్లు సమాజ జీవనగతినే మార్చివేస్తాయి.

### 12.6.2 ప్రణాళికాయుత మార్పు

అభివృద్ధి నాగరికత వికాస క్రమంలో మనిషి కొంతవరకు ప్రకృతిని జయిస్తూ వచ్చాడని చెప్పవచ్చు. ఈ క్రమంలో కనీసం ప్రకృతిని తనకు అనువుగానైనా మలచుకోగలిగాడు. అవసరాలు అవి ప్రేరేపించిన, ఆలోచనలు మనిషిని వ్యూహోన్ముఖుడిని చేశాయి. ప్రకృతి సృష్టించే అవాంతరాలను క్రమబద్ధం చేస్తూనే, ప్రకృతి ఇచ్చిన సంపదను, వనరులను సద్వినియోగం చేసుకోవాలన్న ఆలోచన కూడా మనిషికి కలిగి అందుకు ప్రణాళికలు రూపొందించుకున్నాడు.

ప్రకృతి శక్తుల క్రమబద్ధీకరణ ఎప్పటి నుంచి వున్నా ఆధునిక రాజనీతి శాస్త్రంలో ప్రణాళికలు వనరుల శాస్త్రీయ వినియోగం మాత్రం సోవియట్ యూనియన్‌లోనే మొదలయ్యింది. 1917లో బోల్షివిక్ విప్లవం తరువాత దేశంలోని వనరులను సమగ్రంగా, సమానంగా పంపిణీ చేసి సద్వినియోగం చేసుకోవడానికి కృషిజరిగింది. ఆ తరువాత అన్ని దేశాలూ, అన్ని రాజకీయ పార్టీలు 'ప్రణాళికల'ను అనుసరించడం ప్రారంభించాయి. అందుబాటులో ఉన్న వనరులను సమీకరించుకుని, అవసరాలకు అనుగుణంగా వినియోగించుకునే వ్యూహాన్నే ప్రణాళిక అంటారు.

రాజకీయ వ్యవస్థల్లో ప్రణాళిక ... ం విధానాలు ప్రభుత్వాలు తమ విధానాల అమలుకు అవసరమైన వ్యూహాలు రూపొందించి ప్రణాళికల ద్వారా అమలుచేస్తాయి. ఈ విధానాలకు అవసరాలు, ఉద్యమాలు, ప్రభావ వర్గాలు, రాజకీయ పార్టీల మేనిఫెస్టోలు కారణమవుతాయి.

భారతదేశంలో సామాజిక మార్పుకు దోహదపడే ఏ కార్యక్రమాన్నైనా ప్రభుత్వాలు చేపట్టాయా? చేపడితే వాటి వెనుకవున్న రాజకీయాలేమిటి? సామాజిక మార్పుకు అవి ఏ మేరకు దోహదపడ్డాయి? అనే అంశాలను చర్చిద్దాం.

BRAOU

## 12.7 రాజకీయ ప్రక్రియలు

మార్పు సార్వత్రికమైనదీ, సహజమైనదీ అయినప్పటికీ దానిని క్రమబద్ధం చేసి, అనుకూలంగా మలచుకోవాల్సిన అవసరం రాజ్యానికి ఏర్పడింది. ముఖ్యంగా అధునిక రాజ్యవ్యవస్థలో వనరుల వినియోగం, సామాజిక వికాసం ఒకే నాణానికి ఉన్న రెండు భాగాలుగా, విడదీయలేని అంశాలయినాయి. రాజ్యాల ప్రధాన బాధ్యత సామాజిక అవసరాలు తీర్చడమేనని పలువురు రాజనీతి శాస్త్రవేత్తలు ప్రతిపాదించారు. ప్లేటో నుంచి కౌటిల్యుడి దాకా ప్రతి ఒక్క తాత్వికుడూ వనరుల వినియోగం, రాజు అధికారం ప్రజల అభివృద్ధి వంటివి చర్చించినప్పటికీ ''రాజ్యానికి వనరులు మూలం అభివృద్ధి లక్ష్యం'' గా వుండాలని అధునిక రాజనీతిజ్ఞుల్లో డేవిడ్ ఈస్టన్(David Easton) వంటి వారు పేర్కొనడం గమనార్హం. డేవిడ్ ఈస్టన్ వ్యవస్థా దృక్పథాన్ని(Systems Approach) ప్రతిపాదించిన వారిలో ముఖ్యులు. ఆయన ప్రకారం ఒక రాజ్య స్వభావం ఆ రాజ్యపు వనరుల పంపిణీ, సామాజిక వికాస దృష్టిమీద ఆధారపడి ఉంటుంది.

రాజ్యం మానవ సమాజం ఏర్పరచుకున్న ఒక పాలనా యంత్రాంగం. రాజ్యానికి కొన్ని అధికారాలు, బాధ్యతలూ వున్నాయి. ఏ అధికారాలైనా, ఎటువంటి బాధ్యతలైనా ప్రజల సంరక్షణ కోసం, సమాజ ప్రయోజనాలకోసమే వుంటాయి. రాజ్యం ప్రజలు తమకోసం ఏర్పరచుకున్న సార్వభౌమాధికార వ్యవస్థ. అందుకే 'డేవిడ ఈస్టన్' ప్రణాళికలు, పాలసీలను అధికారయుత వనరుల పంపిణీ(Authoritative allocation of values)అన్నాడు. అయితే ఈ అధికారం ఆ రాజ్యపు రాజకీయ లక్షణాలమీద ఆయా రాజ్య ప్రభుత్వపు సిద్ధాంతాలు, విధానాలు విశ్వాసాలమీద ఆధారపడి వుంటుంది. సామాజిక మార్పుకు ఉద్దేశించిన ప్రభుత్వ విధానాలు రెండు అంశాలమీద ఆధారపడి వుంటాయి. అవి ఒకటి రాజకీయ వ్యవస్థ రెండు ఆర్థిక రంగం.

రాజకీయాలు – ఆర్థిక వ్యవస్థ రెండూ కవల పిల్లలు. ఇలాగే ఇవి ఒకదానిపై ఒకటి ఆధారపడడమే కాక పరస్పరం

ప్రభావితమవుతుంటాయి కూడా. సాధారణంగా ఒక దేశపు ఆర్థిక వ్యవస్థ ఆ దేశంలో అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ సిద్ధాంతాలు, విధానాల మీద ఆధారపడి వుంటుంది. ఆ దేశం పెట్టుబడిదారీ దేశమా, సోషలిస్టు దేశమా, ఉదారవాద ప్రజాస్వామ్య దేశమా, మిలటరీ పాలనలో వుందా, నియంతృత్వ దేశమా అనే అంశాలమీద ఆ ఆర్థిక వ్యవస్థ ఆధారపడి వుంటుంది.

## 12.8 రాజకీయ ప్రక్రియలు – సిద్ధాంతాలు

రాజకీయ పార్టీలకు సిద్ధాంతం పునాది వంటిది. ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలు అధికారంలో ఉన్న పార్టీ ప్రణాళికను – మేనిఫెస్టోను అనుసరించే వుంటాయి. అంటే ప్రభుత్వ నిర్ణయాలు అధికార పార్టీ ఆశయాలు, హామీలకు అనుగుణంగానే వుంటాయన్నమాట.

రాజకీయ పార్టీల ముఖ్యంగా అధికార పార్టీ నిర్ణయాలే విధానాలవుతాయి. అయితే ఈ నిర్ణయాలు నేరుగా కాకుండా సిద్ధాంత రూపంలో వుంటాయి. పార్టీ సిద్ధాంతం అటు ఆర్థిక వ్యవస్థను, ఇటు పాలనా రంగాన్ని అనుసంధానం చేస్తూ నడుస్తుంటుంది. మరోవైపు ప్రజల అవసరాలు, సామాజిక పరిస్థితులు ప్రత్యామ్నాయ మార్పు దిశను కూడా పరిగణనలోకి తీసుకోవలసి వుంటుంది. వివిధ రాజ్యాలు, రాజకీయ పార్టీల మధ్య తేడాలు ప్రధానంగా రెండు రంగాల్లో వ్యక్తమవుతుంటాయి. ఒకటి మార్కెట్ పాత్ర, రెండు అధికార వినియోగ పద్ధతి. ఈ రెండు అంశాలను బట్టి వివిధ రాజ్యాల మధ్య తేడాలు అంచనా వేయవచ్చు.

పెట్టుబడిదారీ దేశాల్లో మార్కెట్‌కు ఎక్కువ ప్రాధాన్యత వుంటుంది. రాజ్యం యొక్క పాత్ర ఈ దేశాల్లో అతి తక్కువ. మార్కెట్ ఆధిపత్యం ఎక్కువగా ఉన్న దేశాల్లో ఉత్పత్తులు, పంపిణీ, వినియోగం తదితర ఆర్థికాంశాలు, ఆర్థిక సంబంధాలు కూడా భిన్నంగా వుంటాయి. సామాజికావసరాలు ముఖ్యంగావనరుల పంపిణీ మార్కెట్ ద్వారానే జరుగుతుంది. ఈ పంపిణీకి కొన్ని నియమ నిబంధనలు సూత్రాలూ వుంటాయి. ఆ నియమాలను ఆచరింపజేసేలా చూస్తూ సర్వసమ్మతిని సాధించడం ఒక్కటే పెట్టుబడిదారీ ప్రభుత్వాల బాధ్యత. అక్కడి రాజ్యాంగ యంత్రాంగానికి కూడా అంతకు మించిన పని వుండదు. అభివృద్ధి చెందిన అన్ని రకాల పెట్టుబడిదారీ దేశాల్లో కూడా ఆర్థిక వ్యవస్థే ప్రణాళికల్లో, పథకాల్లో చివరకు సామాజిక మార్పును నిర్దేశించడంలో కూడా కీలక పాత్ర వహిస్తుంటుంది.

రెండవ రకం రాజ్యాలు మిశ్రమ ఆర్థిక వ్యవస్థను కలిగివుండే ఉదారవాద రాజ్యాలు. ప్రజాస్వామ్య దేశాలుగా ఇటు మార్కెట్, అటు రాజ్యపు బాధ్యత రెండూ కలిగి వుండే వ్యవస్థ. తృతీయ ప్రపంచ దేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాలు ఈ పద్ధతిని ఆచరిస్తున్నాయి. ఈ దేశాల్లో ప్రభుత్వాలు సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి ప్రణాళికలకు ప్రభుత్వ పెట్టుబడులకు ప్రాధాన్యతనిస్తాయి. అదేవిధంగా ఉత్పాదక రంగంలో కూడా పెట్టుబడులు పెట్టి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. అలాగే మార్కెట్ మీద కొంత మేరకు అదుపు కలిగి వుంటాయి. కొన్ని రంగాలను మాత్రమే మార్కెట్ అదుపు చేయగలుగుతుంది. అయితే ప్రభుత్వాలు మారడం, సైద్ధాంతిక భావాల్లో ( ప్రభుత్వాలు మారినప్పుడల్లా) తేడాల మూలంగా ఈ రకమయిన దేశాల్లో సుస్థిర ఆర్థిక వ్యవస్థ కష్టమవుతుంది.

మూడవది, ప్రధాన మైంది అయిన సిద్ధాంతాల్లో సోషలిస్టు సిద్ధాంతం ఒకటి. సోషలిస్టు వ్యవస్థల్లో రాజ్యానికి సర్వ వ్యవస్థల మీద పట్టు వుంటుంది. మార్కెట్‌కు పాలసీల మీద ఎటువంటి పట్టు వుండదు. మార్కెట్‌కు ప్రాధాన్యత కూడా తక్కువే. ఈ వ్యవస్థలో ప్రభుత్వాలే అన్ని వనరుల మీద అధికారం కలిగి వుంది. వనరులు సమీకరిస్తాయి. ప్రభుత్వాలే ప్రజల అవసరాలను గుర్తించి వాటికి అనువైన వ్యూహాలు, ప్రణాళికలు రూపొందిస్తాయి. ఆర్థిక అసమానతలు తొలగించి సమానత్వం సాధించడం సోషలిస్టు రాజకీయ ప్రక్రియల ప్రధాన లక్ష్యంగా వుంటుంది.

## 12.9 రాజకీయ ప్రక్రియలు – ప్రేరకాలు

రాజకీయ ప్రక్రియలు వాటంతట అవే రూపుదిద్దుకోవు. వాటి వెనుక అనేక కారణాలుంటాయి. బ్రిటీష్ వారి పాలన కాలంలో స్థానిక స్వపరిపాలనకు పన్నుల వసూలు, అధికార సుస్థిరత కారణం అయినట్టుగానే హైదరాబాద్ రాష్ట్రంపై సైనిక చర్యకు విశాల భారతం అనే దృక్పథం కారణమైంది. స్వాతంత్ర్యం తర్వాత వచ్చిన అనేక ప్రణాళికలు, పథకాలు రాజకీయ ప్రక్రియల వెనుక అనేక వర్గాల నుంచి వచ్చిన ఒత్తిడి, ప్రేరణ వున్నాయి. అంతేకానీ ఈ పథకాలు, కార్యాచరణలన్ని పాలకుల మనసులో పుట్టినవో, ప్రేమతో రూపొందించినవో కావు. రాజకీయ ప్రక్రియల గురించి చర్చించే ముందు వాటి మూలాలు, ప్రేరకాల గురించి తెలుసుకోవడం అవసరం. అవి:

### ఎ. ప్రభావ వర్గాలు

ప్రభుత్వ విధాన నిర్ణయంతో ప్రత్యక్షంగా సంబంధం లేకున్నా ఆ నిర్ణయాన్ని తమకు అనుకూలంగా తీసుకునే విధంగా ప్రభుత్వాన్ని ప్రభావితం చేసే సమూహమే ప్రభావ వర్గం అవుతుంది. ప్రభావ వర్గాలు రాజకీయ ప్రక్రియలో అత్యంత కీలక పాత్ర వహించడమే కాకుండా ఆ ప్రక్రియ దిశను కూడా నిర్దేశిస్తాయి. భారత రాజకీయాల్లో ప్రభావ వర్గాల పాత్ర మొదటి నుంచీ వుంది. రాజకీయ నిర్ణయాల విషయంలో వీటి జోక్యం ఎక్కువగా వుంటున్నది.

మత సంస్థలు, కుల సంఘాలు దేశ రాజకీయాలను, ప్రభుత్వాల నిర్ణయాలను ప్రభావితం చేసే సాంప్రదాయ ప్రభావి వర్గాలకు ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. పార్టీల్లో ఏ కులానికి ఎన్ని సీట్లు కేటాయించాలి, మైనారిటీ మతస్థులకు ఏ రకమైన ప్రాతినిధ్యం ఇవ్వాలి అనేది ఈ వర్గాలే నిర్ణయిస్తాయి. అలాగే పదవులు, పథకాల విషయంలో కూడా వీటి జోక్యం వుంటుంది.

BRAOU

ఇవే కాకుండా మారుతున్న ఆర్థిక సామాజిక పరిస్థితుల నేపథ్యంలో కొత్త లాబీలు, కొత్త వర్గాలు కూడా ప్రభుత్వాన్ని ప్రభావితం చేస్తున్నాయి. వాణిజ్య సంస్థలు, వ్యాపార సంఘాలు పారిశ్రామిక మండలులు వీటికి ఉదాహరణ.

### బి. సామాజిక చైతన్యం – ఉద్యమాలు

రాజకీయ ప్రక్రియలకు మరో కారణం జనచైతన్యం. విద్య, విజ్ఞానం, భావచైతన్యం సామాజిక మార్పుల మూలంగా ప్రజలు తమకు ఏది అవసరమో ఏది అనవసరమో తెలుసుకోగలుగుతున్నారు. అవసరమైన దాన్ని కోరుకొని, అనవసరమైన దాన్ని వదులుకుంటున్నారు. ఈ క్రమంలో అవసరాల కోసం ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1994 సారా పోరాటం దీనికొక చక్కని ఉదాహరణ. వయోజన విద్య, రాత్రి పాఠశాలలతో విజ్ఞానవంతులైన ప్రజలు సారా రక్కసి తమ ఆర్థిక వనరుల్ని ఛిన్నా భిన్నం చేసి తమను ఎలా పీల్చిపిప్పి చేస్తున్నదో తెలుసుకున్నారు. సారాను నిషేధించాలంటూ నెల్లూరు జిల్లా దూబగుంటలో పుట్టిన నినాదం రాష్ట్రవ్యాప్త ఉద్యమమై సంపూర్ణ మద్య నిషేధ నిర్ణయానికి కారణమైంది.

పేద ప్రజలు లేవదీసే ఉద్యమాలు ఆందోళనలకు కూడా ప్రభుత్వాలు కొన్నిసార్లు దిగిరాక తప్పడం లేదు. వ్యవసాయ కూలీలు, రైతులు చేసిన ఆందోళనల ఫలితంగా కూలీరేట్ల పెంపు, కనీస వేతనాల చట్టం, భూ సంస్కరణల వంటి చట్టాలు, ప్రక్రియలు ముందుకు వచ్చాయి. అయితే ఇవి ఎంతవరకు ఉపయోగకరంగా వున్నాయి. ఏ మేరకు ఫలవంతమైనాయి అనేది చర్చనీయం. ఈ డిమాండ్లు సమాజంలోని మరో వర్గానికి నష్టం కలిగించనంత వరకు లేదా మరో వర్గపు ప్రయోజనాలను దెబ్బతీయనంత వరకు ప్రభుత్వాలు వాటిని అనుమతిస్తాయి. పరిష్కరిస్తాయి. కానీ అవి తమకో, తమ వర్గాలకో నష్టం కలిగిస్తాయని తెలిస్తే వాటిని శాంతి భద్రతల సమస్యగా చిత్రించి అణచివేస్తాయి. కొన్నిసార్లు ప్రభావ వర్గాలే ఉద్యమాలకు కారణమవుతుంటాయి. రాజకీయాల్లో ఎదగలేక వెనుకబడి పోతున్న నేతలు

లాబీగా తయారై కొత్త ఆందోళనలు లేవదీయడం జరుగుతుంటుంది. లేదా ఒక విధానాన్ని, ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రభుత్వంలో భాగమైన, లేదా ప్రజా ప్రతినిధిగా వుండి వ్యతిరేకించలేక ఆందోళనలు, గొడవలను రెచ్చగొట్టడం జరుగుతుంది. భూ సంస్కరణలకు వ్యతిరేకంగా వచ్చిన జై ఆంధ్ర ఉద్యమం, రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ వచ్చిన ఆందోళనలు వీటికి ఉదాహరణలు.

## సి. ప్రసార మాధ్యమాలు

ఆధునిక సమాజంలో ప్రసార మాధ్యమాలు ప్రభుత్వాలను, విధానాలను ప్రభావితం చేయడంలో కీలకపాత్ర వహిస్తున్నాయి. ప్రజల అవసరాలు, ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వానికి తెలియజేయడంలో ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తి చూపడంలో, ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించడంలో లోటు పాట్లను, మంచి చెడ్డలను విశ్లేషించడంలో ఇలా అనేకరకాలుగా ప్రసార సాధనాలు ఉపయోగపడుతున్నాయి. ప్రభుత్వానికి ప్రజలకూ మధ్య వారధిగా వుంటున్నాయి. ప్రసార మధ్యమాల్లో పత్రికలు, రేడియో, టెలివిజన్లు, సినిమాలు సామాజిక చైతన్యానికి ఎంతగానో దోహదపడుతున్నాయి.

అయితే ఒకప్పుడు సామాజిక శ్రేయస్సు, సంస్కరణాభిలాష ధ్యేయంగా కలిగివున్న పత్రికలు ఇటీవలి కాలంలో ప్రభావ వర్గాల పాత్ర పోషిస్తున్నాయి. పత్రికలు ప్రజల అవసరాల కంటే తమ యజమానుల వ్యాపార ప్రయోజనాలు, రాజకీయ ప్రయోజనాలకే ఎక్కువ విలువ ఇస్తున్నాయి. చివరకు ప్రభుత్వాలను మార్చేందుకు కావాల్సిన లాబీని కూడా నిర్వహిస్తున్నాయి. అయినప్పటికి సామాజిక మార్పుకు, ప్రజల అవసరాలకు, ఉద్యమాలకు పత్రికలు అందించిన సహకారం మరువలేనిది.

రేడియో, టెలివిజన్ వంటి ఎలక్ట్రానిక్ మాధ్యమాలు వచ్చిన తరువాత సమస్యకు దృశ్యరూపం లభించింది. ఇది అధికారులకు, ప్రభుత్వానికి విశ్వసనీయ సమాచారం అయ్యింది. సామాజిక నేపథ్యాన్ని, సమస్యలను ఇతివృత్తంగా తీసుకుని వచ్చిన కార్యక్రమాలు, సినిమాలు కూడా ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. దాని ప్రభావం సమాజంపై ఖచ్చితంగా వుంటుంది.

BRAOU

సమాచార ప్రసార సాధనాలు అటు ప్రజలకు, ఇటు ప్రభుత్వానికి మధ్య మధ్యవర్తిగా వుంటూ రాజకీయ నిర్ణయాలను, ప్రక్రియలను ప్రభావితం చేస్తున్నాయి.

## డి. రాజ్యాంగ వ్యవస్థలు

రాజకీయ ప్రక్రియల బాధ్యతను రాజ్యాంగం కేవలం రాజకీయ పార్టీలకే పరిమితం చేయలేదు. రాజకీయ పార్టీల నిర్ణయాలను శాసన సభలు ఆమోదించాల్సి వుంటుంది. వాటిని కార్యనిర్వహణ శాఖ అమలు చేయాల్సి వుంటుంది. నిర్ణయాల్లో, అమలు తీరులో ఎక్కడ అన్యాయం జరిగినా న్యాయ వ్యవస్థ జోక్యం చేసుకుంటుంది.

అదేవిధంగా ఈ మూడు వ్యవస్థలూ ప్రభుత్వ నిర్ణయాలను రాజకీయ ప్రక్రియలను ప్రభావితం చేస్తాయి. శాసన వ్యవస్థ ఇందులో కీలక పాత్ర వహిస్తుంటుంది. శాసన సభులు తమ ప్రాంత సమస్యలను, రాష్ట్ర సమస్యలను, ప్రజల తక్షణావసరాలను సభల్లో

## ఇ. రాజకీయ పార్టీలు - మేనిఫెస్టోలు

వివిధ ప్రభావ వర్గాలు, ప్రజా ఉద్యమాలకు తోడు రాజకీయ పార్టీల అసక్తులు ప్రాధాన్యతలు కూడా రాజకీయ ప్రక్రియలపై ప్రభావం చూపిస్తాయి.

ఎన్నికల్లో పోటీచేసే ప్రతి రాజకీయ పార్టీ తన సిద్ధాంతం, కార్యాచరణను ముందుగానే ప్రకటిస్తుంది. తన మేనిఫెస్టోలో దానికి సంబంధించిన సమగ్ర వివరణ ఇస్తుంది. ఆ కార్యాచరణకు అనుగుణంగానే ప్రక్రియలు ప్రారంభిస్తుంది.

ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించినప్పుడు రెండు రూపాయలకు బియ్యం, మండల వ్యవస్థ ద్వారా స్థానిక పరిపాలనను పునః వ్యవస్థీకరించి ప్రజలకు అందుబాటులోకి తేవడం, తక్కువ ధరకే వస్త్రాల పంపిణీ, గృహ నిర్మాణం వంటి కార్యక్రమాలను తన మేనిఫెస్టోలో పొందుపరిచారు. అలాగే ఇందిరాగాంధీ 20 సూత్రాల కార్యక్రమం, గరీబీ హటావో, భారతీయ జనతా పార్టీ రామ మందిర నిర్మాణం, జనతాదళ్ మండల్ కమిషన్ వంటి వాటిని ప్రాధాన్యతా అంశాలుగా పెట్టుకున్నాయి. వాటిని దృష్టిలో వుంచుకునే ప్రజలు ఓట్లు వేయడం ఆ తరువాత ప్రభుత్వాలు రాజకీయ ప్రక్రియలు ప్రారంభించడం ప్రజాస్వామ్యంలో ఆనవాయితీ.

## 12.10.0 భారతీయ సమాజం – రాజకీయ ప్రక్రియలు

భారతీయ సమాజం మిగతా సమాజాలతో పోల్చితే భిన్నమైనది. సామాజికంగా, సాంస్కృతికంగా ఒక ప్రత్యేకత కలిగివున్న భారతీయ సమాజం అనేక ఆటుపోట్లను ఎదుర్కొంది. వేలాది సంవత్సరాల పరాయి పాలనలో నలిగిపోయిన సాంఘిక జీవనాన్ని చితికిపోయిన ఆర్థిక వ్యవస్థను కుదుటపరచడం స్వాతంత్ర్యానంతర రాజకీయ ప్రయత్నాలకు కష్టతరమైంది.

### 12.10.1 స్వాతంత్ర్యపూర్వదశ

స్వాతంత్ర్యానికి ముందు భారత దేశానికి ఒక రూపం లేకుండింది. వేరువేరు రాజులు, వేరు వేరు రాజ్యాలు, వేరువేరు ప్రభువులు, వేరువేరు పాలనల కింద ఒక్కొక్క ప్రాంతం ఒక్కోరకంగా వుండింది. అయితే ప్రాచీన భారతంలో సమగ్ర పథకాలు, ప్రణాళికల కంటే రాజుల ఇష్టాయిష్టాల మీదే ప్రజల భవిష్యత్తు నిర్ణయమయ్యేది. మంత్రుల సలహాలే మంచి చెడ్డలను, మార్పు దిశను నిర్దేశించేవి.

BRAOU

ఆంగ్లేయుల పాలనలో కూడా ఇదే పరిస్థితి వుండింది. ఈ కాలంలోనే మొట్టమొదటిసారిగా జాతీయ భావన ఎదిగింది. ఆంగ్లేయుల దృష్టి అభివృద్ధి కాదనేది వాస్తవం. అందుకే వారు అభివృద్ధి గురించి కంటే వ్యాపారం మీద ఎక్కువ శ్రద్ధ చూపారు. ఈ క్రమంలో ఆంగ్లేయులు తమ వ్యాపార వాణిజ్యాల అభివృద్ధికి దోహదపడే చర్యలను అనేకం చేపట్టారు.

బ్రిటీష్ పాలకుల హయాంలో సామాజిక మార్పుకు దోహదం చేసిన అంశాల్లో విద్య ఒకటి. ఆంగ్లేయులు తమ ప్రభుత్వ, వ్యాపార వర్గానికి అవసరమైన అధికారులు, సిబ్బందిని సమకూర్చుకోవడానికి భారతీయ యువకులకు శిక్షణ నివ్వాలని భావించారు. దీనికి అనువుగా ఒక విద్యావ్యవస్థను ఏర్పరిచారు. ఈ విద్యా సంస్థలు సాంప్రదాయ భారతీయ ఉన్నత కుటుంబాలను విశేషంగా ఆకర్షించాయి. అప్పటిదాకా సనాతన ధర్మాన్ని ఆచరిస్తూ, వైదిక జ్ఞానాన్నే విద్యగా భావిస్తూ వస్తున్న అనేక బ్రాహ్మణ కుటుంబాల పిల్లలు నూతన వ్యవస్థకు ఆకర్షితులై ఇంగ్లీషు విద్యా సంస్థల్లో చేరారు.

ఆంగ్ల విద్యాభ్యాసం తరువాత ఈ వర్గం ఆంగ్లేయుల కొలువులో నౌకర్లుగా స్థిరపడాలని ఆశించింది. అప్పుడు పాలనా వ్యవహారాల్లో భారతీయులను ఉద్యోగులుగా తీసుకోకపోయేవారు. ఒకవేళ ఎవరైనా ప్రయత్నించినా లండన్ వెళ్ళి పరీక్షలు రాసి (ఐసిఎస్) నెగ్గి రావాల్సి వుండింది. పరీక్షలు ఇంగ్లీషులో వుండడం, సుదూర దేశంలో రాయాల్సి రావడంతో వేరే వర్గాలకిది అందుబాటులో వుండేది కాదు. ఏటా ఒకరో, ఇద్దరో బ్రాహ్మణులు మాత్రం ఈ పరీక్షలో నెగ్గేవారు.

పాలనావసరాలు పెరిగిపోయి, ఇంగ్లీషు తెలిసిన కిందిస్థాయి ఉద్యోగులు కూడా బ్రిటీషు వారికి అవసరమైనారు. దానిని దృష్టిలో వుంచుకుని దేశంలో ఆంగ్లేయులు ఆంగ్ల విద్యను ప్రవేశపెట్టారు. ఆంగ్ల విద్య ద్వారా, పాశ్చాత్య సాహిత్యం, వివిధ రాజకీయ దృక్పథాలు, సిద్ధాంతాలు బదిలీ అవకాశం భారతీయ విద్యార్థులకు కలిగింది. దేశమంతా ఒకే విద్య, ఒకే సిలబస్ ఒకే భాషలో విద్యాబోధన జరగడంతో జన సమీకరణ సులభమైంది.

ఈ మొత్తం తతంగంలో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఏ చదువు నేర్పించయితే ఆంగ్లేయులు భారతీయ యువతను బానిసలుగా చేయాలనుకున్నారో అదే యువత భారత దేశ దాస్యశృంకలాలను బద్దలు కొట్టడానికి నడుం బిగించింది. మొదటి దశలో స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న దాదాబాయి నౌరోజీ, సయ్యద్ అహ్మద్ ఖాన్ జస్టిస్ రనడే మొదలుకుని బాలగంగాధర తిలక్, గాంధీజీ, జవహర్ లాల్‌నెహ్రూ, సుభాష్ చంద్రబోసు దాకా విదేశీ విద్య ద్వారా ఆధునిక రాజకీయ దృక్పథాలు తెలుసుకుని ప్రభావితులైన వారే. పాలకులు ఏ లక్ష్యం కోసమైతే పథకాలు రూపొందిస్తారో ఫలితాలు మార్పు అందుకు భిన్నంగా కూడా వుంటాయనడానికి ఇదొక మంచి ఉదాహరణ.

తరువాతి కాలంలో ఈ చదువుకున్న వర్గమే ప్రభావ వర్గంగా తయారయి అనేక పాలనా సంస్కరణలకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవడమేకాక జాతీయ రాజకీయోద్యమంలో అగ్రభాగాన నిలిచింది. అదే స్ఫూర్తితో విజయం సాధించి విప్లవాత్మకమైన మార్పుకు చోధకశక్తిగా పనిచేసింది.

బ్రిటీషువారి కాలంలో భారత దేశానికి ఒక రూపం రావడంతోపాటు అధునీకరణ ఫలితంగా అనేక మార్పులు సంభవించాయి. ఈ మార్పులు సాంఘిక, ఆర్థిక సాంస్కృతిక రంగాలమీద ప్రభావం చూపాయి. విద్యావకాశాలు, ఉద్యోగాలు, ఇంగ్లీషు భాష భారతీయ సంస్కృతిని కొంతవరకు ప్రభావితం చేసింది. జాతీయ భావం, స్వేచ్ఛా, సౌభ్రాతృత్వం పెరిగి అప్పటిదాకా వున్న అసమాన సామాజిక సంబంధాలు, విలువలలో కొంతమేరకు మార్పు తేగలిగింది. అంతకుముందు జాతి అన్నది కులానికి సూచన అయితే ఆ తరువాత దేశ ప్రజల సంఘటిత శక్తికి సంకేతం అయ్యింది. మరోవైపు బ్రిటీష్ వారు తమ ఎగుమతులు దిగుమతుల కోసం, ఉత్పత్తులకోసం ఏర్పాటు చేసిన పరిశ్రమలు, నిర్మించిన రైలు మార్గాలు, రోడ్లు, ఆనకట్టలు నిజంగానే వేలాది ఏళ్ళ చీకటి స్థానంలో కొత్త వెలుగును నింపాయి. ఆర్థిక వ్యవస్థలో కరెన్సీ ప్రవేశించింది. శ్రమ విలువ ప్రవేశించింది. అంతకు ముందు సాంప్రదాయ వృత్తులు, సేవలుగా ఉన్న సామాజిక స్థరికరణలో కొత్త ఉద్యోగవర్గం ప్రవేశించింది.

బ్రిటీష్ రాజకీయాలు – పాలన ఫలితంగా దేశం ఎంతో నష్టపోయినప్పటికీ అనూహ్యమైన రీతిలో మార్పు చెందినమాట వాస్తవం.

BRAOU

## 12.10.2 స్వాతంత్ర్యానంతర దశ

స్వాతంత్ర్యోద్యమం పరాయి పాలనను అంతంచేసి తొలిసారిగా జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పరచడానికి వీలు కల్పించింది. అంటే దేశంలో అసలైన రాజకీయ ప్రక్రియ ప్రారంభమైందన్నమాట. అప్పటి వరకున్న పాలన పూర్తిగా పాలక వర్గాలు తమ అవసరాలకోసం సాగించిన రాజతంత్రం. దాని స్థానంలో ప్రజాతంత్రం ఏర్పరచడం అవసరమైంది.

బ్రిటీష్ కాలపు లేదా అంతకంటే ముందరి రాజకీయ ప్రక్రియలకూ స్వాతంత్ర్య భారతం అవతరించిన తరువాతి రాజకీయ ప్రక్రియలకు మధ్య ఎంతో తేడా వుంది. స్వాతంత్ర్య పూర్వ రాజకీయ ప్రక్రియలు పూర్తిగా పాలకుల ప్రయోజనాలను, రాజ్య ప్రయోజనాలను, అధికార ప్రయోజనాలను కాపాడడానికి ఉద్దేశించినవి అయితే తరువాతి ప్రక్రియలు ప్రజల ప్రయోజనాలను సాంఘిక ప్రయోజనాలను దృష్టిలో వుంచుకుని నిర్దేశించినవి.

స్వాతంత్ర్యానంతరం పాలకుల మీద అనూహ్యమైన బాధ్యత పడింది. అది దేశ పునర్నిర్మాణం. అప్పటి దాకా రాజులు, దండయాత్రలు, దోపిడీ, పీడనల్లో నలిగిపోయిన దేశాన్ని నిలబెట్టడం పాలకుల తక్షణ కర్తవ్యమైంది. దేశ సమగ్ర అభివృద్ధికి పథకాలు, కార్యక్రమాలు అవసరమైనాయి. ప్రగతిశీల భావాలు, సమసమాజ సిద్ధాంతాలకు ప్రభావితులైన నెహ్రూ వంటి ఆనాటి పాలకులు శాస్త్రబద్ధమైన ప్రణాళికల అవసరాన్ని గుర్తించారు. దానికి వ్యూహాలు సిద్ధంచేసి వార్షిక ప్రణాళికలు, పంచవర్ష ప్రణాళికలు ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఈ ప్రక్రియలన్నీ సమాజంలో అనేక మార్పులు తెచ్చాయి. రాజకీయ ప్రక్రియలు ఏ రకంగా వుండాలి, ఏ ప్రయోజనాలను ఎలా కాపాడాలి అనే

విషయాలను భారత రాజ్యాంగం సమగ్ర పరిచింది.

అసమానతల్లో ఎదిగి వచ్చిన భారత దేశంలో ఆర్థిక, సాంఘిక సమానత్వం సాధించాల్సిన అవసరం ఏర్పడింది. దానికి పౌరహక్కులు, ప్రాథమిక హక్కులు పొందుపరిచారు. అస్పృశ్యతను నిర్మూలిస్తూ చట్టం తెచ్చారు. కుల వివక్షతోపాటు లింగ వివక్షతను రూపుమాపడానికీ, పౌరులంతా ఒక్కటేనని చాటడానికీ విశ్వప్రయత్నం చేశారు. రాజ్యాంగపు ఉపోద్ఘాతంలోనే కులవర్గ లింగ జాతి, మత వివక్ష లేని పాలనను అందరికీ అందించడం రాజ్యాంగ లక్ష్యంగా ప్రకటించారు.

సామాజిక పరివర్తనపై దృష్టిని ప్రధానంగా కేంద్రీకరించిన ప్రభుత్వం దేశంలో క్రింది అంశాలను ప్రభావితం చేసే విధంగా రాజకీయ ప్రక్రియలను చేపట్టింది.

*1. జాతి– జాతీయ భావం:* భారతీయులంతా ఒకేజాతి అని చాటడం అప్పటి ప్రభుత్వానికి తప్పనిసరి అయ్యింది. వివిధ ప్రాంతాలు కులాలు, మతాలు, భాషలు వేరయినా మనమంతా భారతీయులమనే భావన కలిగించవలసిన అవసరం ఏర్పడింది. ద్రవిడులనో, కన్నడులనో పంజాబీలు గుజరాతీలనో పిలువబడే ప్రజలను ఏకం చేయాల్సి వచ్చింది. ఇప్పటికీ పాఠశాలల్లో విద్యార్థులు చదివే ప్రార్థన, ప్రతిజ్ఞ ఆ జాతీయ భావాన్నే ఉద్బోధిస్తుంటాయి.

*2. సామాజిక న్యాయం:* భారతదేశంలో కొన్ని వర్గాలు వేలాది సంవత్సరాలుగా అసమానతలకు లోనవుతూ వచ్చాయి. ప్రజల్లో ఒక వర్గానికీ మరో వర్గానికీ మధ్య తీవ్ర వైరుధ్యాలు, వైషమ్యాలు, న్యూనత, ఆధిక్య భావం ఉన్నాయి. చారిత్రకంగా వస్తున్న వీటిని రూపుమాపడం ఒక పెద్ద కార్యక్రమం. వెనకబడిపోయి, అణచివేయబడిన వర్గాలను పైకి తీసుకురావడం మరో కీలకమైన కర్తవ్యం. దానికి ప్రభుత్వం – రాజ్యాంగం సామాజిక న్యాయం అనే సూత్రాన్ని చేపట్టింది. సమాజ ప్రగతి ఫలాలు అందరికీ న్యాయబద్ధంగా అందించడం ఈ సూత్రపు అంతిమ లక్ష్యం. కులం మతం, ప్రాంతం వంటి వివక్షలు లేకుండా సమాజంలోని మనుషులంతా సమానులేనని ఉద్బోధించడం, ఆ రీతిలో అభివృద్ధి తీసుకురావడం వంటి ఉద్దేశాలతో తరువాత ప్రభుత్వాలు రాజకీయ ప్రక్రియలు ప్రారంభించాయి.

BRAOU

*3. రాజ్య నిర్మాణం– పటిష్టత:* పాలన సక్రమంగా సాగడానికి ఒక వ్యవస్థ అవసరం దానినే రాజ్యం అంటున్నాం. రాజ్యానికి రంగు, రూపు, వాసనా వుంటాయి. అంటే రాజ్యం ఏ రూపంలో వుంది, రాజ్యం ఏ సిద్ధాంతాన్ని ఆచరిస్తుంది. రాజ్యం ధోరణి, వైఖరి ఏమిటి అనేవి కూడా ప్రధాన మైనవి. అంటే మొత్తంగా రాజ్యపు దృక్పథాన్ని ఇది సూచిస్తుంది.

అలాగే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవ్యవస్థ చట్టాలు శాసనాలు వాటికి సంబంధించిన వ్యవహారాల వంటివి క్రమపరచుకోవడానికి కృషిచేయవలసి వచ్చింది.

*4. ప్రణాళికాభివృద్ధి:* అభివృద్ధిని శాస్త్రబద్ధంగా, సమగ్రంగా తీసుకురావాల్సిన అవసరం ఏర్పడింది. దానికోసం ప్రణాళికా వ్యవస్థను నెలకొల్పాల్సి వచ్చింది. ప్రాజెక్టులు, ఆనకట్టలు, బడ్జెట్ కేటాయింపుల్లో వివిధ రంగాలకు ఇవ్వాల్సిన ప్రాధాన్యతల వంటివి నిర్ధారించడం, నిర్ణయించడం ఒక సుదీర్ఘ కార్యక్రమం అయ్యింది.

*5. సామాజిక–సాంస్కృతిక వికాసం:* అభివృద్ధి అంటే భౌతిక శక్తులు, వస్తుగత వ్యవస్థాపనలే కాదు భావ ప్రపంచ వికాసం కూడా. మన సంస్కృతి, మన కళలు సాహిత్యాన్ని కాపాడుకుంటూనే నూతన పోకడలను అనుసంధాన పరచుకోవలసిన అవసరం కూడా ఏర్పడింది.

విద్యారంగం, దాని దృక్పథం భావితరాల్లో భావచైతన్యానికి దోహదపడేదిగా వుండాలి. దానికోసం ప్రత్యేక వ్యవస్థలను ఏర్పరచవలసి వచ్చింది. అలాగే ఆధునికీకరణ, పాశ్చాత్యీకరణల ప్రభావం నుంచి దేశ ప్రయోజనాలు కాపాడడం కూడా ప్రభుత్వ కర్తవ్యం అయ్యింది.

ఈ అంశాలను దృష్టిలో వుంచుకుని ప్రభుత్వం విధానాలను రూపొందించి. ఏకస్వామ్య అధికార స్వామ్యం నుంచి ప్రజాస్వామ్యంలోకి వచ్చిన తరువాత అనేక చిక్కులు ఎదురవుతాయి. ఆ చిక్కుల పరిష్కారానికి కూడా రాజకీయ ప్రక్రియలు అవసరమవుతాయి. ఈ ప్రక్రియలు అధికారంలో వున్న పార్టీ దృక్పథాలు, ఆ పార్టీని ప్రభావితం చేస్తున్న

సామాజిక వర్గాలు వాటి ప్రయోజనాల మీద ఆధారపడి వుంటాయి.

భారత దేశంలో ప్రభుత్వాలు చేపట్టిన ఏ రాజకీయ ప్రక్రియను పరిశీలించినా మనకు ఈ ప్రభావ వర్గాల పాత్ర స్పష్టమవుతుంది. సహజంగానే ప్రజలు రెండు వర్గాలుగా చీలి వుంటారు. రెండు వర్గాలనూ సంతృప్తి పరచడం సమ్మతింపజేయడం అనేది సాధ్యపడని విషయం. వీటిలో ఒకటి శక్తివంతమైన వర్గంగా ప్రభుత్వాలకు వెన్నుదన్నుగా వుండే భూస్వామ్య వర్గం అయితే మరొకటి చైతన్యవంతులవుతున్న సామాన్య ప్రజానీకం.

భారత రాజకీయాల మీద ఈ రెండు వర్గాల ప్రభావం స్పష్టంగా వుంటుంది.

వీటిలో సంపన్న వర్గం రాజకీయ పార్టీలకు అన్ని రకాల ముడిసరుకును సరఫరా చేస్తుంది. నిధుల నుంచి నాయకుల దాకా ఈ వర్గం నుంచి రావాల్సిందే. మరో వర్గం సామాన్య జనం. ఆ వర్గం ఓట్లు వేస్తే తప్ప అధికారం సాధ్యపడదు. కాబట్టి రాజకీయ పార్టీలు రెండు వర్గాలనూ సంతృప్తి పరిచే ప్రయత్నం చేస్తాయి. ఇటు కర్ర విరుగకుండా అటు పాము చావకుండా జాగ్రత్త పడుతుంటాయి. ఏదో చేస్తామనే హామీలిచ్చి తమ బతుకులు బాగుపడతాయన్న భ్రాంతిని పేదల్లో కలిగించడం ఏదీ చేయకుండా ఎప్పటిలాగే సంపన్న వర్గాలకు సహకరించి వారి మెప్పును పొందడం భారత రాజకీయ పార్టీలకు అలవాటయిపోయింది. బలహీన వర్గాలు, దళితులకు కల్పించిన రిజర్వేషన్లు ఇందుకు చక్కని తార్కాణం.

## 12.11 రాజకీయ ప్రక్రియ : ఒక పరిశీలన

రాజకీయ ప్రక్రియ ఫలవంతం కావడానికి ఎంత తతంగం వుంటుందో రిజర్వేషన్ల విధానాన్ని పరిశీలిస్తే అర్థం అవుతుంది.

స్వాతంత్ర్యం తరువాత పాలకులు కొన్ని వర్గాలకు ప్రత్యేక ప్రోత్సాహం అవసరమని భావించారు. చారిత్రకంగా వివిధ కారణాలవల్ల కొనసాగుతూ వస్తోన్న అసమానతలు పోగొట్టి అందరికీ అభివృద్ధి ఫలాలను అందించాలన్న లక్ష్యంతో ఈ వర్గాలకు కొన్ని ప్రత్యేక సౌకర్యాలు కల్పించవలసిన అవసరం ఏర్పడింది. దీనికోసం రాజ్యాంగంలో ప్రత్యేక ప్రస్తావన కూడా పొందుపరిచి దానికి అనుగుణంగా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. అదొక రాజకీయ ప్రక్రియ.

రిజర్వేషన్లు అంటే ప్రత్యేక సౌకర్యాలు కేటాయించడం. లేదా అవకాశాలను సమకూర్చడంలో చేయూత నివ్వడం. మరో రకంగా చెప్పాలంటే కొన్ని అవకాశాలను కొంత మందికోసం కొన్ని వర్గాలకోసం ప్రత్యేకించడం.

భారతీయ సమాజంలో మత, కుల వ్యవస్థల మూలంగా అనేక అసమానతలున్నాయి. సాంఘిక , ఆర్థిక, సాంస్కృతిక విలువలు, జీవన విధానంలో వున్న ఈ వైరుధ్యాలు అనేక సందర్భాల్లో జాతీయతా భావానికి, జాతీయ సమైక్యతకు భంగకరంగా మారడమే కాక కొందరిలో ఆధిపత్య భావనను మరికొందరిలో న్యూనతాభావాన్ని పెంచుతున్నాయి.

ఈ అసమానతలు తొలగించే ఉద్దేశంతోనే ప్రభుత్వం నిమ్న, బడుగు వర్గాలకు ప్రత్యేక సదుపాయాలు కల్పించింది. మిగతా సమాజంతో సమాన స్థాయిని పొందేందుకు రాజ్యాంగం గుర్తించిన షెడ్యూల్డు కులాలు, తెగలకు, ఇతర వర్గాలకు రిజర్వేషన్లు కల్పించారు.

రిజర్వేషన్ల విధానం బ్రిటిష్ వారి కాలం నుంచే అమలవుతోంది. బడుగు వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం కోసం తొలుత 1919లో బలహీన వర్గాలకు శాసన వ్యవస్థల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం ఒక చట్టం తెచ్చింది. ఆ తరువాత స్వాతంత్ర్యానంతరం భారత ప్రభుత్వం షెడ్యూల్డు కులాలు, తెగల వారికి ఉద్యోగాలలో, ప్రభుత్వ సర్వీసులలో కూడా రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం చేసింది. రాజ్యాంగంలోని 16(4) ప్రకరణం ప్రకారం బడుగు వర్గాల అభివృద్ధికి రిజర్వేషన్లు కల్పించే వీలుంది. ఈ చట్టం ద్వారా కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో షెడ్యూల్డు కులాలకు 15 శాతం, షెడ్యూల్డు తెగల వారికి 7 శాతం ఉద్యోగాలు రిజర్వు చేశారు. ఈ విషయంలో రాజకీయ వర్గాలు

BRAOU

ఎలాంటి వెనుకంజ వేయడానికి అవకాశం లేదు. ఎందుకంటే ఈ కులాలకు రిజర్వేషన్లు రాజ్యాంగం ఇచ్చిన హక్కు.

రిజర్వేషన్ల విధానం తరచుగా వివాదాలకు గురికావడానికి కూడా ప్రభుత్వ విధానాలు, రాజకీయ పార్టీలే కారణం అవుతున్నాయి. రాజ్యాంగం కేవలం ఎస్‌సి, ఎస్‌టిలకే రిజర్వేషన్లు కల్పించినప్పటికీ ఇతర కులాల్లో కూడా వెనుకబడిన తరగతులున్న మాట వాస్తవం. ముఖ్యంగా దేశంలో యాభై శాతానికి పైగా కులాలు సాంఘికంగా కూడా వెనుకబడి వున్నాయి. వాటికి కూడా ప్రత్యేక సౌకర్యాలు లభించాల్సివుంది.

ఎస్‌సి, ఎస్‌టిలకు బీసీలకు మధ్య ప్రధాన తేడా అస్పృశ్యత. మొదటి రెండు తరగతుల సాంఘికంగా పీడించబడి, వెలివేయబడి హీనంగా చూడబడిన వర్గాలు. బిసిలకు ఆ పరిస్థితి లేకపోయినప్పటికి ఉత్పత్తులలో సరియైన ప్రాధాన్యత లేక, అభివృద్ధి చెందలేకపోయారు. మిగతా భూస్వామ్య కులాలతో పోల్చితే బిసిలు కూడా ఎంతో వెనుకబడి వున్నారు. ఈ సామాజిక ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు అలాగే కేంద్ర ప్రభుత్వం కూడా కమిటీలు నియమించి సలహాలు, సూచనలు తీసుకుంది. కాకా కాలేల్కర్ కమిషన్ (Kalelkar Commission) మండల్ కమిషన్ (Mandal Commission)లను కేంద్ర ప్రభుత్వం, ముంగేరాలాల్ కమీషన్, రాణే కమిషన్, అనంతరామన్ కమీషన్, మురళీధర రావు కమిషన్ ఇలా వివిధ రాష్ట్రాలు వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు వసరమా? ఏ మేరకు వుండాలి? ఎలా అమలు చేయాలి? ఏయే కులాలకు ఇవి వర్తించాలి అనే అంశాలను పరిశీలించేందుకు కమీషన్లు నియమించాయి. 1970కి ముందు నుంచి జరుగుతున్న ఈ ప్రక్రియ 1995 దాకా సమగ్రరూపం దాల్చక పోవడానికి వెనుక అనేక సామాజిక రాజకీయ కారణాలున్నాయి.

1978లో బీహార్‌లో, 1985లో గుజరాత్‌లో 1986లో ఆంధ్రప్రదేశ్‌లో బి.సి. రిజర్వేషన్లు పెంచారు. ఈ సందర్భంగా ప్రతి రాష్ట్రమూ ఆందోళనలతో అతలాకుతలం అయ్యింది. అగ్రకులాల వారు ఆందోళనలకు దిగడం, రిజర్వేషన్లకు వ్యతిరేకంగా అల్లర్లు చేయడం, హింసకు పాల్పడడం ఒక ఎత్తు కాగా, కోర్టులను ఆశ్రయించడం మరో ఎత్తుగడ అయ్యింది. కేవలం అల్లర్లు, ఉద్రిక్తతలను ఆసరా చేసుకునో, శాంతి భద్రతల పరిస్థితిని దృష్టిలో వుంచుకునే కోర్టులు ఆ ఉత్తర్వులను చెల్లుబాటు కాకుండా చేస్తున్నాయి. పైగా 1960లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రస్తావన ప్రతిసారీ ముందుకు వస్తున్నది. రిజర్వేషన్లు 50 శాతం మించరాదని ఆ తీర్పు సారాంశం. దేశంలో దరిద్రులు, నిరుపేదలు, బడుగు వర్గాలు, ప్రభుత్వం ఆసరా అవసరమైన వారు 80 శాతం వుంటే ఆ ఆసరా 50 శాతం వరకే పరిమితం కావాలనడం హేతుబద్ధమేనా? ఒక సామాజిక ప్రణాళికలో, మెజారిటీ ప్రజానీకం ప్రయోజనం పొందే ఒక రాజకీయ ప్రక్రియలో కోర్టు జోక్యం చేసుకుని పరిమితులు విధించడం రాజ్యాంగ సమ్మతమేనా? అన్నది సామాజిక శాస్త్రవేత్తలు, రాజకీయ పండితులు ఆలోచించాల్సి వుంది.

ప్రజాభిప్రాయంగా చెప్పబడుతున్న మైనారిటీ అభిప్రాయం, ఆందోళనకారుల హింసాత్మక ధోరణి, కోర్టుల వైఖరి ఇవన్నిటినీ చూపించి ప్రభుత్వాలు తమ నిర్ణయాలను, విధానాలను ఉపసంహరించుకోవడం, వెనక్కు తగ్గడం జరుగుతున్నది. అందాయి అనుకున్న ఫలాలు అందకుండానే పోతున్నాయి.

అయినా మండల్ కమీషన్ తరువాత పరిస్థితి మారింది. ఓట్లను, రాజకీయ అవసరాలను దృష్టిలో వుంచుకుని 1990 తరువాత అన్ని పార్టీలూ దళితులపై ప్రత్యేక ప్రేమను ప్రదర్శించడం గమనించదగ్గ విషయం.

మండల్ కమీషన్‌ను కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు కల్పించే విషయం పరిశీలించేందుకు 1970 దశకం చివరలో కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఈ కమిషన్ దేశంలోని వివిధ ప్రాంతాల్లో వెనుకబడిన తరగతుల స్థితిగతులపై అధ్యయనం జరిపి, వారి ఆర్థిక స్థాయిని పరిశీలించి 1980లో ఒక సమగ్ర నివేదిక సమర్పించింది. ఈ నివేదికను ఒక దశాబ్దం దాకా ఎవరూ పట్టించుకోలేదు. 1990లో కేంద్రంలో జనతాదళ్ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ నివేదికలోని కొన్ని భాగాలను ఆమోదిస్తూ ప్రభుత్వ సర్వీసుల్లో బి.సి.లకు 27 శాతం రిజర్వేషన్లు ప్రకటించింది.

ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కొన్ని వర్గాలు ఆందోళనలు చేపట్టాయి. కొందరు 'ఆత్మాహుతి' వంటి దుందుడుకు చర్యలకు పాల్పడ్డారు. ఈ ఆందోళన పర్యవసానంగా సంపన్న వర్గాల మద్దతు జనతాదళ్‌కు దూరమైంది. ఈ విషయం మీదే ఆ పార్టీ ముక్కలైపోయింది. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కొన్ని వర్గాలు ఆందోళనలు చేపట్టాయి. చివరకు ఆ ప్రభుత్వం పతనమైంది. అలజడులు, కోర్టు జోక్యాలు, రాజకీయ ప్రక్రియలను ఎంత నీరుగారుస్తాయో దానినిబట్టి అర్థం చేసుకోవచ్చు.

జనతాదళ్ పతనం తరువాత 1991 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. అయితే అప్పటికే దేశవ్యాప్తంగా బి.సి. లాబీ బలపడడం, ఆ పార్టీలోని బి.సి. నేతల ఒత్తిడి, సమాజంలో వెనుకబడిన తరగతులు ఒక బలమైన శక్తిగా, ఓటు బ్యాంకుగా ఎదగడంతో మండల్ కమీషన్ సూచనలకు కొన్ని సవరణలు చేసి రిజర్వేషన్లు అమలుచేయడానికి ఉత్తర్వు జారీచేసింది. ప్రధాని పి.వి.నరసింహారావు అన్ని వర్గాలకు ఆమోదయోగ్యమైన రీతిలో ఒక కొత్త రిజర్వేషన్ ప్యాకేజీని ప్రకటించారు. 1994 నుంచి కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో కూడా రిజర్వేషన్లు అమలవుతున్నాయి.

రిజర్వేషన్లు అనేవి ఖచ్చితంగా సామాజిక మార్పును వేగవంతం చేసే రాజకీయ ప్రక్రియలో భాగం. రాజ్యాంగం కల్పించిన మార్గదర్శక సూత్రాలకు అనుగుణంగా సమాజంలో వెనుకబడిపోయిన కొన్ని వర్గాల ప్రజలకు చేయూతనివ్వడం రిజర్వేషన్ల పరమావధి. ఈ ప్రయత్నం 1950 నుంచే జరుగుతున్నా ఇది పూర్తవడానికి అనేక అవాంతరాలు వచ్చిపడ్డాయి. ఇప్పుడు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు కేంద్ర సర్వీసుల్లో రిజర్వేషన్లు అమలవుతున్నాయి. శాసన సభల చట్టాల సవరణల ద్వారా కొన్ని రాష్ట్రాల్లో 50 శాతానికి మించి కూడా రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు. రాజకీయ రిజర్వేషన్లవల్ల పాలనా వ్యవహారాలు, విధాన నిర్ణయాల్లో దళితులకు భాగస్వామ్యం లభించింది. అయితే ఈ రకమైన రిజర్వేషన్లు స్థానిక సంస్థల్లో ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు వున్నప్పటికి పార్లమెంటు శాసన సభల్లో కేవలం ఎస్‌సి, ఎస్‌టిలకు మాత్రమే వున్నాయి. రాజకీయ రిజర్వేషన్లవల్ల ఈ వర్గాలు ప్రభావ వర్గాలుగా ఎదిగి తమ సావకాశాలను మెరుగుపరచుకునే అవకాశం వుంది.

BRAOU

ఇవన్నిటికీ మించి 1990 ఉద్యమం తరువాత రిజర్వేషన్లు ఆత్మ గౌరవానికి సంబంధించిన వ్యవహారంగా దళిత వర్గాలు ప్రకటించుకున్నాయి. ఇది దళితులకు కొత్త చైతన్యాన్ని ఆత్మ విశ్వాసాన్నీ ఇచ్చింది. అంతేకాకుండా దళితులకు ఒక కొత్త రాజకీయ చైతన్యాన్ని కూడా సమకూర్చింది. కేంద్ర ప్రభుత్వం కూడా రాజ్యాంగ సవరణ తెచ్చి రిజర్వేషన్లు 50 శాతం మించవచ్చునని ప్రకటించింది.

రిజర్వేషన్లవల్ల అసమానతలు కొంతవరకైనా తొలగిపోయే అవకాశం వుంది. తరతరాలుగా విద్యను, విజ్ఞానాన్ని నిరాకరించబడిన వర్గాలకు విద్యా సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించడం కొత్త చైతన్యానికి దోహదపడింది. విద్యావంతులైన దళిత యువతకు ఉద్యోగావకాశాలు విస్తృతమైనాయి. ఉద్యోగావకాశాలవల్ల సాంప్రదాయ వారసత్వ వృత్తుల నుంచి కొత్త తరాలకు విముక్తి కలిగింది. క్రమక్రమంగా అంటరాని తనం సాంఘిక వివక్ష తొలగిపోతోంది. ఇది దళితుల్లో సామాజిక ఉన్నతికి, ఊర్ధ్వముఖ గతిశీలత కు దారితీసింది. ఉద్యోగ రిజర్వేషన్లవల్ల ప్రభుత్వ పథకాలు, ప్రణాళికలు అన్ని వర్గాలకూ చేరేందుకు వీలు కలిగింది. సమాజ్‌వాది పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీ వంటి పార్టీలు వెనుకబడిన కులాల అధికారమే తమ అంతిమ లక్ష్యంగా ప్రకటించుకున్నాయి. దాంతో తమ తమ పార్టీల్లోని బీసీ, ఎస్సీ, ఎస్టీలను కాపాడుకునేందుకు అన్ని పార్టీలూ దళితుల పట్ల సానుకూల ధోరణి, ప్రేమపూరిత వైఖరిని పెంచుకోవడం గమనార్హం.

ఇది ఎన్నో అవాంతరాలు, అభ్యంతరాలకు సంబంధించిన సమస్యగా కనిపించినప్పటికీ ఇదొక సుదీర్ఘ రాజకీయ ప్రక్రియ. సమాజంలో ఒకరకంగా అనూహ్యమైన మార్పులు తెచ్చిన ప్రక్రియ. కేవలం ఉద్యోగాలకో, విద్యకో సంబంధించిన సమస్యగా మొదలయిన రిజర్వేషన్లు కొత్త వాదనలు, సరికొత్త దృక్పథాల మూలంగా సమిష్టి చైతన్యానికి దోహదపడ్డాయి. సమగ్ర మార్పును తెచ్చాయి.

## 12.12 సారాంశం

మార్పు నిరంతర ప్రక్రియ. ఇప్పటి వరకూ ఉనికిలోకి వచ్చిన ప్రతి సమాజమూ అనేక మార్పులు చేర్పులకు లోనవుతూ పరిణామ క్రమంలోనే ఎదిగాయి. సమాజాలు అంతర్గత శక్తుల చలన శీలతవల్లా, బాహ్య శక్తుల ప్రేరణలవల్ల కూడా మార్పులకు లోనవుతుంటాయి.

ప్రణాళికా బద్ధంగా బాహ్య శక్తుల ప్రేరణవల్ల జరిగే మార్పుల్లో రాజకీయ ప్రక్రియలను ప్రధానంగా చెప్పుకోవచ్చు. రాజకీయ ప్రక్రియలు ప్రజా చైతన్యం, ఉద్యమాల వల్లగానీ, ప్రభావ వర్గాల ప్రేరణ వల్లగానీ ప్రారంభం అవుతాయి. స్వాతంత్ర్యానికి ముందు రాజులు, ప్రభువుల ప్రయోజనాలకోసం సాగిన రాజకీయ ప్రక్రియలు ఆ తరువాత స్వతంత్ర భారతదేశంలో ప్రజాక్షేమం కోసం, ప్రగతిశీల దృక్పథంతో ముందుకు వచ్చినా అంతిమంగా వర్గ ప్రయోజనాలను కాపాడేవిగానే వుంటున్నాయన్న విమర్శ వుంది.

ఏది ఏమయినప్పటికీ ఇప్పటి ఆధునిక ప్రపంచంలో ఈ ప్రణాళికాబద్ధమైన రాజకీయ ప్రక్రియలకు ఎంతో ప్రాధాన్యత వుంది. క్లిష్టమైపోతున్న సామాజిక జీవనంలో అనేక వర్గాల ప్రజలు ఊపిరాడని స్థితిలో వున్నారు. ఏ రాజకీయ ప్రక్రియకైనా సామాజిక దృక్పథం అవసరం. అదే లేకపోతే మార్పు, అభివృద్ధికి అర్థం లేకుండా పోతుంది.

-ఘంటా చక్రపాణి

## 12.13 చదువదగిన గ్రంథాలు


1. Gunnar Myrdal - Asian Drama
2. M.N.Srinivas - Social Change in Modern India.
3. Tarlok Singh - Poverty and Social Change, with a Reapprisal.
4. L.W.Pye and S.Verba (ed) - Political Culture and Political Development.


BRAOU

## 12.14 నమూనా పరీక్షా ప్రశ్నలు

I ఈ క్రింది ప్రశ్నలకు ప్రతిప్రశ్నకు సుమారు 30 పంక్తుల సమాధానం రాయండి.

1. సామాజిక మార్పు అనగా నేమి? మార్పునకు దోహదపడే కారకాలను వివరించండి?
2. రాజకీయ ప్రక్రియలను ప్రేరేపించే వ్యవస్థలను అంశాలను గురించి రాయండి?
3. భారత సమాజంపై రాజకీయ ప్రక్రియల ప్రభావాన్ని విశ్లేషించండి.

II ఈ కింది ప్రశ్నలకు ప్రతి ప్రశ్నకు సుమారు 15 పంక్తులలో సమాధానం రాయండి.

1. ప్రభావ వర్గాలు.
2. రిజర్వేషన్లు – రాజకీయ ప్రక్రియ.
3. ప్రణాళికాయుత మార్పు.

BRAOU

# భాగం 13 : రాజకీయ ఆధునికీకరణ

విషయుక్రమం


13.1 లక్ష్యాలు

13.2 పరిచయం

13.3 ఆధునికీకరణ ఆవిర్భావం

13.4.0 ఆధునికీకరణ లక్షణాలు

13.4.1 ఆధునికీకరణ ఒక విప్లవధోరణి

13.4.2 ఆధునికీకరణ ఒక మిశ్రమ విధానం

13.4.3 ఆధునికీకరణ ఒక వ్యవస్థాపరమైన విధానం

13.4.4 ఆధునికీకరణ సార్వజనీనమైన విధానం

13.4.5 ఆధునికీకరణ సుదీర్ఘమైనటువంటిది

13.4.6 ఆధునికీకరణ దశలవారీగా సంభవిస్తుంది

13.4.7 ఆధునికీకరణ ఏకత్వానికి పాటుపడే విధానం

13.4.8 ఆధునికీకరణ విధానం పురోగామి

13.4.9 ఆధునికీకరణ అభివృద్ధి పూర్వకమైన విధానం

13.5 రాజకీయ ఆధునికీకరణ – పరిశీలనా పద్ధతులు

13.6 రాజకీయ ఆధునికీకరణ – నిర్వచనం

13.7 సిద్ధాంతపర వైఖరులు

13.8.0 రాజకీయ ఆధునికీకరణ – లక్షణాలు

13.8.1 విభేదీకరణ

13.8.2 సమానత్వం

13.8.3 రాజకీయ సామర్థ్యం

13.9 ఆధునికత – సాంప్రదాయాల మధ్య వైరుధ్యం

13.10.0 ఆధునికీకరణను ప్రభావితం చేసే అంశాలు

13.10.1 ప్రాచీనత సాంప్రదాయం

13.10.2 కాలనిర్ణయం

13.10.3 నాయకత్వం

13.10.4 సమస్యలు

13.11.0 ఆధునికీకరణ – నమూనాలు – పద్ధతులు

13.11.1 మేధావుల నాయకత్వం

13.11.2 ప్రాంతీయ అసమానతలు

13.11.3 సిద్ధాంతాల పాత్ర

13.11.4 ప్రభుత్వం పాత్ర

13.12 విమర్శ

13.13 చదువవదగిన పుస్తకాలు

13.14 నమూనా పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 13.1 లక్ష్యాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు

★ ఆధునికీకరణ భావనను అర్థం చేసుకుంటారు.

★ రాజకీయ ఆధునికీకరణ సిద్ధాంతాలను వైఖరులను వివరించగలుగుతారు.

★ రాజకీయ ఆధునికీకరణ నమూనాలు పద్ధతులను వివరిస్తారు.

## 13.2 పరిచయం

ఆధునిక సమాజాల రాజకీయ వ్యవస్థలలో నిర్మాణగతమైన(structural), సాంస్కృతిక మార్పులను రాజకీయ ఆధునికీకరణ సూచిస్తుంది. నేటి రాజకీయ ప్రపంచంలో అభివృద్ధిచెందిన సామాజిక వ్యవస్థల లక్షణాలను, అభివృద్ధి చెందిన సామాజిక వ్యవస్థలు అలవరుచుకోవడం 'రాజకీయ ఆధునికీకరణ' గా పరిగణించడం జరుగుతోంది. సమాజం నుంచి వేరుచేయగల ఉపవ్యవస్థగా రాజకీయ వ్యవస్థ అధికార యుత విధానాన్ని రూపొందించి, దాన్ని అమలు పరచడానికి సంబంధించిన అన్నిరకాల కార్యక్రమాలు, ప్రక్రియలు, సంస్థలు, నమ్మకాలు ఉండి సమష్టి లక్ష్యాలు సాధించడానికి కృషిచేస్తుంది. రాజకీయ నిర్మాణం, రాజకీయ పాత్రలు, అంతః సంబంధాలు, ప్రక్రియలు, నమూనాలు ఉంటాయి. రాజకీయ సంస్కృతి అంటే రాజకీయ వ్యవస్థపట్ల ఉన్న దృక్పథాలు, నమ్మకాలు, విలువలు. మానవుని విజ్ఞానాభివృద్ధి ఫలితంగా సమాజంలోని అన్ని సంస్థలలో వచ్చే మార్పులను ఆధునికీకరణ ప్రక్రియ సూచిస్తుంది. రాజకీయ ఆధునికీకరణ రాజకీయ నిర్మాణాల తేడాలను తెలియజేసే ప్రక్రియను, రాజకీయ సంస్కృతి తాలూకు లౌకికవాదాన్ని తెలియజేస్తుంది. ఒక సమాజం రాజకీయ వ్యవస్థల సామర్థ్యాన్ని, ప్రభావాన్ని సూచిస్తాయి.

BRAOU

## 13.3 ఆధునికీకరణ ఆవిర్భావం

ప్రపంచ దేశాలలో ఆధునికీకరణ చెందినవీ, ఆధునికీకరణ చెందుతున్నవీ, ఆధునికీకరణ చెందనివీ అనే మూడు వర్గాలున్నట్లు తెలుస్తుంది. అయితే అభివృద్ధి, పురోభివృద్ధి, ముందడుగు, నాగరికత, పాశ్చాత్య ప్రభావం, నవీనత, పారిశ్రామికీకరణ మొదలైన భావాలు ''ఆధునికీకరణ'' అన్న భావాన్ని అర్థం చేసుకోవడంలో కొంత ఇబ్బంది కలిగిస్తున్నాయి. ఎందుకంటే ఆధునికీకరణ మానవజాతి చరిత్రలో 16వ శతాబ్దం నుంచి సంభవించిన గణనీయమైన మార్పులన్నింటినీ విచక్షణా దృష్టితోనూ, తులనాత్మక దృష్టితోనూ గ్రహించి విశదీకరించే భావం. ''ఆధునికీకరణ'' అన్న ఈ పదం కేవలం వాడుక భాషలోని పదంగానే చాలారోజులు ప్రచారంలో ఉంది. కానీ 1960 సంవత్సరం నుంచి అమెరికా దేశంలోని సామాజిక శాస్త్ర పరిభాషలో ఈ పదానికి ఒక విశిష్ట స్థానం లభించింది. అప్పటి నుంచి ఆధునికీకరణను సిద్ధాంతీకరించడం ప్రారంభమైంది.

ఆధునికీకరణను శాస్త్రీయ దృక్పథంతో పరిశీలించడం ఇటీవలి కాలంలోనే ప్రారంభమైంది. నిజానికి ఆధునికీకరణ సామ్రాజ్యాలు, వలస విధానం అంతరించడంతోనే మొదలైందని చెప్పవచ్చు. రెండో ప్రపంచ యుద్ధాంతనంతర వలస పాలన నుంచి స్వాతంత్ర్యం సంపాదించుకొన్న ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ఖండాలకు చెందిన దేశాలు అమెరికా దేశపు శాస్త్రజ్ఞులలో కుతూహలాన్ని రేకెత్తించసాగాయి. దీనికి కారణం కొత్తగా స్వేచ్ఛావాయువులు పీల్చుకొంటున్న ఈ దేశాలు తమ దేశాలను అభివృద్ధి చెందిన దేశాలుగా, ఆధునిక దేశాలుగా ఏవిధంగా రూపొందించుకోవాలని ఆలోచిస్తున్న సమయంలో అమెరికాలోని సామాజిక శాస్త్రవేత్తలు మూడో ప్రపంచ దేశాల అన్వేషణకు ఆధునికీకరణ సిద్ధాంతాన్ని ఒక జవాబుగా రూపొందించారు. అమెరికాలోని ప్రభుత్వ, ప్రయివేట్ సంస్థలు

ఈ దేశాల మీద దృష్టి కేంద్రీకరించి వారి ఆర్థిక స్థితిగతులను, రాజకీయ పరిస్థితులను పరిశీలించసాగారు. ఈ దేశాలలోని పాలకులు/ వ్యవహర్తలు తమ దేశాలకు ఉపయోగపడే ఒక సరి అయిన రాజకీయ, ఆర్థిక వ్యవస్థకోసం అన్వేషిస్తున్నట్లు కూడా తెలుస్తున్నది. ఈ అదునుచూసుకొని అమెరికా శాస్త్రజ్ఞులు అమెరికన్ ఆర్థిక, రాజకీయ, సాంఘిక విలువలను, వ్యవస్థలను అభివృద్ధి చెందని దేశాలు, ప్రామాణికంగా పరిగణించవచ్చు అనే భావాన్ని రేకెత్తించారు. ఈ సందర్భంలో అమెరికన్ వ్యవస్థ విలువల ప్రామాణికత మీద అభివృద్ధిచెందని దేశాలు వాటిని అన్వయించుకొనే విధానం మీద అసంఖ్యాకంగా రచనలు వెలువడ్డాయి. డేవిడ్ ఆప్టర్(David Apter), డేనియల్ (Daniel), లెర్నర్ (Lerner), రాబర్ట్ వార్డ్ (Robert Ward), మైరన్ వీనర్ (Myron Weiner), బ్లాక్ (Black), ఐసన్ స్టాడ్ (Eisen Stad), హంటింగ్‌టన్(Huntington), వీచ్ (Weach) మొదలైన శాస్త్రజ్ఞులు అభివృద్ధి చెందని దేశాల మీద చేసిన పరిశోధనలు ప్రశంసించదగినవి. ఆధునికీకరణ సిద్ధాంతాన్ని రూపొందించడంలో ఈ శాస్త్రజ్ఞులు ఎంతో కృషిచేశారు. వీరిలో కొందరు తమతమ దేశాలలోని పాలనా యంత్రాంగంలో కూడా పాల్గొన్నారు.

ఆధునికీకరణ గురించి బెంజమిన్ స్వార్ట్జ్ (Benjamin Schwartz) ''వివిధ మానవ లక్ష్యాల సాధనకోసం మనిషి భౌతిక, సామాజిక పరిస్థితుల వివేచనా పూరిత నియంత్రణకు క్రమబద్ధమైన, ఉద్దేశపూరితమైన మానవ శక్తుల వినియోగం'' అని పేర్కొన్నారు. హంటింగ్ టన్ ప్రకారం ఆధునికీకరణ అంటే ''మానవుని ఆలోచనలలో, కార్యాలలో మార్పుతెచ్చే ప్రక్రియ''.

ఒక ప్రాచీన వ్యవస్థ అధునాతన వ్యవస్థగా రూపొందడం లేదా పరిణతి చెందడమే ఆధునికీకరణ. 'ఆధునికీకరణ' ప్రాచీనతకు ఒక విరుద్ధ భావం లేదా వ్యతిరేక భావం. అంటే అతిసామాన్యమైన ఆర్థిక వ్యవస్థ ఉన్న ప్రాచీన దశ నుంచి, సాంకేతికంగా అభివృద్ధి చెందిన దశను లేదా పారిశ్రామికీకరణ చెందిన దశను సాధించడం. మతతత్వంగల రాజకీయ వ్యవస్థ నుంచి మతతత్వం లేని లౌకిక రాజకీయ వ్యవస్థ దశకు చేరుకోవడం. గ్రామీణ వ్యవస్థగా ఉన్న దశ నుంచి పట్టణ వ్యవస్థ దశకు చేరుకోవడం. ఆసియా ఖండంలోను, ప్రపంచంలోని చాల ఇతర ప్రాంతాలలోను సామాజిక, రాజకీయ, మనోవైజ్ఞానిక మార్పులకు దోహదం చేస్తున్న సంక్లిష్ట ప్రక్రియలను ఆధునికీకరణ అని వ్యవహరిస్తున్నారు. ఈ ఆధునికీకరణ ప్రక్రియలో మారుతున్న సామాజిక, ఆర్థిక చర్యలు కూడా అంతర్భాగంగా ఉన్నాయి. మార్కెట్లకోసం ఉత్పత్తులు, వస్తుమార్పిడి వ్యవస్థ మారిపోయి దాని స్థానంలో ద్రవ్యమార్పిడి వ్యవస్థ అవతరణ, నగరీకరణ వృద్ధిచెందడం, వ్యవసాయేతర ఉపాధి, సాంకేతిక పరిజ్ఞానపు ఉపయోగ విస్తరణ, శ్రమ విభజన, ప్రత్యేకీకరణల పెంపుదల మొదలైనవన్నీ ఇందులో చేరి ఉంటాయి. ఆధునికీకరణ ప్రక్రియలో పాత సామాజిక సంబంధాలు, సంప్రదాయకత సంతరించుకొన్న ఆర్థిక, సామాజిక చర్యలు, పాత వైఖరులు, విలువలు క్రమంగా అంతరించి వాటిస్థానంలో నూతన సామాజిక, మనోవైజ్ఞానిక వైఖరులు ఆవిర్భవిస్తాయి. ఈ మార్పులతోపాటుగా ప్రసార మాధ్యమాల విస్తరణ, విస్తృతమైన నూతన వ్యక్తిత్వాలు, విధేయతలు, రాజకీయ వ్యూహాలు, రాజకీయ భాగస్వామ్యం కూడా స్థానం పొందుతాయి. ఇందులో సుపరిచితమైన నడవడికను, శైలి పాత విలువలలో భంగపాటు సంభవించి వాటిని కించపరచడం కూడా జరుగుతుంది. ఈ విధమైన మార్పులవల్ల కొత్త స్వేచ్ఛ లభించడమేకాక కొత్త అవకాశాలు కూడా అవతరిస్తాయి. వీటితోపాటు సామాజిక జీవనంలో అనిశ్చితాలు, వత్తిడులు, సంఘర్షణలు కూడా ప్రవేశిస్తాయి. వీటిని తట్టుకొనేటందుకు వీలుగా రాజకీయ వ్యవస్థలోని సంస్థలు వ్యవస్థారూపం సంతరించుకోని పక్షంలో అస్థిరత్వం, నిరంకుశత్వం పెరుగుతాయి. నిరంకుశత్వం లేని రాజకీయ వ్యవస్థకోసం రాజకీయ భాగస్వామ్యం, వ్యవస్థ రూపాల మధ్య సమతౌల్యం సాధించాల్సి ఉంటుంది.

BRAOU

## 13.4.0 ఆధునికీకరణ – లక్షణాలు

స్థూలంగా ఆధునికీకరణ అంటే ఒక వ్యవస్థకున్న లక్ష్యాలు, వివిధ రంగాలలో అవి సాధించాల్సిన పరమార్థాలు కొన్ని పరమావధులు. అయితే ఈ ఆధునికీకరణ పద్ధతికి కొన్ని ముఖ్య లక్షణాలున్నాయి. అవి:

### 13.4.1 ఆధునికీకరణ ఒక విప్లవ ధోరణి

ప్రాచీన దశ నుంచి ఆధునిక దశచేరే మధ్య సమాజంలోని సభ్య మానవుల జీవితాలలో సంపూర్ణమైన, సమగ్రమైన మార్పులు సంభవిస్తాయి. ఈ మార్పులు ఎంత విప్లవ ధోరణిలో సంభవించాయో, ఈ మార్పులు అదే ఒరవడిలో అంత సమగ్రంగానూ ఉంటాయి.

### 13.4.2 ఆధునికీకరణ ఒక మిశ్రమ విధానం

మానవ జీవితానికి, ఆలోచనా పరిధికి సంబంధించిన అన్ని రంగాలకు దీనికి సంబంధం ఉంది. పారిశ్రామికీకరణ, పట్టణ వ్యవస్థ విపరీతంగా వృద్ధిచెందడం, సామాజిక చలనం, లౌకిక వ్యవస్థ, రాజకీయాల్లో ప్రజలు పాల్గొనడం - ఇవన్నీ ఆధునికీకరణలోని భాగాలే. ఉదాహరణకు - ఇండియా, నైజీరియా దేశాలు.

### 13.4.3 ఆధునికీకరణ ఒక వ్యవస్థాపరమైన విధానం

ఒక రంగంలో మార్పు ఇతర రంగాలకు తప్పక వ్యాపిస్తుంది. ఎందుకంటే ఒక రాజ్యంలోని వివిధ రంగాల మధ్య అవినాభావ సంబంధముంటుంది. అందుకు కారణం ''చారిత్రకంగా ఈ లక్షణాలు ఒక దానితో ఒకటి పెంపొందించబడ్డాయి'' అని అభిప్రాయం. ఉదాహరణకు - ఫ్రెంచి విప్లవం రాకముందే ఫ్రాన్సులోని రాజకీయ పరిపాలన, సామాజిక వ్యవస్థలలో మార్పులు సంభవిస్తూ వచ్చాయి.

### 13.4.4 ఆధునికీకరణ సార్వజనీనమైన విధానం

BRAOU

ఇది 15, 16 శతాబ్దాలలో యూరప్‌లో మాత్రమే మొదలైంది. ప్రస్తుతం ఇది ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతోంది. ఎప్పుడో ఒకప్పుడు ప్రతిరాజ్యం సనాతనమైందే లేదా ప్రాచీనమైందే. ప్రస్తుతం ప్రతిరాజ్యం అభివృద్ధి చెందినదిగానో చెందుతున్నదిగానో ఉంది. ఒకప్పుడు యూరప్ దేశాలలో మాత్రమే అభివృద్ధి చెందినవి. ఇప్పుడు అన్ని దేశాలు అభివృద్ధి చెందుతున్నాయి.

### 13.4.5 ఆధునికీకరణ సుదీర్ఘమైనటువంటిది

ఇందులో సంభవించే మార్పులు దీర్ఘకాలికమైనవి. సమగ్రమైన ఆధునికీకరణలో వచ్చే స్వరూపాలు విప్లవాత్మకమైనవే కాని అవి కాలక్రమంగా సంభవించేవిగా ఉంటాయి. ఉదాహరణకు ట్యూడర్ రాజుల కాలంలో ఆంగ్లేయులు విద్య ప్రాముఖ్యాన్ని గుర్తించారు. కానీ దేశమంతటా ప్రతివారు విద్యాధికృత సంపాదించడానికి ఒక శతాబ్ద కాలం పట్టింది. అది 1550- 1660 A.D.

### 13.4.6 ఆధునికీకరణ దశలవారీగా సంభవిస్తుంది

ప్రాచీన దశ ప్రథమ దశ అయితే ఈ సోపానంలోని చివరి దశ ఆధునిక దశను చేరుకోవడం. ఈ రెంటికి మధ్య ఉన్నది పరిణామ దశ. వివిధ రాజ్యాలు ప్రాచీన దశ నుంచి ఆధునిక దశ చేరుకొనే మార్గంలో ఎప్పుడు ఎక్కడ ఉన్నాయో దానినిబట్టి అవి లక్ష్యసాధనకు ఇంకా ఎంతదూరంలో ఉన్నాయో, పరిణామ దశలలో మొదట పారిశ్రామికీకరణ తద్వారా పట్టణ వ్యవస్థ పెంపొందడం తరువాత ప్రజాస్వామ్యం బలపడటం, చివరిగా ఆధునికీకరణ చెందడం. ఉదాహరణకు చైనా.

### 13.4.7 ఆధునికీకరణ ఏకత్వానికి తోడ్పడే విధానం

ప్రాచీన రాజ్యాలు వివిధ రకాలు. కానీ ఆధునికీకరణ వివిధ రాజ్యాల మధ్య పరస్పర సంబంధాలను పెంపొందించడమే కాక ఒకరిపై ఒకరు ఆధారపడేటట్లు కూడా చేస్తుంది. ఈ రకమైన అధీనత పరాధీనతకు దారితీయడానికి కాదు. దీనిలక్ష్యం ప్రపంచ వ్యాప్తమైన ఆధునికీకరణ భావాలు, ఆధునిక సమాజాలు ఒకేరకమైన లక్షణాలున్న రాజ్యాలను తయారుచేయవచ్చు. ఆ కారణంగా ఒక దశలో ప్రపంచరాజ్యమే స్థాపించే రోజు రావచ్చు. ఉదాహరణకు ప్రపంచ రాజ్యాల మధ్య సంధానకర్తగా ఐక్యరాజ్య సమితి ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమితి ఆర్థిక సహాయ కార్యక్రమాలు, కాందిశీకుల పునరావాస కార్యక్రమాలు ప్రపంచంలోని వివిధ రాజ్యాలను సంఘటితం చేస్తున్నాయి.

### 13.4.8 ఆధునికీకరణ విధానం పురోగామి

ఆధునికీకరణ విధానం పురోగమనమే కానీ తిరోగమనం ఎరగదు. అంగులో ఉన్న వివిధ పరిణామ దశలలో అప్పుడప్పుడు కొన్ని తప్పటడుగులు తప్పవు. అయితే ఆధునికీకరణ మాత్రం ఎప్పుడూ ముందడుగు వేస్తూనే ఉంటుంది. ఒక దశాబ్దంలో సాధించిన ప్రగతి కంటే (విద్యారంగం, పట్టణాభివృద్ధి, పారిశ్రామికీకరణలలో) తరవాతి దశాబ్దంలో సాధించిన ప్రగతి మునుపటికంటే ఎక్కువగానే ఉండవచ్చు లేదా మార్పేమీ లేకుండాను పోవచ్చు. కానీ ముందుకంటే హీనంగా మాత్రం ఉండదు. ప్రగతిని సాధించడంలో హెచ్చు తగ్గులుండవచ్చునే కానీ ప్రగతి పథంలో మాత్రం మార్పులుండవు. ఆధునికీకరణే వారి పరమావధి. ఉదాహరణకు - చైనాలో మొదటి నుంచి వ్యవసాయ రంగంలో ఎక్కువగా కృషిచేయడం జరిగింది. కానీ ఇప్పుడిప్పుడే వారు పారిశ్రామిక రంగంపట్ల శ్రద్ధ వహించడం ప్రారంభించారు. కానీ గతంలోనూ, ప్రస్తుతంలోనూ వారి దృష్టి మటుకు ఆధునికీకరణమీదనే ఉంది.

### 13.4.9 ఆధునికీకరణ అభివృద్ధి పూర్వకమైన విధానం

BRAOU

పరిణామక్రమంలో ఎన్నో అడ్డంకులుండవచ్చు. ప్రథమ దశలో వ్యయప్రయాసలు కలగవచ్చు. కానీ చివరకు సాధించే ఆధునికీకరణ దశను అభిలషించదగినదిగా పరిగణించడం జరుగుతుంది. దీర్ఘకాలానంతరమే అయినా ఆధునికీకరణ మానవుని సుఖసంతోషాలకు, సంపన్నతకు తోడ్పడుతుంది. ఉదాహరణకు - సోవియట్ రష్యా, చైనాలు మొట్టమొదట చాలా ఇబ్బందులకు, శ్రమకు గురికావాలసి వచ్చింది. దీనికి కారణం వారి ప్రాచీన దశ ఫ్యూడల్ వ్యవస్థ. కానీ గత యాభై సంవత్సరాలు తదేక దృష్టితో వారు చేసిన కృషి, సాధించిన ప్రగతి ప్రశంసనీయమైనవి.

## 13.5 రాజకీయ ఆధునికీకరణ : పరిశీలనా పద్ధతులు

ఆధునికీకరణలో రాజకీయ మార్పులు, రాజకీయ వికాసం అత్యంత ప్రాధాన్యంగల అంశాలు. రాజకీయ ఆధునికీకరణ లక్ష్యం నేటి ప్రభుత్వాలపై నిరంతరంగా ప్రజల నుంచి, దేశం వెలుపల నుంచి వచ్చే వివిధ కోరికలు, వత్తిడులను తట్టుకోవడం కోసం అవసరమైన సరళత్వం, సామర్థ్యం ఉన్న ఒక రాజకీయ వ్యవస్థను నెలకొల్పడం. సంక్షిప్తంగా చెప్పాలంటే అనేకమైన క్లిష్ట సమస్యలను ఎదుర్కొనే సామర్థ్యంగల రాజకీయ యంత్రాంగం అత్యంతావశ్యకం. రాజకీయ వ్యవస్థ శక్తిమంతమైనప్పుడు ఆధునికీకరణలో ఉప్పెనలా వచ్చే మార్పులకు తావిచ్చి ప్రజాజీవితాలను సుఖమయం చేయగలుగుతుంది. రాజకీయ ఆధునికీకరణకు అభివృద్ధితో కూడా అవినాభావ సంబంధం ఉంటుంది. ఎందుకంటే ప్రభుత్వం సమర్థతతో తన విధులను నిర్వహించినప్పుడే ఆర్థిక, మానసిక, సాంస్కృతికాభివృద్ధి సాధ్యమవుతుంది.

అయితే రాజకీయ ఆధునికీకరణను మూడు కోణాల నుంచి పరిశీలించవచ్చు. అవి: (1) చారిత్రక పరిశీలన, (2) టైపాలాజికల్(Typological) పరిశీలన, (3) పరిణామ పరిశీలన (evolutionary).

పదహారో శతాబ్దం నుంచి ప్రపంచంలో ప్రబలిన ఆధునిక ధోరణులవల్ల కొన్ని రాజకీయ వ్యవస్థలలో సమగ్రమైన మార్పులు సంభవించాయి. రాజకీయ నిర్మాణం, లౌకిక వాదం, పారిశ్రామికీకరణ, విద్యావ్యాప్తి, సామాజిక గమనశీలత (social mobility), జీవన ప్రమాణాలస్థాయి పెరగడం, జాతీయ సమైక్యత, ప్రజల భాగస్వామ్యం పెరగడం మొదలైన అంశాలు సంస్కృతిని ప్రభావితం చేస్తాయి. అయితే ఈ మార్పు మొట్టమొదటగా పశ్చిమ ఐరోపాలో ప్రారంభమై క్రమంగా ప్రపంచమంతా వ్యాపించింది. కానీ ఈ వ్యాప్తి అసంపూర్ణంగా ఉంది. సాంప్రదాయిక రాజకీయ సమాజం లేదా ప్రాచీన వ్యవస్థ నుంచి ఎట్లా ఆధునిక రాజకీయ వ్యవస్థగా మార్పు చెందిందో తెలియజేస్తుంది. రాజకీయ వ్యవస్థలోని సంస్థలు నిత్యం ఎదుర్కొనే కొత్త సమస్యలను పరిష్కరించడానికి అనువుగా వాటి నిర్మాణాలను వృద్ధిచేస్తూ, నిరంతర మార్పును జీర్ణించుకొంటూ నూతన సామాజిక లక్ష్యాలు సాధించడానికి కావలసిన శక్తి సామర్థ్యాలను కాలక్రమంగా పెంపొందించుకోవాలి.

చారిత్రక, టైపాలాజికల్ కారణాలలో/దృక్పథాలలో రాజకీయ ఆధునికీకరణ అంటే ఆధునిక రాజకీయ వ్యవస్థ (modern Polity) సాధనకోసం జరిగే ప్రక్రియ. పరిణామ దృక్పథంలో రాజ్య వ్యవహారాలు అనిశ్చితం. వృద్ధి (growth) అంతంలేని ప్రక్రియ.

## 13.6 రాజకీయ ఆధునికీకరణ నిర్వచనం

రాజకీయ ఆధునికీకరణ అనే పదాన్ని నిర్దిష్టంగా నిర్వచించడం కష్టం. అయినప్పటికీ క్లాడ్ ఇ. విల్చ్(Claude E.Welch J.R.) జూనియర్ ప్రకారం రాజకీయ ఆధునికీకరణ అంటే ''ఆధునిక సమాజ స్థాపన అనే లక్ష్యాన్ని సాధించడానికి వనరులను హేతుబద్ధంగా ఉపయోగించే ప్రక్రియ.'' (The process based upon the rational utilisation of resources and aimed at the establishment of modern society). హంటింగ్‌టన్ అభిప్రాయంలో ''ప్రాచీన దశలో ఉన్న మత, కుటుంబ, రాజకీయ సంబంధమైన అధికారాలనన్నింటినీ తొలగించి మతతత్వంలేని, జాతి వివక్షణలేని లౌకిక విధానాన్ని అధికారంలోకి తెచ్చుకోవడమే'' రాజకీయ ఆధునికీకరణ.

(2) రాజ్యంలో రాజకీయ, న్యాయపాలన, సైనిక/రక్షణ సంబంధమైన విషయాలను నిర్వర్తించడానికి పరిపాలనా వ్యవస్థ కొత్తరూపు సంతరించుకోవడం. ఉదా.కు అమెరికా సంయుక్త రాష్ట్రాలు.

(3) రాజకీయ వ్యవహారాలలో సమాజంలోని వివిధ వర్గాలకు చెందిన వారు జోక్యం చేసుకోవడం, ప్రభావ వర్గాల ద్వారా రాజకీయాల్లో ఉత్సాహంగా పాల్గొనడం. ఉదా.కు జపాన్.

హంటింగ్‌టన్ రాజకీయ ఆధునికీకరణను బహుముఖ ప్రక్రియగా వివరించాడు. మానవుని ఆలోచనలు, చర్యలు అన్నింటిలో మార్పు తీసుకొని వచ్చే ప్రక్రియగా పేర్కొన్నాడు. రాజకీయ ఆధునికీకరణ ప్రధానంగా రాజకీయాల పరిధికి సంబంధించినదైనప్పటికీ ఆర్థిక, సామాజిక, మనస్తత్వశాస్త్రాలను కూడా పరిగణనలోకి తీసుకొంటుంది. ఆధునికీకరణ ఫలితంగా రాజకీయ సంస్థలలో, రాజకీయ సంస్కృతిలో వచ్చే మార్పులను రాజకీయ ఆధునికీకరణ సూచిస్తుంది. కాబట్టి రాజకీయ ఆధునికీకరణ అనే భావనకు అనేక రూపాలుంటాయి. ఆధునిక కాలంలో ఐరోపా రాజ్యాలలో వచ్చిన రాజకీయ మార్పులను ఆ తరవాత ప్రపంచ రాజ్యాలలో వస్తున్న రాజకీయ మార్పులను రాజకీయ ఆధునికీకరణ అనే భావనను సూచిస్తాయి. పై(Pye) ఈ మార్పులను ఈ విధంగా వివరించాడు. (1) సమానత్వం పట్ల ఉన్న సాధారణ దృక్పథం. ఇది రాజకీయాలలో పాల్గొనడానికి, ప్రభుత్వ పదవులకు పోటీ పడటానికి సమాన అవకాశం కల్పిస్తుంది. (2) విధానాలను రూపొందించడం, అమలుపరచడంలో రాజకీయ వ్యవస్థ సామర్థ్యం (3) సమగ్రతకు భంగం కలగకుండా రాజకీయ కార్యకలాపాల ప్రత్యేకీకరణ, (4) రాజకీయాలను మత ప్రభావం నుంచి వేరుచేయడం లేదా లౌకికవాద ప్రక్రియ. ఏది ఏమైనప్పటికీ ఆధునికీకరణ ప్రక్రియవల్ల ఉత్పన్నమయ్యే సవాళ్ళను ఎదుర్కొంటూ సమస్యలను పరిష్కరించగల సామర్థ్యాన్ని రాజకీయ వ్యవస్థ సంతరించుకొనడాన్ని రాజకీయ ఆధునికీకరణ సూచిస్తుంది.

BRAOU

## 13.7 సిద్ధాంతపర వైఖరులు (Theoritical Approaches)

సంక్లిష్ట ఆధునిక రాజకీయ వ్యవస్థ లక్షణాలను మూడు రూపాలలో వివరించవచ్చు. అవి (1) వర్ణనాత్మక లక్ష్య జాబితాలు (Discriptive trait list), (2) రిడక్షనిస్టు పద్ధతి, (3) ఆదర్శవాద పద్ధతి. అనేక అధ్యయనాలు ఈ మూడు వైఖరులను వివిధ మార్గాలలో మేళవించారు.

*(1) వర్ణనాత్మక జాబితా పద్ధతి:* ఈ వైఖరి సమకాలీన రాజకీయ వ్యవస్థల ముఖ్య నిర్మాణం, సాంస్కృతిక లక్షణాలతో గుర్తించబడింది. కమ్యూనికేషన్ సమావేశం (1963), రాజకీయ ఆధునికీకరణ సమావేశం (1964), ఆల్మండ్ అండ్ కోలెమన్ (1960), బ్లాక్ (1962), ఐసన్‌స్టాడ్స్ (1964), మొదలైనవారు సమకాలీన రాజకీయ వ్యవస్థలను ఆధునిక రాజకీయ వ్యవస్థలుగా పరిగణించారు. వీరి ప్రయత్నాలు విమర్శలకు గురి అయ్యాయి. దీనికి కారణం స్వతంత్రంగా ఉండే కొన్ని లక్షణాలను ఇతర లక్షణాలతో వీరు కలపడం. ఉదా. కు హాల్ట్ కె. టర్నర్ (1966).

*(2) రిడక్షనిస్ట్ అప్రోచ్:* ఈ వైఖరి ఒకే ఒక కారకానికి (factor) ప్రాముఖ్యమిస్తుంది. ఆధునికీకరణ అతిప్రధాన లక్షణంగా రాజకీయ ఆధునికీకతను సూచిస్తుంది. లేదా ఆధునికీకరణను నిర్ణయించే సూచికగా పేర్కొంటుంది. సమర్థత అనే భావాలను కలుపుకొని ఏక లక్షణాలు ప్రకటితం చేయడం జరిగింది.(Brezesinski 1956, Hold and Turner 1966, Almond 1965, Riggs 1963, Huntington 1965 etc.). రిడక్టివ్ ప్రయత్నాలు బహుళ చలాంకాల కారణత్వాన్ని (multivariable Causation) ఉపేక్షించాయని అర్థం కాదు. ఈ ప్రయత్నాలు ఆధునికీకరణ అనే ఏకైక సమగ్ర భావనకోసం జరిపిన నిరంతర కృషిలోగానీ, గతంలో ఉపేక్షించిన లేదా తక్కువ ప్రాముఖ్య మిచ్చిన కారకాన్ని ప్రకాశవంతం చేయాలన్న కోరికలోకానీ ప్రతిబింబించవు.

*3. ఐడియల్ టైప్ అప్రోచ్:* ఆధునిక రాజకీయ వ్యవస్థ రాజకీయ ఆధునికీకరణ ప్రక్రియలను సిద్ధాంతీకరించడంలో ఈ వైఖరి స్పష్టమైంది కాదు. సంపూర్ణము, దృఢమూ అయింది కాదు. ఆధునిక రాజకీయ వ్యవస్థ వివరణాత్మక లక్షణ జాబితాలే ఐడియల్ టైప్ అవుతుంది. ఎందుకంటే ఆధునిక రాజకీయ వ్యవస్థ అనే భావమే ఐడియల్ టైప్ భావాన్ని సూచిస్తుంది. సాంప్రదాయిక రాజకీయ వ్యవస్థ దీనికి వ్యతిరేకమైంది. ఉదాహరణకు - వ్యావసాయిక, పారిశ్రామిక, సాంప్రదాయిక, ఆధునిక - రాజకీయ ఆధునికీకరణ కొనసాగింపులో మధ్యలో వచ్చే నమూనాగా సంధికాల వ్యవస్థ (transitional Polity)ని పేర్కొనవచ్చు. సాంప్రదాయిక వ్యవస్థ నుంచి ఆధునిక వ్యవస్థకు చేరుకోవడానికి రాజకీయ ఆధునికీకరణను ఒక ఉద్యమ ప్రక్రియగా చూడటం జరిగింది.

BRAOU

## 13.8.0 రాజకీయ ఆధునికీకరణ – లక్షణాలు:

ఆధునికీకరణ, వికాసం(development) పై పెరుగుతున్న సాహిత్యం ఆధారంగా ఆధునిక రాజకీయ వ్యవస్థ రాజకీయ ఆధునికీకరణకు మూడు ప్రధాన లక్షణాలున్నాయని చెప్పవచ్చు. అవి: (1) విభేదీకరణ, (2) సమానత్వం, (3) రాజకీయ సామర్థ్యం.

### 13.8.1 విభేదీకరణ:

విభేదీకరణ ప్రక్రియ రాజకీయ వ్యవస్థ వికాసంలో సంఘాలు(associations), సంస్థలు (Institutions), వాటి పాత్రల ప్రగతిశీల వేర్పాటు, ప్రత్యేకతను సూచిస్తుంది. అంటే రాజకీయ వ్యవస్థలో రాజకీయ సంస్థలు ఏర్పడి వివిధ లక్ష్యాలు సాధించడానికి కృషిచేస్తూ వాటి కార్యనిర్వహణలో ప్రత్యేకతను సంతరించుకొంటాయి. సామాజిక స్థిరీకరణ దీనిలో భాగంగా జరిగి బంధుత్వం, కుటుంబ జీవితాల నుంచి వృత్తిపరమైన పాత్రలు వేరుచేయబడి పరిణామ

సార్వజనీనత ఏర్పడి; మతం నుంచి సార్వజనిక న్యాయసూత్రాలు, మతం, సిద్ధాంతం వేరుచేయబడి పాలనా నిర్మాణం, ప్రజల రాజకీయ పోటీ మధ్య విభేదీకరణ జరిగి ఒక సమైక్య వ్యవస్థగా ఏర్పడుతుంది. విభేదీకరణ పరిపాలన, రాజకీయ విభాగాలలో, విధి నిర్వహణలో అధిక ప్రత్యేకీకరణను. నిర్మాణగతమైన సంక్లిష్టత(structural complexity), ఒకరిపై ఒకరు ఆధారపడటం రాజకీయ నిర్వహణ సామర్థ్యాన్ని సూచిస్తుంది.

## 13.8.2 సమానత్వం

సమానత సాధించడం ఆధునిక రాజ్యం ప్రథమ కర్తవ్యం. ఇది వయోజనులైన వ్యక్తులందరికీ పౌరసత్వం లభించడం ద్వారాను, వారు తమ హక్కులను, బాధ్యతలను సమానంగా పాలుపంచుకోవడం ద్వారాను, న్యాయ సంబంధమైన వ్యవహారాలలో ప్రభుత్వం పౌరులందరినీ సమదృష్టితో చూడటం ద్వారాను సాధించవచ్చు. ఆధునికీకరణ చేపట్టే ప్రతిదేశంలోను సమానతను సంపూర్ణంగా సాధించలేకపోవచ్చుగాని సమానతను సాధించడానికి కృషిమాత్రం నిరంతరం జరుగుతూనే ఉంటుంది. రాజకీయ వ్యవహారాలలో ప్రజలు తరుచు పాల్గొనడం, ఎక్కువ సంఖ్యలో వారు రాజ్య విషయాలలో జోక్యం చేసుకోవడం రాజకీయ ఆధునికీకరణకు చాలా ముఖ్యం.

## 13.8.3 రాజకీయ సామర్థ్యం

రాజ్యంలోని కార్యనిర్వాహక సంస్థలకు ప్రభుత్వపాలనలో శక్తి సామర్థ్యాలుండటం రాజకీయ ఆధునికీకరణకు ఎంతో అవసరం. ఈ శక్తి సామర్థ్యాలు పాలనా సంస్థలు చేపట్టే కార్యక్రమాల పరిధిని బట్టి, తమ కార్యసాధనకోసం తీసుకొనే నిర్ణయాలను బట్టి, వాటిని అమలుచేసే విధానాన్ని బట్టి, నిర్ణయించడం జరుగుతుంది. రాజకీయ ఆధునికీకరణలో ప్రభుత్వం కేంద్రీకరణం చెంది, నిత్యం పెరిగే ప్రజల అవసరాలను గుర్తించి వాటిని తీర్చగలిగి ఉండటం అతిముఖ్యం. వత్తిడులకు లొంగి గద్దెదిగే ప్రభుత్వానికి శక్తి సామర్థ్యాలు లేనట్లే. సమానతను పెంచడం, సమైక్యతను సాధించడం రెండూ కూడా రాజ్యంలోని సంస్థల శక్తియుక్తులకు సవాలు వంటిదే.

BRAOU

ఇవికాక ప్రజాస్వామ్యం, జాతీయతా భావం కూడా రాజకీయ ఆధునికీకరణ లక్షణాలుగా పరిగణింపబడుతున్నాయి. ప్రజాస్వామ్యం కారణంగా వ్యవస్థలకు నూతనత్వం శక్తిసామర్థ్యాలు త్వరితంగా పెంపొందించుకొనే అవకాశాలుంటాయి. అనేక మంది శాస్త్ర వేత్తలు జాతీయతకు ప్రాముఖ్యమిచ్చారు. జాతి పురోగతికి, జాతీయతా భావానికి, రాజకీయ ఆధునికీకరణకు చాలా దగ్గరి సంబంధం ఉంది. ఎందుకంటే ఏ జాతి అయితే అన్ని రంగాలలోను ప్రగతి సాధిస్తుందో ఆ జాతి అధునాతనంగా ఉన్నట్లు అంచనా. ఈ జాతీయతా భావానికి అంతర్జాతీయ గుర్తింపు, అంతర్జాతీయ న్యాయశాస్త్రం మద్దతు కూడా లభిస్తున్నాయి.

రాజకీయ ఆధునికీకరణకు మరికొన్ని ముఖ్య లక్షణాలున్నాయి. అవి:

(i) సాంప్రదాయిక అధికార సంస్థలు క్షీణించి రాజ్యంలో అధికారం కేంద్రీకృతమై ఉండటం.

(ii) రాజకీయ సంస్థలు వివిధ రకాలుగా ఇనుమడింపజేయడం, రాజకీయ సంస్థల ప్రత్యేకీకరణ.

(iii) రాజకీయాలలో ప్రజలు ఎక్కువగా పాల్గొనటం, వ్యక్తులు ఎక్కువగా తమ రాజకీయ వ్యవస్థ మొత్తంతో తాదాత్మ్యం పొందడం.

రాజకీయ అధికారం ఉనికిలో ఆకస్మిక మార్పులు రావడం రాజకీయ ఆధునికీకరణలోని ప్రధానమైన అంశం. ప్రాచీన సాంప్రదాయిక చిహ్నాలయిన ఆదిమ జాతులు, తెగల నాయకులు, రాజులు, నవాబులు మొదలైన వారందరు వారి వారి అధికారాలను క్రమంగా కోల్పోయారు. హంటింగ్ టన్ అభిప్రాయంలో రాజకీయ ఆధునికీకరణకు ఫలితంగా కుల, మత, నరవర్గ సంబంధమైన అధికారాలు, సాంప్రదాయిక కుటుంబాభిమానం మొదలైన సాంప్రదాయిక

కుటుంబాభిమానం మొదలైన సాంప్రదాయిక సంస్థలు, భావాలు అన్నీ అంతమయి అధునికమైన ఏకైక లౌకిక, జాతీయ రాజకీయాధికారం ఏర్పడుతుంది.

అధునికీకరించిన రాజకీయ వ్యవస్థ అతిక్లిష్టంగా రూపొందుతుంది. రాజకీయ ఆధునికీకరణవల్ల పరిపాలనలో సరైన నిర్ణయాలు త్వరగా తీసుకొనే పాలనా నైపుణ్యం పెరుగుతుంది. సమాజంలోని క్లిష్ట సమస్యలను ఎదుర్కోవడం కోసం రాజకీయ వ్యవస్థలో రాజకీయ సంస్థలు అత్యధికంగా ఇనుమడిస్తాయి. ఒక్కొక్క విధిని ఒక్కొక్క సంస్థ నిర్వహిస్తుంది. ఉదా. అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని ప్రభుత్వం నిర్వహించే వివిధ గురుతర బాధ్యతలను ఆఫ్రికాలో ఒక ఆదిమజాతి నాయకుడు నిర్వర్తించే రాజకీయ విధులతో పోల్చిన పై విషయం ద్యోతకమవుతుంది.

రాజకీయాలలో ప్రజలు ఎక్కువగా పాల్గొనడం అనే లక్ష్యాన్ని సాధించడం అతికష్టమైనపని అని చెప్పవచ్చు. దీనిలో ప్రజా వైఖరులను మార్చడం రాజకీయ భాగస్వామ్యం స్వభావాన్ని మార్చడం అతికష్టమైంది. ప్రజలకు చాలా రాజకీయ పరిజ్ఞానం ఉండి జాతీయ రాజకీయాలలో అధికంగా పాల్గొనడం ఆధునిక సమాజలక్షణం. ఇది ఒక సాంప్రదాయిక సమాజంలో జరగదు. సమాజాలలో రాజకీయ పార్టీలు, ప్రభావ వర్గాలు వృద్ధిచెందడంతో రాజకీయ భాగస్వామ్యం బాగా పెంపొందుతుందని చెప్పవచ్చు. సాంప్రదాయికమైన సామాజిక సంస్థలు, కులం, మతం, జాతి, తెగ మొదలైన వర్గాలనన్నింటినీ ఆధునికీకరించి రాజకీయ భాగస్వామ్యానికి తగిన సాధనాలుగా మార్చవచ్చు. దీని పర్యవసానంగా సమాజంలోని ప్రజలందరూ తమ దేశం పట్ల అభిమానం చూపడం, దేశ సమగ్రత, సంస్కృతి, జాతీయ భావంతో తాదాత్మ్యం పొందడం.తద్వారా సాంప్రదాయిక సాంఘిక ఆచారాలు, సంస్థలు బలహీనపడటం రాజకీయ ఆధునికీకరణ ఫలితంగా ఏర్పడే పర్యవసానం.

అయినా సాధారణంగా మూడో ప్రపంచ రాజ్యాలలో మాత్రం రాజకీయ భాగస్వామ్యం అత్యధికంగా ఉండి దానితోపాటు రాజకీయ అస్థిరత వాటిల్లే ప్రమాదం కూడా ఉంటుంది. ప్రజలు ఎక్కువ సంఖ్యలో రాజకీయాలలో పాల్గొన్నప్పుడు తప్పనిసరిగా జనించే ప్రజల కోరికలను(demands) ప్రభుత్వం తీరుస్తూ ఉండాలి. అట్లాచేయడంవల్ల రాజకీయ ఆధునికీకరణ సంఘంలో సునాయాసంగా సాగుతుంది. సిడ్నీ వెర్బ్ కింది విధంగా వ్యాఖ్యానించారు:

''ఇటీవలే అవతరించిన స్వతంత్రరాజ్యాలలోని పౌరులు వారివారి వ్యవస్థలలో భాగస్వాములనే ఏకతా బావం రానంతవరకు ఆదేశాలలో మార్పు ఒక క్రమపద్ధతిలో రాలేదు''. రాజకీయ ఆధునికీకరణ ఒక క్రమపద్ధతిలో రావాలంటే ప్రజల మానసిక వైఖరిలో, వారి అభిప్రాయాలలో వారి సాంప్రదాయిక సాంఘిక జీవితంలో, రాజకీయ కార్యకలాపాలలో మార్పువచ్చితీరాలి.

## 13.9 ఆధునికత – సంప్రదాయాల మధ్య వైరుధ్యం

ఇరవయ్యో శతాబ్దంలో అతి త్వరితంగా వస్తున్న సామాజిక రాజకీయ మార్పులను విశ్లేషించడంలో సంప్రదాయానికి, ఆధునికతకు మధ్య అపరిమితమైన అగాధమున్నట్లు భావించడం జరుగుతోంది.

ఆధునికత, సంప్రదాయం రెండు విరుద్ధమైనవనే భావన సాంప్రదాయిక సమాజాలలో ఉండే సంప్రదాయాన్ని ఆధునిక సమాజంలో ఉండే ఆధునికతను అపార్థం చేసుకోవడంతోపాటు ఆ రెండింటికి మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని సరిగా అవగాహన చేసుకోకపోవడం నుంచి ఉత్పన్నమైంది. ఐరోపా, అమెరికా ఖండాల సంపన్న దేశాలను దృష్టిలో ఉంచుకొని ఆధునిక సమాజభావాన్ని రూపొందించి దానితో ఆసియా, ఆఫ్రికా ఖండాలలోని సాంప్రదాయిక సమాజాలను పోల్చడం సమంజసం కాదు.

రాజకీయ ఆధునికీకరణకు, సాంప్రదాయిక వైఖరులు, ఆచార వ్యవహారాలు అడ్డుగా నిలిచినప్పుడు వాటిని మార్చడానికి రెండు మార్గాలున్నాయి. అవి:

BRAOU

(1) సాంప్రదాయిక ఆదిమ సంకుచితాభిమానాలైన కుల, మత, వర్గ వైషమ్యాలను ప్రభుత్వం శాసనాల ద్వారా (ఏకపక్ష ప్రభుత్వాలున్న ఆఫ్రికన్ రాజ్యాలలో జరిగినట్లు) వీటిని నిరోధించి వీలైనంత త్వరలో జాతీయ సమైక్యతను నెలకొల్పడం.

(2) పాతకాలపు ఆచార వ్యవహారాలలోని అనుకూల అంశాలను సద్వినియోగపరుస్తూ వాటిని క్రమంగా మార్చడం.

పై రెండింటిలో మొదటి పద్ధతిలో సంప్రదాయమనే ప్రగతి నిరోధక శక్తిపై యుద్ధం ప్రకటించడం. రెండో పద్ధతిలో సంప్రదాయానికి కొద్దిగా తావిస్తూ క్రమంగా దానిని పూర్తిగా సంస్కరించడం.

మూడో ప్రపంచ దేశాలలో రాజకీయ నాయకత్వం పనికిరాని పాత మూఢాచారాలపై యుద్ధం సలుపుతున్నా వాటిని నిర్మూలించడం అంత తొందరగాను, సులభంగాను అయ్యేపనికాదు. దానికి కారణం సాంఘిక విశ్వాసాలు, ఆచారాలు మనుషుల్లో లోతుగా పాతుకొని పొయ్యాయి. అవి వారి దైనందిన జీవితంలోని అన్ని సందర్భాలలోను ఆవహించి ఉన్నాయి. ఇవి రాజకీయ ఆధునికీకరణకు ఒక అగ్ని పరీక్ష వంటివి. ఆసియా, ఆఫ్రికా ఖండాలలో కొత్తగా ఏర్పడిన రాజ్యాలలో సంప్రదాయంవల్ల ఉత్పన్నమైన సమస్యలు – అంటే విశాలమైన జాతీయతా భావానికి, సంకుచితమైన కుల, మత, వర్గ భావాలకు మధ్య జరుగుతున్న పోరాటం రాజకీయ ఆధునికీకరణ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. ఒక ఫ్రెంచ్ సామాజిక శాస్త్రవేత్త గస్టావ్ బి.లెబాన్ పై సమస్యను ఈ విధంగా వర్ణించాడు:

''ప్రజలు ఒక సంప్రదాయాన్ని గౌరవించడం వారి జీవిత మనుగడకు సంబంధించిన విషయం; కానీ దాని నుంచి ఎట్లా విముక్తి పొందాలో తెలుసుకోవడం పురోగతి నియమం.''

ముస్లిం దేశాలలో సంప్రదాయం నుంచి విముక్తి పొందడం అంటే ఇస్లాం మతానికి, సంఘానికి మధ్య సంబంధాన్ని నిరంతరంగా పునర్నిర్వచించడమని రిచర్డ్ హెచ్.పాప్ అనే రాజనీతి శాస్త్రజ్ఞుడు అన్నాడు.'' ఇట్లా మతాన్ని పునర్నిర్వచించడం ఆ మతాన్ని ఆధునికీకరించడమే అవుతుంది. దీని పర్యవసానంగా ఇస్లాం మతాన్ని రాజ్యం అధీనంలోకి తీసుకొచ్చి ఒక నవీన లౌకిక జాతీయతా దృక్పథాన్ని మహమ్మదీయులు వృద్ధిచేసుకోవాలి అని రిచర్డ్ పాప్ అన్నారు.

BRAOU

సాంప్రదాయికత నుంచి విముక్తి పొందడం అంటే పాత సాంఘిక సంస్థలను పూర్తిగా తుదముట్టించడం అనికాదు. ఎట్లా అంటే సంపన్న ఆధునిక సమాజాలలో కూడా మనకు సంప్రదాయానికి చిహ్నమైన సంకుచితాభిమానాలు కొద్దిగా కనబడతాయి. సామాజిక శాస్త్రజ్ఞులు తాము పాశ్చాత్య ఆధునిక సమాజాలలో జరిపిన పరిశోధనా ఫలితాలను చూస్తే మనకిది స్పష్టమవుతుంది. అమెరికా రాజకీయ ప్రవర్తనపై జరిగిన పరిశోధనలు సాంప్రదాయిక శక్తులు ఇంకా సజీవంగా ఉన్నాయని తెలిపాయి. స్థానిక తత్వం, నరవర్గతత్వం(ethnicity) మొదలైన సంకుచితాభిమానాల ప్రమేయం అమెరికా రాజకీయాల్లో కొద్దిగా ఉందని పరిశోధనలు సూచిస్తున్నాయి. కొన్ని సందర్భాలలో సాంప్రదాయిక భావాలను సమాజ నిర్మాణ, జాతి నిర్మాణ కార్యక్రమాలలో వినియోగించుకోవడం కూడా జరుగుతుందని ఆధునిక నగర సామాజిక శాస్త్రంలో జరిగిన పరిశోధనలు, వెలువడిన ప్రచురణలు తెలుపుతున్నాయి. అయితే సంపన్న పాశ్చాత్య దేశాలలో ప్రజల విశాల జాతీయతా భావాన్ని, సామాజిక సమన్వయ భావాన్ని కూడా అలవరుచుకొన్నారు.

అధునికీకరణలో ఒక చిత్రం కనిపిస్తుంది. అదేమిటంటే సాంఘిక మార్పులు, రాజకీయ భాగస్వామ్యం ఆధునిక లక్షణాలైనప్పటికీ అవి వర్గ వైషమ్యాలను, ప్రాంతీయ దురభిమానాలను తగ్గించడానికి బదులు పెంచుతున్నాయి. అధికమైన వ్యక్తిగత శీలత, నగరీకరణ, అక్షరాస్యత మొదలయిన లక్షణాలన్నీ సాంప్రదాయిక విలువలను బలహీనపరిచి ఆధునిక విలువలను బలపరుస్తాయి. అయితే ఆధునిక విలువలను పటిష్ఠం చేయడానికి రెండు రకాల జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. అవి:

(1) ప్రాచీన అలవాట్లు, సాంఘిక కట్టుబాట్లను విస్మరించడానికి పాతకాలం నాటి పనికిరాని సంస్థలను బలహీనపరచాలి.

(2) వ్యక్తులను ఆధునిక భావాలున్న కొత్త సంస్థలకు పరిచయం చేసి శాస్త్రీయ దృక్పథం, హేతుబద్ధత, లౌకిక దృష్టి, సామాజిక శ్రేయస్సు పట్ల గౌరవభావం వంటి ఆధునిక విలువలను ఉద్బోధించడం.

సమాజంలోని వర్గ వైషమ్యాలు, సాంస్కృతిక వ్యత్యాసాలు పెరిగినప్పుడు తీవ్రసాంఘిక ఉద్రిక్తతలకు దారితీస్తాయి. ఇది జాతీయ సమైక్యతకు, సమాజ నిర్మాణ కార్యక్రమాలకు గొడ్డలిపెట్టులా పరిణమిస్తాయి. శ్రీలంకలోని జనసమూహంలోని అన్ని వర్గాలను ఏకంచేసిన స్వాతంత్ర్య పోరాటం అంతం కావడంతో మళ్ళీ సంకుచితాభిమానాలు తలెత్తి సింహళ భాష మాట్లాడే వారికీ తమిళ భాష మాట్లాడే వారికి మధ్య వైషమ్యాలు, ఉద్రిక్తతలు పెరిగాయి. ఇటువంటి సంఘటనలే వర్ధమాన సమాజాలలో కూడా జరిగాయి. ఈ దేశాల నాయకులు జాతీయ సమైక్యత సాధించాలని నిర్ణయించుకొన్నారు. కానీ వారి ఆ ప్రయత్నంలో ఆదిమ సంకుచితాభిమానాలు అడ్డురావడంతో నాయకత్వం అధికారవాద ప్రభుత్వాలవైపు తమ దృష్టిని మళ్ళించింది. బలమైన ప్రభుత్వాల ద్వారా సంకుచిత వర్గ వైషమ్యాలను అణిచివేసి జాతీయతా భావాన్ని, దేశ ఐక్యతాభావాన్ని నెలకొల్పవలెనని నిశ్చయించుకొంది. వారికి దేశ ఐక్యతే ఉత్తమ లక్ష్యం. వివిధత్వం లేదా వ్యక్తిగత తత్వంకన్న దేశంలో క్రమశిక్షణకే ఎక్కువ ప్రాధాన్యమిచ్చి అదే సాంఘిక ఆధునికీకరణకు మొదటి మెట్టు అని వారు భావించారు. జాతీయ సమైక్యతను ఏర్పరిచి ప్రజలందరినీ జాతీయ నిర్మాణ కార్యక్రమంలో పాల్గొనేట్లు చేయాలని నూతన రాజకీయ నాయకులు సంకల్పించారు. దీని ఆధారంగా ఆధునికీకరణను ప్రభావితం చేసే అంశాలను కిందివిధంగా పేర్కొనవచ్చు:

## 13.10.0 ఆధునికీకరణను ప్రభావితంచేసే అంశాలు

రాజకీయ ఆధునికీకరణ ప్రక్రియను ప్రభావితం చేసిన అంశాలలో నాలుగు ప్రధానాంశాలు పేర్కొనదగినవి: (1) సాంప్రదాయిక రాజకీయ నిర్మాణం, సంస్కృతి, (2) ఆధునికీకరణ కాల నిర్ణయం, (3) రాజకీయ నాయకత్వం లక్షణాలు, దృక్పథాలు, (4) రాజకీయ ఆధునికీకరణ ప్రక్రియ ఎదుర్కొన్న సమస్యలు.

### 13.10.1 ప్రాచీనత/సంప్రదాయం (Tradition)

BRAOU

(1) ప్రాచీన దశ నుంచి పాతుకొనిపోయిన సంస్థలు, అనాదిగా ఉన్న ఆధునికీకరణ విధానాలకు అతిత్వరగా చోటివ్వవు. అందువల్లనే ప్రాచీన వ్యవస్థ నుంచి ఆధునిక వ్యవస్థకు మార్పు చెందడం దీర్ఘమైన దీర్ఘకాలికమైన పని.

### 13.10.2 కాల నిర్ణయం

ప్రాచీన దశ నుంచి ఆధునిక దశను చేరే మార్గంలో ప్లవన దశ(Take-off time) అతిముఖ్యమైంది. ప్రపంచ వ్యవస్థలలోని ఏ ఆధునికీకరణ విధానం సరి అయిందో పరిశీలించేందుకు, ప్రాచీనత ఎంతవరకు అడ్డుగా ఉందో తెలుసుకొనేందుకు సామాజిక, రాజకీయ రంగాలలోని సంచలనం ఏ స్థాయిలో ఉందో కనుక్కొనేటందుకు, ఆధునికీకరణ దశను త్వరగా చేరుకొనేందుకు ఏవైనా దగ్గరి దారులు ఉన్నాయో లే తెలుసుకొనేందుకు ఇది సరి అయిన సమయం.

### 13.10.3 నాయకత్వం

రాజ్యంలోని నాయకత్వం మీద కూడా చాలావరకు ఈ ప్లవన దశ ఆధారపడి ఉంటుంది. ఆధునికీకరణ పద్ధతులు, ఆధునికతను సాధించే విధానం చాలామటుకు నాయకుల మీద, వారు ప్రాముఖ్యమిచ్చే విలువల మీద ఆధారపడి ఉంటుంది. మావో-సె-టుంగ్, కెమాల్ అటాటర్క్, లెనిన్ మొదలైన నాయకులు వారి వారి దేశాలను అధునాతనం చేయడంలో ఎంతో కృషిచేసి, ప్రముఖ పాత్ర వహించారు. 19వ శతాబ్దానికి చెందిన టోకుగవా(TOKUGAWA), షోగన్ (SHOGUN)లు జపాన్ దేశంలోని ఆధునికీకరణకు ఎంతో తోడ్పడ్డారు. వారి కృషి ఫలితంగానే 1905లో రష్యాకు, జపాన్‌కు మధ్య జరిగిన యుద్ధంలో జపాన్ ఘనవిజయం సాధించగలిగింది.

### 13.10.4 సమస్యలు

నేటి ప్రపంచంలో ఆధునికీకరణ చెందిన ప్రతిదేశం కొన్ని ఇబ్బందులను, సమస్యలను ఎప్పుడో ఒకప్పుడు ఎదుర్కొన్నదే.

(a) *జాతీయ గుర్తింపు* (National Identity): ప్రాచీన దశలో వివిధ రకాలైన వర్గ భేదాలు, ఏ వర్గానికి చెందినవారు ఆ వర్గానికే ప్రాముఖ్యమివ్వడం జరుగుతూ వచ్చింది. అయితే ఆధునికీకరణ జాతీయతా భావాన్ని పెంపొందించడం లౌకిక వ్యవస్థకోసం పాటుపడటంలో ప్రాంతీయ తత్వాలు, వర్గ భేదాలు అడ్డుగా నిలుస్తూ ఉంటాయి. ఈ కారణంగానే ఆధునికీకరణ పథంలో కొన్ని దేశాలు వేర్పాటు ధోరణులకు గురికావలసి వచ్చింది. ఉదా.కు నైజీరియాలోని బయఫ్రాకు (Biafra) ప్రజలు (ఇక్కడి ''ఈనో'' (Ino) తెగవారికి వేర్పాటుధోరణులున్నాయి). ఫ్రాన్స్‌లోని బ్రిటనీ, కోర్సికా ప్రాంతీయులు, ఇంగ్లండ్‌లోని ఐరిష్ కాథలిక్‌లు, కెనడాలోని క్వీబెక్ ప్రాంతీయులు వారి దేశంలోని ప్రభుత్వాలకు సమస్యలుగా పరిణమించారు.

(b) *రాజకీయ శాసన సమ్మతి* (Political Legitimacy): ప్రతిదేశంలోను న్యాయ సమ్మతమైన ప్రజల మద్దతు, విశ్వాసం లభించడం కూడా ఒక సమస్యగానే పరిణమిస్తోంది. ప్రజల విశ్వాసాన్ని చూరగొనని ప్రభుత్వం న్యాయసమ్మతంగాని రీతిలో అధికారానికి వచ్చిన ప్రభుత్వం విశృంఖలంగా ప్రవర్తించే అవకాశాలు చాలా ఉన్నాయి. గవిన్ కెన్నడి (Gavin Kennedy) వంటి శాస్త్రజ్ఞులు ఈనాడు పలు దేశాలలో సంభవించేCoup de etate లకు కారణం ప్రజా ప్రభుత్వాల పేరిట ప్రజల మద్దతులేని ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చి పరిపాలించడమేనని అభిప్రాయపడుతున్నారు. ఉదా.కు పాకిస్తాన్‌లో 1959వ సం. జనరల్ అయూబ్ ఖాన్ ప్రభుత్వాన్ని స్వాధీనం చేసుకోవడానికి కారణం పాకిస్తాన్‌లోని ప్రధాన మంత్రులు బాధ్యతారహితంగా ప్రవర్తించడమే. ఇండోనేషియాలో సుకర్నో ప్రభుత్వం పడిపోవడానికి కూడా ఇదే కారణం.

BRAOU

(C) *కేంద్రీకరణ:* రాజకీయ ఆధునికీకరణలో కేంద్ర ప్రభుత్వానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుంది. ప్రభుత్వాధికారాలన్నీ కేంద్ర ప్రభుత్వంలోనే కేంద్రీకృతమై ఉంటాయి. ప్రాచీన దశలో ప్రాంతీయ స్థాయిలోను, వర్గస్థాయిలోను అధికారాలుండటంవల్ల కేంద్ర ప్రాముఖ్యం మితంగా ఉంటుంది. రాజకీయ ఆధునికీకరణతో కేంద్ర ప్రభుత్వం పటిష్ఠంగా మారి వివిధ వర్గాల మధ్య రాజకీయ సంసర్గానికి (Political Communication) దోహదం చేస్తూ, ప్రభుత్వ విధానాలు దేశం నలుమూలలకు చేరేటట్లు చూస్తుంది. దీనికోసం ప్రభుత్వ యంత్రాంగం విస్తారంగా ఉండి దేశమంతటా వ్యాపించగలిగిన సామర్థ్యం దీనికుండాలి. ఆధునికీకరణ కోసం కొత్త విధానాలు తయారుచేసి ప్రజలందరికీ అవి అర్థమయ్యేటట్లు చూడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే. చాలా ప్రభుత్వాలు తమ విధానాలు ప్రజలకు తెలియపరచడంలో పొరపాట్లు చేయడం మూలంగా అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. ఉదా.కు భారత ప్రభుత్వం చేసే అనేక ప్రజోపకార విధానాలు ప్రజలకు తెలియకపోవడానికి కారణం రాజకీయ సంసర్గంలోని లోటుపాటులే. నిరక్షరాస్యులైన లక్షలాది భారతీయులకు, మారుమూల గ్రామాలలో ఉన్న వారికి భారత ప్రభుత్వ విధానాలు అవగతం కావడం లేదు. దీనికి కారణం మన దేశంలో మొదటి నుంచి ప్రాథమిక విద్యపట్ల శ్రద్ధ చూపించకపోవడమే. అయితే చైనాలో మొదటి నుంచి ప్రాథమిక విద్యకు ప్రాముఖ్యమివ్వడంతో ప్రతివారు అక్షరాస్యులు కావడంతో కేంద్ర ప్రభుత్వ విధానాలు అందరికీ అర్థమవుతున్నాయి. ఆధునికీకరణ త్వరితంగా జరిగేందుకు వీలవుతున్నది.

(d) *భాగస్వామ్యం* (Participation): దేశంలోని ప్రభుత్వ సంస్థలన్నింటిలోను ప్రజలు కూడా పాల్గొనగలిగితే రాజకీయంగా ఆధునికీకరణ జరిగినట్లు లెక్క. అందరూ పాల్గొనాలంటే ప్రభుత్వ సంస్థలు, కేంద్ర స్థాయి నుంచి గ్రామీణ స్థాయి వరకు తమ సామర్థ్యాన్ని పెంచుకోవాలి. ప్రతి దేశంలోను ప్రజలు పాలనా వ్యవహారాల్లో తమకు కూడా స్థానం కల్పించాలనే నినాదాన్ని లేవనెత్తుతున్నారు. ప్రభుత్వరంగం సమర్థనీయంగా లేకుంటే ప్రజల కోరిక పెద్ద సమస్యగా పరిణమించవచ్చు.

(e) సమైక్యత(Integration): జాతి, మత, వర్గ భేదాలు ప్రతి దేశంలోను ఉన్నవే. అయితే సమాజ ధ్యేయాలను నెరవేర్చుకోవడానికి భిన్న వర్గాల మధ్య రాజకీయంగా దేశవ్యాప్తంగా సమైక్యత ఎంతైనా అవసరం. అందువల్లనే జాతీయ సమైక్యతకు ఎంతో ప్రాముఖ్యమివ్వడం జరుగుతోంది.

(f) పంపిణీ (Distribution): ప్రజల అవసరాలను గుర్తించి వాటిని తీర్చడంలో, ఆర్థికాభివృద్ధి సాధించడంలో సహజవనరులను దేశాభివృద్ధికోసం ఉపయోగించడంలో ప్రభుత్వరంగం శక్తి సామర్థ్యాలను పూర్తిగా వినియోగించాల్సి ఉంటుంది. భారతదేశంలో ప్రభుత్వం ఈ విషయంలో వెనకబడి ఉంటే చైనాలో ప్రభుత్వం సర్వాంతర్యామిగా ఉంటుంది.

ఒక దేశం రాజకీయంగా ఆధునికీకరణ చెందింది అని చెప్పడానికి పైన పేర్కొన్న వివిధ సమస్యలను ఆ దేశ ప్రభుత్వం ఎదుర్కొనే సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది.

## 13.11.0 ఆధునికీకరణ: నమూనాలు, పద్ధతులు

ఆధునికీకరణ సాధించడానికి చాలా మార్గాలున్నాయి. ఆధునికీకరణ ఆధునిక సమాజాన్ని స్థాపించడానికి ఒక ప్రక్రియ. అందుకే వేర్వేరు దేశాల్లో వేర్వేరు పద్ధతులుండవచ్చు. దానికి కావలసిన కాల పరిమితి కూడా వేరువేరుగా ఉండవచ్చు. ఇంగ్లండ్‌లో ఆధునికీకరణ ప్రక్రియ క్రమంగా జరిగింది. దేశంలో సాంఘిక, ఆర్థిక, రాజకీయ మార్పులు అన్నీ ఒకేసారి రాలేదు. సనాతన ఆచారాలు, సంస్థలు మారి ఆధునిక ధోరణులు రావడానికి కొన్ని శతాబ్దాలు పట్టింది. కానీ సోవియట్ యూనియన్‌లో దీనికి భిన్నంగా ఆధునికీకరణ అనతికాలంలోనే సాధించడమైంది. స్టాలిన్ పరిపాలనా కాలంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చి ఆధునికీకరణకు బలం చేకూరుతుంది. పారిశ్రామికీకరణ బలవంతంగా వ్యవసాయ సమష్టీకరణ, పాశ్చాత్యుల అనుకరణను నిష్కరించడం మొదలైనవన్నీ సోవియట్ సమాజాన్ని ఆధునికీకరించాయి. ఇట్లా సోవియట్ కమూనిస్టు పార్టీ క్రమశిక్షణా నాయకత్వంలో సాంఘిక, ఆర్థిక, రాజకీయ వికాసం పొంది సోవియట్ యూనియన్ ఒక చిన్న బలహీన దశ నుంచి ప్రపంచంలో ఒక అగ్రరాజ్యంగా పరిణతి చెందింది.

BRAOU

జపాన్‌లో ఆధునికీకరణ కులీనులైన ఉద్యోగిస్వామ్యం పర్యవేక్షణలో జరిగింది. ఆధునికీకరణ కార్యక్రమాన్ని నిర్వహించడంలో నాలుగు ముఖ్యాంశాలు మన దృష్టికి వస్తాయి. (1) మేధావుల పాత్ర, (2) సాధించిన మార్పులో హెచ్చు తగ్గులు, (3) మార్పులు తేవడంలో సిద్ధాంతాల పాత్ర, (4) ఆధునికీకరణను సాధించడానికి ప్రభుత్వ యథార్థ పాత్ర.

### 13.11.1 మేధావుల నాయకత్వం

ఆధునికీకరణ కార్యక్రమంలో సారధ్యం వహించేవారు మేధావి వర్గం. మేధావులు సాధారణంగా పాశ్చాత్య విద్య, విజ్ఞానాలవల్ల ప్రభావితులై ఉంటారు. జపాన్‌లోని మాజీ అధికారులు, ఆసియా, ఆఫ్రికా ఖండాలలోని వివిధ వలస రాజ్యాల నాయకులు చాలామంది పాశ్చాత్య విద్యనభ్యసించి ద్వారా తమతమ దేశాలలో మార్పు అవసరాన్ని గుర్తించారు. స్వాతంత్ర్య సముపార్జన తరవాత వీరు ప్రభుత్వాధికారాన్ని తామే చేపట్టడంవల్ల ఆధునికీకరణ కార్యక్రమాలను నిర్వహించడం సుగమమయింది. మేధావుల పాత్రపై అనేక పరిశోధనలు జరిపిన శాస్త్రజ్ఞుడు ఎడ్వర్డ్ షిల్స్. ప్రస్తుత శతాబ్దంలో ఆధునికీకరణను సాధించడంలో మేధావుల పాత్ర అద్వితీయమైంది అనికొనియాడాడు. ఈ మేధావి వర్గమే రాజకీయంగా వర్తమాన సమాజాలలో ఒక సరికొత్త జాతీయతా భావాన్ని పునరుద్ధరించి, స్వాతంత్ర్య పోరాటానికి సారధ్యం వహించి, దాన్ని సంపాదించి తరవాత ఆర్థికాభివృద్ధి సాధించడానికి, పారిశ్రామికీకరణ, ప్రగతి శీలక స్వభావం, శాస్త్రీయ దృక్పథం మొదలైన ఆధునిక ధోరణులను ప్రవేశపెట్టేట్లుచేసి ఆధునికీకరణ సాధించటంలో సాఫల్యం పొందారు.

## 13.11.2 ప్రాంతీయ అసమానతలు

ఆధునికీకరణలో రెండో ముఖ్యాంశం కొత్త రాజ్యాలలో సాధించిన ఆర్థిక, రాజకీయ ప్రగతిలో హెచ్చుతగ్గులు ఏర్పడటం. ఈ హెచ్చుతగ్గులు రావడానికి కారణం చారిత్రక పరిస్థితులు కావచ్చు లేదా సమాజంలో సాంఘిక, సాంస్కృతిక వ్యత్యాసాలను బట్టికూడా అభివృద్ధిలో ఇవి ఏర్పడవచ్చు. సాంఘిక, ఆర్థిక, రాజకీయ వికాసం సాధించడంలో ఏర్పడే హెచ్చుతగ్గులకు, ప్రాంతీయ అసమానతలకు కూడా ఒక బలమైన కారణం. ఈ ప్రాంతీయ అసమానతలమూలంగా అప్పుడప్పుడు రాజకీయాలలో ఉద్రిక్తతలు రావడం కూడా సహజం. ఇటువంటి ప్రాంతీయ ఉద్రిక్తతలు వచ్చినప్పుడు రాజనీతిజ్ఞులు నిర్మాణాత్మక జాతీయ దృష్టితో పరిష్కారమార్గాలు కనుక్కోవాలి.

## 13.11.3 సిద్ధాంతాల పాత్ర

మూడో ప్రపంచ రాజ్యాలలో ఆధునికీకరణ కార్యక్రమాలను నిర్వహించేటప్పుడు సమాజంలో మార్పులను విస్తృతప్రాతిపదికపై తీసుకొని వచ్చినప్పుడు సిద్ధాంతాలు కూడా(idealogies) ప్రముఖపాత్రవహిస్తాయి. సిద్ధాంతాలు, రాజకీయాలలో వ్యక్తికి వ్యక్తిత్వాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ఇస్తాయి. ఆధునికీకరణ సాధిస్తున్న నాయకత్వం తమ దేశ ఐక్యతను కోరుతూ తమ ప్రజలను ప్రజాస్వామ్య సిద్ధాంతం వైపు దృష్టిని మళ్ళిస్తున్నారు. కొంతమందికి సోషలిస్టు సిద్ధాంతాలపట్ల అభిమానముంటే మరికొందరికి జాతీయ ఐక్యతపై ఉండవచ్చు.

## 13.11.4 ప్రభుత్వం పాత్ర

ఆధునికీకరణలోని చివరి ముఖ్యాంశం ఈ ప్రక్రియలో ప్రభుత్వం పాత్ర. యథార్థానికి ఆధునికీకరణ కార్యక్రమానికి ఒక రూపకల్పన చేసి దాన్ని సవ్యంగా, జయప్రదంగా నిర్వహించడం ప్రభుత్వం విధే అవుతుంది. ఈ సందర్భంలోనే ఆధునికీకరణకు, రాజకీయాలకు ఉండే అవినాభావ సంబంధం స్పష్టమవుతుంది. 20వ శతాబ్దంలోని ప్రభుత్వాలకు సాంకేతిక పరిజ్ఞానముండి ప్రజాజీవితంలో పెద్ద మార్పులు తీసుకొచ్చి సమాజాన్ని మౌలికంగా సంస్కరించడానికి ప్రణాళికలను, ఇతర కార్యక్రమాలను చేపడుతున్నారు. నిజానికి రాజ్యం పర్యవేక్షణలోనే ఆధునికీకరణ సాధించాల్సి ఉంది.

BRAOU

స్వతంత్రరాజ్యాలలోని నాయకత్వం ప్రజా జీవితంలో మార్పులు తీసుకొని రావడానికి ఎంతో శ్రద్ధాసక్తులు చూపిస్తున్నారు. ఒక సామాన్య వ్యవసాయిక దేశంగా ఉన్న సోవియట్ యూనియన్‌ను అక్కడి నాయకులు సంపూర్ణాధికార రాజ్యం ద్వారా అన్ని రంగాలలో అచిరకాలంలోనే అత్యంత పురోభివృద్ధి సాధించి ప్రపంచంలోని రెండు అగ్రరాజ్యాలలో ఒకటిగా రూపొందించారు.

## 13.12 విమర్శ

అయితే ఆధునికీకరణ సిద్ధాంతం మీద అనేక విమర్శలున్నాయి. ఎడ్వర్డ్ సీయల్(Edward Siul) అభిప్రాయంలో ''ఆధునికీకరణ అంటే పాశ్చాత్య నాగరకతను అలవరుచుకోవడం'' అనేది ఒక అపోహ మాత్రమే. ఇది కేవలం కాపిటలిస్టు వ్యవస్థకు, అమెరికా దేశానికి చెందినది అనే భావన అసమంజసమైంది. ఈ సిద్ధాంతం మొదట అమెరికాలో వెలువడింది. అప్పుడే స్వేచ్ఛావాయువులు పీల్చుకొంటున్న అనేక మూడో ప్రపంచ దేశాలు సోషలిస్టు విధానాలపట్ల ఆసక్తి చూపించసాగాయి. ప్రపంచమంతటా సోషలిస్టు విధానాలపట్ల ఆసక్తి చూపించసాగాయి. ప్రపంచమంతటా సోషలిస్టు విధానాలు వ్యాపించకుండా ఈ ఆధునికీకరణ సిద్ధాంతాన్ని పశ్చిమ దేశాల శాస్త్రవేత్తలు రూపొందించారు.

ఈ సిద్ధాంతం నూతన వలస విధానాన్ని గుర్తించినట్లు కనిపించదు. కొత్తగా స్వాతంత్ర్యం సంపాదించుకొన్న దేశాలకు అభివృద్ధిచెందిన దేశాలు ఆర్థిక సహాయం అందజేస్తూవచ్చాయి. కొన్నేళ్ళ తరవాత ఈ మూడో ప్రపంచ దేశాల మీద వారి ప్రభావం క్రమంగా పెరగసాగింది. ఆ కారణంగా ఈ దేశాలలోని ఆధునికీకరణ పద్ధతులు ఆ దేశ అవసరాలను బట్టికాక పాశ్చాత్య ధోరణులలో కొనసాగుతున్నాయి. ఉదా.కు ఫిలిప్పైన్స్, ఆఫ్ఘనిస్తాన్‌లు.

ఆధునికీకరణ సిద్ధాంతం ప్రాచీనతకు ఒక విరుద్ధభావం. హంటింగ్‌టన్ అన్నట్లు ''ఆధునికత, ప్రాచీనత రెండు వ్యతిరేక పదాలు. ఆధునికతను నిర్వచించాక ఏది ఆధునికత కాదో అది ప్రాచీనతగా పరిగణించడం జరుగుతోంది. అందుకని ప్రాచీనతను పరిశీలించాక నిర్వచించడం జరగడం లేదు. కాబట్టి అది ఒక ఊహాజనితమైన విరుద్ధభావంగానే కనబడుతుంది. కానీ గతంలోనిదంతా ప్రాచీనము, ప్రస్తుతమంతా ఆధునికము అన్న అభిప్రాయం అపోహ అని రుజువైంది.

అన్నిటికన్న ఆధునికీకరణ సోషలిస్టు విధానాల ద్వారా కూడా సాధ్యమని ఈ ఆధునిక సిద్ధాంతం గుర్తించకపోవడం గర్హనీయం.

పెట్టుబడిదారీ విధానంలో ఆధునికీకరణ అంటే పెట్టుబడిదారీ వ్యవస్థకు అత్యంత ప్రాముఖ్యమివ్వడం. ఈ వ్యవస్థలో ఉత్పత్తి ముఖ్య లక్ష్యం. పెట్టుబడిదారుకు లాభాలు చేకూర్చడం. ఈ వ్యవస్థలో ఆధునికీకరణ దశ చేరాక కూడా వర్గభేదాలు, వర్గీకరణ కొనసాగుతూనే ఉంటాయి.

సోషలిస్టు విధానంలో ఆధునికీకరణ అంటే పెట్టుబడిదారీ వ్యవస్థ రూపుమాసిపోవడం, ప్రభుత్వం, ప్రజలే అన్నింటికి హక్కుదారులు కావడం. ప్రజల అవసరాలను తీర్చడాన్నిబట్టి ఉత్పత్తివిధానాలను రూపొందించడం జరుగుతుంది. ఈ వ్యవస్థలో ఆధునికీకరణ అంటే వర్గ నిర్మూలనమే. ఉత్పత్తిదారులు, పెట్టుబడిదారులైన ధనికవర్గాన్ని నిర్మూలించి ఉత్పత్తి అంతా ప్రజల ఆధ్వర్యంలో ఉంచడమే.

BRAOU

కాపిటలిస్టు, సోషలిస్టు దేశాలు రెండూ తమ దేశాలను అధునాతనం చేయాలనే అభిప్రాయపడుతున్నాయి. ఇరుపక్షాలవారు ఆర్థికంగా మానవశక్తితో సాగుతున్న ఉత్పత్తి విధానానికి స్వస్తిచెప్పి యంత్రశక్తిపై ఆధారపడదలుచుకొన్నారు. వారి పారిశ్రామికీకరణ ఒకే విధంగా ఉంటుంది. ఇద్దరూ ఆధునికీకరణకు విద్య, సాంకేతిక పరిజ్ఞానం ప్రాముఖ్యాన్ని, రాజకీయ సంసర్గం ఆవశ్యకతను గుర్తించారు. అమెరికా, జపాన్ పెట్టుబడి వ్యవస్థ ద్వారా ఆధునికీకరణ చెందగా, సోవియట్ యూనియన్, యుగోస్లావియా సామ్యవాద విధానం ద్వారా ఆధునికీకరణ చెందిన దేశాలకు ప్రతీకలుగా కనిపిస్తాయి.

దీన్నిబట్టి రాజకీయ ఆధునికీకరణలో రెండు రకాల పద్ధతులు, సిద్ధాంతాలు ఉన్నట్లు కనబడుతుంది. కానీ పాశ్చాత్య దేశాల పెట్టుబడిదారీ విధానాలకే ప్రాముఖ్యం, గుర్తింపు లభిస్తున్నాయి. ఒకప్పుడు కొత్తగా స్వాతంత్ర్యం సంపాదించుకొన్న దేశాలకు ఈ సిద్ధాంతాన్ని మాత్రమే అనుసరించాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు రెండు విధానాలున్నాయి. అయితే రెండింటికి సమానమైన గుర్తింపు లేదు.

ఇదికాక ఆధునికీకరణ సిద్ధాంతం గుర్తించని మరో విషయం ఏమిటంటే ఆధునికీకరణకు పరిమితి అనేది లేదని, అది ఎల్లప్పుడూ కొనసాగుతూనే ఉంటుందని, ఎప్పుడో ఆధునికీకరణ చెందిన దేశాలకు, ఇప్పుడిప్పుడే ఆధునికం అవుతున్న దేశాలకు మధ్య అంతరం ఎప్పుడూ ఉంటుంది. అదీకాక ఆధునికీకరణ అంటే ఏమిటి? రాజకీయ ఆధునికీకరణ అంటే ఏమిటి? అన్న ప్రశ్నలకు సమాధానం దేశాన్నిబట్టి, తర్కాన్నిబట్టి మారుతూ ఉంటుంది.

అదీకాక ప్రస్తుతం అనేక మూడో ప్రపంచ దేశాలు పాశ్చాత్య దేశాలు రూపొందించిన ఈ ఆధునికీకరణ సిద్ధాంతాన్ని తమ దేశాల ఆంతరంగిక పరిస్థితులకు అనుగుణంగా లేవని గుర్తించాయి. వివిధ దేశాల అవసరాలు వేరువేరుగా ఉంటాయి. చైనాలో మొదట వ్యవసాయ రంగానికి ప్రాముఖ్యమివ్వాల్సి వచ్చింది. ఈ రంగాన్ని పటిష్ఠం చేసుకొన్నాక ఇప్పుడు పారిశ్రామికీకరణపై దృష్టి మళ్ళిస్తున్నారు. భారతదేశంలో రెండు రంగాలలోను కృషిచేసిన కారణంగా ఏ

రంగంలోను ప్రశంసించదగిన ఫలితాలు కనిపించలేదు. జపాను ముడిసరుకును దిగుమతి చేసుకోవడం మీద, తయారుచేసిన వస్తువులను ఎగుమతి చేయడం పట్ల, విదేశీ మార్కెట్లలో తమ వస్తువులను విక్రయించడం పట్ల శ్రద్ధ చూపిస్తోంది. కొన్ని దేశాలు టూరిస్టు రంగంపై, విదేశీమారకంపై ఆధారపడవలసి వస్తోంది. స్విట్జర్ లాండ్ లాంటి దేశాలు టూరిస్టు రంగం, బ్యాంకింగ్ రంగం పట్ల శ్రద్ధ చూపుతున్నాయి. ఈ రకంగా వివిధ దేశాల అవసరాలు, ఆర్థిక వ్యవస్థలు, శక్తి సామర్థ్యాలు, రూపొందించుకోవాల్సిన విధానాలు వివిధ రకాలుగా ఉంటాయి. ఆ కారణంగా అన్ని దేశాలు పాశ్చాత్య దేశాలను, వారి సిద్ధాంతాలను అనుకరించలేవు, అనుకరించకూడదు కూడా.

అట్లాగని ఆధునికీకరణ సిద్ధాంతాన్ని నిరుపయోగమని తోసిపుచ్చలేము. ఆధునిక రాజకీయ వ్యవస్థను అధ్యయనం చేయడానికి రాజకీయ ఆధునికీకరణ అనే భావన మెరుగైన ఉపకరణాల(better tools) అందించింది. నిత్యమూ మార్పు చెందుతున్న అనేక రాజకీయ వ్యవస్థలలో జరుగుతున్న అనేక మార్పులను విశ్లేషించడానికి ఈ సిద్ధాంతం రాజనీతి శాస్త్రజ్ఞుడికి ఎంతో తోడ్పడుతుంది. రాజకీయ, సామాజిక విశ్లేషణ మరో రూపమే రాజకీయ ఆధునికీకరణ అధ్యయనం. రాజకీయ ఆధునికీకరణ ప్రధానంగా సామాజిక, ఆర్థిక భావన. అయితే రాజనీతిశాస్త్రజ్ఞులు రాజకీయ ఆధునికీకరణ అనే ఉపకరణ(tool) సహాయంతో రాజకీయ వ్యవస్థ పనిచేసే తీరుతెన్నులను విశ్లేషించడానికి ప్రయతించారు. అయితే టాలాకాట్ పార్సన్, రాబర్ట్ కె, మర్టన్, మెలియన్ లెవిజానియర్ మొదలైన సామాజిక శాస్త్రవేత్తల ప్రభావంలోపడి డేవిడ్ ఈస్టన్, డేవిడ్ ఆప్టర్, ఎడ్వర్డ్ షల్స్ మొదలైన రాజనీతి శాస్త్రవేత్తలు ప్రభుత్వ వ్యవస్థను సామాజిక, మానసిక, సాంస్కృతిక అంశాల ద్వారా నిర్ణయించే స్థాయికి రాజనీతి శాస్త్ర హోదాను దిగజార్చారనే విమర్శ ఉంది. ఏది ఏమైనప్పటికీ రాజకీయ ఆధునికీకరణ సిద్ధాంతం ద్వారా రాజకీయ వ్యవస్థలలో వస్తున్న మార్పులను, రాజకీయ పరిణామాలను, రాజకీయ వ్యవస్థలు ఎదుర్కొంటున్న సమస్యలను, వాటి పరిష్కార మార్గాలను తెలుసుకోవచ్చు.

– డా కె. లక్ష్మి

BRAOU

## 13.12 చదువదగిన పుస్తకాలు

1. Srinivas, M.N. : Social Change in Modern India.
2. Lucianw. Pye : Aspects of Political Development.
3. Lipset, S.M. : The Political Man.

## 13.13 నమూనా పరీక్షా ప్రశ్నలు

I వ్యాసరూప ప్రశ్నలు

1. రాజకీయ ఆధునీకరణ అనగానేమిటో నిర్వచించి ఆధునీకరణ ఆవిర్భావాన్ని గురించి వ్రాయుము.
2. రాజకీయ ఆధునీకరణ లక్షణాలను వివరించుము
3. ఆధునీకరణను ప్రభావితం చేసే అంశాలను పేర్కొనుము

II సంక్షిప్త ప్రశ్నలు

1. ఆధునీకరణ – సిద్ధాంత వైఖరులు వివరించుము.
2. సోషలిస్టు భావనలో రాజకీయ ఆధునీకరణ అంటే ఏమిటి?
3. ఆధునిక – సాంప్రదాయ వ్యవస్థల మధ్య వైరుధ్యాలు పేర్కొనుము.

# భాగం 14 – రాజకీయ అభివృద్ధి

విషయక్రమం


| | |
|---|---|
| 14.1 | లక్ష్యాలు |
| 14.2 | పరిచయం |
| 14.3 | రాజకీయ అభివృద్ధి అంటే ఏమిటి |
| 14.4 | రాజకీయ అభివృద్ధి లక్షణాలు |
| 14.5 | రాజకీయ అభివృద్ధి సిద్ధాంతాలు |
| 14.6 | సిద్ధాంత అన్వేషణ : రెండో దశ |
| 14.7 | సిద్ధాంత అన్వేషణ : మూడో దశ |
| 14.8 | రాజకీయ అభివృద్ధి భావన వివరణ : సమస్యలు |
| 14.9 | రాజకీయ అభివృద్ధి : మూడో ప్రపంచ రాజ్యాల ధోరణి |
| 14.10 | రాజకీయ అభివృద్ధి : సమస్యలు, సంక్షోభాలు |
| 14.11 | విమర్శనాత్మక పరిశీలన |
| 14.12 | చదువదగిన పుస్తకాలు |
| 14.13 | నమూనా పరీక్షా ప్రశ్నలు |


BRAOU

## 14.1 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదివిన తరువాత మీరు

★ రాజకీయ అభివృద్ధి

★ దాని వివిధ దశలు

★ సంక్షోభాలు సమస్యలను బాగా వివరించగలుగుతారు.

## 14.2 పరిచయం

రాజకీయ అభివృద్ధి భావనను మొట్టమొదట రాజనీతిజ్ఞులు విధాన నిర్ణేతలు ప్రస్తావించారు. ఆ తరువాత దీనిని ఆర్థిక, సామాజిక శాస్త్రజ్ఞులు అధ్యయనం చేయసాగారు. ''రాజకీయ అభివృద్ధి'' (POLITICAL DEVELOPMENT) పదప్రయోగంలో అసందిగ్ధత ఉండి, నిర్దిష్టత లేకపోయినప్పటికీ తులనాత్మక రాజకీయాల క్షేత్రంలో ప్రముఖ స్థానాన్ని సంతరించుకొంది. ద్వితీయ ప్రపంచ యుద్ధానంతరం స్వతంత్ర రాజ్యాలుగా అవతరించిన అనేక ఆశియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ఖండాలలో శీఘ్రగతిన వస్తున్న మార్పులు అమెరికన్ రాజనీతి శాస్త్రజ్ఞులను ఆకర్షించాయి. పర్యవసానంగా వీరు ఆయా దేశాల రాజకీయ ప్రక్రియలు పాశ్చాత్య దేశాల రాజకీయ ప్రక్రియలకు భిన్నంగా ఉన్నప్పటికీ ఆయా దేశాలను, వాటి సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక నేపథ్యంలో విజయవంతంగా అధ్యయనం చేయవచ్చని తెలుసుకొన్నారు. దాంతో తులనాత్మక రాజకీయాల అధ్యయనంలో నూతన దృక్పథం చోటుచేసుకొంది. దీని ప్రకారం తులనాత్మక రాజకీయాల అధ్యయనం రాజకీయ సంస్థలు, నిర్మితుల విశ్లేషణతో పాటు పర్యావరణ శక్తులకు భారీ ఎత్తున విస్తరించింది. మలినోవస్కీ, బ్రౌన్, టాల్కాట్ పార్సన్స్, మెరియమ్, లెవి మున్నగు శాస్త్రజ్ఞులు రాజకీయ

అభివృద్ధిని వివరిస్తూ సైద్ధాంతిక మద్దతును ప్రదర్శించారు. లూసియన్‌పై, గాబ్రియల్ ఆల్మండ్, డేవిడ్ ఆప్టర్, లాస్వెల్, లిప్‌సెట్ వంటి రచయితలు రాజకీయ అభివృద్ధిని అంతర్విభాగయ అధ్యయనాంశంగా (INTER DISCIPLINARY) తీర్చి దిద్దారు. వీరు మూడవ ప్రపంచ దేశాల మార్పు ప్రక్రియను వివరించటానికి ఆయా దేశాల ఆర్థిక, సామాజిక, మానసిక, రాజకీయాంశాలను అధ్యయనం చేశారు. వీరందరిలోను లూసియన్‌పై రాజకీయ అభివృద్ధి విశ్లేషణలో విశేషమైన కృషిచేశారు. జేమ్స్ ఎస్.కోల్మన్, హొవార్డ్ రిగ్గ్స్, బిండర్, లూసియన్‌పై, మైరన్ వీనర్, డేవిడ్ ఆప్టర్ మరికొందరు రాజనీతి శాస్త్రజ్ఞులు అభివృద్ధి చెందుతున్న నైజీరియా, శ్రీలంక, ఇండొనీసియా, బర్మా, భారత్, ఘనా మొదలైన దేశాలపై అధ్యయనాలు జరిపి అద్భుతమైన అవగాహనలను వెలిబుచ్చారు. వీరు పై దేశాల్లోని కొన్ని కీలక సమస్యల మీద దృష్టిని కేంద్రీకరించారు. అందులో జాతీయత(NATIONALITY) ముఖ్యమైంది. ఈ దేశాల అభివృద్ధి తీరుతెన్నులు ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో ఎటువంటి సందేహ వివాదాలను ఎదుర్కొంటున్నవో నిరూపించ ప్రయత్నించారు. మతం, సైన్యం, ఉద్యోగిస్వామ్యం ఆయా దేశాల రాజకీయ అభివృద్ధికి దోహదం చేశాయని వారు భావించారు. జాతి నిర్మాణానికి వ్యక్తిగతమైన ధోరణులు, రాజకీయ వైఖరులు ఎంతవరకు దోహదం చేస్తాయో ఒకవంక, మరొకవంక ఆర్థికంగా వెనుకబడినతనం ఆ రాజకీయ స్వరూపాలను ఎంతవరకు ప్రభావితం చేస్తాయో అధ్యయనం చేశారు. ఈ అధ్యయనాలు గాబ్రియల్ ఆల్మండ్ రూపొందించిన నిర్మితులు – విధులు (STRUCTURAL AND FUNCTIONAL) నమూనాను అనుసరించాయి. అమెరికాలోని పెక్కు విశ్వవిద్యాలయాల్లో ప్రత్యేక కేంద్రాలు వర్ధమాన దేశాలపై పరిమాణాత్మక సమాచారాన్ని సేకరించాయి. విస్తృత సమాచారానికి రాజకీయ సిద్ధాంతాలలో వస్తున్న మార్పులకు మధ్య రాజకీయ శాస్త్రజ్ఞులు పెద్ద ఎత్తున సమన్వయం కుదుర్చాల్సిన అవశ్యకత ఏర్పడింది. గణాంకాల సమాచారాలవల్ల ఒక దేశాభివృద్ధి స్థాయిని తెలుసుకోవడం సాధ్యమైంది. కాని ఆదేశంలో అభివృద్ధి ఎలా జరిగింది? ఎందుకు జరిగింది? అనే ప్రశ్నలకు జవాబులు తెలుసుకోవడం సాధ్యపడలేదు. సాధారణ వ్యవస్థల(GENERAL SYSTEMS) సిద్ధాంతకర్తలైన గాబ్రియల్ ఆల్మండ్, కాల్‌మెన్‌లు కూడా రాజకీయాభివృద్ధి కాలమానాలను సూచించలేకపోయారు. పారిశ్రామికాభివృద్ధి సామాజిక పరిణామాలు ఎక్కువగా కలిగిన జపాన్, బ్రిటన్‌ల వంటి దేశాలను దృష్టిలో ఉంచుకొని ఆర్.డబ్ల్యూ.బెల్లా, నీల్ స్మెల్సర్ వంటి వారు ప్రయత్నాలు చేశారు. వెర్నర్ మాత్రం ఆధునికీకరణం వెనుకకల విలువల మీద దృష్టిని సారించారు. కాని వర్ధమాన దేశాలలో జరిగే సామాజిక, ఆర్థిక మార్పులు కొత్తరకమైన మానసిక సాంస్కృతిక వైఖరులను కలిగిస్తున్నాయనే దానిని వెర్నర్ వివరించలేకపోయారు. ఒక దేశంలోని రాజకీయ అభివృద్ధివల్ల కలిగేస్థాయిని కొలవడానికి కారల్ డ్యూష్ కొన్ని సూచికలను రూపొందించారు.

BRAOU

## 14.3 రాజకీయ అభివృద్ధి అంటే ఏమిటి

రాజకీయ ఆధునికీకరణం, రాజకీయ అభివృద్ధి రెండూ పర్యాయ పదాలుగా ఉపయోగింపబడ్డాయి. ఆధునికీకరణపు రాజకీయాంశాలను రాజకీయ అభివృద్ధిగా వర్ణించారు. కాని చాలా మంది రచయితలు ఈ రెండింటిని వేరుచేసి 'రాజకీయ అభివృద్ధి'ని ప్రత్యేక శీర్షిక కింద వివరించారు.

రాజకీయ అభివృద్ధి భావనను నిర్దిష్టంగా నిర్వచించటం చాలా కష్టం. వివిధ రచయితలు వివిధ రకాలుగా రాజకీయ అభివృద్ధిని వివరించారు. వారందరూ స్థూలంగా రాజకీయ సంస్థల స్వభావంలోని ఆంగిక మార్పు(ORGANIC CHANGE) ప్రక్రియను రాజకీయ అభివృద్ధిగా అంగీకరిస్తున్నారు. జాతీయ సమైక్యతను, రాజకీయ భాగస్వామ్య ప్రాతిపదిక విస్తరణను రాజకీయ అభివృద్ధిగా రోస్టోవ్(ROSTOW) లూసియన్‌పైలు వివరించారు. అతిస్వల్ప కాలంలో రాజకీయ వ్యవస్థలో ఎదురౌతున్న సమస్యలను పరిష్కరించే రాజకీయ సంస్థల సామర్ధ్యత, దీర్ఘకాలంలో ప్రజల డిమాండ్లకు ప్రభుత్వ స్పందనా కృషియే రాజకీయ అభివృద్ధి అని హెగెన్(HEGAN) నిర్వచించారు. ఎదురౌతున్న సవాళ్ళను పరిష్కరించటానికి రాజకీయ వ్యవస్థ తన ప్రత్యేక నిర్మితుల ద్వారా సామర్థ్యతను పెంచుకోవటమే రాజకీయ

అభివృద్ధి అని ఆల్మండ్ నిర్వచించారు. రాజకీయ అభివృద్ధి భావన ఒక ప్రత్యేక రాజకీయ పరిస్థితిని సూచించదు. విస్తృతమవుతున్న రాజకీయ సమస్యల పరిష్కారానికి సంస్థాత్మక చలాంకాన్ని ఏర్పాటుచేసే ప్రయత్నాలను రాజకీయ అభివృద్ధిగా అల్ఫ్రెడ్ డయమంట్ (ALFRED DIAMONT) పేర్కొన్నారు. లూసియన్‌పై తన ''రాజకీయ అభివృద్ధి'' (ASPECTS OF POLITICAL DEVELOPMENT) గ్రంథంలో వివిధ నిర్వచనాలను పరిశీలించారు. ఆయన ఆ నిర్వచనాలలోని కొన్ని భాగాలను అంగీకరించారు; మరికొన్ని భాగాలను తిరస్కరించారు. చివరకు ఆయన తన మాటలలో రాజకీయ అభివృద్ధి భావనను నిర్వచించారు. ఆయన రాజకీయ అభివృద్ధిని ఈ కింది విధంగా చర్చించారు.:

(1) ఆర్థికాభివృద్ధికి రాజకీయ అభివృద్ధి ప్రాతిపదిక: పాల్ బారన్(PAUL BARON) హెవార్డ్ ఎలిస్, బార్బరావార్డ్ వంటి ఆర్థిక శాస్త్రవేత్తలు దేశ రాజకీయ పరిస్థితులు ఆర్థిక ప్రగతికి కాని క్షీణతకు కాని దోహదకరంగా ఉంటాయన్నారు. వెనుకబడిన సమాజాలలో రాజకీయాభివృద్ధి ఆర్థికాభివృద్ధికి ప్రధానమైన ప్రాతిపదికగా ఉంటుంది. కాని రాజకీయ వ్యవస్థ ఏవిధంగా ఆర్థిక తిరోగమనానికి, దోహదకారి అవుతుందో తెలుసుకోవడం చాలా సులభమే కాని ఆర్థిక ప్రగతి ఏవిధంగా దోహదకారి అవుతుందో తెలుసుకోవడం కష్టమని లూసియన్‌పై అన్నారు.

(2) పారిశ్రామిక సమాజాల ప్రత్యేకతగా రాజకీయ అభివృద్ధి: ఆర్థికంగా పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన సమాజాల రాజకీయ అభివృద్ధి చాలా ప్రాతిపదికమైన విషయం. అభివృద్ధి చెందని దేశాలు, బాగా అభివృద్ధి చెందిన పారిశ్రామిక దేశాల రాజకీయ ప్రవర్తనా ప్రమాణాలను అందుకోవటానికి ప్రయత్నించాలి.

(3) రాజకీయ ఆధునికీకరణంగా రాజకీయ అభివృద్ధి: కోల్మన్(COLEMAN) లిప్‌సెట్ (LIPSET) వంటి కొంతమంది సమాజ శాస్త్రజ్ఞులు అభివృద్ధిచెందిన అధునాతన పాశ్చాత్య రాజ్యాలను అభివృద్ధి చెందుతున్న రాజ్యాలు అనుకరించ ప్రయత్నించడాన్ని రాజకీయ అభివృద్ధిగా నిర్వచించారు. రాజకీయ అభివృద్ధికి, అభివృద్ధి చెందిన పాశ్చాత్య ఆధునిక రాజ్యాలు మార్గదర్శకాలు అని అర్థం. అభివృద్ధి చెంద ప్రయత్నిస్తున్న దేశాలు పాశ్చాత్య దేశాలను అనుకరించటంకోసం, తమ చారిత్రక సాంప్రదాయాలను విడనాడటానికి ఇష్టపడక పోవచ్చునని లూసియన్ పై వ్యాఖ్యానించారు.

BRAOU

(4) జాతిరాజ్యపరిణామమే రాజకీయ అభివృద్ధి: ఆధునిక జాతి రాజ్యంగా పరిగణన పొందటానికి అవసరమైన రాజకీయ విధానాల నిర్వహణ, రాజకీయ జీవన వ్యవస్థాపనా ప్రయత్నాలే రాజకీయ అభివృద్ధి అని కొందరి అభిప్రాయం. వారు రాజకీయ అభివృద్ధిని జాతివాద రాజకీయ అభివృద్ధిని జాతివాద రాజకీయంగా పేర్కొన్నారు. కాని జాతివాదం ఒక్కటే రాజకీయ అభివృద్ధికి తగిన పరిస్థితి అని చెప్పజాలం.

(5) రాజకీయ అభివృద్ధి, పాలన అభివృద్ధి, న్యాయ అభివృద్ధి: మాక్స్‌వెబర్, టాల్కాట్ పార్సన్స్ లాంటి సామాజిక శాస్త్రవేత్తలు రాజకీయ అభివృద్ధి దేశపు న్యాయ, పరిపాలన అభివృద్ధులతో ముడిపడి ఉన్నదన్న విషయానికి ప్రాముఖ్యమిచ్చారు. సమర్థవంతమైన ఉద్యోగి స్వామ్యవ్యవస్థ అభివృద్ధి ప్రక్రియకు అత్యంత ఆవశ్యకమైన విషయమంటున్నారు. రాజకీయ సామాజికీకరణం, ప్రజాభాగస్వామ్యం, వంటి ప్రక్రియలకు వీరు ప్రాధాన్యం ఇవ్వలేదని లూసియన్పై ఈ నిర్వచనాన్ని తిరస్కరించారు.

(6) రాజకీయ అభివృద్ధి, జనసమీకరణ, భాగస్వామ్యం: ప్రజాభాగస్వామ్యాన్ని విస్తృతమయ్యేదిశకు ప్రజలను మేల్కొల్పటమే రాజకీయ అభివృద్ధి అని కొందరు అన్నారు. దీనిలో భావోద్రేకవాదం, దిగజార్చే జనసమ్మోహనవాదం ఉందని, అవి సమాజ శక్తికి నిరోధకాలని లూసియన్‌పై తిరస్కరించారు.

(7) ప్రజాస్వామ్య నిర్మాణమే రాజకీయ అభివృద్ధి: పాలంబర(PALOMBARA) ప్రజలలో ప్రజాభాగస్వామ్య విలువలను పెంచేటట్లుగా చేసే కృషియే రాజకీయ అభివృద్ధి అని నివరించారు. ఈ నిర్వచనం ప్రజాస్వామ్యేతర దేశాలను రాజకీయ అభివృద్ధి నిర్వచనం నుండి వేరు చేస్తున్నది.

(8) స్థిరమైన, క్రమమైన మార్పే రాజకీయ అభివృద్ధి: ఒక క్రమపద్ధతిలో స్థిరంగా సాగే మార్పులను రాజకీయ

అభివృద్ధిగా వర్ణిస్తున్నారు. స్థిరత్వాన్ని క్రమపద్ధతితో జరిగే మార్పులను రెండింటిని సమ్మిళితం చేశారు. కాని ఎంతటి క్రమపద్ధతి అవసరమన్న విషయాన్ని నిర్వచించనందున పై తిరస్కరించారు.

(9) సమీకరణ శక్తి రాజకీయ అభివృద్ధి: కోల్మన్, ఆల్మండ్, టాల్కాట్ పార్సన్స్ వంటి సైద్ధాంతికులు రాజకీయ అభివృద్ధిని రాజ్యశక్తి కొరకు సమాజంలోని మానవ, మానవేతర వనరుల సమీకరణంగా వివరించారు. అలాంటి సమీకరణం లేకుండా ఎలాంటి అభివృద్ధి సాధ్యపడదు. రాజకీయ వ్యవస్థకుగల వనరులు, వాటి సమీకరణంపైననే రాజకీయ అభివృద్ధి ఆధారపడి ఉంటుంది. సమీకరించే శక్తి పరిమితంగా ఉన్నప్పుడు రాజకీయ అభివృద్ధి కొరవడినట్లవుతుంది.

(10) బహుళ్రుక్కోణాల మార్పుల ప్రక్రియయే రాజకీయ అభివృద్ధి: మాక్స్ మిల్లికాన్(MAX MILLIKAN) డేనియల్ లెర్నర్‌లు రాజకీయ అభివృద్ధి ఏకాంతమైన సంఘటన కాదన్నారు. రాజకీయ అభివృద్ధిని సామాజిక, ఆర్థిక విషయాల నుండి వేరు చేయలేం. బహుముఖ సామాజిక మార్పుల ప్రక్రియయే రాజకీయ అభివృద్ధి అన్నారు. విస్తృతమైన బహుముఖ సామాజిక మార్పుల ప్రక్రియలలో రాజకీయ అభివృద్ధి ఒకటి. ఈ నిర్వచనం బాగుందని లూసియన్‌పై అన్నారు. ఇందులో అన్ని రకాలైన అభివృద్ధులు ఉన్నాయి. ఆధునికీకరణం వలెనే రాజకీయ అభివృద్ధి కూడా సమాజంలోని సమాజేతర ప్రభావాలు, మార్పులు ఒకదానికి మరొకటి సంబంధం కలిగి ఉంటాయి.

పైన చర్చించిన వివరణలను పరిశీలిస్తే రాజకీయ అభివృద్ధి భావన నిర్వచనాలలో కొంత అసందిగ్ధత చోటుచేసుకొన్నట్లు తెలియవస్తున్నది. లూసియన్‌పై ఈ అసందిగ్ధతలను పరిష్కరించ ప్రయత్నించారు.

## 14.4 రాజకీయ అభివృద్ధి లక్షణాలు

BRAOU

పై పేరాలో వివరించిన నిర్వచనాలన్నింటిలోను కల సాధారణ విషయాలను లూసియన్‌పై గుర్తించారు. ఆయన రాజకీయ అభివృద్ధిలో కింది ప్రత్యేక లక్షణాలున్నాయన్నారు. అవి (1) సమానత్వం, (2) భిన్నత్వాలు, (3) సామర్థ్యం

సమానత్వం: రాజకీయ అభివృద్ధి అనగా జన సమూహపు భాగస్వామ్యం. రాజకీయ చర్యలలో, కార్యకలాపాలలో ప్రజలు పాల్గొనటం అని అర్థం. ప్రజాస్వామ్య దేశాలలో భాగస్వామ్యం ప్రజాస్వామికంగా ఉంటుంది. సంపూర్ణాధికార యుత దేశాలలో కూడా భాగస్వామ్యం ఉంటుంది. పౌరులు క్రియాశీలకంగా పాల్గొనటమే రాజకీయ అభివృద్ధి కీలక విషయం. రాజ్యంలో శాసనాలు అందరికీ వర్తించేవిగా ఉండాలి. రాజకీయ స్థానాల్లో భర్తీకి సామర్థ్యతా ప్రమాణాలు నిర్దేశితమై ఉండాలేగాని, ఆరోపిత (ASCRIPTIVE) ప్రమాణాలుగా ఉండరాదు. అన్ని జీవన రంగాలలోను సమానత్వం నెలకొనాలి. పౌరులందరికీ ఒకేరకమైన శాసనాలను వర్తింపచేస్తూ, అందరికీ సమాన అవకాశాలు లభ్యమయ్యేట్లు చూడాలి. ప్రతిపౌరునికి రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనే అవకాశముండాలి. చట్టం ముందు అందరూ సమానులే అన్న సూత్రాన్ని అమలుచేయాలి. వివిధ రాజకీయ పాత్రల కేటాయింపులలో తాటస్థ్యతను ప్రమాణికంగా అంగీకరించాలి.

సామర్థ్యం: రాజకీయ వ్యవస్థకు ఎదురైన సవాళ్ళను పరిష్కరించగలిగే శక్తినే సామర్థ్యంగా వ్యవహరిస్తున్నారు. సవాళ్ళను విజయవంతంగా ఎదుర్కొనగల్గితే వ్యవస్థ మనుగడ కొనసాగుతుంది. అలాకాని పరిస్థితులలో వ్యవస్థ మనుగడకు ముప్పు ఏర్పడుతుంది. తన పరిసరాలకు అనుగుణంగా రాజకీయ వ్యవస్థ మనుగడ సాగించాలని టాల్కాట్ పార్సన్స్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వ విధానాల రూపకల్పన అమలుపరచటంలో రాజ్యానికి గల సమర్థతనే సామర్థ్యమని పిలుస్తున్నాం.

భిన్నత్వాలు: రాజకీయ వ్యవస్థల నిర్మితులలో ప్రత్యేకతలు ఉండాలి. నిర్మితులన్నింటిని నిర్వహించగల విధుల పరిధులను నిర్దేశించాలి. అనగా వివిధ కార్యక్రమాల నిర్వహణకు నిర్మితుల మధ్య శ్రమ విభజన జరగాలి. అయితే

ఈ శ్రమ విభజనవల్ల వివిధ ప్రభుత్వ విభాగాలు ముక్కలు ముక్కలుగాకూడదు. సమైక్యంగా లక్ష్యసాధనకు వివిధ విభాగాలు సమర్థవంతంగా పనిచేసేటట్లుగా నిర్మితుల మధ్య శ్రమ విభజన జరగాలి.

లూసియన్ పై ఇంకా ఈ కింది విధంగా విశదీకరించారు. పైన మనం చర్చించిన రాజకీయ అభివృద్ధికి దోహదం చేసే మూడు మూలకాల మధ్య కొంత సంధానం ఏర్పరచాల్సి ఉంది. సమానత్వం కొరకు ప్రకటితమయ్యే డిమాండ్లవల్ల సమాజంలో ఉద్రిక్తతలు పెరగవచ్చు. అందువల్ల అధికతరమైన డిమాండ్లు రాజకీయ వ్యవస్థ సామర్థ్యతను దెబ్బతీసేవిగా ఉండే అవకాశాలున్నాయి. ఫలితంగా నిర్మితుల మధ్య భిన్నత్వాలు సమానత్వపు ప్రాముఖ్యతను తగ్గించవచ్చు. విస్తృత దృక్కోణంలో పరిశీలించినప్పుడు సమానత్వం రాజకీయ సంస్కృతి సామర్థ్యతలతో సంబంధం కలిగి ఉందని; భిన్నత్వాలు అధికారేతర నిర్మితుల సామర్థ్యానికి సంబంధించి ఉంటాయని ద్యోతకమవుతున్నది. పర్యవసానంగా రాజకీయ అభివృద్ధి సమస్య ఈ మూడు మూలకాలతోను, రాజకీయ వ్యవస్థలోని ఇతర భాగాలలోను సంబంధం కలిగి ఉంటుంది. అభివృద్ధి చెందుతున్న వ్యవస్థలో సమానత్వ సామర్థ్యం భిన్నత్వాల ప్రగతి స్థాయిని నిర్దేశిస్తాయని లూసియన్‌పై అభిప్రాయపడ్డారు. వీటినే కోల్మన్ తరువాత అభివృద్ధి సింద్రోమ్స్(DEVELOPMENTAL SYNDROMS) గా పేర్కొన్నారు.

రాజకీయ అభివృద్ధి భావనను లూసియన్‌పై బహుళ ప్రచారంలోకి తెచ్చినప్పటికీ అభివృద్ధి చెందుతున్న మూడవ ప్రపంచ రాజ్యాలకు దీనిని అన్వయించుటకు వీలుగా లియోనార్డ్ బిండర్ రాజకీయ అభివృద్ధి భావనకు కొన్ని కొత్త విషయాలను చేర్చారు. అవి:

(1) మతం నుండి జాతి, సంకుచిత భావాల నుండి సామాజిక భావాలకు మార్పు జరగాలి.

(2) సాంప్రదాయక భావాల నుండి ఆధునిక భావాలకు, న్యాయ సమ్మతమైన మార్పు జరగాలి.

(3) శిష్యుల నుండి ప్రజలకు, కుటుంబం నుండి సమూహమునకు రాజకీయ భాగస్వామ్యంలో మార్పు రావాలి.

(4) హోదా, ప్రత్యేక సదుపాయాలు తొలగిపోయి అర్హతగల వారికి అవకాశాలు లభ్యం కావాలి.

(5) సామాజిక నిర్మితిలో పరిపాలక, న్యాయ పదవులు దేశ నలుమూలలకు చెందిన వారికి లభ్యం కావాలి.

BRAOU

రిగ్స్ రాజకీయ అభివృద్ధి భావనను పర్యావరణ శక్తులతో సమైక్యపరచగా హంటింగ్ టన్ రాజకీయ వ్యవస్థ శక్తి సామర్థ్యాలతో జోడించారు. అనగా రాజకీయ వ్యవస్థ సామాజిక, DEMO GRAPHIC, నిర్మితులలో వచ్చే వివిధ మార్పుల ప్రక్రియలను నియంత్రించు, సమన్వయంచేయు శక్తి సామర్థ్యాలు కూడా రాజకీయ అభివృద్ధిలో నిబిడీకృతమై ఉన్నాయి.

రాజకీయ అభివృద్ధి లక్ష్యం, అర్థాల గురించి పునః పరిశీలించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. అభివృద్ధి అనగా వస్తువుల వృద్ధి కాదు. తిండి, బట్ట, ఇల్లు, ఆరోగ్యం, విద్య మొదలగు కనీస అవసరాల పట్ల మానవులకు కలిగే సంతృప్తి, కనీస అవసరాలను తీర్చలేని అభివృద్ధి ప్రక్రియను ''అభివృద్ధి''గా పరిగణించవీలు లేదు. అల్ప సంఖ్యాక ధనిక వర్గానికి ప్రయోజనం కల్పించే లేదా ధనిక, పేద వర్గాల మధ్య వ్యత్యాసాన్ని పెంపొదించే లేదా దేశం లోపలకాని, వివిధ దేశాల మధ్య కాని వ్యత్యాసాన్ని పెంపొందించే అభివృద్ధి ప్రక్రియను ''అభివృద్ధి'' అని అనటానికి వీలు లేదు. నిజానికది దోపిడీ అవుతుంది. రాజకీయ అభివృద్ధి భావన ప్రయోజనాలు ప్రజల మధ్య న్యాయబద్ధంగా పంపిణీ చేయాలి. ప్రజలకు దేశ రాజకీయ వ్యవస్థ విధాన నిర్ణయాలలో భాగస్వామ్యం, భావ ప్రకటనా స్వాతంత్ర్యం, పనిహక్కు, ఉత్పత్తి, పంపిణీ, నిర్వహణలలో భాగస్వామ్యం కల్పించాలి.

## 14.5 రాజకీయ అభివృద్ధి సిద్ధాంతాలు

రాజకీయ అభివృద్ధి భావనను బాగా లోతుగా అధ్యయనం చేసిన వాడు లూసియన్ పై. పాత జీవన పద్ధతులను కొత్త అవసరాలకు తగిన విధంగా మలుచుకోవటమనే ప్రాతిపదికగా రాజకీయ అభివృద్ధిని పై నిర్వచించారు. జాతి

రాజ్యవ్యవస్థ (NATION STATE SYSTEM) పరిణామం రాజకీయ అభివృద్ధి తొలిదశగా ఆయన విశ్వసించారు. ఈ పరిణామం క్రమంగా అన్ని సమయాలలో మార్పులు తెస్తూ ప్రపంచ సంస్కృతికి నాంది పలుకుతుందని ఆయన పేర్కొన్నారు. 1965లో ''రాజకీయ సంస్కృతి, రాజకీయ అభివృద్ధి'' అను గ్రంథంలో రాజకీయ అభివృద్ధి కీలకాంశాలను మూడు స్థాయిలలో కనుక్కోవచ్చునని పేర్కొన్నారు. అవి: జనాభా, ప్రభుత్వ స్థాయి, రాజకీయ వ్యవస్థ.

రాజకీయ వ్యవస్థలో ప్రజలు ఎక్కువగా పాల్గొనటం ప్రాథమికమైన మార్పుకు హేతువు అయింది. ప్రజల భాగస్వామ్యం రాజకీయాల అవగాహనను పెంచింది. సమాజంలో సమానత్వంపై ప్రజల దృష్టి పెరిగింది. రాజకీయ వ్యవస్థలో ప్రభుత్వ కార్యకలాపాలను కార్యసాధకంగా నిర్వహించే శక్తి పెరిగింది. విభిన్న రంగాల మధ్య సమన్వయం సాధ్యపడింది. క్లుప్తంగా చెప్పాలంటే అభివృద్ధి చెందుతున్న వ్యవస్థలో సమానత్వం, శక్తి, విభిన్నత, ప్రధాన లక్షణాలుగా ఉన్నాయి. ఈ లక్షణాలే పెంపుదల రాజకీయ అభివృద్ధిని నిర్ణయిస్తాయి. ఈ లక్షణాలనే(DEVELOPMENTAL SYNDROME)గా కోల్మన్ అభివ్యక్తీకరించారు. రాజకీయ అభివృద్ధి తొలి రచయితలు ఏయే దశ లేక స్థాయి నుండి సమాజాలు అభివృద్ధివైపు పయనించాయి అనేదానికంటే అభివృద్ధి చెందిన పశ్చిమ దేశాల నుండి అభివృద్ధి చెందుతున్న దేశాల లక్షణాలను గుర్తించటానికి ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చారు. వార్డ్, రోస్టోవ్‌లు తమ పరిశోధనల్లో కొన్ని ఉద్దేశాల్ని పేర్కొన్నారు. అవి:

(1) ఈనాడు బాగా పరిణితి చెందిన దేశాలు ఏవిధంగా తమ సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధి సాధించాయన్న పద్ధతిని సూక్ష్మంగా విశ్లేషణం చేసి చూడటం;

(2) అభివృద్ధి పరిణామ దశలో మార్పుల వరుసను పరిశీలించటం;

(3) అభివృద్ధి పద్ధతుల్లో ఒకేరకమైన సంక్షోభాలను ఎదుర్కోవలసి వచ్చిందో లేదో పరిశీలించటం.

కాని వీటిని గురించి వివరించటానికి వారు ప్రయత్నించలేదు. లూసియన్ పై బ్రిటన్, మరి ఇతర దేశాలలో వివిధ పరిస్థితులలో ఉత్పన్నమయ్యే సంక్షోభాలను గుర్తింపు సంక్షోభం(IDENTITY CRISIS) శాసన బద్ధత (LEGITIMACY) చొరవ(PENETRATION) భాగస్వామ్యం(PARTICIPATION) సమైక్యత(INTEGRATION) పంపిణీ(DISTRIBUTION)లుగా పేర్కొన్నారు. ఈ సంక్షోభాలనేవి వివిధ దేశాల్లో వివిధ రకాలుగా ఉంటాయని కూడా ఆయన పేర్కొన్నారు. కెన్నెత్ ఆర్గానిస్కీ కూడా రాజకీయ అభివృద్ధిలో ఉత్పన్నమయ్యే సంక్షోభాల సమస్య గురించి స్పందించాడు. కెన్నెత్ ఆర్గానిస్కీ, రోస్టోవ్‌లు అభివృద్ధి చెందుతున్న సమాజం తన అభివృద్ధి లక్ష్యాన్ని నాలుగు దశల్లో చేరుకొంటుందని పేర్కొన్నారు. అవి:

మొదటి దశ: రాజ్యంలో అధికారం కేంద్రీకరించటం;

రెండో దశ: ఆర్థికాభివృద్ధి సాధనకై పారిశ్రామికీకరణం జరగటం;

మూడో దశ: ప్రభుత్వ ఆర్థిక రాజకీయ ఫలితాలను ప్రజలకు అందించటం;

నాల్గవ దశ: ప్రజలు భౌతిక సంపదను అధిక స్థాయిలో సాధించటం.

ఆర్గానిస్కీ రాజకీయ సంస్థలపైకన్నా ఆర్థిక విషయాలపై దృష్టిని కేంద్రీకరించారు. ఒక దేశం ఏ రాజకీయ విధానాల ద్వారానైనా సరే ఆర్థికాభివృద్ధి సాధించవీలున్నదని ఆయన విశ్వసించారు. వర్ధమాన దేశాలు రాజకీయ అభివృద్ధిని ఏ రాజకీయ వ్యవస్థ ద్వారానైనా సాధించవచ్చుననే విషయం మీద వాదోపవాదాలు ఉన్నాయి. షిల్స్ రాజకీయ వ్యవస్థలను ఐదు రూపాలుగా విభజించారు. (1) రాజకీయ ప్రజాస్వామ్యం, (2) సంరక్షణాధికార ప్రజాస్వామ్యం, (3) ఆధునీకృత అల్పజనపాలన, (4) నియంతృత్వ అల్పజన పాలన, (5) సాంప్రదాయక అల్పజన పాలన.

డేవిడ్ ఆప్టర్ (POLITICS OF MODERNISATION) గ్రంథంలో సాంప్రదాయ సమాజాల అభివృద్ధికి రెండు దశలను సూచించారు. ఆ సమాజాలలో ఉన్న ప్రభుత్వ స్వరూపాన్ని బట్టి దశను నిర్ణయించాల్సి ఉంది. ఆప్టర్ సూచించిన

BRAOU

అభివృద్ధి అనుక్రమాలు: (1) క్రమానుగత శ్రేణిగలది, (2) సూచ్యాకారమైనది.

1960 దశాబ్దం మధ్యలో రాజకీయ శాస్త్రజ్ఞులకు తాము సమాజశాస్త్రం మీద ఎక్కువగా ఆధారపడుతున్నామనే భావన కల్గింది. నిర్మితి – విధుల నమూనా ఆధారంగా వచ్చిన అధ్యయనాలతో ప్రభావితం కావటం మంచిదని కాదని భావించారు. రాజకీయ అభివృద్ధి ఒక కొత్త మార్పు దశగా గాక వేరే అంశాల మీద ఆధారపడగల్గేదన్న భావన సరైనది కాదని భావించారు. డంక్ వాన్ట్ రోస్టో(DANKWANT RUSTOW) సి.ఇ.బ్లాక్, మైరన్ వీనర్‌లు ''ఆధునికీకరణ'' అంశంపై దృష్టిని కేంద్రీకరించారు.

1960 దశాబ్దంలో రాజకీయ అభివృద్ధిపై వివిధ శాస్త్రజ్ఞులు చేపట్టిన అధ్యయనాల వల్ల రాజకీయ అభివృద్ధిపైన సరియైన అవగాహన ఏర్పడింది. ఆరంభంలో సంస్థాగత అధ్యయన పద్ధతి ద్వారా(INSTITUTIONAL APPROACH) ప్రభుత్వాన్ని పరిశీలించారు. చాలా మంది రచయతలు ఆర్థికాభివృద్ధ స్థాయి విధిగా రాజకీయ అభివృద్ధిని వివరించారు. అభివృద్ధి చెందిన దేశం ఒకవేళ ప్రజల ఆర్థిక ఆశయాలను తృప్తిపరచలేకపోయినచో సమాజంలోని వివిధ వర్గాల మధ్య సత్సంబంధాలను నెలకొల్పలేదు. పర్యవసానంలో ప్రభుత్వం శాంతి భద్రతలను కాపాడటంలోను, విధానాలు అమలుపరచటానికి రాజకీయ వ్యవస్థకు న్యాయబద్ధత, సామర్థ్యం లోపిస్తాయి. ఈ సందర్భంలో రాజకీయ వ్యవస్థ పనిచేయటానికి వీలుగా సామాజిక వ్యవస్థను మార్చవలసి ఉంటుంది. లేనిచో ప్రజల భాగస్వామ్యం సాధ్యపడదు. ప్రజల దృక్పథాలలో, వ్యక్తిత్వ వృద్ధిలో, పౌరుల లక్షణాలలో మార్పు ప్రతిబింబిస్తూ క్రమంగా రాజకీయ అభివృద్ధి సాధ్యమౌతుంది. అనగా రాజకీయ అభివృద్ధి, ఆర్థిక, సామాజిక, పాలనా, రాజకీయ, సాంస్కృతిక అంశాలపై ఆధారపడుతుంది. కాని ఏ కారకం ఎంత ప్రభావాన్ని చూపించిందనేది చెప్పటం కష్టం. రాజకీయ అభివృద్ధిని ఆధారిత చలాంకంగా (DEPENDENT VARIABLE) వివరించటమే ఈ అధ్యయనాలలోగల ప్రధాన లోపం. రాజకీయ అభివృద్ధిని వివిధాంశాలు ప్రభావపరచినట్లుగానే రాజకీయ అభివృద్ధి కూడా ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, ఉపరితల అంశాలను ప్రభావపరచటంలో ప్రధాన పాత్ర వహించి శిష్టులు నిర్ణయించిన సమష్టి లక్ష్యాలను సాధించటానికి ఉపరితలానికి కొత్త రూపాన్ని ఇవ్వదా?

BRAOU

## 14.6 సిద్ధాంత అన్వేషణ: ద్వితీయ దశ

1960 దశాబ్దపు చివరలో రాజకీయ అభివృద్ధి అధ్యయనాల దృష్టి ఉపరితల నిర్మితుల అధ్యయనం నుండి రాజకీయ సంస్థల, రాజకీయ వేత్తల లక్ష్యం, సామర్థ్యతల వైపుకు మళ్ళించారు. అనగా రాజకీయ అభివృద్ధి విషయంపై పరిశీలకులు కొత్త దృక్పథాన్ని ప్రవేశపెట్టారు. రాజకీయ అభివృద్ధిని నిర్మితుల దృష్టితో కాకుండా రాజకీయ సంస్థల పరంగా, రాజకీయ వేత్తల పరంగా విశ్లేషించటం మొదలుపెట్టారు. రాజకీయ అభివృద్ధిని ఆర్థిక, సామాజిక, మానసిక వత్తిడులు ప్రభావపరచినప్పటికీ, రాజకీయ నాయకులే సమాజం అవసరాలను డిమాండ్లను, సమస్యలను నిర్ణయించి రాజకీయ అభివృద్ధికి ఒక రూపాన్ని ఇచ్చి మార్గదర్శకత్వం వహిస్తారు. మరోవిధంగా చెప్పాలంటే రాజకీయ అభివృద్ధి చివర దశ కాదని, ఇదొక నిరంతర గమనమని పేర్కొన్నారు. ఐసెన్ స్టడ్, హాల్పర్న్, హంటింగ్‌టన్, మున్నగువారు రాజకీయ అభివృద్ధిని అధ్యయనం చేయటానికి కొత్త దృక్పథాలను పద్ధతులను ప్రవేశపెట్టారు. వీటిని WILL AND CAPACITY; PROBLEM SOLVING CAPACITY; ABILITY TO SUSTAIN NEW GOALS గా పేర్కొనవచ్చును. ''పెరుగుతున్న విభిన్నతలు, రాజకీయ నిర్మితుల ప్రత్యేకీకరణ, వృద్ధిచెందిన లౌకిక రాజకీయ సంస్కృతి'' రాజకీయ అభివృద్ధి అని ఆల్మండ్ పేర్కొన్నారు. ఐసెన్‌స్టడ్ ఎల్లప్పుడూ మార్పులను తనలో ఐక్యం చేసుకొనే శక్తిగల వ్యవస్థా స్వరూపాన్ని రాజకీయ అభివృద్ధి అని అన్నారు.

రాజకీయ అభివృద్ధిపై హంటింగ్ టన్ చేసిన విశ్లేషణలో రాజకీయ క్షీణత(POLITICAL DECAY) ప్రధానమైనది. మూడవ

ప్రపంచ దేశాలు శీఘ్రగతిన ఆధునికీకరణం చెందుటకు దీర్ఘకాలిక, స్వల్పకాలిక ప్రణాళికల ద్వారా తీవ్రమైన ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ ప్రయత్నాలవల్ల పారిశ్రామికీకరణం వృద్ధిచెంది నగరీకరణం వృద్ధికి దోహదపడుతున్నది. ఆయా దేశాలలో ప్రజలు చైతన్యవంతులవుతున్నారు. ఆధునికీకరణంవల్ల విద్యావంతుల సంఖ్య పెరుగుతున్నది. దేశంలోని ప్రజలందరికీ తమ జీవనస్థాయిని వృద్ధిచేసుకోవాలన్న కాంక్షలు నానాటికి పెరుగుతున్నాయి. కాని వారి ఆశలు అడియాసలవుతున్నాయి. పర్యవసానంగా అసంతృప్తి పెరిగి; ఆందోళనలు, హింసా ప్రవృత్తులు వృద్ధిచెందుతున్నాయి. ఆధునికీకరణం జరిగిన నిష్పత్తిలో రాజకీయ వ్యవస్థలోని సంస్థలు వృద్ధి చెందకపోవడమే ఇందుకు ప్రధానకారణమని హంటింగ్‌టన్ వ్యాఖ్యానించారు. విద్యా సౌకర్యాలు వ్యాప్తిచెందటంవల్ల విద్యాధికులు అధికమయ్యారు. కాని వారికి ఉద్యోగ అవకాశాలు తగ్గిపోయాయి. వైద్య సౌకర్యాలు పెరిగాయి; కాని పోషక ఆహార పదార్థాలు సమకూర్చటం కష్టమౌతున్నది. వయోజన ఓటింగ్ హక్కు కల్పించారు. కాని వయోజనుల రాజకీయ ఆశల సంతృప్తికి తగిన నూతన రాజకీయ అవకాశాలు వృద్ధి చెందలేదు. ఫలితంగా రాజకీయ వ్యవస్థ ప్రజల ఆశయాలను సంతృప్తిపరచలేకపోతున్నది. దాంతో రాజకీయ వ్యవస్థ తాటస్థ్యతమీద విశ్వాసం సడలిపోయింది. తమకు ఇష్టమైన రీతిలో రాజకీయ వ్యవస్థ మారాలని యువజనులు డిమాండ్ చేస్తున్నారు. ఈ పరిస్థితులన్నీ ప్రజా సమూహ రాజకీయాలకు (MASS POLITICS) దారితీస్తున్నాయి. సంస్థల సంస్థాపక స్థాయిలో పెరుగుదల తగ్గినప్పుడు రాజకీయ వ్యవస్థ పెరుగుతున్న ప్రజల ఆశయాలకు అనుగుణంగా మనుగడసాగించలేదు. ఫలితంగా ప్రతిచోట రాజకీయ అస్థిరత్వం ప్రబలుతున్నది. సామాజిక సమీకరణం చెందిన వ్యక్తులకు రాజకీయ భాగస్వామ్యం పరిస్థితులు మెరుగుపడుటకు దారితీస్తుంది. సామాజిక అసంతృప్తివల్ల ప్రభుత్వంపై డిమాండ్లు పెరుగుతాయి. రాజకీయ భాగస్వామ్యం విస్తృతి చెందటంవల్ల డిమాండ్లు అమలుచేయాలన్న కోరికలు బాగా బలం పుంజుకుంటాయి. పెరుగుతున్న డిమాండ్లకు అనుగుణంగా వెనుకబడిన స్థితిలో ఉన్న ప్రభుత్వం తన శాసనబద్ధతను కోల్పోతుంది. రాజకీయ భాగస్వామ్యం విస్తృతమయ్యే కొద్దీ రాజకీయ స్థిరత్వంలో సడలింపులు ప్రవేశిస్తాయి. ఈ విధమైన పరిస్థితులు సైనిక నియంతృత్వానికి మార్గాలను వేస్తాయి. ఆధునికీకరణ నిష్పత్తిలో రాజకీయ సంస్థలు వృద్ధిచెందని రాజకీయ వ్యవస్థలలో రాజకీయ అభివృద్ధికి బదులు రాజకీయ క్షీణత సంభవిస్తుంది. మూడవ పపంచ రాజ్యాల సమస్యలను విశ్లేషించిన హంటింగ్ టన్ ఆ రాజ్యాలు రాజకీయ అభివృద్ధివైపుకుగాక రాజకీయ క్షీణత ఉంటుంది. అవి అంతరిస్తాయి. మరల వృద్ధిచెందుతాయని కూడా హంటింగ్ టన్ అన్నారు. రాజకీయ అభివృద్ధితో సంబంధంకల రాజకీయ క్షీణత భావనను హంటింగ్‌టన్ ప్రవేశపెట్టారు. రాజకీయ అభివృద్ధి, రాజకీయ క్షీణత రెండూ పరస్పర సంబంధంకల ప్రక్రియలు. ఆయన రాజకీయ అభివృద్ధి నిర్వచనం రాజకీయ క్షీణతను కూడా గణనలోకి తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

BRAOU

రాజకీయ వ్యవస్థల సామర్థ్యత పెరగవచ్చు. తరగవచ్చు. సమయసందర్భాలను ఎదుర్కొనగల రాజకీయ వ్యవస్థ సామర్థ్యత, అసమర్థత, రాజకీయ అభివృద్ధికి ప్రధాన సూచకంగా ఉంటాయన్నారు. కాని సాధారణంగా సందర్భాలకు, రాజకీయ వ్యవస్థల సామర్థ్యతకు మధ్య పెద్ద అఘాతం ఉంటున్నది. ఈ అఘాతాన్ని అలాగే కొనసాగించినట్లయితే అది రాజకీయ క్షీణతకు దోహదం చేస్తుంది. ఇటువంటి ధోరణి సైనిక నియంతృత్వాన్ని ఆహ్వానించవచ్చు. దాని పరిష్కారానికి రాజకీయ వ్యవస్థ సామర్థ్యత పెరగాల్సి ఉన్నది.

రాజకీయ క్షీణత రాజకీయ అభివృద్ధికి వ్యతిరేకమైన భావన కాదు. ఆ రెండింటికి పరస్పర సంబంధమున్నది. అందువల్లనే రాజకీయ అభివృద్ధిని నిర్వచించేటప్పుడు రాజకీయ క్షీణతను కూడా గమనించాల్సి ఉన్నది. రాజకీయ క్షీణత ఎక్కువ రాజకీయ అభివృద్ధికి కారకము కావచ్చును – ఉత్పాదకములు లభించడం తగ్గినప్పుడు దానికి వ్యతిరేక దిశగా రాజకీయ అభివృద్ధి ప్రారంభం కావచ్చు. రాజకీయ వ్యవస్థల సామర్థ్యతలోకానీ, క్షీణతలోకానీ ఒత్తిడి ఎక్కువ కావడం సంభవించవచ్చు. హంటింగ్టన్ రాజకీయ అభివృద్ధితోపాటుగా రాజకీయ క్షీణతను కలిపి అధ్యయనం చేసారు. ఫ్రెడ్ డబ్ల్యూ. రిగ్స్ (Fred W.Riggs) వ్రాసిన ''సమకాలీన రాజకీయ విశ్లేషణ'' అనే వ్యాసం రాజకీయ అభివృద్ధిపై ఒక అవగాహననిస్తుంది. సాంకేతిక, సాంస్కృతిక మార్పులను వేరు పరచడానికి ఆయన కృషిచేసాడు. రాజకీయ సంస్థలనేవి

కేవలం సాంకేతికమైనవే తప్ప సాంస్కృతికం కావని ఆయన భావం. ఆయన నిర్మితుల విశ్లేషణ(Structural Analysis)కి విధుల విశ్లేషణ (Functional Analysis)కు ప్రాముఖ్యత నివ్వడాన్ని విమర్శించాడు. సమానత్వం, సామర్థ్యం, విభిన్నతలతో కూడిన లూసియన్‌పై Developmental Syndrome మీద వ్యాఖ్యానిస్తూ రాజకీయ వ్యవస్థలోని సభ్యులు ఎంతవరకు రాజకీయ విధానాల రూపకల్పనలో పాల్గొనే అవకాశం కలిగి విధానాల అమలు నుండి లాభాలు పొందగలం అనేదాన్నిబట్టి సమానత్వం ఉంటుందన్నాడు. సామర్థ్యం అనేది అందరూ అంగీకరించిన లక్ష్యాలను అమలుపరిచే రాజకీయ వ్యవస్థ శక్తి. రాజకీయ వ్యవస్థ తగు విభిన్నతను సాధించలేకపోతే, సమానత్వం, సామర్థ్యం సాధ్యం అవుతాయి. విభిన్నత ఎక్కువగా ఉన్న సమాజంలోని ప్రభుత్వ సంస్థల ద్వారానే సామర్థ్యం, సమానత్వంలకు అవకాశం ఉండే రాజకీయ పరిస్థితులు కొనసాగగలవు. సమానత్వాన్ని అభివృద్ధి చేయడం వామపక్షాల లక్ష్యం, రైటిస్టు పక్షాల లక్ష్యం సామర్థ్యాన్ని పెంచడం – ఈ రెండు గ్రూపుల మధ్య సమతౌల్యం ముఖ్యం. అది లేనిచో రాజకీయాభివృద్ధి రిగ్ చెప్పిన అభివృద్ధి చిక్కులో ఇరుక్కుపోయే ప్రమాదముంది. రెండింటి మధ్య సమతౌల్యం ఉన్నప్పుడే నిర్మిత విభిన్నతలు ఎక్కువ కాగలవు.

## 14.7 సిద్ధాంత అన్వేషణ: మూడవ దశ

డానియల్ లెర్నర్, కార్ల్ డూష్(Karl Deutsh) ఇంకనూ అనేక ఇతర సామాజిక శాస్త్రవేత్తలు సామాజిక ప్రక్రియల సిద్ధాంతాన్ని (Theory of Social process) వృద్ధి చేసారు. వీరు సామాజిక ప్రక్రియలయిన పారి శ్రామికీకరణ, నగరీకరణ, వ్యాపారీకరణ, అక్షరాస్యతా విస్తృతిని అధ్యయనం చేయడం ద్వారా రాజకీయాభివృద్ధిని అర్థం చేసికొనుటకు ప్రయత్నించారు. వీరు సామాజిక ప్రక్రియ పద్ధతి(approach) ద్వారా ప్రక్రియలకు causal విశ్లేషణలకు మధ్య పరస్పర సంబంధాన్ని (co-relation) ఏర్పరచ ప్రయత్నించారు. వ్యవస్థల సిద్ధాంతం (approach) ఒకరకమైన చర్యతో మొత్తం వ్యవస్థకు సంబంధం కల్పించ ప్రయత్నించగా సామాజిక ప్రక్రియ సిద్ధాంతం ఒకరకమైన చర్యకు, ఇంకోరకమైన చర్యకు మధ్య పరస్పర సంబంధాన్ని(co-relate) ఏర్పరచ ప్రయత్నించింది. సామాజిక ప్రక్రియల పద్ధతి వ్యవస్థల పద్ధతికంటే ఉన్నతమైనది. ఎందుకనగా ఈ పద్ధతి వివిధ కారకాల మధ్య సంబంధాన్ని ఏర్పరుస్తుంది. ఒక సమూహ కారకాల మధ్య వచ్చే మార్పులకు ఇంకొక సమూహ కారకాల మధ్య వచ్చే మార్పుల మధ్య సంబంధాన్ని ఏర్పరచుతుంది.

వ్యవస్థల సిద్ధాంతం, సామాజిక ప్రక్రియల సిద్ధాంతానికి భిన్నంగా తులనాత్మక చారిత్రక సిద్ధాంతం (comparative history approach) మార్టిన్, లిప్‌సెట్, రిచర్డ్ బిండిక్స్, మూరె, బ్లాకో,Eisenstadt, డాంక్ వార్ట్, రుస్టో, హంటింగ్‌ల చే వృద్ధి చేయబడింది. ఈ సిద్ధాంతం చారిత్రకాంశాలకెక్కువ ప్రాధాన్యత నిస్తుంది. రెండు లేదా అంతకంటే ఎక్కువ సమాజాల స్వభావసిద్ధ పరిణామాన్ని వివరిస్తుంది. ఒక దానితో ఇంకోదానిని పోల్చి తేడాలను విపులీకరిస్తుంది. దశల వారీ అభివృద్ధిని వివరిస్తుంది. సామాజిక ప్రక్రియల సిద్ధాంతం కంటే ఇది రాజకీయ సంస్థలు, సంస్కృతి, నాయకత్వంల పాత్రను లోతుగా అధ్యయనం చేసింది. అయినప్పటికి ఈ రెండు సిద్ధాంతాలు సైద్ధాంతిక చట్రాలను (Conceptual framework)ను కలిగిలేవు. వ్యవస్థల సిద్ధాంతానికి conceptual frame work, అధునాతన పరిశోధనా సాధనాలున్నాయి. అయినప్పటికీ ఈ మూడు పద్ధతులలో(approaches) ఏ ఒక్కటి కూడా రాజకీయ అభివృద్ధిని అధ్యయనం చేయడానికి తగిన Frame work ని అందించలేకపోయింది. ఈ సందర్భంలో నిర్మితుల విధుల పద్ధతి మార్పుల నధ్యయనం చేయడంలో, సామాజిక ప్రక్రియల పద్ధతి రాజకీయాలలో, తులనాత్మక చారిత్రక పద్ధతి ఒక సిద్ధాంతాన్ని రూపొందించడంలో విఫలమయ్యాయని హంటింగ్టన్ వ్యాఖ్యానించారు.

## 14.8 రాజకీయ అభివృద్ధి భావన వివరణ: సమస్యలు

రాజకీయ అభివృద్ధి భావనను వివరించడంలో నాలుగు రకాల సమస్యాపూర్వ పరిస్థితులెదురౌతాయనిNettl

పేర్కొన్నాడు. అవి:

1. *Definitional Priorities* నిర్వచనా ప్రాధాన్యతలు: అభివృద్ధి భావన అర్ధశాస్త్ర విభాగంలో ఆవిర్భవించింది. తరువాత సామాజిక సైద్ధాంతికుల చేత రెండో ప్రపంచ యుద్ధానంతరం స్వాతంత్ర్యం పొందిన రాజ్యాల సాంస్కృతిక ఆటంకాలు, వ్యక్తిగత వైరుధ్యాలను అధ్యయనం చేయడానికి ఉపయోగించబడింది. నూతనంగా స్వాతంత్ర్యం పొందిన రాజ్యాలు అర్థిక, సామాజిక ప్రాధాన్యతలకు ప్రాముఖ్యత నిచ్చాయి. సమస్యల పరిష్కారానికి ప్రజాస్వామ్యాన్ని ప్రక్కనబెట్టి అర్థిక పరిష్కారాలను సూచించారు. ప్రత్యేకమైన, గుర్తించదగిన సామాజిక లక్ష్యాల సాధనే అభివృద్ధి అని కొంతమంది ప్రజలనుకుంటారని పేర్కొన్నాడు. కొంతమంది రచయితలు పశ్చిమ దేశాలు వివిధ రంగాలలో సాధించిన ప్రగతిని అభివృది చెందుతున్న దేశాలు ఒక నమూనాగా తీసికోవాలన్నారు. అర్థిక, సామాజిక, రాజకీయ ప్రాధాన్యతల దృష్ట్యా అనిశ్చితమైన, అంగీకారయోగ్యం కాని అభివృద్ధి సిద్ధాంతాలు రాజకీయాభివృద్ధి భావనపై ప్రభావాన్ని తగ్గించాయి.

2. *విలువలు:* రాజకీయాభివృద్ధి విషయ పరిధిలో ఉపయోగించిన పదజాలం, సంప్రదాయికత లేదా ఆధునికత స్వేచ్ఛా లేదా Closed సమాజాలు, అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న సామాజిక వ్యవస్థలు, సందిగ్ధతను ఆశ్చర్యాన్ని కల్గిస్తుంది. కొన్ని అభివృద్ధి చెందుతున్న దేశాలు పాశ్చాత్య అభివృద్ధి నమూనాను ప్రశంసించగా కొన్ని దేశాలు తిరస్కరిస్తూ పాశ్చాత్య నమూనాను స్థిరత్వాన్ని ధ్వంసం చేసే వినాశకారి అని పేర్కొన్నారు. పాశ్చాత్య ప్రపంచ విలువలు సవాల్ చేయబడ్డాయి.

3. *అభివృద్ధి చెందిన, తక్కువ అభివృద్ధి చెందిన రాజ్యాల మధ్య సంబంధం :* రాజకీయ అభివృద్ధి సిద్ధాంతం తూర్పు, పశ్చిమ, అభివృద్ధి చెందిన లేదా అభివృద్ధి చెందుతున్న రాజ్యాలన్నింటికి తప్పనిసరిగా వర్తించేదిగా ఉండాలి. ఎందుకనగా ,ఈ రెండు పరస్పర ఆధారితాలు. అనగా అభివృద్ధి లక్ష్యం కోసం యూరోపు అమెరికా , రష్యాల చరిత్రలను తిరిగి వ్రాయాలి.

BRAOU

4. *Rank Order for development:* అభివృద్ధి భావన మొదటగా అర్ధశాస్త్రంలో తరువాత సామాజిక శాస్త్రంలో ఉపయోగించినప్పటికీ రాజకీయ వ్యవస్థ సామర్ధ్యాన్ని అర్థిక, సామాజిక, రాజకీయ సమస్యల పరిష్కారంలో అభివృద్ధి భావనకు ప్రాముఖ్యత నీయువలెను. ఒక ప్రత్యేక సమాజాల ప్రకారం అభివృద్ధి విభిన్న ప్రక్రియ అయినచో వారి లక్ష్యాలను, స్థాయిలను నిర్ణయించడం అర్థరహితం.

ఈ సమస్యలను తొలగించడానికి Nettl నాలుగు ప్రధానాంశాలను పేర్కొన్నాడు. అవి:

1. సామాజిక సైద్ధాంతికులు ప్రపంచ రాజ్యాలన్నీ పరస్పర సంబంధాన్ని కలిగి ఉన్నట్లుగా అభివృద్ధి అధ్యయనం అంతర్ విభాగీయ focus కలిగి ఉన్నదని అర్థం చేసికోవాలి.

2. రాజకీయాభివృద్ధి అనగా ప్రగతి మరియు క్షీణత రెండూ అని గ్రహించాలి.

3. రాజకీయభివృద్ధి అధ్యయనంలో జనాభా సమస్యను పరిగణించాలి.

4. రాజకీయాభివృద్ధి సిద్ధాంతాలు జాతి వివాదాలను (racial conflicts) జాతి విభేదాలను (racial differences) accomadate చేసుకోవాలి.

## 14.9 రాజకీయాభివృద్ధి : మూడవ ప్రపంచ రాజ్యాల ధోరణి

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత వలస ఆధిపత్యం నుండి విమోచనం చెందిన చాలా రాజ్యాలు తమ అభివృద్ధికి కృషి సలుప ప్రారంభించాయి. ఈ దేశాలన్నీ చాలా బీద దేశాలు. అభివృద్ధి చెందనటువంటి దేశాలు. వలస పాలకులు

ఈ దేశాలను అభివృద్ధి చేయలేదు. ఈ దేశాలన్నీ వ్యవసాయిక ఆర్థిక వ్యవస్థలనే కలిగి ఉన్నాయి. ఆధునకీకరణ చెంది అభివృద్ధి సాధించడానికి ఈ దేశాలు తమ పూర్వ వలస ప్రభువుల ధోరణినే అనుసరించసాగాయి. వీటిలో కొన్ని రాజ్యాలు కొంతవరకు అభివృద్ధిని సాధించగలిగాయి. ఈ అభివృద్ధిని విశ్లేషించటానికి యూరోపియన్, అమెరికన్ మేధావులు ప్రయత్నించారు. వివిధ ప్రాంతీయ అధ్యయనాలను చేపట్టారు. వివిధ నమూనాలను కూడా వివరించారు. ఈ మేధవులు సూచించిన నమూనాలన్నీ పాశ్చాత్య రాజ్యాల అనుభవాల పర్యవసానాలే. మూడవ ప్రపంచ రాజ్యాల అభివృద్ధికి నమూనాలను సూచించినవారు ఆయా దేశాల సామాజిక, రాజకీయ దృగ్విషయాలను సరిగ్గా అర్థం చేసికోలేకపోయారు. పాశ్చాత్య నమూనాలకు, వాస్తవంలో మూడవ ప్రపంచ రాజ్యాలు సాధించిన అభివృద్ధికి మధ్య చాలా వ్యత్యాస ముండటాన్ని వీరు గమనించారు. రోస్టోవ్, పార్సన్స్, లెర్నర్, ఆల్మండ్, షిల్స్, లూసియన్‌పైలు చర్చించిన రాజకీయ అభివృద్ధి నమూనాలకు ఔచిత్యం లేకుండా పోయింది. దీని పర్యవసానంగా మూడవ ప్రపంచ రాజ్యాలకు చెందిన కొంతమంది మేధావులు రాజకీయ అభివృద్ధి విశ్లేషణకు స్వంతంగా కొన్ని నమూనాలను నిర్మించారు. అలాంటి వారిలో పాల్ బారన్, గుండర్ ఫ్రాంక్, పాల్ స్వీజీ, రజని కొఠారి లాంటివారు ప్రధానమైన వారు. 1970 దశకం ఆరంభం నుండి ఈ మేధావులు తమ నమూనాలను ప్రకటించి చర్చించసాగారు.

మూడవ ప్రపంచ దేశాల మేధావులు పాశ్చాత్య నమూనాలను పూర్తిగా విమర్శించారు. మూడవ ప్రపంచ రాజ్యాలలోని రాజకీయ అభివృద్ధి స్వయం సమృద్ధమైనదిగా ఉండాలని వారు భావించినారు. అభివృద్ధి కొరకు ఇతరుల మీద ఆధారపడకూడదని వీరి భావన. మూడవ ప్రపంచ రాజ్యాల అభివృద్ధికి ఆయా దేశాలే తమకు కావలసిన ద్రవ్య నిధులను సమకూర్చుకోవాలని వారు వివరించినారు. అభివృద్ధిని కాంక్షిస్తున్న దేశాలు తమకు గల వనరులను, సమస్యలను దృష్టియందుంచుకోవాలన్నారు. రాజకీయ అభివృద్ధి విషయమై మూడవ ప్రపంచ మేధావులలో ధోరణి రెండు విధాలుగా ఉన్నది. భారతీయ అధ్యయన శిబిరానికి రజనీ కొఠారి నాయకత్వం వహిస్తుండగా, రెండవ ధోరణికి లాటిన్ అమెరికన్ రాజ్యాల మేధావులు నాయకత్వం వహిస్తున్నారు.

BRAOU

అధీనతా నమూనా భారతీయ నమూనా రాజకీయ అభివృద్ధి ధోరణి గుడ్డిగా పాశ్చాత్య దేశాలను అనుకరించరాదని వివరిస్తుంది. మన అభివృద్ధికి ప్రాధాన్యతను మనమే నిర్ధారించుకోవాలి అభివృద్ధి చెందుతున్న దేశాలు ప్రధానంగా జాతి నిర్మాణ, రాజ్య నిర్మాణ సమస్యలను ప్రబలంగా ఎదుర్కొంటున్నాయి.

రాజకీయ అభివృద్ధిని విశ్లేషిస్తున్న పాశ్చాత్య నమూనా ఆర్థికాభివృద్ధికి, ఆధునికీకరణకు ప్రాధాన్యమిస్తున్నా ఆయా దేశాలలోని రాజ్య నిర్మాణ, జాతి నిర్మాణ సమస్యలను ఆ నమూనాలు పట్టించుకోవు. ఈ మూడవ ప్రపంచ దేశాలు ప్రధానంగా జాతి, రాజ్య నిర్మాణ సమస్యలను పరిష్కరించాల్సి ఉన్నది. పాశ్చాత్య నమూనాలు మూడవ ప్రపంచ రాజ్యాలలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను సరిగా అర్థం చేసికోలేవు. ఆర్థికాభివృద్ధి సాధించడంవల్ల రాజకీయ అభివృద్ధి దానంతట అదే సాధ్యమౌతుందని పాశ్చాత్య మేధావులు భావిస్తున్నారు. ఆధునికీకరణం ద్వారా జాతి నిర్మాణం, రాజ్య నిర్మాణం సాధ్యమౌతుందంటారు. పాశ్చాత్య ప్రపంచంలో ఆధునికీకరణానికి ముందే రాజ్యాల నిర్మాణం జరిగి జాతులు సమైక్యమయ్యాయన్న వాస్తవాన్ని వీరు విస్మరిస్తున్నారు. పాశ్చాత్య నమూనాలను సూచించిన మేధావులు తమ దేశాలలోని రాజకీయ వ్యవస్థలే మూడవ ప్రపంచ రాజ్యాలలో నెలకొన్నాయనుకొన్నారు. వివక్షను ప్రదర్శిస్తున్నారు. వారి రాజకీయ వ్యవస్థలే ప్రమాణ మైనవిగా మూడవ ప్రపంచ రాజ్యాలకు చూపెడుతున్నారు. అందువల్లనే మూడవ ప్రపంచ రాజ్యాల అభివృద్ధి ప్రయత్నాలలో ఆయా దేశాలు తమ చారిత్రక వాస్తవాలను దృష్టియందుంచుకోవాలని భారతీయ మేధావులు భావిస్తున్నారు. వారు పెట్టుబడిదారీ వ్యవస్థ నమూనాలు మన దేశానికి సరిపోవని కూడా వాదిస్తున్నారు.

లాటిన్ అమెరికన్ అధీనతా నమూనా, లాటిన్ అమెరికన్ మేధావులు పాశ్చాత్య మేధావుల నమూనాలను తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఈ విషయంలో పాల్ బారన్, గుండర్ ఫ్రాంక్, పాల్ స్వీజి పేర్లను ప్రధానంగా పేర్కొనవచ్చును.

వారు పెట్టుబడిదారి వ్యవస్థ స్వభావంగల అభివృద్ధిని పూర్తిగా వ్యతిరేకించినారు. పెట్టుబడిదారి వ్యవస్థ ప్రపంచాన్ని అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందని విభాగాలుగా విభజిస్తుంది. అభివృద్ధి చెందామని భావిస్తున్న పాశ్చాత్య రాజ్యాలు 17వ శతాబ్దంలో అభివృద్ధి చెందిన దేశాలు అభివృద్ధి చెందుతున్న దేశాల వనరులను దోపిడిచేసి తమ స్వలాభాలకు వినియోగించుకొనుచున్నాయి. దోపిడికి గురైన రాజ్యాలు బీద దేశాలుగా మారి అభివృద్ధిని సాధించుకోలేక పోయాయి. ఈ లాటిన్ అమెరికన్ మేధావులందరూ మార్క్సిస్ట్ లేక వామపక్ష ధోరణికి చెందినవారే. దేశాలలో నెలకొన్న ఆర్థిక విభేదాలకు 17వ శతాబ్ది నుండి పాశ్చాత్య దేశాలు సాగించిన దోపిడియే ప్రధాన కారణంగా వీరు భావిస్తున్నారు. వలసలకు వలస పాలకులు ప్రసాదించిన లాభాలకన్నా సాగించిన దోపిడీయే అధికంగా ఉన్నది. సామ్రాజ్య వాద దేశాల దోపిడికి గురైన ఏ దేశం కూడా ఇంతవరకు అభివృద్ధిని సాధించలేకపోయింది. సామ్రాజ్యవాద దేశాలకు లొంగిన కెనడా, జపాను, చైనా లాంటి దేశాలు చాలాకాలం క్రిందటే తమ సంకెళ్ల సంబంధాలను తెంచుకున్నాయి. అందువల్లనే ఆ దేశాలలో అభివృద్ధి సాధ్యమైందని ఈ మేధావులు భావిస్తున్నారు. వలస పాలన క్రింద కొనసాగి రెండవ ప్రపంచ యుద్ధం తరువాత విముక్తి పొందిన దేశాలు అభివృద్ధి చెందలేకపోతున్నాయి.

అభివృద్ధి చెందిన దేశాల దోపిడి ఇంకా పరోక్షంగా కొనసాగుతునే వున్నందువల్ల ఈ దేశాలు అభివృద్ధి సాధించడం లేదు. పాశ్చాత్య దేశాలు తమ ప్రయోజనాలకు అనుకూలించే విధంగా మాత్రమే మూడవ ప్రపంచ రాజ్యాలలో అభివృద్ధిని నిర్దేశిస్తున్నాయి. అందువల్లనే లాటిన్ అమెరికన్ మేధావులు అభివృద్ధి చెందిన దేశాల మీద ఆధారపడకూడదంటారు. అభివృద్ధి చెందుతున్న దేశాలు స్వంతంగా స్వయం సమృద్ధిగావాలంటారు. అవి తమకు అనుకూలమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని తమే సమకూర్చుకోవాలి. విదేశీ సహాయం మీద ఆధారపడరాదు.

## 14.10 రాజకీయ అభివృద్ధి: సమస్యలు, సంక్షోభాలు

BRAOU

వివిధ జాతీయ అంతర్జాతీయ విషయాల సమ్మిశ్రమంలో రాజకీయ వ్యవస్థల మనుగడ వృద్ధి చెందుతూ ఉంటుంది. యుద్ధం, దురాక్రమణ వంటి అంతర్జాతీయ సంఘటనలు రాజకీయ వ్యవస్థలో మార్పులకు కారణాలవుతాయి. రాజకీయ వ్యవస్థ సంస్కృతి, నిర్మితులు ఎదురైన సవాళ్ళను విజయవంతంగా ఎదుర్కొనగలిగినప్పుడే అభివృద్ధి ఫలప్రదంగా ఉంటుంది. ఆల్మండ్, పవల్ రాజకీయ అభివృద్ధికి ఎదురయ్యే నాలుగు సవాళ్ళను గుర్తించారు. అవి;

1. *రాజ్య నిర్మాణ సమస్య (State Building problem):* రాజ్యంలో ప్రజల ప్రవర్తనలను వనరులను క్రమబద్ధం చేసేటందుకు క్రొత్త నిర్మితులను, సంస్థలను ఏర్పాటుచేసే సమస్యయే రాజ్య నిర్మాణ సమస్య. ఇందులో రాజకీయ వ్యవస్థ క్రమబద్ధీకరణ, నిర్వహణా సామర్ధ్యతలు చేరి ఉంటాయి. ప్రజల విధేయతలను, అభివృద్ధులను పెంపొందించేటందుకు కేంద్రీకృతమైన ఉద్యోగి స్వామ్య వ్యవస్థ అవసరమవుతుంది.

2. *జాతి నిర్మాణ సమస్య (Nation Building Problem):* ప్రజలు తమకుగల తెగ, గ్రామ సంకుచిత విధేయతలను విస్తృత రాజకీయ వ్యవస్థకు మారుస్తాయి. రాజ్య నిర్మాణ సమస్య, జాతి నిర్మాణ సమస్యలు రెండూ కూడా ఒకే విధంగా ఉండవచ్చు. ఉండకపోవచ్చును కూడా. కొన్ని సందర్భాలలో రాజ్య నిర్మాణ సమస్య పరిష్కరింపబడినా, జాతి నిర్మాణ సమస్య అపరిష్కృతంగానే ఉంటున్నది.

3. *భాగస్వామ్య సమస్య (Problem of Participation):* ప్రతి సమాజంలోనూ ప్రభావ వర్గాలు రాజ్య నిర్ణయ ప్రక్రియలో భాగస్వామ్యం కొరకు కృషిచేస్తుంటాయి. ఫలితంగా ప్రజల నుండి డిమాండ్లు అధికమౌతాయి. ప్రజలు తమకు అవసరమైన ఉత్పాదితములకు వారితో నిర్ణయాలు కావాలని కోరుతుంటారు.

4. *పంపిణీ సమస్య (Problem of Distribution):* చివరగా జాతీయ ఆదాయాన్ని అవకాశాలను కృత్రిమమైన వివక్ష లేకుండా విభజనచేయాలన్న సమస్య ఎదురౌతుంది. సమాన అవకాశాలు కల్పించేటప్పుడు ప్రతిభకు ప్రాముఖ్యత

గుర్తించాల్సి ఉంటుంది. ఇది సంక్షేమ రాజకీయాలలో ఒక గుర్తించదగిన అంశం.

ఈ నాలుగు సమస్యలేగాక ఆల్మండ్, రాజకీయ అభివృద్ధిలో మరో ఐదు ప్రధానాంశాలను విశ్లేషించారు. అవి;

*1. రాజకీయ వ్యవస్థ ఎదుర్కొనే సమస్యల స్వభావం:* రాజకీయ వ్యవస్థ అభివృద్ధి, క్షీణతలు అది ఎదుర్కొంటున్న సమస్యల మీద కూడా ఆధారపడి ఉంటాయి. విభిన్న వర్గాల ప్రజలు వివిధ భాగస్వామ్య పాలనను, సమైక్య ఆర్థిక ప్రయోజనాలను కోరుతుంటారు. అభివృద్ధి చెందుతూవున్న దేశాలలో ఈ సమస్యలు అకస్మాత్తుగా తలయెత్తి అమితమైన ప్రభావాన్ని కలుగజేస్తుంటాయి. అందువల్ల క్రొత్త దేశాలు ఎదుర్కొంటున్న సమస్య అవి ఎదుర్కొంటున్న సమస్యల స్వభావం మీద ఆధారపడి ఉన్నది.

*2. వ్యవస్థ వనరులు:* ప్రజలు కోరుతున్న డిమాండ్లకు సంతృప్తి కలుగజేయటం ప్రతి వ్యవస్థ నిర్వర్తించాల్సిన ప్రధానమైన కర్తవ్యం. ఒక్కొక్క సందర్భంలో డిమాండ్లు ఎక్కువై వాటి భారాన్ని మోసే శక్తిని రాజకీయ వ్యవస్థ కోల్పోయే అవకాశాలున్నాయి.

*3. విదేశీ సామాజిక వ్యవస్థ ప్రభావం:* సామర్థ్యతలు, వాటి వృద్ధి రాజకీయ వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యల/సవాళ్ళ పరిమాణం మీద ప్రభావాన్ని కలుగజేస్తాయి. అందువల్లనే అంతర్జాతీయ సంస్థలైన ప్రపంచ బాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి మొదలయిన సంస్థలు క్రమబద్ధ విభజన, సామర్థ్యతను పెంచటానికి చేసే ప్రయత్నాలవల్ల రాజకీయ వ్యవస్థపై ఒత్తిడి తగ్గిపోతుంది.

*4. వ్యవస్థ పనిచేస్తున్న తీరు:* రాజకీయ వ్యవస్థ పనిచేస్తున్న తీరుపై కూడా రాజకీయ అభివృద్ధి క్షీణతలు ఆధారపడి ఉంటాయి. ఉత్పాదకముల భారాన్ని రాజకీయ వ్యవస్థ భరించవచ్చు. భరించలేకపోవచ్చును కూడా. భారాన్ని వహిస్తూ మనుగడను కొనసాగించవచ్చు. లేదా డిమాండ్ల భారాన్ని మోయలేక భగ్నం కావచ్చును.

*5. రాజకీయ శిష్టుల ప్రతిస్పందన:* డిమాండ్ల ప్రభావం ఎక్కువై రాజకీయ శిష్టులు లక్ష్యాలను మార్చుకొన్నప్పుడు రాజకీయ వ్యవస్థ క్షీణత ప్రమాదం నుండి తప్పించుకోగలదు. డిమాండ్ల ప్రభావాన్ని తక్కువగా అంచనావేసినప్పుడు ప్రతిస్పందించలేకపోయినప్పుడు వ్యవస్థ భగ్నమయ్యే అవకాశం ఉంటుంది.

లూసియన్‌పై రాజకీయ వ్యవస్థ అభివృద్ధిలోని విభిన్న దశలలో ఎదురయ్యే సంక్షోభాలను ఆరింటిని పేర్కొన్నాడు. అవి:

*1. గుర్తింపు సంక్షోభం (Identity Crisis):* ప్రజలు తమ రాజకీయ వ్యవస్థలను గుర్తించడంలో విఫలమైనప్పుడు రాజకీయ వ్యవస్థ సంక్షోభానికి గురౌతుంది. జాతీయ భౌగోళిక ప్రాంతాన్ని తమ జన్మభూమిగా ప్రజలు గుర్తించలేనప్పుడు, లేక వ్యక్తుల విధేయతలు తెగ, మతం, భాషవైపుగా ఉన్నప్పుడు సంక్షోభ పరిస్థితులు ఏర్పడుతాయి. జాతీయ ప్రయోజనాల విషయంలో ఆదిమ కాలపు విధేయతలను విడనాడి ఆధునిక జాతీయ రాజకీయ సంస్కృతిని అలవరచుకోవడం చాలా అవసరం.

*2. శాసనబద్ధత సంక్షోభం (Legitimacy Crisis):* ప్రాథమిక సమస్యల విషయంలో పాలకులు, పాలితులు విభేదించినప్పుడు శాసన బద్ధత విషయమై సంక్షోభం ఏర్పడే అవకాశాలున్నాయి. ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా పాలన సాగిస్తున్న అధికారయుత ప్రభుత్వం తన శాసన బద్ధత విషయంలో సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. అటువంటి సంక్షోభం ఎదురైనప్పుడు పాలకులు ప్రజల అభీష్టాన్ని తెలుసుకొని తమ ప్రభుత్వానికి శాసన బద్ధతను కల్పించుకోవాలి.

*3. వ్యాపన సంక్షోభం (Penetration Crisis):* ప్రాథమిక రాజకీయాలను ప్రభావితపరిచే గ్రామీణ ప్రజల దైనందిన జీవన పరిస్థితులలో మార్పులు కలుగజేసే ప్రయత్నమే వ్యాపన సంక్షోభం. ప్రభుత్వ కృషి కొరకు ప్రజల నుండి విపరీతమైన డిమాండ్లు వచ్చినప్పుడు వ్యవస్థ సంక్షోభ పరిస్థితిని ఎదుర్కొంటుంది. అలాంటి వాటి సఫలతకు కావలసిన

BRAOU

సామర్థ్యత రాజకీయ వ్యవస్థకు లేకపోవచ్చును.

4. భాగస్వామ్య సంక్షోభం(Participation Crisis): రాజకీయ వ్యవస్థలో కొత్తగా భాగస్వామ్యం పొందేవారు తమతో కొత్తకొత్త సమస్యలను తీసుకొనివస్తారు. రాజకీయ పార్టీలు, ప్రభావ వర్గాలు, బలం పుంజుకోవటంవల్ల వ్యవస్థ సామర్థ్యతపైన ఒత్తిడి ఏర్పడుతుంది. వీరు చేస్తున్న డిమాండ్లను సరియైన రీతిలో స్పందించలేక పోయినప్పుడు వ్యవస్థ సంక్షోభానికి గురౌతుంది. భాగస్వామ్య ప్రక్రియలలో పరిమితులు విధించినప్పుడు కూడా భాగస్వామ్య సంక్షోభం ఏర్పడుతుంది.

5. సమైక్యతా సంక్షోభం: ప్రజల డిమాండ్లను ప్రభుత్వం గుర్తించాలి. డిమాండ్ల పరిష్కారానికి అనువైన ప్రభుత్వ విధానాలు రూపొందాలి. అలా జరిగినప్పుడు సంక్షోభ పరిస్థితులు ఏర్పడవు. డిమాండ్లను పరిశీలించి పరిష్కరించే ప్రభుత్వ ప్రక్రియా సామర్థ్యత పెరిగినప్పుడు సంక్షోభ పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉండవు.

6. పంపిణీ సంక్షోభం:సమాజంలో ప్రజలకు అవసరమైన వస్తువుల పంపిణఈ క్రమబద్ధీకరణకు జారీచేసే ఉత్తరువులవల్ల కూడా సంక్షోభాలు ఏర్పడే ప్రమాదం ఉంటుంది. జాతీయ సంపద విభజనలో ప్రభుత్వం ప్రత్యక్షంగా జోక్యం కలుగజేసుకోవచ్చు. కొన్ని సందర్భాలలో బడుగు వర్గాల వారికి లాభం చేకూర్చే విధంగా ప్రభుత్వం పంపిణీ విధానంలో జోక్యం కలిగించుకోవచ్చును.

వివిధ సంక్షోభాల ప్రచారం రాజకీయ అభివృద్ధి క్రమంపై ఉంటుందని లూసియన్‌పై వివరించారు. అందువల్ల రాజకీయ అభివృద్ధి సిద్ధాంతం రాజకీయ వ్యవస్థ ఎదుర్కొనే సంక్షోభాలలోని వివిధ సమస్యలను పరిష్కరించటానికి శ్రద్ధవహించాల్సి ఉంటుం..

## 14.11 విమర్శనాత్మక పరిశీలన

BRAOU

మూడు రకాల విమర్శలున్నాయి. అవి;

1. ఈ భావనకు నిర్దిష్టమైన నిర్వచనం లేదు. రాజకీయ అభివృద్ధిపై విస్తృతంగా ఉన్న సాహిత్యాన్ని పరిశీలించాక కూడా రాజకీయ అభివృద్ధి అధ్యయనం విషయంలో నిర్దిష్టత కనిపించదు.

2. రాజకీయ అభివృద్ధిపై జరిగిన అధ్యయనాలు ఏవీ రాజకీయ అభివృద్ధి నమూనాను సూచించక రాజకీయేతర విషయాలు, రాజకీయ మార్పులకు కారణమని మాత్రమే విశ్లేషణలు వివరించాయి. నిర్దిష్టత లేనందువలన రాజకీయ శాస్త్రం ఇతర సామాజిక శాస్త్రాలయిన ఆర్థిక, సామాజిక శాస్త్రాల విశ్లేషణలో మునిగిపోయింది.

3. ప్రపంచంలో అన్ని రాజ్యాలకు అన్వయించగల రాజకీయ అభివృద్ధి నమూనాను దేనిని ఈ భావన సూచించలేక పోయింది. ఈ భావన కమ్యూనిస్టులకు రుచించలేక పోయింది. ఈ భావన కమ్యూనిస్టులకు గాని కమ్యూనిస్టేతరులను గాని ప్రభావపరచలేకపోయింది. మూడవ ప్రపంచ రాజ్యాలలోని వాస్తవ విషయాలను అవగాహనపరచలేకపోయింది. ఆసియా, ఆఫ్రికా ఖండాలలోని బీద ప్రజల జీవన స్థితిగతులను చికాగో, హార్వర్డు విశ్వవిద్యాలయాల సంపన్న భావనా దృష్టితో మాత్రమే పరిశీలించగలిగారు. అందువల్లనే రాజకీయ అభివృద్ధి అధ్యయనాలన్నీ చిందరవందరగా ఉండిపోయాయి.

ఇన్ని విమర్శలున్నప్పటికి ఈ భావనను సమర్థించడానికి కూడా కొన్ని అంశాలున్నాయి. సమకాలీన రాజకీయాలలో రాజకీయ మార్పు ఒక ప్రధానమైన సమస్య. రాజకీయ అభివృద్ధి ఉపయోగకరమైన, క్రమబద్ధమైన పరిణామాత్మకమైన మార్పు. అటువంటి మార్పులను విశ్లేషించడం ద్వారా రాజకీయ అభివృద్ధి స్థాయిలను నిర్ణయించవచ్చును. దాని ద్వారా రాజకీయ వ్యవస్థలను వివరించి వర్గీకరణం చేయవీలున్నది. వివిధ సమయాలలో రాజకీయ అభివృద్ధిని అంచనా

వేయడం ద్వారా రాజకీయ వ్యవస్థ సామర్థ్యతను అంచనా వేయవీలున్నది. అభివృద్ధి దశల అధ్యయనం వల్ల రాజకీయ వ్యవస్థలోని ఇతరాంశాలను తెలిసికొనవచ్చును. చివరగా రాజకీయ అభివృద్ధి అధ్యయనాలవల్ల అభివృద్ధి సూచికలను (indicators) నిర్దేశించుకోవచ్చును.

డా. కె. లక్ష్మి

## 14.12 చదువదగిన పుస్తకాలు


1. Lipset, S.M. : The Political Man,

2. Lucianw, Pye : Aspects of Political Development.

3. Varma, S.P. : Modern Political Theory.


## 14.13 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు వ్యాసరూపంలో సమాధానలు రాయండి

1. రాజకీయ అభివృద్ధి అనగా ఏమిటి? నిర్వచించండి.
2. రాజకీయ అభివృద్ధి దశలను వివరించండి?
3. రాజకీయ అభివృద్ధి ఎదుర్కొంటున్న సమస్యలను సంక్షోబాలను విశ్లేషించండి.

II. కింది ప్రశ్నలకు సంక్షిప్త సమాధానం రాయండి.

1. రాజకీయ క్షీణత
2. రాజకీయ అభివృద్ధి సూచికలు

BRAOU

BRAOU

# భాగం 15 – సమైక్యత : సమస్యలు

విషయక్రమం


| | |
|---|---|
| 15.1 | లక్ష్యాలు |
| 15.2 | పరిచయం |
| 15.3 | సమైక్యత అర్థం – వివరణ |
| 15.4 | సమైక్యత – ఆవశ్యకత |
| 15.5.0 | అసమైక్యత – కారణాలు |
| 15.5.1 | చారిత్రక కారణాలు |
| 15.5.2 | రాజకీయ కారణాలు |
| 15.5.3 | ఆర్థిక కారణాలు |
| 15.5.4 | సాంఘిక సాంస్కృతిక కారణాలు |
| 15.6 | ప్రాంతీయవాదం |
| 15.7.0 | ప్రాంతీయోద్యమాల తీరు తెన్నులు |
| 15.7.1 | వేర్పాటువాద ఉద్యమాలు |
| 15.7.2 | ప్రత్యేక రాష్ట్రాలు |
| 15.7.3 | ఉప ప్రాంతీయవాదం |
| 15.7.4 | అంతర్ రాష్ట్ర వివాదాలు |
| 15.8 | భాషావాదం |
| 15.9 | మతతత్వం |
| 15.10 | కులతత్వం |
| 15.11 | భిన్నత్వంలో ఏకత్వం |
| 15.12 | సమైక్యతా సాధన |
| 15.13 | ముగింపు |
| 15.14 | చదవదగిన గ్రంథాలు |
| 15.15 | నమూనా పరీక్షా ప్రశ్నలు |


BRAOU

## 15.1 లక్ష్యాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు

★ జాతీయ సమైక్యత అంటే ఏమిటో తెలుసుకుంటారు.

★ సమైక్యతను భగ్నం చేస్తున్న సవాళ్ళను, సమస్యలను గుర్తిస్తారు.

★ భారతదేశంలో జాతీయ సమైక్యత, ఆ సమైక్యతను దెబ్బతీస్తున్న సమస్యలను అర్థం చేసుకుంటారు.

## 15.2 పరిచయం

సమైక్యత రాజ్యం ఆవిర్భావానికి ప్రాథమిక అంశం. సమైక్యత లేనట్లయితే రాజ్యం ఆవిర్భావమే సాధ్యపడేది కాదు. వ్యక్తుల మధ్య ఏకమత్యం, జాతుల మధ్య ఐక్యభావం, ప్రాంతాల మధ్య సహకారం, భావాల మధ్య సంఘీ భావం ఉంటే తప్ప సమైక్యత సాధ్యపడదు. సమైక్యత ఒక భావ పూరితమైన, ఉద్వేగ భరితమైన భావన. జాతీయతా భావాన్ని, రాజ్యానికి కావల్సిన ఉనికిని సాధించడానికి మూలమైన అంశంగా దోహదపడుతుంది.

సమైక్యత గురించి, అసమైక్యతను పెంపొందించే అంశాల గురించి, జాతీయ సమైక్యత దెబ్బతినడానికి కారణమైన సమస్యల గురించి ఈ పాఠ్యాంశంలో చర్చించడం జరిగింది.

## 15.3 సమైక్యత – అర్థం – వివరణ

ఒక వ్యవస్థలో వేరు వేరు అంశాలు అంతర్లీనమై వున్నట్టయితే దానిని సమైక్యతగా పేర్కొనవచ్చు. రాజ్యానికి సంబంధించినంత వరకు ప్రజలను ఐక్యంచేసే బంధమే సమైక్యత. ఒక వ్యక్తికి, మరో వ్యక్తికి, ఒక సమూహానికి, మరో సమూహానికీ మధ్య అరమరికలు లేకుండా పెంపొందే స్నేహ సహకార భావాన్నే సమైక్యత అనవచ్చు. అంటే భిన్నమైన అంశాలకు ఏకరూపత ఇవ్వడం. ఒక రాజ్యంలోని ప్రజల సామాజిక, రాజకీయ, ఆర్థిక జీవనం అభివృద్ధి గమనంలో అసమానతలు, అవాంతరాలు, అపశృతులు లేకుండా పరస్పరం కలిసిపోయి ఒక సమిష్టి వ్యవస్థగా రూపొందితే అది సమైక్యతకు చిహ్నం అవుతుంది.

సాధారణంగా రాజనీతి శాస్త్రంలో సమైక్యతను జాతీయ సమైక్యత దృష్టితో పరిశీలిస్తారు. దేశంలోని వివిధ జాతులు, మతాలు, కులాలు, ప్రాంతాలు అంటే భిన్న సామాజిక, ఆర్థిక, జీవన విధానాలుగల వివిధ యూనిట్లు ఏకాభి ప్రాయంతో, ఉమ్మడి లక్ష్యాలు, ఆశయాలతో పరస్పరం సహకరించుకొని సమిష్టి జీవనం గడిపినట్లయితే దానిని జాతీయ సమైక్యతగా పేర్కొనవచ్చు. జాతీయ సమైక్యత ఒక దేశంలోని లేదా రాజ్యంలోని ప్రజల మధ్యనగల సంఘీభావాన్ని, సమన్వయాన్ని, సహకారాన్ని కలివిడి తనాన్ని సూచించే భావ గర్భితమైన అర్థాన్నిస్తుంది.

ఉదాహరణకు భారతదేశాన్నే తీసికుందాం. భారతదేశంలో పరస్పరం అనేక వైరుధ్యాలు, అసమాన ప్రాధాన్యతలు గలిగిన అనేక ప్రాంతాలు, మతాలు, కులాలు, జాతులు వున్నాయి. అయినప్పటికీ యావత్ భారత ప్రజానీకంలోనూ ఒకే జాతీయతా భావం వుంది. ఈ అసమానతలు తరచూ బయటపడుతున్నప్పటికీ ఒకే దేశంగా, ఒకే జాతిగా ఒకే సార్వభౌమాధికారంతో అభేద్యంగా కొనసాగడం భారత జాతీయ సమైక్యతలోని ప్రత్యేకత.

## 15.4 సమైక్యత – ఆవశ్యకత

నాగరిక సమాజాలు, ప్రజాస్వామ్య రాజ్యాలు అవతరిస్తూ వస్తున్న ప్రస్తుత దశలో సమైక్యత అత్యంత ప్రాధాన్యతను కలిగి వుంది. ముఖ్యంగా ప్రపంచ యుద్ధాలు, వాటి ఫలితాలు నేర్పిన పాఠాల తరువాత విశ్వవ్యాప్తంగా సమైక్యత ప్రాధాన్యతను సంతరించుకొంది. మిత్రదేశాలు, స్నేహ కూటములు ఏర్పాటుచేసికోవటం 'విశ్వసమాజం' కోసం ప్రయత్నంచేయడం వంటి చర్యలన్నీ సమైక్యత కోసమే. సహకారం సమైక్యతకు తొలిమెట్టు. సహకార భావం ద్వారా ఏకాభిప్రాయం సాధ్యపడుతుంది. ఏకాభిప్రాయం ఉమ్మడి లక్ష్యాల సాధనకు దోహదం చేస్తుంది.

సమైక్యతా సాధన నేటి ఆధునిక రాజకీయ వ్యవస్థ ప్రాథమిక కర్తవ్యం. సమైక్యత లేకపోతే రాజ్యం, రాజ్యాంగ వ్యవస్థ, రాజకీయాలకు అర్థం లేదు. అమెరికా నుంచి అరబ్బుదేశాల దాకా ఇవాళ ప్రపంచంలోని అన్ని దేశాలకు సమైక్యత ఒక సమస్య అయ్యింది. ఒక దేశంలో జాతులు, మన దేశంలో మతాలు, ఇంకొకచోట తెగలు, వర్గాలు

BRAOU

ఇట్లా ప్రపంచంలోని ప్రతిదేశంలోనూ సమైక్యత ఒక ప్రధాన సమస్య అయిపోయింది. పైపైకి సమైక్యంగా కనిపిస్తున్నప్పటికీ భారతదేశ సమైక్యత కూడా సంక్షోభంలోనే వుంది. దీనికి అనేక చారిత్రక కారణాలున్నాయి. ముఖ్యంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాతే ఈ సమైక్యత సందేహాత్మకంగా తయారయ్యింది. స్వాతంత్ర్యోద్యమం తరువాత దేశంలోని వివిధ ప్రాంతాలు, భాషలు, జాతులు, తెగలు, కులాలు, మతాల వారిని ఒకే గొడుగు క్రిందికి తెచ్చే ప్రయత్నంలోనే ప్రభుత్వం విఫలమైంది. భిన్నత్వంలో ఏకత్వం చూపాలనుకున్న ప్రభుత్వ లక్ష్యం మామూలు విషయం కాదు. భిన్న సంస్కృతులు, భిన్న మతాలు, భిన్నమైన జీవన విధానం, భాష, కులం, తెగల ప్రజలను కలిపి వుంచడానికి చేసిన ప్రయత్నం ఆయా వర్గాల్లోని అంతరాలను పూడ్చక పోవడంవల్ల ఇవాళ సమైక్యతా భావన సంక్షోభంలో పడింది. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచీ నేటి దాకా ప్రతిరోజూ ఏదో ఒకచోట అసంతృప్తి, ఆందోళన, అల్లర్లు, వైషమ్యాలు, గొడవలు, కొట్లాటలు రగులుతూనే వున్నాయి. వేర్పాటు వాదం, మతతత్వం, కులతత్వం, మూలంగా దేశ సమగ్రత బాగా దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. దేశ చారిత్రక నేపథ్యం, సాంఘిక అసమానతలు, రాజకీయ వ్యవస్థ, ఆర్థిక స్థితిగతులు సమైక్యతలు సంక్షోభంలోకి నెడుతున్నాయి. సమస్యలు సృష్టిస్తున్నాయి. ప్రజల మధ్య సమైక్య భావన లేనప్పుడు సుస్థిరత అసాధ్యం. ఇది దేశ అస్థిత్వానికి, ఉనికికే ముప్పు తెస్తుంది.

## 15.5.0 అసమైక్యత – కారణాలు

సమైక్యతను పై నుంచి రుద్దలేము. వ్యక్తుల ఇష్టా యిష్టాలు, ఆకాంక్షలు, అవసరాలు, అభిప్రాయాల మేరకే ఇది సాధ్యపడుతుంది. అయితే సమాజం సంక్లిష్టమవుతున్న కొద్దీ సమైక్యత సవాళ్ళను ఎదుర్కొనవలసి వస్తున్నది. క్రొత్త అవకాశాలు, అభివృద్ధి ప్రణాళికలు, ఆధునికీకరణ విస్తృతమవుతున్న నేపథ్యంలో అవకాశాల ప్రాధాన్యతలో అసమానతలు ఉత్పన్నమవుతున్నాయి.

BRAOU

భారతదేశానికి సంబంధించినంతవరకు ఈ అసమానతలకు చారిత్రక కారణాలున్నాయి. ప్రపంచంలోని అన్ని సమాజాలకంటే భారతదేశానికి భిన్నమైన, ప్రత్యేకమైన చారిత్రక నేపథ్యం వుంది. వివిధ మతాలకు పుట్టినిల్లయి, వివిధ సంస్కృతులు, జాతుల పాలకుల చేతుల్లో నలిగిపోయి స్వాతంత్ర్యం వచ్చేనాటికి భారతదేశ పరిస్థితి చిరిగిపోయిన విస్తరాకులా తయారయ్యింది. ఈ చిరిగిన ఆకులను కలపడం, దానికి ఒక సమగ్రరూపం ఇవ్వడమనేది కష్టసాధ్యమైంది. అందుకే సమైక్యత అనేది దేశంలో ప్రధాన జాతీయ సమస్య అయింది. ఈ అసమైక్యతకు కారణమైన అంశాలను ప్రధానంగా ఐదు రకాలుగా పేర్కొనవచ్చు.

### 15.5.1 చారిత్రక కారణాలు

భారతదేశానికి సుదీర్ఘమైన చరిత్ర వుంది. వేల సంవత్సరాలుగా వేరు వేరు దేశాలుగా, వేరువేరు సంస్కృతుల నిలయంగా విలసిల్లిన దేశం మొట్టమొదటిసారిగా స్వాతంత్ర్య సంగ్రామ కాలంలో ఒకటయ్యింది. జాతీయతా భావం తొలిసారిగా ఈ దశలోనే అంకురించింది. దేశమంతా ఒక్కటే. పంజాబు, సింధు, గుజరాత్, మరాఠీ, ద్రవిడ రాజ్యాలన్నీ అఖండ భారతంలో అంతర్భాగమేనన్న నినాదం మొదట స్వాతంత్రోద్యమ కాలంలోనే వచ్చింది. అప్పటి వరకూ దేశం వేరువేరు రాజ్యాలుగా, వేరువేరు ప్రాంతాలుగా, వేరువేరు సార్వభౌమాధికారుల చేతుల్లో వుండింది. అదే విధంగా వేరు వేరు భాషలు, వేరువేరు మత విభాగాలుగా వుండింది. దీనికి తోడు నాలుగు వేల సంవత్సరాలకు పైగా కొనసాగుతూ వస్తున్న కుల వ్యవస్థ కూడా భారతీయ ప్రజల్లో ఐక్యతా భావానికి ఆటంకమైంది. ఇటువంటి భిన్న అస్థిత్వాల పరంపరలో స్వాంతంత్రోద్యమం ఒక ఉద్వేగ భరిత ఉద్యమంగా వ్యాపించినప్పటికీ అది తాత్కాలిక ప్రభావం మాత్రమే చూపింది. వేల సంవత్సరాలుగా కొనసాగిన చారిత్రక సమానతల నేపథ్యంలో ఏర్పడిన భారతదేశంలో స్వాతంత్ర్యం అనంతరం కూడా ఆ అసమానతలు అలాగే కొనసాగి సమైక్యతకు భంగం కలిగించాయి.

## 15.5.2 రాజకీయ కారణాలు

రాజకీయాలు, రాజకీయ పార్టీలు కూడా సమగ్రత, సమైక్యతలను దెబ్బతీసే విధంగా తయారవుతున్నాయి. అధికార దాహం తీర్చుకునేందుకు ప్రజల్లో, ప్రాంతాల్లో, జాతుల్లో నెలకొని వున్న అసంతృప్తిని, అసమానత భావాన్ని వాడుకోవడం జరుగుతున్నది. ఇది దేశ సమైక్యతకు భంగం కలిగిసిస్తున్నది.

పార్టీలు వాటి ఎన్నికల ప్రణాళికలు, ఆయా పార్టీలు ప్రజలను కూడగట్టుకునేందుకు ఓటర్లను ఆకర్షించుకునేందుకు చేసే ప్రయత్నాలు సుస్థిరతను, సౌభ్రాతృత్వాన్ని, పరస్పర సహకార భావాన్ని దెబ్బ తీస్తున్నాయి. బాబ్రీ మసీదు, రామ జన్మభూమి వివాదాలు ప్రత్యేక రాష్ట్రాలు, జార్ఖండ్, గుర్ఖాలాండ్, పూర్వాంచల్, ఉత్తరాంచల్ ప్రాంతీయ పాలనా మండళ్ళు, హామీలు దీనికి ఉదాహరణగా పేర్కొనవచ్చు. వీటితో పాటు కేంద్ర, రాష్ట్రాల్లో వేరువేరు పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు నిధుల వ్యవహారంలో పాలసీలు, ప్రణాళికల విషయంలో తలెత్తే ఘర్షణలు కూడా సమైక్యతకు భంగం కలిగిస్తున్నాయి. అదేవిధంగా ఇరుగు పొరుగు రాష్ట్రాల మధ్య ఉమ్మడి వనరుల పంపిణీ విషయంలో తలెత్తే వివాదాలు కూడా ఉద్రిక్తతలను కలిగిస్తున్నాయి. కావేరీ జలాల వివాదం తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల మధ్య పాలనా పరమైన తగువుగానో, రాజకీయ సమస్యగానో కాకుండా ప్రజల్లో కల్లోలం సృష్టించింది. ఈ వివాదం ముదిరి బెంగుళూరులో జరిగిన అల్లర్లలో వేలాది మంది అమాయక ప్రజలు బలైపోయారు. ఇది రెండు రాష్ట్రాల ప్రజల మధ్య ఎన్నాళ్ళగానో ఉన్న సమైక్య భావనను దెబ్బతీసింది. కొన్ని రాజకీయ నిర్ణయాలు ప్రజల్లో అశాంతిని రేపి సమాజాన్ని ముక్కలు ముక్కలుగా వీడదీశాయి. రిజర్వేషన్లు, సర్దార్ సరోవర్ వ్యవహారం ఈ కోవలోకే వస్తాయి. ప్రభుత్వాల ఉద్దేశ్యం ఎలా వున్నా, ప్రజలకు సరియైన సమాచారం లేకపోవడం వల్ల, ప్రజలకు అవగాహన కలిగించడంలో ప్రభుత్వాలు విఫలమైనందు వలన ఇటువంటి వివాదాలు తలెత్తుతున్నాయి.

నేరమయమైపోతున్న రాజకీయ వ్యవస్థ కూడా సమాజాన్ని విచ్ఛిన్నం చేస్తున్నది. బొంబాయి, హైదరాబాద్ వంటి నగరాల్లో తరచూ చెలరేగుతున్న మతఘర్షణలు కేవలం రాజకీయ ప్రయోజనాల వల్లే జరిగినట్లు అనేక నివేదికలు పేర్కొన్నాయి. రాజకీయ వ్యవస్థ అవినీతి మయం కావడం, అధికార దాహం పెరిగి పోవడం వంటి కారణాలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయుటమే కాక ప్రజల్లో అశాంతిని అల్లకల్లోలాన్ని రేపుతున్నాయి.

## 15.5.3 ఆర్థిక - కారణాలు

పేదరికం, వెనుకబాటు తనంతో పాటు ఆర్థిక సమానతలు కూడా సమైక్యతను దెబ్బతీస్తున్నాయి. ప్రజల మధ్య, ప్రాంతాల మధ్య, కులాలు, మతాల మధ్య వేలాది సంవత్సరాలుగా కొనసాగుతూ వస్తున్న సమానతలు ఈ ఘర్షణలకు, ఉద్రిక్తతలకు కారణమవుతున్నాయి. బడ్జెట్ కేటాయింపుల విషయంలో, అభివృద్ధి పథకాల అమలు విషయంలో ఈ విభేధాలు బహిర్గతమవుతున్నాయి. నిధుల అసమాన పంపిణీ, పాక్షిక అభివృద్ధి వంటివి వ్యక్తుల్లో, ప్రాంతాల్లో అలజడికి కారణమవుతున్నాయి. ప్రాంతీయ వాదానికి, వేర్పాటు వాదానికి మూల కారణం ఈ అసమానతే. ఉత్తరాదిన జార్ఖండ్ ప్రాంతం, ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణా ప్రాంతం దీనికి ఉదాహరణగా పేర్కొనవచ్చు.

జార్ఖండ్‌లో అత్యంత విలువైన ఖనిజ సంపద వుంది. బొగ్గు, ఇనుము, మాంగనీసు వంటి ఖనిజాలను ప్రభుత్వాలు, పరిశ్రమలకు అప్పగించి సొమ్ము చేసికుంటున్నవే తప్ప ఆ ప్రాంతాన్ని ఏ మాత్రం అభివృద్ధి చేయడం లేదన్న భావన అక్కడి గిరిజనుల్లో కలిగింది. ఇది చివరకు ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంగా రూపుదిద్దుకుంది.

అదేవిధంగా వందలాది సంవత్సరాలుగా నిజాం రాష్ట్రంలో నిరంకుశ పాలనలో వున్న తెలంగాణా ఆంధ్ర రాష్ట్రంలో కలిసిన తరువాత కూడా అభివృద్ధికి నోచుకోలేదు. విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి వంటి మౌలిక రంగాల్లో ఈ అసమానతలు అలాగే కొనసాగుతున్నాయి. పర్యవసానంగా గతంలో ప్రత్యేక తెలంగాణా ఉద్యమం, సమైక్యతా భావాన్ని భంగపరిచింది.



BRAOU

అదే విధంగా ఆర్థిక సమానతలు వర్గ పోరాటాలకు కూడా కారణమవుతున్నాయి. పేద, సంపన్న వర్గాల మధ్య సమన్వయం, సంఘభావం లోపించి నేక ఉద్యమాలు తలెత్తుతున్నాయి. భూసంస్కరణలు విఫలం కావడం, ప్రైవేటు రంగం విస్తరించడం, ఈ అంతరాలను మరింతగా పెంచి అసంతృప్తి, అశాంతికి కారణమవుతున్నాయి.

### 15.5.4 సాంఘిక సాంస్కృతిక కారణాలు

ప్రపంచంలో ముఖ్యంగా భారతదేశంలో అశాంతికి సాంఘిక, సాంస్కృతిక వ్యత్యాసాలే ఎక్కువ కారణభూతమవుతున్నాయి. వేలాది సంవత్సరాలుగా భిన్న సంస్కృతులు, భిన్న మతాలు, భిన్న పాలనలను చవిచూసిన దేశంలో హఠాత్తుగా సర్వమానవ సౌభ్రాతృత్వం చోటు చేసికోవడం తేలికైన విషయం కాదు. పాలకులకు ఎంతో ఏకాగ్రత, శ్రద్ధ వుండి, నిష్పాక్షికంగా వ్యవహరిస్తే తప్ప అది సాధ్యం కాదు. స్వాతంత్ర్యం తరువాత ఆశించినదానికి భిన్నంగా సమైక్యతకు బదులు అనేక సాంఘిక సాంస్కృతిక వైరుధ్యాలు,అసమానతలు, ఘర్షణలు బయలుదేరాయి.

అనేక రాష్ట్రాలు, మతాలు, కులాలు, తెగలు కలిసి ఒక్క దేశం ఏర్పడి ''భిన్నత్వంలో ఏకత్వం'' వున్నట్టు చెప్పుకుంటున్నప్పటికీ సాంఘిక, సాంస్కృతిక అసమానతల మూలంగా ఈ వైషమ్యాలు, ఘర్షణలు తరచూ బయట పడుతూనే వున్నాయి. కులం అలాగే కొనసాగడమే కాక చుండూరు, కారంచేడు లాంటి సంఘటనల సందర్భంలో ఇంకా తన వికృత రూపం చూపిస్తూనే వుంది. సర్వమతాలను సమానంగా మన్నించాలనుకున్న రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా మతం పేరుతో జరిగే మారణహోమాలకు బొంబాయిలు, హైదరాబాద్‌లు,అయోధ్యలు కేంద్ర బిందువులవుతూనే వున్నాయి. పరాయి మతపు పండుగలను, ఉత్సవాలను కూడ భగ్నం చేసే ప్రయత్నంలో వ్యతిరేకించే చర్యలు నానాటికీ పెరుగుతూనే వున్నాయి. ఈ భిన్నత్వం మన సంస్కృతిలో భాగం అన్న విషయాన్ని గుర్తించలేకపోతున్నాయి. కుల, మత, జాతుల ప్రత్యేక సంస్కృతుల మధ్య గౌరవం లోపించడంతో ఈ ఘర్షణలకు, శత్రు భయానికి మొత్తంగా అశాంతి,అసమైక్యతకు కారణమవుతున్నాయి.

BRAOU

## 15.6 ప్రాంతీయ వాదం

భారతదేశంలో ప్రాంతీయ వాదం క్రొత్త సమస్య కాదు. జాతీయ వాదం మొలకెత్తిన మరుక్షణమే ప్రాంతీయ వాదం కూడా ఈ దేశంలో తలెత్తింది. ఇది రానురాను మొత్తం జాతీయ సమస్యగా తయారయ్యింది.దేశంలో బ్రిటీష్ వారి పాలన వున్న కాలంలోనే ఒకవైపు జాతీయోద్యమం కొనసాగుతూ వుంటే మరోవైపు ప్రాంతీయ ఉద్యమాలు, ప్రత్యేక రాష్ట్రాల కోసం ఆందోళనలు మొదలైనాయి. ఈ ఆందోళనలు, ఉద్యమాలు స్వాతంత్ర్యం తరువాత మరింత ఉధృతమైనాయి.ప్రాంతం మనిషికి చారిత్రకంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా, రాజకీయంగా అత్యంత ప్రధానమైన పరిసరం.ముఖ్యంగా భిన్న సాంస్కృతిక, సాంఘిక, చారిత్రక నేపథ్యంలో ఆవిర్భవించిన భారతదేశంలో ప్రాంతీయ వాదానికి పటిష్టమైన పునాది వుందనవచ్చు. దేశంలో జాతీయ ప్రభుత్వం ఏర్పడిన పది, పదిహేనేళ్లలో ప్రత్యేక రాష్ట్రాలకు సంబంధించి నేక ఉద్యమాలు వచ్చి భాషా ప్రయుక్త రాష్ట్రాల ఆవిర్భావానికి దోహదపడ్డాయి. వందల, వేల సంవత్సరాల స్వయం ప్రతిపత్తి ప్రత్యేక అధికారం అనుభవించిన అనేక రాష్ట్రాలు ఉమ్మడి జాతీయ పాలనలో ఇమడలేకపోయాయి.

ప్రాంతీయ వాదానికి తమ ప్రాంతం పట్ల ప్రత్యేక ప్రేమను పరిగణించవచ్చు.లేదా ఆ ప్రాంతప్రజలు ప్రత్యేక ప్రతిపత్తి కోరడంగా భావించవచ్చు. దానికి అనేక కారణాలున్నాయి.

(i) పాలకుల నిర్లక్ష్యం

చాలాకాలంగా రాజులు,ప్రభువులు, నవాబుల పాలనలో వున్న ప్రాంతాలు సహజంగానే విముక్తిని కోరుకుంటాయి. అభివృద్ధిని ఆకాంక్షిస్తాయి. స్వాతంత్ర్యవచ్చిన తరువాత చాలాప్రాంతాల్లో ఇదే జరిగింది.అయినప్పటికీ అభివృద్ధికి

నోచుకోక నిర్లక్ష్యానికి గురయిన ప్రాంతాల ప్రజలు ప్రత్యేక ప్రతిపత్తికి, స్వతంత్ర పాలనకు ఆందోళన చేయక తప్పలేదు.

(ii) అధికార వికేంద్రీకరణ

అధికారం అంతా జాతీయ ప్రభుత్వం చేతిలో కేంద్రీకృతమై వుండడం, ఆ ప్రభుత్వంలో తమ ప్రాంతానికి సరియైన ప్రాతినిధ్యం లేకపోవడం కూడా ప్రాంతీయ వాదానికి కారణమైంది. ప్రాంతీయ అభివృద్ధి కోసం, స్థానిక నాయకత్వం కోసం, రాజకీయ, పరిపాలనా రంగాల్లో ప్రాతినిధ్యం కోసం ఆందోళనలు మొదలైనాయి.

(iii) సాంస్కృతిక కారణాలు

భిన్న సంస్కృతులు గలిగిన దేశంలోకి అధికారం వచ్చిన ప్రభుత్వం ఏ సిద్ధాంతంతో, ఏ విధానాలతో పని చేస్తున్నదని ప్రధానం. స్వాతంత్ర్యం వచ్చిన తొలి పదేళ్ళ పాలన ప్రజలకు అర్థంకాని అనేక సందేహాలకు కారణమైంది. భాష విషయంలో, సాంస్కృతిక వ్యవహార విషయంలో, వనరుల విషయంలో భావోద్వేగాల విషయంలో ఉత్తరాది రాష్ట్ర ఆధిపత్యం ఎక్కువైందన్న, భావన ద్రావిడ రాష్ట్రాల్లో బలపడింది. హిందీ భాషకు వ్యతిరేకంగా ద్రవిడ సంస్కృతి పరిరక్షణకు ప్రారంభమైన ఆందోళనలు ప్రాంతీయ ఉద్యమాలుగా బలపడినాయి.

## 15.7.0 ప్రాంతీయ ఉద్యమాల తీరు తెన్నులు

ప్రాంతీయ ప్రయోజనాలకోసం సాగే ఉద్యమాలన్నీ ప్రాంతీయ ఉద్యమాలు అనుకున్నాం. సాధారణంగా ప్రాంతీయ అసమానతలు, ఉమ్మడి పాలనలో వివక్షతోపాటు, తమ ప్రాంతాలపై ప్రత్యేక ప్రేమ మూలంగా ఈ ఉద్యమాలను ప్రధానంగా నాలుగు రకాలుగా విభజించవచ్చు. అవి (1) వేర్పాటువాద ఉద్యమాలు, (2) ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలు, (3) ప్రత్యేక ప్రాంత ఉద్యమాలు, (4) అంతర్ రాష్ట్ర ఉద్యమాలు.

BRAOU

### 15.7.1 వేర్పాటువాద ఉద్యమాలు

ఏ ప్రాంతమైన భారతదేశం నుంచి వేరు కావాలని ఉద్యమిస్తే దాన్ని వేర్పాటువాద ఉద్యమంగా పేర్కొనవచ్చు. స్వాతంత్యం వచ్చిన తరువాత ఇండియన్ యూనియన్ నుంచి విడిపోవడానికి అనేక రాష్ట్రాలు అనేకసార్లు ప్రయత్నించాయి. కొన్ని రాష్ట్రాలు ఇంకా ఈ తరహా ఉద్యమాలను కొనసాగిస్తూనే వున్నాయి. ప్రాంతీయ వాదం ముదిరితే వేర్పాటువాదం అవుతుంది. ఇండియన్ యూనియన్ నుంచి వేరవ్వాలనుకున్న తొలి ప్రాంతం పంజాబీ ప్రాంతం. స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే అప్పటికి పాటియాలా అండ్ ఈస్ట్ పంజాబ్ స్టేట్ యూనియన్ గా వున్న ఈ ప్రాంతం ప్రత్యేక దేశంగా ఏదిగే ప్రయత్నం చేసింది. ఐతే 1956లో పంజాబ్ రాష్ట్రం ఏర్పడింది. పంజాబ్, సిక్కు జాతీయుల ప్రత్యేక రాష్ట్రంగా వుండాలని సిక్కులు, హిమాచల్ ప్రదేశ్, పాత పాటియాల ఈస్ట్ పంజాబ్ ప్రాంతంతో కలిసి గ్రేటర్ పంజాబ్ ఏర్పడాలని ఆర్య సమాజ్ ఉద్యమాలు చేశాయి. పంజాబ్‌ను ప్రత్యేక సిక్కు రాష్ట్రంగా ఏర్పాటు చేయకపోతే తాను ఆత్మాహుతి చేసికుంటానని అకాలీదళ్ నాయకుడు సంత్‌ఫతే సింగ్ బెదిరించడంతో 1966 లో అప్పటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ ఆ డిమాండుకు అంగీకరించారు. దీని ఫలితం ఆ తరువాత ఉమ్మడి పంజాబ్‌లో 111.5 మిలియన్ల జనాభాతో 41 శాతం ప్రాంతం పంజాబ్‌గా 38.8 శాతం ప్రాంతం 7.5 మిలియన్ల జనాభాతో హిందీ మాట్లాడే హర్యానాగా, మిగిలిన 22 శాతం భూభాగం 7.1 మిలియన్ జనాభాతో హిమాచల్‌ప్రదేశ్‌గా ఏర్పడ్డాయి. ఐతే అకాలీదళ్‌లోని కొన్ని గ్రూపులకు ఇది నచ్చలేదు. పంజాబ్ ప్రత్యేక రాష్ట్రంగానే కాక స్వతంత్ర రాజ్యంగా భారతదేశం నుంచి వేరవ్వాలని ఈ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. సిక్కులు నివసించే ప్రాంతం ప్రత్యేక స్వతంత్ర 'ఖలిస్తాన్' ఏర్పడాలన్నది ఈ సిక్కు అతివాద వర్గాల ఆకాంక్ష.

ఇదిలావుండగా దక్షిణ భారతదేశంలో ద్రవిడ భాషా రాష్ట్రాలు స్వయంప్రతిపత్తిని కోరుతూ ఉద్యమించాయి. ద్రవిడ

మున్నేట్రకగజం 1960లో ప్రత్యేక ద్రవిడ నాడు డిమాండ్‌ను ముందుకు తెచ్చింది. తమిళ ప్రాంతంతోపాటు ఆంధ్ర, మైసూర్, కేరళ రాష్ట్రాలు కలిసి ప్రత్యేక స్వతంత్ర ద్రవిడ నాడు ఏర్పడాలని డిఎంకె డిమాండు చేసింది. ఈ డిమాండ్‌ను అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నిర్ద్వంద్వంగా త్రోసిపుచ్చారు. అంతేకాకుండా 1963లో 16వ రాజ్యాంగ సవరణ ద్వారా భారతదేశ సార్వభౌమాధికారాన్ని ఏ వ్యక్తి ప్రశ్నించినా శిక్షించేందుకు వీలుగా ఒక చట్టాన్ని కూడా తెచ్చారు. ఈ చట్టాల ఫలితంగా వేర్పాటు వాదాన్ని వదిలి డిఎంకె ప్రత్యేక ప్రతిపత్తిని తన ఎజెండాగా మార్చుకుంది. డిఎంకెకు ఇ.వి.రామస్వామి నాయకర్ నాయకత్వం వహించారు. 1963 తరువాత స్వయం ప్రతిపత్తి నినాదంతో డిఎంకె తమిళనాడులో బలమైన రాజకీయ పార్టీగా ఎదిగి 1967లో అధికారంలోకి రాగలిగింది. ఆ తరువాత 1974లో అధికారంలోకి రాగలిగింది. ఆ తరువాత 1974లో డిఎంకె చీలిపోయి అఖిలభారత అన్నా ద్రవిడ మున్నేట్రకజగమ్ (ఎఐడిఎంకె) ఏర్పడింది. 1977లో ఎడిఎంకె అధికారంలోకి వచ్చింది.

అదే విధంగా కాశ్మీర్‌లో స్వతంత్రపాలన లక్ష్యంగా అనేక రాజకీయ పార్టీలు ఉద్యమాలు మొదలైనాయి. 1952 వరకు స్వతంత్ర రాజ్యంగా వున్న కాశ్మీర్ 1957లో నేషనల్ కాన్ఫరెన్స్‌కు, భారతీయ ప్రభుత్వానికి జరిగిన ఒప్పందంతో స్వతంత్ర ప్రతిపత్తిగల రాష్ట్రంగా అవతరించింది. ఐతే ఈ ఒప్పందానికి వ్యతిరేకంగా, అదేవిధంగా కాశ్మీర్ స్వతంత్ర రాజ్యంగా వుండాలని డిమాండ్ చేస్తూ అనేక ఉద్యమాలు వచ్చాయి. భారత ప్రభుత్వం ఈ ఉద్యమాలను, వేర్పాటు వాద ధోరణిని అణచివేసే ప్రయత్నం చేస్తూ వస్తున్నది. అలాగే నాగాలు, మిజోలు, అస్సామీలు కూడా ప్రత్యేక ప్రతిపత్తి కోసం పోరాటాలు నిర్వహించారు.

## 15.7.2 ప్రత్యేక రాష్ట్రాలు

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అనేక ప్రాంతాల ప్రజలు ప్రత్యేక రాష్ట్రాల ఏర్పాటు కోసం ఉద్యమాలు నిర్వహించారు. భాషాపరంగా, సంస్కృతి పరంగా సాగిన ఈ ఉద్యమాల ఫలితమే రాష్ట్రాల పునర్నిర్మాణానికి దోహదపడినాయి. ఒక ప్రత్యేక సంస్కృతి, భాష, ఇతర సాంఘిక జీవనం కలిగిన ప్రజలు ప్రత్యేక పాలనా ప్రతిపత్తిని కోరుకోవడాన్నే ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలు లేదా ప్రాంతీయ రాష్ట్ర ఉద్యమాలు అని పేర్కొనవచ్చు.

BRAOU

ప్రత్యేక రాష్ట్రం కోసం మొట్టమొదట ఆంధ్రులు చేసిన ఆందోళన ఫలించింది. మద్రాసు రాష్ట్రంలో భాగంగా వున్న ఆంధ్ర ప్రాంతానికి ప్రత్యేక ప్రతిపత్తి కల్పించాలని, ఆంధ్ర రాష్ట్రాన్ని ప్రత్యేక రాష్ట్రంగా గుర్తించాలనే ఉద్యమం పొట్టి శ్రీరాములు ఆత్మాహుతితో ముగిసింది. 1953లో ఆంధ్ర రాష్ట్రం దేశంలోని తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆవిర్భవించింది. దీనితో ఇతర రాష్ట్రాలలో కూడా ఇదే తరహా ఉద్యమాలు మొదలైనాయి. సమస్య తీవ్రతరం కావడంతో భారత ప్రభుత్వం 1955 లో ఫజల్ అలీ కమీషన్‌ను నియమించింది. దీని ఫలితంగా 1956లో భాషా ప్రయుక్త రాష్ట్రాల నిర్మాణం జరిగింది. భాషా ప్రయుక్త రాష్ట్రాల వల్ల దక్షిణాది రాష్ట్రాలకు, ఈశాన్య రాష్ట్రాలకు ఒక రూపం ఏర్పడిందే తప్ప హిందీ మాట్లాడే ప్రాంతాల్లో అల్లర్లు ఆందోళనలు ఆగలేదు. బొంబాయి రాష్ట్రం నుంచి విడిపోయేందుకు గుజరాతీయులు, ప్రత్యేక పంజాబ్ కోసం సిక్కులు నిర్వహించిన ఆందోళన హింసారూపం దాల్చింది. దీనితో పునర్విభజన తప్పలేదు.

## 15.7.3 ఉప ప్రాంతీయ వాదం

ఒక రాష్ట్రంలోని ప్రత్యేక ప్రాంతం, ఆ రాష్ట్రం నుంచి విడిపోయి స్వతంత్ర రాజ్యంగా ఏర్పడాలను కోవడం ఉపప్రాంతీయ వాదం వుతుంది. అసమానతలు, అభివృద్ధి లోపించడం, ప్రత్యేక భౌగోళిక, సాంస్కృతిక లక్షణాలు కలిగి వుండడం వంటివి ఉపప్రాంతీయ వాదానికి కారణమవుతున్నాయి. స్వాతంత్ర్యానంతరం వచ్చిన ఉపప్రాంతీయ ఉద్యమాల్లో విదర్భ (మహారాష్ట్ర) తెలంగాణా (ఆంధ్రప్రదేశ్) వంటివి ప్రధానమైనవి.

బొంబాయి రాష్ట్రం నుంచి గుజరాత్, మహారాష్ట్ర రాష్ట్రాలు విడిపోయిన తరువాత ప్రత్యేక విదర్భ ఉద్యమం

ప్రారంభమైంది. మహారాష్ట్రలో వెనుకబడిన ప్రాంతం అయిన విదర్భను, మధ్యప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలను కలిపి విదర్భ రాష్ట్రం ఏర్పాటు చేయాలని నాగ విదర్భ ఆందోళన సమితి పెద్దఎత్తున ఉద్యమం లేవదీసింది. రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమిషన్ కూడా ఈ డిమాండ్‌ను ఆమోదించాలని సూచించింది. కేంద్ర ప్రభుత్వం విదర్భను ప్రత్యేక ప్రాంతంగా గుర్తించి అభివృద్ధి చేస్తామని హామీ ఇవ్వడంతో ఉద్యమం నీరుగారిపోయింది.

1956లో ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణా ప్రాంతాలు కలిసి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. అయితే సాంస్కృతికంగా, ఆర్థికంగా, సామాజికంగా భిన్నమైన మూడు ప్రాంతాలకు కేవలం భాష ద్వారా కలిపి వుంచడం సాధ్యం కాదని ప్రత్యేక తెలంగాణా ఉద్యమం నిరూపించింది.

బ్రిటీష్‌పాలనలో అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించి సాంస్కృతికంగా కోస్తా ప్రాంతం తెలంగాణాతో పోల్చితే ముందంజలో వుంది. నదీ జలాల వినియోగంలో, వ్యవసాయంలో, విద్యావైద్య రంగాల్లో కోస్తా అప్పటికే అభివృద్ధి చెంది వుంది. మరోవైపు తెలంగాణా ప్రాంతం వందలాది ఏళ్ళుగా నిజాం ప్రభుత్వం దోపిడీలో, పీడనలో నలిగిపోయింది. మితిమీరిన పన్నులు, సుంకాలు, ఒకవైపు కాగా, ప్రాజెక్టులు లేక, పంటలు పండక రైతులు బానిసత్వంలో కొట్టుమిట్టాడే పరిస్థితులు మరోవైపు వుండేవి. ఈ పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్ అవతరణ (1956) పట్ల అప్పటికే తెలంగాణా ప్రజల్లో వ్యతిరేకత వుండింది. తెలంగాణా ప్రాంత ప్రత్యేక అభివృద్ధికి దోహదపడే కొన్ని షరతులతో తెలంగాణా నాయకులు పెద్దమనుషుల ఒప్పందం సంతకాలు చేయడంతో ఆంధ్రప్రదేశ్ అవతరించింది. అయితే ఈ షరతులు, హామీలు ఫలించకపోవడంతో తెలంగాణా ప్రాంత ప్రజలు ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమం లేవదీశారు. వాస్తవానికి 1955 లో రాష్ట్రాల పునర్నిర్మాణ సంఘం కూడా తెలంగాణా ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని సూచించింది. ఈ సూచనను పెడచెవిన పెట్టిన ప్రభుత్వం, ఆ తరువాత పెద్ద మనుషుల ఒప్పందాన్ని కూడా తొక్కిపెట్టింది. తెలంగాణా ప్రాంతీయ కమిటీ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి లేదా ఉప ముఖ్యమంత్రి పదవి తెలంగాణాకు చెందాలని, తెలంగాణాలో ఉద్యోగాలు ఈ ప్రాంతంలో కనీసం 15 సంవత్సరాలు నివసించే వారికి ఇవ్వాలని ఇలా అనేక అంశాలు ఒప్పందంలో వున్నాయి. అయితే ఇవేవీ అమలు జరగకపోవడంతో, రాజకీయంగా, విద్యాపరంగా, ఉద్యోగాల్లో వెనుకబడినామన్న భావన తెలంగాణా వాదుల్లో పడింది. ఉద్యమం బలంగా పుంజుకున్నప్పటికీ ప్రభుత్వ వైఖరి వల్ల, రాజకీయ నాయకుల రాజీ వల్ల విజయం సాధించలేక పోయింది. తరువాత 1972లో ప్రత్యేక ఆంధ్ర ఉద్యమం తలెత్తింది. తెలంగాణా ఉద్యమ ఫలితంగా తెలంగాణాకు చెందిన పి.వి.నరసింహారావు ముఖ్యమంత్రి కావడం, ఆ తరువాత 1972లో ఆయన భూసంస్కరణలు తేవడం ఈ సంస్కరణల వల్ల ఆంధ్ర ప్రాంతపు కమ్మ, కాపు కులాలు సారవంతమైన సేద్యపు భూములు ఎక్కడ కోల్పోవలసి వస్తుందోనని ఆందోళనకు దిగారు. దీని ఫలితంగా పి.వి.నరసింహారావు ముఖ్యమంత్రి పదవిని కోల్పోవలసి వచ్చింది. చివరకు ప్రత్యేక ప్రణాళిక సంస్థలు, హైదరాబాద్‌లో కేంద్రీయ విశ్వవిద్యాలయం, విద్య ఉద్యోగావకాశాల్లో నిర్ణీత నిబంధనలకు లోబడి ప్రాతినిధ్యం ఇవ్వాలని ఒప్పందం జరిగింది.

### 15.7.4. అంతర్ రాష్ట్ర వివాదాలు

ప్రాంతీయ వాదం ప్రోత్సహించే వివాదాల్లో అంతర్ రాష్ట్ర వివాదాలు కూడా ప్రధానమైనవే. ఒక రాష్ట్రానికి మరో రాష్ట్రానికి మధ్య వనరుల పంపిణీ విషయంలో, సరిహద్దుల విషయంలో తరచూ ఇవి తలెత్తుతున్నాయి. హర్యానా, పంజాబ్ రాష్ట్రాల మధ్య చండీగఢ్ పట్టణం కోసం తమిళనాడు కర్ణాటక మధ్య కావేరీ నదీ జలాల కోసం ఇటువంటి వివాదాలు చెలరేగాయి. ఈ ఆందోళన కూడా జాతీయ సమైక్యతను, ఐకమత్యాన్ని దెబ్బ తీస్తున్నాయి.

అన్ని ప్రాంతీయ క్షేత్రాల సమాజ అభివృద్ధి, సాంస్కృతిక పరిరక్షణ, రాజకీయ స్వయం ప్రతిపత్తి కల్పించడంవల్ల ఈ విఘాతాన్ని తప్పించవచ్చు. ఈ అసమానతలు తమిళనాడులో డి.ఎం.కె., ఎ..డి.ఎం.కె. ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతీయ పార్టీల ఏర్పాటుకు కారణమైనాయి. దీంతో ప్రాంతీయ అసమానతలు, రాజకీయ ఉద్యమంగా బలపడడంతో కేంద్ర, రాష్ట్రాల వివాదాలు తలెత్తుతున్నాయి.



BRAOU

## 15.8 భాషావాదం

మాతృభాషపై మమకారం ఆ భాషను పరిరక్షించుకోవడానికి సాగే ప్రయత్నాలు, పరాయిభాషపట్ల వ్యతిరేకత భాషా వాదంలో ఇమిడి వున్న అంశాలు. భిన్నభాషలు, సంస్కృతుల సమ్మేళనమైనా భారతదేశంలో ఏకత్వం ఉన్నప్పటికీ భాషా వివాదాల మూలంగా జాతీయ సమైక్యత భావన తరచూ భగ్నం కావడం జరుగుచున్నది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ భాష విషయంలో అనేక ఆందోళనలు జరిగాయి. దేశం ఒక్కటిగా కనిపిస్తున్నటికీ, అంతరాంతరాల్లో అనేక వైరుధ్యాలున్నాయన్న వాదనలకు ఈ భాషావాదాలు గట్టిబలం చేకూర్చాయి. భారతదేశం బహుభాషా దేశం(Multilingual). భారతీయ జన సమూహాలు అనాదిగా ఒక సంస్కృతిని ప్రత్యేకంగా తమకొక భాషనూ ఏర్పరచుకొని కొనసాగిస్తూ వస్తున్నాయి. 1961 లెక్కల ప్రకారం దేశంలో 1652 భాషలు మాట్లాడే ప్రజలున్నారు. వీటితో పాటు అనేక మాండలికాలు కూడా వున్నాయి. భారత రాజ్యాంగం 16 భాషలను అధికారికంగా గుర్తించింది. భాషాసమస్య దేశంలో రెండు రూపాల్లో కనిపిస్తున్నది. ఒకటి స్వభాషాభిమానం, రెండోది పరభాషా వ్యతిరేకత, స్వభాషాభిమానం స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అనేక ప్రాంతాల్లో వ్యక్తమైంది. కేవలం భావప్రసార అనుసంధానానికే పరిమితమైన భాష స్వాతంత్ర్యానంతరం రాష్ట్రాల పునర్నిర్మాణాలలో కీలకపాత్ర వహించింది. ఆంధ్ర రాష్ట్రంతో సహా అనేక రాష్ట్రాల ఏర్పాటుకు భాష మాత్రమే ప్రామాణికమైంది. వీటినే మనం భాషాప్రయుక్త రాష్ట్రాలు అంటున్నారు. స్వాతంత్ర్యం తరువాత ఆంధ్రలో ప్రారంభమైన భాషా ఉద్యమాలు అనేక రాష్ట్రాల్లో విస్తరించి జాతీయ భావానికి సవాలుగా పరిణమించాయి. ఈ ఉద్యమాల ఫలితంగా రాష్ట్రాల పునర్విభజన సంఘం ఏర్పడింది. బొంబాయి గుజరాత్ రాష్ట్రాల్లో హిందీ, గుజరాతీ, మరాఠీభాష ఆందోళనలు, మైసూరు, మహారాష్ట్రల మధ్య బెల్గాం ప్రాంతపు అధికార భాషపై చెలరేగిన వివాదాలు, మైసూరు, కేరళ, మద్రాసు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో భాషా వివాదాలు, హిందీ, పంజాబీ భాషా సమస్య మొదలగు ఆందోళనలు మొత్తం దేశాన్నే కల్లోల పరిచాయి.

BRAOU

మరోవైపు దక్షిణాదిన హిందీ వ్యతిరేకోద్యమం తీవ్రతరమైంది. ద్రవిడ, ఆర్య సంస్కృతులు వేరువేరని ఆర్యులది దేవనాగరి భాష అని, ఆ భాషని అధికార భాషగా అంగీకరించే ప్రశ్న లేదని డి.ఎం.కె. వంటి ద్రవిడ పార్టీలు స్పష్టం చేశాయి. హిందీని ఉపసంహరించుకోకపోతే దేశం నుంచి విడిపోయి ద్రవిడస్థాన్ ఏర్పాటు చేసికుంటామని కూడా ఉద్యమకారులు హెచ్చరించారు. దక్షిణాది రాష్ట్రాలన్నీ కూడా ఈ ఉద్యమ ప్రభావానికి లోనయినాయి. ఇదేకాలంలో బెంగాలీలు, అస్సామీలు కూడా హిందీకి వ్యతిరేకంగా ఉద్యమాలు లేవదీశారు. భాషోద్యమాలకు దిగివచ్చిన ప్రభుత్వం తక్షణమే కాకుండా క్రమక్రమంగానైనా హిందీని జాతీయ భాషగా అమలు చేయాలని దీనికోసం త్రిభాషా సూత్రాన్ని (1959) ప్రతిపాదించింది. ఈ సూత్రం ప్రకారం ఇంగ్లీషు, హిందీతో పాటు విద్యార్థులు పాఠశాలల్లో మరో భారతీయ భాషను కూడా నేర్చుకోవాల్సి వుంటుంది. దీనికి కూడా మద్రాసు, పశ్చిమబెంగాల్ ప్రభుత్వాలు అంగీకరించలేదు. ఈ వివాదాలను దృష్టిలో వుంచుకొని ప్రభుత్వం నూతన అధికార భాషా చట్టం (1963) రూపొందించింది. దీని ప్రకారం హిందీతో పాటు ఇంగ్లీషు కూడా అధికార వ్యవహారాల్లో వాడవచ్చు. హిందీ ప్రాంతాలు హిందీని, ఇతర ప్రాంతాలు ఇంగ్లీషుని అధికార ఉత్తర ప్రత్యుత్తరాల్లో ఉపయోగించవచ్చు. ఈ చట్టం కూడా నిరసనలకు గురయ్యింది. తరువాత దక్షిణాది రాష్ట్రాలతో పాటు పశ్చిమబెంగాల్, ఇతర ఈశాన్య రాష్ట్రాల శాసనసభలు, కోర్టులు ఇతర అధికార వ్యవహారాల్లో ఇంగ్లీషును వాడే విధంగా తీర్మాణాలు ఆమోదించాయి. ఆ తరువత అన్ని రాష్ట్రాలు తమతమ ప్రాంతీయ భాషలకు, ప్రజల మాతృ భాషలకే ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించుకున్నాయి. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వ వ్యవహారాల్లో హిందీనే వాడడం పట్ల సమాచార వ్యవస్థ ముఖ్యంగా రేడియోలు, టెలివిజన్‌లు హిందీని ప్రజలపై రుద్దడం పట్ల కూడా అనేక నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఈ వివాదాలు ఇంకా సద్దుమణగకపోయినప్పటికీ మరోవైపు ప్రాంతీయ స్థాయిలో కర్నాటకలో ఇటీవల కాలంలో తలెత్తిన మరో వివాదం ఉర్దూభాషకు సంబంధించినది. 1994లో కర్నాటక ప్రభుత్వం దూరదర్శన్‌లో ఉర్దూవార్తల ప్రసారం ప్రవేశపెట్టింది. బీదర్, గుల్బర్గా, బెంగుళూరు, హబ్లీ ప్రాంతాల్లో వున్న ఉర్దూ మాట్లాడే ప్రజలకు ఇది ఎంతో ఉపయోగకరమైనదైనప్పటికీ మెజారిటీ వర్గాలు ముఖ్యంగా

కన్నడ దురభిమానులు దీనిని వ్యతిరేకించడంతో పాటు హింసాత్మక సంఘటనలకు పాల్పడ్డారు. అనేక మంది ప్రాణాలు కూడా కోల్పోయారు. ఇది మత రాజకీయాలకు దారి తీసింది. పంజాబ్‌లో భాషకు సంబంధించిన వివాదం మత కల్లోలానికి ఆజ్యం పోసింది. పంజాబీ మాట్లాడే సిక్కులకు, హిందీ హిందువులకు మధ్య ఘర్షణలు చివరకు వేర్పాటు వాదానికి దారి తీశాయి. ఉత్తరప్రదేశ్, బీహార్, హర్యానా, ఢిల్లీలో ఉర్దూ, హిందీ వివాదాలు తొలి నుంచి వున్నాయి.

భాష మొదట కేవలం భావప్రసార సాధనంగానే పుట్టినా కొన్నిసార్లు సాంస్కృతిక రూపంగా, మరికొన్ని ఆత్మాభిమానానికి సంబంధించిన అంశంగా అనేక రకాల పాత్రలు నిర్వహించి చివరకు అదొక రాజకీయ వస్తువుగా కూడా ఉపయోగపడింది. హిందీ భాషనో, మరో భాషనో, అధికార భాష పేరుతో రుద్దకుండా రాష్ట్రాలకు తమతమ భాషల విషయంలో స్వేచ్ఛనిస్తూ అన్ని భాషలకూ సమానమైన గురింతవును, గౌరవాన్ని ఇస్తే తప్ప ఈ వివాదాలు సడలిపోయే అవకాశం లేదు. సమైక్యతకు సమాన ప్రతిపత్తి ఒక్కటే మార్గం.

## 15.9 మతతత్వం

భారతదేశ సమైక్యతకు పొంచివున్న ప్రమాదం మతతత్వం, మధ్యయుగ కాలంలో జరిగిన మత యుద్ధాలకు తీసిపోని రీతిలో సమాజాన్ని కల్లోల పరుస్తున్నాయి.

భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడినప్పటికీ ఈ సమస్య తీరిపోలేదని రాష్ట్ర ప్రభుత్వాలు తమ భాషను తక్కువచూపు చూస్తున్నాయని ఆయా రాష్ట్రాల్లో వున్న మైనారిటీ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా కర్నాటక, పంజాబ్, ఉత్తరప్రదేశ్, బీహార్, ఈశాన్య రాష్ట్రాల్లో ఈ సమస్య తీవ్రతరమై అనేక ఆందోళనలకు దారి తీసింది.

భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు నేపథ్యంలో కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, హైదరాబాద్ రాష్ట్రాల్లో ప్రాంతాలు కలిసి కర్నాటక ఏర్పడింది. కర్నాటకలో ఇప్పటికే తెలుగు, తమిళం, మలయాళం, మరాఠీ, ఉర్దూ, కొంకణి, భాషలు మాట్లాడే ప్రజలు ఎక్కువ సంఖ్యలో వున్నారు. వీరందరికీ అనుసంధాన భాషగానీ, అందరికీ ఆమోదయోగ్యమైన భాషగానీ లేదు. అందువల్ల అధికార భాషగా కన్నడ రుద్దడంపై అనేక వివాదాలు జరిగాయి. అలాగే ఇతర భాషలను గుర్తించడం వల్ల కూడా అనేక గొడవలు తలెత్తాయి. పాఠశాలల్లో ఏభాష ప్రాథమిక భాషగా బోధించాలనే విషయంపై 1980 ప్రాంతంలో వివాదం తలెత్తింది. గోకక్ కమిటి నివేదిక కన్నడను ప్రాథమిక భాషగా ప్రతివిద్యార్థి నేర్చుకోవాలని సూచించింది. దీనిపై మైనారిటీ వర్గాలు ఇతర భాష మాతృభాషగా వున్న సమాజాలలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగాయి. ప్రభుత్వం తప్పని సరి పరిస్థితుల్లో క్రొత్త త్రిభాషా సూత్రాన్ని ప్రతిపాదించింది. దీని ప్రకారం పాఠశాలల్లో ప్రాథమిక భాషగా విద్యార్థి తన మాతృభాషను ఎంచుకోవచ్చు. దీనిపై కన్నడ భాషాభిమానులు బంద్‌లు, జైల్‌భరో కార్యక్రమాలు నిర్వహించడమేకాక ప్రభుత్వ చర్యను తీవ్రంగా నిరసించారు. పెంచుతున్నాయి.

భారతదేశంలో మతతత్వం కొత్తకాదు. చరిత్రలో ఆది నుంచీ మతమే మానవత్వంపై ఆధిపత్యం చెలాయిస్తూ వచ్చింది. ఒకరకంగా చెప్పాలంటే భారతదేశ నిర్మాణమూ, చరిత్ర మతం పునాదులపైనే ఎదిగింది. చరిత్రకారులు భారతదేశం మతసామరస్యానికి ప్రతీకగా వర్ణించినప్పటికీ మతాల మధ్య అవిశ్వాసమూ, అపనమ్మకమూ, అభద్రతా భావం కూడా క్రమక్రమంగా పెరిగిపోతున్నది.

భారతదేశం లౌకిక రాజ్యం. రాజ్యాంగం ప్రకారం పౌరునికి యిష్టమైన మతాన్ని అవలంబించే స్వేచ్ఛ వుంది. దేశంలో హిందూ ముస్లిం, క్రైస్తవ, సిక్కు, బుద్ధ, జోరాష్ట్రియన్ మతాలు ప్రధానంగా వున్నప్పటికీ హిందువులదే మెజారిటీ చారిత్రక పునాదులు తెరచి చూస్తే నేటికంటే మధ్యయుగ భారతదేశంలోనే భారతీయ సమాజంలో మత సమైక్యత ఎక్కువ. దేశాన్ని ముస్లిం రాజులు చకవర్తులే ప్రారంభించినా ఆ కాలంలో సర్వమత సమానత్వం కనిపించేది. ప్రజలు పరాయి పాలనలో వున్నట్లు కూడా భావించే వారు కాదు. భారతతొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నట్లు ''ముస్లిం పాలకులకు హిందూమతం పట్ల ఎంతో సహన శీలత ప్రదర్శించే వారు అందువల్లే వారు తమ అధికారం

BRAOU

చిరకాలం నిలువుకోగలిగారు.'' భిన్నమతాల సఖ్యత మధ్య బ్రిటీష్ పాలకులు మొట్టమదటిసారిగా విషబీజాలు నాటారు. 'విభజించి పాలించు' పద్ధతిలో ఆంగ్లేయులు తమ పబ్బం గడువుకోవడానికి హిందువుల, ముస్లింల మధ్య చిచ్చురేపారు. ముస్లింలకు ప్రత్యేక నియోజకవర్గాలు ఏర్పాటు చేసి హిందువుల్లో లేనిపోని అపోహలు, అనుమానాలు కల్పించారు. ఇది దేశ విభజనకు తత్ఫలితంగా మత కల్లోలాలకు దారి తీసింది. మెజారిటీ ముస్లింలు పాకిస్తాన్‌కు వలస వెళ్ళారు. మిగతా వారు ఇండియాలోనే స్థిరపడ్డారు. స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగం అన్ని మతాల వారికి సమాన హక్కులు కల్పిస్తామని హామీచ్చింది. అలాగే మతస్వేచ్ఛను ఇచ్చింది.

రాజ్యానికీ, మతానికీ సంబంధం వుండదని రాజ్యాంగం ప్రకటించినప్పటికీ స్వాతంత్ర్యానంతరం అనేక రాజకీయాలు మతం పునాదిగా పుట్టాయి. మతాన్ని ఆసరా చేసికుని అధికారంలోకి రావడానికి ప్రయత్నించాయి. వీటిలో హిందూ, ముస్లిం, సిక్కు మతాలతో సహా అన్ని మతాలూ వున్నప్పటికీ తరచూ ఘర్షణలు హిందూ ముస్లిం మతాల మధ్యే జరుగుతున్నాయి.

1961లో ఆలీఘర్ ముస్లిం యూనివర్సిటీలో రెండు విద్యార్థి వర్గాల మధ్య తలెత్తిన ఘర్షణలు ఉత్తర భారతదేశాన్ని ఉడికించాయి. ఉత్తర ప్రదేశ్, బీహార్, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్‌లలో అనేక పట్టణాల్లో మత వైషమ్యాలు పెల్లుబికినాయి. ఆ తరువాత 1963 నుండి ప్రతి ఏడాది రెండేళ్ళకోసారి చెలరేగిపోతున్న ఘర్షణలు వేలాది మందిని బలిగొంటూనే వున్నాయి.

మత ఘర్షణలు ఉత్తరాదినే కాదు, దక్షిణాదిన కూడా అనేక సార్లు జనజీవనాన్ని కల్లోల పరిచింది. కేరళ, కర్నాటక, ఆంధ్రప్రదేశ్‌లలో అనేక ప్రాంతాల్లో మతం తరచూ మారణ హోమం సృష్టిస్తున్నది. హైదరాబాద్ నగరానికి మత సామరస్యంలో ఎంత చరిత్ర వుందో మత ఘర్షణల్లో అంతటి పేరూ వుంది.

మత ఘర్షణలకు కేవలం మతాల మధ్య, మత విశ్వాసాల మధ్యనున్న విభేదాలే కారణం కాదు. ఈ కల్లోలం వెనుక ఇతర కారణాలు కూడా వున్నాయి. ఏ మతం కూడా హింసను బోధించలేదు. ఏ ప్రవక్తా హింసను ప్రవచించలేదు. అయితే కలుషితమూ, నేరమయమూ అవుతున్న రాజకీయాలు, చిల్లర తగాదాలు, వ్యక్తిగత ప్రయోజనాలు, వ్యాపారాలు, భూములు, లావాదేవీలు హింసను ప్రోత్సహిస్తున్నాయి. పేదరికం, నిరుద్యోగం అసమానతల మధ్య సతమతమవుతున్న మైనారిటీ వర్గాల్లోని నైరాశ్యం ఒకవైపు, ఆర్.ఎస్.ఎస్., శివసేన, భారతీయ జనతాపార్టీ, ముస్లింలీగ్, మజ్లిస్ వంటి సంస్థలు మితిమీరిన మతభక్తి మరోవైపు మతాగ్నికి ఆజ్యం పోస్తున్నాయి. బొంబాయి, బివాండి, గుల్బర్గా, అలహాబాద్, మీరట్, అలీఘర్, హైదరాబాద్ ఇలా ఎన్నో నగరాలు ఈ అగ్నిలో ఆహుతి అవుతున్నాయి.

BRAOU

దుర్గాపూజ పేరుతోనో, మొహర్రం వూరేగింపు, గణపతి ఉత్సవాల పేరుతోనే చెదురు ముదురు గొడవల రూపంలో తలెత్తుతున్న ఈ ఘర్షణలు మానవత్వాన్ని మంటగలుపుతున్నాయి. ముఖ్యంగా అయోధ్యలో బాబ్రీమసీదు కూల్చివేత తరువాత చెలరేగిన అల్లర్లు మన రాజ్యాంగపు ప్రధాన ఆశయమైన సెక్యూలరిజాన్ని అపహాస్యం చేశాయి. ప్రజల్లో అభద్రతా భావాన్ని అప నమ్మకాన్ని పెంచి సమైక్యతను భంగపరిచాయి.

## 15.10 కులతత్వం

భారతదేశంలో అనాదిగా కులం తన ఆధిపత్యాన్ని నిరూపించుకుంటూనే వుంది. వేలాది సంవత్సరాలుగా కొనసాగుతూ వస్తోన్న కులం ప్రస్తుత సమాజంలో కూడా కీలకపాత్ర పోషిస్తున్నది. కుల వివక్షతను రూపుమాపి సమసమాజానికి మార్గం వేయాలనుకున్న రాజ్యాంగ లక్ష్యం నెరవేరడం అటుంచి రానురాను కుల విద్వేషాలు పెచ్చుపెరిగి పోతున్నాయి. కులం అనే పదం 'కాస్టా' అనే పోర్చుగీసు పదం నుంచి పుట్టింది. 'కాస్టా' అంటే 'సంతతి', జాతి, విభాగం అనే అర్థం వుంది. భారతదేశంలో 'అంతర్వివాహ పద్ధతిని ఆచరిస్తూ ఒకే ఇంటి పేరు వుండి వంశ పారంపర్య సమానత్వం కలిగి వున్న సమూహాన్ని 'కులం' అంటున్నాం. ఇదొక విస్తృత బంధు సమూహం. తొలి రోజుల్లో అవసరం రీత్యా

ఆవిర్భవించిన కులం తరువాత కాలంలో వర్గ వివక్ష పేరుతో ఒక వర్గం మరో వర్గంపై ఆధిపత్యం వహించేందుకు దోహదపడింది.

కులానికి సంబంధించిన దురభిమానం పెరిగిపోయి సమైక్యతను భంగపరిస్తే అది కులతత్వం అవుతుంది. కులతత్వం భారత రాజకీయాల్లో ప్రవేశించి ఓటు బ్యాంకును కొల్లగొట్టే సాధనమైపోయింది. ఎలాగైనా సరే అధికారంలోకి రావాలనుకుంటున్న పార్టీలు కులాలను ముఖ్యంగా పేదరికం, అమాయకత్వం ఇతర సమస్యలతో సతమతమవుతున్న కులాలను, కుల సంఘాలను మభ్యపెట్టి మోసపూచ్చి ఓట్లను వేయించుకుంటున్నారు. రాజకీయ పార్టీలు, ప్రభుత్వాల వైఖరివల్ల కుల నిర్మూలన జరగకపోగా, కులానికి ప్రాపకం లభిస్తున్నది. ఎన్నికల్లో గెలిచేందుకు, ఎలాగైనా అధికారంలోకి రావాలనుకునే పార్టీలు కుల సంఘాలను ప్రోత్సహించడమే కాక అభ్యర్థుల ఎంపిక మొదలుకొని మంత్రి పదవులు, ఇతర అధికార పీఠాల పంపిణీ దాకా కులం పైనే ఆధారపడుతున్నాయి. మరోవైపు ఉత్పత్తి శక్తులపై ఆధిపత్యం గల కులాలు ఇతర కులాలను తమ అదుపు ఆజ్ఞల్లో వుంచుకొని అవసరం వచ్చినప్పుడల్లా ఓట్ల బ్యాంకుగా మార్చుకుంటున్నాయి. క్రింది కులాలు అందుకు అంగీకరించకపోతే దాడులు, దౌర్జన్యాలు చేయటం జరుగుచున్నది. పదిరి కుప్పం దీనికి ఉదాహరణ. 1982లో చిత్తూరు జిల్లా పదిరి కుప్పం హరిజనులు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశారన్న ఆరోపణపై తెలుగుదేశం పార్టీకి చెందిన కమ్మ వర్గం దళిత వర్గంపై దాడిచేసింది. ఈ సంఘటనలో గుడిసెలు దగ్ధ అవ్వడమే కాక ప్రాణ నష్టం జరిగింది.

మరోవైపు తరతరాలుగా ఆధిపత్యానికి రక్షణ కవచంగా మారిన కుల వ్యవస్థపై పోరాటం తీవ్రమవుతున్నది. రిజర్వేషన్ల వల్ల విద్యా వకాశాలు పొంది, ఉద్యోగాల్లో చేరిన వర్గం తమ కులాలకు జరుగుచున్న అన్యాయాలను గుర్తించి తెలుసుకొని తమ కులాలను సంఘటిత పరచటం ఇటీవలే ప్రారంభమైంది. అగ్రకులాల దోపిడీని, దౌర్జన్యాలను ప్రతిఘటించటం కూడా ఈ మధ్యే మొదలైంది. ఇది రెండు వర్గాల మధ్య వైరుధ్యాలను మరింత పెంచి కారంచేడు, చుండూరు వంటి సంఘటనలకు కారణమవుతున్నది. ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకపోవడం చేత అభివృద్ధికి దూరంగా పేదరికంలో మగ్గిపోతున్న కింది కులాలు చైతన్య వంతమై రాజ్యాధికారమే అంతిమ పరిష్కారమన్న రీతిలో 1990 నుంచి రాజకీయ సమీకరణకు పూనుకున్నారు. ''ఓట్లు మావి సీట్లు మీవా'' అని ప్రశ్నిస్తూ ఇంతకాలం అధికారంలో వున్న ఉన్నత వర్గాలను ఎదిరిస్తూ ఎదగడం గ్రామీణ సమాజంలో ఉద్రిక్తతలకు కారణమైంది. ఇంతకాలం రిజర్వేషన్లతోనో, ప్రత్యేక పథకాలతోనో జనాన్ని బుజ్జగిస్తూ వచ్చిన పార్టీలు ఈ మధ్యకాలంలో దళితుల డిమాండ్లకు తలవంచక తప్పడం లేదు.

కేవలం శ్రమ విభజనకో, పనుల పంపిణీ కోసమో పుట్టిన కులం, అధికార బలమై దోపిడీ మార్గమై ఓట్ల బ్యాంకుగా మారి ఇప్పుడు రాజకీయాలే కులమయమైపోయాయి. పరస్పర సహకారం స్థానంలో నేడు ఘర్షణలు పెరిగిపోయి సామరస్యం, సుహృద్భావం ఐకమత్యాన్ని దెబ్బతీస్తున్నాయి.

## 15.11 భిన్నత్వం-ఏకత్వం

భారతదేశంలో భిన్నసంస్కృతులు గల ప్రజల సమ్మేళనం. జాతులు, మతాలు, ప్రాంతాలు, అసమానతలు, భిన్నమతాలు, కులాలు, ధర్మాలు ప్రజలను వారి జీవన విధానాలను విడదీస్తున్నటికీ జాతీయ భావం వారి మధ్య ఐకమత్యం పెంపొందిస్తున్నది.

చారిత్రకంగా చూసినట్లయితే భారతదేశాన్ని అనేక మంది రాజులు పరిపాలించారు. దాడులు, దండయాత్రలు విదేశీ పాలన తదితర కారణాల వల్ల భారతదేశంలో భిన్నమతాలు, భిన్న విశ్వాసాలు, భిన్న సంస్కృతులు విలసిల్లాయి. అలాగే భారతదేశానికి ఒకే రకమైన భౌగోళిక స్వరూపం కూడా లేదు. ఈశాన్య రాష్ట్రాలు కొండ కోనలతోనూ, మధ్యభాగం పీఠభూములతోనూ, దక్షిణభాగం పర్వతాలు, అడవులతోనూ, నిండి వుంది. ఎప్పుడైనా సరే ఒక ప్రాంతపు

BRAOU

నైసర్గిక, భౌగోళిక స్వరూపమే ఆ రాష్ట్రపు ప్రజల జీవన విధానాన్ని స్వభావాన్ని నిర్దేశిస్తుంది.

దేశ ప్రజలందరినీ ఏకం చేసే భాష ఏదీ లేక పోవడం కూడా ఒక ప్రత్యేకత. ఒకే రాజ్యం, ఒకే రాజ్యాంగం ఉన్న భారతదేశంలో ఒకే భాషలేదు. దేశంలో 179 భాషలు, 544 మాండలికాలు వున్నాయి. ప్రజల్లో 73 శాతం ఇండో ఆర్యన్ భాషలను, 20 శాతం ద్రవిడ భాషలను, 1.3 శాతం ఆస్ట్రిక్ భాషలను మరో 0.85 శాతం చైనా టిబెటన్ భాషలను మాట్లాడుచున్నారు. వందలాది జాతులు, తెగలు, వేలాది కులాలున్న భారతదేశంలో సాంస్కృతీ పరమైన భిన్నత్వం, వైరుధ్యం కూడా నెలకొని వున్నాయి. ఇన్ని వైరుధ్యాలున్న దేశాన్ని జాతీయ భావం ఒక్కటి చేసింది. ఒకే సార్వభౌమాధికారాన్ని ఆమోదించడమేగాక యావత్ భారత ప్రజానీకం ఒకే జాతిగా సంక్షోభ సమయాల్లో సంఘటిత శక్తిగా నిరూపించుకుంది. లోలోపల ఎన్ని వైరుధ్యాలున్నప్పటికీ దేశం భిన్నత్వలో ఏకత్వం చాటుతూ వస్తున్నది.

## 15.12 సమైక్యతాసాధన

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత పదేళ్ళ వరకూ దేశంలో ఎలాంటి గొడవులు లేవు. ప్రభుత్వం జాతి పునర్నిర్మాణ కార్యక్రమాలు రూపొందిస్తూ ప్రజల్లో ఐక్యభావాన్ని విస్తృతంగా ప్రచారం చేసింది. ఐతే పదేళ్ళు గడచినప్పటికీ తమ పరిస్థితుల్లో గుణాత్మకమైన మార్పేమీ కనిపించకపోవడంతో అనేక జాతులు, మతాల్లో ఒక రకమైన 'వైమనశ్యత' ప్రబలింది. నిర్లక్ష్యానికి గురైన ప్రజల్లో అశాంతి చెలరేగింది. ఇది తొలుత ఈశాన్య రాష్ట్రాల్లో ఆ తరువాత దక్షిణాదిన మద్రాసు రాష్ట్రంలోనూ వేర్పాటువాద రూపంలో వ్యక్తమైంది. అదేవిధంగా దేశ విభజన తరువాత దశాబ్దం గడిచినా హిందూ ముస్లిం వర్గాల్లో సఖ్యత సాధ్యపడకపోగా కొత్త విభేదాలు పొడచూపి మతకల్లోలాలకు కారణమైనాయి. మరోవైపు ఆదివాసి ఉద్యమాలు వేర్పాటువాద ధోరణులు బలపడి జాతీయ సమైక్యతకే ముప్పు వాటిల్లింది.

నూతన ధోరణులను దృష్టిలో వుంచుకొని ప్రభుత్వం సమైక్యత మండలి ఏర్పాటు చేసింది. ప్రధాన మంత్రి రాష్ట్రాల ముఖ్యమంత్రులు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, విద్యావేత్తలు, సంఘ సేవకులు ఈ మండలిలో సభ్యులు. దీని తొలి సమావేశం 1962 సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు కొత్త ఢిల్లీలో జరిగింది. అప్పుడప్పుడే తలెత్తుతున్న మత కల్లోలు, వేర్పాటు వాదం నేపథ్యంలో జాతీయ సమైక్యత మండలి 'భిన్నత్వంలో ఏకత్వం' ఎలా సాధ్యపడుతుందో చర్చించి జాతీయ సమైక్యత కోసం మార్గదర్శకాలను రూపొందించింది. ప్రాంతీయ వాదాన్ని వేర్పాటు వాదాన్ని కుల తత్వాన్ని, మత విద్వేషాలను రెచ్చగొడుతున్న సంస్థల వెనుక రాజకీయ పార్టీల హస్తం వుందని భావించిన జాతీయ సమైక్యత మండలి ఒక నియమావళిని రూపొందించింది. అవి ప్రజల్లో ద్వేష భయాలు కల్పిస్తున్న శక్తులకు రాయకీయ పార్టీలు దూరంగా ఉండాలి.

(1) కుల, మత, ప్రాంతీయ విభేదాలు ప్రోత్సహించడం రాజ్యాంగ రీత్యా నేరంగా పరిగణించాలి.

(2) మత సంబంధమైన సమస్యల పరిష్కారానికి రాజ్యాంగేతర ఆందోళనలు, అనుసరించరాదు.

(3) అధికారాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకోరాదు. ఆ తరువాత కూడా సంక్షోభం ఏర్పడ్డ ప్రతిసారీ సమైక్యత మండలి సమావేశం కావడం, తీర్మానాలు చేయడం మామూలైపోయింది. జాతీయ సమైక్యత మండలి సిఫారసులను ప్రభుత్వం కట్టుదిట్టంగా అమలు పరచకపోవడం, రాజకీయ ప్రయోజనాల కోసం కుల, మత, జాతి ప్రాంతీయ వాదాలను వివిధ పార్టీలు ప్రోత్సహించడం జరుగుతూనే వస్తున్నది.

ప్రజల్లో చైతన్యం తేవడం, మత రాజకీయాలకు దూరం చేయడం, ప్రభుత్వం చిత్తశుద్ధితో అన్ని వర్గాలను సమానంగా అభివృద్ధిలోకి తీసికురావడం ప్రజల్లో ఉన్న అసమాన భావనలను పొగొట్టి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించటం ఎంతో అవసరం. అసమానతలు కొనసాగినంత కాలం అసంతృప్తే సమైక్యతా భావానికి భంగం కలిగిస్తుంది.

BRAOU

## 15.13 ముగింపు

భారతదేశంలో అసమానతలు కొత్తకాదు. వేదకాలం నుంచీ ఆధిపత్యం, దోపిడీ, పీడన కొనసాగుతూనే వస్తున్నాయి. బ్రిటీష్ పాలన ప్రజల్లో ఈ అసమానతలను మరింత పెంచింది. స్వాతంత్ర్యం వచ్చేనాటికి సామాజికంగా ముక్కలు చెక్కలైనా దేశాన్ని కలిపి వుంచాలని పాలకులు ప్రయత్నిస్తూనే వస్తున్నా, అన్యాయానికీ, అసమానతలకూ గురవుతున్న ప్రజలు ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడుతూనే వున్నారు. మరోవైపు కుల, మత వివక్షణలకు వ్యతిరేకంగా కూడా జనం సంఘటితమవుతున్నారు. ఇది మొత్తంగా భారత జాతీయ భావానికి, సమైక్యతకు, లౌకిక వ్యవస్థకు సమాఖ్య విధానానికి గొడ్డలిపెట్టుగా మారింది. అన్ని ప్రాంతాలు, కులాలు, మతాల సమానాభివృద్ధి, సమగ్ర ఆర్థిక ప్రణాళికలు, సాంఘిక సమానత్వం సాధించపోతే దేశ సమైక్యతకే ముప్పు వాటిల్లే ప్రమాదం వుంది.

– ఘంటా చక్రపాణి

## 15.14 చదవదగిన గ్రంథాలు

1. Sinha M.R.; Integration in India.
2. Desai A.R.; Social Movements in India.

## 15.15 నమూనా పరీక్షా ప్రశ్నలు

BRAOU

I వ్యాసరూప ప్రశ్నలు.

1. సమైక్యతా భావనను వివరించి, సమైక్యత అవశ్యకతపై ఒక వ్యాసము వ్రాయుము.
2. అసమైక్యత కారణాలను చర్చించుము.
3. ప్రాంతీయ వాదాన్ని వివరించి కారణాలను చర్చించుము

II సంక్షిప్త ప్రశ్నలు

1. మతతత్వం
2. 'భిన్నత్వంలో ఏకత్వం' భావనను వివరించుము.
3. జాతీయ సమైక్యతా మండలి లక్ష్యాలను పేర్కొనుము.

# ఖండం –4 స్థిరదృక్కోణాలు

BRAOU

రాజకీయాలకు సామాజిక అంతర్ శక్తులకు మధ్య అంతర్ చర్యలను వివరించటానికి రాజకీయ సమాజ శాస్త్రం కొన్ని స్థిర దృక్కోణాల ద్వారా ప్రయత్నిస్తుంది. అది రాజకీయ సమాజంలో మానవ ప్రవర్తనను వివరిస్తుంది. ఈ ఖండంలో రాజకీయ పార్టీలు, ప్రభావ వర్గాలు నాయకత్వ నమూనాలు, సామాజిక మార్పుకు వివిధ దృక్పథాలను చర్చించాం.

BRAOU

# భాగం 16 - రాజకీయ పక్షాలు

విషయక్రమం

16.1 లక్ష్యాలు
16.2 పరిచయం
16.3 రాజకీయ పక్షాల ఆవిర్భావం
16.4 రాజకీయ పక్షాలు- సామాజిక, ఆర్థిక పునాదులు
16.5 రాజకీయ పక్షాల అధ్యయనం- ప్రాధాన్యత
16.6.0 పార్టీ రాజకీయాలు- అధ్యయన దృక్పథాలు
16.6.1 అభివృద్ధి దృక్పథం
16.6.2 చీలిక సిద్ధాంతం
16.6.3 పునరేకీకరణ సిద్ధాంతం
16.6.4 స్పేషియల్ సిద్ధాంతం
16.6.5 పర్మియేషన్ సిద్ధాంతం
16.7.0 రాజకీయ పక్షాల స్వభావం
16.7.1 ఉదారవాద దృక్పథం
16.7.2 మార్క్సిస్టు దృక్పథం
16.8 రాజకీయ పక్షాలు - కర్తవ్యాలు
16.9.0 రాజకీయ పక్షాలు- నిర్మాణం
16.9.1 కాకస్ పార్టీలు
16.9.2 శాఖల పార్టీలు
16.9.3 సెల్ పార్టీలు
16.9.4 సైనిక తరహా రాజకీయ పక్షాలు
16.10 అభివృద్ధి చెందుతున్న దేశాల్లో రాజకీయ పక్షాలు
16.11.0 పార్టీ వ్యవస్థలు- రకాలు
16.11.1 ఏకపక్ష వ్యవస్థ
16.11.2 ద్విపక్ష వ్యవస్థ
16.11.3 బహుపక్ష వ్యవస్థ
16.12 ముగింపు
16.13 సంప్రదించదగిన పుస్తకాలు
16.14 నమూనా పరీక్షా ప్రశ్నలు

BRAOU

## 16.1 లక్ష్యాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు

★ రాజకీయ పార్టీల ఆవిర్భావం వివిధ దృక్పథాలను తెలుసుకుంటారు.

★ రాజకీయ పార్టీల అధ్యయన ఆవశ్యకతను గ్రహిస్తారు.

★ రాజకీయ పార్టీల నిర్మాణం పనితీరులను గురించి వివరించగలుగుతారు.

## 16.2 పరిచయం

ఆధునిక కాలంలో రాజకీయ పక్షాల అధ్యయనం చాలా ప్రాముఖ్యం పొందింది. పశ్చిమదేశాల్లో ఆవిర్భవించిన ప్రవర్తనావాద విప్లవం ఫలితంగా రాజకీయ పార్టీల విశ్లేషణ, అవి పనిచేసే తీరుతెన్నులు అధ్యయనం పట్ల రాజకీయ శాస్త్రజ్ఞులు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. రాజకీయ సంస్థలు పనిచేసే విధానం చాలా వరకు రాజకీయ ప్రక్రియపై ఆధారపడి వుంటుంది. రాజకీయ ప్రక్రియలో ఒక ప్రధాన అంతర్భాగం రాజకీయ పక్షం. అందువల్ల రాజకీయ పక్షాల అధ్యయనం ప్రాధాన్యం పొందింది.

రాజకీయ పక్షాలు చట్టపరంగా, రాజ్యాంగ పరంగా గుర్తింపు పొందినప్పటికీ చట్టబద్ధమైన రాజకీయ సంస్థలు– శాసనసభ, కార్యనిర్వాహక వర్గం– నిర్మాణం, నిర్వహణల్లో అత్యంత కీలకపాత్ర వహిస్తున్నాయి. పార్లమెంటరీ ప్రాతినిధ్య ప్రజాస్వామ్యలకు రాజకీయ పక్షాలు వెన్నెముక వంటివి. అందువల్ల రాజకీయ పక్షాల విశ్లేషణ లేకుండా రాజకీయ వ్యవస్థ అధ్యయనం సంపూర్ణగాదు.

ప్రజాస్వామ్య ప్రభుత్వం సమర్థతతో పనిచేయాలంటే రాజకీయ పార్టీలు తప్పని సరి. కర్ణుడు లేని భారతంలా రాజకీయ పక్షాలు లేని ప్రజాస్వామ్యాన్ని మనం ఊహించలేం. అధిక సంఖ్యాబలం సంపాదించిన పార్టీ అధికారాన్ని చేపడుతుంది. తక్కువ సంఖ్యలో స్థానాలు సాధించిన రాజకీయ పక్షం/పక్షాలు ప్రతిపక్షంగా వ్యవహరిస్తాయి. అవి అధికార పక్షం తన కర్తవ్యాలను బాధ్యతాయుతంగా నిర్వహించేలా చూస్తాయి. ప్రభుత్వ అలసత్వాన్ని, అవినీతిని, అసమర్థతను ఎండగడతాయి. ఈ విధంగా అధికార పక్షం, ప్రతిపక్షాలు రెండూ ప్రజాస్వామ్యానికి రెండు చక్రాలుగా పనిచేస్తాయి.

రాజకీయ పక్షాలు విభిన్న అభిప్రాయాలున్న ప్రజల నుంచి ఉత్పన్నమయ్యే గందరగోళాన్ని అదుపు చేసి వాటికి ఒక క్రమాన్ని ఏర్పరుస్తాయి. గాబ్రియల్ ఆల్మండ్ అన్నట్లు రాజకీయ పక్షాలు ప్రయోజనాన్ని సమీకరించే సంస్థలుగా ప్రజాభిప్రాయానికి మెరుగులుదిద్దే సాధనాలుగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి చైతన్యవంతులు చేసి వారిని ప్రభావితం చేయటం, ఎన్నికల్లో పాల్గొనటం, ఎన్నికల ప్రణాళికల్లో పేర్కొన్న విధానాలను, కార్యక్రమాలను అమలు చేయడానికి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం రాజకీయ పక్షాల విధులు. స్వభావరీత్యా అవతరణ, వికాసం, అభివృద్ధి మొదలైన వాటికి సంబంధించిన అంశాలు రాజ్యాంగం పేర్కొనటం లేదు.

BRAOU

## 16.3 రాజకీయ పక్షాల ఆవిర్భావం

అభివృద్ధి చెందిన పాశ్చాత్య సమాజాల్లో రాజకీయ పక్షాలు–ఇంగ్లండ్, అమెరికా చారిత్రకంగా, సామాజికంగా, పారిశ్రామికీకరణ, అభివృద్ధుల ఫలితంగా ఏర్పడి వికాసం పొందాయి. 1688లోని ఉదాత్త, విప్లవానికి ముందు ప్రారంభమైన ప్యూరిటన్ విప్లవం (1648) ఇంగ్లండ్‌లో రాజకీయ పక్షాల జననానికి నాంది పలికింది. రాచరిక సంపూర్ణాధికారాన్ని బలపరిచేవారు ఒకవైపు పార్లమెంటరీ ఆధిక్యతకు మద్దతునిచ్చేవారు మరోవైపు నిలబడి ఇంగ్లండ్‌లో సుదీర్ఘపోరాటం సాగించారు. వీరే కాలక్రమంలో విగ్గులు (Whigs), టోరీలు (Tories)గా ముందు చలామణి అయి తరువాత కన్సర్వేటివ్ (Conservative), లిబరల్ (Liberal), రాజకీయ పక్షాలుగా అవతరించారు. బ్రిటన్‌లో రాజ్యాంగం సంవిధానం–పరిమిత రాచరికం– సంపూర్ణాధికార రాచరిక వ్యవస్థ నుంచి రాజ్యాంగబద్ధ, లాంఛనప్రాయ రాచరిక వ్యవస్థ ప్రజాస్వామ్య పార్లమెంటరీ ప్రభుత్వంగా రూపాంతరం చెందింది. అందువల్ల రాజకీయ పక్షాల ఆవిర్భావం, అభివృద్ధి, వికాస దశల్లో చారిత్రక, సామాజిక నేపథ్యాన్ని మనం తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాల్సి వుంటుంది.

పశ్చిమ దేశాల అనుభవానికి విరుద్ధంగా ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ఖండాల్లో వలసవాద విమోచనోద్యమాల ద్వారా స్వాతంత్ర్యం పొందిన అనేక దేశాల్లో రాజకీయ పక్షాల ఆవిర్భావానికి ప్రత్యేక సామాజిక, చారిత్రక వలసవాద, సాంస్కృతిక నేపథ్యం దోహదం చేసింది. పై ఖండాల్లోని వలస దేశాల్లో రాజకీయ పక్షాల అవతరణ, అభివృద్ధిని, జాతీయోద్యమాలు ప్రభావితం చేశాయి.

ఈ సందర్భంలో భారతదేశ స్వాతంత్ర్యానికి పూర్వం, తరువాత రాజకీయ పక్షాల అనేక పరిణామాలను ప్రస్తావించడం అవసరం. ఈ రెండు దశల్లో కాంగ్రెస్ పార్టీ ముఖ్యపాత్ర నిర్వహించింది. అఖిల భారత జాతీయ కాంగ్రెస్ ఒక జాతీయోద్యమంగా ప్రారంభమైంది. వలస వాదాన్ని అంతంచేయటానికి, సంప్రదాయ వాదానికి వీడ్కోలు చెప్పడానికి, ప్రాచీన సంస్కృతిలో, ఆదిమ విలువలలో గొంతు వరకు కూరుకుపోయిన భారతదేశానికి ఒక సాంఘిక –ఆర్థిక నవజీవనాన్ని కల్పించడానికి కాంగ్రెస్ ప్రారంభమైంది. స్వాతంత్ర్యానంతరం అది అధికార రాజకీయ పక్షమైంది. స్వాతంత్రోద్యమకాలంలో భారతీయులు కలిసి కట్టుగా బ్రిటిష్‌వారితో పోరాడి దేశాన్ని పరాయిపాలన నుంచి విముక్తి చేయడానికి అన్ని వర్గాల మద్దతు అవసరమని నాడు కాంగ్రెస్ భావించింది. ఫలితంగా జమీందారులు. భూస్వాములు, సామాన్య ప్రజలు, ఛోటా, బడా పెట్టుబడిదారులను కాంగ్రెస్ ఒక తాటిపై నడిపించగలిగింది. స్వాతంత్ర్యానంతరం కూడా నవసమాజ నిర్మాణం కోసం సోషలిస్టు భావాల ప్రాతిపదికగా ప్రణాళికాబద్ధమైన ఆర్థిక వ్యవస్థ మొదలైనవన్నీ వలస వాదకాలం నాటి సర్వసమ్మతి వారసత్వం నాటి కాంగ్రెస్‌ను ఈ నాటికీ ప్రభావితం చేస్తున్నాయి. అందువల్ల రాజకీయ పక్షాల ఆవిర్భావం, విధానాలు, ఆచరణ పద్ధతులు, వ్యవహార సరళి, దేశ సామాజిక, చారిత్రక సాంస్కృతిక పరిస్థితులు అమితంగా ప్రభావితం చేస్తాయి.

## 16.4 రాజకీయ పక్షాలు–సామాజిక, ఆర్థిక పునాదులు

BRAOU

పశ్చిమదేశాల వలస పాలన వల్ల మూడో ప్రపంచ దేశాల్లో పాశ్చాత్య విద్యావిధానాన్ని పాలకులు ప్రవేశపెట్టారు. ఈ విద్యద్వారా చైతన్యం పొందిన అతితక్కువ స్థాయి ప్రజానీకం ఒక ప్రబల మధ్యతరగతి వర్గంగా ఏర్పడి ఆయా వలస ప్రాంతాల్లో స్వాతంత్ర్యోద్యమానికి నాయకత్వం వహించి స్వాతంత్ర్య సముపార్జనానంతరం అధికారంలోకి వచ్చి ఒక ప్రబల శిష్టవర్గంగా రూపాంతరం చెందింది. వీరిలో చాలామంది భారతదేశంలో చూసినట్లయితే ఉన్నత కులాల నుంచి వచ్చినవారే. వీరు జాతీయోద్యమ నాయకత్వం వహించటమేకాకుండా రాజకీయ పక్షాల్లో కూడా (స్వాతంత్ర్యానంతరం) కీలక స్థానంలో ఉన్నారు. రాజకీయ పక్షాల ఆవిర్భావం నమూనా నాయకత్వ ప్రాబల్యం మొదటి నుంచి ఎక్కువగానే వుంది. అది అఖిల భారత జాతీయ కాంగ్రెస్ కావచ్చు, భారత కమ్యూనిస్టు పార్టీ కావచ్చు.

స్వాతంత్ర్యోద్యమకాలంలో పై రెండు రాజకీయ పక్షాలు భారతదేశంలో ప్రాబల్యస్థితిలో ఉండేవి. స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన రాజకీయ పక్షాలు కూడా భారతీయ జనసంఘ్, స్వతంత్రపార్టీ, ద్రావిడ మున్నేట్రకజగమ్, సోషలిస్టు పార్టీ–చివరికి నక్సలైట్ పక్షాలు కూడా ఉన్నత, మధ్యతరగతి, ఉన్నత, మధ్యకులాల నాయకత్వంలో కొనసాగుతున్నాయి.

స్వాతంత్ర్యోద్యమ కాలం నాటి సామాజిక పరిస్థితుల ప్రభావం స్వాతంత్ర్యానంతరం కూడా భారత రాజకీయ పక్షవ్యవస్థను ప్రభావితం చేస్తున్నది. కుల, మత, తెగ, ఉపజాతి, ఉపతెగల, భాషా, ప్రాంతీయ వైవిధ్యాలు జాతీయోద్యమ కాలం నుంచి భారతదేశంలో ఆవిర్భవించి నేటికీ జాతీయ, రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేస్తూనే వున్నాయి. ద్రవిడమున్నేట్రకజగమ్ వెనకబడిన కులాల ఉద్యమంగా, ఆత్మగౌరవం ఉద్యమంగా, చివరికి బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమంగా రూపాంతరం చెందింది. వివిధ చీలిక ప్రాంతీయ పక్షాలుగా డి.ఎం.కె, అన్నా డి.ఎం.కె.అగ్రస్థానంలో ఉన్నాయి. అధికారం, అవకాశం, హక్కులు, అన్నీ అగ్రకులాలకే పరిమితమయ్యాయన్న భావం బహుజన సమాజ్ రాజకీయ పక్షం అవతరణకు కారణమయింది. ఒకవైపు హిందూ –ముస్లిం తత్వం, మరోవైపు అకాలీ ఉద్యమం, చివరికి

పంజాబ్‌లో తీవ్రవాదులు ''ఖలిస్థాన్'' నినాదంతో పంజాబ్ రాజకీయాలనే కాకుండా దేశ రాజకీయాలను కూడా ప్రభావితం చేస్తున్నారు. ఫలితంగా జాతీయ స్థాయిలో రాజకీయ పక్షాలు, ప్రాంతీయ స్థాయి రాజకీయ పక్షాలు డి.ఎం.కె, అన్నా డి.ఎం.కె., అకాలీదళ్, అస్సాంగణ పరిషత్, శివసేన, తెలుగుదేశం-మొదలైనవి తామర తంపరగా వెలిశాయి.

పైవిధంగా వివిధ సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, చారిత్రక నేపథ్యాలు భారతదేశంలోనే కాకుండా ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాల్లో కూడా రాజకీయ పక్షాలు ఆవిర్భవించాయి. అందువల్లనే రాజనీతి శాస్త్రజ్ఞులు, పరిశోధకులు, పాత్రికేయులు ఈ దృగ్విషయాన్ని శోధించి విశ్లేషించడానికి నేడు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. ఒక్క భారతదేశంలోనే కాకుండా ఇతర మూడో ప్రపంచ దేశాల్లో కూడా పరిస్థితులు ఇంచుమించుగా పై విధంగానే వున్నాయి. ఆయా సమాజాల్లో కూడా భాష, తెగ, జాతి, ఉపజాతి, ఉపతెగల సమస్యలు, ఆదిమ విధేయతలు, వివాదాలు రాజకీయ ప్రముఖులను ప్రభావితం చేస్తున్నాయి.

పైసామజిక సంఘర్షణలు చివరికి ప్రజాస్వామ్య ప్రక్రియకు కాలదోషం పట్టేట్లు చేసి నియంతృత్వాల స్థాపనకు దోహదం చేశాయి. 1962లోని విభిన్న సామాజిక శక్తుల, ఘర్షణల ఫలితంగా నైజీరియాలో ప్రజాస్వామ్య వ్యవస్థ కుప్పకూలి నియంతృత్వ స్థాపనకు దోహదం చేశాయి. అలాగే పాకిస్థాన్, బంగ్లాదేశ్ మొదలైన దేశాల అనుభవాలు కూడా ఉన్నాయి.

విభిన్న వర్గాల మధ్య ఏర్పడిన ఘర్షణలు, అధికారం కోసం పెనుగులాటలు, అనేక ఆఫ్రికా, ఆసియా దేశాల్లో సైనిక పాలనకు దోహదం చేశాయి. రాజకీయ పక్షాల మధ్య అవగాహన, జాతీయ సమస్యలపై స్పష్టమైన వైఖరి లేనప్పుడు సహజంగా అటువంటి అవకాశాన్ని ఉపయోగించుకొని దురాశపరులైన సైనికాధికారులు అధికారాన్ని కైవసం చేసుకొని పౌర పాలనకు భరతవాక్యం పలుకుతారు. సమీప పొరుగు రాజ్యం పాకిస్థాన్, దీనికి చక్కని ఉదాహరణ. తూర్పు, పశ్చిమ పాకిస్థాన్‌లు ప్రాదేశికంగా దగ్గరగా లేవు. మూడు దశాబ్దాలు పశ్చిమ పాకిస్తాన్, పంజాబీ ప్రాబల్యంతో విసుగు చెందిన తూర్పు పాకిస్తాన్-వంగభాషావాదులు-బంగ్లాదేశ్‌గా అవతరించింది. పఠాన్‌లు, పంజాబీలు ప్రాబల్యస్థానంలో వున్న పాకిస్తాన్ రాజకీయాల్లో నేటికీ సైన్యం ప్రధాన పాత్ర నిర్వహిస్తున్నది. పౌర ప్రభుత్వాన్ని నిలపాలన్న, కూలగొట్టాలన్న సైన్యం ప్రమేయం తప్పనిసరి అయింది.

BRAOU

## 16.5 రాజకీయ పక్షాల అధ్యయనం ప్రాధాన్యత

రాజకీయ పక్షాల పాత్రను అవగాహన చేసుకోడానికి, దాని ప్రాముఖ్యానికి దారితీసిన కారణాలను ఈ సందర్భంలో విశ్లేషించడం అవసరం.

1. రెండో ప్రపంచ యుద్ధానంతరం అమెరికా సంయుక్త రాష్ట్రాలలో ఏర్పడిన ప్రవర్తనావాద విప్లవం వాస్తవాలను ఆధారం చేసుకొని సిద్ధాంతాలను రూపొందించాలనే దృక్పథం రాజకీయ ప్రక్రియ విశ్లేషణకు ప్రాధాన్యం కల్పించింది.

2. ఫలితంగా రాజకీయ ప్రక్రియ అధ్యయనం సహజంగా రాజకీయ పక్షాల విశ్లేషణ అంతర్జాతీయంగా పరిశోధకుల ఆసక్తికి కేంద్ర బిందువు అయింది. ప్రారంభంలో రాజకీయ పక్షాల అధ్యయనం అమెరికా, యూరప్ దేశాల అనుభవాలకే పరిమితమైనప్పటికీ, క్రమంగా మూడో ప్రపంచ దేశాలలో అవి ఏవిధంగా ఆవిర్భవించాయి, ఎలా పనిచేస్తున్నాయి మొదలైన వాటికి సంబంధించిన అధ్యయనం రాజకీయ సామాజిక శాస్త్రంలో చోటు చేసుకొంది.

3. సాధారణంగా రాజకీయ పక్షాలను అధ్యయనం చేస్తున్నప్పుడు ఒక రాజకీయ పక్షం ఎటువంటి నేపథ్యంలో ఏర్పడింది? ఏ కారణాల వల్ల ఉచ్ఛదశకు చేరింది? ఎందుకు పతనమైంది? పరిశీలించడం జరుగుతోంది. అభివృద్ధి దృక్పథంలో పార్టీ రాజకీయాలను అధ్యయనం చేయటంలో రాజనీతి శాస్త్రజ్ఞులకు ఆసక్తి పెరిగింది.

## 16.6.0 పార్టీ రాజకీయాల అధ్యయన దృక్పథాలు

ఇంతకు ముందే ప్రస్తావించినట్లు రాజకీయ పక్షాల అధ్యయనానికి అనేక దృక్పథాలున్నాయి. పార్టీ రాజకీయాలకు సంబంధించిన అనేక సిద్ధాంతాలున్నాయి. వాటిని గురించి క్లుప్తంగా చెప్పుకొందాం.

### 16.6.1 అభివృద్ధి దృక్పథం(Development Approach)

దీనిని అభివృద్ధి సిద్ధాంతంగా కూడా వర్ణిస్తారు. పార్టీ రాజకీయాలు ఆధునికీకరణతో ముడిపడి వుంటాయి. ఈ సందర్భంలో వ్యవస్థలో తలెత్తిన సమస్యలు- జాతి నిర్మాణం, పారిశ్రామికీకరణ, జన సమీకరణ మొదలైనవి- అభివృద్ధి దృక్పథం అధ్యయనం చేయడం జరుగుతున్నది. అలాగే వ్యవస్థకు సంబంధించిన విధులు కూడా సమీకరణ, శాసనబద్ధీకరణ సంఘర్షణలను సరి చేయడం మొదలైనవి పార్టీ వ్యవస్థతో ముడిపడివున్నాయి. అయితే ఈ అభివృద్ధి సిద్ధాంతంలో ఒక ముఖ్యమైన లోపముంది. అదేమిటంటే ఈ సిద్ధాంతం చాలా ఎక్కువ స్థాయిలో అభివృద్ధికి సంబంధించిన తరహాలో కొన్ని విలువలను సూచిస్తుంది.

### 16.6.2. చీలిక సిద్ధాంతం (Cleavage Theory)

సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన వారిలో ముఖ్యులు సిప్సెట్, రొక్కం, అల్లార్డ్‌లు. వీరి ఉద్దేశం ప్రకారం రాజకీయాలను మత, ఆర్థిక, ప్రాంతీయ, గ్రామీణ, పట్టణ, తెగల పరంగా అధ్యయనం చెయ్యాలి. సమాజంలో చీలికలు- అంటే పరస్పర పోరాటాన్ని అనివార్యం చేసే అంశాలను అధ్యయనం చెయ్యాలి. కుల, మత, ఉపజాతి, ప్రాంత, తెగ తదితర వైవిధ్యాలతో కూడుకున్న బహుతావాద భారతీయ సమాజంలో వివిధ రాజకీయ పక్షాల జాతీయ, ప్రాంతీయ ఆవిర్భావాన్ని ఈ దృష్టితో మనం అధ్యయనం చేయవచ్చు. ఆర్థిక అసమానతలు, భాషా పరమైన అభిమానం అస్సాం, తమిళనాడు, మహారాష్ట్ర ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో వరుసగా అస్సాం గణపరిషత్, డి.ఎం.కె., అన్నా డి.ఎం.కె, శివసేన, తెలుగుదేశం ప్రాంతీయ రాజకీయ పక్షాల ఆవిర్భావానికి దోహదం చేశాయి. మతపరమైన విశ్వాసాలు అకాలీదళ్, ఇండియన్ ముస్లింలీగ్ వంటి రాజకీయ పక్షాలకు ఊపిరి పోస్తున్నాయి. కులపరమైన హెచ్చుతగ్గులు, అణిచివేత భావం, బహుజన సమాజ్, దళిత ఉద్యమాలకు పునాదులు వేస్తున్నాయి.

BRAOU

పైన ప్రస్తావించిన వైవిధ్యాలను పరిగణనలోకి తీసుకోకుండా చేసే రాజకీయ పక్షాల అధ్యయనం అమూర్తంగా, విద్యాపరమైన ఆసక్తికే పరిమితమవుతుంది. ఎందుకంటే సాంస్కృతిక, సామాజిక, ఆర్థిక, మత సంబంధమైన అంశాలు ప్రజల విధేయతలను మౌలికంగా శాసిస్తున్నాయి, వారిని విభజిస్తున్నాయి.

### 16.6.3 పునరేకీకరణ సిద్ధాంతం

సాండ్‌యిన్ట్, బర్న్‌హామ్ మొదలైన రచయితలు రాజకీయాలలో పాల్గొనడం స్థాయిలో మార్పులు తీవ్రతరమైన కొద్దీ పాక్షిక ఆసక్తులు పెరుగుతాయంటారు. ఫలితంగా రాజకీయ, ఆర్థిక ప్రాబల్యం కోసం పోటీ పెరిగి అధికార పంపిణీ కైవసం చేసుకోడానికి శిష్టవర్గాలు కార్యకలాపాలు రాజకీయ సంస్థల స్వభావాన్ని ప్రభావితం చేస్తాయి.

### 16.6.4 ''స్పేషియల్'' సిద్ధాంతం

ఈ సిద్ధాంతాన్ని గివానీ సార్టో ప్రతిపాదించాడు. ఇది సమాజంలోని శక్తులను విభజించే సమస్యలపై దృష్టిని కేంద్రీకరిస్తుంది. వివిధ సమస్యల దృక్పథంతో పార్టీ రాజకీయాలను పరిశీలించడానికి ప్రయత్నిస్తుంది.

### 16.6.5 పర్మియేషన్ సిద్ధాంతం

ఈ సిద్ధాంతం వివిధ మతాలు, సమూహాలు శిష్టవర్గాలను అధ్యయనం చేస్తుంది. వాటి ప్రభావం రాజకీయ పక్ష వ్యవస్థపై ఏవిధంగా ఉంటుందో విశ్లేషిస్తుంది. మారిస్ - డ్యూవర్జర్, డాల్టర్, పాల్‌బ్రాన్, వాల్ష్ మొదలైన రచయితలు ముఠాలు,

కోటరీలు, రాజకీయ నిర్మితులలోకి ఏ విధంగా ప్రవేశిస్తాయి? వాటిని ఏ విధంగా ప్రభావితం చేస్తాయి? మొదలైన అంశాలకు ప్రాధాన్యమిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి వర్గ తత్వం దోహదం చేసిందని స్టాన్లీ కొచానక్, పాల్‌బ్రాస్‌లు అభిప్రాయపడ్డారు. వివిధ ముఠాలకు నిలయమైన కాంగ్రెస్ 1970 దశకం ఉత్తరార్ధం వరకు స్వపక్ష, విపక్ష కర్తవ్యాలను తానే నిర్వహించిందని రాజనీతి శాస్త్రజ్ఞులు భావించారు. వివిధ ముఠాల ఏర్పాటు, నాయకుల బహిష్కరణ, నూతన ముఠాల ఆవిర్భావం పార్టీని, పార్టీ రాజకీయాలను సజీవచైతన్యంగా ఉంచుతాయని పై రచయితల అభిప్రాయం.

## 16.7.0 రాజకీయ పక్షాల స్వభావం

పైన ప్రస్తావించిన సిద్ధాంతాలేకాకుండా రాజకీయ పక్షాల అధ్యయనంలో మరో రెండు చాలా ముఖ్యమైన దృక్పథాలున్నాయి. అవి: ఉదారవాద, మార్క్సిస్టు దృక్పథాలు. పార్టీ రాజకీయ అధ్యయనానికి ఇవి రెండు భిన్నమైన దృక్పథాలను ప్రతిపాదిస్తాయి. వీటి అధ్యయనం ద్వారా ఒక రాజకీయ పక్షం సామాజిక, ఆర్థిక మూలాలు,రాజకీయ పక్షాల స్వభావం అర్థం చేసుకోవడం సాధ్యమవుతుంది.

### 16.7.1 ఉదారవాద దృక్పథం

రాజకీయ వ్యవస్థ నిర్మాణం, నిర్వహణలలో వివిధ రాజకీయ పక్షాలు ప్రజాభిప్రాయాన్ని సంఘటితం చేసి వ్యక్తీకరిస్తూ ప్రధాన పాత్ర నిర్వహిస్తాయని ఉదారవాద దృక్పథం భావిస్తుంది.

అయితే మార్క్సిస్టు దృక్పథం ఉద్దేశంలో రాజకీయ పక్షాలు వివిధ వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తూ, వాటిమధ్య ఉన్న పరస్పర వైరుధ్యాలను ప్రతిబింబిస్తాయి.

అయితే ఉదారవాదులలో కూడా దృక్పథం పరంగా ఏకాభిప్రాయం లేదు. బ్రిటిష్, ఫ్రెంచ్, ఇటాలియన్ రచయితలు రాజకీయ పక్షాల పాత్రను సిద్ధాంతాలు, నియమాల పరంగా విశ్లేషిస్తారు. ప్రజాస్వామ్యంలో అధికారం చేపట్టడానికి పోటీపడే వారికి రాజకీయ పక్షాలు వేదికను కల్పిస్తాయని అమెరికా రచయితలు భావిస్తారు. నిజానికి అమెరికాలో ప్రధాన రాజకీయ పక్షాలైన రిపబ్లికన్, డెమొక్రటిక్ పార్టీల మధ్య సిద్ధాంత పరంగా చెప్పుకోదగ్గ వ్యత్యాసాలు లేవు. అమెరికా రాజకీయాలలో అంతరంగిక విధానాలు నియోజక వర్గ ఆసక్తులు ప్రధాన పాత్ర వహిస్తాయి. వీటితోపాటు విభిన్న ఆసక్తి వర్గాలు తమతమ ప్రయోజనాల సాఫల్యం కోసం, పరిరక్షణకోసం ప్రత్యక్ష, పరోక్ష పద్ధతుల్లో ఒత్తిడి తీసుకొస్తాయి. అందువల్ల అధికారాన్ని కైవసం చేసుకోవాలని అమెరికా అధ్యక్ష పదవి, లేదా రాష్ట్ర గవర్నర్ పదవి లేదా సెనేట్ సభ్యత్వం పొందాలనుకొన్న వారు వివిధ స్థాయిలలో వివిధ ఆసక్తులను సంతృప్తిపరచడానికి ప్రయత్నిస్తారు.

బ్రిటిష్ ఉదారవాదం ఎడ్మండ్ బర్క్ రచనలలో కనిపిస్తుంది. ఒక సూత్రంపై సమైక్యమై జాతీయ ప్రయోజనాలను సాధించేటందుకు సంఘటితమైన వ్యక్తుల సమూహమే రాజకీయ పార్టీ అని బర్క్ రాజకీయ పక్షానికి నిర్వచనమిచ్చారు. రాజకీయ పక్షం మనుగడ పరిశీలనకు దానికి ఒక సైద్ధాంతిక ప్రాతిపదిక ఉందా లేదా కేవలం ఎన్నికలలో విజయం పొందటమే లక్ష్యమా అనే విషయాలు ప్రధానం కావు. అవి రాజకీయ పక్షం గుత్తాధికారాన్ని నిర్దేశించలేవు.

అమెరికన్ రచయితలు ''సిద్ధాంతం'' ప్రాతిపదికపై ఎక్కువ ఆసక్తి చూపరు. వారు ప్రధానంగా అధికారంకోసం రాజకీయ పక్షాలు ఏవిధంగా పోటీపడతాయన్న అంశాన్నే అధ్యయనం చేస్తారు. రాజకీయ పక్షాలు అధికారం కోసం పరస్పరం పోటీ పడటాన్నే అధ్యయనం చేయటం ముఖ్యమని భావిస్తారు. కార్యక్రమాలను ప్రకటించి, సమస్యలను ప్రస్తావించి, ప్రజలను సమీకరించి, ఓట్లు సంపాదించి పెట్టే యంత్రంగా రాజకీయ పక్షాలను అమెరికన్‌లు చూస్తారు.

కాగా పశ్చిమ దేశాలలో రాజకీయపక్షాల ప్రారంభం, వికాసం, నిర్మాణం, నిర్వహణల విషయంలో ఉదారవాద

దృక్పథంలోని పైన ప్రస్తావించిన రెండు విభిన్న దృక్పథాలు మనకు కనిపిస్తాయి.

## 16.7.2 మార్క్సిస్టు దృక్పథం

ఉదారవాద దృక్పథానికి భిన్నంగా మార్క్సిస్టు భావన ఉంది. ఉదారవాదం రాజకీయ పక్షాన్ని కొన్ని నియమాలు, సిద్ధాంతాలపట్ల ఏకాభిప్రాయమున్న వ్యవస్థల సంఘటిత సంస్థగా భావిస్తే మార్క్సిస్టులు రాజకీయ పక్షాలు, వర్గాలను వాటిమధ్య వైరుధ్యాలను వ్యతిరేకిస్తాయని వాదిస్తారు. సమాజాలు ఆర్థిక ప్రాబల్యమున్న వర్గం తన రాజకీయాధికారాన్ని సుస్థిరం చేసుకోడానికి, విస్తరింపు చేసుకోడానికి ఉదారవాద నియమాలను వల్లిస్తుంది. శ్రామిక వర్గం చైతన్యాన్ని, ఉద్యమాలను నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తుంది. పెట్టుబడిదారీ వర్గం ప్రాబల్యాన్ని కాపాడుకోడానికి రాజకీయ పక్షాలు ఉదారవాద ప్రజాస్వామ్యంలో ప్రయత్నిస్తాయని మార్క్సువాదులు భావిస్తారు.

అందువల్ల పై నేపథ్యంలో లెనిన్ కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం, నిర్వహణలను గురించి, దాని పాత్ర గురించి సుదీర్ఘంగా చర్చించాడు. శ్రామిక వర్గానికి అగ్రగామిగా కమూనిస్టు పార్టీ ఉండాలన్నాడు. కార్మిక, కర్షకుల అనక్తులకది ప్రాతినిధ్యం వహించాలి. ''కేంద్రీకృత ప్రజాస్వామ్యం'' ప్రాతిపదికగా కమ్యూనిస్టు పార్టీ పనిచేస్తుంది. ప్రజల్లో వర్గ చైతన్యాన్ని వ్యాప్తిచేసి పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోసి శ్రామిక రాజ్య స్థాపనకు మొదట, అటు తరువాత వర్గ రహిత, రాజ్య రహిత సమాజం అవతరణకు కమ్యూనిస్టు పార్టీ అవిశ్రాంత పోరాటం సాగించాలని లెనిన్ సిద్ధాంతీకరించాడు.

## 16.8 రాజకీయ పక్షాల కర్తవ్యాలు

రాజకీయ పక్షాలు రాజకీయాధికారాన్ని సంపాదించుకోవడం, ప్రభుత్వ విధులను నిర్వహించడం, వాటికిగాను రాజకీయ నిర్మితులను ఉపయోగించుకోవడం సర్వసాధారణం. ఒక రాజకీయ వ్యవస్థలోని నిర్మితుల పరిధిలో అవి పనిచేస్తాయి. అభ్యర్థులను ఎంపికచేయడానికి ఎన్నికల్లో చట్ట సభలకు, వివిధ రాజకీయ పదవులకు పోటీచేసి ప్రజాభిప్రాయాన్ని తమకు అనుకూలంగా మలుచుకొని అధికారం చెలాయించడానికి ప్రయత్నిస్తాయి. సమైక్యతతో లక్ష్యాలు సాధించుకోడం రాజకీయ పక్షాల ప్రధాన లక్ష్యం. తమ దృష్టిలో ప్రజలందరి ప్రయోజనాలను సాధించే అత్యున్నత లక్ష్యాన్ని రాజకీయ పక్షాలు ప్రస్తావిస్తాయి. వివిధ వర్గాల ప్రయోజనాలను సమీకరించి, భౌతిక భేదాలను అధిగమించి ఏకీకృతమైన లక్ష్యాలను ఎంచుకొంటాయి. ప్రజా ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించటం, వారి హక్కులను రక్షణ కల్పించటం తద్వారా వివిధ ప్రజలను రాజకీయ ప్రక్రియలోకి తీసుకొని రావటం రాజకీయ పక్షాలు నిర్వహించే కొన్ని సాధారణ కర్తవ్యాలు. అవి ప్రజల డిమాండ్‌లను వ్యక్తీకరించడానికి ప్రయత్నిస్తాయి. వాటి సాధనకు కృషిచేస్తాయి.

ఎటువంటి రాజకీయ వ్యవస్థలోనైనా రాజకీయ పక్షాలు సమాజంలోని వివిధ వర్గాలను, సమూహాలను ప్రతిబింబిస్తాయి. ప్రజలకూ ప్రభుత్వానికీ మధ్య రాజకీయ పక్షాలు సంబంధాలు నెలకొల్పుతాయి. తద్వారా ప్రజానీకాన్ని, జాతీయ, రాష్ట్ర, ప్రాంతీయ, స్థానిక సమస్యలపై జాగృతంచేస్తాయి. వారిని ప్రజాస్వామ్య ప్రక్రియలో అన్ని స్థాయిల్లో పాల్గొనేటట్లు చేస్తాయి. ఒకరకంగా చెప్పాలంటే ఆధునిక రాజకీయ వ్యవస్థ నడకకు రాజకీయ పక్షాలు చక్రాల వంటివి.

రాజకీయేతరమైన కార్యక్రమాల ద్వారా కూడా రాజకీయ పక్షాలు ప్రజల మద్దతును సమీకరించుకొంటాయి. దీనికిగాను ప్రతి రాజకీయ పక్షానికి కొన్ని అనుబంధ సంస్థలు - శ్రామిక సంఘం, విద్యార్థి సంఘం, మహిళా విభాగం, అల్ప సంఖ్యాకుల సంఘం - ఉంటాయి. ఇవి రాజకీయ పక్షానికి అనుబంధ సంస్థలుగా పనిచేస్తూ సమాజంలోని వివిధ వర్గాల, వృత్తుల వారి మద్దతును తమ పక్షానికి సమకూర్చుకోవడానికి ప్రయత్నిస్తాయి.

ప్రతి రాజకీయ పక్షం తనదైన ఒక జెండాను, గుర్తును (Symbol), నినాదాలను ఏర్పాటుచేసుకొంటుంది. ''హస్తం'', ''ఎరుపు, ఆకుపచ్చ జెండా'', ''గరీబీ హటావో'' కాంగ్రెస్ పార్టీకి జెండా, గుర్తు, నినాదాలుగా ఉన్నాయి. కొన్ని

విధానాలను, కార్యక్రమాలను, పథకాలను రూపొందించుకొని అధికారంలోకి వచ్చినప్పుడు వాటిని అమలుచేయడానికి రాజకీయ పక్షం ప్రయత్నం చేస్తుంది. విపక్షంగా ఉన్నప్పుడు స్థానిక, రాష్ట్ర, జాతీయ సమస్యలపై ప్రజా ఉద్యమాలను నిర్మించి జన సామాన్యంతో నిరంతర సంబంధాలు పెట్టుకొంటుంది.

రాజకీయ చర్యల పరిధి విస్తరణతోపాటు రాజకీయ పక్షాలు, రాజకీయ నాయకత్వం భర్తీ వంటి ప్రధాన కర్తవ్యాన్ని కూడా నిర్వహిస్తాయి. రాజకీయ వ్యవస్థల్లో నాయకుల భర్తీ కర్తవ్యం రాజకీయ పక్షాలే నిర్వహిస్తాయి. ప్రజాబలం ఉన్న నాయకులను ఎంపిక చేకొని రాజకీయ ప్రక్రియలో రాజకీయ పక్షాలు నిరంతరం పాల్గొంటాయి.

ప్రజా సమస్యలను గురించి రాజకీయ పక్షాలు సమాజం లక్ష్యాలను, ధ్యేయాలను నిర్దేశిస్తాయి. ఒక సిద్ధాంతం ప్రాతిపదికపై, ఆ సిద్ధాంత దృక్పథం ద్వారా ప్రజా సమస్యలకు పరిష్కారాలు సూచిస్తాయి. ఉదాహరణకు, ఆర్థిక వ్యవస్థను రూపొందించటంలో ఉదారవాద మార్కెట్ వ్యవస్థను లేదా ప్రణాళికాబద్ధంగా ప్రభుత్వ నియంత్రణ ద్వారా ఆర్థిక కార్యక్రమాలను క్రమబద్ధం చేయవచ్చు. మొదటి తరహాను పెట్టుబడిదారీ సమాజాలనీ ఉదారవాద రాజకీయ పక్షాలు నిర్దేశిస్తే, రెండోదాన్ని సామ్యవాదులు సమర్థిస్తారు.

సిద్ధాంతపరంగా ఎన్ని వ్యత్యాసాలున్నప్పటికీ అభివృద్ధి విషయంలో రాజకీయ పక్షాలు ఇంచుమించుగా ఒకే విధంగా ఉంటున్నాయి. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రజలందరూ సమానత్వాన్ని కోరుకొంటున్నారు. అందరికీ ప్రయోజనాన్ని సమకూర్చే సాధనాలతో సాంప్రదాయిక విలువలను వ్యతిరేకిస్తున్న కమ్యూనిస్టు పక్షాలకు ప్రజల మద్దతు ఆశించిన స్థాయిలో లభించటం లేదు. అయితే మధ్యే మార్గంగా సామ్యవాద సంక్షేమ విధానాలను అనుసరించే రాజకీయ పక్షాలు ప్రజామద్దతును సమీకరించుకోగలుగుతున్నాయి.

## 16.9.0 రాజకీయ సమస్యల పరిష్కారం

BRAOU

అధికారాన్ని చేపట్టి తమతమ సైద్ధాంతిక ప్రాతిపదికలపై కొన్ని నిర్దిష్ట కార్యకలాపలను అమలుపరచడానికి రాజకీయ పక్షాలు పరస్పరం పోటీపడుతుంటాయి. ఇవి అనుసరించే పద్ధతులపై నిర్వహించే విధులపై రాజకీయ నిర్మితులు ఆధారపడి ఉంటాయి. ప్రజాస్వామ్య ప్రక్రియలో విశ్వాసమున్న రాజకీయ పక్షాలు బహిరంగంగా ప్రజానీకాన్ని సమీకరించుకొని చట్టసభల్లో ప్రాతినిధ్యం పొంది రాజకీయ పదవులను నిర్వహిస్తాయి. అయితే ప్రజాస్వామ్య ప్రక్రియపట్ల విశ్వాసం లేని రాజకీయ పక్షాలు అజ్ఞాతంగా – నక్సలైట్ వర్గాలు – ప్రజాస్వామ్యానికి దూరంగా ఉంటూ పనిచేస్తాయి.

రాజకీయ పక్షం నిర్మాణం గురించి మారిస్ డువర్జర్ చేసిన విశ్లేషణ ప్రకారం ప్రతి రాజకీయ పక్షానికి నాలుగు స్థాయిల్లో నిర్మితులుంటాయి. అవి:

(1) కాకస్

(2) శాఖ

(3) సెల్

(4) సైనిక తరహా

### 16.9.1 కాకస్ పార్టీలు

కాకస్ రకపు రాజకీయ పక్షానికి పరిమిత సభ్యత్వం ఉంటుంది. సభ్యత్వంలో సంఖ్యకంటే గుణానికి ప్రాధాన్య మంటుంది. ఎన్నికల మధ్యకాలంలో క్రియారహితంగా ఉండి ఎన్నికల సమయంలో బాగా పనిచేస్తుంది. స్థానిక

ల్లోని ప్రముఖులు కాకస్ తరహా రాజకీయ పక్షంలో ఎక్కువగా చేరతారు. బ్రిటిష్ లేబర్ పార్టీ, ఫ్రెంచ్ రాడికల్ పార్టీలను డువర్జర్ కాకస్ పార్టీలకు ఉదాహరణలుగా పేర్కొన్నాడు. అయితే సార్వజనీన ఓటు వ్యాప్తి ద్వారా కాకస్ రాజకీయ పక్షాల ప్రాముఖ్యం తగ్గిపోయింది.

## 16.9.2 శాఖల పార్టీలు

శాఖల పార్టీల్లో సభ్యుల సంఖ్య విస్తారంగా ఉంటుంది. వీటికి కేంద్రీకృతమైన పార్టీ నిర్మాణం ఉంటుంది. ప్రతి నియోజక వర్గంలో పార్టీ శాఖలు, ప్రాథమిక విభాగాలుంటాయి. ఇవి నిరంతరం స్థానిక, రాష్ట్ర, జాతీయ రాజకీయ వ్యవహారాల్లో పాల్గొంటాయి. శాఖ పార్టీలు కేవలం ఎన్నికల సమయాలలోనే కాకుండా ఇతరత్రా కూడా క్రియాత్మకంగా పనిచేస్తాయి. సార్వజనీన ఓటుహక్కు విరివిగా వ్యాప్తి చెందటంతో అన్ని వర్గాలు – ముఖ్యంగా శ్రామిక వర్గాల్లో – ప్రాచుర్యం పొందటానికి పశ్చిమ దేశాల్లో సోషలిస్టు పార్టీలు శాఖల పార్టీలుగా రూపొందాయి. భారతదేశంలో కూడా కొన్ని జాతీయ రాజకీయ పక్షాలు – కాంగ్రెస్ (ఐ), సిపి, సిపిఐ (ఎం), భారతీయ జనతా పార్టీ, మరికొన్ని ప్రాంతీయ రాజకీయ పక్షాలు – డీఎంకె, అన్నా డిఎంకె, తెలుగుదేశం, శివసేన – శాఖల రాజకీయ పక్షాలుగా రూపొందాయి. ఒక నిర్ణీత కాలానికి పార్టీలో అంతర్గత ఎన్నికలు జరుగుతాయి. పార్టీ నిర్మాణానికి సంబంధించిన పదవులను భర్తీచేయడం జరుగుతుంది. తరుచు పార్టీలోని వివిధ శాఖలు సమావేశమయి పార్టీ సభ్యులను క్రియాత్మకంగా రాజకీయ ప్రక్రియలో పాల్గొనేటట్లు చేస్తుంటాయి. స్థానిక, రాష్ట్ర, జాతీయ చట్ట సభలకు, వివిధ రాజకీయ పదవులకు అభ్యర్థులను నిలబెట్టి శాఖ పార్టీలు ఉత్సాహంతో ప్రజాస్వామ్య ప్రక్రియలో పాల్గొంటాయి.

## 16.9.3 సెల్ పార్టీలు

విప్లవ పంథా రాకీయ పక్షాలు రూపొందించిన నిర్మితి సెల్ (Cell). ఇటువంటి రాజకీయ పక్షాల వ్యవస్థా నిర్మితి ప్రతి ఫ్యాక్టరీలూ ఒక సెల్‌ను ఏర్పాటుచేయడం ద్వారా రూపొందుతుంది. కొన్ని సందర్భాల్లో, ప్రాంతీయ స్థాయిల్లో సెల్‌ను ఏర్పాటుచేయడం జరుగుతుంది. సెల్ తరహా రాజకీయ పక్షాల్లో కమ్యూనిస్టు పార్టీలను ఉదాహరణగా తీసుకోవచ్చు.

BRAOU

సెల్ తరహా రాజకీయ పక్షం నిరంతరం రాజకీయ కార్యకలాపాల్లో మునిగి తేలుతుంటుంది. ఒక స్థాయిలో ఉన్న వివిధ సెల్‌ల మధ్య ఏవిధమైన సంబంధాలుండవు. సెల్ శాఖ కంటే చిన్నది. ఇది కొద్ది మంది సభులతో ఏర్పడుతుంది. దని నిర్మాణానికి కుట్రదారుల స్వభావం ఉంటుంది. నూతన సభ్యులను చేర్చుకోవటం, ఉన్న వారిని సభ్యత్వం నుంచి తొలగించటం మొదలైనవి సెల్‌ను క్రియాత్మకంగా ఉంచుతాయి. అంతేకాకుండా సదరు సెల్‌లో జరిగే మార్పులు ఇతర సెల్స్‌కు వ్యాపించకుండా జాగ్రత్త వహించడమే సెల్ ప్రధాన కర్తవ్యం.

సెల్ తరహా రాజకీయ పక్షాల్లో రాజకీయ చర్యలు, నిర్ణయాలు, చర్యలు బహిరంగంగా కాకుండా రహస్యంగా ఉంటాయి. రహస్యం సెల్ తరహా రాజకీయ పక్షాల ప్రత్యేక లక్షణం. సెల్ నిర్మితి ఉన్న రాజకీయ పక్షాలు ఎన్నికల్లో విజయానికి ఎక్కువ ప్రాధాన్యమివ్వవు. కమ్యూనిస్టు పార్టీలు సాధారణంగా భారతదేశంలోని వివిధ నక్సలైట్ వర్గాలు ప్రత్యేకంగా సెల్ ప్రాతిపదిక రాజకీయ పక్షాలే.

## 16.9.4 సైనిక తరహా రాజకీయ పక్షాలు

కొన్ని రాజకీయ పక్షాల నిర్మితికి సైనిక వ్యవస్థ స్వభావం ఉంటుంది. ఈ తరహాను విప్లవ రాజకీయ పక్షాలు అనుసరిస్తాయి. జర్మనీలో నాజీ పార్టీ, ఇటలీలో ఫాసిస్టు పార్టీ, రష్యాలో కమ్యూనిస్టు పార్టీ సదరు నిర్మితిపరంగా రూపొందినవే.

అయితే పై రాజకీయ పక్షాల అనంతరం ఏ రాజకీయ పక్షం సైనిక నిర్మితిని కలిగి లేదని, కాగా పైన పేర్కొన్న

నాలుగు లక్షణాలు రాజకీయ పక్షాల్లో సమ్మిళితమైనాయని మారిస్ డువర్జర్ భావిస్తాడు.

డువర్జర్ కాకుండా అనేక రచయితలు రాజకీయ పక్షాల నిర్మితులను గురించి చర్చించారు. విశ్లేషించారు. జీన్ బ్లాసెక్ కాకస్ తరహా రాజకీయ పక్షాలను ప్రత్యక్ష పరోక్ష పాలక పక్షాలుగా వర్ణించాడు. దీనికి పార్టీ సభ్యత్వాన్ని కాకుండా నాయకుని ఎంపిక, నాయకునికి, అనుచర వర్గానికి మధ్య సంబంధాలను ప్రాతిపదికలుగా బ్లాసెక్ తీసుకొన్నాడు. జన సమూహ, కాకస్ రాజకీయ పక్షాల మధ్య వ్యత్యాసం సభ్యత్వ పరిమాణం బట్టి కాకుండా సభ్యుల విధేయతపై ఆధారపడి ఉంటుంది.

మెకంజీ బ్రిటిష్ రాజకీయ పక్షాల నిర్మాణాన్ని విశ్లేషించాడు. బ్రిటన్‌లోని ప్రధాన రాజకీయ పక్షాలైన కన్సర్వేటివ్, లేబర్ పార్టీలకు ఒకే రకమైన నిర్మాణం ఉంది. వాటిల్లోని అధికారం పార్లమెంటరీ నాయకత్వంలోనే కేంద్రీకృతమై ఉంటుంది. మిచెల్స్ ప్రకారం రాజకీయ పక్షాల నిర్మితికి సైద్ధాంతిక నిబద్ధతను అధ్యయనం చెయ్యాలి.

## 16.10 అభివృద్ధి చెందుతున్న దేశాల్లో రాజకీయ పక్షాలు


అభివృద్ధి చెందుతున్న దేశాల్లో రాజకీయ పక్షాలు, పశ్చిమ సమాజాల్లోని వాటికంటే మౌలికంగా భిన్నంగా లేవు. అనేక రాజకీయ పక్షాలు 19 వ శతాబ్దపు సాంప్రదాయిక పద్ధతుల్లోనే రూపొందులాయి. వాటో చాలామట్టుకు ప్రధాన నాయకులు, జనాకర్షణ శక్తి, నాయకత్వం ప్రాబల్యం కలిగిన రాజకీయ పక్షాలే.

ప్రత్యేకంగా భారతదేశంలో రాజకీయ పక్షాల నిర్మాణంలో పైన పేర్కొన్న అంశాలు స్పష్టంగా కనిపిస్తాయి. అఖిల భారత కాంగ్రెస్ నిర్మాణంలో గాంధీ, నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీల ప్రాబల్యం స్పష్టంగా కనిపిస్తుంది. మరికొన్ని రాజకీయ పక్షాలు మతం ప్రాతిపదికగా – అకాలీదళ్, ముస్లిం లీగ్, భారతీయ జన సంఘ్ – ఏర్పడితే ఇంకా కొన్ని ప్రాంతీయ వాదంతో – అస్సాం గణపరిషత్, ద్రావిడ మున్నేట్ర కజగమ్, అన్నా డిఎంకె, తెలుగుదేశం – అవతరిస్తే, ఇంకొన్ని కులాల ఆసక్తులపరంగా – బహుజన సమాజ్ – ఆవిర్భవించాయి. ఈ విధంగా రాజకీయ పక్షాల నిర్మాణం, నిర్వహణల్లో అనేక చలాంకాలు – కులం. ప్రాంతం, మతం, భాష – మనకు కనిపిస్తాయి.

BRAOU

## 16.11 పార్టీ వ్యవస్థల్లో రకాలు

రాజకీయ పక్షాలు వివిధ చలాంకాల ప్రాతిపదికపై రూపొందటమే కాకుండా నిర్మితిపరంగా కూడా వాటిలో వివిధ రకాలున్నాయి. ఈ సందర్భంలో రాజకీయ పక్షాలను సార్టోరి కింది విధంగా వర్గీకరించాడు:



రాజకీయ పక్షాల వర్గీకరణలో పక్షాల సంఖ్య చాలా ప్రధానాంశం. దీనిని ప్రాతిపదికగా తీసుకొని ఆధునిక రాజకీయ పక్ష వ్యవస్థను వర్గీకరించటం జరిగింది.

### 16.11.1 ఏకపక్ష వ్యవస్థ

ప్రతిపక్షాలన్నిటిని అణిచివేస్తూ లేదా వాటిని తమలో కలుపుకొంటూ ఇతర రాజకీయ పక్షాలకంటే ఎక్కువ ప్రభావం, ప్రాబల్యం కలిగి అధికారంలో కొనసాగే ఒక పార్టీ విధానాన్ని ఏకపక్ష వ్యవస్థగా వర్ణిస్తారు. ప్రభుత్వాధికారం అంతా సమైక్య పరిచిన, పటిష్ఠమైన ఒకే రాజకీయ పక్షంలో కేంద్రీకృతమై ఉంటుంది.

ఏకపక్ష వ్యవస్థలో కూడా అనేక వ్యత్యాసాలున్నాయి. కొన్ని దేశాల్లో రాజకీయ పక్షానికి అధికారికమైన గుర్తింపు ఉంటుంది. ఇతర పక్షాలకు మనుగడ చట్టపరంగా ఉండదు. ఇటీవలి కాలం వరకు అమలులో ఉన్న సోవియట్ యూనియన్ తదితర తూర్పు యూరోపా కమ్యూనిస్టు దేశాల్లో ఒక కమ్యూనిస్టు పక్షానికే రాజ్యాంగబద్ధమైన గుర్తింపు ఉండేది. అన్య రాజకీయ పక్షాలు ఉంటే అవి శ్రీకృష్ణ జన్మస్థానంలో కాలం గడిపేవి.

ఏక పక్ష వ్యవస్థ భావాన్ని మొదట వ్యాప్తిచేసింది ఇటలీలోని ఫాసిస్టు పక్షం. ఫాసిస్టు, మార్క్సిస్టు సిద్ధాంత కర్తలు ఏకపక్ష వ్యవస్థను సమర్థించారు. ఫాసిస్టు , కమ్యూనిస్టు ఆఫ్రికా ఖండంలోని కొన్ని దేశాల్లో ఏకపక్ష నియంతృత్వ వ్యవస్థలు అమలులో ఉన్నాయి.

కొన్ని సందర్భాలలో ఒకే రాజకీయ పక్షం ఇతర రాజకీయ పక్షాలను కలుపుకోవటం ద్వారా లేదా వాటి కార్యకలాపాలపై ఆంక్షలు విధించడం ద్వారా కాని ఏకపక్ష వ్యవస్థలు పనిచేస్తాయి. ఇరాక్, కెన్యా, బర్మా మొదలైన దేశాల్లో సదరు వ్యవస్థ సంపూర్ణాధికారమున్న నియంతృత్వ ప్రభుత్వాలను కొనసాగిస్తున్నది.

ఏకపక్ష వ్యవస్థ ఇంకోరకంగా కూడా ఉండవచ్చు. ఒక దేశంలో ఒక రాజకీయ పక్షం సుదీర్ఘకాలం రాజకీయ జీవనంపై ఆధిపత్యం చెలాయించి ఇతర రాజకీయ పక్షాలను రాజకీయంగా ఎదగనీయకుండా స్వేచ్ఛగా పనిచేయటానికి అదే సమయంలో వాటికి అవకాశం కల్పించే - ప్రాబల్య సిద్ధాంతాలుండవచ్చు. భారతదేశంలో కాంగ్రెస్ పార్టీ ఇతర పార్టీలతో పోటీ చేస్తూ జాతీయ రాజకీయాల్లో 1985 వరకు ప్రాబల్య స్థితిలో ఉండింది. అనేక జాతీయ, ప్రాంతీయ పక్షాలు కాంగ్రెస్ నుంచి అవతరించినవే. అనేక రాజకీయ పక్షాలు స్వేచ్ఛగా పనిచేయటానికి అవకాశం ఉన్నప్పటికీ అవి కాంగ్రెస్ స్థాయికి చేరలేక పొయ్యాయి. నిజానికి కాంగ్రెసే అధికార, ప్రతిపక్ష పార్టీల పాత్రలు నిర్వహించిందని భారత రాజకీయ వ్యవస్థను అధ్యయనం చేసిన రాజనీతి పండితుల అభిప్రాయం. అందువల్లనే ఆచార్య రజనీ కొఠారి ఏకపక్ష ప్రాబల్య వ్యవస్థ (One party dominant system) గా కాంగ్రెస్‌ను అభివర్ణించాడు.

BRAOU

### 16.11.2 ద్విపక్ష వ్యవస్థ

ఒక దేశంలోని రాజకీయ వాతావరణాన్ని రెండు రాజకీయ పక్షాలు ప్రభావితం చేసినప్పుడు అది ద్విపక్ష రాజకీయ వ్యవస్థగా పేరు పొందుతుంది. అమెరికా, బ్రిటన్ దేశాలు ద్విపక్ష రాజకీయాలున్న వ్యవస్థలుగా ప్రాచుర్యం పొందాయి. అమెరికాలో డెమొక్రాటిక్, రిపబ్లికన్ పక్షాలు, ఇంగ్లండ్‌లో కన్సర్వేటివ్, లేబర్ పార్టీలు ఆయా దేశ రాజకీయ రంగాలలో ప్రధాన పాత్ర నిర్వహిస్తున్నాయి.

ద్విపక్ష వ్యవస్థలంటే రెండే రెండు రాజకీయ పక్షాలుంటాయని కాదు. ఇందులో అనేక ఇతర రాజకీయ పక్షాలు కూడా ఉండవచ్చు. కానీ వాటి ప్రభావంచెప్పుకోదగ్గ స్థాయిలో ఉండదు. అటువంటి సందర్భంలో రాజకీయాధికారం మార్పిడి రెండు పార్టీల మధ్యే పరిమితమవుతుంది.

ద్విపక్ష వ్యవస్థ 17వ శతాబ్దం నుంచి ఇంగ్లండ్‌లో అమల్లో ఉంది. బాగా వేళ్ళూనుకొని ఉన్న ద్విపక్ష వ్యవస్థ పార్లమెంటరీ ప్రభుత్వ వ్యవస్థ అత్యంత యోగ్యమైనదిగా భావిస్తున్నారు. స్థిరమైన ప్రభుత్వం ఏర్పాటుకు ఈ పద్ధతి అనుకూలంగా ఉంటుంది.

అమెరికాలో కూడా ద్విపక్ష వ్యవస్థ అమలులో ఉంది. సామాజిక, ఆర్థిక, రాజకీయ దృక్పథాల్లో ఈ రెండు పార్టీల వ్యవస్థలో - ఇంగ్లండ్, అమెరికా - సిద్ధాంతపరమైన వైవిధ్యాలు అంత తీవ్రంగా లేవు. కీలక సమస్యల పట్ల ఏకాభిప్రాయం ఉండటంవల్ల పై దేశాలలో ప్రభుత్వ నిర్వహణ, తత్సంబంధమైన పోటీ రెండు రాజకీయ వ్యవస్థల మధ్య ఉంటున్నది. స్థిరత్వం, రాజీధోరణి సూచించేదిగా ద్విపక్ష వ్యవస్థను పరిగణించడం జరుగుతున్నది.

రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా పారిశ్రామికంగా, సాంస్కృతికంగా స్థిరత్వం సాధించిన సమాజాలలో ద్విపక్ష వ్యవస్థ విజయవంతంగా సాగుతున్నది.

### 16.11.3 బహుపక్ష వ్యవస్థ

రెండుకు మించి రాజకీయ పక్షాలు ప్రజాస్వామ్య ప్రక్రియలో క్రియాత్మకంగా పనిచేసే దేశంలో బహుపక్ష వ్యవస్థ ఉంటుంది. రాజకీయ పక్షాలన్నీ సమాన బలం కలిగి ఉండి, ఏ పక్షానికి సొంత బలంతో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసి నిర్వహించే ప్రజాబలం లభ్యంకానిచోట బహుపక్ష వ్యవస్థ నెలకొని ఉంటుంది. పశ్చిమ యూరప్‌లో, ఫ్రాన్స్, ఇటలీ ఇటీవలి కాలంలో ఆసియా ఖండంలో పాకిస్తాన్, భారతదేశం, బంగ్లాదేశ్‌లు బహుపక్ష వ్యవస్థవైపు మళ్ళుతున్నాయి.

1989 వరకు భారతదేశం ఏకపక్ష ప్రాబల్య బహుపక్ష రాజకీయ వ్యవస్థలు కొనసాగుతూ వచ్చింది. 1989 నుంచి కేంద్ర ప్రభుత్వ నిర్మాణంలో ఏ రాజకీయ పక్షానికి స్వయంగా చాలినంత బలం లభ్యం కాకపోవటంతో కాంగ్రెస్, జనతాదళ్, భారతీయ జనతా పార్టీ - హంగ్ పార్లమెంట్ ఏర్పడి మైనారిటీ ప్రభుత్వాలు జాతీయ స్థాయిలో అవతరించాయి.

బహుళతావాదం, సరళత్వం, విభిన్న ప్రయోజనాల ప్రాతినిధ్యం బహుపక్ష వ్యవస్థ నేపథ్యం. సామాజిక వ్యవస్థలోని భిన్నత్వాలకు ప్రయోజన, ప్రాతినిధ్యాలు లభింపచేయటం కోసం బహుపక్ష వ్యవస్థ పనిచేస్తుంది.

BRAOU

ఒక ప్రత్యేక రాజకీయ పార్టీ వ్యవస్థలో మార్పులకు నిర్దేశకాలు కానీ కారణాలు కానీ సంక్లిష్టంగా ఉన్నప్పుడు వాటిని గుర్తించడం కష్టమవుతుంది. రాజకీయ వ్యవస్థలోని ఇతర భాగాల్లో ప్రధానమైన సామాజిక, ఆర్థిక పరమైన మార్పులు సంభవించినప్పుడే రాజకీయ పక్ష వ్యవస్థలో కూడా మార్పులు, ఒడుదుడుకులు ఏర్పడతాయి.

ఇటీవలి కాలం వరకు ఏకపక్ష ప్రాబల్య వ్యవస్థగా ఉన్న భారతదేశంలో ఆర్థిక, సామాజిక మార్పుల ప్రభావం వల్ల బహుపక్ష వ్యవస్థ ఆవిర్భవించింది. ఒకనాటి ఏకపక్ష ప్రాబల్య వ్యవస్థ నేడు బహుపక్ష వ్యవస్థగా రూపాంతరం చెందింది.

## 16.12 ముగింపు

దీర్ఘకాలంగా పారిశ్రామికీకరణ చెంది, అటు తరవాత రాజకీయ ప్రజాస్వామ్యం అవతరించిన పశ్చిమ దేశాల్లో ముఖ్యంగా అమెరికా, ఇంగ్లండ్‌లలో రాజకీయ పార్టీ వ్యవస్థ మౌలిక మార్పులకు లోనుకాలేదు.

రాజకీయ విప్లవాలు, యుద్ధాలు, విదేశీ ఆక్రమణలు, దాడులవల్ల పార్టీ వ్యవస్థలో అవశ్యకమైన, గణనీయమైన మార్పులు ఏర్పడవచ్చు. 1917 అనంతరం రష్యాలో ఏకపక్ష వ్యవస్థ ఏర్పడింది. నేడు అది కూడా కుప్పకూలిపోయింది. బలవత్తరమైన విప్లవ శక్తులు అధికారాన్ని హస్తగతం చేసుకోవడంవల్ల కమ్యూనిస్టు దేశాల్లో పై మార్పులు సంభవించాయి.

ప్రారంభంలో వివరించినట్లు చారిత్రక సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరిణామాల ఫలితంగా, పరిస్థితుల ప్రభావం ఫలితంగా పార్టీ వ్యవస్థ రూపొందుతుంది. సిద్ధాంతపరంగా రాజకీయ పక్షాలు నిర్వహించే కార్యక్రమాలు, విధులు వాటి నిర్మాణం ఒకేరకంగా ఉంటే ఆచరణలో అది మరోరకంగా వ్యవహరించవచ్చు. దీనికి కారణం అవి వాస్తవంలో స్పందించే సామాజికనేపథ్యమే. అందువల్ల సామాజిక, ఆర్థిక వారసత్వ నేపథ్యం లేకుండా రాజకీయ పక్ష వ్యవస్థ ఒక దేశంలో ఎలా పనిచేస్తుందో అధ్యయనం చేయడం సాధ్యం కాదు.

ఏది ఏమైనప్పటికీ రాజకీయ పక్షాలు ప్రజాస్వామ్యానికి తప్పనిసరి. కర్షుడు లేని భారతాన్ని, రాజకీయ పక్షాలు లేని ప్రజాస్వామ్యాన్ని మనం ఊహించలేం. చివరికి నియంతృత్వ వ్యవస్థల్లో కూడా రాజకీయ పక్షాలు సిద్ధాంత ప్రాతిపదిక కోసం ఉంటాయి. ప్రజాబల ఆలంబన కోసం నియంతలు కూడా స్వబలంగా రాజకీయ పక్షాలను ఏర్పాటుచేస్తారు. ఇటలీలో ఫాసిస్ట్, జర్మనీలో నాజీ పార్టీ, బంగ్లాదేశ్, పాకిస్తాన్ దేశాల్లో సైనిక నియంతలు స్థాపించిన జియా ఉర్ రహమాన్, జియా ఉల్ హక్ – రాజకీయ పక్షాలు దీనికి ఉదాహరణలు.

అందువల్ల ఎటువంటి రాజకీయ వ్యవస్థ అయినప్పటికీ ఆధునిక రాజ్యాల్లో రాజకీయ పక్షాల ఉనికి తప్పనిసరి అవుతున్నది.

–డా. రవీంద్రశాస్త్రి

## 16.13 చదవదగిన గ్రంథాలు


1. David Easton : The Political System

2. Paul R.Brass : Caste, Faction and Party in Indian Politics

3. **Mosca, G.** : The Ruling Class


## 16.14 నమూనా పరీక్షా ప్రశ్నలు

BRAOU

I వ్యాసరూప ప్రశ్నలు

1. రాజకీయ పక్షాల అధ్యయన ఆవశ్యకతను వివరించుము.
2. రాజకీయ పక్షాల నిర్మాణంపై ఒక వ్యాసం వ్రాయుము
3. రాజకీయ పార్టీల వ్యవస్థల్లో వివిధ రకాలను వివరించుము.

II సంక్షిప్త ప్రశ్నలు

1. రాజకీయ పక్షాల ఆవిర్భావం గురించి వివరించుము.
2. చీలిక దృక్పథం.
3. సెల్ పార్టీలు.

BRAOU

# భాగం-17 ప్రభావ వర్గాలు

విషయక్రమం

17.1 లక్ష్యాలు
17.2 పరిచయం
17.3 ప్రభావ వర్గాల నిర్వచనం
17.4 ప్రభావ వర్గాల ఆవిర్భావం
17.5 ప్రభావ వర్గాల లక్షణాలు
17.6.0 వివిధ రకాల ప్రభావ వర్గాలు
17.6.1 సాహచర్య ప్రభావ వర్గాలు
17.6.2 సంస్థాగత ప్రభావ వర్గాలు
17.6.3 సాహచర్యేతర ప్రభావ వర్గాలు
17.6.4 అప్రయత్న పూర్వక ఆసక్తి వర్గాలు
17.7.0 ప్రభావ వర్గాల పద్ధతులు
17.7.1 పైరవీ
17.7.2 సమ్మెలు
17.7.3 బంద్‌లు
17.7.4 ఘెరావ్‌లు
17.8 ప్రభావ వర్గాల ప్రాధాన్యం
17.9 ముగింపు
17.10 చదువదగిన పుస్తకాలు
17.11 నమూనా పరీక్షా ప్రశ్నలు

BRAOU

## 17.1 లక్ష్యాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు

★ ప్రభావ వర్గాల ఆవిర్భావం, వాటి లక్షణాలు తెలుసుకుంటారు.

★ ప్రభావ వర్గాల రకాలు, వాటి పద్ధతులు అర్థం చేసుకుంటారు.

★ ప్రభావ వర్గాల ప్రాధాన్యతను గుర్తిస్తారు.

## 17.2 పరిచయం

ఆధునిక రాజనీతి శాస్త్ర అధ్యయనంలో ప్రభావ వర్గాలు చాలా ప్రముఖ పాత్ర నిర్వహిస్తాయి. తులనాత్మక రాజకీయాలు, రాజకీయ సామాజిక శాస్త్ర విభాగాలలో ప్రభావ వర్గాల అధ్యయనం తప్పని సరిగా ఉంటుంది.

1940 దశకంలో మొదలైన ప్రవర్తన వాద విప్లవానంతరం లాంఛనేతర సంస్థల అధ్యయనాన్ని రాజకీయ ప్రక్రియ, విశ్లేషణలకు ప్రాముఖ్యం పెరిగింది. చట్టబద్ధమైన నిర్మితులను ఏవిధంగా వ్యవస్థాపరమైన సమూహాలు తనుతమ

ప్రయోజనాల సాధనకు ప్రభుత్వాన్ని, ప్రాతినిధ్య సంస్థలను ప్రభావితం చేస్తాయో అనే అధ్యయనం కీలక పాత్ర వహిస్తున్నది.

అంతే కాకుండా ఆధునిక పారి శ్రామిక సంక్షేమ రాజ్యంలో ప్రభుత్వం అనేక కార్యకలాపాలను విస్తృతంగా చేపడుతున్నది. రాజ్యం, సంస్థల అవసరం లేకుండా ఆధునిక సమాజాలలో మనకు ఏ వ్యక్తి, వర్గం, సమూహం కనిపించవు.

అయితే విధాన నిర్ణేత దృష్టిని అందరూ ఆకర్షించలేరు. అంతేకాకుండా పరిమిత వనరులను ప్రజాసమూహాల ప్రయోజనం కోసం వినియోగించడంలో సహజంగా పోటీ ఏర్పడుతుంది. అందువల్ల విభిన్న వర్గాలు, వృత్తి పరమైన సమూహాలు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొని వచ్చి ప్రభుత్వ విధానాన్ని తమతమ ప్రయోజనాలకు అనుకూలంగా మలుచుకోడానికి ప్రయత్నిస్తాయి. ఈ నేపథ్యంలో ప్రభావ వర్గాల అధ్యయనం ప్రాముఖ్యం సంతరించుకొంటున్నది.

## 17.3 ప్రభావ వర్గాల నిర్వచనం

ప్రభావ వర్గమంటే ప్రభుత్వం ద్వారా లేదా ఇతరత్ర రాజకీయ మార్పు తీసుకొని రావటానికి ప్రయత్నించే రాజకీయ పక్షేతర సంస్థలుగా వర్ణించవచ్చు. ప్రభుత్వ నిర్మితుల వెలుపల స్వచ్ఛందంగా ఏర్పడి ప్రభుత్వ విధానాలను, ప్రభుత్వ నియమాలను, పాలనను ప్రభావితం చేయడానికి ఏర్పడే సంస్థలను ప్రభావ వర్గాలని ఎరల్ లాథమ్ నిర్వచించాడు.

ప్రభావ వర్గం అంటే తన ప్రయోజనాల కోసం ప్రభుత్వ విధానాలను అనేక విధాలుగా ప్రభావితం చేయడానికి కృషిచేసే రాజకీయ పక్షేతర ప్రజాసముదాయం. లాథిన ప్రాయంగా ఒక సాధారణ లేదా ప్రత్యేక ప్రయోజన సాధనకోసం సంఘటితమైన ఒకానొక ప్రజా సముదాయం.

ప్రభుత్వ విధానాలను తమ ప్రయోజనాల సంరక్షించుకోడానికి లేదా తమ ప్రయోజనాల పరిధిని విస్తరించుకోడానికి ప్రయత్నించే సముదాయాన్ని ప్రభావ వర్గం అంటారు. ఒక ప్రత్యేక ప్రయోజన సాధన కోసం – ధనిక, బీద, వృత్తిపరమైన, వ్యవసాయ, కార్మిక, వ్యాపార, వాణిజ్య ఉద్యోగ బృందం, విద్యార్థి, అధ్యాపక - ప్రయత్నించవచ్చు. ప్రభావ వర్గాలు రాజకీయేతర సంస్థలు. వాటికి రాజకీయాలతో సంబంధం ఉండి, ప్రభుత్వ విధానాలను, పద్ధతులను మార్చడానికి ప్రయత్నిస్తాయి. చట్టాల రూపకల్పనను పాలనా పద్ధతులను తమ ప్రయోజనాలకు అనుగుణంగా ప్రభావితం చేయడానికి కృషిచేస్తాయి.

ప్రభుత్వ విధానాలు, పద్ధతులు అనే అంశాలను మనం విస్తృతార్థంలో ఉపయోగించాలి. ప్రభుత్వం అంటే శాసన నిర్మాణం, విధానాలను అమలుపరిచే కార్యనిర్వాహక వర్గం నియమ నిబంధనలను వర్తింపజేసే ఉద్యోగ బృందం, చట్టాలను వ్యాఖ్యానించి వివిధ సందర్భాలలో వాటిని అన్వయింపజేసే న్యాయ శాఖ మొదలైనవన్నీ స్థూలంగా ప్రభుత్వ భావన పరిధిలోకి వస్తాయి. అందువల్ల ప్రభావ వర్గాలు ప్రభుత్వాన్ని ప్రభావితం చేయడానికి పనిచేస్తాయి. అన్నప్పుడు పై సంస్థలనన్నింటినీ అని మనం భావించాల్సి ఉంటుంది.

అందువల్ల పై సంస్థల నిర్వహణ, విధానాల రూప కల్పన మొదలైన వాటిని తమతమ ఆసక్తులకు అనుగుణంగా మలుచుకోడానికి ప్రభావ వర్గాలు ప్రయత్నిస్తాయి. బహుతావాద సమాజంలో వివిధ ఆసక్తులున్న సమూహాలుంటాయి. అవి తమతమ ప్రయోజనాల సాధనకోసం పరస్పరం పోటీ పడుతుంటాయి. అందువల్ల రాజకీయ సామాజిక ప్రక్రియలో ప్రభావ వర్గాలు కేంద్ర బిందువులుగా పనిచేస్తాయి.

## 17.4 ప్రభావ వర్గాల ఆవిర్భావం

ప్రభావ వర్గాలు ఎప్పుడు, ఎలా ఏర్పడ్డాయో నిర్ధారించడం కష్టం. చారిత్రకంగా ఫలానా సంవత్సరం, ఫలానా దేశంలో,

BRAOU

అవి అవతరించాయని నిర్ధారించటం అంత సులభం కాదు. దానికి అవసరమైన ప్రామాణిక ఆధారాలు మనకు లభ్యం కాలేదు.

అయితే వ్యవస్థాపిత సమాజం ఏర్పడిన నాటి నుంచి ప్రభావ వర్గాలు ఏదో ఒక రూపంలో పనిచేస్తున్నాయని చెప్పవచ్చు. ప్రాచీన గ్రీక్ దేశంలో కులీన స్వామ్యాల్లో ప్రజాస్వామ్యాల్లో అనేక ముఠాలు పనిచేస్తుండేవి. అవి పాలక వర్గాన్ని ఏదో ఒక విధంగా ప్రభావితం చేయడానికి ప్రయత్నించేవి.

శాసన సభ లేదా కార్యనిర్వాహక శాఖను ప్రభావితం చేయడానికి ప్రయత్నాలు ప్రారంభం నుంచి జరుగుతూ వచ్చాయి. మధ్యయుగాల్లో స్థానిక వ్యవహారాల్లో శ్రేణులు ముఖ్యమైన పాత్ర నిర్వహించాయి. రాజ్య పాలక వర్గాల నుంచి అవి చాలా మేరకు స్వతంత్రంగా వ్యవహరిస్తుండేవి. ఆర్థిక కార్యకలాపాల్లో – ఉత్పత్తి, **పంపిణీ** – అవి రాజ్య జోక్యం నుంచి దూరంగా ఉండేవి. అయితే ప్రభావ వర్గాలు ఆధునిక కాలంలోనే ప్రాధాన్యం పొందాయి. ఇంగ్లండ్‌లో కారన్ చట్టం వ్యతిరేక సమితి(Anti-Corn League), అమెరికాలో ఫెడరలిస్ట్ వాదులు(Federalists) తమతమ దృక్పథాలను వ్యక్తంచేసి ఉభయ దేశాల్లో గణనీయమైన విజయం సాధించాయి.

రాజ్యానికి, వ్యవస్థాపరమైన సమూహాలకు మధ్య ఎప్పుడూ చర్య, ప్రతిచర్యలు ఉంటూండేవి. న్యాయవాదులు, మతాచార్యులు, రాజవంశీయులు, భూస్వాములు, వ్యాపారులు మధ్య యుగాల పాశ్చాత్య సమాజాల్లో ప్రభావ వర్గాలుగా పనిచేశారు.

అయితే ప్రభావ వర్గాలకు సంబంధించిన అధ్యయనం 20వ శతాబ్దం ప్రారంభం నుంచి మొదలైంది. ఆర్థర్ బెంట్లీ (Arthur F.Bently) ''ప్రభుత్వ ప్రక్రియ''(The Process of Government) అనే గ్రంథం 1908లో ప్రచురించారు. ఇందులో బెంట్లీ ప్రభావ వర్గాలను గురించి ఒక ప్రత్యేక అధ్యయనం చేశారు. ప్రభావ వర్గాలను ప్రయోజన వర్గాలుగా, ప్రయివేట్ సంఘాలుగా, అభిరుచి సమూహాలుగా, లాబీలుగా, ఒత్తిడి గణాలుగా పేర్కొన్నాడు(Pressure groups, Interest groups, Private groups/Organisations, Lobbies, Interest Articulators).

BRAOU

అధికారం పొందటం ప్రభావం వర్గాల ధ్యేయం కాదు. రాజకీయాలు వాటి లక్ష్యం కాదు. అధికారాన్ని నిర్వహించే వారికి వారి విధానాలను తను ప్రయోజనాలకు ఏవిధంగా ఉపయోగించుకోవాలి? అధికారం కోసం రాజకీయాల్లో ప్రత్యక్షంగా పాల్గొనకుండా రాజకీయాలకు వెలుపల ఉంటూ/ఉన్నట్లు కనబడుతూ అధికారం చెలాయింపును తమ వర్గ ప్రయోజనాలకు అనుగుణంగా మలుచుకోవటమే ప్రభావ వర్గాల మౌలిక ధ్యేయం.

అమెరికా, యూరప్ దేశాల్లో పరిశోధనకు, ప్రభుత్వ ప్రక్రియ అధ్యయనానికి బెంట్లీ రచన విశేషంగా ఉపయోగపడింది. వి.ఓ.కీ (V.O.Key), జూనియర్, ఎస్.. ఫైనర్, డేవిడ్ ట్రూమన్, చార్ల్స్.ఇ. హేగెన్, ఫెర్‌ట్రామ్, స్టాన్లీ కోచనక్, మొదలైనవారు ప్రభావ వర్గంపై విస్తృతమైన అధ్యయనాలు చేశారు.

## 17.5 ప్రభావ వర్గాల లక్షణాలు

ప్రభావ వర్గాల సాధారణ స్వభావం నుంచి దాని లక్షణాలను కింది విధంగా అధ్యయనం చేయవచ్చు.

(1) సామాన్యంగా ప్రభావ వర్గానికి ఒక నిర్ణీత ప్రయోజనముంటుంది. దానిని సాధించడానికి అటువంటి ఆసక్తి ఉన్న వ్యక్తులతో ప్రభావ వర్గం ఏర్పడుతుంది.

(2) ప్రభావ వర్గం రాజకీయేతర సంస్థగా అవతరిస్తుంది. రాజకీయాలతో ప్రత్యక్ష లేదా పరోక్ష సంబంధాలున్నప్పటికీ ఒక రాజకీయ పక్షంగా, ప్రత్యక్ష రాజకీయాలలో క్రియాత్మకంగా పాల్గొనదు.

(3) ప్రభావ వర్గానికి రాజకీయ పక్షం మాదిరి ఒక నిర్దిష్టమైన రాజకీయ కార్యక్రమమంటూ ఏదీ ఉండదు. అయినా

రాజకీయాలతో సంబంధం ఉంటుందే కాని ప్రభుత్వ నిర్మాణంతో ప్రత్యక్ష సంబంధం ఉండదు.

(4) ప్రభావ వర్గాలు తమతమ ప్రయోజనాలకు అనుగుణంగా ప్రభుత్వ విధానాలను కార్యక్రమాలను ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తాయి.

(5) ప్రభావ వర్గం రాజకీయాల్లో ప్రత్యక్షంగా పాల్గొనదు. ఎన్నికల్లో అభ్యర్థులను తన వర్గం పక్ష నిలబెట్టదు. అయినా ఆసక్తులకు దగ్గరగా ఉన్న రాజకీయ పక్షాల లేదా అభ్యర్థుల విజయానికి అవసరమైన అండదండలిస్తుంది.

(6) ప్రభావ వర్గం ద్వారా రాజకీయ వ్యవస్థ ఆసక్తి వ్యక్తీకరణ కర్తవ్యం నెరవేరుతుంది. ముఖ్యంగా బహిరంగ ప్రజాస్వామ్యాల్లో ప్రభావ వర్గం ద్వారానే ఆసక్తుల వ్యక్తీకరణ సాధ్యమవుతుంది. విభిన్న వర్గాలు, వ్యక్తిపర సముదాయాలు, వాటి వాటి ప్రయోజనాలను వ్యక్తంచేసి ప్రభుత్వాన్ని తమ కనుగుణంగా స్పందింపచేయటానికి ప్రయత్నిస్తుంటాయి.

(7) ప్రభావ వర్గాలు రాజకీయాల్లో ప్రత్యక్షంగా క్రియాత్మకంగా పాల్గొనక పోయినప్పటికీ రాజకీయ నేతలను సంస్థలను, నిర్మితులను నిరంతరం ప్రభావితం చేస్తూనే ఉంటాయి. అందువల్ల ఆధునిక రాజకీయ వ్యవస్థల్లో ప్రభావ వర్గాలు గణనీయమైన పాత్ర నిర్వహిస్తుంటాయి.

(8) ప్రభావ వర్గాలు కొన్ని ప్రత్యేక రాజకీయ, సామాజిక పరిస్థితుల్లో ఏర్పడి కొన్ని నిర్ణీత ప్రయోజనాలకు పనిచేస్తాయి. ఉదాహరణకు, విద్యార్థి ఉద్యమాలు, తెలంగాణా శాసన సభ్యుల వేదిక తెలంగాణ ప్రత్యేక ప్రయోజనాల సాధనకోసం అవతరించిన వేదిక.

అలాగె 'కొన్ని సంస్థలు తమ ప్రయోజనాల సాధన అనంతరం రంగం నుంచి నిష్క్రమిస్తాయి. ఉదాహరణకు, విద్యార్థి సమాఖ్య, తెలంగాణా ప్రజా సమితి, స్టీల్ ప్లాంట్ ఆందోళన సమితి మొదలైనవి. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఏర్పడి, ఒక పరిమిత లక్ష్య సాధనకోసం ఉద్యమించి, ఆ ప్రయోజనం సాధించిన తరువాత క్రియాత్మక కార్యకలాపాల నుంచి అంతర్ధానమవుతాయి.

BRAOU

(9) ఆఫ్రికా, ఆసియా ఖండాల్లోని దేశాలలో ప్రభావ వర్గాలు ఆర్థిక, వ్యక్తిపరమైన ప్రాతిపదికలపై కాకుండా ఆదిమ విధేయతల (Primordial Loyalties) కారణంగా ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా భారతదేశంలో కులం, మతం, తెగల పరంగా ప్రభావ వర్గాలు ఏర్పడి ఆయా వర్గాలకు చెందిన వారి ప్రయోజనాలకోసం పనిచేస్తున్నాయని అనేక రాజనీతి శాస్త్ర వేత్తల అభిప్రాయం. Modernity of Tradition అనే గ్రంథంలో రుడాల్ఫ్ దంపతులు ఈ విధంగా నిర్వచించారు. ''ద్రవిడ ఉద్యమం'' (Dravidian Movement) అనే గ్రంథంలో రాబర్ట్ హార్డ్ గ్రేవ్ కూడా పై అభిప్రాయాన్నే వ్యక్తంచేశాడు.

## 17.6.0 వివిధ రకాల ప్రభావ వర్గాలు

అవి నిర్వహించే కర్తవ్యాలను, ప్రాతినిధ్యం వహించే సమూహాలను బట్టి ప్రభావ వర్గాలను కింది విధంగా వర్గీకరించవచ్చు.

(1) ఆసక్తి వర్గాలు (Interest groups)

(2) అభిజాత వర్గాలు (Attitude groups)

పై వాటిలో మొదట ప్రస్తావించిన వర్గాలను గుర్తించడం పెద్ద కష్టం కాదు. ఎందుకంటే ఇందులోని వ్యక్తులకు ఒకే రకమైన ప్రయోజనాలుంటాయి. ఉదాహరణకు, స్కూటర్ ఉత్పత్తిదారుల సంఘం. ఇందులోని సభ్యులందరి ప్రయోజనం ఒకే రకంగా ఉంటుంది.

అయితే రెండో రకానికి చెందిన ప్రభావ వర్గాలు కొంత క్లిష్టంగా ఉంటాయి. ఇందులోని సభ్యుల ఏకాభిప్రాయంప

లక్ష్యం స్థిరంగా ఉండవు. వారి ఆసక్తులకు స్పష్టత శాశ్వతత్వాలు ఉండవు, ప్రయోజనం భావపరంగానే ఉంటుంది. కానీ స్పష్టంగా వ్యక్తంకాదు.

ఆల్మండ్ ప్రభావ వర్గాలను నాలుగు రకాలుగా విభజించాడు. అవి:

### 17.6.1 సహచర్య ప్రభావ వర్గాలు (Associational Interest Groups)

ఈ రకమైన ప్రభావ వర్గాలు స్థిరమైనవి. ఇవి ప్రత్యేక ఆసక్తులను వ్యక్తీకరిస్తాయి. వ్యవస్థాపరంగా సంఘటితమై పనిచేయటంవల్ల ఎక్కువ ఫలితాలు సాధించ గలుగుతాయి. కార్మిక సంఘాలు, మత సంఘాలు ఈ కోవకు చెందుతాయి.

### 17.6.2 సంస్థాగతమైన ప్రభావ వర్గాలు (Institutional Interest Groups)

సంస్థాపరమైన ప్రభావ వర్గాలు తమ లక్ష్యాలతోపాటు ఇతర ప్రయోజనాలు సాధించడానికి కూడా ప్రయత్నిస్తాయి. సామాజిక, రాజకీయ విధులు కొన్నింటిని ఇవి నిర్వహిస్తాయి. శాసన సభలు, ఉద్యోగి బృందాలు, సైన్యం, మతపరమైన సంస్థలు సంస్థాపరమైన ప్రభావ వర్గాలు. ఈ కోవకు చెందిన ప్రభావ వర్గాలు అన్ని సంస్థల్లో - రాజకీయ పక్షాలు, శాసన సభ, ఉద్యోగి స్వామ్యం - ఉంటాయి; పనిచేస్తాయి. ఇవి తమ ఆసక్తులతోపాటు ఇతర ప్రయోజనాలను కూడా సాధించడానికి ప్రయత్నిస్తాయి.

### 17.6.3 సహచర్యేతర ఆసక్తి వర్గాలు (Non-Associational Interest Groups)

ఇవి బహిర్గతంగా కాకుండా వ్యక్తిగత సంబంధాల ద్వారా రూపొందుతాయి. బంధుత్వం, రక్త సంబంధం, కుటుంబం, వంశపారంపర్యత, భాషా సంబంధమైన సమూహాలు దీనికి ఉదాహరణలు.

### 17.6.4 అప్రయత్న పూర్వ ఆసక్తి వర్గాలు (Anomic Interest Groups)

BRAOU

ఒక ప్రత్యేక ప్రయోజన సాఫల్యత కోసం ఏర్పడినట్లు ఈ తరహాకు చెందిన ఆసక్తి వర్గాలు కనిపించవు. అప్పటికప్పుడు ఆకస్మికంగా ఇవి ఏర్పడతాయి. ఏదో ఒక సంఘటన వల్ల ఉద్వేగం పొంది అప్పటికప్పుడు అవి ఏర్పడి పనిచేస్తాయి. మత కలహాలు ఏర్పడినప్పుడు, లేదా ఒక ప్రాంతంలో/బస్తీలో శాంతి భద్రతల పరిస్థితి క్షీణించినప్పుడు అక్కడి పౌరులు తాత్కాలికంగా ఒక సంఘంగా ఏర్పడి ఆ ప్రత్యేక ప్రయోజనం కోసం పనిచేస్తారు. విద్యార్థి సమస్యలపై ఏర్పడే సంయుక్త కార్యాచరణ సమితులు కూడా ఈ కోవకు చెందినవే. కొట్లాటలు, ధర్నాలు, వ్యతిరేక ప్రదర్శనలు, నిరసనోద్యమాలు, ఊరేగింపులు తదితర ఉద్రిక్త చర్యలు ఈ తరహాకు చెందినవే.

వ్యవస్థ స్వరూపాన్ని అనుసరించి, ప్రయోజనాల సంఘటితత్వాన్ని దృష్టిలో పెట్టుకొని గాబ్రియల్ ఆల్మండ్ పై విధంగా ప్రభావ వర్గాలను వర్గీకరించాడు. ఇందులో నిర్మితమైనవి, అనిర్మితమైనవి అని రెండు రకాలుంటాయి. ఈ విధంగా ప్రభావ వర్గాలను స్థూలంగా శ్రేణీకరించడానికి అవకాశముంది.

స్థూలంగా ప్రభావ వర్గాలను అవి ప్రాతినిధ్యం వహించే ఆసక్తులను బట్టి కింది విధంగా వర్గీకరించవచ్చు.

(1) ఆర్థిక ప్రయోజన వర్గాలు

(2) సాధారణ వృత్తి సంబంధ వర్గాలు

(3) సంస్థాపరమైన వర్గాలు

(4) మత సంబంధ వర్గాలు

(5) భాషా, సాంస్కృతిక వర్గాలు

(6) వినియోగదారుల సంఘాలు

సమాజంలోని వివిధ వర్గాల ప్రజలు భిన్న ఆసక్తులను ప్రతిబింబిస్తూ వారివారి ప్రయోజనాల సాఫల్యతకోసం ప్రయత్నించడానికి అనేక ప్రభావ వర్గాలు ఏర్పడతాయి.

## 17.7.0 ప్రభావ వర్గాల పద్ధతులు

తమ తమ లక్ష్యాల సాధనకోసం ప్రభావ వర్గాలు రకరకాల పద్ధతులు అనుసరిస్తాయి. పైరవీ, సమ్మె, బంద్, ఘెరావ్, అవినీతి మార్గాలు మొదలైనవి సమయానుకూలంగా ఆశయ సాధనకోసం భారత దేశంలో ప్రభావ వర్గాలు ప్రయోగిస్తున్నాయి.

వ్యక్తిగత సంబంధాల నుంచి సమ్మెల వరకూ ఆశయ సిద్ధికోసం అనేక పద్ధతులు అనుసరించటం మనకు కనిపిస్తుంది. కులం, మతం, ప్రాంతం, భాష, స్త్రీ అభ్యుదయం మొదలైన అనేక అంశాలను ప్రాతిపదికగా తీసుకొని లక్ష్య సాధన కోసం ఉద్యమిస్తాయి.

లక్ష్యసాధనకున్న ప్రాముఖ్యం పద్ధతులకు లేదు. అనుసరించే పద్ధతులను బట్టే ప్రభావ వర్గం సాఫల్యత తరుచు అంచనా వేయటం ఈనాడు జరుగుతోంది. సామాన్యంగా ఒక సంఘటిత వర్గం ప్రాబల్య స్థితికి చేరుకొనే స్థాయిలో ఉద్యమించినప్పుడే ప్రభుత్వం వారి కోరికలను మన్నించడానికి పూనుకొంటుంది. అందువల్ల పద్ధతులను మనం తేలికగా తీసిపారెయ్యలేం. సాధారణంగా ప్రభావ వర్గాలు కింది పద్ధతులను అవసరాన్నిబట్టి అనుసరిస్తాయి.

### 17.7.1 పైరవీ (Lobbying)

పాశ్చాత్య సమాజాల్లో వ్యవస్థాపరమైన ఆసక్తి వర్గాలు ప్రభుత్వ నిర్ణయ కర్తలను ప్రభావితం చేయడానికి తత్సంబంధిత సభ్యులను, అధికారులను తరుచు కలుసుకొంటూ వారికి తమ కోర్కెలను వివరిస్తూ వారిని వ్యక్తిగతంగా ప్రభావితం చేయటానికి ప్రయత్నిస్తాయి. ఈ పద్ధతిని 'లాబీయింగ్' అంటారు. ప్రముఖ శాసన సభ్యులను, ప్రభుత్వాధికారులను, రాజకీయ వేత్తలను వ్యక్తిగతంగా కలుసుకొని, వారితో సన్నిహిత సంబంధాలు పెంపొందించుకొని అవసరమైతే కొన్ని ప్రలోభాలు ఉపయోగించి వారిని తమ ప్రయోజనాలకు కృషిచేసేటట్లు చేస్తాయి.

అమెరికా రాజకీయాల్లో, ప్రభావ వర్గాలు కీలకమైన పాత్ర నిర్వహిస్తాయి. అమెరికాలో కాంగ్రెస్ - ముఖ్యంగా ఎగువ సభ సెనేట్ అత్యంత శక్తిమంతమైన సంస్థ. సెనేట్ ఆమోదముద్ర అధ్యక్షుడి విధానాలకు తప్పనిసరి. సెనేట్ సభ్యులను అనేక ప్రభావ వర్గాలు తరుచు కలుసుకొంటూ వారికి తమతమ సమస్యలను విశదపరిచి అవసరమైన సందర్భాలలో విరాళాలు, వ్యక్తిగత ప్రలోభాలు చూపించి తమ పనులు చేయించుకొంటాయి.

భారతదేశంలో వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక వర్గాలు ప్రభుత్వంపై రకరకాల పద్ధతుల్లో ఒత్తిడి తీసుకొని రావడానికి ప్రయత్నిస్తాయి. ఎన్నికల సమయంలో వివిధ రాజకీయ పక్షాలకు - ముఖ్యంగా అధికార పక్షానికి ఉదారంగా ''విరాళాలు'' చెల్లిస్తాయి. ఈ విరాళాలివ్వడం, పార్టీ టికెట్టుకోసం ప్రయత్నించటం, పార్లమెంట్‌లో తమకంటూ ఒక ఒక వర్గాన్ని ఏర్పాటుచేసుకోవడం, ప్రజాప్రతినిధుల ''అవసరాలు తీర్చడం'' సర్వసాధారణంగా జరుగుతున్నది. అధికార, ప్రతిపక్షాలు పారిశ్రామిక సంస్థల పట్ల కృతజ్ఞతా భావంతో వ్యవహరించడం, అవి ఎన్నికల వ్యయాన్ని కొంత మేరకు భరించడమే. అందువల్ల ప్రభుత్వ విధానాలను రూపొందిస్తున్నప్పుడు సహజంగా పారిశ్రామిక సంస్థల ఆసక్తులను, ఏ రాజకీయ పక్షానికి చెందిన ప్రభుత్వమైనా తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

రాష్ట్రమంతటా సారాను నిషేధించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఐఎంఎఫ్ఎల్ మద్యాన్ని విక్రయించడానికి, చౌకధర మత్తుపానీయాలను అందరికీ అందుబాటులో ఉండేటట్లు చేయడానికి, ఖజానాకు ఏర్పడిన లోటును భర్తీ చేయటం కంటే మత్తు పానీయాల విక్రేతల ఒత్తిడికి లొంగిపోవటం ప్రధాన కారణమని చెప్పవచ్చు.

BRAOU

ఎందుకంటే ఎన్నికల్లో అవసరమైన ''నిధులను'' ఉదారంగా ధారాళంగా అందించే వర్గం ఈ మత్తు పానీయాల ఉత్పత్తి, విక్రయదారులే.

## 17.7.2 సమ్మెలు

తమ ఆసక్తులను పరిరక్షించుకోటానికి, లేదా విస్తరించుకోటానికి సర్వసాధారణంగా అనుసరిస్తున్న పద్ధతి ''సమ్మె'' చేయడం. తాత్కాలికంగా పని ఆపివేయడం ద్వారా ప్రభుత్వ యంత్రాంగాన్ని స్తంభింపచేసి సాధారణ ప్రజలకు అసౌకర్యం కలిగించి తద్వారా ప్రభుత్వంపై వత్తిడి తీసుకొని వచ్చి తమ కోర్కెలను తీర్చుకోడానికి సమ్మెను అత్యంత శక్తిమంతమైన సాధనంగా నేడు భారతదేశంలో అనేక ప్రభావ వర్గాలు తరుచు ఉపయోగిస్తున్నాయి.

[illegible] పనిచేయడం(Work as per Rule), కలాన్ని కదిలించక పోవడం(Pen down strike), పనిముట్లను ముట్టుకోకపోవడం(Tool Down Strike) మొదలైనవి సమ్మె కార్యక్రమంలో అనుసరిస్తున్న వివిధ దశల్లో ఉపయోగించే పద్ధతులు.

కీలకమైన సంస్థల్లో శాఖలు ప్రజలకు ప్రత్యక్ష సేవలను అత్యవసర సేవలను అందించే విభాగాలు(Essential Services) – విద్యుచ్ఛక్తి, నీటి సరఫరా, మునిసిపాలిటీ పారిశుధ్య సేవలు, రోడ్డు రవాణా శాఖ సమ్మెకు దిగినప్పుడు ప్రజా జీవనంపై వాటి ప్రభావం తప్పని సరిగా ఉంటుంది. 1993 ఆగస్టులో అఖిల భారత లారీ యజమానుల సంఘం రోడ్డు పన్ను కు (Road Tax) వ్యతిరేకంగా, ఆక్ట్రాయ్ పన్నుకు నిరసనగా అఖిల భారత స్థాయిలో సమ్మె నిర్వహించి తమ డిమాండ్ల సాధనకోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చాయి. ఫలితంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగివచ్చి కొన్ని కోర్కెలను తీర్చాయి.

ప్రపంచ వ్యాప్తంగా ''సమ్మె'' ఒక సార్వజనీనమైన సాధనంగా అయింది. అనేకదేశాల్లో దీనిని ఒక శక్తిమంతమైన సాధనంగా ప్రభావ వర్గాలు ఉపయోగించుకొన్నాయి.

BRAOU

## 17.7.3 బంద్

'బంద్' అంటే మూసివేయడం. ఇది దేశవ్యాప్తంగా జరిగినప్పుడు దాన్ని ''భారత్ బంద్'' అనవచ్చు. రాష్ట్రానికే పరిమితమైనప్పుడు అది రాష్ట్ర బంద్ అవుతుంది. సర్వసాధారణంగా బంద్‌లు స్వచ్ఛందంగా జరగకుండా, నిర్బంధంగా – హింసాపద్ధతుల, దౌర్జన్య చర్యల ద్వారా – అందరూ పాటించేటట్లు నిర్వహించడం జరుగుతోంది. తమ ప్రత్యేక లక్ష్య సాధనకోసం, ప్రజల సానుభూతిని సంపాదించడంకోసం, ప్రభుత్వాన్ని లొంగదీసుకోడానికి బంద్‌లను ప్రభావ వర్గాలు తరుచు నిర్వహిస్తాయి. టర్నోవర్ పన్నుకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని వ్యాపార సంస్థలు 1993 ఆగస్టులో మూడు రోజులు నిరవధిక బంద్‌ను పాటించాయి. జీవన రక్షక మందులు కూడా ప్రజలకు లభ్యం కాలేదు.

నిజానికి ఒక లక్ష్యం పట్ల ఆసక్తి, సానుభూతి కంటే బందును పాటించకపోతే జరిగే నష్టం – ఆస్తి విధ్వంసం, ప్రాణహాని – ఎక్కువ అనే భయంతో ప్రజలు బంద్ పిలుపును మౌనంగా పాటించడం అనేక సందర్భాలలో జరుగుతూ ఉంటుంది.

## 17.7.4 ఘెరావ్

ఒక సంస్థలోని ముఖ్యాధికారులను కదలనీయకుండా, వారు బయటికి రాకుండా, తమ కర్తవ్యాలను నిర్వహించకుండ అడ్డుకోవటాన్ని ''ఘెరావ్'' అంటారు. ఆందోళనకారులు వీరిని చుట్టుముట్టి కదలనీయకుండా చేయడం ప్రస్తుతం బాగా ప్రాచుర్యం పొందిన పద్ధతి. మరోమాటలో చెప్పాలంటే ఘెరావో అంటే యాజమాన్యాన్ని కదలనీయకుండా చేసి వారిని ఒక ప్రదేశం లేదా గదిలో పెట్టి తాళం వేయటమన్నమాట. దీని ఉద్దేశం సంబంధిత అధికారులను వారి యథావిధి కర్తవ్య నిర్వహణ నుంచి నిరోధించటం తద్వారా కార్యాలయం పనిని స్తంభింపచేయటం. ఈ విధంగా

యాజమాన్యాన్ని, నిర్వహణ కార్యక్రమాలను నిర్వహించకుండా నిరోధించి తమ కోర్కెల సాధనకు వారిపై ఒత్తిడి తీసుకొని రావడం.

పారిశ్రామిక రంగంలో సదరు ఘెరావ్‌లు సర్వసాధారణమయ్యాయి. ఇవి నిజానికి ప్రభావ వర్గం అంతిమ ఆయుధంగా, తమ కోర్కెల సాధనకు ఉపయోగించుకొంటున్నప్పటికీ తరుచు ఘెరావ్‌లను నిర్వహించడంవల్ల ఉత్పత్తి తగ్గిపోవటం, ప్రజలకు అసౌకర్యం కలగడం జరుగుతోంది.

ఘెరావ్‌లతోపాటు ''రాస్తారోకో'', ''జైల్‌భరో'' మొదలైన ప్రత్యక్ష ఆందోళన సాధనాలను తరుచు వినియోగించడం జరుగుతున్నది. దీనివల్ల పారిశ్రామిక, అత్యవసర సేవా రంగాల్లో అశాంతి, అలజడులు, అభద్రత, అసౌకర్య పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అంతేకాకుండా ప్రజా ఆస్తులు విధ్వంసానికి గురి అవుతున్నాయి.

అయితే ప్రజా స్పందనను పట్టించుకోని ప్రభుత్వం పనిచేస్తున్నప్పుడు అన్ని రకాలుగా వారిని ప్రభావితం చేయడానికి విఫలమైనప్పుడు ఆఖరి ఆయుధంగాపైన పేర్కొన్న ప్రత్యక్ష చర్యలకు ప్రభావ వర్గాలు దిగటం తప్పనిసరి అవుతున్నది.

పాశ్చాత్య దేశాలతో పోలిస్తే అభివృద్ధి చెందుతున్న దేశాలలో ముఖ్యంగా భారతదేశంతో ప్రభావ వర్గాల పాత్ర చాలా పరిమితంగా ఉంది. చాలా వరకు అభివృద్ధి చెందిన దేశాల్లో అవనీతి చర్యల ద్వారా ఘనీభవించిన ప్రజాస్వామ్య, ప్రజాభిప్రాయం ద్వారా – అంటే సంబంధిత అధికారులు విధాన నిర్ణేతలు, రాజకీయ వేత్తలకు ప్రలోభం ఎరచూపించి, ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసి ఆసక్తి వర్గాలు తమ లక్ష్యాన్ని సాధించుకొంటాయి. ధనము, బహుమానాలు, ప్రభుత్వ కొనుగోళ్ళలో భారతదేశంలో మొత్తాలను కమిషన్‌లుగా ఇవ్వడం(kickbacks), అధికారంలో ఉన్న వారి బంధు మిత్రులకు ఉద్యోగాలివ్వటం, వారు ప్రారంభించిన వ్యాపార సంస్థలకు అక్రమ పద్ధతుల్లో నిధులు సమకూర్చటం మొదలైన చర్యలు సర్వసాధారణమయ్యాయి.

అలా సాధ్యపడనప్పుడు మాత్రమే ఆందోళనకరమైన ప్రత్యక్ష పద్ధతులకు ఆసక్తి వర్గాలు దిగటం జరుగుతున్నది. తమ కోర్కెలను తీర్చటంలో ప్రభుత్వం మొండి వైఖరి చూపించినప్పుడు ప్రత్యక్షచర్యలకు – సమ్మె, బంద్, ఘెరావ్, – పూనుకోవటం జరుగుతున్నది.

BRAOU

బాబూలాల్ ఫాడియా "Pressure groups in Indian Politics" గ్రంథంలో ప్రభావ వర్గాలు అనుసరించే పద్ధతులను కింది విధంగా చర్చించాడు:

(1) లాబీయింగ్ ద్వారా ప్రభుత్వాన్ని ప్రభావితం చేస్తాయి.

(2) తమ ప్రయోజనాలకు అనుగుణంగా ప్రవర్తించే వారిని ఎన్నికల్లో నిలబెట్టి వారి ఎన్నికయ్యేట్లు చూడటం.

(3) శాసన కర్తలకు తగిన తీరిక, ఓపిక లేకపోవటంవల్ల వారికి సరి అయిన సమాచారం అందించి తద్వారా తమకు అనుకూలమైన విధంగా చట్టాలు చేయించుకోవడం లేదా ఉన్న చట్టాలలో మార్పులు తీసుకొని రావడం.

(4) శాసన సభా సంఘాలు సభ్యులను రకరకాలు ప్రభావితం చేస్తాయి. వారిని ఆకర్షించి తమకనుకూలంగా చేసుకొంటాయి.

(5) తమ ప్రయోజనాలు, కోర్కెల ప్రకటనకు విపరీత ప్రచారం కోసం ప్రభావ వర్గాలు ఉపన్యాసాలు, గ్రంథాలు, వ్యాసాలు ప్రకటనలు, వార్తా ప్రసారాలు, చలనచిత్రాలను సాధనంగా ఉపయోగిస్తాయి.

(6) ప్రభావ వర్గాలు కొన్ని సందర్భాలలో శాసన సభ్యులకు ముసాయిదా బిల్లులను తయారుచేసి ఇస్తాయి. ప్రత్యేక నైపుణ్యం ఉండటంవల్ల బిల్లు ముసాయిదాను సునాయాసంగా తయారుచేసి సభ్యుల పనిభారాన్ని తగ్గిస్తాయి.

(7) ప్రచార సాధనాలను, ప్రయోజ సాధన కోసం తరుచు ప్రభావ వర్గాలు ఉపయోగించుకొంటాయి.

(8) ప్రభావ వర్గాలు సొంత పత్రికలను నడువుతాయి లేదా పత్రికలకు వ్యాపార ప్రకటనల ద్వారా వాటి మద్దతును సంపాదించుకొంటాయి.

(9) వ్యతిరేక ప్రదర్శనలు, ఘర్షణలు, కొట్లాటలు మొదలైన పద్ధతుల ఉపయోగించుకోవడానికి వెనకాడవు.

(10) రాజకీయ పక్షాలతో సంబంధాలు నెలకొల్పుకొని వాటి సహాయాన్ని పొందుతాయి; వాటికి సహాయం చేస్తాయి.

(11) కొన్ని సందర్భాలలో ప్రభావ వర్గం అవినీతి అవాంఛనీయ చర్యలను చేపట్టి ప్రభుత్వాన్ని, విధాన నిర్ణేతలను ప్రభావితం చేస్తాయి.

(12) ప్రభావ వర్గాల్లోని శ్రేష్ఠ వర్గం, శాసన సభులు, సీనియర్ అధికారులను, ఇతర ముఖ్యులను కలిసి వాళ్ళను సమన్వయపరిచి చర్చిస్తుంది. దానికి అనుకూలంగా మార్చుకోటానికి ప్రయత్నిస్తుంది.

## 17.8 ప్రభావ వర్గాల ప్రాధాన్యం

ప్రభావ వర్గాల ప్రాధాన్యం నానాటికీ పెరుగుతున్నది. ఆధునిక రాజకీయ వ్యవస్థలపై ఆసక్తి వర్గాల ప్రభావం ప్రత్యక్షంగాను పరోక్షంగాను చాలా ఉంది. దీనికి అనేక కారణాలు దోహదం చేశాయి. వాటిలో ముఖ్యమైనవి.

(1) ప్రజాస్వామ్యాల్లో జాతీయ, రాష్ట్ర స్థానిక ప్రయోజనాల నిమిత్తం ప్రభావ వర్గాలు సరిగా పనిచేయాల్సి ఉంటుంది. పౌరునికి ప్రభుత్వానికీ మధ్య ప్రభావ వర్గాలు వారధిగా ఉంటాయి.

(2) ఆధునిక బహుతా వాద సమాజాల్లో భిన్న వర్గాలు, వృత్తులు, ఆసక్తులు ఉన్న జన సముదాయాలు సహజంగా తమ ప్రయోజనాల కోసం ప్రయత్నిస్తాయి. వాటి వాటి ఆసక్తులను పాలకుల దృష్టికి తీసుకొని రావటానికి ప్రభావ వర్గాలు ముఖ్యపాత్రను నిర్వహిస్తాయి. ముఖ్యంగా పారిశ్రామిక సంస్థలు, కార్మిక ఉద్యోగి వర్గాలు తమ ఆసక్తుల వ్యక్తీకరణ ప్రభావ వర్గాలపై ప్రధానంగా ఆధారపడతాయి.

BRAOU

(3) విస్తృతమైన, సంక్లిష్టమైన ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థలో వ్యక్తులకు జాతీయ రాజకీయ పక్షాలతో పాటు తమతమ కోర్కెల సాధనకు ప్రభావ వర్గాల తోడ్పాటు తప్పనిసరి అవుతుంది. పార్టీ ప్రణాళికలు లేని ప్రయోజనాలు వ్యక్తులకు ఉండవచ్చు. అటువంటి ఆసక్తులను సంఘటితం చేసి ప్రభుత్వ దృష్టికి తీసుకొని రావటానికి ప్రభావ వర్గాలు ఉపకరిస్తాయి. తద్వారా వారు అంచనావేసి నిర్ణయాలు తీసుకోటానికి అవకాశముంటుంది. అంటే పరోక్షంగా విధాన నిర్ణయ ప్రక్రియలో సముచిత పాత్రను ప్రభావ వర్గాలు నిర్వహిస్తాయి.

(4) ప్రభావ వర్గాలు ''అనిర్మిత చట్ట సభలు'' అనటంలో అతిశయోక్తి లేదు. ఎందుకంటే నిజానికి చట్ట సభల్లో ప్రవేశపెట్టే అనేక ముసాయిదా చట్టాలు తమ ఆసక్తుల మేరకు ప్రభావ వర్గాలు తయారుచేసేవే. శాసన సభ్యులకు అవసరమైన సమాచారాన్ని అందివ్వటం, తమ ప్రయోజనాలను హేతుబద్ధంగా వాదించటానికి అవసరమైన సూచనలివ్వటం వారికి తమ సమస్యలను వివరించి అవసరమైన సహాయ సౌకర్యాలు అందివ్వటం ద్వారా శాసన సభ్యులకు ప్రభావ వర్గాలు ఉపయోగపడతాయి.

(6) రెండు ఎన్నికల మధ్య కాలంలో ప్రజాభిప్రాయానికి ప్రభావ వర్గాలు ప్రాతినిధ్యం వహిస్తాయి. అవి రాజకీయ పక్షాలతో ప్రత్యక్ష, పరోక్ష సంబంధాలను పెట్టుకొని క్రియాత్మకంగా పనిచేస్తాయి.

(7) నానాటికీ విస్తృతమవుతున్న ప్రభుత్వ కార్యకలాపాలవల్ల సామాన్య ప్రజానీకానికి ఎటువంటి నష్టం కలగకుండా వారి ఆసక్తులను ప్రభుతం అనవసరంగా పరిమితం చేయకుండా కాపాడటానికి కూడా ప్రభావ వర్గాలు ప్రయత్నిస్తాయి.

కొన్ని సందర్భాలలో ఉన్న ప్రభుత్వాన్ని మార్చటం కూడా ప్రభావ వర్గాలు పనిచేస్తాయి. స్వాతంత్ర్య సాధనకు కొన్ని

దేశాల్లో – భారతదేశంలో అఖిల భారత జాతీయ కాంగ్రెస్ – కొనసాగిన జాతీయోద్యమాలు ప్రభావ వర్గాల నాయకత్వం వల్లనే అని చెప్పవచ్చు. అలాగే కొన్ని దేశాల్లో ఉన్న ప్రభుత్వాన్ని పడగొట్టి దాని స్థానంలో మరో ప్రభుత్వం ఏర్పాటవటం లక్ష్యంగా కూడా ప్రభావ వర్గాలు పనిచేస్తాయి. పై నేపథ్యంలో ప్రభావ వర్గాల ప్రాధాన్యతను విస్తృత పరిధిలో పరిశీలించాల్సి ఉంటుంది.

## 17.9 ముగింపు

సమకాలీన రాజకీయ జీవనంలో ప్రభావ వర్గాలు అంతర్లీనమై ఉన్నాయి. ప్రభుత్వ కర్తవ్యాలు, బాధ్యతలు పెరుగుతున్న కొద్దీ ప్రభావ వర్గాల ప్రాధాన్యత కూడా పెరుగుతుంది. ఆసక్తుల వ్యక్తీకరణ కూడా అవసరమవుతుంది.

ఆధునిక సంక్షేమ రాజ్యాలలో ప్రభుత్వం పాత్ర నానాటికీ పెరుగుతోంది. సదుపాయాలు, రాయితీలు, సంక్షేమ పథకాలు, ఉపాధి అవకాశాలు, జనసముదాయం కూడా పెరుగుతుంది.

సహజంగానే సదరు ప్రజల ఆసక్తుల వ్యక్తీకరణకు ప్రభావ వర్గాలు బాధ్యత స్వీకరిస్తాయి. ఆసక్తుల వ్యక్తీకరణ ద్వారా సమాజంలోని వివిధ వర్గాలను సమీకరించి ప్రభుత్వం ప్రజావసరాలను, ఆసక్తులను, సంక్షేమాన్ని పట్టించుకొనేటట్లు ప్రభావ వర్గాలు పనిచేస్తాయి. ప్రభావ వర్గాలకు రాజకీయ పక్షాలతో ప్రత్యక్ష సంబంధం ఉండవచ్చు. అనేక రాజకీయ పక్షాలు తమ అనుబంధ సంస్థలను – కార్మిక, విద్యార్థి, మహిళా, యువత, రైతు – కలిగి ఉన్నప్పటికీ – సంబంధిత ప్రభావ వర్గాలు వాటికి కూడా అవసరమవుతాయి. ఎందుకంటే పార్టీ అనుబంధ సంస్థలు వివిధ రాజకీయ పక్షాల ప్రణాళికలకు లోబడి పనిచేస్తాయి. అందువల్ల ప్రభావ వర్గాల అవసరం జనసమీకరణ, మద్దతు, వ్యవస్థ విస్తరణకు, రాజకీయ పక్షాలకు కూడా అవసరం.

– డా. వి. రవీంద్రశాస్త్రి

BRAOU

## 17.10 చదువదగిన పుస్తకాలు


1. Paul R.Brass : Caste, Faction & Party in Indian Politics.
2. Somarajan C.N. : Pressure Groups and Democratic Politics.
3. Jermy J.Richardson : Pressure Groups.


## 17.11 నమూనా పరీక్ష ప్రశ్నలు

I వ్యాసరూప ప్రశ్నలు

1. ప్రభావ వర్గాలు అనగానేమి? వాటి లక్షణములు వివరించుము?
2. ప్రభావ వర్గాలు ఎన్ని రకములు అవి ఏవి?
3. ప్రభావ వర్గాల ప్రాధాన్యత వివరించుము?

II సంక్షిప్త ప్రశ్నలు

1. ప్రభావ వర్గాల ఆవిర్భావాన్ని పేర్కొనుము.
2. ప్రభావ వర్గాల పద్ధతులు వివరించుము.
3. సంస్థాగత ప్రభావ వర్గాల గురించి వ్రాయుము.

# భాగం -18 నాయకత్వ నమూనాలు

విషయక్రమం


| | |
|---|---|
| 18.1 | లక్ష్యాలు |
| 18.2 | పరిచయం |
| 18.3 | నాయకత్వ వికాసం |
| 18.4 | నాయకత్వ ప్రాముఖ్యం |
| 18.5 | నాయకత్వ స్వభావం |
| 18.6 | నాయకత్వ అవతరణ |
| 18.7 | నాయకుడు - అనుచరుల సంబంధం |
| 18.8 | నాయకత్వం - ఆధారాలు |
| 18.9.0 | వివిధ రకాల నాయకత్వం |
| 18.9.1 | రాజకీయ అధికారి |
| 18.9.2 | దౌత్యాధికారి |
| 18.9.3 | సంస్కర్త ఆందోళనకారుడు |
| 18.9.4 | సిద్ధాంతకర్త |
| 18.9.5 | అధికారవాద నాయకత్వం |
| 18.10 | నాయకత్వం - సైద్ధాంతిక చట్రం |
| 18.11 | నాయకత్వం - అధికారం |
| 18.12 | నాయకత్వం - ప్రతీకలు |
| 18.13 | ముగింపు |
| 18.14 | సంప్రదించదగిన పుస్తకాలు |
| 18.15 | మాదిరి పరీక్ష ప్రశ్నలు |


BRAOU

## 18.1 లక్ష్యాలు

ఈ పాఠ్యాంశం చదివిన తరువాత మీరు

★ నాయకత్వాన్ని నిర్వచించి వివరించగలుగుతారు.

★ నాయకత్వ ప్రాముఖ్యతను గుర్తిస్తారు.

★ వివిధ రకాలైన నాయకత్వాలను గురించి తెలుసుకోగలుగుతారు.

## 18.2 పరిచయం

ఆధునిక సామాజిక అధ్యయనాలలో నాయకుడు లేదా నాయకత్వం అధ్యయనం చాలా ప్రాముఖ్యం పొందింది. రాజకీయ సామాజిక ఆర్థిక జీవనంలో వ్యవహారాలను సంఘటితంగా నిర్వహించటంలో నాయకత్వం కీలక పాత్ర

వహిస్తుంది. సామాజిక శాస్త్ర అధ్యయనంలో సాంఘిక సంస్థల అవతరణ, వికాసం మొదలైన వాటిల్లో ఇది అత్యంత ప్రాముఖ్యం పొందింది. ఎందుకంటే ఈ సంస్థల అవతరణలో అవసరమైన చొరవ, మార్గదర్శకత్వం మొదలైన వాటిని నాయకత్వం కల్పిస్తుంది. ప్రాచీన కాలం నుంచి ఆధునిక పారిశ్రామిక సమాజం వరకు మానవ సంస్థల అవతరణలో నాయకత్వం పాత్ర విశిష్టమైనది. కుటుంబ వ్యవస్థ, తెగలు, మతం, ఇతర సంస్థలలో కూడా వాటి వికాసానికి చలనానికి నాయకత్వం అమితంగా దోహదం చేసింది. మధ్యయుగాలలో సైనిక ప్రాబల్యానికి ఆధునిక కాలంలో ఉద్యోగిస్వామ్య పారిశ్రామిక శిష్ట వర్గాల అవతరణకు కూడా నాయకత్వం దోహదం చేసింది.

రాజకీయ రంగంలో కూడా నాయకత్వం అత్యంత కీలక పాత్ర నిర్వహిస్తున్నది. సామాజిక ప్రాతిపదికను అధ్యయనం చేయకుండా నాయకత్వం మూలాలను మనం అర్థం చేసుకోవటం సాధ్యం కాదు. ఉదాహరణకు ప్లేటో తత్వవేత్తలే పాలకులుగా ఉండాలి అన్నప్పుడు ఆయన ఆసక్తి ఆదర్శ రాజ్యంలో ప్రధానంగా నాయకత్వం రూపకల్పనపైనే కేంద్రీకృతమైంది. పాలకులు విజ్ఞాన వంతులై ఉండాలని అప్పుడే మానవ సమాజంలో వివిధ అంశాలను సమగ్రంగా వారు అవగాహన చేసుకోగలుగుతారని సంక్లిష్ట సమస్యలను తమ సునిశిత మేధాశక్తితో పరిష్కరించగలుగుతారని ప్లేటో భావించాడు. 'తత్వవేత్తలే పాలకులు అవ్వాలి' లేదా పాలకులే తత్వవేత్తలు అవ్వాలి అప్పుడే ప్రస్తుత రాజ్యాలకు వాటి రుగ్మతల నుంచి నిష్కృతి లభించదు' అని ప్లేటో సిద్ధాంతీకరించాడు. సమకాలీన ఏథెన్స్ ప్రజాస్వామ్యంలో అవినీతిపరులు అసమర్థులైన పాలకులను అజ్ఞాన ప్రజలు ఎంపిక చేసుకోవటంవల్ల ఏథెన్స్ ప్రాభవం క్షీణించిందని ప్లేటో భావిస్తాడు. అందువల్లనే ఆయన పాలకుడి విజ్ఞతకు దోహదం చేసే సాంఘిక వైజ్ఞానిక వాతావరణాన్ని తన 'రిపబ్లిక్' గ్రంథంలో చర్చించాడు.

ప్లేటో శిష్యుడైన అరిస్టాటిల్ కూడా సామాజిక వర్గాలకు రాజకీయాధికారానికి మధ్యగల సంబంధాన్ని గుర్తించాడు. ప్రజాస్వామ్యంలో ఉన్న విపరీత భావాలను విమర్శించాడు. అయితే కులీన పాలన గుణాన్ని ప్రజాస్వామ్యం గుణాన్ని సంతులితం చేసి ఒక మిశ్రమ రాజ్యాంగాన్ని ఉత్తమ ప్రభుత్వ విధానంగా అరిస్టాటిల్ రూపొందించాడు. ఈ మిశ్రమ ప్రభుత్వ వ్యవస్థ వివిధ సామాజిక వర్గాల సంఘర్షణ పూరితమైన ఆసక్తులను సమన్వయం చేస్తుందని భావించాడు.

BRAOU

## 18.3 నాయకత్వ వికాసం

స్థూలంగా ప్రాచీన కాలంలో కూడా నాయకత్వ అవతరణకు సామాజిక వ్యవస్థ మూలకారణమైంది. ప్రాచీన గ్రీకు యుగం నుంచి ఈ విధంగా ఆధునిక కాలం వరకు రాజనీతి శాస్త్ర అధ్యయనంలో నాయకత్వానికి సంబంధించిన చర్చ కేంద్ర స్థానంలో ఉన్నది. ఇటీవలి కాలంలో రాజకీయ సామాజిక శాస్త్రం ఒక ప్రత్యేక అధ్యయనంగా అవతరించింది. ఈ అధ్యయనంలో నాయకత్వం కీలక పాత్ర వహిస్తున్నది. శిష్ట వర్గాల గురించి మనం చర్చిస్తున్నప్పుడు తప్పనిసరిగా వాటి అవతరణకు దోహదం చేసిన నాయకత్వాన్ని తప్పనిసరిగా ప్రస్తావించవలసి ఉంటుంది.

మాకియవెల్లి, మాక్స్ వెబర్, మిచల్స్ ఇంకా అనేక రాజనీతిశాస్త్ర రచయితల అభిప్రాయంలో నాయకత్వం అంటే సామాజిక వర్గాలపై, సంస్థలపై సమూహాలపై లేదా జాతులపై అధికారం చెలాయించటం. ఈ దృక్కోణంలో పరిశీలించినపుడు అధికారం ఈ కింది మూడు సాధారణ కర్తవ్యాలను నిర్వహిస్తుంది. అవి:

1. సామాజిక సమష్టి ప్రయోజనానికి సంబంధించిన ధ్యేయాలు, ప్రయోజనాలు లేదా లక్ష్యాలను నిర్ణయించడం,

2. నిర్ధారించుకున్న లక్ష్యాల సాధనకు అవసరమైన నిర్మాణాలను రూపొందించడం.

3. సదరు నిర్మాణాల ద్వారా ముందుగా ఎంపిక చేసుకొన్న ప్రయోజనాలను సాధించడం.

రాజకీయ, సామాజిక అధ్యయనాలు వివిధ నిర్మాణాల రూపకల్పనకు ప్రాముఖ్యతనిచ్చాయి, ఎందుకంటే నాయకత్వం

అధ్యయనానికి సంబంధించిన పరిశోధనలను నిర్వహించటానికి నిర్మాణాలు అవసరమైన అనుభవపూర్వక సమాచారాన్ని అందిస్తాయని కొంత మేరకు భావించటం జరిగింది.

పై దృక్పథంతో జరిపిన అధ్యయనాలు నాయకత్వం ప్రాముఖ్యాన్ని నొక్కి వక్కాణిస్తాయి. ఒక సమాజాన్ని ఆంతరంగిక విదేశీయ విభాజిత శక్తుల నుంచి కాపాడటానికి, దాని ముందున్న సవాళ్ళను విజయవంతంగా ఎదుర్కోటానికి, సమాజంలోని వివిధ వర్గాల భిన్నమైన ఆసక్తులను సమన్వయం చేసి సాధ్యమైనంత మేరకు సమైక్యతను నెలకొల్పటానికి, వివిధ సమూహాల మధ్య తరచూ ఏర్పడే సంఘర్షణల తీవ్రతను తొలగించటానికి లేదా కనీస స్థాయికి తగ్గించటానికి నాయకత్వం నిరంతరం ప్రయతిస్తూ ఉంటుంది. ఈ విధంగా చూసినపుడు ఒక సామాజిక వ్యవస్థను యధాతథంగా సాంప్రదాయ వాద దృక్పథంతో కొనసాగించటానికి గాని లేదా విప్లవాత్మకమైన భావాలతో దానిలో సమూలమైన మార్పులు తేవటానికిగాని దోహదపడేది నాయకత్వమే. అందువల్ల ఆదిమ కాలం వరకు వివిధ సమాజాల వికాసం, మార్పులు, సంక్షోభం, క్షీణత మొదలైన దశలన్నిటిలోనూ నాయకత్వం పాత్ర ముఖ్యమైనది. అందువల్ల నాయకత్వం అధ్యయనం ప్రాముఖ్యాన్ని ఏవిధంగానూ మనం తక్కువ అంచనా వేయలేం.

## 18.4 నాయకత్వ ప్రాముఖ్యం

అధికారాన్ని చెలాయించటం అంటే లేదా ఇతరులను ప్రభావితం చేయటం అంటే ఇతరుల ద్వారా తాము అనుకొన్నది చేయించగలగటం. నాయకులు అనేక కార్యకలాపాలలో తమ ప్రయోజనాల సాఫల్యత కోసం నిమగ్నమై ఉంటారు. సమన్వయం చేయటం, నియంత్రణ చేయటం, మార్గదర్శకత్వం వహించటం, జనాన్ని సమీకరించటం మొదలైనవన్నీ నాయకులు నిర్వహిస్తూ ఉంటారు. అనుచరులను ప్రోత్సహించటం వారికి సలహా ఇవ్వటం, సహాయ పడటం శిష్టులను కొన్ని కర్తవ్యాలను నిర్వహించమని ప్రోత్సహించటం కొన్ని లక్ష్యాలను రూపొందించటం మొదలైన వాటన్నిటిలో నాయకుడు నిరంతరం పాల్గొంటాడు.

BRAOU

పైన ప్రస్తావించిన కార్యకలాపాలన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో నాయకులు నిర్వహిస్తారు. తమ, తమ దేశాల ప్రయోజనాల సాధనలో క్రియాత్మకంగా పాల్గొంటూ ప్రాబల్యాన్ని కూడా ఉపయోగిస్తారు. విదేశీ వ్యవహారాల నిర్వహణలో అనేక కీలకమైన నిర్ణయాలను తీసుకొని జాతీయ ఆసక్తులను విస్తరింపచేస్తారు. ఈ సందర్భంలో నాయకులు కొన్ని నూతన భావనలను లేదా సిద్ధాంతాలను కూడా రూపొందిస్తారు.

సామాజిక నిర్మాణానికి సంబంధించిన లక్ష్యాలను, కార్యక్రమాలను నాయకత్వం రూపొందిస్తుంది. నాయకత్వం ద్వారానే సామాజిక వ్యవస్థ తన లక్ష్య సాధనకు పనిచేస్తుంది. నాయకుల నిర్ణయాలు ఒక సమాజంలోని ప్రజల జీవితాలను లేదా సంక్షేమాన్ని విపరీతంగా ప్రభావితం చేస్తాయి. ప్రజా జీవనానికి సంబంధించిన అతి ముఖ్యమైన నిర్ణయాలు వాటి పర్యవసానాలను నాయకత్వం చాలా జాగ్రత్తగా అంచనా వేయవలసి ఉంటుంది. ఎందుకంటే ప్రజాజీవనాన్ని ప్రభావితం చేసే నిర్ణయాలు వాటి పరిణామాలు నాయకత్వం ప్రాబల్యానికి లేదా క్షీణతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదం చేస్తాయి. అంచేత సమాజ వికాసానికి నాయకత్వం అభివృద్ధికి ప్రత్యక్ష సంబంధం ఉంది.

నాయకత్వం అధ్యయనంలో శిష్ట వర్గాల ప్రస్తావన తప్పనిసరి అవుతుంది. సనాతన, ఆధునిక, భూస్వామ్య, ప్రజాస్వామ్య, దృఢ వర్గాల లేదా కుల ప్రాతిపదికపై రూపొందిన సమాజాలలో నాయకత్వానికి శిష్ట వర్గాలకి అవినాభావ సంబంధం తప్పనిసరిగా కనిపిస్తుంది. అరిస్టాటిల్, మాకియవెల్లి మొదలైన తత్వవేత్తల రచనలలో నాయకత్వానికి సంబంధించిన ప్రస్తావన విశేషంగా, విస్తారంగా చోటుచేసుకొంది. దారి తెన్నూ, సుస్థిర లక్ష్యం, ప్రయోజనం, తనంతట తానుగా ఏ నిర్ణయం తీసుకోలేని అశేష జనసామాన్యానికి ఒక స్థిర లక్ష్యాన్ని కల్పించి వారిని ముందుకు నడిపించి ఆ లక్ష్యాన్ని సాధించే దృఢ సంకల్పం ఉన్నా శక్తివంతుడే నాయకుడు అన్న అంశం మాకియవెల్లి స్పష్టంచేశాడు.

## 18.5 నాయకత్వం నిర్వచనం

స్థూలంగా ఇతరులపై ఆధిపత్యం చెలాయించటమే నాయకత్వం అని చెప్పవచ్చు. ఏదైనా ఒక ప్రత్యేక పరిస్థితిలో ఇతరులపై వారిచే తననుకొన్న పని చేయించగలిగే ప్రభావం చూపగలిగే వ్యక్తినే నాయకుడు అంటారు. ఇతరులను ప్రేరేపించి, ప్రోత్సహించి వారిచే పనులను చేయించగలవాడే నాయకుడు.

నాయకత్వం అంతర్ సంబంధాల వ్యవస్థను ఏర్పాటు చేస్తుంది. అందువల్ల నాయకత్వం సంస్థ నిర్మాణం, ప్రభావాలను సూచిస్తుంది. డేవిడ్ హిక్స్ అభిప్రాయంలో ఒక సంఘటిత సమూహం ద్వారా కొన్ని నిర్దిష్ట ప్రయోజనాల సాధనకోసం వారిని ప్రోత్సహించి, ప్రభావితం చేసి పనిచేయించగలిగే ప్రక్రియే నాయకత్వం. ఈ నిర్వచనం ప్రకారం నాయకత్వం సంస్థ నిర్మాణంతో ముడిపడి ఉంటుంది. దీనినిబట్టి నాయకత్వానికి ఈ కింది అంశాలు అవసరమవుతాయి.

1. ఒక సమూహం (కనీసం ఇద్దరు లేదా ముగ్గురు వ్యక్తులు)

2. ఒక సామూహిక లక్ష్యం (Common task)

3. బాధ్యతల వైవిధ్యీకరణ (Differentiation of responsibility)

నాయకత్వాన్ని ప్రభావితం చేయడానికి అనేక ఇతర సమూహాలు, పరిస్థితులకు సంబంధించిన కారకాలు కూడా ఉండవచ్చు. అయితే నాయకత్వం అవతరణకు కొన్ని కనీస పరిస్థితులుండాలి. వాటిలో మొదటిది: ఒక సామూహిక లక్ష్య సాధనకు ఒక సమూహం అంటూ ఉండాలి. ఈ సమూహం తన లక్ష్య సాధనలో ఇతర సమూహాల కంటే భిన్నంగా ఉంటుంది. అలాగే సమూహంలోని వ్యక్తులందరూ ఒకే కర్తవ్యాన్ని నిర్వహించరు. అందరూ ఒక పనిని చేసేవారైతే అప్పుడు నాయకత్వం అవతరణ ఏర్పడదు. నాయకత్వం అవసరం కూడా ఉండదు. సమూహంలోని సభ్యులకంటే భిన్నంగా ఉంటూ వారిని ఒక లక్ష్యసాధనకు ప్రభావితం చేసే వ్యక్తే నాయకుడు. వ్యక్తులను సంఘటితం చేసి వారిని లక్ష్యసాధనకు ప్రయత్నింపచేయడం, వారు లక్ష్యాన్ని సాధించడమే నాయకత్వం అని రాల్ఫ్ స్టాగ్‌డిల్ (Ralph M Stog Dill) భావిస్తాడు.

BRAOU

## 18.6 నాయకత్వం అవతరణ

ఎక్కడైనా ఇద్దరు లేదా ముగ్గురు వ్యక్తులు ఒక సమూహంగా ఏర్పడితే అందులో నాయకత్వం తప్పకుండా ఉద్భవిస్తుంది. ఒక పదవిలో కొనసాగే వ్యక్తిగా నాయకుడిని మనం చూడవచ్చు. కొన్ని పదవుల్లో కొనసాగుతూ నాయకత్వ లక్షణాలను వ్యక్తంచేసే వ్యక్తులను నాయకులు అని బ్రౌన్ (J.F.Brown) భావిస్తారు. అంతేకాకుండా ఇతరుల ప్రవర్తననూ, ఆలోచనలనూ ప్రభావితం చేస్తూ వారిని కొన్ని చర్యలకై ప్రోత్సహించే వ్యక్తిని కొన్ని లక్ష్యాల సాధనకు నాయకుడు అనవచ్చు.

పై వివరణను అనుసరించి ఒక ప్రత్యేక మార్గంలో పయనిస్తూ ఇతరులను తనను అనుసరించేలా ప్రభావితం చేయగలిగే వ్యక్తే నాయకుడు అనిచెప్ప వచ్చు. ఒక పదవి, హోదా లేదా గౌరవం, ప్రతిష్ట, అధికారం కలిగి ఇతరులను తన చర్యల ద్వారా, మాటల ద్వారా, ప్రకటించిన లక్ష్యాల ద్వారా ప్రభావితం చేయటం కూడా నాయకత్వంలో అతి ముఖ్యమైన భాగంగా మనం గుర్తించవచ్చు. ఒక సమూహాన్ని నిర్దేశిస్తూ, దానిని సంఘటితం చేసి, నియంత్రణ చేస్తూ, ఆ సమూహం సభ్యుల ప్రవర్తనను ప్రభావితం చేస్తూ వారిని కొన్ని లక్ష్యాల సాధనకు పనిచేయటానికి ప్రోత్సహించడం నాయకుల లక్షణాలుగ చెప్పవచ్చు.

క్లుప్తంగా చెప్పాలంటే ఇతరులకంటే భిన్నంగా ఉంటూ వారిని ప్రభావితం చేస్తూ తన వ్యక్తిగత లక్షణాల ద్వారా వారిని కొన్ని చర్యలకు శాసించే వ్యక్తే నాయకుడనవచ్చు. నాయకుడు ఇతరులకు నాయకత్వం వహిస్తాడు. వారిలో ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తాడు. వారికి మద్దతునిస్తాడు. అధికారాన్ని చెలాయించే పదవిని నిర్వహిస్తూ వారిని కొన్ని చర్యలకు, కొన్ని లక్ష్యాల సాధనకు ప్రోత్సహిస్తాడు. అధికారం, హోదా కలిగి పదవులను పంపిణీచేసే స్థితిలో ఉంటాడు. ప్రతీకలు, ఆసక్తుల వ్యక్తీకరణ, లక్ష్యాల ప్రకటన, సాంస్కృతిక సంబంధిత ఇతర ప్రక్రియల ద్వారా నాయకుడు అనుచరులను ప్రభావితం చేస్తాడు. సిద్ధాంతాలు కూడా అతనికి ఈ సందర్భంలో ఉపయోగపడతాయి. తన సమూహం, అనుచరుల ఆసక్తులను వ్యక్తీకరించటం ద్వారా వారిని సంఘటితం చేయటానికి ప్రయత్నిస్తాడు. తన నాయకత్వానికి అవసరమైన మద్దతు వ్యవస్థను నిర్మించుకొంటాడు. అనుచరుల సమస్యలను పరిష్కరించటానికి కృషిచేస్తాడు.

## 18.7 నాయకుడు – అనుచరుల సంబంధాలు

తన సమూహంలో లేదా సంస్థలో నాయకుడు కీలకమైనే స్థానంలో ఉంటాడు. నాయకుడు లేనప్పుడు అతని అనుచరులు చెల్లా చెదరు కావచ్చు. లేదా అనేక మార్గాలుగా విడిపోవచ్చు. వారి మధ్య ఎటువంటి సమన్వయం ఉండదు. అయితే నాయకుడు తిరిగి ప్రత్యక్షమైనప్పుడు పరిస్థితి పూర్తి మార్పు కు లోనవుతుంది. చిన్నచిన్న ముఠాలు పెద్ద సమూహంగా రూపొందుతాయి. తిరిగి వివిధ ముఠాల మధ్య సంఘర్షణలు ప్రారంభమై అవగాహన ఏర్పడి అది ఒక నాయకుని ఆధ్వర్యంలో పునరేకీకరణ చెందుతాయి. అనుచరులు మార్గదర్శకత్వం కోసం, సలహా కోసం, కార్యక్రమం కోసం నాయకుడిని అనుసరిస్తారు. వారిలో అతడు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాడు. వారిని నిర్దేశిస్తాడు. ఫలితంగా తన సమూహంలో ఏమి జరుగుతున్నదో ఇతరులకంటే అతడు ఎక్కువ తెలుసుకొని ఉండాలి.

నాయకులను మూడు రకాలుగా వర్గీకరించవచ్చు. మొదటి రకం జనాంతిక నాయకులు. వీళ్ళు మొత్తం జనం (Crowd emissary) ఆలోచనకు ప్రాతినిధ్యం వహిస్తారు. వారిని గురించి నిరంతరం ఆలోచన చేస్తారు. రెండవ రకం జనాన్ని ప్రభావితం చేసేవారు ఉంటారు. (Crowd compellers) వీరు తమ చర్యల ద్వారా, మాటల ద్వారా జన సముదాయాన్ని ప్రభావితం చేస్తారు. వారు తమ మీద ఆధారపడేటట్లు ప్రవర్తిస్తారు. రాజకీయ ఆందోళన కారులు, మతపునరుద్ధరణ వాదులుపై కోవ కిందికి వస్తారు. మరికొంత మంది నాయకులు జనసమూహం ఉద్వేగాలను రెచ్చగొడ్తారు. కొన్ని అమూర్తభావాలను వ్యక్తీకరించి ప్రజలకు జరుగతున్న అన్యాయాలను వివరిస్తూ జనాన్ని రెచ్చగొడ్తారు. తద్వారా వారిని కొన్ని చర్యలకు ఉసిగొల్పుతారు.

బార్లెట్ (F.C.Barlett) అనే బ్రిటిష్ మనో విజ్ఞాన శాస్త్రవేత్త అధ్యయనం ప్రకారం సంస్థాపరమైన ప్రాబల్యం వహించే, ప్రోత్సహించే పద్ధతుల్లో మూడు రకాల నాయకులు ఉంటారు. సంస్థాపరమైన నాయకులు కార్యనిర్వాహకుల రూపంలో మనకు కనిపిస్తారు. ప్రాబల్యం వహించే నాయకులు మత, సామాజిక తదితర సాంప్రదాయక సంస్థల ద్వారా కట్టుబాట్లు, ఆచారాలు, వ్యవహారాల ద్వారా అనుచర వర్గాన్ని శాసిస్తారు. వీరు తమ సమూహాలపై విశేషమైన ప్రభావాన్ని కలిగి ఉంటారు. దృఢమైన విశ్వాసం నిర్దిష్టమైన లక్ష్యాలు కలిగి ఉన్న ఈ నాయకుల నుంచి అనుచరుల మార్గదర్శకత్వం కోసం, ప్రోత్సాహం కోసం ఎదురుచూస్తూ ఉంటారు. ప్రోద్బలం ద్వారా అనుచర వర్గాన్ని కొన్ని చర్యలను ప్రోత్సహించేటువంటి నాయకత్వం తీవ్రమైన చర్యలకు అంగీకారం సాధారణంగా ఇవ్వదు. కొన్ని సూచనలను, సలహాలను ఇస్తూ వాటికనుగుణంగా అనుచర వర్గాన్ని వ్యవహరించమని కోరుతుంది. రాజకీయ, మత రంగాలలో ఈ తరహాకు చెందిన నాయకులు కనిపిస్తారు. వీరు ఎక్కువగా ప్రజానీకానికి ఎటువంటి బద్ధతను చూపించరు. వారు ఎక్కువగా సామాన్య ప్రజల హక్కులను ప్రస్తావించారు. సామాజిక వ్యవస్థలోని విప్లవాత్మక అంశాలను నొక్కివక్కాణిస్తారు.

BRAOU

## 18.8 నాయకత్వం - ఆధారాలు

నాయకత్వంపై ఇంతవరకు చేసిన అనేక అధ్యయనాల ప్రకారం అది వివిధ ఆధారాల ద్వారా వ్యక్తమౌతుంది. ఒక ప్రత్యేక పరిస్థితి లేదా కాలంలో నాయకుడు ఉద్భవించవచ్చు. నాయకత్వానికి విద్యకు కూడా సన్నిహిత సంబంధం ఉన్నది. బ్రిటీష్ వాళ్ళు మన దేశాన్ని పరిపాలిస్తున్న కాలంలో ఆంగ్ల విద్యాభ్యాసం ద్వారా భారతీయులలో రాజకీయ చైతన్యం అంకురించింది. తద్వారా ప్రభావితులైన జాతీయోద్యమపు తొలి నాయకత్వం మత సామాజిక రంగాలలో అవసరమైన సంస్కరణలు తీసుకువచ్చి భారతీయులలో జాతీయతా భావం విస్తృతం చేయటానికి, వారిని జాగృతం చేయటానికి ప్రయత్నించింది. ఈ సందర్భంలో ఉన్నత మధ్య తరగతి వర్గం నుంచి నాయకత్వం భారత జాతీయోద్యమంలో అవతరించింది.

సామాజిక హోదా పరపతి నాయకత్వం ఆవిర్భావానికి ఎదుగుదలకు చాలా ముఖ్యమైన ఆధారాలు అనేక సందర్భాలలో సామాజికంగా ఉన్నత స్థాయిలో ఉన్న సమూహం లేదా వర్గం నుంచి నాయకులు ఉద్భవించటం జరుగుతుంది. ఉదాహరణకు భారత జాతీయోద్యమంలో వివిధ నాయకులు సాంప్రదాయిక కులాలు వర్గాల నుంచి ఆవిర్భవించారు. మహారాష్ట్రలో ముఖ్యంగా బ్రాహ్మణ కులం నుంచి జాతీయోద్యమంలోకి అనేకమైన నాయకులు వచ్చారు. ఆంగ్ల విద్యాభ్యాసం, ఉన్నత కులాలు, శిష్టవర్గం, పాశ్చాత్యీకరణ, నాగరికీకరణ మొదలైనవి. నాయకత్వం ఆవిర్భావానికి దోహదం చేశాయి. బ్రిటీష్ వారి హయాంలో భారతదేశంలో ఉన్న సామాజిక, ఆర్థిక పరిస్థితులు పైన పేర్కొన్న వర్గాల నుంచి నాయకులు ఏర్పడటానికి దోహదం చేశాయి. వీరి ప్రాబల్య స్థితికి వారికి ఉన్న భూ సంపద కూడా చాలా వరకు దోహదం చేసింది. భూస్వామ్య నేపథ్యం నుంచి జాగీర్దారులు, జమీందారులు, దేశ్‌ముఖ్‌లు, గ్రామీణ ప్రాంతాలలో ప్రజాజీవనంపై విస్తారమైన పలుకుబడి ప్రాబల్యం చెలాయించగలిగారు.

వాక్చాతుర్యం నాయకత్వం అభివృద్ధికి మనోవైజ్ఞానికంగా దోహదం చేస్తుంది. వాక్పటిమ ద్వారా జనసముదాయాన్ని ఆకర్షించటం తాను చెప్పదల్చుకుంది తిరుగులేని విధంగా ప్రజల మనస్సుకు హత్తుకు పోయేలా చెప్పగలగటం నాయకత్వానికి ఆత్మ విశ్వాసం, హుందాతనం అధికం చేస్తాయి. ఎటువంటి పరిస్థితిలోనైనా ఒక సమూహం కోర్కెలను వాక్చాతుర్యంతో వ్యక్తీకరించి వారి మద్దతును నాయకుడు సంపాదించుకోగలుగుతాడు.

పైన చర్చించిన అంశాలతో పాటు నాయకత్వం అభివృద్ధికి విస్తారంగా జనాకర్షణ శక్తి కూడా ఉపయోగపడుతుంది. నిజానికి మిగతా అంశాలకంటే నాయకత్వం పెరుగుదలకు జనాకర్షణ శక్తి అత్యంత ప్రబలమైన ఆధారమని చెప్పవచ్చు. సమకాలీన కాలంలో మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ, యం.జి.రామచంద్రన్, జాన్ కెనడీ, మార్టిన్ లూథర్ కింగ్, నెల్సన్ మండేలా మొదలైన వారిని జనసమ్మోహన నాయకులుగా పేర్కొనవచ్చు. వీరికి అశేష జనసామాన్యంపై విశేషమైన ప్రాబల్యం ఉండేది. మాక్స్ వెబర్ కూడా జనాకర్షణ శక్తి, వ్యక్తిత్వం నాయకత్వపు ముఖ్యాధారాలని భావిస్తాడు.

నాయకత్వం అవతరణకు ఆర్థిక స్థితి లేదా వర్గ నేపథ్యం కూడా దోహదం చేస్తుంది. సమాన ఆర్థిక ఆసక్తులు నాయకత్వం అవతరణకు ఉపకరిస్తాయి. భూస్వామ్య పెట్టుబడిదారీ శ్రామిక వర్గాలు నాయకుల ఆవిర్భావానికి దోహదం చేస్తాయి. ఇంగ్లాండ్‌లో ఉదాత్త విప్లవం అనంతరం భూస్వామ్య వర్గం స్థానంలో ఆవిర్భవించిన నూతన సముద్రాంతర వ్యాపార వర్గానికి ఒలివర్ క్రాంవెల్ నాయకత్వం వహించాడు. ఇతని నాయకత్వంలో ఈ నూతన వర్గం యధాతథస్థితిని కొనసాగించకోరే భూస్వామ్య వర్గాన్ని సవాలు చేసింది. ఫలితంగా స్టూవర్ట్ వంశ నిరపేక్షాధికార పీఠం కదలనారంభించింది. అదేవిధంగా భూస్వామ్య వర్గం క్షీణత వ్యాపార వర్గం అవతరణ బూర్జువా సమాజం ఆవిర్భావాలకు ఫ్రెంచ్ విప్లవం దోహదకారి అయిందని భావించటం జరిగింది. ఫ్రెంచ్ విప్లవంలో 18వ శతాబ్దపు ఫ్రెంచ్ సమాజంలోని మధ్య తరగతి వర్గాల ఆసక్తులకు ప్రతీకగా నెపోలియన్ నాయకత్వాన్ని వర్ణిస్తారు.

BRAOU

మతం కూడా నాయకత్వం అభివృద్ధికి ఒక ముఖ్యమైన ఆధారం. అనేక ఇస్లామిక్ దేశాల ఆవిర్భావం దీనికి ఉదాహరణగా చెప్పవచ్చు. ఇస్లామిక్ దేశాలలో పునరుద్ధరణ వాదం, మత మౌఢ్య వాదం విపరీతంగా వ్యాప్తి చెందుతున్నాయి. వీటి ప్రాబల్యం అనేక గల్ఫ్ దేశాలలో, పశ్చిమ ఆసియా రాజ్యాలలో మనం చూడవచ్చు. 1978లో ఇరాన్‌లో అయతుల్లా ఖుమైనీ నాయకత్వంలో జరిగిన ఇస్లామిక్ విప్లవం ఆ దేశంలో మతమౌఢ్యవాదం ప్రాబల్యం సుస్థిరం చేసింది. అంతవరకు పాశ్చాత్యీకరణ పట్ల, ఆధునికీకరణ పట్ల విశేషమైన ఆదరణ చూపిన ఇరానీయులు షా ఆఫ్ ఇరాన్‌ను కూలదోసి అధికారంలోకి వచ్చిన అయతుల్లా ఖుమైనీ పట్ల విధేయత, విశ్వాసాలను చూపిస్తూ మత మౌఢ్యవాదం వైపు తమ దృష్టిని మరపించారు.

మతంలాగే ఉపజాతి వాదం కూడా నాయకత్వం ఆవిర్భావానికి దోహదం చేస్తుంది. సామాజిక స్థితిగతులు ఉపజాతి వాదాన్ని బలపరుస్తాయి. ఉపజాతీయత భావాన్ని ఆలంబనగా చేసుకొని జనాన్ని సమీకరించటానికి అనేక ఉద్యమాలు ఏర్పడతాయి. ఈ ఉద్యమాల నుంచి నాయకత్వం ఆవిర్భవిస్తుంది. 1940, 1950 దశకాలలో ద్రవిడ ఉద్యమం తమిళనాడులో రామస్వామి నాయకర్ నాయకత్వం ప్రారంభ కాలంలో ద్రవిడస్థాన్ ఏర్పడాలని ఉద్యమించింది. ఉత్తరాది వారు ఆర్యులని, దక్షిణాది వారు ద్రవిడులని ఉత్తర, దక్షిణ భారతదేశం మధ్య పోలికలు, ఎటువంటి సారూప్యత లేవని వాదించింది. డి.యం.కె. ప్రధానంగా తమిళ సంస్కృతి, చరిత్ర, వారసత్వం, సామాజిక నేపథ్యం నుంచి బలాన్ని పుంజుకొంది. అదేవిధంగా ఈశాన్య ప్రాంతంలో గూర్ఖా జాతీయ విమోచనా ఉద్యమం, నాగానేషనల్ కౌన్సిల్ ఫిజో నాయకత్వంలో లాల్ డెంగా నేతృత్వంలో మిజో నేషనల్ ఫ్రంట్ ఆవిర్భవించి పశ్చిమ బెంగాల్, అస్సాం రాష్ట్రాలలో ఉపజాతి ఉద్యమాలను ఉధృతం చేశాయి. దక్షిణాఫ్రికాలో ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ నెల్సన్ మండేలా నాయకత్వానికి దోహదం చేసింది. అక్కడ శ్వేతజాతి అల్పజన పాలనకు వ్యతిరేకంగా స్థానిక నల్లవారిని ఉద్యమించటానికి జాతి విచక్షణ విధానాన్ని తొలగించటానికి సౌత్ ఆఫ్రికా రాజకీయ ప్రక్రియలో అధిక సంఖ్యలో ఉన్న నల్లజాతి ప్రజలు యథేచ్ఛగా పాల్గొనడానికి అధికారాన్ని పంచుకోడానికి నిర్విరామంగా గత నాలుగు దశాబ్దాలుగా మండేలా నాయకత్వంలో నిర్విరామ ఉద్యమం కొనసాగుతున్నది.

BRAOU

1970 దశకంలో విజాతీయుల ఏరివేత అనే ఒక కార్యక్రమంలో అస్సాంలో విద్యార్థులు పెద్ద స్థాయిలో ఉద్యమాన్ని నిర్వహించారు. అఖిల అస్సాం విద్యార్థి పరిషత్ ఏర్పడింది. అస్సాంలోకి చొచ్చుకువచ్చిన బంగ్లాదేశీయులను తిరిగి వారి స్వదేశానికి పంపించి వేయాలని అస్సాంలో నివశిస్తున్న బెంగాలీ, బీహారీయులకు వ్యతిరేకంగా కూడా అస్సాం విద్యార్థి సంఘం పెద్ద ఎత్తున ఉద్యమించింది. ఈ ఉద్యమం నుంచి అస్సాం గణపరిషత్ అనే ప్రాంతీయ పార్టీ ప్రఫుల్లకుమార్ మహంతి నాయకత్వంలో అవతరించి అస్సాం అసెంబ్లీ ఎన్నికలలో విజయవంతంగా పోటీచేసి కొంతకాలం అధికారాన్ని చెలాయించింది. అదేవిధంగా 1969లో ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడిన ప్రత్యేక తెలంగాణా ఉద్యమం 1972– 73 సం.లలో జరిగిన 'జై ఆంధ్రా' ఆందోళన కొందరు నాయకులను సృష్టించాయి. మల్లికార్జున్, మదన్‌మోహన్ మొదలైన ప్రస్తుత రాజకీయ వేత్తలు ప్రత్యేక తెలంగాణా ఉద్యమం నేపథ్యం నుంచి వచ్చినవారే.

పైన ప్రస్తావించిన అంశాలను బట్టి నాయకత్వం ఆవిర్భావానికి దోహదం చేసే ఆధారాలు చాలా విస్తృతమైనవని చెప్పవచ్చు. నాయకత్వం ఆవిర్భవించడానికి ఈ విధంగా బహుముఖ ఆధారాలు దోహదం చేస్తాయి. వీటిలో కొన్ని నాయకత్వం అవతరణ, ప్రాబల్యం కొనసాగింపులకు దీర్ఘకాలికంగా పనిచేసేలా ఉంటాయి. మరికొన్ని తాత్కాలికమైన ఆధారలుగానే ఉండిపోతాయి. అయితే పై ఆధారాలన్నీ కూడా రాజకీయ ప్రక్రియలో అంతర్భాగం అవుతాయి. రాజకీయ పక్షాల ఏర్పాటుకు వాటి ప్రాబల్య విస్తరణకు ఇవి దోహదం చేస్తాయి. వివిధ ప్రత్యామ్నాయ రాజకీయ పక్షాలు సామాజిక వర్గాల ఆవిర్భావానికి వివిధ ఆధారాల ద్వారా ఆవిర్భవించిన నాయకత్వం ఉపకరిస్తుంది.

సైద్ధాంతికంగా చూసినపుడు కూడా సాంప్రదాయిక, ఉదారవాద, మతతత్వ, లౌకిక నాయకత్వాలు కనిపిస్తాయి. అలాగే అభివృద్ధి కాముక, అభివృద్ధి వ్యతిరేక ఆలోచనా దృక్పథం ఉన్న నాయకత్వాలు కూడా వాటి వాటి సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక నేపథ్యం ద్వారా ప్రభావితం చెంది ప్రజాజీవనాన్ని శాసిస్తూ ఉంటాయి.

ఈ విధంగా నాయకత్వం రకరకాల లక్షణాలు, ప్రత్యేక పరిస్థితులు తదితర ఆధారాల నుంచి ఏర్పడుతుంది. వీటిలో కొన్ని దీర్ఘకాలిక ప్రాతిపదికపై వుంటె, మరికొన్ని తాత్కాలికంగా ఉపకరిస్తాయి. అయితే చిట్టచివరకు ఇవన్నీ కూడా రాజకీయ ప్రక్రియలో భాగం అవుతాయి. వ్యవస్థాపిత రాజకీయ పక్షాలలో చేరిపోవడమో లేదా ప్రస్తుత మున్న రాజకీయ పక్షాలలో కాకుండా మరొక నూతన రాజకీయపక్షంగా ఆవిర్భవించడానికి తోడ్పడతాయి.

## 18.9.0 వివిధ రకాల నాయకత్వం

నాయకత్వం ఒక విశాల దృక్పథంతో కూడిన భావన. ఇది అనేక పాత్రల ద్వారా వ్యక్తమవుతుంది. వాటిని కింది విధంగా చర్చించవచ్చు.

### 18.9.1 రాజకీయ అధికారి

రాజకీయ వేత్తలు అధికారంలోకి రావటం ప్రజాస్వామ్య వ్యవస్థలో అంతర్భాగం. పంచాయతీ సర్పంచ్‌గాను, మునిసిపల్ చైర్మన్‌గాను, జిల్లా పరిషత్ అధ్యక్షుడుగానూ, రాష్ట్ర మంత్రిగాను లేదా ముఖ్య మంత్రిగాను రాజకీయ వేత్తలు ప్రజాస్వామ్య ప్రక్రియలో ఉన్నత పదవులను అధిరోహించి అధికారాన్ని చెలాయిస్తారు. ఈ విధంగా వారు ప్రభుత్వ యంత్రాంగంతో సన్నిహిత సంబంధం ఏర్పరుచుకొంటారు. అయితే రాజకీయ వేత్తలు అధికారం కోసం పరస్పరం పోటీ పడటంవల్ల ప్రజలలో పలుకుబడి సంపాదించుకోడానికి, ఎన్నికలలో వారి మద్దతు పొందడానికి ప్రభుత్వ యంత్రాంగం పై కూడా తరుచూ తమ నియోజక వర్గాల మద్దతు దారుల కోసం పనులు చేయించుకోవటంలో ఒత్తిడి తెస్తారు. స్థానిక అధికారులను తమ చెప్పుచేతలలో ఉంచుకోడానికి ప్రయత్నిస్తారు. అయితే అధికారంలోకి వచ్చిన తరవాత విప్లవాత్మకమైన మార్పులు తీసుకొని రావటానికి వారు యథాతథస్థితినే కొనసాగించటానికి ఇష్టపడతారు.

BRAOU

### 18.9.2 దౌత్యాధికారి

దౌత్యవేత్తలకు ప్రధానంగా అంతర్జాతీయ సంబంధాలతోనే ప్రమేయం ఉన్నప్పటికీ వివిధ సమూహాలు, ప్రభుత్వాల పరస్పర వైరుధ్య ఆసక్తులను గమనించి మెలకువతో వ్యవహరించాల్సి ఉంటుంది. అందువల్ల వారు స్వదేశంలో కూడా వివిధ కార్యకలాపాల నిర్వహణలో నాయకత్వ లక్షణాలు సంతరించుకొని ఉండాలి.

సాధారణంగా దౌత్యవేత్తలు తమ ప్రభుత్వ విధానాలకనుగుణంగా వ్యవహరిస్తారు. తమ కర్తవ్యాలు నిర్వహిస్తారు మామూలుగా అధికారంలో ఉన్న రాజకీయ పక్షాలతో వారికి సన్నిహిత సంబంధం ఉంటుంది. అయితే తాను వ్యవహరించే పరిస్థితులను బట్టి తాను సంప్రదించే ఇతర ప్రభుత్వ నాయకులను బట్టిం అతడు అనేక సందర్భాలలో వ్యవహరించాల్సి ఉంటుంది. ఇటువంటి కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో దౌత్యవేత్త తన నాయకత్వ నైపుణ్యతను ప్రదర్శించాల్సి ఉంటుంది. కొన్ని సవాళ్ళు ఎదుర్కోవాల్సి వచ్చినప్పుడు తన శక్తి సామర్థ్యాలను, వ్యక్తిత్వాన్ని ప్రదర్శించాల్సి ఉంటుంది. ఓపిక, సహనం దౌత్యవేత్త బహిర్గత ముఖ్య లక్షణాలు. అతడు ఎప్పుడూ 'కాదు' అనడు. అతడు 'అవును' అంటే 'బహుశా' అని, 'బహుశా' అంటే కాదు అని అర్థం. కాదు, కుదరదు అని నిర్మొహమాటంగా చెప్పేవ్యక్తి దౌత్యవేత్త కాలేడు.

### 18.9.3 సంస్కర్త, ఆందోళనకారుడు

సాధారణంగా ప్రజాస్వామ్య వ్యవస్థలో నాయకులు సంస్కరణ పథాన్ని అనుసరిస్తారు. నాయకుడు మనో వైజ్ఞానికంగా ఆదర్శవాదిగా కనిపిస్తాడు. సమాజంలో ఏవైనా మార్పులు తీసుకొని రావాలనేటటువంటి ఆయన ఆలోచనలు చాలావరకు విలువల పరంగా అధిక సంఖ్యాకులు ఆమోదించే విధంగా వ్యక్తమవుతూ ఉంటాయి. మౌలికంగా

సమాజంలోని ఆచార వ్యవహారాలు అధిక సంఖ్యాకుల భావాలకు వ్యతిరేకంగా సంస్కర్త వ్యవహరించడు.

అయితే ఆందోళనకారుడు సంస్కర్త మాదిరి ఉండడు. ఆందోళనపరమైన ఉద్యమాలకు నాయకత్వం వహించే వాడు తన భావాలను అవి అధిక సంఖ్యాకుల అభిప్రాయాలకు భిన్నంగా ఉన్నప్పటికీ – నిర్మొహమాటంగా వ్యక్తంచేయడానికి, అమలుపరచడానికి ఏమాత్రం వెనకాడడు. వ్యక్తంచేసే అభిప్రాయాలు మౌలికమైన మార్పులను కోరే విధంగా ఉంటాయి. వాటి కనుగుణంగానే ప్రజలను సంఘటితం చేసి తమ లక్ష్య సాధనకై ఉద్యమించేటట్లు వారికి నాయకత్వం వహిస్తారు.

## 18.9.4 సిద్ధాంత కర్త

నాయకులలో కొంతమంది సిద్ధాంత కర్తలు కూడా ఉంటారు. వారు ప్రస్తుత వ్యవస్థను ఏకబద్ధంగా విశ్లేషించి వాటి లోపాలను విమర్శనాత్మకంగా పరిశీలించి ప్రత్యామ్నాయ వ్యవస్థలను, విధానాలను, పద్ధతులను ప్రతిపాదిస్తారు. అయితే సిద్ధాంత కర్తలందరికీ ఒకేరకమైన దృక్పథం ఉండదు. కొందరు కేవలం సిద్ధాంతపరమైన రాద్ధాంతానికే ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తారు. ఉదాహరణకు, భారత కమ్యూనిస్టులు, వామపక్ష వాదులు వారు తరుచు చేసే విశ్లేషణ, ఉపయోగించే పదజాలం సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండవు. కాలదోషం పట్టిన భావాలను పట్టుకొని వేలాడుతారే కానీ సమకాలీక, సమీప సమాజ పరిస్థితులను అంచనా వేయటానికి, వాటి కనుగుణంగా విధానాలను, వ్యూహాలను, పద్ధతులను రూపొందించడానికి ఏమాత్రం ప్రయత్నించరు.

## 18.9.5 అధికార వాద నాయకత్వం

నాయకత్వాన్ని విశ్లేషించేటప్పుడు ప్రజాస్వామ్య, అధికార వాద నాయకత్వాలను స్పష్టంగా వివరించటం అవసరం. ప్రజాస్వామ్య నాయకత్వం విస్తృతమైన మద్దతు ప్రాతిపదికపై, ముందుగా సర్వసమ్మతి ద్వారా అంగీకరించిన కొన్ని సాధారణ విధానాలకు, లక్ష్యాలకు కట్టుబడి వ్యవహరిస్తుంది. భిన్న ఆసక్తుల మధ్య సాధ్యమైనంత వరకు సామరస్యాన్ని నొక్కి వక్కాణించి సమాన భావాలకు ప్రాముఖ్యమివ్వడానికి ప్రయత్నిస్తుంది. మరో మాటలో చెప్పాలంటే విభేదాల కంటే ఏకాభిప్రాయ సాధనకు ప్రయత్నిస్తుంది. నిర్ణయం తీసుకోవడంలో సువిశాల ప్రాతిపదికపై జనబాహుళ్య మద్దతును సంపాదించడానికి ప్రయత్నిస్తుంది. అలాకాకుండా అధికారవాద నాయకత్వం తాను నిర్ణయించుకొన్న లక్ష్యాలను అమలుపరచడానికి స్థిరంగా ప్రయత్నిస్తుంది. తన విధానాలను, సిద్ధాంతాలను, పద్ధతులను వ్యతిరేకించేవారిని సహనంతో తమవైపు తిప్పుకోటానికి ప్రయత్నించదు. కాగా వ్యతిరేకతను తీవ్రంగా తీసుకొని దాన్ని అణిచివేయడానికి ప్రయత్నిస్తుంది.

అయితే అధికార వాద నాయకత్వం తాను కల్పించే ప్రయోజనాలు, తనకున్న శక్తి సామర్థ్యాలపైనే విజయవంతం కాగలుగుతుంది. ఎందుకంటే నియంత కూడా కేవలం హింసాకాండ ద్వారా తన ఆధిపత్యాన్ని నిలుపుకోలేడు. ప్రజల ఆకాంక్షలకు పూర్తిగా వ్యతిరేకంగా వ్యవహరించలేడు. అందువల్ల కొన్ని మనో వైజ్ఞానిక పద్ధతులను అనుసరించి జనం మద్దతును సమీకరించడానికి ప్రయత్నిస్తాడు. వ్యతిరేకతను అణిచివేస్తూనే ఆ అణిచివేత ప్రజాప్రయోజన సంబంధమైనదని ప్రజలలో విశ్వాసం కలిగించటానికి ప్రయత్నిస్తాడు. తన అధికారాన్ని నిలబెట్టుకోడానికి 1975లో శ్రీమతి ఇందిరాగాంధీ అంతరంగిక అత్యవసర పరిస్థితిని ప్రవేశపెట్టింది. స్వపక్ష, విపక్షాలలోని తన వ్యతిరేకులను నిర్బంధించింది. అయితే సర్వత్ర హింస, అరాచకం ప్రబలటంవల్ల క్రమశిక్షణ నెలకొల్పటానికి అంతరంగిక అత్యవసర పరిస్థితిని ప్రకటించామని, బలహీన వర్గాల అభ్యుదయానికి 20 సూత్రాల ఆర్థిక పథకాన్ని నాటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ ప్రవేశపెట్టారు.

ఈ సందర్భంలో తన అధికారాన్ని నిలుపుకోడానికి అధికార వాద నాయకులు తన మద్దతుదారులలో భయం అభద్రతాభావం కల్పిస్తారని, అనేక సంకుచిత విశ్వాసాలను తన అధికార పీఠాన్ని పదిలపరచుకోటానికి ఉపయోగించుకొంటాడని కాటెల్ వ్యాఖ్యానించాడు.

BRAOU

అధికారవాద నాయకుడు ఎప్పుడూ తమ సమూహంలో తానే కేంద్రబిందువుగా ఉంటాడు. నాయకత్వం చుట్టూ ప్రధాన ఆకర్షణ ఉంటుంది. తన మాటను శాసనంగా అమలుపరచటానికి ప్రయత్నిస్తాడు. వ్యతిరేకించిన వారిని భయభ్రాంతులను చేస్తాడు.

ప్రజాస్వామ్య నాయకత్వం ఇలాకాకుండా ప్రతి అంశాన్ని విస్తృతంగా చర్చించి విధానాలకు, పద్ధతులకు అధిక స్థాయిలో మద్దతు సంపాదించటానికి ప్రయత్నిస్తుంది. వివిధ గణాల, సమూహాల ఆసక్తులను, ఆకాంక్షలను అంచనావేయటానికి ప్రయత్నిస్తుంది. తన ఆసక్తి తన మద్దతుదారుల ఆసక్తులతో సారూప్యం చెందేటట్లు నాయకత్వం ప్రయత్నిస్తుంది. అందువల్ల సాధారణంగా నాయకత్వానికి, అనుచర వర్గానికీ మధ్య ఆసక్తి లేదా ప్రయోజనపరమైన ఘర్షణలు లేదా అభిప్రాయ భేదాలు సామాన్యంగా ఉత్పన్నం కావు. అంతేగాకుండా ప్రజల ఆసక్తులకు భిన్నంగా వ్యవహరించమని నాయకత్వం జనసామాన్యంలో విశ్వాసాన్ని పెంచడానికి ప్రయత్నిస్తుంది.

## 18.10 నాయకత్వం – సైద్ధాంతిక చట్రం

నాయకత్వానికి సంబంధించిన ఏ అధ్యయనమయినా అది ఒక రూపాన్ని ఎలా ధరిస్తుందో విశ్లేషించడం అవసరం. ఇలా పరిశీలించినప్పుడు నాయకత్వంలో మూడు అంతర్లక్షణాలుండటాన్ని గమనించవచ్చు. అవి: నాయకుడు, అనుచరులు, నాయకుడు – అనుచరుల మధ్య సంబంధం. ఈ మూడింటిలో నాయకుడు – అనుచరుల మధ్య సంబంధం కొన్ని సామాన్యీకరణాలు రూపొందించడానికి ఉపయోగపడుతుంది. అనేక అధ్యయనాలు ఈ అంశంపై ఎక్కువగా దృష్టిని కేంద్రీకరించలేదు. నాయకత్వానికి సంబంధించిన సిద్ధాంతాలు చర్చించేటప్పుడు రాజకీయ నాయకత్వం సాధారణ వర్గీకరణలో ఒక అంశం అన్న విషయాన్ని మనం గుర్తుంచుకోవాలి. సాధారణ సిద్ధాంతాన్ని పరిశీలించినప్పుడే రాజకీయ నాయకత్వం గురించి మనకు అవగాహన ఏర్పడుతుంది. ఈ సందర్భంలో రాజకీయ నాయకత్వాన్ని సమూహ సంఘటిత ప్రక్రియగా పరిశీలించాల్సి ఉంటుంది. ఒక పార్టీకి సంబంధించిన నాయకుడు గాను లేదా జనసామాన్యానికి సంబంధించిన నాయకుడు గాను రాజకీయ నాయకత్వాన్ని విశ్లేషించాలి. అయితే రాజకీయ నాయకత్వాన్ని పరిశీలిస్తున్నప్పుడు ఒక రాజకీయ పక్షానికో, మద్దతు వ్యవస్థకో దానిని పరిమితం చేయటం జరుగుతున్నది. వాస్తవంలో నాయకులు తమ ప్రాబల్యాన్ని కాపాడుకోటానికి స్వపక్షంలో కాని, జనసామాన్యంపై కాని ప్రయోగించే శక్తియుక్తులు లేదా ఎత్తుగడలను శక్తిమంతమైన నాయకుల అధ్యయనంలో ఎక్కువగా కనిపిస్తాయి.

వివిధ రీతుల మధ్య చర్య ప్రతి చర్యల సమాహారమే నాయకత్వమని కొందరు భావిస్తారు. ఉదాహరణకు, రాజకీయ పక్షాల్లోని నాయకత్వం ప్రజలు, అన్ని స్థాయిల్లోని వారి కార్యకలాపాలకు మధ్య సమన్వయం చూపే విధంగా కనిపిస్తుంది. తన సమూహం మద్దతు కోల్పోయినట్లయితే ప్రజావిశ్వాసాన్ని కోల్పోయినట్లు. అందువల్ల నాయకత్వం తీవ్ర సంక్షోభంలో పడినట్లు భావించడం జరుగుతుంది. ఇదే భావం మంత్రివర్గంలో ప్రభుత్వంలో లేదా ఇతర సామూహిక సంస్థల్లోనూ ఏర్పడుతుంది.

జనాకర్షణ నాయకత్వం వ్యక్తిగత లక్షణాలను, పరిస్థితులను ఆధారం చేసుకొని ఏర్పడుతుంది. సమూహ ప్రక్రియలో వాస్తవాలను హేతుబద్ధ సంస్థాపరమైన అంశాలతో కలగాపులగం చేసి జనాకర్షణ నాయకత్వం తన ప్రాబల్యాన్ని నిలబెట్టుకోడానికి ప్రయత్నిస్తుంది.

మాక్స్ వెబర్ నాయకత్వాన్ని మూడు ప్రత్యేకమైన తరహాలుగా వర్గీకరించాడు. అందులో మొదటిది పితృస్వామిక నాయకత్వం. ఇది సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలపై ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. రెండోది, జనాకర్షణ నాయకత్వం. వ్యక్తిగత ప్రత్యేక ఆకర్షణ, విలక్షణాల ద్వారా జనసముదాయాన్ని జనాకర్షణ నాయకత్వం నియంత్రిస్తుంది. మూడోది, చట్టము, హేతుబద్ధతలపై ఆధారపడిన ఉద్యోగి బృంద నాయకత్వం. ఆఫ్రికన్ తెగల సమాజాలలో పితృస్వామిక నాయకత్వం ఎక్కువగా కనిపిస్తుంది. వీటిలో ప్రాచీన మత, ఆచార వ్యవహారాలు, ప్రాథమిక

BRAOU

విధేయతలు నాయకత్వం అధికంగా ఉపయోగించుకొని అనుచర వర్గంపై పట్టును సంపాదిస్తుంది. వంశపారంపర్యత లేదా వారసత్వం ఈ నాయకత్వపు ప్రధాన నియమం. కుటుంబం, రక్తసంబంధం, సమీప బంధుత్వం పితృస్వామిక నాయకత్వపు ముఖ్య ప్రాతిపదికలు.

జనాకర్షణ నాయకత్వం ఎక్కువగా అభివృద్ధి చెందుతున్న సమాజాలలో, మూడో ప్రపంచ దేశాలలో ఎక్కువగా కనిపిస్తుంది. జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, యన్‌క్రోమా, జిన్నా, నాజర్, టిటో, సుకర్నో మొదలైన వారు తమ తమ దేశాల్లో జనాకర్షణ నాయకత్వాన్ని చలాయించారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలోనే కాకుండా, స్వాతంత్ర్యానంతరం కూడా అనేక దేశాలలో ఇటువంటి నాయకత్వం కొనసాగుతూ వచ్చింది.

ప్రభుత్వోద్యోగ నియామకాలు, మౌఖిక, లిఖిత పరీక్షల ద్వారా ప్రత్యేక ఉద్యోగ భర్తీ సంస్థల ద్వారా జరిగి ప్రభుత్వోద్యోగులు శాశ్వత ప్రాతిపదికపై సుదీర్ఘకాలం ఉద్యోగంలో కొనసాగుతు పదోన్నతి పొందే నేపథ్యం నుంచి ఉద్యోగి స్వామ్య నాయకత్వం అవతరిస్తుంది. చట్టపరమైన నిబంధనలు, నియమాలు, పద్ధతులు, రాజ్యాంగ అధికరణలు మొదలైన వాటికి ఉద్యోగి బృంద నాయకత్వం ప్రాముఖ్యమిస్తుంది. వాటి ద్వారా అది బలపడుతుంది.

## 18.11 నాయకత్వం – అధికారం

నాయకత్వం, అధికారం వేరువేరు అని వివరించటానికి మాక్స్ వెబర్ ప్రయత్నించాడు. అయితే ఆయన నాయకత్వాన్ని సంస్థాపరమైన అధికార రీతుల చట్రం పరిధిలోని ఎక్కువగా అధ్యయనం చేశాడేకానీ ఆజ్ఞలను జారీచేసే పరంగా పరిశీలించలేదు. అయితే ఆజ్ఞలను ఇచ్చే పద్ధతులు అన్ని వ్యవస్థలలోను ఒకేవిధంగా ఉండవు. వ్యవస్థల సరళిని బట్టి, స్వరూపాన్ని అనుసరించి మారుతూ ఉంటాయి. కొన్ని సందర్భాలలో నాయకుల వ్యక్తిత్వాన్ని అనుసరించి కూడా వివిధ కాలాలలో ఒకే వ్యవస్థలో ఒకే విధంగా అధికారం చెలాయించడం ఉండదు. జనాకర్షణ పరమైన నాయకత్వం చాలా అస్థిరమైనదిగా వెబర్ భావిస్తాడు. అంతేగాక ఆ నాయకత్వం కమబద్ధంగా ఉండదని వాదిస్తాడు.

BRAOU

వ్యక్తిగత అభిజాత్యాలైన ''ఆశ, భయం, ఆదుర్దా మొదలైనవి ఒక సమూహంలోని నాయకుడిని ఏవిధంగా ప్రభావితం చేస్తాయి? వాటికి ఏఏ కారణాలు దోహదం చేస్తాయి? మొదలైన వాటిని అనేక అధ్యయనాలు పరిశీలించాయి. ఏది ఏమైనప్పటికీ ప్రతి సమూహంలోను అదే ప్రాతిపదికపై ఏర్పడినప్పటికీ మనకు తప్పనిసరిగా నాయకత్వం అందులో కనిపిస్తుంది. అయితే రాజకీయ సంస్థలలోనే – ముఖ్యంగా అధికార వ్యవస్థలలోనే – పై లక్షణాలు ఎక్కువగా కనిపిస్తాయని వాదించడం జరిగింది.

రాజకీయ నాయకత్వం వ్యక్తిగత, సామూహిక అవసరాల నుంచి కూడా ఏర్పడుతుంది. పరిసరాలు, రాజకీయ వ్యవస్థ నాయకత్వ ఆవిర్భావానికి దోహదం చేస్తాయి. వ్యక్తిగత అభిప్రాయాలు, సామూహిక స్పందన, ప్రమాణాలు ఏ వ్యవస్థలోనైనా నాయకత్వం పై కొద్దో గొప్పో ప్రభావం చూపిస్తాయి.

## 18.12 నాయకత్వం – ప్రతీకలు

తరుచు నాయకత్వం వేషభాషల ద్వారా, ప్రతీకల ద్వారా వ్యక్తమవుతూ ఉంటుంది. హిట్లర్ స్వస్తికాన్ని ఒక ప్రతీకగా ఉపయోగించాడు. జవహర్‌లాల్ నెహ్రూ గులాబీ పువ్వును ఎప్పుడూ తమకోటుమీద ధరించేవారు. విన్‌స్టన్ చర్చిల్ ఆంగ్లపదం 'వి'ని విజయసంకేతంగా రెండు వేళ్ళు చూపించడం ద్వారా తరుచు ప్రజలను ఉత్తేజపరిచేవాడు.

నాయకత్వం ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సామాన్య ప్రజలను ఆకర్షించటానికి అనేక జనాకర్షణ పద్ధతులను, విధానాలను అనుసరించవచ్చు. నాయకత్వం తరహాలు ఆయా సమాజాల ప్రత్యేక పరిస్థితులు, విలువలపై ఆధారపడి ఉంటాయి.

## 18.13 ముగింపు

ఏ సమాజంలోనైనా నాయకత్వం కీలక పాత్ర వహిస్తుంది. ఎటువంటి సమాజంలోనైనా, ఎటువంటి సంస్థలలోనైనా నాయకత్వం ఏదో ఒక స్థాయిలో, ఏదో ఒక తరహాలో తప్పని సరిగా అవిర్భవిస్తుంది. అయినప్పటికీ వివిధ రంగాల్లో నాయకత్వం వివిధ వైరుధ్యాలతో కూడుకొని ఉన్నప్పటికీ వాటి మధ్య సామరస్యం కొంత మేరకు కనిపిస్తుంది.

ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థలో రాజకీయ నాయకత్వానికి, ఉద్యోగి బృందం నాయకత్వానికి మధ్య సంబంధాన్ని పరిశీలించటం కూడా చాలా అవసరం. ప్రభుత్వోద్యోగులు కొన్ని నియమ నిబంధనలకు లోబడి చట్టబద్ధంగా వ్యవహరిస్తారు. అలాగే సైనిక నాయకత్వానికి కూడా ఒక ప్రత్యేక సంస్కృతి ఉంటుంది. అది క్రమశిక్షణకు పెద్దపీట వేస్తుంది. ప్రజాస్వామ్య నాయకత్వం ఉద్యోగి బృందం బాధ్యతాయుతంగా పనిచేసేటట్లు చూస్తుంది. దేశ రక్షణ జాతీయ ప్రయోజనాల విషయంలో ప్రజలకు బాధ్యత వహిస్తుంటుంది కాబట్టి సైన్యం కూడా దానికి వ్యవహరిస్తుంది. ఈ విధంగా రాజకీయ నాయకత్వం పాలక, సైనిక, పారిశ్రామిక, ఆర్థిక, సామాజిక రంగాలపై ప్రభావం చూపిస్తుంది.

అయితే ఎటువంటి నాయకత్వం ఎంపిక చేయదగ్గది, అనుసరించదగ్గది ఖచ్చితంగా నిర్ధారించి చెప్పడం కష్టం. నాయకత్వానికి సంబంధించిన అనేక సిద్ధాంతాలు నాయకత్వాన్ని ఒక్కొక్క కోణం నుంచి పరిశీలించాయి. ఒక జాతి లేదా సమాజం లేదా సంస్థ లక్ష్యాలు, ఆసక్తులు మొదలైన వాటి పరిగణనలోకి తీసుకొన్నప్పుడు వాటి సాఫల్యతకు అనువైన నాయకత్వాన్ని ఎంపిక చేసుకోవచ్చు. అలాగే ఒక సమాజం స్వభావంపై కూడా నాయకత్వ స్వభావ స్వరూపాలు ఆధారపడి ఉంటాయి. చారిత్రకంగా, సాంస్కృతికంగా అధికార వాద వ్యవస్థకు అలవాటు పడిన సమాజాల్లో అధికార వాద నాయకత్వం విజయవంతమవుతుంది. అభివృద్ధి చెందిన, పారిశ్రామిక ఉదారవాద ప్రజాస్వామ్య సమాజాల్లో ప్రజాస్వామ్య నాయకత్వం రాణిస్తుంది.

– డా. వి. రవీంద్రశాస్త్రి

BRAOU

## 18.14 చదువదగిన పుస్తకాలు

1. Mosca, G. : The Ruling Class.
2. Paul R Brass : Caste, Faction and Party in Indian Politics.
3. David Easton : The Political System.

## 18.15 నమూనా పరీక్ష ప్రశ్నలు

I. వ్యాసరూప ప్రశ్నలు

1. నాయకత్వ వికాసం, ప్రాముఖ్యతను వివరించుము.
2. నాయకత్వ అవతరణ గురించి చర్చిస్తూ వివిధరకాల నాయకత్వ లక్షణాలను పేర్కొనుము.
3. నాయకత్వం – అధికారాల మధ్య సంబంధాన్ని విశదీకరించుము.

II. సంక్షిప్త ప్రశ్నలు:

1. నాయకత్వ స్వభావం.
2. నాయకుడికి అనుచరులకు మధ్యగల సంబంధం వివరించుము.
3. నాయకత్వ ప్రతీకలు.

# భాగం-19: సామాజిక మార్పు సిద్ధాంతం-గాంధీ సిద్ధాంతం

విషయ క్రమం


19.1 లక్ష్యాలు
19.2 పరిచయం
19.3 గాంధీ జీవిత విశేషాలు
19.4 గాంధీ తత్వానికి ఆధారాలు
19.5 లక్ష్యాలు – సాధనాలు
19.6 అహింసాతత్వం
19.7 సత్యాగ్రహం – సంఘర్షణల పరిష్కార సాధనం
19.8.0 సత్యాగ్రహం పద్ధతులు
19.8.1 చట్టం ఉల్లంఘన
19.8.2 హిజరత్
19.8.3 నిరాహారదీక్ష
19.8.4 సమ్మెలు
19.8.5 సంఘర్షణల తొలగింపుకు సత్యాగ్రహం ఒక సాధనం
19.9 గాంధీ తత్వంలో సంప్రదాయం – ఆధునికత
19.10 గాంధీ అరాచకవాదం
19.11 ఉదారవాద ప్రజాస్వామ్యం
19.12 అహింసాయుత సమాజం – గ్రామ స్వరాజ్యం
19.13 ముగింపు
19.14 ఉపయుక్త గ్రంథాలు
19.15 మాదిరి పరీక్ష ప్రశ్నలు


BRAOU

## 19.1 లక్ష్యాలు

ఈ పాఠ్యాంశం చదివిన తరువాత మీరు

★ గాంధీజీ తాత్విక చింతనను తెలుసుకుంటారు.

★ గాంధీ సిద్ధాంతం ప్రభావాన్ని అర్థం చేసుకుంటారు.

★ గాంధీజీ ప్రబోధించిన అహింసావాదం, సత్యాగ్రహం ఫలితాలు తెలుసుకుంటారు.

## 19.2 పరిచయం

ఇరవయ్యో శతాబ్దం మొదటి భాగంలో రెండు శక్తిమంతమైన సిద్ధాంతాలు, ఉద్యమాలు అవతరించాయి. అవి గాంధీ వాదం, ఫాసిజమ్. మొదటిది ఆసియా ఖండంలో అవతరిస్తే రెండవది యూరప్‌లో ఆవిర్భవించింది. ఈ రెండు సిద్ధాంతాలూ వ్యక్తి, సమాజం, రాజ్యం గురించి స్పష్టమైన అవగాహన కలిగి ఉన్నాయి. రాజ్యపరంగా, అధికారపరంగా ఫాసిస్ట్‌లు వ్యక్తిని చూడగా, గాంధీ సిద్ధాంతం వ్యక్తిని ఒక స్వయం సంవృద్ధ, స్వయం ఆధారిత పరిమాణంగా భావిస్తుంది.

ఫాసిజమ్ రాజ్యానికి ప్రాధాన్యతనిస్తుంది. రాజ్య నియంతృత్వానికీ సంపూర్ణ వాదానికీ ఫాసిజమ్ ప్రాముఖ్యమిస్తుంది.

అయితే గాంధేయవాదం రాజ్యరహిత సమాజం లేదా అతితక్కువ రాజ్య అధికారాలు, పౌరవ జోక్యం, విధులు నిర్వహించే వ్యవస్థను కావాలంటుంది. గాంధేయ సిద్ధాంతం వికేంద్రీకరణను, అన్ని రకాల నిర్బంధాల తొలగింపును కోరుతుంది. అహింసా పద్ధతుల్లో సామాజిక మార్పులు తేవాలని వాంఛిస్తుంది.

ఫాసిజమ్ హింసాపూరిత సాధనాలను ఉపయోగించి నిర్బంధంగా తన ఆశయాలను అమలుపరచటానికి ప్రయత్నిస్తుంది. వలసవాదం, సామ్రాజ్య వాదాలను ఫాసిజమ్ ప్రోత్సహిస్తుంది. వీటిని గాంధేయ వాదం వ్యతిరేకిస్తుంది. ఫాసిజమ్ తీవ్రవాదాన్ని బలపరుస్తుంది. తీవ్రజాతీయ వాదం, రాజ్య విస్తరణ కాంక్ష ఫాసిజమ్ వ్యాప్తిచేయటానికి ఉద్యమించింది.

ఈ రెండు సిద్ధాంతాల మధ్య ఉన్న మౌలిక వ్యత్యాసాన్ని ఒక్క మాటలో చెప్పాలంటే గాంధేయవాదం హింసను వ్యతిరేకిస్తే ఫాసిజమ్ హింసను ప్రోత్సహిస్తుంది. యూరప్‌లో ఫాసిజమ్, నాజిజమ్ జన్మించాయి. 1930 దశకంలో అవి ప్రాచుర్యం పొందాయి. గాంధేయ వాదం ఆసియాలో, ప్రధానంగా భారతదేశంలో ఆవిర్భవించి సామాజిక మార్పుకు వాంఛనీయమైన దృక్పథంగా తత్వంగా అభివృద్ధి చెందింది.

ఆసియా ఖండంలో రెండు విభిన్న సిద్ధాంతాలు, దృక్పథాలతో ఇద్దరు నాయకులు సామాజిక మార్పుకై అవతరించారు. వారు భారతదేశంలో మహాత్మాగాంధీ, చైనాలో మావోసేటుంగ్‌లు. వారిద్దరు కూడా తమతమ సమాజాల్లో ఉన్న ప్రత్యేక పరిస్థితులు, సమస్యలు ఆధారం చేసుకొని వాటి పరిష్కారానికి అనుగుణమైన పద్ధతులను అనుసరించారు, ఆర్థిక, సామాజిక సమస్యల పరిష్కారానికి అవసరమైన చైతన్యాన్ని ప్రజల్లో కల్పించి వారిని సంఘటితం చేయటంలో విజయాన్ని సాధించారు. అయితే అహింసాతత్వం గాంధీ వాదానికి మౌలికమైతే మావో హింసాత్మక విప్లవం మార్పుకు అత్యవసరమని భావించాడు. సామాజిక మార్పులకు అవసరమైన సిద్ధాంతాలను వారు రూపొందించారు. అందువల్ల గాంధేయ వాదం మూలతత్వమైన సత్యము, అహింస, సత్యాగ్రహం, 'లక్ష్యాలు–సాధనాలు', సంప్రదాయం, ఆధునిక మొదలైన వాటి గురించి అధ్యయనం చేయటం చాలా అవసరం.

BRAOU

## 19.3 గాంధీ జీవిత విశేషాలు

1874 అక్టోబర్ 2 నాడు గుజరాత్‌లోని కథియవార్ జిల్లాలోని పోర్‌బందర్ గ్రామంలో గాంధీ జన్మించారు. భారత సామాజిక, రాజకీయ తత్వాలకు ప్రతీకగా ఆధునిక యుగంలో గాంధీ ప్రసిద్ధి చెందారు. ప్రాథమిక విద్యనభ్యసించిన తరువాత న్యాయశాస్త్రం అధ్యయనం చేయటానికి ఆయన లండన్ వెళ్ళారు. 1891 లో న్యాయశాస్త్రంలో పట్టా తీసుకొని న్యాయవాదిగా భారతదేశానికి తిరిగి వచ్చారు. రాజ్‌కోట్‌లో న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. అయితే 1893లో ఒక వివాదం సందర్భంగా గాంధీ దక్షిణాఫ్రికాకు వెళ్ళారు. అక్కడ నల్లజాతి వారిపట్ల చూపుతున్న వర్ణ వివక్షత, వారి సామాజిక ఆర్థిక దుస్థితి పట్ల ఆయన తీవ్రంగా కలత చెందారు. గాంధీ సుమారు 20 సంవత్సరాలు దక్షిణాఫ్రికాలో గడిపారు. ఆ కాలంలో నల్లవారి పట్ల చూపుతున్న వర్ణ వివక్షణకు వ్యతిరేకంగా వారి సామాజిక న్యాయం కోసం, రాజకీయ, పౌరహక్కుల కోసం అవిశ్రాంత ఉద్యమాన్ని నిర్వహించారు.

1914లో గాంధీ భారతదేశానికి తిరిగి వచ్చి జాతీయోద్యమంలో పూర్తిగా లీనమయ్యారు. భారత జాతీయోద్యమంలో గాంధీ ఆగమనంతో రెండవ దశ ప్రవేశించిందని వ్యాఖ్యానించటం జరిగింది. 1919 నుంచి రౌలత్ చట్టాలకు నిరసనగా ప్రారంభమైన హర్తాళ్ళతో జాతీయోద్యమంలో ఒక నూతన స్ఫూర్తి చోటుచేసుకొంది. 1920 లో గాంధీ ఆల్ ఇండియా హోం రూల్ లీగ్‌కు అధ్యక్షులయ్యారు. అదే సంవత్సరంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఆయన సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ప్రారంభించారు. ఫలితంగా గాంధీ – ఇర్విన్‌ల మధ్య ఒక ఒప్పందం కుదిరింది. 1942 నాటికి గాంధీ దేశ వ్యాప్తంగా ''క్విట్ ఇండియా'' ఉద్యమాన్ని నిర్వహించారు. ఈ ఉద్యమం చిట్టచివరికి బ్రిటిష్‌వారు భారతదేశానికి పూర్తి స్వాతంత్ర్యం (పూర్ణ స్వరాజ్) ఇచ్చేటట్లు చేసింది. ఇంగ్లండ్‌లో వరుసగా ఏర్పడిన పరిణామాలు భారతదేశంలో

ముమ్మరమైన జాతీయోద్యమం తదితర అంతర్జాతీయ కారణాలు చివరికి బ్రిటిష్‌వారు మన దేశాన్ని వదిలిపెట్టే పరిస్థితులు కల్పించాయి. హిందూ, ముస్లిం సోదరుల మధ్య మత సామరస్యం కోసం అవిశ్రాంతంగా కృషిచేసిన మహాత్మాగాంధీ చివరికి ఒక హిందూ ఉన్మాది చేతుల్లో హత్యకు గురికావడం ఒక దురదృష్టకరమైన పరిణామం. జనవరి 3, 1948 నాడు గాంధీజీని మతోన్మాది తుపాకీ బలి తీసుకొంది.

## 19.4 గాంధీతత్వానికి ఆధారాలు

జాన్ రస్కిన్, హెన్రీడేవిడ్ థోరే, లియో టాల్స్టాయ్ భావాలు గాంధీని చాలావరకు ప్రభావితం చేశాయి. స్వేచ్ఛ గురించి థోరే, టాల్ స్టాయ్ [illegible] గాంధీ మనో ఫలకంపై చెరగని ముద్రవేశాయి. స్వేచ్ఛాయుత మానవుడు అనే గాంధీ భావం తాత్విక ఆలోచనావాదాన్ని ఆయన అంగీకరించేటట్లు చేసింది.

కేవలం పైన పేర్కొన్న పాశ్చాత్య రచయితలు, వారి భావనలే కాకుండా గాంధీజీ భారతీయతత్వం హిందూ మతం నుంచి కూడా స్ఫూర్తి పొందాడు. వేదాలు, భగవద్గీత, బైబిల్, ఖురాన్, జంద్ అవెస్తా, మొదలైన మతపరమైన రచనలు ప్రజా, వ్యకిగత రంగాల్లో నైతిక భావాల అనుసరణపట్ల గాంధీజీని కృతనిశ్చయుణ్ణి చేశాయి. చిట్టచివరకు సత్యం, అహింస, నిష్కామకర్మ భావాలను గాంధీజీ దృఢంగా విశ్వసించాడు. అంతేకాదు వాటిని క్రమం తప్పకుండా వ్యక్తిగత, ప్రజారంగాల్లో ఆయన రాజీలేని పద్ధతిలో అనుసరించాడు.

గాంధీ చేసిన [illegible]ల్లో ముఖ్యమైనవి

(i) సత్యంతో చేసిన స్వీయ ప్రయోగాలు (Story of My Experiments with Truth 1925).

(ii) ఆఫ్రికాలో సత్యాగ్రహం-1928

(iii) ఆత్మకథ

BRAOU

పై గ్రంథాలు ఆయన రాజకీయ, సామాజిక, ఆర్థిక భావాలను అధ్యయనం చేయడానికి ఉపకరిస్తాయి. రచనలతోపాటు గాంధీజీ ఇండియన్ ఒపీనియన్ (Indian Opinion-1903), యంగ్ ఇండియా (Young India-1919), నవజీవన్ (1919), హరిజన్ (1913) పత్రికలకు సంపాదకత్వం వహించారు. గాంధీజీ చేసిన మొత్తం రచనలు 90 సంపుటాలుగా వెలువడ్డాయి.

గాంధీజీ పై భగవద్గీత ప్రభావం అపారం. ''నాకు సందేహం కలిగినప్పుడు, నిరుత్సాహం ఏర్పడినప్పుడు, ఏటూ మార్గం తోచనప్పుడు నేను గీతను ఆశ్రయిస్తాను'' అని ఆయన చెప్పారు. గాంధీజీ గీత నుంచి కర్మయోగాన్ని అభ్యసించారు. స్వయం నియంత్రణ, ఇంద్రియ నిగ్రహం - ఆయన ఉద్దేశంలో - వ్యక్తికి చాలా అవసరం. చెడు వినకు , చెడు చూడకు, చెడు మాట్లాడకు అనే మూడు మర్కటాల భావనయే స్వీయ నియంత్రణకు మూలాధారం. గాంధీజీ జీవన విధానంలో, ఆలోచనా విధానంలో సత్యం మరొక దృఢమైన నియమం. గాంధీజీ ఉద్దేశంలో సత్యం స్వతంత్రయామి, తప్పుకానటువంటిది. మహాభారతం మొత్తం సత్యశోధన భావనపైనే రూపొందింది. అసత్యంపై సత్యం విజయాన్ని మహాభారతం నిరూపిస్తుంది.

''చట్టం ఉల్లంఘన (On Civil Disobedience) అనే హెన్రీ డేవిడ్ థారే వ్యాసం నుంచి గాంధీ సత్యాగ్రహ భావనను స్వీకరించారు అని సాధారణంగా భావించడం జరుగుతుంది. అయితే వీటిని గాంధీ అంగీకరించలేదు. ''అహింస'' భావాన్ని జైన మతం సారాంశంగా భావించవచ్చు. చేచర్జీ స్వామి అనే జైన మత గురువుతో గాంధీకి పరిచయమయింది. ఆయన గాంధీజీ విదేశాలకు వెళ్ళడానికి సహాయపడ్డాడు. గాంధీజీ దృక్పథాన్ని ప్రభావితం చేసిన మరొక రచన రస్కిన్ రచించిన "Unto the Last". గాంధీజీ ఆలోచనా పథాన్ని ఈ రచన చాలా ప్రభావితం చేసింది. ఆ కాలపు పారిశ్రామికీకరణ పశ్చిమ దేశాల్లో సంపద వ్యక్తిని పరాధీనత భావానికి గురిచేశాయని రస్కిన్ అభిప్రాయం. గాంధీజీ

కూడా భౌతిక వాదాన్ని (Materialism) పూర్తిగా వ్యతిరేకించాడు. మానవ విలువలకు, నిరాడంబర జీవనానికి, స్వేచ్ఛా సమానత్వాలకు గాంధీజీ అధిక ప్రాముఖ్యమిచ్చారు. టాల్‌స్టాయ్ రచన ''భగవంతుని రాజ్యం నీలోనే ఉంటుంది'' (The Kingdom of God within You) గాంధీజీని బాగా ప్రభావితం చేసింది. 'తన సందేహాలను చాలా మట్టుకు పోగొట్టి అహింసపట్ల దృఢ విశ్వాసాన్ని పెంచుకొనేటట్లు టాల్‌స్టాయ్ రచనలు నన్ను ప్రభావితం చేశాయి' అని గాంధీజీ చెప్పారు.

ఈ విధంగా గాంధీతత్వం మత గ్రంథాలు, తాత్విక అరాజకవాదం మొదలైన వాటి ద్వారా ప్రభావితమైంది. ప్రాక్, పశ్చిమ తత్వాల సమ్మేళనాన్ని గాంధేయ తత్వంలో మనం గమనించవచ్చు. ఈ నేపథ్యంలో వ్యక్తి, సమాజం, రాజ్యాలను పునర్నిర్వచించడానికి గాంధేయతత్వం ప్రయత్నించింది.

## 19.5 లక్ష్యాలు – సాధనాలు

లక్ష్యం సాధనాల మధ్య సరి అయిన సంబంధాన్ని నెలకొల్పటం గాంధీజీ తన ప్రధాన కర్తవ్యంగా భావించారు. ఈ సమస్యను సాంప్రదాయిక రాజనీతి సిద్ధాంతం పరిష్కరించటంలో విఫలమయింది. లక్ష్యాలు మంచివి అయితే వాటిని చెడు సాధనాల ద్వారా సాధించలేము. అయితే విధానాలు మంచివి అయితే మంచి లక్ష్యాల మార్గాలు నెమ్మదిగా నైనా ముందుకు పోవటానికి వీలవుతుంది. నైతిక భావాల్లో ప్రగాఢమైన విశ్వాసం ఉండటంవల్ల అనైతిక మార్గాలు ధర్మానికి, సత్యసాధనకు తోడ్పడాలని గాంధీజీ నొక్కి వక్కాణించారు.

రాజకీయ అవసరం, అనుకూలతలను గాంధీ వ్యక్తీకరించారు. చెడ్డ విత్తనంతో – అంటే కుళ్ళిపోయిన, లోపభూయిష్టమైన విత్తనం మంచి వృక్షాన్ని రూపొందించలేదు అని అయన గాఢంగా విశ్వసించారు. అనైతిక సాధనాలు వ్యక్తి దృష్టిని వక్రీకరిస్తాయి. హింస, మోసం, కపటం, ద్రోహం మొదలైనవి మానవ సమైక్యతను దెబ్బతీస్తాయి. ఉదాత్తమైన ఆశయాల సాధనకు ఉదత్తామైన పద్ధతులను అనుసరించాలని గాంధీ భావిస్తారు. అందువల్లనే సి.ఇ.ఎం.జోడ్ ''సాధువుల్లో రాజకీయ వేత్తగా'' గాంధీజీని వర్ణించాడు. రాజకీయ రంగంలో నైతిక ప్రమాణాలు ముఖ్యమైనవిగా గాంధీజీ భావించడంవల్లనే అయనకు రాజకీయాలకు నైతికత కల్పించిన నాయకుడిగా పేరు ప్రతిష్ఠలు అబ్బాయి.

BRAOU

## 19.6 అహింసాతత్వం

గాంధీజీ తత్వ విచారంలో అహింస అతిసమగ్రమైన భావన. మావో వాదంలో హింస కేంద్ర బిందువు అయితే గాంధీ సిద్ధాంతానికి అహింస మూలస్తంభం. గాంధీ అభిప్రాయంలో సామాజిక విరుద్ధతలు హింస ద్వారా పరిష్కరించవలసినంత క్లిష్టమైనవి కావు. సమాజంలోని ఎటువంటి అన్యాయాలనైనా అహింసా పద్ధతుల ద్వారా తొలగించవచ్చని గాంధీ ప్రగాఢ విశ్వాసం. మనిషిలోని దుష్టతత్వాన్ని కాకుండా మనిషినే నాశనం చేయాలని అనుకొనేవారు హింసా పద్ధతులు, దౌర్జన్య సాధనాలను ఉపయోగిస్తారని గాంధీజీ వాదిస్తారు. అందువల్ల వారికి చెడు మూలం తెలియదు.

అహింసకు, సత్యానికి సంబంధం ఉందని గాంధీవాదం. మానవుడికి పూర్తి సత్యం తెలియదు కాబట్టి అతడికి శిక్షించే అధికారం లేదు. సత్యాన్ని భగవంతుడని గాంధీజీ నిర్వచించారు. అందువల్ల అయన అభిప్రాయంలో భగవంతుని తెలుసుకోడానికి లేదా సత్యాన్ని గ్రహించడానికి అహింస ఒక్కటే సాధనం. అహింసా పద్ధతుల్లో సంపూర్ణ విశ్వాసం లేకుండా సత్యాన్ని తెలుసుకోలేము. గాంధీ ఉద్దేశంలో అహింస కేవలం వ్యతిరిక్త భావం కాదు. ఇతరులకు హాని చేయకపోవటమే కాకుండా ఎదుటి వ్యక్తిలో మంచిని తెలుసుకోవటం లేదా అతడిని చెడు మార్గం నుంచి సన్మార్గంలోకి తీసుకొని రావటానికి అహింసా మార్గమే అత్యంత శ్రేష్ఠమైనది. అలాగే కేవలం నిష్క్రియ ద్వారా ఇతరుల చెడును

సహనంతో భరించడం కూడా అహింస కాదు. అహింస అంటే తప్పు చేసే వ్యక్తిని ప్రతిఘటించటం. అతడిని ఆ దుర్మార్గం నుంచి దూరం చేయడం.

గాంధీజీ ఉద్దేశంలో అహింస, ప్రేమ వేరు వేరు కావు. అలాగే సత్యం, ప్రేమ కూడా ఒక దగ్గరే ఉంటాయి. అహింస, ప్రేమ కలిసి మెలిసి ఉంటాయి. వాస్తవంలో వాటిని విడదీయడం సాధ్యం కాదు. అవి ఒక నాణానికి రెండు వైపులు.

## 19.7 సత్యాగ్రహం - సంఘర్షణల పరిష్కార సాధనం

గాంధీజీ చేతుల్లో సత్యాగ్రహ భావన ఒక శక్తిమంతమైన ఆయుధంగా, సత్యశక్తిగా రూపొందింది. సత్యాగ్రహం అంటే గాంధీ మాటల్లో సత్యాన్ని దృఢంగా విశ్వసించటం. రాజీలేని పద్ధతుల్లో అనుసరించటం, ఆచరించటం. అందువల్లనే సత్యాన్ని ఒక బలమైన శక్తిగా గాంధీ భావించారు. సత్యం ఆత్మశక్తిని ప్రతిబింబిస్తుంది. అందువల్ల దానిని ఆత్మశక్తి అనవచ్చు. సత్యం హింసా పద్ధతులను వ్యతిరేకిస్తుంది. హింసను అంగీకరించదు. ఎందుకంటే మానవుడు సంపూర్ణ సత్యాన్ని తెలుసుకోలేడు కాబట్టి. సత్యమంటే సత్యం అగ్రహ పట్టుదలతో అనుసరించటం. అందువల్ల సత్యాగ్రహం అంటే సత్యాన్ని పట్టుదలతో దృఢ దీక్షతో అనుసరించటమని అర్థం. అందువల్ల అసత్యానికి లొంగిపోకుండా దృఢ శక్తితో అనుసరించటం అధర్మమున్న చోట ధర్మం ప్రత్యక్షమైనట్లు అసత్యాన్ని ఎదిరించి గెలవటం సత్యం లక్ష్యం. అది దాని స్వభావం. అంతిమ విజయం సత్యానిదే. సత్యాగ్రహం గాంధీ సిద్ధాంతానికి ఆత్మవంటిది. అన్యాయం, సత్యరాహిత్యం, అనర్థాలను ప్రతిఘటించడానికి అది ఏకైక మార్గం. స్వీయ పరిశుద్ధతను, ఇతరులపట్ల ప్రేమను సత్యాగ్రహం కలిగిస్తుంది. బలవంతుని చేతిలో ఒక ప్రబలమైన సాధనం. హింసకు ప్రతిఘటనగా ఉపయోగించడం జరుగుతుంది. ఈ పద్ధతి ద్వారా గాంధీజీ అభిప్రాయంలో సత్యాగ్రహి అన్ని వైరుధ్యాలను పరిష్కరించగలుగుతాడు. వ్యక్తిలోని నైతిక, ఆధ్యాత్మిక భావాలను సత్యాగ్రహం దృఢతరం చేస్తుంది. శత్రువును సత్యాగ్రహి హేతుబద్ధమైన వాదం ద్వారా జయించడానికి ప్రయత్నిస్తాడు. స్వీయ బోధ ద్వారా, త్యాగం ద్వారా శత్రు ఆలోచనలో మార్పు తీసుకొని రావటానికి ప్రయత్నం చేస్తాడు. తల్లి బిడ్డ గురించి ఎన్ని బాధలనైనా ఏవిధంగా భరిస్తుందో అలాగే సత్యాగ్రహి కూడా ఇతరుల ప్రయోజనం కోసం, వారి సంక్షేమం కోసం ఎన్ని బాధలనైనా భరిస్తాడు. ఎటువంటి త్యాగాలనైనా చేస్తాడు.

BRAOU

గాంధీజీ ప్రతిపాదించి అమలు జరిపిన సత్యాగ్రహ భావనలో మూడు అంశాలున్నాయి.

(1) ఇది బాధితుణ్ణి పరిశుద్ధం చేస్తుంది.

(2) ప్రజాభిప్రాయాన్ని అనుకూల పరుస్తుంది.

(3) శత్రువు అంతరాత్మకు ప్రత్యక్షంగా విజ్ఞప్తిచేస్తుంది.

సత్యాగ్రహాన్ని చాలా మంది నిష్క్రియ ప్రతిఘటనగా భావిస్తారు. అయితే గాంధీ అభిప్రాయంలో ఈ రెండింటికీ వ్యత్యాస ముంది. నిష్క్రియ ప్రతిఘటన సమయానుకూలమైన రాజకీయ ఆయుధం. బలహీనులు దీనిని అనుసరించవచ్చు. అయితే సత్యాగ్రహం బలవంతుని, ధైర్యవంతుని ఆయుధం. నిష్క్రియ ప్రతిఘటనలో సత్యాగ్రహం చలన రహితమైంది. కాదు. ధర్మం, ప్రేమ, త్యాగం మొదలైన స్పందనల ద్వారా సత్యాగ్రహి స్వీయ బాధతో ప్రతి ద్వంద్విలో పునరాలోచన కలిగిస్తాడు. ఒకానొక బలహీన పరిస్థితిలో గత్యంతరం లేకపోవడంవల్ల బలహీనులు నిష్క్రియ ప్రతిఘటన చర్యలకు పూనుకొంటారు. అయితే సత్యాగ్రహి ఎటువంటి ప్రతికూల పరిస్థితుల్లోనైనా లక్ష్యాన్ని వదిలిపెట్టక ధైర్యంగా శత్రువులను అహింసా మార్గంలో ప్రతిఘటిస్తాడు.

## 19.8.0 సత్యాగ్రహం పద్ధతులు

సత్యాగ్రహాన్ని అమలుపరచడంలో కింది పద్ధతులు ముఖ్యమైనవి.

ప్రభుత్వం అన్యాయ పద్ధతుల్లో వ్యవహరించినప్పుడు ప్రజలు ప్రతిఘటించాలని గాంధీజీభావిస్తారు. ప్రజల సమ్మతి

లేకపోతే ఎంతటి నిరంకుశ ప్రభుత్వమైనా నిలబడలేదు. బలప్రయోగం ద్వారా నిరంకుశ ప్రభుత్వం పాలన సాగించడానికి ప్రయత్నిస్తుంది. సహాయ నిరాకరణ సత్యాగ్రహంలో ఒక పద్ధతిగా సదరు నిరంకుశ ప్రభుత్వం అన్యాయవైఖరిని ఎదుర్కోటానికి ప్రయత్నిస్తుంది. ప్రభుత్వం ప్రజల దృష్టిని ఆకర్షించటాని ఈ పద్ధతి ఉపకరిస్తుంది. సాధారణంగా సహాయ నిరాకరణ సామాజిక బహిష్కరణ లేదా పికెటింగ్ ద్వారా అమలుపరచడం జరుగుతుంది. అయితే హర్తాళ్‌లు అహింసాయుతంగా జరగాలి. ప్రజాభిప్రాయాన్ని ధిక్కరించే వారిని సామాజికంగా బహిష్కరించాలి. అలాగే ప్రజాభిప్రాయాన్ని వ్యక్తంచేయడానికి పికెటింగ్ ఒక సాధనం కావాలి. సామాజిక మార్పులు తేవడానికి సహాయ నిరాకరణ ఒక వ్యతిరిక్త పద్ధతిగానే కాకుండా సంవర్ధక సాధనంగా భావించాలి.

### 19.8.1 చట్టం ఉల్లంఘన

అనైతిక, అన్యాయమైన చట్టాలను తొలగించటానికి పౌర ఉల్లంఘన ద్వారా చట్టాలను ఉల్లంఘించటం సరి అయిన పద్ధతి అని గాంధీ భావిస్తారు. అహింసాయుత పద్ధతి ద్వారా రాజ్య చట్టాలను ఉల్లంఘించడానికి ఇది సత్యాగ్రహంలో శాంతియుతమైన పద్ధతి. అయితే ఈ పద్ధతిని అనుసరిస్తున్నప్పుడు ఎటువంటి దుర్మార్గమైన ఆలోచన ఉండకూడదు. క్రమశిక్షణతో సద్బుద్ధితో ఈ పద్ధతిని అమలుపరచాలి. విచక్షణా యుతంగా బాగా ఆలోచన చేసి చట్టం ఉల్లంఘన కార్యక్రమాలను చేపట్టాలి. అయితే చట్టం ఉల్లంఘన పద్ధతికి ఉపక్రమించటానికి ముందు ఇతర పద్ధతులన్నీ ఉపయోగించాలి. అవి ఆశించిన ఫలితాలు ఇవ్వనప్పుడు ఈ పద్ధతిని ఉపయోగించాలి. హింస, తదితర అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా సరైన జాగ్రత్తలు తీసుకొని శాంతియుతంగా చట్టాలను ఉల్లంఘించటానికి ప్రయత్నించాలని గాంధీ భావిస్తారు.

### 19.8.2 హిజ్‌రత్

హిజ్‌రత్ అంటే ఐచ్ఛికంగా నివాస ప్రదేశం నుంచీ తరలిపోవటం. ఆత్మగౌరవానికి కలిగిందని ప్రజలు భావించినప్పుడు గౌరవప్రదంగా జీవితం వెళ్ళదీయలేమని అనుకొన్నప్పుడు తమ తమ నెలవులను వదులుకొని ఇతర ప్రదేశాలకు తరలిపోవటాన్ని – ప్రవాసం – హిజ్‌రత్ అంటారు. ప్రభుత్వం దమన నీతిపట్ల నిరసన తెలిపే సత్యాగ్రహ సాధనాల్లో హిజ్‌రత్ ఒకటి. దీనివల్ల ప్రభుత్వం తను చేసిన తప్పిదాన్ని తెలుసుకోవడం సాధ్యమవుతుంది.

BRAOU

### 19.8.3 నిరాహార దీక్ష

సంప్రదాయాతీత పద్ధతిగా గాంధీ నిరాహార దీక్షను ఉపయోగించారు. అయితే దీనిని కూడా చాలా విచక్షణతో ఒక ఉదాత్తమైన ఆశయ సాధనకు చిత్తశుద్ధితో ఉపయోగించాలి. నిరాహార దీక్షకు పూనుకొనే వారు ఆధ్యాత్మికంగా పరిపూర్ణతను కలిగి ఉండి, చిత్తశుద్ధితో, అకుంఠిత దీక్షతో, క్రమశిక్షణతో పూనుకోవాలి. ఎటువంటి శారీరక బాధలైనా భరించడానికి సంసిద్ధం కావాలి.

నిరాహార దీక్ష అంటే ఆహారాన్ని తిరస్కరించటం, శరీర పోషణకు సంబంధించిన ఆహారాన్ని తీసుకోడానికి నిరాకరించి శరీరాన్ని శుష్కింపచేయడం నిరాహార దీక్ష పద్ధతి. దీనివల్ల ప్రత్యర్థి తన తప్పిదాలను గ్రహించగలుగుతాడు. ఇతరులపట్ల తాను చేసిన అన్యాయాలను గ్రహించగలుగుతాడు. తన పంథాను, చర్యలను మార్చుకోడానికి అవకాశమేర్పడుతుంది.

### 19.8.4 సమ్మెలు

సత్యాగ్రహంలో సమ్మె మరొక సాధనం. న్యాయసాధనకు హేతుబద్ధమైన కనీస కోర్కెల సాధనకు సమ్మెలు ఉపకరిస్తాయి. అన్యాయానికి ఒడిగట్టిన ప్రత్యర్థిలో మార్పు తీసుకొని రావటం సమ్మె లక్ష్యం. మార్క్సిస్టు వర్గ పోరాటంపట్ల గాంధీకి విశ్వాసం లేదు. పెట్టుబడిదారీ వర్గాన్ని తొలగించడానికి శ్రామిక వర్గం ప్రయత్నిస్తుందని ఈ రెండు వర్గాల మధ్య వర్గపోరాటం అనివార్యమని గాంధీ భావించారు. కాగా పరిశ్రమలు ధర్మనిధి వంటివి. పెట్టుబడిదారులకు, శ్రామికులకు

సమానంగా ఉపయోగపడేవి. అధర్మాన్ని, అన్యాయాన్ని, అసమర్థతను, అవినీతిని తొలగించడానికి సమ్మెలు ఉపయోగపడాలని గాంధీజీ భావించారు.

### 19.8.5 సంఘర్షణల తొలగింపుకు సత్యాగ్రహం ఒక సాధనం

సామాజిక, ఆర్థిక రంగాల్లో ఉత్పన్నమయ్యే వైరుధ్యాలను శాంతియుతంగా, అహింసా పద్ధతుల్లో తొలగించడానికి సత్యాగ్రహం ఒక అత్యంత శక్తిమంతమైన ఆయుధంగా గాంధీజీ భావించారు. మానవ సమాజంలో అత్యంత సాధారణమైన విషయం వైరుధ్యాలు. వైరుధ్యాలను తొలగించడానికి, సంఘర్షణలు నివారించడానికి గాంధీజీ ప్రయత్నించారు. గాంధీ కర్మయోగి. అందువల్ల ఆయన సంఘర్షణలకు, వివాదాలకు దూరంగా ఉండలేదు. వాటిమూల కారణాలను తెలుసుకొని వాటిని తొలగించడానికి ఆయన శాయశక్తులా ప్రయత్నించారు.

సమాజంలోని అన్ని రకాల దుర్గుణాలను, అవాంఛనీయ ధోరణులను, అన్యాయాలను తొలగించడానికి అహింసాయుతంగా, శాంతియుతంగా ఫలితాలను సాధించడానికి సత్యాగ్రహం అత్యంత శక్తిమంతమైన పద్ధతి అని గాంధీజీ నిశ్చితాభిప్రాయం. అందువల్ల గాంధజీ వైరుధ్యాల తొలగింపుకు అహింసా పద్ధతి అత్యంత వాంఛనీయమైందని భావిస్తారు. 1893లో మిత్స్‌బర్గ్ అనుభవం అరుదైందిగా గాంధీ భావిస్తారు. అది ఆయన ఆలోచనను తీవ్రంగా ప్రభావితం చేసింది. ''నా హక్కుల కోసం తప్పనిసరిగా పోరాడతాను'' అనే దృఢ సంకల్పం దక్షిణాఫ్రికా అనుభవం గాంధీలో ప్రవేశించింది. అన్యాయాలకు దూరంగా ఉండకుండా వాటిని నిర్భయంగా ప్రతిఘటించకుండా శాంతియుతంగా సంవర్ధక సత్యాగ్రహ పద్ధతుల ద్వారా ఎదిరించాలని గాంధీ దృఢంగా విశ్వసిస్తారు.

అహింస సంవర్ధకమైన చర్య. దానిని నిష్క్రియతో పోల్చరాదు. గాంధీజీని చిత్తశుద్ధితో అనుసరించిన మార్టిన్ లూథర్ కింగ్ అన్నట్లు అహింస ''సంఘర్షణ స్థితిలో సృజనాత్మకమైన చర్య'' అవుతుంది. ఉద్రిక్తతలు సామాజిక వ్యవస్థలో ఉంటాయి. అహింస ఉద్రిక్తతలను తొలగించడానికి ఉపకరిస్తుంది.

గాంధేయ మార్గం సామాజిక ఉద్రిక్తతలను అహింసాయుత పద్ధతుల ద్వారా తొలగించడానికి ఉద్దేశించింది. ఒక ఉద్రిక్త పరిస్థితిలో సృజనాత్మకమైన సంఘర్షణ స్థితిని అహింసాయుతంగా సృష్టించి అసలు సమస్యను సత్యాగ్రహం ద్వారా పరిష్కరించడానికి ప్రయత్నిస్తుంది. సామాజిక రాజకీయ జీవనంలో ఏర్పడే గతి తార్కికమైన మార్పులను గాంధీ గుర్తించారు. అందులో ఉత్పన్నమయ్యే వైరుధ్యాలను, సంఘర్షణలను, ఉద్రిక్తతలను కూడా ఆయన పరిగణనలోకి తీసుకొన్నారు. అయితే వాటిని అహింసా పద్ధతి చట్ర పరిధిలోనే పరిష్కరించాలని గాంధీ అభిప్రాయం.

సత్యాగ్రహాన్ని జాతీయోద్యమంలో గాంధీజీ ప్రతిభావంతంగా ఉపయోగించారు. 1920- 21, 1930- 32, 1942లో జరిగిన సత్యాగ్రహాలు బ్రిటిష్ పాలకుల వ్యతిరేకోద్యమ సంఘర్షణ, ఉద్రిక్తతల స్థాయి అహింసాయుత పద్ధతుల్లో సత్యాగ్రహ చర్యల ద్వారా వారిని ఎదుర్కోవటం జరిగింది.

సామాజిక, ఆర్థిక రంగాల్లో యజమానికి, శ్రామికుడికి మధ్య ఉత్పన్నమయ్యే సంఘర్షణలను ఉన్నత కుల హిందువులకు, నిమ్న జాతుల వారికీ మధ్య జరిగే సంఘర్షణలను గాంధీ అహింసాయుత పద్ధతుల్లో తొలగించడానికి ప్రయత్నించారు. ఈ విధంగా సత్యాగ్రహ సాధనం ద్వారా సామాజిక రంగంలో మార్పులు తేవడానికి గాంధీ కృషిచేశారు.

1917లో మొట్టమొదటి సత్యాగ్రహాన్ని గాంధీ చంపారన్ (బీహార్) వ్యవసాయదారులు ఎదుర్కొంటున్న అన్యాయాలకు, అనుభవిస్తున్న అక్రమాలకు వ్యతిరేకంగా విజయవంతంగా నిర్వహించారు. అటు తరవాత 1918లో ఖేడ్ సత్యాగ్రహాన్ని రైతులు శిస్తు చెల్లింపు నిరాకరణ ఉద్యమం ద్వారా నిర్వహించారు. బొంబాయి ప్రభుత్వానికి విరుద్ధంగా సదరు సత్యాగ్రహం కొనసాగింది. 1928 లో సత్యాగ్రహం పన్నుల చెల్లింపు నిరాకరణ, సహాయ నిరాకరణ పద్ధతుల్లో కొనసాగింది. ఇవన్నీ స్థానిక ప్రభుత్వోద్యోగుల అక్రమ నిర్ణయాలు, అధిక పన్నుల విధింపులకు వ్యతిరేకంగా విజయవంతంగా నిర్వహించబడ్డాయి.

BRAOU

పైన పేర్కొన్న సత్యాగ్రహాలన్నీ బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా నిర్వహించినవే. అయితే వాటి అసలు ఉదంతం కేవలం పరాయి పాలకుల అక్రమాలను ప్రతిఘటించడమే కాకుండా ఆర్థిక రంగంలో మార్పులు తీసుకొని రావటం. అహమ్మదాబాద్ కార్మికుల ఆందోళన (1918) సందర్భంలో యాజమాన్యం, కార్మికుల ఆందోళనను ఉపసంహరింపచేయడానికి గాంధీజీని సహాయాన్ని అర్థించింది. అయితే ధరలు విపరీతంగా పెరగటంవల్ల శ్రామికులు తమ వేతనాల్లో 35% పెంపుదల కావాలని ఆందోళన చేయటం సమంజసమని భావించి వారి తరఫున ఉద్యమం నిర్వహించి చివరికి నిరాహార దీక్షకు కూడా ఆయన పూనుకొన్నారు. అదేవిధంగా హరిజనుల దేవాలయ ప్రవేశం, దేవాలయ వీధుల్లో వారు తిరగటానికి ఉన్న నిషేధాలను తొలగించడానికి 16 నెలలు ట్రెకోమ్ సత్యాగ్రహాన్ని ఆయనే నిర్వహించారు.

1928లో నిర్వహించిన బార్డోలి సత్యాగ్రహం బాగా విజయవంతమయింది. సత్యాగ్రహ పద్ధతులను గురించి అందులో పాల్గొన్న వారికి బాగా ముందుగానే వివరించి వారికి తగిన శిక్షణ ఇచ్చారు. అలాగే పత్రికలు కూడా దానికి విశేష ప్రచారం ఇచ్చాయి. సత్యాగ్రహులతో ఆలపింపజేయడం జరిగింది. సత్యాగ్రహులు చిత్తశుద్ధితో లక్ష్యసాధనకు పూనుకొంటామని వారి వద్ద నుంచి ప్రమాణ పత్రాలను తీసుకొన్నారు. సత్యాగ్రహం ప్రారంభం కావటానికి ముందే ప్రభుత్వం ఎటువంటి కఠిన చర్యలు తీసుకొంటుందో వాటిని సత్యాగ్రహులకు వివరించటం జరిగింది. అంటే వారిని కష్టాలకు ముందుగానే మానసికంగా సంసిద్ధం చేయటమైంది. 1930లో సత్యాగ్రహం పద్ధతులు బాగా పరిణతి చెందాయి. మద్రాసులో రాజగోపాలాచారీ, గుజరాత్‌లో వల్లభాయ్ పటేల్, ఉత్తరప్రదేశ్‌లో పండిత జవహర్‌లాల్ నెహ్రూ, ఆంధ్రలో కొండా వెంకటప్పయ్య పంతులు దేశవ్యాప్త సత్యాగ్రహ ఉద్యమాల్లో విశేషంగా పాల్గొని ప్రజల్లో రాజకీయ చైతన్యం వ్యాప్తికి అవిశ్రాంతంగా కృషిచేశారు. రాజకీయ స్వాతంత్ర్యోద్యమానికి పునాదులు వేయడమే కాకుండా సత్యాగ్రహం ప్రపంచ వ్యాప్తంగా శాంతియుత, అహింసాయుత పద్ధతుల్లో విదేశీ పాలన నుంచి విముక్తి పొందిన ఏకైక దేశంగా భారతదేశం ప్రసిద్ధి చెందడానికి దోహదం చేసింది.

సత్యాగ్రహం స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం మొదలైన విలువలకు ప్రాధాన్యమిస్తుంది. వ్యక్తిని, సమాజాన్ని శాసనం చేయటం సత్యాగ్రహం ప్రాథమిక ఉద్దేశం. మార్క్సిస్టు దృక్పథంలో వ్యక్తి, వ్యక్తిగతంగా కాకుండా ఒక వర్గంలో సభ్యుడుగా శత్రువును నాశనం చేయడానికి ప్రయత్నిస్తాడు. ఈ ప్రక్రియలో వ్యక్తి శత్రువు ఉనికిని, స్వేచ్ఛను తొలగించటానికి ప్రయత్నిస్తాడు. అయితే సత్యాగ్రహి అహింసాయుత పద్ధతుల్లో శత్రువు స్వేచ్ఛను, ఉద్దేశాలను నాశనం చేయటం కాకుండా స్వీయ బాధలతో ప్రతి ద్వంద్విలో మానసిక పరివర్తన తీసుకొని రావడానికి అతనిపై నైతిక ఒత్తిడి, ప్రభావం కలిగించడానికి ప్రయత్నిస్తాడు.

పైన చర్చించిన అంశాలు, సత్యాగ్రహం సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో మార్పులు తీసుకొని రావడానికి ఒక అద్భుతమైన, శాంతియుత, అహింసా సాధనం అనిచెప్పవచ్చు. దానిని వ్యక్తిగత, సమాజం, రాజ్యం, జాతీయ, అంతర్జాతీయ రంగాలకు వర్తింపజేయవచ్చు. సామాజిక పరివర్తనకు అత్యంత శక్తిమంతమైన సాధనాన్ని గాంధీజీ ప్రపంచానికి అందించారు.

## 19.9 గాంధీ తత్వంలో సంప్రదాయం, ఆధునికతలు

పశ్చిమ, పాశ్చాత్యీకరణ భావాలకు విరుద్ధంగా గాంధీ కొన్ని అభిప్రాయాలను వ్యక్తంచేశారు. భారతీయ సంప్రదాయం, పద్ధతుల్లో ప్రజలను స్పందింపజేయడానికి, వారితో సంభాషించడానికి ఆయన ప్రయత్నించాడు. అంతేకాదు ఇందులో అమోఘమైన విజయం సాధించారు. చరఖాను వినియోగించడం మొదలైన పద్ధతులు, అహింస మొదలైన భావాలు గాంధీని సంప్రదాయ, సనాతన వాదిగా ముద్రవేశారు. భారతీయ సమాజం సమస్యలపట్ల ఆయనకు ఒక సొంత దృక్పథముంది. అయితే అంత మాత్రాన ఆయనను సంప్రదాయవాది అని ముద్ర వెయ్యటం సముచితం కాదు.

గాంధీ ఆధునికతను పూర్తిగా వ్యతిరేకించలేదు. విస్మరించలేదు. అలా అని మొత్తం సంప్రదాయాన్ని విమర్శనా రహితమైన దృష్టితో ఆయన అంగీకరించలేదు. భారతదేశం సంప్రదాయాన్ని అధిగమించి ఆధునికం కావాలన్నది ఆయన ధ్యేయం. అయితే సదరు ఆధునికత – పారిశ్రామికీకరణ, యాంత్రికీకరణ – వ్యక్తి నివాసానికి, వ్యక్తి ఉనికి భంగం కాకూడదని గాంధీ భావించాడు. వ్యక్తి స్వేచ్ఛ, సమానత్వం మొదలైనవి అనుభవించాలి. దానికి కావలసిన ఆధునికతను సంతరించుకోవాలి. అలా అని ఆధునికత పేరిట మొత్తం సంప్రదాయాన్ని పూర్తిగా విస్మరించకూడదు. ఎందుకంటే గతంతో సంబంధం లేకుండా ప్రస్తుతం ఏర్పడదు. మరో మాటలో చెప్పాలంటే రుడాల్ఫ్ దంపతులు భావించినట్లు సంప్రదాయంలో ఆధునికతను సమ్మిళితం చేయటానికి గాంధీ ప్రయత్నించారు.

## 19.10 గాంధీ అరాచకవాదం

గాంధీని అరాచక వాది అనికొన్ని సందర్భాల్లో వర్ణిస్తారు. రాజ్యం అంతరించాలని ఆయన అన్నది నిజమే. వ్యక్తి సంపూర్ణ వికాసానికి రాజ్య యంత్రాంగం అడ్డంకి కారాదని గాంధీ భావిస్తారు. కానీ ఇతర అరాచక వాదుల లాగా రాజ్యమొక అనవసరమైన, అవాంఛనీయమైన వ్యవస్థ కాబట్టి దానిని నాశనం చేసి వర్గరహిత సమాజం నిర్మించాలని గాంధీజీ భావించలేదు. అరాచక వాదుల లాగ గాంధీ కూడా రాజ్యం అధిక అధికారాలను సంతరించుకొని వ్యక్తి స్వేచ్ఛను హరిస్తుందని భావించారు. ప్రోథాన్, బాకునిన్, మొదలైన విప్లవాత్మక అరాచక వాదులు హింసాయుత పద్ధతుల ద్వారా రాజ్య వ్యవస్థను నాశనం చెయ్యాలని వాదిస్తారు.

అయితే గాంధీ హింసాయుత పద్ధతులను తిరస్కరించాడు. ఈ సందర్భంలో ఆయన భావాలు విలియం గాడ్విన్, టాల్‌స్టాయ్ మొదలైన తాత్విక అరాచక వాదుల భావాలకు దగ్గరగా ఉంటాయి. వ్యక్తి ఆలోచన, హేతుబద్ధతలపట్ల గాడ్విన్ అధిక విశ్వాసం చూపాడు. అలాగే నైతికత అన్ని మానవ చర్యలకు మూలమని టాల్‌స్టాయ్ సిద్ధాంతీకరించాడు. గాంధీ భావాలు వీరి అభిప్రాయాలకు సన్నిహితంగా ఉంటాయి.

BRAOU

గాంధీ రాజ్యాన్ని లేదా రాజకీయాన్ని తిరస్కరించలేదు. అరాచక వాదులతో ఆయన విభేదించింది ఎక్కడంటే రాజ్యం పట్ల పూర్తి వ్యతిరేకత చూపకపోవడంలోనే. రాజ్యంపై పూర్తిగా ఆధారపడకుండా వ్యక్తి, సమాజం సామూహిక చర్యలు, సామూహిక చైతన్యం ద్వారా ముందుకు సాగినప్పుడు ఎంత శక్తిమంతమైన రాజ్య యంత్రాంగాన్నైనా అదుపులో ఉంచవచ్చని గాంధీ భావించారు. ఆయన రాజ్యం కొన్ని నిర్దిష్ట లక్ష్యాలను చేరుకోటానికి ఒక సాధనంగా ఉపయోగపడాలన్నారు.

అంతేకాకుండా గ్రామ పంచాయతీల ఏర్పాటు ద్వారా స్వయం సమృద్ధతను సాధించి గ్రామ గణతంత్రాలను ఏర్పాటుచేసుకోవటం ద్వారా రాజ్య యంత్రాంగం ప్రాముఖ్యం తగ్గించవచ్చని గాంధీ వాదించారు. గ్రామ వ్యవస్థల ఏర్పాటు ద్వారా పౌరుడు స్వయం పాలనలో కూడా తగిన శిక్షణ పొందవచ్చు, అట్టడుగు స్థాయిలో గ్రామ పంచాయితీలు అతిచిన్న రాజ్యాలుగా గ్రీక్ నగర రాజ్యాల గా మనగలుగుతాయని ఆయన విశ్వాసం.

మరో మాటలో చెప్పాలంటే గాంధీ ఆధునిక కేంద్రీకరణను వ్యతిరేకించారు. వికేంద్రీకరణ హింసను దోపిడీని తొలగించి స్వయం సమృద్ధతను సాధించడానికి తమ కాళ్ళపై తాము నిల్చేటట్లు ప్రజలు ప్రయత్నించేలా చేస్తుందని ఆయన భావించారు. చిట్టచివరికి రాజకీయ వ్యవస్థ ప్రజల ఆమోదంతో, సహకారంతో కొనసాగాలని గాంధీ విశ్వసించారు.

అనేక విషయాలలో గాంధీజీ మార్క్సిస్టులతో కూడా ఏకీభవించలేదు. పెట్టుబడిదారీ విధానం మార్క్సిస్టు దృక్పథంలో అన్ని దోషాలకు మూలకారణం. అది సమాజాన్ని రెండు వర్గాలుగా విభజిస్తుంది. ఈ రెండు వర్గాల్లో – పెట్టుబడి దారీ, శ్రామిక వర్గాలు – పరస్పరం భిన్నమైన ఆసక్తులతో వర్గ సంఘర్షణకు దారితీస్తాయి. మార్క్సిస్టు దృక్పథంలో రాజ్య మొక దోపిడీ సాధనం. రాజ్య యంత్రాంగం వర్గ దోపిడీకి అంటే పెట్టుబడి దారీ వర్గం చేతుల్లో ఒక శక్తిమంతమైన

సాధనం కాబట్టి రాజ్యరహిత, వర్గ రహిత సమాజం ఏర్పడాలని అది శ్రామిక వర్గం అంతిమ ధ్యేయమని మార్క్సిస్టులు వాదిస్తారు.

అయితే గాంధీజీ పై వాదాలతో ఏకీభవించలేదు. గాంధీ అభిప్రాయంలో పెట్టుబడిదారీ వర్గం మానవతా దృక్పథంతో కూడి ఉండాలి. ఈ సందర్భంలోనే ఆయన ఆస్తిని ఒక ధర్మ నిధిగా వర్ణించారు. సంపద దానంతట అదే దుర్గుణం కాదు. సంపదను వినియోగించడంలో దుర్గుణం వ్యక్తమవుతుంది. సంపన్నులు సంపదను భగవంతుడు తమకు ఇచ్చిన వరంగా భావించి తమ అవసరాలకోసం దాన్ని వినియోగించుకొని, మిగిలిన సంపదను ప్రజల ప్రయోజనాలకు వెచ్చించాలని గాంధీ భావిస్తారు. అలాగే ఆయన రాజ్య వ్యవస్థ ప్రాధ్యాతను వికేంద్రీకరణ ద్వారా, స్వయం సమృద్ధత ద్వారా, ప్రజా ఉద్యమాల ద్వారా తగ్గించాలని భావించారే కానీ మొత్తం రాజ్యవ్యవస్థ అనవసరమని, అవాంఛనీయమని, అది దోపిడీ దారీ వర్గం ప్రతినిధి అని నిర్ధారించలేదు.

## 19.11 ఉదారవాద ప్రజాస్వామ్యం

గాంధీ పశ్చిమ ఉదారవాద ప్రజావ్యవస్థను తీవ్రంగా విమర్శించారు. ఎందుకంటే ఆయన ఉద్దేశంలో పశ్చిమ సాంకేతిక విజ్ఞానం కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో అవిర్భవించింది. అక్కడ యాంత్రికీకరణలు కొన్ని నిర్దిష్ట పరిస్థితుల్లో ఏర్పడ్డాయి. అయితే అవి భారతీయ ప్రజలకు, సమాజానికి పూర్తిగా సరిపడవు. ఎక్కువ స్థాయి వికేంద్రీకరణతో రూపొందిన రాజకీయ ఆర్థిక వ్యవస్థను గాంధీ సమర్థించారు.

పశ్చిమ దేశాల్లో అమలులో ఉన్న ప్రజాస్వామ్యంలో ఎక్కువ అధికారాలను కేంద్రీకరింపజేసిందని గాంధీ అభిప్రాయం. ప్రత్యక్ష ఎన్నిక ద్వారా ఏర్పడిన పార్లమెంట్, కార్యనిర్వాహక వర్గం, న్యాయశాఖ వ్యక్తిని రాజ్యానికి కట్టుబానిసను చేస్తుందని గాంధీ విమర్శించారు. అది వ్యక్తిలో చొరవను, సృజనాత్మక శక్తిని హరిస్తుందని ఆయన అభిప్రాయం.

BRAOU

పాశ్చాత్య ఉదార ప్రజాస్వామ్యం అధికారాలను కేంద్రీకరించి స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తుంది. కేంద్రీకరణ హింసకు, నిర్బంధానికి దోహదం చేస్తుంది. దీనితో పెట్టుబడి దారీ వాదం మూలస్తంభమైన ఉదారవాద ప్రజాస్వామ్య సమాజంలో వైరుధ్యాలను మరింత తీవ్రతరం చేస్తుంది. కాబట్టి గాంధీ ఉద్దేశంలో పశ్చిమ ఉదారవాద ప్రజాస్వామ్యం భారతదేశానికి సరిపడదు.

పాశ్చాత్య ఉపయోగితావాదం – అధిక సంఖ్యాకుల అత్యధిక ప్రయోజనం – సిద్ధాంతాన్ని కూడా గాంధీ వ్యతిరేకించాడు. 51 శాతం ప్రజలకు లాభం చేకూరుతుంది కాబట్టి ఏ చర్య అయినా సమర్థనీయం అనే ఉపయోగితావాదం, అధిక సంఖ్యాక సూత్రం నైతికతను, సార్థకతను గాంధీ తీవ్రంగా వ్యతిరేకించారు. నిజమైన నైతిక సూత్రం ధ్యేయం అందరి శ్రేయస్సును అధిక స్థాయిలో సమకూర్చటమే అని గాంధీ భావించారు. అయితే దీనిని అధిక త్యాగం ద్వారా, సర్వోదయ భావం వ్యాప్తి ద్వారా సాధించడం సాధ్యమని ఆయన అభిప్రాయం. హింస, దోపిడీ, బానిసత్వం అన్ని రకాల పీడనకు, దౌర్జన్యానికి అతీతంగా సమాజం రూపొందాలి. అప్పుడే సామాజిక జీవనం ప్రశాంతంగా ఉంటుంది.

## 19.12 అహింసాయుత సమాజం – గ్రామస్వరాజ్యం

అహింసాయుత పద్ధతుల ద్వారా సమాజాన్ని ఏర్పాటుచెయ్యాలని గాంధీ భావించారు. అయితే అది పూర్తి ఆచరణ రూపం ధరించలేదు. ప్రభుత్వ విధానాన్ని కూడా ప్రజలే వారి నైతిక, ఆధ్యాత్మిక భావాల ప్రకారం రూపొందించాలని ఆయన భావించారు. కానీ ఆ ఆలోచన ఊహాత్మకంగానే మిగిలిపోయింది.

గాంధీ ఉద్దేశంలో ప్రజలకు రాజ్యంతో అవసరం లేదు. ఆయన రాజ్యాన్ని ఒక హింసాయుత యంత్రాంగంగా

భావించారు. కారణం, ప్రభుత్వ వ్యవహార సరళి హింసాయుతంగా ఉండటమే. హింస, దమన నీతి రాజ్యం ప్రతీక అని గాంధీ నిశ్చితాభిప్రాయం. వ్యక్తుల వ్యక్తిత్వాలకు, స్వేచ్ఛకు రాజ్యం ప్రబలవిరోధి. అందువల్ల రాజ్య రహిత సమాజం వ్యక్తి వికాసానికి, సమాజాభివృద్ధికి వాంఛనీయమని గాంధీ వాదిస్తారు.

అటువంటి రాజ్యంలో వర్గాలుండవు. అందువల్ల అనేక స్వయం సమృద్ధమైన గ్రామీణ సంఘాలుంటాయి. ప్రతి గ్రామానికి ఒక పంచాయితీ సంస్థ ఉంటుంది. అది గ్రామ అవసరాలను తీర్చి రక్షణ సమకూరుస్తుంది. ఈ విధంగా ప్రతిగ్రామం స్వయం సమృద్ధంగా, స్వతంత్రంగా ఉంటుంది. అటువంటి గ్రామాలు ఒక కూటమిగా ఏర్పడతాయి. ఈ కూటమిలో స్వయం ప్రతిపత్తిగల అనేక గ్రామాలుంటాయి. వీటికి సైన్యం, న్యాయ సాధనాలు, కారాగారాలు ఉండవు. వీటిలో అధికార వికేంద్రీకరణ ప్రస్ఫుటంగా ఉంటుంది. అహింసాయుత సమాజంలో వికేంద్రీకరణ, సహకారం ఎక్కువగా ఉంటాయి.

పై రకమైన గ్రామ రాజ్యం భారతదేశంలో 'రామరాజ్యం' అవతరణకు దోహదం చేస్తుందని గాంధీ భావించారు. ప్రతివ్యక్తి నిజాయితీతో జీవించాలని, శారీరక శ్రమతో ఉత్పత్తిని పెంచాలని ఆయన ఉద్బోధించారు. దీనివల్ల జీవితంలో క్రమశిక్షణ అలవడుతుందని, ధనిక వర్గంలో కూడా మార్పు వస్తుందని, ఫలితంగా వర్గరహిత సమాజం ఏర్పాటు సాధ్యమని గాంధీ ఆశించారు. ఆదర్శప్రాయ సమసమాజం అవతరణ ద్వారా వర్ణాశ్రమ విధానంలో కూడా మార్పు వస్తుందని గాంధీ వాదించారు.

గాంధీ సామ్యవాది కాదు, సమష్టివాది కాదు, కమ్యూనిస్టు అసలే కాదు. కానీ సమాజంలోని నిరుపేదలను ఉద్ధరించటం ఆయన ధ్యేయం. దానికోసం సమాజంలో నూతన ఆధ్యాత్మిక విలువలను పెంపొందించాలని గాంధీ ఉద్యమించారు. ప్రజల్లో నైతిక జీవనం అవసరమని, దానికి తాత్విక విచార సహాయం పడుతుందని భావించారు. సర్వమానవ సంఘీభావం వ్యాప్తికి ఆయన జీవితాంతం అవిరళ కృషిచేశారు. సమతావాదం, శాంతి, సౌభ్రాతృత్వం జాతి మనుగడకు అత్యవసరమని గాంధీ ఉద్బోధించారు.

BRAOU

స్వాతంత్ర్యానంతరం గాంధేయ సిద్ధాంతాలను వక్రీకరించడం దురదృష్టకరం. ఆయన సిద్ధాంతీకరించినట్లు కాకుండా కేవలం పశ్చిమ దేశాల ప్రజాస్వామ్యాన్ని ఏర్పాటుచేయుటం, యాంత్రిక పారిశ్రామిక విధానం, కేంద్రీకృత ప్రణాళికలు, శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి పట్టణాలను విపరీతంగా పెంచి పల్లె సీమలను ఎడారులుగా మార్చివేశాయి.

## 19.13 ముగింపు

ప్రజల్లో అజ్ఞానాన్ని తొలగించి వారు దోపిడీకి విరుద్ధంగా, బానిసత్వానికి వ్యతిరేకంగా శాంతియుత, అహింసా మార్గాల్లో పోరాటం సాగించాలని ఆ విధంగా వారిని తీర్చిదిద్దడానికి గాంధేయవాదం మౌలికంగా ప్రయత్నిస్తుంది. అప్పుడే నిజమైన విప్లవం ద్వారా సమాజం ఆశించిన ధ్యేయాలను సాధిస్తుంది.

ప్రారంభంలో వ్యక్తులు, సమూహాలు వారి వారి ప్రయోజనాల విషయంలో వైవిధ్యాలు, వైరుధ్యాలు చూపించినప్పటికీ వాటిని తొలగించుకొని మానవతా దృక్పథంతో సమాజాన్ని పునర్నిర్మించుకొంటారు.

అహింస, స్వయం సమృద్ధత మొదలైన సాధనాల ద్వారా బహుతావాద సమాజాల్లో ఒక నైతిక భావనను, దృక్పథాన్ని ప్రజానీకానికి అందివ్వటానికి గాంధీ తత్వం ప్రయత్నించింది.

– డా. వి. రవీంద్రశాస్త్రి

## 19.13 ఉపయుక్త గ్రంథాలు

1. R.R. Diwakar : Satyagraha : Its Techniques and History.

2. Radhakrishnan.S. : Mahatma Gandhi.

3. Gandhi M.K. : My Experiments with Truth.

## 19.14 మాదిరి పరీక్షప్రశ్నలు

I వ్యాస ప్రశ్నలు

1. గాంధీజీ తాత్విక చింతనకు గల ఆధారాలను, లక్షాయ్యలు సాధనాలను పేర్కొనుము.

2. సత్యాగ్రహం ప్రాధాన్యత – పద్ధతులను వివరించుము.

3. గాంధీజీ ప్రజాస్వామ్య భావనల గురించ విశదీకరించుము.

II సంక్షిప్త ప్రశ్నలు

1. గ్రామస్వరాజ్యం

2. హిజరత్ అంటే ఏమిటి?

3. అరాచకవాదం గాంధీ తత్వం గురించి సంక్షిప్తంగా వివరించుము.

BRAOU

## 20.11 నమూనా పరీక్షా ప్రశ్నలు

I వ్యాసరూప ప్రశ్నలు

1. గతి తార్కిక భౌతిక వాదాన్ని వివరింపుము

2. వర్గ సిద్ధాంతాన్ని చర్చించుము.

3. మార్క్స్ ప్రతిపాదించిన చారిత్రక పరిణామ దశలను గూర్చి వ్రాయుము.

II సంక్షిప్త ప్రశ్నలు

1. సమ సమాజ భావన

2. కమ్యూనిస్టు వ్యవస్థ

3. చారిత్రక భౌతికవాదం

# భాగం 20 - మార్క్సిస్టు నమూనా

విషయుక్రమం


| | |
|---|---|
| 20.1 | లక్ష్యాలు-ఉద్దేశం |
| 20.2 | పరిచయం |
| 20.3.0 | మార్క్సిస్టు దృక్పథం |
| 20.3.1 | గతితార్కిక భౌతికవాదం |
| 20.3.2 | చారిత్రక భౌతికవాదం |
| 20.4 | సామాజిక భావన-పరివర్తన |
| 20.5 | వర్గ సమాజం-వర్గ పోరాటాలు |
| 20.6 | సమసమాజం-సామ్యవాదం |
| 20.7 | కమ్యూనిజం |
| 20.8 | రాజ్యం- మార్క్సిస్టు దృక్పథం |
| 20.9 | ముగింపు |
| 20.10 | చదువదగిన పుస్తకాలు |
| 20.11 | నమూనా పరీక్షా ప్రశ్నలు |


BRAOU

## 20.1 లక్ష్యాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు మార్క్సిస్టు ధృక్పథాన్ని తెలుసుకుంటారు.

★ సామాజిక పరిణామ క్రమాన్ని అర్థం చేసుకుంటారు.

★ వర్గ పోరాటాలను గురించి

★ సమసమాజ భావనను గురించి వివరించగలుగుతారు.

## 20.2 పరిచయం

మానవజాతి చరిత్రకు సరికొత్త భాష్యం చెప్పిన తత్వవేత్త కారల్‌మార్క్స్. ఇప్పటి వరకు గడిచిపోయిన మానవజాతి చరిత్ర సమస్యల వర్గపోరాటాల చరిత్రేనని సూత్రీకరించి, దోపిడీ, పీడనల నుంచి విముక్తం కావటానికి పోరుబాట తప్పదని తేల్చిచెప్పిన మార్క్స్ శాస్త్రీయ కమ్యూనిజానికి రూపశిల్పి.

కారల్‌మార్క్స్ (1818-1883) ప్రతిపాదించిన సామాజిక సిద్ధాంతాన్నే మార్క్సిజం అంటున్నాం. ఆధునికప్రపంచంలో సామాజిక వ్యవస్థను అంత స్పష్టంగా, శాస్త్ర బద్ధంగా వివరించిన సిద్ధాంతం మరొకటి లేదు. అలాగే ప్రజానీకంలో అంతటి ప్రాచుర్యంపొందిన దృక్పథంకూడా ఇంకొకటిలేదు. నేడు విశ్వవ్యాప్తంగా ఆకలి, దోపిడీ, అన్యాయాలతో అలమటిస్తున్న అశేష ప్రజల జీవితాల్లో ఆయన ప్రతిపాదించిన సైద్ధాంతం ఒక ఆశాకిరణమైంది. దోపిడీ,

దౌర్జన్యాలకు, అసమానతలకు వ్యతిరేకంగా తలెత్తుతున్న విముక్తి ఉద్యమాలకు మార్క్సిజం సిద్ధాంతికపునాది అయ్యింది. మానవుడే సృష్టికర్తని చాటి, పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్ళు తప్పని, విప్లవ శక్తుల వెన్నుతట్టి నిలబెట్టిన మార్క్సిజం ప్రపంచ గమనానికి మార్గం నిర్దేశించింది..

ఒక సిద్ధాంతం ప్రపంచాన్ని ఇంతగా ప్రభావితం చేయడానికి గల కారణం ఏమిటి? విశ్వవ్యాప్తంగా ఇంత ప్రాచుర్యం పొందిన మార్క్స్ సామాజిక, నిర్మాణం, మార్పులను ఎలా విశ్లేషించాడు? ఆయన ప్రతిపాదించిన నమూనా ఏమిటో తెలియజేయడం ఈ పాఠ్యాంశపు ప్రధాన లక్ష్యం.

## 20.3.0 మార్క్సిస్టు దృక్పథం

సామాజిక వికాస క్రమాన్ని చారిత్రకంగా విశ్లేషించిన కార్ల్‌మార్క్స్ చరిత్ర అధ్యయనానికి ఒక నూతన శాస్త్రీయ దృక్పథాన్ని ఆవిష్కరించాడు. జర్మన్ తత్వవేత్త జార్జి ఎఫ్. డబ్ల్యు. హెగెల్ ఆలోచనలతో ప్రభావితుడైన మార్క్స్ ఆయన గతితార్కిక తత్వాన్ని ఆవిష్కరించాడు. తన ఆలోచనా పద్ధతికి హెగెల్ గతితార్కికతే మూలమని కూడా మార్క్స్ స్పష్టంగా చెప్పాడు.

హెగెల్ భావవాది. ఆయనది అధిభౌతిక ఆలోచన. ఈ ఆలోచన ప్రకారం మనకు కనిపిస్తున్న భౌతిక ప్రపంచానికి మూలమైన అధిభౌతిక శక్తి ఒకటి వుంది. ఆ అధిభౌతిక శక్తి సర్వస్వతంత్రమైనది. దాని వ్యక్తీకరణ, పర్యవసానమే భౌతిక ప్రపంచం. కాబట్టి ఈ భౌతిక ప్రపంచం హేతుబద్ధమైనది కాదు. అది నిరంతరం మారుతూ వుంటుంది. భౌతిక ప్రపంచపు పరిణామాలకు మూలమైన చిదాత్మ ఒక్కటే హేతుబద్ధమైనది, యధార్థమైనది, ఆదర్శవంతమైనది. హెగెల్ ప్రకారం అధిభౌతిక (meta physical) అయిన చిదాత్మ (spirit) ప్రభావం మూలంగానే పరిణామం సంభవిస్తుంది. అంటే సామాజిక పరిణామం ఈ అంతః శక్తిమూలంగా జరుగుతున్న ప్రక్రియ. ఈ ప్రక్రియ గతితార్కిక పద్ధతిలో జరుగుతుంది. అంటే వాదం, ప్రతివాదం, సమన్వయం ద్వారా జరుగుతుంది.

BRAOU

ప్రతిసత్యం వెనుకో వాదం వుంటుంది. తర్కానికి వాదమే మూలం. ప్రతి వాదానికి వ్యతిరేకంగా ప్రతివాదం పుడుతుంది. వాదప్రతివాదాల (పరస్పరం విరుద్ధమైన ఈ రెండు అంశాల) మధ్య అంతరించి సమన్వయం ఏర్పడుతుంది.

మార్క్స్ హెగెల్ ఆలోచనను అంగీకరిస్తూనే హెగెల్ భావ ఆధిపత్యాన్ని తిరస్కరించాడు. భావం లేదా చిదాత్మనే పరమసత్యం కాదని, చితాత్మ కేవలం భౌతిక ప్రపంచపు అభివ్యక్తి మాత్రమేనని పేర్కొన్నాడు. హెగెల్ గతి తర్కాన్ని తలకిందులుగా నిల్పోబెట్టాడని మార్క్స్ పేర్కొన్నాడు గతి తార్కికతకు భౌతిక వాదాన్ని జోడించి కొత్త దృక్కోణాన్ని ప్రతిపాదించాడు. భౌతిక ప్రపంచాన్ని గతి తార్కిక పద్ధతిలో విశ్లేషించి, గతితార్కిక భౌతికవాదం తన తాత్విక పునాది అని మార్క్స్ ప్రకటించుకున్నాడు. ఇప్పటికే గతితార్కి భౌతికవాదమే మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథానికి మూలం అయ్యింది.

### 20.3.1 గతి తార్కిక భౌతిక వాదం

భౌతిక ప్రపంచాన్ని అధ్యయనం చేయడానికి మార్క్స్ ఎన్నుకున్న మార్గం 'గతితార్కి భౌతిక వాదం' మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథానికి ఇది ఆరంభ బిందువు.

మార్క్స్ వాస్తవానికి భౌతికవాది. భౌతికవాదం సృష్టికి మూలం పదార్థం' అని చెబుతుంది. మార్క్స్ తన 'థీసిస్ ఆన్ ఫ్యూర్‌బా' గ్రంథంలో తాను విశ్వసిస్తున్న భౌతికవాదం యాంత్రికమైంది (Mechanical) కాదని అది గతితార్కికమైందని (Dialectical) పేర్కొన్నాడు. మార్క్స్ తన సిద్ధాంతాలు ప్రతిపాదించే నాటికే భౌతికవాదం అనే దృక్పథం వుండడం మూలంగా ఈ వివరణ అవసరమైంది. భౌతిక, రసాయన శాస్త్రాల్లో, ప్రకృతికి సంబంధించిన విషయ వివరణలో అప్పటి శాస్త్రవేత్తలు భౌతికశాస్త్ర దృక్పథాన్ని అనుసరించేవారు. ఈ పద్ధతి శాస్త్రబద్ధమే అయినప్పటి

దీనిని మానవ సమాజ వికాస అధ్యయనానికీ, సామాజిక శాస్త్రాల పరిశోధనకూ ఉపయోగించడం సాధ్యం కాదు. ఎందుకంటే సమాజం స్తబ్ధ పదార్థం కాదు. నిశ్చలంగా వుండదు. ఇది గతిశీలమైనది. వాస్తవికమైనది. కాబట్టి సామాజికాంశాల అధ్యయనానికి భౌతిక శాస్త్ర పద్ధతికి తోడుగా గతితార్కిక దృక్పథాన్ని జోడించవచ్చని మార్క్స్ భావించాడు. గతితార్కిక పద్ధతి అనేది నిరంతరం మార్పులకు లోనవుతూ అభివృద్ధి క్రమంలో పురోగమిస్తున్న అంశాలను అధ్యయనం చేసే శాస్త్రం ఈ పద్ధతిని హెగెల్ నుంచి గ్రహించి దానిని భౌతిక పరిస్థితులకు అన్వయించాడు మార్క్స్. మార్క్స్ ప్రకారం గతితార్కిక భౌతికవాదం అంటే భౌతిక వాస్తవాలు లేదా యదార్థతలో జరిగే మార్పులు లేదా పరిణామం తార్కికంగా జరుగుతుందనే సత్యాన్ని అంగీకరించడమే. మార్పు పరిణామం మార్పు, పరిణామం లేదా అభివృద్ధి అనేది పదార్థం లేదా వ్యవస్థలోని అంతశ్శక్తి ఫలితంగానే జరుగుతుంది. దానికి పరిసరాలు సహకరించడమో, వ్యతిరేకించడమో జరుగుతుంది. మార్పును కోరే శక్తులు పరిసరాలను కూడా తమకు అనుకూలంగా మలచుకుంటూ ముందుకు వెళతాయి. పదార్థం లేదా వ్యవస్థలోని చలన శీలతే నిర్దేశిత గమ్యాన్ని చేరడానికి దోహదపడుతుంది.

మార్క్స్ దృష్టిలో పదార్థం (సమాజం) దానంతట.అదే మారదు. అలాగని హెగెల్ చెప్పినట్టు చిదాత్మ చైతన్యం వల్ల కూడా మారదు. సామాజిక పరిణామానికి సామాజికాంశాలైన ప్రజలు, ప్రజల చైతన్యం చోదకశక్తిగా పనిచేస్తుంది. వాద ప్రతివాదాల ఫలితంగా తలెత్తే భావసంఘర్షణ భౌతికశక్తులను ప్రభావితం చేసి పరిణామానికి దోహదపడుతుంది.

మార్క్స్ గతితార్కిక భౌతిక వాదానికి హెగెల్ గతితార్కిక తత్వం మూలమని చెప్పుకున్నాం. హెగెల్ సిద్ధాంతంలో నిర్మాణానికి సంబంధించినంతవరకూ ఏ లోపం లేదని మార్క్స్ స్పష్టం చేశాడు. చారిత్రకాంశాల అధ్యయనం భావనా దృక్పథంతోనో, భౌతికశాస్త్ర అధ్యయనంతోనో వీలు పడదని అంగీకరించిన మార్క్స్ గతితార్కి భౌతికవాదాన్ని సామాజిక అధ్యయన పద్ధతిగా రూపొందించారు. జ్ఞాన చింతనలో అంతిమ బిందువు చేరుకొనేంత వరకు వాదం (thesis) ప్రతివాదం (Antithesis) సమన్వయం (Synthesis) కొనసాగుతూ నిరంతరం సంఘర్షించుకుంటూ వుంటాయి. ఘర్షణలోంచే జ్ఞానం విరాజిల్లుతుంది. సృష్టి వికసితమవుతుంది. మానవ సమాజ వికాసానికి మనిషే మూలధాతువు. సామాజిక చరిత్ర నిర్మాతలు మనుషులే. అలాగని మనుషులు తమకు తోచిన విధంగా, భావ బంధితమైన వూహాలోకం నిర్మించుకోవడం కాదు. మనిషి ఏ భౌతిక పరిస్థితుల్లో, ఏ సామాజిక పరిసరాల్లో జీవిస్తున్నారో ఆ పరిస్థితులు, పరిసరాలకు వారి అవసరాలకు అనుగుణంగా వారు ఆ పనిచేగలుగుతారు. అంతేతప్ప చరిత్ర చిదాత్మ చిద్విలాసం కాదు.

BRAOU

హెగెల్ తన గతితర్కాన్ని 'తలమీద నిల్చోబెట్టాడు దాన్ని కాళ్ళమీద నిల్చోబెట్టడమే నావుద్దేశ్యం అని మార్క్స్ పేర్కొన్నాడు.

మార్క్స్ కేవలం సిద్ధాంత బోధ చేయలేదు. గతితర్కాన్ని భౌతిక యథార్థతకు అన్వయించి ఆ సూత్రాన్ని సామాజిక పరివర్తనను శాస్త్రబద్ధంగా సిద్ధాంతీకరించడానికి ఉపయోగించాడు. ఇది తాత్విక భావన. ఈ భావనను భూమికగా చేసుకుని, చారిత్రక మూలాల్లోని సామాజికాభివృద్ధి క్రమాన్నే వివరించాడు. అదే చారిత్రక భౌతిక వాదం.

## 20.3.2 చారిత్రక భౌతికవాదం

మార్క్స్ ప్రతిపాదించిన ప్రాపంచిక దృక్పథం గతితార్కిక భౌతికవాదమని ముందే పేర్కొన్నాం. ఈ దృక్పథంతోనే ఆయన సామాజిక అధ్యయనాన్ని సాగించాడు. మానవ సమాజాల చారిత్రక వికాసగతిని అధ్యయనం చేసే క్రమంలో ఆయన మానవజాతి చరిత్ర సమస్తం వర్గపోరాటాల చరిత్రేనని గుర్తించాడు.

1848వ సంవత్సరంలో ఫ్రెడరిక్ ఎంగెల్స్‌తో కలిసి ''కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక''ను ప్రచురించినమార్క్స్ అందులో సామాజిక వికాస క్రమచరిత్రను చిత్రించాడు. చరిత్రను భౌతికవాద దృష్టిలో పరిశీలించడం ఉత్పత్తి సంబంధాల ద్వారా వివరించడమే చారిత్రక భౌతికవాదం అవుతుంది.

మార్క్స్ సమాజ ఆవిర్భావం మొదలు గడిచిపోయిన మానవజాతి చరిత్రనంతా గతితార్కిక భౌతిక పద్ధతిలో అధ్యయనం చేశాడు. ఆయన ప్రకారం చరిత్ర అంతా పరస్పర వైరుధ్యాలు గల శక్తుల సంఘర్షణ. నిరంతరమూ కొనసాగుతూ వస్తోన్న ఈ ఘర్షణ కొన్నిసార్లు అంతర్గతంగా మరికొన్నిసార్లు బహిరంగంగా వుంటుంది. ఆధిపత్య వర్గాలకు, అణగారిన జనానికి మధ్య సాగే ఈ ఘర్షణే సామాజిక వికాసానికి మూలం అని మార్క్స్ పేర్కొన్నాడు.

చరిత్రను పరిశీలించటం అంటే రాజులు, రాజ్యాలు, పాలనా కాలపు తారీఖుల తాలూకూ దస్తావేజులు కాదు. చరిత్ర అనేది గతకాలపు ప్రజల్లో పాట్లు, కష్టనష్టాలు, వారి మనుగడ, ఆ మనుగడ కోసం సాగిన మహత్తర పోరాటం. చరిత్రను చదవడం అంటే అప్పటి సమాజాలను చదవడం, అంటే అప్పటి సమాజాలకు పునాది అయిన భౌతిక వస్తువుల అధ్యయనం ఈ భౌతిక వస్తువులు పనిముట్లు, ఉత్పత్తి సంబంధాలు ఆర్థిక వ్యవస్థతో కూడిన మొత్తం అప్పటి సమాజం, ఆ సమాజంలోని మానవ సంబంధాలు, భౌతిక పరిస్థితులలో చరిత్రకు అర్థం పడతాయని మార్క్స్ భావించాడు. చారిత్రక ఘటనలకు భౌతిక పునాదిని వెతికి కార్ల్‌మార్క్స్ చరిత్రకు ఒక శాస్త్రీయమైన రూపాన్నిచ్చారు. హెగెల్ ఆదర్శవాదాన్ని శాస్త్రరూపానికి సమన్వయ పరిచాడు. సమాజానికీ చరిత్రకూ మధ్య సంబంధం కలిపే ప్రయత్నమే చారిత్రక భౌతిక వాదం అయ్యింది.

మార్క్స్ కంటే ముందు కాలంలో చారిత్రక విశ్లేషణ ఆధ్యాత్మిక, భౌగోళిక అంశాలను బట్టి మాత్రమే జరుగుతుండేది. భగవంతుడే సృష్టికి మూలమని కొందరు భావిస్తే, ప్రకృతి, పరిసరాలు, ఇతర భౌగోళిక అంశాలే సమాజాన్ని నడిపించాయని, నడిపిస్తున్నాయని మరికొందరు అంటుండేవారు. అదంతా అబద్ధమంటాడు మార్క్స్. చరిత్రలోని ప్రతి ఘట్టమూ మనిషి ఆర్థిక కార్యకలాపాల ఫలితమేనని పేర్కొన్నాడాయన. పాలకుల గొప్పతనాలు, తప్పిదాలు, గొప్పవారి గోత్రాలే చరిత్ర కాదని మనిషి తన అవసరాల కోసం సాగించిన ప్రతి కార్యమూ చరిత్రేనని మార్క్స్ భావించాడు.

చారిత్రక అధ్యయనం ఆసమాజపు ఆర్థిక కారణాలు, ఉత్పత్తి శక్తులు ఉత్పత్తిలో పాల్గొన్న శక్తుల మధ్య సంబంధాలను పరిశీలించవలసి వుంటుంది. చరిత్రను సామాజిక భౌతిక పరిసరాల నేపథ్యంలో పరిశీలించిన మార్క్స్ మొట్టమొదటిసారిగా ఒక సమగ్రమైన సామాజిక ఆవిర్భావ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు.

BRAOU

## 20.4 సామాజిక భావన–పరివర్తన

మార్క్స్ చారిత్రక భౌతికవాద దృక్పథం మానవ సమాజాల అధ్యయనానికి తోడ్పడింది. ఈ పద్ధతిలోనే మార్క్స్ సమాజ ఆవిర్భావ సిద్ధాంతాన్ని శాస్త్ర బద్ధం చేశాడు. ఒకానొక చారిత్రక సందర్భంలోని అవసరాలు పరిస్థితులే మనిషిని స్వేచ్ఛగా స్వతంత్రంగా తిరుగుతున్న మనిషి ఎందుకు సంఘటితమైనట్లు, ఏ శక్తులు మనిషిని సంఘటిత పరచాయని మార్క్స్ పేర్కొన్నాడు. ఆయన దృష్టిలో సమాజం మనిషి సృష్టించుకొన్న మహత్తర వ్యవస్థ. మనిషిని కలిపి సమాజాన్ని సృష్టించాయి అనే ప్రశ్నలకు మార్క్సిజం ఆకలి, అవసరాలు అనే సమాధానాన్నిస్తుంది. చారిత్రక భౌతికవాదం వివరణలో మార్క్స్ ఇలా పేర్కొన్నాడు "Simple truth, which is clue to the meaning of history, that men must eat to live" పుట్టిన ప్రతి మనిషీ బ్రతకాలనుకుంటాడు బతకాలంటే తినాలి, తిండిలేకపోతే అస్తిత్వమే లేదు. అందుకే మనిషి ఆలోచనలు విస్తరింపజేశాడు. అన్వేషణ సాగించాడు. ప్రకృతినీ, పరిసరాలనలు తనకు అనుకూలంగా మార్చుకున్నాడు. తన ఆకలికే, అస్తిత్వానికే అవసరమైన భౌతిక సంపదను తన పరిసరాల నుంచీ ప్రకృతి నుంచే పొందే ప్రయత్నంలో మనిషి ఉత్పత్తి అనే ప్రక్రియను కనిపెట్టాడు. ఉత్పత్తి భౌతికమైంది. ఉత్పత్తి అయిన అదొక కొత్తసృష్టి. తన అవసరాలు తీర్చుకునేందుకు, తనకు కావాల్సిన భౌతిక వనరులను ఉత్పత్తి చేసుకునేందుకు మనిషికి పరోమనిషి సహకారం అవసరమైంది. ఒంటరిగా శ్రమించడం కంటే సామూహికంగా పనిచేస్తే వస్తూత్పత్తి పెరుగుతుందని గ్రహించాడు. సమూహంలో తన భౌతికావసరాలు ఎక్కువగా సమర్థవంతంగా తీర్చుకోగలనన్న అవగాహనే మనిషిని సంఘటిత పరిచింది. అదే స్థిరమై 'సమాజం' ఏర్పడేందుకు దోహదపడింది.

అంటే సమాజం ఏర్పడడం ఒక భౌతికావసరం. ఒక ఆర్థిక ప్రక్రియలో భాగం.

సమాజం ఏర్పడిన నాటి నుంచే నిరంతరం మారుతూ వస్తోందని మార్క్స్ పేర్కొన్నాడు. సమాజం విస్తృతమై అవసరాలు పెరిగిన క్రమంలో ఉత్పత్తి సంబంధాల్లోనూ, ఉత్పత్తి సాధనాల్లోనూ మార్పు వచ్చింది. ఉత్పత్తి ప్రక్రియ విస్తరించి, ఉత్పత్తి సంబంధాలు మార్చుకున్నా సామాజిక భౌతికావసరాలు తీరి నిస్సహాయ స్థితిలో మనిషి మతం నీడలో సర్దాడని మార్క్సిజం చెపుతుంది. మతం, దైవం, మానవాతీత శక్తి, మాయలన్నీ భౌతిక శక్తులకు భిన్నమైన అశాస్త్రీయ ఆలోచనలు. మార్క్సిజం దీనికి బద్ధ విరోధి. మతం మనిషి ఆలోచనలపై ముసుగు వేస్తుందే తప్ప వెలుగు చూడనీయదు. అందుకే మార్క్స్ మతాన్ని మత్తు మందు అన్నాడు. మతం, నైతిక జీవనం, రాజకీయాలు, సామాజిక విలువలు ఇవన్నీ భౌతిక అవసరాలు, ఉత్పత్తి, ఉత్పత్తి సంబంధాల పునాదిపై ఏర్పడలాయి. అంటే ఉత్పత్తి సంబంధాలు, భౌతిక అవసరాలే చైతన్యాన్ని నిర్ధారిస్తాయి కాని చైతన్యం భౌతిక అవసరాలను, పరిస్థితులను ప్రభావితం చేయదు. మార్క్సిజం ప్రకారం 'మనిషి చైతన్యం అతని భౌతిక పరిస్థితులను ఉనికిని నిర్ధారించదు. అందుకు విరుద్ధంగా సామాజిక భౌతిక పరిస్థితులే మనిషి చైతన్యాన్ని నిర్దేశిస్తాయి'. మనిషి చైతన్యానికి, చరిత్ర గమనానికి భౌతిక పరిస్థితులూ, అవసరాలే మూలం తప్ప ఆత్మలు, చిదాత్మలు, మతాలూ దేవుళ్ళూ కాదన్నమాట.

సంఘర్షణ, సమాలోచన, సమన్వయం మళ్లీ సంఘర్షణ ఇలా నిరంతరం మార్పులకు లోనవుతూ మానవ సమాజం ఇప్పటికే వివిధ దశలను దాటి వచ్చిందని మార్క్స్ సిద్ధాంతీకరించాడు. మనిషి తన ఉనికిని, అస్తిత్వాన్ని కాపాడుకుంటూనే భౌతిక అవసరాలను, పరిస్థితులను జయిస్తూ ఈ దశలన్నీ దాటివచ్చాడు. ఈ మహాప్రస్థానంలో ఎన్నో ఆటుపోట్లు విప్లవాలు, వినాశనాలు ఎదురైనాయి. ఈ చారిత్రక క్రమాన్ని కార్ల్‌మార్క్స్ గతితార్కిక పద్ధతిలో ఈ క్రింది విధంగా విభజించాడు. సామాజిక వికాసం ఈ ఐదు దశలగుండా సాగుతుందని ఆయన నిర్ధారించాడు.

BRAOU

*(ఎ) ఆదిమదశ* (Asiatic or Primitive age)

మానవజాతి చరిత్రలో ఇది తొలిదశ. ఈ దశలో ఉత్పత్తి శక్తులన్నీ సమూహం చేతిలోనే వుండేవి. సమూహం లేదా సమాజమే ఉత్పత్తి సంబంధాలను నిర్దేశిస్తుండేది. ఈ దశలో ఆహార సేకరణ, వేట ప్రజల ప్రధాన వృత్తిగా వుండేది. ప్రయివేటు ఆస్తి వుండేది కాదు. దీనినే మార్క్స్ ఆదిమ కమ్యూనిస్టు దశ (Age of Primitive Communism)గా అభివర్ణించాడు. ఆహారోత్పత్తి పెరగడం, ఉత్పత్తి శక్తులు, భౌతిక పరిస్థితుల్లో మార్పు ఇతర గతితార్కిక పరిణామాల ఫలితంగా హెచ్చుతగ్గులు లేని సమసమాజం అంతరించి కొత్తగా వర్గ సమాజం అవతరించింది.

*(బి) బానిసత్వదశ* (Age of Slavery)

భౌతికావసరాలు పెరిగిపోయి జీవితం సంక్షోభంలో పడిపోయిన పరిస్థితుల్లో వేట, ఆహార సేకరణ స్థానంలో పశుపోషణ వ్యవసాయం కొత్త వృత్తులుగా అవతరించాయి. వ్యవసాయం ఒక కొత్త ఉత్పత్తి ప్రక్రియగా ఎదిగింది. లోహాలు, మట్టితో పాత్రల తయారీ కొత్త వృత్తులకు అవకాశం కల్పించింది. పని క్లిష్టమైపోయింది. మానవ శ్రమ ఎక్కువగా అవసరమైంది. ఈ పరిస్థితుల్లోనే బానిస వ్యవస్థ ఆవిర్భవించింది. పనుల కోసం మనుషులను పశువుల్లా కొనుక్కోవడం అమ్ముకోవడం మొదలైంది. బలవంతులు బలహీనుల్ని బంధించి బానిసలుగా చేసుకోవడం, ఉత్పత్తి పెంచుకోవడం జరిగింది. ప్రయివేటు ఆస్తి పెంపొందింది. ఉత్పత్తి సాధనాలపై బలవంతుల పట్టు పెరిగింది. సమాజం రెండు వర్గాలుగా (బానిసలు యజమానులు) విడిపోయింది. ఆర్థిక శక్తులపై యజమానులు అదుపు సాధించుకున్నారు. పురాతన గ్రీకు, రోమన్ సమాజాల్లో బానిస వ్యవస్థ ఉనికిని గమనించవచ్చు.

*(సి) భూస్వామ్యదశ* (Feudalism)

ఇది వ్యవసాయ ఆర్థిక దశ. వ్యవసాయం ఉత్పత్తిలో ప్రధాన ప్రక్రియగా భూమి ప్రధానావసరంగా ఎదిగిన దశ. అంటే భూమి కొంతమంది చేతిలోనే కేంద్రీకృతమై వుండడం వల్ల సమాజంలో వర్గ విభజన మరింత ప్రస్ఫుటమైంది. [illegible] భూస్వాములు- అర్ధబానిసలుగా విభజన చెందింది. బానిస అధికారం సంపాదిస్తే, భూస్వాములు భూ [illegible]

సృష్టించుకొని అధిపతులైనారు. భూమిలేని పేద ప్రజలు వారికి దాసులైపోయారు. దాసులు దొరల కోసం భూములు దున్ని సాగుచేసి గరిసెలు నింపి, తమ పొట్టలు పోషించుకునేవారు. మధ్యయుగపు ఐరోపా పరిస్థితులు దీనికి మంచి ఉదాహరణ. ఇవే పరిస్థితులు ఇతర ఆసియా సమాజాల్లో కూడా కనిపిస్తాయి. అనేకానేక కారణాల వల్ల, పరిణామాల ఫలితంగా ఈ దశ అంతరించి (కొన్ని ప్రాంతాల్లో ఇంకా కొనసాగుతోంది.) నాలుగో దశ అయిన పెట్టుబడి దారీ దశకు సమాజం పరివర్తన చెందుతుందని మార్క్స్ పేర్కొన్నాడు.

(డి) పెట్టుబడి దారీదశ (Capitalism)

శాస్త్రీయాభివృద్ధి, సాంకేతిక ప్రగతి మూలంగా పరిశ్రమలు అభివృద్ధి చెంది ఒక కొత్త ఆర్థిక దశకు సమాజం చేరుకుంటుంది. పరిశ్రమలు ఉత్పత్తులు పెరిగిపోయి 'పెట్టుబడి' సమాజానికి ప్రాణవాయువులా ప్రధానాంశం అవుతుంది. సమాజంలో డబ్బు, ఆస్తులు, ఫ్యాక్టరీలు, పరిశ్రమలు ఇతర ఉత్పత్తి శక్తులమీద పట్టు కలిగిన పెట్టుబడిదార్లది ఒకవర్గం కాగా, కేవలం శరీర శ్రమపై ఆధారపడి బతికే కార్మికులు ఒకవర్గంగా ఏర్పడతారు. పెట్టుబడి దారుల చేతుల్లో ఉత్పత్తిశక్తులుంటాయి. కార్మికులు తమ నెత్తురు కరిగించి, చెమటోడ్చి కష్టపడి జీవితాలు గడుపుతారు. ఆర్థిక వ్యవస్థ, ఉత్పత్తి వనరులన్నీ పెట్టుబడిదారీ వర్గం చేతుల్లోనే వుంటాయి. రెక్కలు ముక్కలు చేసుకున్న కార్మికులకు శ్రమ ఫలితం కూడా దక్కదు. ఉత్పత్తి మొత్తం తమ శ్రమ ఫలితమే అయినా దానిమీద ఏమాత్రం అధికారం లేని నిస్సహాయ పరిస్థితి వైమనశ్యత కు దారితీస్తుంది. ఈ దశలో సామాజిక వర్గాల మధ్య దూరం మరింత పెరిగి వర్గ పోరాటానికి దారితీస్తుంది. ఈ రెండు వర్గాల్లో ఉత్పత్తి శక్తులను నియంత్రించే పెట్టుబడిదారులను బూర్జువాలు అనీ కార్మిక వర్గాన్ని ప్రొలెటేరియేట్ అని మార్క్స్ పేర్కొన్నాడు.

పెట్టుబడిదారి దశ వర్గ సమాజానికి అంతిమ దశ అని, ఇది అంతరించి సామ్యవాద దశ వస్తుందని మార్క్స్ సూత్రీకరించాడు

BRAOU

మార్క్స్ చెప్పిన ఈ పరిణామం అంతా ఒక సుదీర్ఘ సంఘర్షణ ఫలితం. ఒక్క ఆదిమ సమాజంలో తప్ప ప్రతి దశలో నూ ఈ ఘర్షణ వుంది. దోపిడీ వుంది. పీడన వుంది. బానిసలను యజమానులు, అర్ధబానిసలైన దాసులు, రైతులను భూస్వాములు, కార్మికులను పెట్టుబడిదారులు దోచుకున్నారు. వారి చెమటనీ, శ్రమనీ దోచి సంపన్నులైనారని మార్క్స్ పేర్కొన్నాడు. అందుకే ఆయన మొత్తం సమాజాలను రెండు వర్గాలుగా విభజించాడు. ఒకటి దోపిడీదార్లు, రెండో దోపిడీకి గురయిన పీడితులు.

ప్రతి సమాజానికీ ఆర్థిక వ్యవస్థే పునాది అంటాడు మార్క్స్. ఆర్థిక వ్యవస్థమీద పట్టుకలిగి వుంటే పునాది మీద పట్టు సాధించినట్టే. పునాది మీద ఏ వర్గాలకైతే పట్టు వుంటుందో ఆ వర్గాలే సామాజిక జీవితపు ఇతర ఉపరితల అంశాల మీద పట్టు కలిగి వుంటారు. అంటే ఆర్థికాంశాల మీద ఉత్పత్తి శక్తుల మీద ఆధిపత్యం కలిగి ఉన్న వర్గం ఉపరితల అంశాలైన రాజకీయాలు, చట్టం, న్యాయం, విద్య కళలు, సాహిత్యం విలువలు, సంస్కృతి తదితర అంశాలన్నిటినీ అదుపులో పెట్టుకుంటుంది. ఉత్పత్తి శక్తులు, ఆర్థిక వ్యవస్థ సంబంధాలు సామాజిక నిర్మాణపు రూపం అయితే కళలు సాహిత్యం , సంస్కృతి విలువలు రాజకీయాలు, చట్టం ఇవన్నీ దాని సారం.

మార్క్సిస్టుల ప్రకారం భౌతికావసరాలు, ఆర్థిక వ్యవస్థలో (అంటే పునాదిలో) అంతర్గతంగా అవసరాల రీత్యా ఏర్పడే వైరుధ్యాలు మరో కొత్తదనాన్ని కోరతాయి. ఘర్షణలు తలెత్తి ఉత్పత్తి సంబంధాల్లో పునాదిలోనే మార్పు అనివార్యమవుతుంది. పునాది మారితే దానంతట అదే ఉపరితలం కూడా మారుతుంది. కొత్త వ్యవస్థలో పాత సామాజిక వర్గాల స్థానంలో కొత్త వర్గాలు కొత్త కళలు, కొత్త సాహిత్యం కొత్త విలువలు ఇట్లా కొత్త సృష్టి సాధ్యపడుతుంది.

అంతర్గత శక్తుల మధ్య ఘర్షణ తీవ్రమైనప్పుడు హింస అనివార్యమవుతుంది. ఈ దశలో హింస అంతిమ పరిష్కారమని కూడా మార్క్సిస్టులు విశ్వసిస్తారు. కొత్త బీజాలు నాటే ముందు పాత ముళ్ళకంప తాలూకూ అవశేషాలను కూడా తెగనరకాల్సి వుంటుంది లేకపోతే అవే తిరిగి అంకురించి ఆటంకపరుస్తాయి.

ఈ విధంగా పాత సమాజాలు కుప్పకూలిపోయి కొత్త సమాజాలు పుట్టుక, పరిణామ క్రమాన్ని గతితార్కిక పద్ధతిలో అధ్యయనం చేసి అంతర్గంతగా భౌతిక శక్తులు పరిణామానికి ఎలా కృషిచేస్తాయో సవివరంగా పేర్కొన్నాడు. మార్క్స్. ఎంగెల్స్ పేర్కొన్నట్టు డార్విన్ మహాశయుడు జీవ పరిణామ సూత్రం కనిపెట్టినట్టే మార్క్స్ మానవ జాతి చారిత్రక పరిణామ క్రమాన్ని కనుగొన్నాడు. సామాజిక పరిణామ క్రమంలో కొత్త సమాజ సృష్టికోసం మనిషి ఎనలేని ఘర్షణ పడ్డట్టు మార్క్స్ రచనలను బట్టి తెలుస్తోంది. ఈ ఘర్షణ రానురాను పెరిగి, పెట్టుబడిదారి దశలో పతాక స్థాయిని చేరుతుందని కూడా మార్క్స్ పేర్కొన్నాడు. ఈ ఘర్షణ అంతిమంగా వర్గ పోరాటంగా రూపుదిద్దుకుంటుందని ఈ వర్గ పోరాటంలో పెట్టుబడి అంతమై సమసమాజం ఆవిష్కరించబడుతుందని ఆయన విశ్లేషించాడు. ఇంతకీ వర్గ పోరాట స్వభావం ఏమిటి? సమాజంపై వర్గ పోరాట ప్రభావం ఎలా వుంటుంది? మార్క్స్ ఈ విషయాలు ఎలా వివరించాడు. అనేది తెలుసుకోవలసిన అవసరం వుంది.

## 20.5 వర్గ సమాజం, వర్గ పోరాటాలు

మార్క్స్ చరిత్రను భౌతికవాద గతి తర్కంతో పరిశీలించాడని తెలుసుకున్నాం. ఈ దృక్పథంతో ఆయన ఆదిమకాలం నుంచీ మనుగడ సాగిస్తూ వస్తోన్న సమాజాల నిర్మాణాన్నీ, స్వభావాన్నీ అధ్యయనం చేసి మానవ సంబంధాలన్నీ ఉత్పత్తి సంబంధాలూ, ఆర్థిక సంబంధాలేనని నిర్ధారించాడు. ప్రతి దశలోనూ మానవ జాతి రెండు వర్గాలుగా (ఉత్పత్తి సంబంధాల రీత్యా) విడిపోయిందని ఒకటి ఉత్పత్తి శక్తుల మీద పట్టు కలిగిన యాజమాన్య వర్గం అయితే మరోటి కార్మిక లేదా శ్రామిక వర్గం అని పేర్కొన్నాడు.

ఈ వర్గాలు ఏర్పడడానికి ఆర్థిక, భౌతికావసరాలే కారణమని మార్క్సిస్టులు చెపుతారు. మార్క్స్ కూడా ఒక మనిషి మరో మనిషి మీద ఆధిపత్యం చెలాయిస్తున్నాడంటే ఆ మనిషికి ఉత్పత్తి శక్తులు, ఆర్థిక వనరుల మీద పట్టు ఉండడమేనని పేర్కొన్నాడు. ఒక్క ఆదిమ సమాజంలో మాత్రం ఈ తేడా వుండేది కాదని మార్క్స్ వివరించాడు. ఆదిమ దశ దాటిన తరువాతే దోపిడీ, అసమానతలు పెరిగిపోయి సమాజం వర్గాల వారీగా చీలిపోయింది. మార్క్స్ తన 'క్యాపిటల్' గ్రంథంలో ఈ పరిణామ క్రమాన్ని ప్రస్తావిస్తూ"Society divides itself into classes the privileged and the dispossessed. the exploiters and exploitant, the rulers and ruled" అని పేర్కొన్నాడు.

మార్క్స్ దృష్టిలో సామాజిక వర్గం అంటే ఉత్పత్తి వ్యవస్థలో ఒకే విధిని నిర్వర్తించే జన బాహుళ్యం. ఉత్పత్తి సంబంధాల్లో ఆ వ్యక్తి నిర్వహించే పని, హోదా, ఆర్థిక రాబడిని బట్టి వర్గం ఏర్పడుతుంది. బెండిక్స్ (Bendix), లిప్‌సెట్(Lipset)ల ప్రకారం మార్క్సిస్టులు చెప్పే సామాజిక వర్గాలు ఈ కింది వైరుధ్యాలు కలిగి వుంటాయి.

(ఎ) వర్గానికీ వర్గానికీ మధ్య ఆర్థిక వ్యత్యాసం వుంటుంది.

(బి) ఒక వర్గంలోని వ్యక్తుల మధ్య సుహృద్భావం, సాన్నిహిత్యం వుండి పరస్పర చర్యలు, సహకారం వుంటాయి.

(సి) వర్గంలోని సభ్యుల మధ్య వారియొక్క చారిత్రక ప్రాధాన్యత, పాత్రకు సంబంధించిన అవగాహనతోపాటు సంఘీభావం వుంటుంది. దీనినే మార్క్స్ వర్గ చైతన్యం(Class conciousness) అని పేర్కొన్నాడు. వర్గ చైతన్యం వ్యక్తుల మధ్య సంఘీభావాన్ని పెంచుతుంది.

(డి) ఆర్థిక వ్యవస్థను అదుపుచేయలేని నిస్సహాయత, అసంతృప్తి పీడితుల్లో ప్రబలుతుంది. దోపిడికి గురవుతున్నామన్న భావన - ఈ వర్గంలో నెలకొంటుంది.

మార్క్స్ ప్రకారం వర్గాలు ఏర్పడడానికి కేవలం ఉత్పత్తి సంబంధాల్లోని వ్యత్యాసాలే కాకుండా, ప్రజాసముదాయాల మధ్య పరస్పర సంబంధాలు, భావ ప్రసార వ్యవస్థ. నిరంతర సంఘర్షణలు - ఇవన్నీ తరచూ తలెత్తినపుడే వర్గ చైతన్యం వెల్లివిరుస్తుంది.

BRAOU

వర్గ పోరాటం అన్ని సమాజాల్లోనూ వుందని ఇది కొన్నిసార్లు బహిరంగంగాను మరికొన్ని సార్లు అంతర్గతంగానూ కొనసాగుతుంటుందని మార్క్స్ పేర్కొన్నాడు.

వర్గ పోరాటం తాను వివరించిన సామాజిక వికాస దశల్లో ఒక్కొకక చారిత్రక దశలో ఒక్కొక్క స్థాయిలో వుందని ఆయన వివరించాడు. గతంలో దోపిడికి గురయిన పీడిత వర్గం కంటే ఈనాటి కార్మిక వర్గానికి కనీసం తమ శ్రమశక్తిని 'అమ్ముకునే' అవకాశం స్వేచ్ఛయినా దొరికిందని అంటూ మార్క్స్ వర్గ సమాజపు భవిష్యత్ పరిణామాన్ని కూడా ఊహించాడు. ఆశ్చర్యకరంగా మార్క్స్ ఊహ సిద్ధాంతంగా నిలబడి, ఆచరణగా రుజువై శాస్త్రీయ సామాజిక విశ్లేషణగా చరిత్రలో చిరస్థానం పొందింది.

మార్క్స్ చారిత్రక భౌతిక వాద దృక్పథంలో గత కాలపు సామాజిక పరివర్తనను విశ్లేషించిన తరువాత భవిష్యత్ దిశను, గమనాన్ని కూడా సూచించాడు. ఆదిమ, బానిస, భూస్వామ్య, పెట్టుబడిదారీ దశలు ఎలా ఆవిర్భవిస్తాయో వివరించాడు. మిగతా చారిత్రక దశల్లో కన్నా పెట్టుబడిదారీ దశలో ఈ వైరుధ్యాలు స్పష్టంగా బయటపడి సంఘర్షణ పెరుగుతుందని భావించాడు. పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రతిదీ సరుకు రూపంలోనే వుంటుంది. మనిషికి, మానవత్వానికీ విలువలు లేకుండా పోతుంది. శ్రమ, చెమట కూడా సరుకులు అవుతాయి. మనుషులను కూడా ఉత్పత్తిని పెంచే యంత్రాలు మాదిరిగా భావించే పెట్టుబడిదారులు యంత్రాలను అరగదీసి లాభాలు పొందినట్టే, చెమటను, శ్రమను దోచి మిగులును సంపదగా మార్చుకుంటారు. కానీ మనిషి ప్రాణం వున్న చైతన్యశీలి. తాను యంత్రంలో యంత్రమై నిరంతరం తన చెమటను కండెనచేసి కరిగించి పెంచుతున్న ఉత్పత్తిని యజమాని కొల్లగొట్టుకుపోతూంటే ఎంతో కాలం ఓర్చుకోలేడు. ఓపిక పట్టలేడు. పెట్టుబడిదారుడి దగ్గర పెరుగుతున్న సంపదంతా తమ శ్రమ ఫలితమేనన్న సత్యం తెలుసుకున్న కార్మికులు సమరానికి సమాయత్తమవుతారు. సంఘటితమవుతారు. ఈ క్రమాన్ని మార్క్స్ పెట్టుబడిదారీ సమాజాన్ని విమర్శిస్తూ చేసిన సిద్ధాంత చర్చలో సవివరంగా పొందుపరిచాడు.

BRAOU

కార్మికులు వివిధ డిమాండ్లతో తొలుత ఒకవేదికపైకి వచ్చినప్పటికి అనంతరం సమిష్టి ప్రయోజనాల కోసం పోరాడే సంఘాలుగా ఏర్పడతారు. వివిధ హోదాలు, వివిధ పరిశ్రమలు ఫ్యాక్టరీలు, వివిధ అంతస్తులు అంతరాల నుంచి వచ్చిన ఈ జనం సంఘటితమై తమ పోటీ, విరోధం యజమానితోనేనన్న సత్యం గుర్తిస్తారు. అంటే ఈ దశలోనే తామంతా ఒక వర్గం అనుకుంటారు.

సామాజిక వర్గాలు ఉత్పత్తి సంబంధాల నేపథ్యంలోనే ఏర్పడినప్పటికీ వాటి వైరుధ్యాలు రాజకీయ రంగంలో ప్రతిఫలిస్తాయి.

ఎందుకంటే పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉత్పత్తి శక్తులు – ఫ్యాక్టరీలు కర్మాగారాలు ఇతర సంపద కొందరి చేతుల్లోనే కేంద్రీకృతమై వుంటుంది. ఏ వర్గమైతే ఉత్పత్తి శక్తులమీద ఆధిపత్యం కలిగి వుంటుందో ఆ వర్గమే రాజకీయాల మీద భావజాలం మీద పట్టు కలిగి వుంటుంది. నిజానికి రాజకీయ అధికారం అనేది ఒక వర్గం మరో వర్గాన్ని అణచివేసేందుకు సమీకృతమైన అధికార వ్యవస్థ. బూర్జువా వ్యవస్థలో (పెట్టుబడదారీ వ్యవస్థలో రాజ్యం ఆర్థిక దోపిడీకి, వ్యక్తిగత ప్రయోజనాల (వర్గ ప్రయోజనాల)ను కాపాడడానికి ఒక సాధనంగా తోడ్పడుతుంది. అలాగే కోర్టులు, పోలీసు వ్యవస్థ, సైన్యం ఇలా అన్ని రంగాలూ పెట్టుబడిదారుల ప్రయోజనాలకు ఊడిగం చేస్తాయి. ఈ దశలో వర్గాలు బలాబలాల సమీకరణలో నిమగ్నమవుతాయి. మార్క్స్ ఈ దశలో మొత్తం సమాజం రెండు శత్రుశిబిరాలుగా విడిపోతుందనీ, రెండు వ్యతిరేక కూటములు -- బూర్జువాలు, ప్రొలేటేరియేట్‌లుగా ఎదుగుతుందని వూహించాడు.

ఈ రెండు వర్గాలేకాక పెటీ బూర్జువాల వంటి మధ్యస్త వర్గాలు కూడా పెట్టుబడిదారీ వ్యవస్థలో వున్నప్పటికీ వర్గపోరాట క్రమంలో పెట్టుబడిదార్లు ఈ వర్గాలను కూడా ఉత్పత్తి శక్తుల మీద అధికారం నిరాకరించడంతో వారు కూడా కార్మిక వర్గం స్థాయికి దిగిపోక తప్పదు.

దానికితోడు పెట్టుబడిదారీ వర్గాలు బజారు పేటలో పడి దోపిడీని తీవ్రం చేస్తాయి. కార్మికులకు శ్రమకు తగిన

ఫలితం లభించదు. ఒకవైపు పెట్టుబడీదార్ల లాభాలు పెరుగుతాయి. మరోవైపు కార్మికుల్లో పేదరికం ప్రబలుతుంది. ఈ పేదరికం వనరుల కొరతవల్ల కాకుండా దోపిడీవల్ల పెరుగుతుంది. ఈ అమానుష పరిస్థితులు కార్మిక వర్గంలో వైమనశ్యతకు కారణమౌతాయని మార్క్స్ పేర్కొన్నాడు. వైమనశ్యత, వర్గ కసి తీవ్ర రూపం దాల్చి అంతిమంగా విప్లవం వస్తుందని మార్క్స్ విశ్వసించాడు. ఆర్థిక సంక్షోభం తీవ్రమైన పరిస్థితుల్లో విప్లవం ఎలా సిద్ధిస్తుందో మార్క్స్, ఎంగెల్స్ కళ్లకు కట్టినట్టు వివరించారు."Finally, in times when the class struggle nears the decisive hour, the process of dissolution going on within the ruling class, infact within the whole range of old society, assumes such a violent, glaring charecter, that a small section of the ruling class cuts itself a drift and joins the revolutionary class, the class that holds the future in its hands. Just as therefore, at an earlier period, a section of the nobility went over to the bourgeoisie, so now a portion of the bourgeois ideologists who have raised themselves to the level of comprehending theoretically the historical movement as a whole".

విప్లవం పెట్టుబడిదారుల పేకమేడల్ని కుప్పకూల్చుతుంది. దాని స్థానంలో కార్మిక వర్గ నియంతృత్వం ముందుకు వస్తుంది. విప్లవం అంటే రక్తపుటేరులు పారాలనే లేదు. కొన్నిసార్లు పెట్టుబడిదారులను లొంగదీసుకుని ఆస్తులు అధికారాలన్నీ లాక్కొని వారిని కార్మికుల స్థాయికి తేవడం కూడా విప్లవంలో భాగమే అయితే అనివార్యమైనపరిస్థితుల్లో ఉత్పత్తి శక్తులను, యంత్రాలను ఫ్యాక్టరీలను మొత్తంగా ధ్వంసం చేయడం అభౌతికం చేయడం కూడా జరుగుతుంది. పోరాటంలో హింస అనివార్యమని పురిటి నొప్పుల బాధను అనుభవించకుండా ఏ తల్లీ ప్రసవించదని అలాగే హింస లేకుండా ఏ విప్లవం పరిపూర్ణం కాదని మార్క్సిస్టులు నమ్ముతారు. పాత వ్యవస్థను సమూలంగా నాశనం చేసిన తరువాత దాని స్థానంలో నూతన వ్యవస్థ అనివార్యంగా ఏర్పడుతుంది.

ఈ విప్లవానికి కార్మిక వర్గం, ఆ వర్గంలో అంతర్లీనంగా వున్న వర్గ చైతన్యం ప్రగతిశీల గుణమే కారణమని మార్క్స్ స్పష్టం చేశాడు. చివరకు ఈ వర్గ నాయకత్వంలోనే ప్రగతి శీలమైన నూతన వ్యవస్థ ఏర్పడుతుందని మార్క్స్ జోష్యం చెప్పాడు. దానినే కార్మిక వర్గ నియంతృత్వం అని పేర్కొంటూ ఇది వర్గ రహిత సమాజానికి మార్గం వేస్తుందన్నాడు.

BRAOU

## 20.6 సమసమాజం – సామ్యవాదం

విప్లవం తరువాత శ్రామిక వర్గ నియంతృత్వం కింద(Dictatorship of proletariate) నూతన సమాజ ఆవిష్కరణ జరుగుతుంది. అప్పటి దాకా వున్న వర్గ సమాజం అంతరించి దాని స్థానంలో దోపిడీ, స్వార్థం లేని సమాజం ఆవిర్భవిస్తుంది. ఈ క్రమంలో తొలుత ఉత్పత్తి సంబంధాలు సమూలంగా మారుతాయి. ఉత్పత్తి శక్తులను సమాజపరం చేయడం జరుగుతుంది. పెట్టుబడి దారీ సమాజపు అర్థిక భావన, ప్రయివేటు ఆస్తులు రద్దయిపోతాయి. ఈ సంధికాలంలో అంటే కాపిటలిస్టు సమాజానికీ కమ్యూనిస్టు సమాజానికీ మధ్య కాలంలో కార్మిక వర్గం తాత్కాలికంగా ఆధిపత్యం వహించి సామ్యవాదానికి రంగం సిద్ధం చేస్తుంది.

సామ్యవాదం మార్క్స్ ప్రకారం వర్గరహిత సమాజం, ఇది కమ్యూనిస్టు వ్యవస్థకు భిన్నమైనది. ఈ దశలో పెట్టుబడిదారీ వర్గపు వాసనలను సమూలంగా రూపుమాపి కొత్త సమాజాన్ని ఏర్పరచే ప్రక్రియ జరుగుతుంది. పెట్టుబడిదారీ వర్గం ప్రమాదకరమైంది. మనుషుల ప్రాణాలు పిండి ఆస్తుల్ని పెంచుకున్న ఆ వర్గాలు తమ ప్రాణాలు ధారపోసైనా పంతం నెగ్గించుకోవాలని ప్రయత్నిస్తారు. కాబట్టి ఆ వర్గాన్ని సమూలంగా నాశనంచేసి, కొత్త వర్గ రహిత వ్యవస్థ ఏర్పడేంత వరకు కార్మిక నాయకత్వంలో ఏర్పడే సామాజిక వ్యవస్థ ఇది. పెట్టుబడిదారీ వ్యవస్థ అవశేషాల నుంచి తలెత్తాలని చూసే విప్లవ ప్రతీఘాత శక్తులను అణచివేసి నూతన సమాజానికి మార్గం వేసే దశ. ఈ దశలో కార్మిక వర్గం భూములు, పరిశ్రమలు, సమాచార భావ ప్రసార వ్యవస్థ వంటి ఉత్పత్తిలో కీలక పాత్రవహించే అన్ని రంగాలపై పట్టు సాధిస్తుంది. ప్రయివేటు ఆస్తిని, వారసత్వ హక్కులను రద్దుచేస్తుంది. కార్మికులే యజమానులుగా పరిశ్రమలను

ప్రయోగాత్మకంగా నడుపుతుంది. విద్య, కళలు, సాహిత్యం, శాస్త్ర విధానం వంటి ఉపరితల అంశాలను కూడా స్వతంత్రీకరిస్తుంది.

సోషలిస్టు దశ పెట్టుబడిదారీ వ్యవస్థ అవశేషాలను పూర్తిగా తొలగించి, కమ్యూనిస్టు వ్యవస్థకు రంగం సిద్ధం చేసే దశ ఇది మూడు దశల్లో జరుగుతుంది. మొదట కార్మిక వర్గ నియంతృత్వంలో సమాజంపై పట్టు సాధించడం, ఆ తరువాత రెండో దశలో ప్రజలను రాజ్యాధికారానికి సంసిద్ధం చేయడం మూడోది ప్రజారాజ్యం ఏర్పరచడం.

## 20.7 కమ్యూనిజం

కార్ల్ మార్క్స్ గతి తార్కిక భౌతిక వాదపు అంతిమ దశ కమ్యూనిజం. కమ్యూనిజం అనేది ఆకలి దప్పికలు లేని ఆదర్శ సమాజం. సంపూర్ణ స్వాతంత్ర్యం, సమానత్వంతో కూడిన సహజీవనం ఈ వ్యవస్థ ప్రత్యేకత. ఆస్తిపాస్తులు, భేదాభావాలు లేని, కలతలూ కల్లోలాలూ లేని ఈ వ్యవస్థలో ప్రతి మనిషీ కార్మికుడే. రాజ్యం, రాజకీయ వ్యవస్థ అంతరించిపోతుంది. ఈ వ్యవస్థలో పరిపాలన వుండదు. కేవలం వనరులను సమకూర్చుకోవడం, సమీకరించుకోవడం మాత్రమే వుంటుంది. కమ్యూనిస్టు వ్యవస్థలో ఫలానా వ్యక్తి ఫలానా పని మాత్రమే చేయాలని లేదు. ఎవరికి ఇష్టం వచ్చిన పని, ఇష్టం వచ్చిన వేళ, ఇష్టం వచ్చిన చోట చెయ్యొచ్చునని మార్క్స్ తన ది జర్మన్ ఐడియాలజీలో పేర్కొన్నాడు. కమ్యూనిజం ప్రైవేటు ఆస్తిని సమూలంగా రద్దుచేస్తుంది. మనిషికి స్వతంత్ర సమగ్ర పరిసరాన్ని నెలకొల్పుతుంది. మనిషికీ ప్రకృతికీ మధ్య, మనిషికీ మనిషికీమధ్య సుహృద్భావం నెలకొల్పుతుంది. మొత్తంగా కమ్యూనిజం అనేది మనిషికి సంపూర్ణ స్వాతంత్రాన్ని, స్వేచ్ఛనీ ఇచ్చి బంధ విముక్తున్ని చేస్తుందని మార్క్స్ విశ్వసించాడు.

మార్క్స్ కలలుగన్న ఈ సుందర స్వప్నానికి ఆయన వారసులు జీవంపోశారు. లెనిన్, స్టాలిన్, మావో సేటుంగ్ మార్క్స్ వేసి వెళ్ళిన సిద్ధాంత పునాదిపై మహాసౌధాలనే నిర్మించారు. లెనిన్ ప్రపంచ చరిత్రలోనే తొలి సోషలిస్టు సమాజ నిర్మాత. రష్యాలో విప్లవాన్ని విజయవంతం చేసిన ఘనత లెనిన్‌దే. కాగా మావో సేటుంగ్ చైనాలో సోషలిస్టు విప్లవ బీజాలు నాటిన వ్యక్తి . మార్క్స్ లెనిన్‌ల భావాలను మేళవించి సోషలిస్టు విప్లవాలు వ్యవసాయ దేశాల్లో కూడా విజయవంతం కాగలవని నిరూపించిన వ్యక్తి. చైనా రైతాంగాన్ని గెరిల్లా యుద్ధ పంథాలో కదిలించి నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం అహరహం కృషిచేశాడు. మార్క్సిస్టు లెనినిస్టు సిద్ధాంతానికి మావో తన ఆలోచనను జోడించి విప్లవం విజయవంతం కావాలంటే ఐక్య సంఘటన, కమ్యూనిస్టు పార్టీతోపాటు ప్రజాసైన్యం కూడా తప్పనిసరి అవసరంగా పేర్కొన్నాడు. తుపాకి గొట్టం ద్వారానే రాజ్యాధికారం సిద్ధిస్తుందని, విప్లవ సాధనకు ప్రజాసైన్యం తప్పదని చెప్పి ప్రపంచంలోనే విశాలమైన దేశమైన చైనాలో వ్యవసాయిక విప్లవాన్ని విజయవంతం చేసిన మహోన్నత విప్లవవీరుడు మావో.

ఒకవైపు కార్మిక వర్గ చైతన్యంతో విప్లవం విజయవంతం చేసి కమ్యూనిజాన్ని అంతర్జాతీయ సిద్ధాంతంగా రూపొందించిన లెనిన్, నూతన ప్రజాస్వామ్య విప్లవ పంథాననుసరించి రైతాంగాన్ని విముక్తంచేసి 'లాంగ్ మార్చ్' సాగించిన మావోలు ఒకరు రష్యాను, మరొకరు చైనాను మార్క్స్ సిద్ధాంతాని ప్రతిబింబాలుగా ప్రపంచానికి చూపారు. ఇవి రెండు మార్క్సిస్టు నమూనాకు మంచి ఉదాహరణలు.

## 20.8 రాజ్యం - మార్క్సిస్టు దృక్పథం

మార్క్స్ పరిశోధనలు, విశ్లేషణల ప్రకారం చారిత్రక వికాస తొలి దశ ఆదిమ దశలో రాజ్యం లేదు. అందుకే ఆయన దాన్ని ఆదిమ కమ్యూనిస్టు దశ అన్నాడు. ఈ దశలో మనిషి స్వేచ్ఛాజీవి. కుటుంబం, ప్రయివేటు ఆస్తికి ప్రాధాన్యత లేని దశ. ఉత్పత్తి శక్తులన్నీ సముదాయపు ఆధీనంలోనే వుండి సమసమాజంగా విలసిల్లిన దశ. మార్క్స్ దీనినే పునః

BRAOU

వ్యవస్థాపింపజేయాలని కలలు గన్నారు.

రాజ్యం పుట్టుక వర్గం సమాజ ఆవిర్భావ కాలంలో జరిగింది. మార్క్సిస్టు లెనినిస్టు సిద్ధాంతం ప్రకారం వర్గ సమాజాల్లో నాలుగు దశల్లో రాజకీయ వ్యవస్థ ఎదిగింది.

తొలివర్గ సమాజమైన బానిసత్వ వ్యవస్థలో రాజ్య భావన యజమానుల హక్కులను కాపాడడం కోసం ఆవిర్భవించింది. బానిసలకు రాజకీయ వ్యవస్థతో రాజ్య వ్యవహారాలతో సంబంధం లేదు. రాజ్య వ్యవహారాలకు సంబంధించిన వాటిలో చివరకు రక్షణ, పరిపాలనా వ్యవస్థలతో సహా అన్ని కార్యకలాపాలు సర్వహక్కులు కలిగివున్న సంపన్న వర్గమే చూసుకునేది. 'బానిసకు సంబంధించిన ప్రతిదీ ఆ బానిస యొక్క యజమానిదే అవుతుంది' అన్నది ఆనాటి రోమన్‌చట్టంగా వుండేది.

భూస్వామ్య వ్యవస్థలో రాజ్య స్వభావం, రాజకీయ వ్యవస్థ రూపు రేఖలు మారిపోయినయ్. మొత్తం రాజకీయ వ్యవస్థకు రాజ్యం మూలాంశం అయ్యింది. రాజ్యం భూస్వామ్య వర్గాల ప్రయోజనాలను కాపాడే యంత్రాంగంగా పరిణామం చెందింది. భూముల పంపిణీ విషయంలో భూ సంస్కరణల విషయంలో, కూలీ రేట్ల విషయంలో రాజ్యం భూస్వాముల ప్రయోజనాల పరిరక్షణకే మొగ్గు చూపుతుంది తప్ప పీడితుల పక్షాన నిలువదు. ఈ వ్యవస్థలో మతం కూడా ప్రధాన పాత్ర ( రాజకీయంగా) పోషిస్తుందని మార్క్స్ పేర్కొన్నాడు. పాశ్చాత్య దేశాల్లో చర్చి నిర్వహించిన పాత్రను దృష్టిలో వుంచుకుని మార్క్స్ ఈ నిర్ధారణకు వచ్చినట్టు తెలుస్తోంది. ఫ్యూడల్ సమాజాల్లో మతం రాజకీయాలను ప్రభావితం చేస్తూ వచ్చిన మాట వాస్తవం కూడా. పాలక వర్గాలు వ్యాపార వర్గాలతో లింకులు కలిగి వుంటాయి. ఆర్థిక, సాంఘిక దోపిడీని ప్రతిఘటించేందుకు కిందిస్థాయి వర్గాలు చిన్నచిన్న సంఘాలను ఏర్పాటుచేసుకుంటాయి. ఫ్యూడల్ సమాజంలో రాజకీయాలు ఆర్థిక సామాజిక జీవనంలో కలెగలిసి వుంటాయి. పెట్టుబడిదారీ వ్యవస్థలో రాజకీయాలు పరిణతి చెంది వుంటాయి. నిర్మితి ప్రకార్యాల పరంగా సమాజం మూడు రకాలుగా విభజన చెంది వుంటుంది. ఆధిపత్య వర్గాలు భూర్జువాలు ఒక వర్గంగా, పీడిత వర్గాలు, కార్మిక శక్తులు మరో వర్గంగా వుంటే మూడో స్థానంలో మధ్య తరగతి వుంటుంది.

BRAOU

మొదటి తరహాలో బూర్జువా రాజ్యం. దాని అనుబంధ జాతీయ కార్మిక సంఘాలు. వాటికి అనుకూలమైన జాతీయ రాజకీయ పార్టీలు, మత ధార్మిక సంస్థలూ వుంటాయి. ఇవన్నీ పెట్టుబడి దారుల ప్రయోజనాలకోసం పనిచేస్తాయి. పెట్టుబడిదారుల, ఆర్థిక సాంఘిక రాజకీయ దోపిడీకి, భావ ఆధిపత్యానికి వ్యతిరేంగా సంఘటితమైన కార్మికులు శ్రామిక వర్గ పార్టీలు, వర్గ పోరాటానికి నాయకత్వం వహించే కమ్యూనిస్టు పార్టీలు ట్రేడ్ యూనియన్లు, ప్రజా సంఘాలు రెండో వర్గంగా వుంటాయి.

పెట్టుబడిదారీ సమాజంలో మూడో రాజకీయ పంథాగా సంస్కరణ వాదం ఎదుగుతుంది. ఇది పెట్టుబడిదారీ వ్యవస్థతో మధ్యవర్తిత్వం నడిపే వ్యవస్థ. ఇందులో సోషల్ డెమోక్రటిక్ పార్టీలు రైటిస్టు పార్టీలు ట్రేడ్ యూనియన్లు వుంటాయి. ప్రధాన మౌలిక విషయాల్లో పెట్టుబడిదారీ స్వభావం కలిగి వుంటే ఈ సంస్థలు ప్రజలవైపు ఉన్నట్టు ప్రవరిస్తుంటాయి. మరోవైపు పెట్టుబడిదారీ సమాజంలో అన్ని ఉపరితలాంశాలు. చట్టం, న్యాయం, విద్య, కళలు, సంస్కృతి పాలక వర్గ ప్రయోజనాల కోసమే ఉద్దేశింపబడి వుంటాయి. పీడితులు, కార్మిక వర్గాలకు రాజకీయాల్లో, నిర్ణయాల్లో, రాజ్య వ్యవహారాల్లో ఎలాంటి సంబంధం వుండదు. కార్మిక వర్గం ఉత్పత్తికే పరిమితమై వుండాలన్నది బూర్జువా రాజ్యపు ప్రధాన కాంక్ష.

విప్లవం బూర్జువా రాజ్యాన్ని సర్వనాశనం చేసి సమ సమాజాన్ని నిర్మిస్తుందని మార్క్సిజం – లెనినిజం చెపుతుంది. ఉత్పత్తి శక్తులను బద్ధలు కొట్టడంతోపాటు వాటికి ఊడిగం చేసే రాజకీయ వ్యవస్థ పార్లమెంటు, న్యాయ వ్యవస్థ చట్టాలు, తదితర రంగాలన్నిటినీ విప్లవం మట్టికరిపిస్తుంది. వాటి స్థానంలో సోషలిజం ఏర్పడుతుంది. సోషలిస్టు రాజ్యం అన్నిటికంటే ఉన్నతమైన రాజ్య వ్యవస్థను నెలకొల్పుతుందని మార్క్సిస్టులు చెపుతారు.

మార్క్సిస్టుల దృష్టిలో చారిత్రక పరిణామానికి ఇది అంతిమ దశ. ఇది వర్గరహిత, కమ్యూనిస్టు ప్రజారాజ్యాన్ని ఏర్పాటు చేసేందుకు దోహద పడుతుంది. రాజ్యాధికారాన్ని పూర్తిగా ప్రజలకు అప్పగించే ముందు సోషలిస్టు వ్యవస్థ ఈ క్రింది అంశాలకు ప్రాధాన్యత ఇస్తుంది.

సమాజానికి అవసరమైన భౌతిక సాంకేతిక వనరులను సమకూర్చడం సామాజిక సంబంధాల్లో గుణాత్మకమైన మార్పులు తేవడం ద్వారా నూతన మానవుడిని ఆవిష్కరించడం, శ్రామిక వర్గాల భౌతిక, సాంస్కృతిక ప్రమాణాలు పెంచడం, దేశ రక్షణతోపాటు అంతర్జాతీయ సంబంధాలు పెంచుకోవడం వంటివి. సోషలిస్టు దశ పూర్తయిన తరువాత రాజ్య రహిత కమ్యూనిస్టు వ్యవస్థ ఏర్పడుతుంది.

## 20.9 ముగింపు

మానవ జాతి చరిత్రను క్షుణ్ణంగా పరిశీలించిన మార్క్స్, సామాజిక వికాస క్రమాన్ని గతి తార్కిక భౌతిక వాద దృక్పథం నుంచి సూత్రీకరించాడు. చరిత్ర మనిషిని సృష్టించలేదు. మనిషే చరిత్రను సృష్టించాడన్న వాదంతో మానవజాతి చరిత్ర పరిణామాన్ని శాస్త్ర బద్ధం చేశాడు. మార్క్స్.

చరిత్ర పరిణామంలోని ప్రతి దశలోనూ మానవజాతి చేసిన రక్తతర్పణ, త్యాగాలు మరిచి పోలేనివి అంటుంది మార్క్సిజం. ఆ త్యాగాలే చరిత్రగమనానికి చోదక శక్తిగా ఉపకరించాయి. ప్రతి దశలోను ఉత్పత్తి క్రమంలోని వైరుధ్యాలు, ఉత్పత్తి శక్తుల మీద ఆధిపత్యం ఘర్షణలే కొత్త మార్పుకు దోహదపడ్డాయని మార్క్స్ పేర్కొన్నాడు. ఆదిమ, బానిస, భూస్వామ్య, పెట్టుబడిదారీ దశలు దాటి వర్గ వ్యవస్థ కుప్పకూలి పోతుందని కారల్ మార్క్స్ వూహించాడు. ప్రజలే వర్గ సమాజాన్ని కూల్చివేసి నవ సమాజానికి మార్గదర్శకులవుతారని మార్క్స్ నమ్మకం.

ఆ నమ్మకం రష్యాలో లెనిన్ నాయకత్వంలోనూ, చైనాలో మావో సేటుంగ్ నేతృత్వంలోనూ వాస్తవమైంది. ఈ క్రమంలో మార్క్స్ వూహించని అనేక పరిణామాలూ జరిగాయి. ఈ రెండు దేశాల్లో విజయం సాధించిన విప్లవ శక్తులు ప్రపంచ కార్మిక, కర్షక పీడిత వర్గాలను భావపరంగా ఏకం చేశాయి. మార్క్స్ ఆలోచనలను, మరింత బలోపేతం చేసి మార్క్సిజాన్ని ఒక సమగ్ర ప్రాపంచిక దృక్పథంగా నిలిపాయి.

మార్క్సిజం గెలిచిందా, ఓడిపోయిందా, విప్లవం విజయం సాధించిందా, విఫలమైందా అన్న చర్చ ఇవాళ విశ్వవ్యాప్తంగా కొనసాగుతుంది. చర్చలు, వాదోపవాదాల ఫలితాలెట్లావున్నా, మార్క్సిజం తెచ్చిన మార్పును, ప్రగతిని ఎవరూ కాదనలేరు. అది శాస్త్రీయ మైంది. సత్యమైంది.

– ఘంటా చక్రపాణి

## 20.10 చదువదగిన పుస్తకాలు

1. రేమండ్ ఆరన్ : మెయిన్ కరంట్స్ ఇన్ సోషల్ థాట్

2. ఫ్రాన్సిస్ అబ్రహం జె. హెచ్.మోర్గాన్ : సోషలాజికల్ థాట్

3. సబైన్ : పొలిటికల్ థియరీ

4. ప్రోగ్రెసివ్ పబ్లిషర్స్ ప్రచురణ : థియరీ ఆఫ్ స్టేట్ అండ్ లా

5. మార్క్స్, ఎంగెల్స్ : కమ్యూనిస్టు పార్టీ మేనిఫెస్టో

BRAOU

## 20.11 నమూనా పరీక్షా ప్రశ్నలు

I వ్యాసరూప ప్రశ్నలు

1. గతి తార్కిక భౌతిక వాదాన్ని వివరింపుము
2. వర్గ సిద్ధాంతాన్ని చర్చించుము.
3. మార్క్స్ ప్రతిపాదించిన చారిత్రక పరిణామ దశలను గూర్చి వ్రాయుము.

I సంక్షిప్త ప్రశ్నలు

1. సమ సమాజ భావన
2. కమ్యూనిస్టు వ్యవస్థ
3. చారిత్రక భౌతికవాదం

BRAOU

BRAOU

# డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

## సామాజిక శాస్త్రాల విభాగం

### రాజనీతి శాస్త్రంలో స్నాతకోత్తర అధ్యయన కార్యక్రమం

### ఎం.ఎ. రెండవ సంవత్సరం

### పాఠ్యప్రణాళిక

### పాఠ్యాంశం–III రాజకీయ సమాజ శాస్త్రం

**ఖండం–1** **ప్రవేశిక**

- భాగం–1 రాజకీయ సమాజ శాస్త్రం – స్వభావం, పరిధి
- భాగం–2 అధ్యయన దృక్పథాలు
- భాగం–3 రాజకీయాల సామాజిక ఆర్థిక ప్రాతిపదికలు
- భాగం–4 సామాజిక స్థరీకరణం

**ఖండం–2** **భావనలు**

- భాగం–5 రాజకీయ సమాజికీకరణం
- భాగం–6 రాజకీయ సంస్కృతి
- భాగం–7 రాజకీయ ప్రసరణం
- భాగం–8 రాజకీయ శిష్టవర్గం
- భాగం–9 రాజకీయ భాగస్వామ్యం
- భాగం–10 రాజకీయ పరాయీకరణం

**ఖండం–3** **చలనసూత్రాలు**

- భాగం–11 శక్తి, ఆధారం, శాసనబద్ధత
- భాగం–12 సామాజిక మార్పు – రాజకీయ ప్రక్రియలు
- భాగం–13 రాజకీయ ఆధునికీకరణం
- భాగం–14 రాజకీయ అభివృద్ధి
- భాగం–15 సమైక్యత : సమస్యలు

**ఖండం–4** **స్థిర దృక్కోణాలు**

- భాగం–16 రాజకీయ పార్టీలు
- భాగం–17 ప్రభావ వర్గాలు
- **భాగం–18** నాయకత్వ నమూనాలు
- భాగం–19 సామాజిక మార్పు – గాంధీ సిద్ధాంతం
- భాగం–20 మార్క్సిస్టు నమూనా

BRAOU

BRAOU

# డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

## సామాజిక శాస్త్రాల విభాగం

### రాజనీతి శాస్త్రంలో స్నాతకోత్తర అధ్యయన కార్యక్రమం

### ఎం.ఎ. రెండవ సంవత్సరం

### పాఠ్యప్రణాళిక

### పాఠ్యాంశం-3 రాజకీయ సమాజ శాస్త్రం

### నమూనా ప్రశ్నా పత్రం

కాలం: 3 గంటలు

మార్కులు: 100

భాగం -A

కింది ప్రశ్నలకు జవాబులు రాయుము. 4 x 15 = 60

1. రాజకీయ సమాజ శాస్త్రమును నిర్వచించి దాని పరిధిని చర్చింపుము.

లేదా

రాజకీయ సమాజశాస్త్ర అధ్యయన దృక్పథాలను పరిశీలింపుము?

2. సామాజిక స్తరీకరణం అంటే ఏమిటి? మన దేశంలో సామాజిక స్తరీకరణను పరిశీలింపుము?

లేదా

రాజకీయ సమాజీకీకరణం అనగా ఏమిటి?

BRAOU

3. రాజకీయ సంస్కృతిని విశ్లేషింపుము.

లేదా

ప్రజాస్వామ్య వ్యవస్థలలో రాజకీయ భాగస్వామ్యాన్ని చర్చించండి?

4. పరేటో వివరించిన విశిష్ట వర్గ భ్రమణ సిద్ధాంతాన్ని చర్చించండి?

లేదా

రాజకీయ పరాయీకరణ మనగా నేమి? వివరింపుము.

భాగం -B

కింది ప్రశ్నలకు జవాబులు రాయండి 5 x 8 = 40

5. రాజకీయ అభివృద్ధి.

లేదా

శిష్టులు.

6. రాజకీయ ఆధునికీకరణ.

లేదా

భారతదేశపు సమైక్యతా సమస్యలు.

7. రాజకీయ పార్టీలు

లేదా

ప్రభావ వర్గాలు.

8. గాంధీ మార్గంలో సామాజిక మార్పు

లేదా

రాజకీయ ప్రసరణం ప్రాధాన్యత

9 కాంగ్రెసు సంస్కృతి.

లేదా

సామాజిక మార్పులకు మార్క్సిస్టు నమూనా.

BRAOU